రామాయణం

# శ్రీరామ కథామృతము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శ్రీ రామ కథామృతం



రచన:

ఓరుగంటి సుబ్బలక్ష్మి
B. O. L.

# విజ్ఞప్తి

"శ్రీరామ కథామృతము" అను ఈ వచన కావ్యమును 'సప్త కాండములు'గా రచియించు భాగ్యము కలిగినందులకు నేను ఎంతో సంతోషించుచున్నాను. ఈ రచనకు పురికొల్పి నన్ను కృతార్థు రాలిని చేసిన దయామయులు, కరుణా స్వరూపులు, లోకరక్షకులు ఐన శ్రీ శైల భ్రమరాంబికా మల్లికార్జునులు-ఆదిదంపతులైన ఆ దేవ దేవులకు నా భక్తి పురస్కర నమస్కార సహస్రములు.

అనుకోకుండానే నేను ఆ స్వామిచేత ఆకర్షితురాలినై శ్రీశైలం వెళ్ళుట తటస్థించినది. అక్కడ జగత్పితరుల సన్నిధిలో కొన్ని రోజులుండుట సంభవించినది, స్వామి కృపచే. అంతఃప్రేరణ కలిగి, గురు దేవులు బ్రహ్మీభూత శ్రీ శ్రీ శ్రీ రామయోగింద్రస్వామి వారి ఒకనాటి ఆశీస్సులు ఫలితోన్ముఖముకాగా ఈ గ్రంథ రచనకు అంకు రార్పణ చేసితిని. బాల కాండను కొంతభాగము రచించితిని.

తిరిగి ఇంటికి వచ్చిన తరువాత క్రమముగా సప్తకాండ పరిమిత మైన ఈ గ్రంథ రాజమును కొలది మాసములలోనే నిరంతరాయముగా వ్రాసి ముగించగలిగితిని.

గ్రంథమును శీఘ్రగతిన నిరంతరాయంగా వ్రాయనైతే వ్రాశాను. కాని అందలి లోపాలోపములను వెనుదిరిగి చూడనైన చూడనైతిని. ఆకారణముచే నా యితర గ్రంథములను వలెనే ఈ గ్రంథమునుగూడ ఘనహనీయులు, మధురకవి బిరుదాంకితులు, నాకు

గురుతుల్యులు, పితృ సమానులు ఐన శ్రీ కొలిపాక మధుసూదనరావు గారికి చూపించి,పరిష్కరింపజేసి వ్రాతచిత్తుప్రతిని శుద్ధప్రతిగా తయారు చేయించితిని. వారి సహకారముతోనే ముద్రణ రూపునకు నోచుకొని, గ్రంథము సర్వాంగ సుందరముగా తయారైనది. వారికి నా ధన్య వాదాలు. గ్రంథ ముద్రణకు ఎంతో ఆర్థిక సదుపాయము అవసర మైనది. ఇందుకు సహృదయులైన దాతల ఉదారమైన సహకారము ముఖ్యముగ పేర్కొనదగినది. వారి పేర్లను కృతజ్ఞతా పూర్వకముగ గ్రంథము చివరన పేర్కొనబడినవి.

ఈ గ్రంథ రచనా సందర్భమున నా కృషిని విని ప్రోత్సహిం చిన బ్రహ్మీభూత గురుదేవులు పోపూరి బాలకృష్ణశాస్త్రిగారిని పవిత్ర ఆత్మన సంస్మరించుచున్నాను. వారి ప్రోత్సాహము వారిద్వారా కుర్తాలంపీఠాధిపతులు, వారి ఉత్తరాధికారి స్వాముల అక్షయ ఆశీస్సులు కూడా లభించడం నా సుకృతి విశేషము. 'సి కావ్యము భవ్యము- దివ్యము' అగును అని ఆశీర్వదించిన గురుస్వాముల ఆశీర్వచనము లన్వర్థములైనవి. అదే విధముగ హైద్రాబాదు- స్నేహపురి, సమర్థ మాతాజీ, శ్రీ బాలాంజనేయస్వామి ఉపాసకులు శ్రీ శృంగేరి పీఠ స్వాముల శిష్యవరేణ్యులు శ్రీ శ్రీ శ్రీ వాసుదేవానంద భారతీ యతీంద్రుల ఆశీస్సులు విజయవంతమైన నా కావ్య రచనకు దోహద పడినవి- వారికి నా వినమ్ర హృదయాంజలి.

ది 14-7-1989 వ సంవత్సరమున పూజ్య గురుదేవులు బ్రహ్మీభూతులు శ్రీ శ్రీ శ్రీ రామ యోగీంద్రస్వామివారు లోగడ నేను వ్రాసి ప్రచురించిన "శ్రీమద్రామాయణ కథా సంగ్రహము"ను చీరాల శ్రీ లలితాశ్రమములో వారు నిర్వహించిన శ్రీరామనామ సప్తాహ

సందర్భంగ వారి కర కమలాలచే ఆవిష్కరించారు. అనతికాలంలోనే ఆ ప్రతులు పూర్తిగా వినియోగమైనాయి. కాగా ఆ గ్రంథము అతి సంగ్రహంగా ఉండటం వలన శ్రీరామకథను తృప్తికరంగా చెప్పినట్లు లేదని చెబుతూ శ్రీరామ యోగీంద్రులు విపులలో 'నీ చేతినుండి అందరికీ సులభగ్రాహ్యమయ్యే రీతిలో శ్రీరామ కథామృతం మరొక గ్రంథం త్వరలోనే వెలువడుతుందని చెపుతూ ఆశీర్వదించారు. వారి ఆశీర్వచనమును, వారు సూచించిన గ్రంథ రచనకు ఆదేశముగా భావించి, నాకు చేతనైన రీతిలో వివిధ రామాయణాలను పరిశీలించి, అందలి కథల ఆధారంగా ఈ శ్రీరామ కథామృతాన్ని రచించడం జరిగింది.

ఋషి వాక్కును నా యీ రచన మూలంగా ఫలించడం వలన నా జన్మ ధన్యమైనదనే భావిస్తున్నాను.

ఈ నా కావ్య రచనకు, ముద్రణకు ఎందరెందరో మహానుభావులు సహకరించారు. వారందరికీ నా ప్రత్యేక కృతజ్ఞతాభివాదాలు. శ్రీ సీతారామచంద్ర ప్రభువు వారికి సకల శ్రేయస్సులొసగి అనుగ్రహించుగాక—

—రచయిత్రి

# శ్రీరామ రక్షాస్తోత్రమ్

చరితమ్ రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్॥

ధ్యాత్వానీ లోత్పల శ్యామం రామం రాజీవలోచనమ్
జానకీ లక్ష్మణోపేతం జటామకుట మండితామ్॥

సాఽసితూణ ధనుర్బాణ పాణిం నక్తం చరాంతకమ్
స్వలీల యాజగత్త్రాతు మావిర్భూత మజం విభుమ్॥

రామరక్షాం పఠేత్ప్రాజ్ఞః పాపఘ్నీం సర్వకామదామ్
శిరోమే రాఘవః పాతుఫాలం దశరథాత్మజః॥

కౌసల్యేయో దృశౌపాతు విశ్వామిత్రః ప్రియఃశృతీ
ఘ్రాణం పాతు మఖత్రాతా ముఖం సౌమిత్రి వత్సలః॥

జిహ్వాం విధ్యానిధిః పాతు, కఠంభరత వందితః
స్కంధౌ దివ్యాయుధః పాతుభుజే భగ్నేశ కార్ముకః॥

కరేసీతాపతిః పాతుహృదయం జామదగ్న్యజిత్.
మధ్యం పాతు ఖరధ్వంసే నాభిం జాంబవదాశ్రయః॥

సుగ్రీవేశః కటీపాతు సకినీ హనుమత్ప్రభుః
ఊరూరఘూత్తమః పాతు రక్షఃకుల వినాశకృత్॥

జానునీ సేతుకృత్పాతు జంఘేదశ ముఖాంతకః
పాదౌ విభీషణః శ్రీదః పాతురామోఽఖిలంవపుః॥

ఏతాం రామ బలోపేతాం రక్షాయస్సుకృతీ పఠేత్
సచిరాయుః సుఖీపుత్రీ విజయీ వినయీ భవేత్॥

పాతాళభూతలవ్యోమ చారిణశ్ఛద్మచారిణః
నద్రష్టుమపి శక్తాస్తే రక్షితం రామనామభిః॥

రామేతి, రామభద్రేతి రామచంద్రేతి వాస్మరన్
నరోనలిప్యతే పాపైర్భుక్తింముక్తించ విందతి॥

జగజ్జైత్రైక మంత్రేణ రామనామ్నాభిరక్షితమ్
యః కంఠేధారయేత్తస్యకరస్థా సర్వసిద్ధయః॥

వజ్రపంజర నామేద్రం యోరామకవచం స్మరేత్
అవ్యాహతాజ్ఞః సర్వత్ర లభతే జయమంగళం॥

వజ్రపంజరముతో సమానమైన శ్రీరామరక్షాకవచమును సర్వదా, సర్వత్ర అనుస్మరించిన వారికి శ్రీరామచంద్రప్రభువు అనుగ్రహాము వలన సర్వారిష్టములు తొలగి దేహబాధలు నశించి ఇహామందు సర్వాభీష్టసిద్ధియు పరమందు ముక్తిధామనివాసము నిశ్చయముగా కలుగునని ఆర్షవాక్య ఫలశ్రుతి

# ప్రార్థనా శ్లోకములు

శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే

దోర్భిర్యుక్తా స్ఫటిక మణిమయామ్ అక్షమాలాంధ దానా
హస్తేనైకేన శుకమపి పుస్తచాపరేణ

భాసాకుందేందు స్ఫటికమణి నిభా భాసమానా
సామే వాగ్దేవతేఽయం నివసతువదనే సర్వదా సుప్రసన్నా

వైదేహీ సహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్

అగ్రేవాచయతి ప్రభంజన సుతే తత్వం మనిభ్యః పరమ్
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతమ్ రామంభజే శ్యామలం

వామే భూమిసుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్ సుమిత్రాసుతః
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వ దలయో వాయ్వాది కోణేషు చ

సుగ్రీవశ్చ, విభీషణశ్చ యువరాట్తారాసుతో జాంబవాన్
మధ్యే నీల సరోజ కోమల రుచిమ్ రామంభజే శ్యామలం

రామాయ రామ భద్రాయ రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయేనమః

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం.

# శ్రీరామ కథామృతము

## విషయసూచిక


| వ. నెం. | విషయం | బాలకాండ | పేజీ నెం |
|---|---|---|---|
| 1. | వంశక్రమం | | 1 |
| 2. | శ్రీరామ అవతార నేపథ్యం | | 3 |
| 3. | దశరథ మహారాజు | | 6 |
| 4. | శ్రీరామ జననం | | 11 |
| 5. | విశ్వామిత్రుల ఆగమనం | | 15 |
| 6. | తాటక వధ | | 20 |
| 7. | యాగ రక్షణ | | 23 |
| 8. | విశ్వామిత్ర చరిత్ర | | 25 |
| 9. | గంగావతరణము | | 27 |
| 10. | అమృత మథనం | | 33 |
| 11. | గౌతమాశ్రమం | | 36 |
| 12. | మిథిలానగర ప్రయాణం | | 38 |
| 13. | త్రిశంకు మహారాజు చరిత్ర | | 40 |
| 14. | శివ ధనుర్భంగం | | 42 |
| 15. | సీతారామ కళ్యాణం జనకుని వంశక్రమం | | 50 |
| 16. | పరశురామ గర్వ భంగం | | 51 |
| | | అయోధ్యకాండము | |
| 17. | శ్రీరామ పట్టాభిషేకం... ఫలించని ప్రయత్నం | | 54 |
| 18. | దశరథుని మందిరానికి రామలక్ష్మణులు వెళ్ళుట | | 57 |

| | |
|---|---|
| 19. సీతారాముల ఉపవాస దీక్ష | 58 |
| 20. మంథర అసూయ | 60 |
| 21. మంథర దుర్బోధ | 64 |
| 22. కోపగృహంలో కైక | 66 |
| 23. దశరథుని కైకేయి వరముల నడుగుట | 67 |
| 24. శ్రీరాముడు కైకేయి మందిరమునకు వెడలుట | 70 |
| 25. కౌసల్యా మందిరంలో శ్రీరాముడు | 76 |
| 26. సీతతో రాముడు | 82 |
| 27. సీతారాములు తమ వస్తు సముదాయమును దాన మొనర్చుట | 87 |
| 28. సీతా రామలక్ష్మణులు దశరథుని చూడబోవుట | 89 |
| 29. సుమంత్రుడు చెప్పిన కైక తల్లి కథ | 91 |
| 30. గుహునితో చెలిమి | 99 |
| 31. సీతారామ లక్ష్మణులు గంగను దాటుట | 101 |
| 32. భరద్వాజాశ్రమము | 103 |
| 33. చిత్రకూట పర్వతము | 104 |
| 34. సీతారామలక్ష్మణులు వాల్మీకిని దర్శించుట | 105 |
| 35. దశరథుని విలాపము | 106 |
| 36. దశరథుడు ముని బాలుని హతమార్చిన వృత్తాంతము | 107 |
| 37. దశరథుని మృతి | 110 |
| 38. భరతునికై కేకయ రాజ్యమునకు దూతలు వెళ్ళుట | 110 |
| 39. భరతుని స్వప్నం | 111 |
| 40. కైకేయీ మందిరమున భరతుడు | 113 |
| 41. భరతుడు కైకేయిని నిందించుట | 116 |

42. భరతుడు - కౌసల్య 117
43. భరతుడు, కౌసల్య సన్నిధిన శపథము చేయుట 118
44. భరతుడు శ్రీరాముని గొని తెచ్చుటకు వనమునకు వెడలుట 121
45. గుహుడు భరతుని రాకను అనుమానించుట 121
46. భరతుడు భరద్వాజ మహర్షిని దర్శించుట 123
47. భరద్వాజుడు భరతునికి విందునొసంగుట 124
48. భరతుడు సైన్యముతో చిత్రకూట పర్వతమునకు వెడలుట 127
49 లక్ష్మణుడు వృక్షముపై నుండి భరతాదులు సైన్య యుక్తముగా వచ్చుచున్నట్లు గమనించుట 127
50. జాబాలి రామునికి హితవు చెప్పుట 133
51. పాదుకా పట్టాభిషేకం 134
52. అత్రిమహాముని ఆశ్రమం 135
53. సీతా అనసూయల సంభాషణం 137

అరణ్యకాండ

54. విరాధుని వధ 139
55. శరభంగాశ్రమము 141
56. అగస్త్యాశ్రమము 143
57. జటాయువు 144
58. పంచవటిలో పర్ణశాల 144
59. శూర్పణఖ 145
60. జన స్థానంలో రాక్షస సంహారం 147
61. త్రిశిరునితో యుద్ధము 147
62. ఖరుడు 148

63. మారీచుని వద్దకు రావణుడు పోవుట 148
64. శూర్పణఖ రావణునితో జనస్థాన రాక్షసుల వధను చెప్పుట 149
65. రావణుడు మరల మారీచుని వద్దకు వెళ్ళుట 150
66. బంగారు జింక 153
67. సీత, లక్ష్మణుని పరుష వాక్కులతో నిందించుట 154
68. రావణుడు పర్ణశాలలో సీతను అపహరించుట 157
69. రావణునితో జటాయువు పోరుట 158
70. రామలక్ష్మణులు సీతను గానక అరణ్యములో వెదకుట 160
71. రాముని లక్ష్మణుడు వారించుట 162
72. రామలక్ష్మణులు జటాయువును చూచుట 163
73. కబంధుడు 165
74. మతంగాశ్రమంలో శబరి 166
75. హనుమంతునితో రామలక్షణులు... కిష్కింథకాండము 169
సంభాషించుట
76. రామ సుగ్రీవుల మైత్రి 173
77. రాముడు సప్తసాల వృక్షములను ఖంజించుట 175
78. వాలివధ 178
79. రామబాణముచే నేలకూలిన వాలి రాముని నిందించుట 181
80. తారా విలాపము 184
81. సుగ్రీవునికి రాజ్యాభిషేకం 185
82. సుగ్రీవుని ప్రమత్తత 186
83. సుగ్రీవుని పనుపున వానరులు సీతాన్వేషణ సాగించుట 189

84. అంగదుని ప్రాయోపవేశం 191

85. సముద్రమును చూచి... సుందరకాండము
వానరులు దిగులుపడుట 193

86. హనుమంతుని సముద్ర లంఘనము 195

87. హనుమంతుని ఆకాశగమనం 197

88. మైనాకుడు 197

89. సురస 199

90. సింహిక 200

91. లంకిణి 203

92. హనుమంతుడు లంకాపురములోనికి ప్రవేశించుట 204

93. సీతను గానక హనుమంతుడు
నిర్వేదము చెందుట- ప్రాయోపవేశ నిశ్చయము 205

94. హనుమంతుడు అశోక వనమున సీతాదేవిని చూచుట 206

95. రావణుడు అశోకవనమునకు వచ్చుట-
సీతను బాధపెట్టుట 208

96. రాక్షస కాంతలు సీతాదేవిని నిష్ఠురోక్తులాడుట 211

97. త్రిజట స్వప్నము 212

98. సీత ప్రాణత్యాగమునకు సిద్ధపడుట-
హనుమంతుని దర్శనము 214

99. హనుమంతుడు సీతతో సంభాషణము 215

100. హనుమంతునిచే అశోకవన భంగము 221

101. రావణుడు రాక్షస సైన్యమును అశోక
వనమునకు పంపుట 222

102. అక్ష కుమారుని వధ 222

103. హనుమంతుడు ఇంద్రజిత్తుని బ్రహ్మాస్త్రముచే బంధింపబడుట 224
104. రావణునితో హనుమంతుడు మాటలాడుట 225
105. లంకా దహనము 227
106. సీత అగ్నిహోత్రుని ప్రార్థించుట 228
107. హనుమ తొందరపాటునకు విచారించుట 228
108. హనుమంతుని తిరుగుప్రయాణం 229
109. హనుమంతుడు తనవారితో జరిగిన వృత్తాంతమును వివరించుట 230
110. వానరులు మధు వనములో ప్రవేశించుట 231
111. హనుమంతుడు శ్రీరామచంద్రునికి సీతపంపిన చూడామణిని ఆనవాలుగా ఇచ్చుట 232
112. శ్రీరాముడు వానరసైన్యముతో యుద్ధకాండము లంకకు ప్రయాణమగుట. 235
113. వానర సేనతో రాముడు సముద్ర తీరమున విడిదిచేయుట 237
114. సభలో రావణుడు 238
115. విభీషణుడు శ్రీరాముని శరణువేడుట 240
116. విభీషణ పట్టాభిషేకం 242
117. సముద్రముపై వారధి 245
118. శుక సారణులు 246
119. శ్రీరాముడు చనిపోయెనని రావణుడు సీతాదేవికి చెప్పుట. 249
120. రావణుడు మంత్రులతో సమాలోచనము 252
121. శ్రీరాముడు యుద్ధ విధానమును నిర్ణయించుట 253

122. సుగ్రీవుడు-రావణుల మల్లయుద్ధము 254

123. అంగదుని రాయబారము 255

124. వానరులు లంకాపురిని ముట్టడించుట 256

125. రాత్రి యుద్ధము 258

126. ఇంద్రజిత్తు నాగాస్త్రముచే రామలక్ష్మణులను బంధించుట 258

127. నాగపాశ విమోచనము 262

128. రావణుని భయము 262

129. రావణుడు యుద్ధమునకు బయలుదేరుట 263

130. రావణుడు లక్ష్మణునితో యుద్ధము 265

131. రాముడు రావణునితో యుద్ధము చేయుట 266

132. కుంభకర్ణుడు 267

133. ఇంద్రజిత్తు సైన్యముతో మరల యుద్ధమునకు వచ్చుట 277

134. ఇంద్రజిత్తు మాయ సీతను వధించుట 272

135. లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించుట 273

136. రావణుడు తన మూలబలమును యుద్ధమునకు పంపుట 276

137. రావణుడు యుద్ధరంగమునకు వెళ్ళుట 277

138. లక్ష్మణుని మూర్ఛ 279

139. హనుమంతుడు సంజీవిని పర్వతమును కొనితెచ్చుట 281

140. యుద్ధభూమిలో మరల రావణుడు 281

141. ఇంద్రుడు రామునకు రథమును పంపుట 282

| | |
|---|---|
| **142.** రామరావణ యుద్ధము | 282 |
| **143.** రావణవధ | 284 |
| **144.** రావణ వధానంతరము విభీషణుడు | 285 |
| **145.** రావణ స్త్రీలు మరియు పట్టమహిషి మండోదరి విలాపము | 286 |
| **146.** విభీషణుడు రావణునికి అగ్ని సంస్కారము చేయుట | 287 |
| **147.** విభీషణ పట్టాభిషేకం | 288 |
| **148.** శ్రీరాముడు సీతాదేవి కడకు హనుమంతుని పంపుట | 289 |
| **149.** హనుమంతుడు సీత సందేశమును రామునికి వినిపించుట | 290 |
| **150.** రాముడు సీతను పరుషము లాడుట | 292 |
| **151.** సీత అగ్ని ప్రవేశము | 293 |
| **152.** విభీషణుడు వానరవీరులను సత్కరించుట | 296 |
| **153.** శ్రీరాముడు సీతా లక్ష్మణులతో అయోధ్యకు ప్రయాణమగుట | 298 |
| **154.** భరద్వాజాశ్రమము | 300 |
| **155.** రాముడు హనుమంతుని భరతుని వద్దకు పంపుట | 301 |
| **156.** సీతా రామలక్ష్మణులు నందిగ్రామము వచ్చుట | 304 |
| **157.** శ్రీరాముడు అయోధ్యకు ప్రయాణము | 305 |
| **158.** శ్రీరామ పట్టాభిషేకము | 307 |

159. శ్రీరాముడు జనకాది రాజలోకమును ఉత్తరకాండ
వారి వారి పురములకు పంపుట 309

160. పుష్పకవిమానము శ్రీరాముని కొరకై
తిరిగివచ్చుట 309

161. భరతుడు ప్రజల సుఖస్థితిని శ్రీరామునకు
విన్నవించుట 310

162. ఉద్యానవనంలో సీతతో రాముడు 311

163. సీత ఋష్యాశ్రమముల సందర్శనమును కోరుట 311

164. శ్రీరాముడు భద్రుని లోకవార్తల నడుగుట 312

165. భద్రుడు శ్రీరామునకు ప్రజలనుకొను సీతాపవాదమును
గురించి తెలుపుట 312

166. శ్రీరాముడు సోదరులను పిలిపించుట 313

167. లక్ష్మణుడు సీతను ఋష్యాశ్రమమునకు తీసుకొని
వెళ్ళుట 314

168. సీతకు కొన్ని దుస్స్వప్నములు కలుగుట 315

169. శ్రీరాముని దుఃఖము 318

170. మునికుమారులు వాల్మీకికి సీతవృత్తాంతమును తెలుపుట 319

171. వాల్మీకి సీతాదేవిని ఓదార్చి ఆశ్రమమునకు కొనివచ్చుట
319

172. లక్ష్మణుడు శ్రీరాముని దుఃఖమును సుమంత్రునితో చెప్పి
దుఃఖించుట 320

173. శ్రీరాముని చెంతకు లక్ష్మణుడు వెళ్ళుట 321

174. సీత కుమారుల కనుట 322

175. బ్రాహ్మణుడు మృతబాలుని కళేబరమును శ్రీరాముని ఇంటి వాకిటనుంచి ఏడ్చుట 324

176. నారదుడు బాలకుడు మృతుడైన కారణము తెలుపుట 325

1 7. శ్రీరాముడు రాజసూయ యాగమును నిర్వహించ నెంచుట 327

178. శ్రీరాముడు అశ్వమేధయాగము చేయుట 329

179. వాల్మీకి మహర్షి, కుశలవులను రామాయణ గానము చేయ నియోగించుట 331

180. లవకుశులు రామాయణ గానముచేయుట - శ్రీరాముడు వినుట 332

181. శ్రీరాముడు వాల్మీకి ఆశ్రమమునకు దూతలను పంపుట 334

182. సీత భూ ప్రవేశము 335

183. కుశలవుల యౌవరాజ్య పట్టాభిషేకము - శ్రీరామాదుల మహాప్రస్థానము 336

ఫలశ్రుతి

# మంగళహారతి

సమర్పణ :-
శ్రీమతి రాళ్ళబండి సుబ్బలక్ష్మి

రామా రాఘవా జయ మంగళం
సీతా రామా దశరథా తనయ,
రాజీవలోచన
రామా రాఘవ జయ మంగళం

పరమూని వెంట మిథిలాపురిపోయి
హరునీ విల్లు
విరచీ నా రామా నీకు
రత్నాలా హారాతిదిగో ॥రామా॥

శృంగారమైనా సీతకు
మంగళా సూత్రము గట్టి
రంగైనా రామా నీకు
రవ్వాలా హారాతిదిగో ॥రామా॥

ముత్యాల తలంబ్రాలు
ముదిత శిరసునా బోసి
హెచ్చైనా రామా నీకు
పచ్చాల హారాతిదిగో ॥రామా॥

# శ్రీ రామ కథామృతం

## వచన కావ్యము

## బాలకాండము

వంశక్రమం :-

పూర్వం త్రేతాయుగంలో భరతఖండంలోని ఉత్తర ప్రాంతంలో "కోసల" అను పేరుగల రాజ్యం ఒకటి ఉన్నది. ఆ రాజ్యానికి "అయోధ్య" ముఖ్యపట్టణం. ఆ పట్టణం ప్రక్కనుంచే "సరయూ" అనుపేరుగల ఒకనది ప్రవహిస్తూ వున్నది.

అయోధ్య ముఖ్య పట్టణంగా అనేక సంవత్సరాల నుండి కోసల దేశాన్ని సూర్య వంశపు రాజన్యు లెందరో పరిపాలిస్తూ వచ్చారు. అసమానమైన వారి ధైర్యసాహసాలు వర్ణించడం అలవి కాదు. వారి రాజాస్థానంలో సకల శాస్త్రకోవిదులైన గొప్ప పండితులు, రాజనీతికోవిదులు, నీతి శాస్త్ర నిపుణులు, ధర్మ పరాయణులైన పౌరుషవంతులు, ఆజానుబాహులు, ధీరగంభీరులు, పుణ్యక్రతు నిర్వహణ ధూర్వహులు ఉండేవారు.

ధర్మజిజ్ఞాసువులు, సత్కర్మ నిరతులునైన కోవిదమణులు, ఆ రాజ్యంలో ధర్మ ప్రవర్తనకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూచేవారు. తగిన శాసనాలతో, వాటి అమలుతో స్త్రీ బాలవృద్ధ

లను రక్షించుచు, ధర్మధేనువును నాలుగు పాదాల నడిపిస్తూ వచ్చారు.

శత్రురాజులతో తలపడవలసివస్తే, వారితో ధర్మయుద్ధాలనే చేసి, సువిశాలమైన తమ రాజ్యాన్ని చెక్కు చెదరకుండా కాపాడుతూ వచ్చారు. రాజ విద్యలన్నింటియందును నిష్ణాతులై, నిపుణులై తమ విద్యాధిక్యతను నలుదెసలా చాటేవారు. రాజోచితమైన వేట, యందు మిక్కిలి అభిలాష కలవారై క్రూరమృగాలు పల్లె సీమలపై, పంట పొలాలపై ఎగబడకుండా తగిన కట్టుదిట్టం చేసి రక్షణా కార్య క్రమం నిర్వహించేవారు. దేవతలకు అత్యంత ప్రీతికరములైన యజ్ఞ యాగాదులను ఆయా సమయాలలో ప్రజాసంక్షేమం కోసం తగిన కట్టు దిట్టాలతో నిర్వహించి దేవతానుగ్రహం పొంది ప్రజలకు మేలు చేకూర్చేవారు. దీనితోపాటు తమ కీర్తి ప్రతిష్ఠలను, శక్తి, సామర్థ్యాలను, వంశ గౌరవమును నలుగురికి తేటతెల్లం చేయడానికి ఎన్నో అశ్వమేధయాగాలు చేసి ధీరోదాత్తులని పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

ఈ రాజులు అనేకానేక క్రతు నిర్వహణల ద్వారా దేవతాను గ్రహం కూడా పుష్కలంగా పొంది యున్నవారవడం చేత దేవ మర్త్య లోకాలకు తరచు వీరి పర్యటనలు, కొనసాగుతూ సత్సం బంధ సహకారధోరణులు సదా నెలకొని ఉండేవి. ఈ సూర్య వంశపు రాజులలో "రఘువు" అనే పేరుగల మహారాజు అప్పటికి ఆ వంశము వారందరిలోనూ, లోకోత్తర పురుషుడుగా, సకల దిక్జయ కీర్తుల నార్జించిన మహారాజ పుంగవుడుగా కీర్తిగడించినవాడు కాబట్టి, అప్పటి నుండి ఆ వంశానికి "రఘువంశం" అనే పేరు సుప్రసిద్ధం అయింది. మొదటిరాజు ఇక్ష్వాకుడు కాబట్టి ఆ వంశీకులకు ఇక్ష్వాకులు అనే పేరుకూడవచ్చింది. రఘువంశంలో ప్రవర్తిల్లిన రాజు లందరూ ఆ వంశకీర్తి ప్రతిష్ఠలను, ఔన్నత్యాన్ని తమ ప్రాణ సమంగా కాపాడుతూ వృద్ధి చెందించుతూ వచ్చారు.

ఆ వంశ క్రమం ఇట్లా ఉన్నది.

బ్రహ్మ- బ్రహ్మ కుమారుడు మరీచి, మరీచి కుమారుడు కాశ్యపుడు,- వివస్వంతుడు- మనువు - ఇక్ష్వాకుడు, ఈ ఇక్ష్వాకుడే వెనుకటి అయోధ్యా ప్రభువు- ఇక్ష్వాకుని కుమారుడు కుక్షి - తరువాతవికుక్షి -అనరణ్యుడు-పృధువు-త్రిశంకుడు-దుందుమారుడు-(యవనాశ్వుడు) మాంధాత-సుగంధికి-ధృవసంధి- ప్రసేనజిత్తు అను ఇద్దరు కుమారులు-భరతుడు-అసితుడు- సగరుడు- అసమంజసుడు-అంశుమంతుడు-దిలీపుడు, - భగీరధుడు - కకుత్థ్సుడు - రఘువు - ప్రవృద్ధుడు (కల్మాష పాదుడు)- శంఖణుడు- సుదర్శనుడు- అగ్నివర్ణుడు- శీఘ్రగుడు- మరువు-ప్రశుశ్రుడు-అంబరీషుడు-నహోషుడు-యయాతి- ఆభాగుడు- అజుడు- దశరధుడు.

శ్రీరామావతార నేపథ్యం :-

పైన పేర్కొనబడిన రఘువంశ క్రమంలో అజ మహారాజు కుమారుడైన దశరథ మహారాజునకు ముఖ్యులైన ముగ్గురి భార్యల యందు కూడ చాలా కాలానికి సంతానం అందలేదు. తనకు సంతానములేని కారణంగా, తనతోనే ఆ వంశము ఆగిపోతుందనే దురంతమైన చింతతో దశరథ మహారాజు చాలాకాలం వేగిపోయి, వయసు మీరి హతాశుడై యున్న కాలములో దైవము అనుకూలించు చున్నట్లు, దేవలోకములో ఒక దేవతలయందు హఠాత్తుగా ఒక సంచలనము కలిగినది-అది భూలోకవాసుల కళ్యాణార్థమై శ్రీ మహావిష్ణువుని గూర్చిన ప్రార్థనా కలకలమే-విష్ణు సందర్శనము నిమిత్తమై చెలరేగిన దేవతల విష్ణులోక ప్రయాణ కోలాహలమే - ఆ ప్రయాణములో దేవతలతోపాటు, వారి ప్రభువు, ఇంద్రుడు, బ్రహ్మదేవుడు, ఋషిగణం అందరు వైకుంఠము చేరి శ్రీ మహావిష్ణువును పరి పరి విధముల ప్రార్థన చేయసాగారు.

"శాంతా కారం భుజగశయనం, పద్మనాభం సురేశం, విశ్వాకారం, గగన సదృశం యోగి పాద్యానగమ్యం వందే విష్ణుం భవ

భయ హరం సర్వలోకైక నాథం" అంటూ దిక్కులు ప్రతిధ్వనించే విధంగా ఎలుగెత్తి స్తోత్రం చేస్తూ వున్న భక్తాదుల ప్రార్థనలను శ్రీ మహావిష్ణువు ఆలకించాడు.

అప్పుడా విష్ణువు, కరుణాళువై వారలతో ఇట్లా అన్నాడు. "అమితపుణ్య ధీబల తేజో సంపన్నులైన దేవతలారా! ఋష్యాదులారా! మీరు అందరూ ఏక కాలంలో వైకుంఠమునకు వచ్చిన పనియేమి? మీకు కలిగిన బాధలు ఏమి? ఏ శత్రుమూకయైనా దేవలోకముపై కానీ, బ్రహ్మలోకముపై కాని దురహంకారమదోన్మత్తులై దండెత్తి వచ్చినారా! మహర్షులారా! సకల సంగములను వృద్ధి, నిర్మములై, నిరహంకారులై, ముముక్షువులై దట్టమైన అడవులు జొచ్చి ప్రశాంత వాతావరణములో తపోనుష్ఠాన విధుల నిర్వర్తించు కొను, మీ విమల వృత్తికి ఏ దుర్మార్గులైనా భంగము కలిగించుచున్నారా! సెలవివ్వండి - అట్లైనచో నేను చేయగల కార్యమును కూడ వివరించి, అట్టి కార్యమును జరిపించుకుని, మీ మీ బాధల నుండి విముక్తిని పొందుడి!" అని పల్కెను.

అంత దేవాదులందరూ శ్రీ మహావిష్ణువు యొక్క అనుగ్రహ భాషణములకు మిక్కిలి సంతసించి, ఆ దేవ దేవునితో ఈ విధముగా తమ మనోగతాన్ని చెప్పుకొన్నారు.

ఓ శ్రీహరీ! భూలోకమందు రావణాసురుడను రాక్షసుడు లోక కంటకుడై, వినాశన కరమైన తన దుశ్చేష్టలతో సకల లోకస్థులను నిష్కారణ వైరముతో బాధించు చున్నాడు. అతడు పెట్టు బాధలను వర్ణించడం మా వల్లకాదు- నీవు ఏ విధముగానైనా ఆలోక కంటకుని సంహరించి, వాని దుశ్చేష్టలనుండి, లోకములను, లోకేశులను కాపాడుము. సాధు పుంగవులైన ముని సత్తముల తపోయజ్ఞయాగాది క్రతువులను నిర్విఘ్నముగా కొనసాగించు కొననిమ్ము - శ్రీహరీ! నీవు కరుణా సముద్రుడవు, ధర్మ రక్షకుడవు, అధర్మ నాశకుడవు - అతి బలవంతుడు, దుర్నిరీక్ష్య తేజో వంతుడు,

దురిత వర్తనుడు అయిన ఆ రావణుని పరిమార్చి సర్వ లోకములకు శాంతి భిక్షను ప్రసాదింపుము.

లోకరక్షా మహనీయమూర్తియైన శ్రీ మహావిష్ణువు వారి ప్రార్థనలను విని వారితో ఈ విధముగా చెప్పాడు.

దేవతలారా! మీరు విచారింపకుడు — మీ బాధలను నేను తెలుసుకొన్నాను. నేను నా శరీరము [విభూతిని] ను నాలుగు భాగములుగా చేసి, భూలోకమునందు పుణ్యచరిత్రుడైన దశరథ మహారాజుకు నలుగురు పుత్రులుగా పుట్టి, రావణసంహారమున కవసరమైన కావ్యరచన సాగింతును. మీరు కోరినట్లు అనతికాలములోనే వానిని సంహరించి లోకరక్షణము గావింతును. అంతదనుక ఓరిమి వహించి జాగ్రత్తగా మసలుకొనుడు.

దేవాదులా మహనీయుని మాటల నాలకించి తమ తమ వాస స్థానములకు వెళ్ళిరి.

శ్రీ మహావిష్ణువు రావణవధ నిమిత్తము వారలతో చేసిన పథక రచన మిట్లున్నది.

దేవతలలో కొందరు తమ తమ అంశములతో కిష్కింధలో వానరులుగా జన్మించుట. ఆ రూపములలో వారు తనకు రామావతారములో రావణసంహారమున కనువైన సమయములో సహకరించుట.

శ్రీహరి పథకము నంగీకరించి వెళ్ళిన దేవాదులు సమయము వచ్చువరకు వేచియుందమని సంతృప్తి చెంది నిజస్థానములలో తమ తమ కార్యములను చక్కబెట్టుకొనుచుండిరి.

## దశరథమహారాజు:-

అది త్రేతాయుగము. శ్రీమహావిష్ణువు నాజ్ఞచేత దేవతలు తమ తమ అంశములతో అవతరించగా వానరులుగా భూలోకమున కిష్కింధలో అవతరించిరి. ఆదే సమయములో సరయూ నదీతీరమున గల అయోధ్యయను పట్టణమును తన రాజధానిగా చేసికొని, రఘు వంశ ప్రభువైన దశరథమహారాజు 'కోసల' దేశమును పరిపాలించు చుండెను. ఆ మహారాజు అరువదివేల సంవత్సరములు ప్రజారంజకముగా తన దేశమును పరిపాలించెను.

ఆ మహారాజునకు తన దేవేరులైన ముగ్గురి యందును చాల కాలమువరకు సంతానము కలుగలేదు. 'అపుత్రస్యగతిర్నాస్తి' యని కదా! శ్రుతివచనము. తనతరువాత తన వంశక్రమమును కొనసాగించ గల సంతానము లేమికి ఆ మహారాజు మిక్కిలి చింతించెను. ఇక్ష్వాకు వంశము యొక్క వృద్ధి ప్రవృద్ధులను కోరి వంశ ప్రతిష్ఠను నిల్పుటకే సదా యోజించు దశరథ మహారాజు పుత్రులు లేని దుఃఖమును ఎంతగా లోలోపలనే అణచుకొనుచు రాజ్యపాలనము చేయు చున్నను, రాజుగారి విచారము అంతఃపుర కాంతలకే కాక, దాస దాసీ జనులకు, మంత్రులకు, పురోహితులకు, సామంతులకు, ప్రజ లందరిలోను వ్యాపించి చింతాక్రాంతులను చేయజొచ్చినది. అరువది వేల సంవత్సరములు రాజ్యపాలన చేసిన తరువాతకూడ నారాజ్యము నకు ఉత్తరాధికారి లేకపోవుట నా సుకృతి లోపమేనని భావించెను. అంతులేని వ్యాకులచిత్తంతో రాజు నానాటికీ కృశించిపోతూ వుండగా రాజవంశాభివృద్ధినీ, రాజ్యక్షేమమును కోరు ఆత్యంతికు లైన మంత్రి పురోహితులు, మహారాజుని సమీపించి "రాజా! మీరిట్లు అంతులేని చింతను దవిలి నానాటికీ కృశించుట, మీకును, మీ రాజ్యము నందలి ప్రజలకును క్షేమకరముకాదు. సంతానము పొందు టకు దేవతానుగ్రహమును పొందుట యుక్తమని శాస్త్రములు చెప్పు చున్నవి. దేవతానుగ్రహమును పొందుటకు శాస్త్రముతేమైన మార్గ

ములు సూచించినవో లేవో అన్వేషింపుడు. మీరు సకల ధర్మవేత్తలు, అనేక పుణ్యక్రతువుల ద్వారా దేవతలను మెప్పించి, వారి వారి యనుగ్రహమును పొందగల శక్తిశాలురు. ఏదేని ప్రక్రియ నాలోచింపుడు" అని ముక్త కంఠముతో పలికిరి. అందులకు దశరథ మహారాజు తీవ్ర ఆలోచనా నిమగ్నుడై కొంతవడికి ముఖమునందు ఉత్సాహరేఖలు పొటమరించగా వారితో నిట్లు పలికెను.

"మహాత్ములారా! యజ్ఞయాగాది క్రతువులచేత దేవతలను సంతృప్తిపరచి ఇష్టకామ్యార్థములను పొందవచ్చునని ధర్మశాస్త్ర వేత్తలు నుడువుచున్నారు. దేవతలు క్రతుప్రియులుకదా! అట్టిచో రాజులకు సైతము అత్యంత కష్టసాధ్యము, అభిలషించిన మహాఫల సంధాయకమునైన "అశ్వమేథయాగము" సలిపిన పుత్రప్రాప్తి నందవచ్చునని తోచుచున్నది. మీరనుమతించినచో అట్టి క్రతువును నిర్వహించుటకు నేను సంసిద్ధుడనై యున్నాను. అని విన్నవించెను.

అందులకు మంత్రి పురోహితులు "రాజా! మీ ప్రయత్నము తప్పక ఫలప్రదమగును మీకుతప్పక పుత్రలాభము కలుగును." అని చెప్పిరి.

మంత్రి సుమంత్రుడు రాజువద్దకువెళ్ళి సవినయముగా "రాజా! మీరాశించిన అశ్వమేథయాగము నిర్విఘ్నమున నెరవేరుటకు మహా తపస్సంపన్నుడు, నియతేంద్రియుడు, సంకల్పసిద్ధుడునైన "ఋష్య శృంగుని" భార్యాయుక్తముగ రప్పింపుడు. ఆ దంపతులిచటకు వచ్చినంతనే క్రతుఫలమును సగముపొందిన వారగుదురు. అతడిప్పుడు మీ చిరకాలమిత్రుడైన రోమపాదుడు పరిపాలించు అంగరాజ్యములో నున్నాడు. అతడు రోమపాదుని కుమార్తెయైన శాంతాదేవిని వివాహమాడి, పూర్వమందెప్పుడో అధర్మదోషమువలన కలిగిన దారుణమైన క్షామమును పోగొట్టి, ప్రజాక్షేమంకరుడై మామగారి యాతిథ్యములో నున్నాడు. మీరు మంత్రిపురోహిత పరివారసమేతముగా

అచటికి వెళ్ళి, మీ మిత్రుని దర్శించి, మహర్షివర్యుని ప్రార్థించి ఇచటికి శాంతాయుక్తముగా ఆతని రావింపుడు. కార్యము చక్కబడునని" వివరించెను.

దశరథ మహారాజు "అట్లే" యనిచెప్పి, తదనంతరము రోమ పాదుని నగరమునకు ప్రయాణమై వెళ్ళినాడు. అచట కొన్నాళ్ళుండి, మిత్రుడైన రోమపాదునితో "నీకుమార్తె శాంత, అల్లుడు ఋష్యశృంగ మునిని అయోధ్యకు పంపి, కొన్నాళ్ళు మా యాతిథ్యమున నుండ నియోగించి నన్ను కృతార్థుని చేయుము. వీరి యనుగ్రహమున నేనొక మహాకార్యమును సలిపి ధన్యుడను కావలసియున్నదని" నుడివెను.

రోమపాద మహర్షి "అట్లే" యని అంగీకరించి సగౌరవ ముగా, ఆ దంపతుల నిరువురిని అయోధ్యకు తోడుకొని వచ్చెను. ఋష్యశృంగుని రాకను ముందే చారులవలన యెరిగిన అయోధ్యా నగర కర్మచారులు పట్టణవాసులు పట్టణము నందలి రాజవీధులను, గృహములను నేత్రానందకరముగ అలంకరించిరి. నగర బహిః ప్రదేశమున స్వాగతద్వారముల నమర్చిరి. పట్టణమంతయు కళ్యాణ మండపము వలె నలంకరింపబడినది. అట్లలంకరింపబడిన అయోధ్యా పట్టణమునకు బహుపరాకులతో, జయ జయ ధ్వానములతో, శాంతా ఋష్యశృంగ యుక్తముగా అలంకరింపబడిన అందమైన రథముపై ఆసీనుడై దశరథమహారాజు నగరప్రవేశము చేసెను.

అశ్వమేధయాగము : ప్రారంభమునకు సకల రాజన్యులకు ఆహ్వానములు పంపబడినవి. అధ్వర్యులైన బ్రాహ్మణోత్తముల నిర్వ హణలో క్రతువిధానమునకు కావలసిన ఏర్పాట్లన్నియు పూర్తి గావింపబడినవి. యాగప్రారంభమున ఆ మంత్రింపబడి అశ్వరాజము విడువబడినది. పిమ్మట ఆ క్రతువు ఒక సంవత్సర కాలము వరకు కొనసాగింపబడినది. సలక్షణము, యజ్ఞము నిర్విఘ్న పరిసమాప్తి నందినది. విజయరథుడైన దశరథుని కామితమును నెరవేర్చుటకు

దేవతలు ఉన్ముఖులైనారు. ఆ సమయములో దశరథుడు ఋష్య శృంగుని తనకు పుత్రఫలోదయమగు యాగము నొకదానిని నిర్వ హింపజేయుడని ప్రార్థించెను. ఋష్యశృంగుడాలోచించి, దశరథుని చేత పుత్రకామేష్టియాగమును సంకల్పింపజేసి, క్రతునిర్వహణ విధా నమును స్వయముగా నిర్ణయించి ఇష్టకార్యమును జరిపించెను. ఆ యాగమును తిలకించుటకు ఎందరో ఋషులను, సామంతరాజులను, చక్రవర్తులను, పనివారలను, పురోహితులను, వేదపారాయణ చేయువారిని, శాస్త్రచర్చలను జరుపువారిని, సకలశాస్త్రములను అభ్యసించిన పండితులను పిలిపించెను. రాజాజ్ఞమేరకు మంచినీటి బావులు త్రవ్వించబడినవి. ప్రజలు నడచుబాటల కిరుపైపుల చెట్లు నాటించబడినవి. యాగ సందర్శనమున కాహ్వానింపబడిన అతిథు లకు సకల సౌకర్యములతో కూడిన వసతి గృహములు నిర్మించబడి నవి. వంటవారు, పనివారు అవసరముమేరకు నియోగింపబడిరి. యాగసమయములో సందర్శకజన సందోహమునకు నిరంతర అన్న దానము జరిపించబడినది. నగరము నందలి దేవాలయములలో పూజారుల చేత ప్రత్యేక పూజలు జరిపించబడినవి.

యాగక్రతువు సందర్శనమునకు ముఖ్య అతిథులుగ రోమ పాదుని, జనక మహారాజుని, దశరథుడు స్వయముగ వెళ్ళి, సబంధు పరివారముగా నాహ్వానించి తోడ్తెచ్చెను. వారలకు ప్రత్యేక విడు దులు ఏర్పాటు చేయబడినవి. వచ్చిన రాజన్యుల వాహనములైన, రథ, గజ, తురగ సమూహమునకు ప్రత్యేకముగ శాలలు నిర్మించ బడెను. వానిని నడుపు పరివారమునకు, సకల విధ సౌకర్యములతో కూడిన ఉత్తమ వసతులను ఏర్పాటు గావించిరి.

క్రతు కార్య క్రమములలో నిర్విరామముగా శ్రమించుచున్న దశరథ మహారాజు, ఎంత తీరిక లేకున్నను ఏ చిన్న లోపమైనను కలుగనీయకుండా, సమస్తము విచారించుచు అత్యంత జాగరూకుడై మసలు చుండెను.

అతిథులై వచ్చు వారికి స్వాగతము చెప్పుటలోను, వారికి తగు వసతులను కలిగించుటలోను, భోజన భజనాదులను నిర్వహించుటలోను ఎటువంటి పొరపాటు రాకుండ, పరివారమును అప్రమత్త పరచెను.

పట్టణం నాలుగు దిక్కులా మంగళ వాద్యములు ప్రతిధ్వనింప జేస్తూ వాద్యకారులు తమ తమ జంత్ర వాద్యనైపుణ్యములను ప్రదర్శించు చుండిరి.

గోడలపై రంగు రంగుల చిత్ర విచిత్ర చిత్రములు చిత్రించబడి కనువిందు గొలుపు చుండెను.

వివిధాలంకరణలతో అయోధ్యానగరమంతా భూలోక స్వర్గముగా భాసించినది. ఘంటానాదము వంటి ఋత్విక్కుల వేదమంత్ర ఘోషలతో ఆయాయజ్ఞ సంభారములను హవిస్సుల యుక్తంగా వ్రేలుస్తూ స్వాహా కృతులు చేస్తూ వుండగా వశిష్ఠాది మహర్షులు విధి విధానములను నిర్దేశిస్తూ కార్యక్రమము జరిపిస్తూండగా ఋష్యశృంగుడు యాగనిర్వహణతో ఎటువంటిలోటు జరుగకుండగా పర్యవేక్షించి పుత్రకామేష్ఠి యాగాన్ని పరిసమాప్తి చేయించాడు.

ఆ యాగ ఫలితముగా జ్వాలలెగయుచున్న హోమగుండము నుండి ఒక దివ్య పురుషుడుదయించి, తన చేతనున్న పాయసముతో నిండిన బంగారు పాత్ర నొకదానిని దశరథునికి ఇచ్చి. "ఈ పాయసమును, నీ మూవురి భార్యలకు పంచి పెట్టుము. అభీష్టము సిద్ధించును'' అని చెప్పి, అంతర్ధాన మయ్యెను.

దశరథుడు ఆ యజ్ఞ పాయసమును సగముచేసి, పెద్ద భార్యయగు కౌసల్యకు ఇచ్చి, మిగిలిన దానిలో సగము సుమిత్రకు ఇచ్చి, తదుపరి మిగిలిన దానిలో సగము కైకేయికి, కాగా మిగిలిన భాగము మొత్తమును సుమిత్రాదేవి కొసగెను.

దశరథుడు పంచి యివ్వగా పాయస భాగములను అందు

కొన్న కౌసల్య, సుమిత్ర, కైకేయులు, వారి వారి భాగములను అత్యంత శ్రద్ధా భక్తులతో పుత్రఫల ప్రాప్తిని కోరి భుజించారు.

దశరథుడు యజ్ఞమును పరిసమాప్తి గావించి, యజ్ఞములో పాల్గొన్న వారందరికీ, వారి వారిని తగిన విధంగా దక్షిణ తాంబూలాదులతో, దానాదులతో సత్కరించి, సంతృప్తులను గావించెను.

ఋత్విగ్వరులు, విప్రోత్తములు దశరథ మహారాజుచే ఘనముగా సత్కరింపబడిన వారై "ఇష్ట కామ్యార్ధములను పొందెదవు గాక" యని దీవించి, అతని వద్ద సెలవుగైకొని తమ తమ నెలవులకు మరలిపోయిరి.

## శ్రీ రా మ జ న నం :-

యాగపాయసం సేవించిన దశరథుని ముప్పురు రాణులు గర్భవతులైనారు. ఈ వాస్తవం తెలుసుకొన్న దశరథ మహారాజు ఆనందానికి అవధులు లేవు.

తొలుత శ్రీ మహావిష్ణువు నిశ్చయించుకొని బ్రహ్మాదులకు చెప్పిన విధంగా తన అవతార విధానము నీ విధముగా కార్యరూపముగావించెను. ఆ ప్రకారం ఇట్లా ఉన్నది. శ్రీరామచంద్రుడుగా తాను దశరథ మహారాజు పట్టమహిషియైన కౌసల్యాదేవి గర్భమందును, తనకు ఛత్రమువలెనుండి సదా సేవించుచున్న ఆదిశేషువును సుమిత్ర యందు లక్ష్మణునిగాను, తాను ధరించుచుండిన శంఖు చక్రములు భరత శత్రుఘ్నులుగా కైకేయి, సుమిత్రలయందు జన్మించుటకు ఏర్పాటు గావింపబడినది.

దైవానుగ్రహము వలన, క్రతు ఫలముగా దశరథుడు పుత్రవంతుడైనాడు.

దశరథుని ముప్పురి భార్యలందు కలిగిన పుత్రుల జన్మనక్షత్రాదులిట్లా ఉన్నవి.

రాణులు గర్భవతులైన లగాయతు పండ్రెండువ మాసములో వారికి పుత్ర ప్రాప్తి సంభవించినది.

శ్రీరామ జననం

చైత్రమాస నవమి తిథియందు పునర్వసు నక్షత్రములో సూర్యుడు, అంగారకుడు, బృహస్పతి, శుక్రుడు, శని ఈ ఐదు గ్రహములు ఉచ్ఛస్థితియందు నెలకొని యుండగా, బృహస్పతి, చంద్రునితో కూడి యుండగా ఇక్ష్వాకు వంశవర్ధనుడైన, లోకోత్తర పురుషుడు, అనాది నిధనుడు, ఆర్తత్రాణ పరాయణుడు లోకనాయకుడు శ్రీరామచంద్రుడు నీలమేఘశ్యామల వర్ణంతో ఉదయించాడు.

పుష్యమీ నక్షత్రం, మీనలగ్నంలో కైకేయికి భరతుడు జన్మించాడు. మధ్యాహ్న సమయంలో ఆశ్లేషా నక్షత్రం, కర్కాటక లగ్నంలో సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులు పుట్టారు.

పుట్టిన నలుగురు శిశువులకు వశిష్ఠ మహర్షి జాతకర్మాదులు నిర్వహించాడు. ఆ నలుగురికి రాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు అని నామకరణం చేశారు.

మహారాజుకు రత్నములవంటి నలుగురు కుమారులు కలిగారనే శుభవార్త వినగానే దేవలోకంలోని అప్సరసలు ఆనందంతో నాట్యం చేశారు. గంధర్వులు శ్రవణమంగళములైన గానాలతో నృత్యం చేశారు. దివిజవరులంతా నందన వనంలో అపురూపమైన పూలవనంనుండి దోసిళ్ళకొలదిగ పూలు సేకరించి, పుష్ప వర్షం కురిపించారు.

భూలోకంలో అయోధ్యా వాసులంతా అపరిమితానంద సందోహ భరితులై మేళతాళాలతో ఆడుతూ పాడుతూ నగరమంతా అపూర్వ శోభలతో వెలుగొందే విధంగా అలంకరించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

దశరథ మహారాజు అంతఃపుర పరిచారిక పరిచారక గణానికి భూరి బహూకృతులతో సత్కరించాడు.

సార్థకనామములు దశరథ సుతులు :

వశిష్ఠమహర్షి దశరథుని నలుగురు కుమారులకు వారి వారి జన్మ విశేషాలనుబట్టి నామకరణం చేసినట్లు, శిశువుల ప్రత్యేక గుణాలను బట్టి తెలుస్తున్నది. కౌసల్యా కుమారుడు దశరథుని జ్యేష్ఠ పుత్రుడు బన వానికి శ్రీరామచంద్రుడు అని పేరు పెట్టాడు. అందరినీ ఆకర్షించు విశిష్ట లక్షణమ: లున్నవాడు, నిరంతర ధ్యాన మగ్నులై అంతర్ముఖులకు అను సంధాన నామమైన "రామ" నామం ఎంతో పవిత్రమైనది. ఆహ్లాదకరమైనది కనుక ఆ పేరు అతనికి సార్థకమైంది.

కైకేయీ సుతునకు 'భరతుడు' అని నామ కరణం చేశాడు. ఉజ్వలమైన ఆదర్శాలను అనుష్ఠించువాడు కాగలడని అతనికి ఆ పేరు పెట్టడమైంది. సుమిత్ర సుతులిరువురికి "లక్ష్మణుడు, శత్రుఘ్నుడు" అని నామకరణం చేయడం జరిగింది. లక్ష్మణుడు సకల శుభలక్షణుడు కాబట్టి, అతనికి ఆ పేరు సార్థకమైంది. అదే విధంగా శత్రువులను అవలీలగా, నిశ్శేషంగా నాశనం చేయగలవాడు 'కనుక' శత్రుఘ్నుడు, అను పేరు సార్థకమైంది.

జన్మనిచ్చిన తల్లి దండ్రులకు కనులపండువుగా ప్రజలకు హృదయ రంజకంగా, దాశరథులు నలుగురు పెరిగి పెద్దవారవుతున్నారు. అయితే సోదరులు నలుగురిలో రాముడు, లక్ష్మణుడు ఒకరినొకరు విడచియుండలేని జంటగా ఉండేవారు. భరతుడు, శత్రుఘ్నుడు ఇరువురు రామలక్ష్మణులవలెనే ఒక జంటగా ఉండేవారు. మొత్తముమీద నలుగురన్న దమ్ములు ఒకరినొకరు ఎంతో ప్రేమాభిమానాలు కలిగియుంటూ సర్వజనాహ్లాదకరంగా మసలుకొనేవారు. ఆ రోజుల్లో అన్నదమ్ముల అనుబంధానికి, అనురాగా

నికి, ఆత్మీయతకూ ఆదర్శంగా ప్రజలు వీరి పేర్లు చెబుతూండే వారు.

దశరథుడు తన కుమారులందరిలోన జ్యేష్ఠుడు, గుణవంతుడు, రూపవంతుడు ఐన రాముడంటే ఎక్కువ మక్కువ చూపేవాడు. కుమారులు నలుగురు శ్రద్ధతో గురుశుశ్రూషచేసి, వేద వేదాంగములలో నిష్ణాతులైనారు. రాజపుత్రులు కనుక రాజోచితములైన విద్యలకు నెలవైన ధనుర్వేదమునందు ప్రత్యేకించి ప్రజ్ఞాపాటవములను కలిగించుకొన్నారు. సోదరులందరిలోను శ్రీరాముడు కూలంకష ప్రజ్ఞాభినివేశములు కల శక్తిశాలి అనిపించుకొన్నాడు. ఈ విద్యలన్నీ వశిష్ఠులవారి ఆచార్యత్వంలో వారు అభ్యసించారు. బాలుర లోని సహజ క్షత్రియ తేజానికి, వారు అభ్యసించిన వేద వేదాంగ విద్యలతాలూకు అపురూపమైన బ్రహ్మతేజంతోడై బంగారానికి పరిమళం అబ్బినట్లయినది. "భూలోకంలో అవతరించిన దివ్యశక్తి స్వరూపాలు ఈ బాలురని" ప్రజలు భావించి కీర్తించసాగారు. రఘువంశ దీపకులైన బాలుర బాల్య చేష్టలు, వారి చదువు సంధ్యలు, ఆట పాటల ముద్దుమురిపాలతో రాజమందిరం ఎంతో కోలాహలంగా ఉండేది. దశరథ మహారాజు హృదయం పుత్రోత్సాహంతో పొంగిపొరలి ఆనందసాగరం ఐంది.

చంద్రుడు పదహారు కళలుచే విరాజమానుడైనట్లే శ్రీరామచంద్రుడు కూడ పదహారు గుణములచే దినదిన ప్రవర్థమానం అవుతున్నాడు. శ్రీరామ చంద్రునిలోని పదహారు గుణాలను వాల్మీకి ఈ విధంగా పేర్కొన్నారు. 1. గుణవంతుడు, 2. వీర్యవంతుడు, 3. ధర్మజ్ఞుడు, 4. కృతజ్ఞుడు 5. సత్యవాక్కుకలవాడు 6. ధృఢవంతుడు 7. విశుద్ధ చారిత్రము కలవాడు 8. సమస్త ప్రాణులయెడ దయ కలిగియుండువాడు 9. విద్వాంసుడు 10 సమర్థుడు 11. సర్వథా ప్రియదర్శనుడు 12. ధృతికలవాడు 13. క్రోధమును జయించినవాడు 14. ద్యుతిమంతుడు 15. అసూయారహి

తుడు 16. రోషము కలిగినప్పుడు దేవతలను సైతము ధిక్కరించు వాడు.

నలుగురు పుత్రులు పెద్దవారై యుక్త వయస్సునకురాగనే దశరథ మహారాజు కుమారులకు తగిన కన్యలను అన్వేషించి వివాహము చేయవలెననెడి తలంపు కలిగింది. అతడొక నాడు నిండు కొలువుండి, వశిష్ఠ, వామదేవాది గురుజనులకి విషయమును విన్నవించి, వారితో సమాలోచన కొనసాగించు చుండెను. వారి సంభాషణ చివరకు వేదాంతంలోనికి దిగింది. మరొకవైపు మంత్రులు రాజకార్యాల గురించి తర్జన భర్జనలు చేస్తున్నారు. పురోహితులు అప్పటి రాశి ఫలాల గురించి, పాడిపంటల గురించి, గ్రహగతుల గురించి గుణిస్తున్నారు. దశరథుడు వారి వారి వాద ప్రతివాదాలు శ్రద్ధతో వింటూ మధ్య మధ్య తన అభిప్రాయాలు చెపుతున్నాడు. సూచనలు చేస్తున్నాడు. రాజసభ అంతా కోలాహలంగా ఉంది. ఆ సమయంలో ప్రతిహారి వచ్చి విశ్వామిత్ర మహర్షివచ్చి వెళ్ళాడని చెప్పి వెళ్ళాడు.

విశ్వామిత్రుల ఆగమనం:—

దశరథుడు వెంటనే మంత్రి, పురోహితులను వెంటబెట్టుకొని, విశ్వామిత్రునకు ఎదురేగి సకలవిధ రాజమర్యాదలతో స్వాగతం పలికాడు. వెంట తీసుకువచ్చి, ఉచితాసనంపై కూర్చుండబెట్టి, అర్ఘ్యపాద్యాది పూజావిధులచే పూజించి, వినయ విధేయతలతో అంజలి ఘటించి "మహర్షీ! తమరి యాజ్ఞగా నేనేమి చేయవలయునో సెలవిందు స్వామీ మీ దర్శనంవల్ల నా రాజ్యం, నా ప్రజలు, నాజన్మము పావనమైనవి. తమరు ఏది కోరిన యిచ్చువాడను. దయవుంచి కోరుకొనుడు." అని పలికెను.

విశ్వామిత్రమహర్షి దశరథునితో "రాజా! నేను దేనిని కోరినను, నీవద్దానిని అవశ్యము యిచ్చువాడవే కదా!" అని పలికిన దశరథుడు కించితుడై "మహర్షీ ఎంతమాట అంటిరి. ఈ సభా మధ్య

మున నిలచిన మంత్రులు, సేవకులు, రాజులు, వశిష్ఠాది మహర్షి గణం మధ్యన నేను "మీరు ఏదికోరిన అది యిత్తునని విస్పష్టముగా వచించితిని. మీరు నామాటను పాటిసేయక మరల నన్ను "నేను దేనిని కోరినను నీవద్దానిని అవశ్యము యిచ్చువాడవే"నని నొక్కి నొక్కి ప్రశ్నించుచున్నారు. మహర్షీ! సూర్యవంశములో జన్మించిన వారు ఎవరునూ మాటతప్పినవారు కారు. నేను మరల విన్నవించు కొనుచున్నాను. మీరేది కోరినను నేనిచ్చువాడనే." అని సమాధాన మిచ్చెను.

అప్పుడు విశ్వామిత్రుడు రాజు మాటలకు సంతృప్తినొంది, చిరునవ్వుతో దశరథునకు అభిముఖుడై "రాజా! వినుము నే వచ్చిన పని యేమనగా, అడవిలో నేనొక దుర్ఘట యజ్ఞకార్యమును నెర వేర్చ సంకల్పించి, అట్టి యజ్ఞమును ప్రారంభించితిని. దీక్షతో ఆ యజ్ఞమును కొనసాగించవలెను కదా! లేకున్న యజ్ఞకర్తకు తత్ఫలము లభించుటకు మారుగా అనేకవిధములైన అరిష్టములు వాటిల్లును. అట్టి గట్టి పూనికతో నేనున్న సమయములో క్రూర కర్ములైన రాక్షసులు యజ్ఞమును ధ్వంసము చేయుచుండిరి. వారి క్రూరకర్మములను నివారించగల శక్తి సామర్థ్యములు నాకున్నను, రాజా! యజ్ఞనిర్వహణ దీక్షలో నుండిన కారణమున స్వయముగా నేనట్టిపనికి పూనుకోలేదు. కావున యాగరక్షణకై సర్వసమర్థులైన ౨ కుమారులను రామలక్ష్మణులను తీసుకొని వెళ్ళుటకు వచ్చితిని. నీవిచ్చిన మాటప్రకారము నీ కుమారులను నావెంట పంపుము. ఇదియే నా కోరిక" అని విశ్వామిత్రుడు పలికెను.

విశ్వామిత్రుని కోరిక రాజునకు దారుణమైన వింతకోర్కెగా తోచినది. ఆకస్మికముగా విన్న కర్ణశూలములైన మహర్షి మాటలను దశరథుడు తట్టుకొనలేకపోయినాడు. మూర్ఛ వచ్చినంతపనియైనది. ఊహాలోనైనా కుమారుల వియోగమును గురించి ఆలోచించని రాజు కతడు మహర్షి మాటలు మిక్కిలి బాధను కలిగించినవి.

గాఢచింతావశుడైన దశరధుడు అతికష్టంమీద కొంతసేపటికి తేరుకొనినవాడై భయముతో "స్వామీ! మీ రేమనుచున్నారు. రామ లక్ష్మణులను యాగరక్షణకై మీవెంట పంపవలయునా? రామునేనా మీరు కోరుచుంటిరి. రాముడు పసివాడు. బాలుడు. ఏమీ తెలియని వాడు. కనీసము ధనుస్సును కూడ ఎత్తలేని మారాముడు మీకేమి సాయము చేయగలడు? అతడెందుకు నేనే నాయావత్‌సైన్య యుక్తు డనై, మీ యాగరక్షణకు విచ్చేయగలను." అని దశరధుడు పలికెను. అంత విశ్వామిత్రుడు వెంటనే ఆగ్రహము తెచ్చుకొని, మండిపడిన వాడై "రాజా! నీవిచ్చినమాటనే తప్పుచుంటివి కదా! నేను ఏదికోరిన అద్దానిని యిచ్చెదనని, ఈ సభావేదికనుండి ఇందరిమధ్యన వాగ్దాన మొనర్చితివి కదా! ఇప్పుడిదేమి?" అని పలికెను.

దశరధుడు పూడిపోయిన గొంతుకతో "మహర్షి! నన్ను క్షమింపుడు. దుర్మార్గులైన రాక్షసులు మాయావులు వారు అనేక మాయలచే వంచింతురు. అట్టి మాయావుల మాయలను ఛేదించి బాలుడైన మా రాముడు వారిని ఏవిధముగ వధించగలడు? అది యునుగాక మహర్షీ! నాకు లేకలేక కలిగిన సంతానము. అందునా జేష్ఠకుమారుడు 'రాము'డన్న నాకు ఎంతో ప్రీతి, ముసలితనములో నాకు ఆనందమును కలిగించిన రాముని నేనెంతమాత్రము పంప జాలను. ఇన్నిమాటలేల? రాముని విడిచి నేను ఒక్కక్షణమైనను జీవించజాలను. కావున మా రాముని మీ వెంట పంపజాలను. మహాత్మా! రాముని పంపుమను కోర్కెతప్ప మరొండేదియైనను కోరుడు. చివరకు ప్రాణములనైన సరే కాదనక యిచ్చువాడను. నన్ను దయజూడుడు.' అనుచు దశరధుడు దుఃఖముతో, భయముతో వడవడవణికిపోతూ, దీనముగా విశ్వామిత్రుని పరిపరి విధముల వేడు కొనెను.

విశ్వామిత్రుడు పట్టరాని కోపముతో దశరధునితో ఇట్లుపలుక దొడగెను. "రాజా! ఇచ్చినమాటను కాదను గొప్పతలంపు నీకు

కలుగుట విచిత్రముగా నున్నది. నీ రాముడు బాలుడైనా మాయావులైన రాక్షసులను సంహరించుటలో ధీరుడే. రాముని ప్రాణములకు నా ప్రాణముల నొడ్డి కాపాడుదును. నీవేమాత్రము భయపడకుము. నీవు రాముని పంపవు పో! నేనేమి చేయగలను "రాజా! భళి! భళి! రఘువంశపు రాజులలో వాగ్దాన మొనరించి, పిమ్మట భంగపరచిన పుణ్యాత్ముడు దశరథుడ"ను పొగడికోలునకు నీవే అర్హుడవుకమ్ము. అదియునుగాక ఇచ్చినమాటను తప్పి ప్రజలలో తమ ఏలిక మాట తప్పినవాడను అప్రతిష్ఠ శాశ్వతముగ నీ కలము కొనుము. యోచించుము. మహారాజా! మావంటి సాధుపురుషులు కోరినది గొంకక యిచ్చుట రఘుకుల మర్యాద, ఆకులమర్యాదను పాటించలేని భీరుతైన నిన్ను అర్థించడం నాదే పొరపాటు. సెలవు" అని వెళ్ళిపోబోయాడు.

అప్పుడు వశిష్ఠమహర్షి, విశ్వామిత్రుని శాంతింపజేసి, దశరథుని వైపు తిరిగి అతనితో ఇట్లా అన్నాడు.

దశరథమహారాజా! రామచంద్రుడు సామాన్యబాలుడు కాడు. చంద్రుడు, బృహస్పతి కలిసి కర్కాటకరాశిలో నుండగా, ఐదు గ్రహాలు (సూర్యుడు, అంగారకుడు, బృహస్పతి, శుక్రుడు, శని) ఉచ్చస్థితిలో నుండగా జనించిన సూర్యవంశదీపకుడు రాముడు. దేవకార్యసిద్ధికై జన్మించిన అవతారపురుషుడు. విశ్వామిత్రుల వారి కోరిక లోకరక్షణము. కావున సంశయించక రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంట పంపుము. అదియునుగాక సూర్యవంశ ప్రభువువైన దశరథమహారాజా! మీ వంశములో జన్మించిన వారెవరు ఆడినమాట తప్పినవారు కారు. మీరింతవరకు ఈ మహనీయునితో సభాసదులందరు వినుచుండగా, కనుచుండగా "ఏది కోరిన దానిని అవశ్యమిత్తునని" చెప్పియున్నారు. అయ్యది మీ సత్యప్రతిజ్ఞయే మేమెల్లరము భావించియున్నాము.

రాజేంద్రా! రాముని గూర్చి చింతింపకుడు. విశ్వామిత్రుల వారు సమర్థులు. అతడు తన తీవ్రమైన తపస్సుచేత రాజర్షి పదము

నుండి బ్రహ్మర్షి పదము నొందిన ప్రజ్ఞాశాలి. ధీమంతుడు, మన రామ లక్ష్మణులను సకల అస్త్ర శాస్త్ర విద్యాపారంగతులను చేసి, వారిని సర్వవిధముల శుభమూర్తులను చేయుటకే, దయతో ఇచ్చటి కరు దెంచినాడు.

దశరథుడు, వశిష్ఠుని హితోపదేశమును పాటించి, రామ లక్ష్మణులను విశ్వామిత్రుని వెంట వెళ్ళుటకు అనుమతించి, వారిని అప్పగించెను.

విశ్వామిత్రుడు రాకుమారుల నిద్దరిని వెంటబెట్టుకొని వన మధ్యమునకు వెడలిపోయెను. ముందు గురువుగారైన విశ్వామిత్రుడు పిమ్మట రాముడు, రాముని వెనుక లక్ష్మణుడు ఈవిధముగా వారు కాలినడకన రాత్రంతయు ప్రయాణించి, చీకటిపడు వేళకు వారు సరయూనది దక్షిణతీరమును చేరుకున్నారు.

రామలక్ష్మణులతో నదీతీరమున విడిసియున్న విశ్వామిత్రుడు రాముని సంబోధించి "రామా ఇప్పుడు నీకు తొలిసారిగా 'బల, అతిబల' యను రెండు మంత్రాలను ఉపదేశిస్తున్నాను. వీటిని శ్రద్ధగా జపించు. ఈ మంత్రద్వయ ఫలితముగా నీవు అజేయుడ వైన మహాబలవంతుడవు కాగలవు. అట్లే అలసట, దప్పిక, ఆకలి వంటివి బాధింపవు. శత్రువులు మిమ్ముల నేమి చేయజాలరు. బుద్ధి విశేషము, వాఙ్మతయందు శ్రేష్ఠుడవుగా నుందువు." అని మంత్రోప దేశము చేసెను. ఆరాత్రి వారొక వృక్షము క్రింద, దర్భలపై పరుండిరి.

వేకువఝామున విశ్వామిత్రుడు లేచి రాముని చూచి, "కౌసల్య గర్భమున జనించిన యోగ్యుడివైన ఓ రామా! ప్రాతః సంధ్యాసమయ మాగమించినది. నరశార్దూలా! నిద్దురను వీడి మేల్కొనుము. తొలి ఆహ్నికమైన దైవకార్యమును నిర్వర్తింప గడంగుము." అని చల్లని సన్నతెమ్మెరవంటి మృదుమధురములైన వాక్కులతో సోదరులను మేల్కొలిపెను.

విశ్వామిత్రుడు, మేల్కొనకముందే మేల్కొన్న రామ లక్ష్మణుల నిద్దరను వెంటనిడుకొని కాలకృత్యములు నెరవేర్చు కొని, స్నానార్థమై సరయూనదిలోని దిగెను. అచ్చటవారిచే సూర్య భగవానునికి అర్ఘ్యము లిప్పించి, ఒడ్డునకు వచ్చిరి. పిమ్మట వారు విశ్వామిత్రునితో సరయూనదీతీరము వెంట పయనించి, సరయూ నది గంగలో విలీనమగు సంగమస్థానమును చేరుకొనిరి. అక్కడ రాముడు ఒక ఆశ్రమమును చూచెను. "మహాత్మా! ఇది ఎవ్వరి యాశ్రమము" అని ప్రశ్నించెను.

అందుకు విశ్వామిత్రుడు 'రామా! ఇది స్థాణునియాశ్రమము. ఇచటనే సశరీరుడైన మన్మథుడు ఇంద్రుని ప్రేరణచే, శివుని తప స్సును భంగపరచి, అతని మూడవ కంటి మంటచే భస్మమై అనంగు డయ్యెను. అట్లు భస్మమైన ఆ మన్మథుని శరీరభాగములే అక్క డక్కడ పడినవి. అందుచే నిది అంగదేశమయ్యెను. ఈ ప్రాంత మున పెక్కురు మునులు ఆశ్రమములు నిర్మించుకొని వాసము చేయుచున్నారు. ఈ రాత్రి ఇచటనే విశ్రాంతి గొని, రేపకడ ముందున కేగుదము అని చెప్పెను. వారు అట్లే ఆ రాత్రి మునుల ఆతిథ్యమును పొంది ఆరాత్రి అక్కడ గడిపినారు.

మరల వేకువఝాముననే లేచి సంధ్యానుష్ఠాన విధుల నిర్వర్తించి విశ్వామిత్రుడు, రామలక్ష్మణులు ముగ్గురు కలసి ఒక దట్టమైన అరణ్యమును సమీపించినారు.

తాటక వధ:-

రామాభద్రా! మనమిప్పుడు ప్రవేశించిన యీ సాంద్ర రణ్యము తాటకయను రాక్షసి నివాసస్థానము. దీనిని మలద కరూశ"ములని పిలుతురు. పూర్వము ఇంద్రుడు వృత్రాసురుని వధిం చిన కారణమున యతనికి "బ్రహ్మహత్యా" దోషమంటినది. ఆ దోష పంకమును యింద్రుడీ ప్రాంతమున వదిలి తిరిగి తన దివ్యత్వ మును పొందెను. అందుచే దీనికాపేర్లు కలిగినది. అనంతరము

కొంతకాలమున కిచ్చట "తాటక" యను రాక్షసి జనించెను. ఈ తాటక యొక యక్షిణి. అది పుట్టుకచేతనే సహస్ర నాగబలసంపన్న సుందుడను వానిని పెండ్లాడి వానివలన "మారీచు"డను రాక్షసుని కన్నది. తాటక అజేయ. దాని బలసంపదలు బ్రహ్మవరమువలన లభించినవి. సుందుని, అగస్త్యుడు ఒకానొక కారణంచేత చంపవలసి వచ్చింది. ఆ కారణంగా తల్లీకుమారులైన తాటక, మారీచుడు ఇరువురూ అగస్త్యుని మీదికి పోయినారు. అగస్త్యుడు వారిని రాక్షసులు కండు అని శపించినాడు. అది మొదలు వారు రాక్షసజన్మము నెత్తి చేయరాని హింసాకృత్యములు చేయుచూ ఇచటి సాధుపురుషులను బాధించుచున్నారు. రామ ! నీవిపుడా రాక్షసి తాటకిని సంహరింపవలసియున్నది. స్త్రీయని సందేహింపక నిస్సంకోచముగ సంహరింపుము అని చెప్పెను.

విశ్వామిత్రుడు ఈ మాట యనునంతలోనే ఎక్కడనుండియో భయంకరమైన పిడుగువంటి ధ్వని కలిగినది. ఆ ధ్వనికి దిక్కులు పిక్కటిల్లినవి. భూమి దద్దరిల్లినది. రాముడు ఒక్కకుదుపు తిని "స్వామీ! ఏమిటా ధ్వని" అని ఆశ్చర్యముగ ప్రశ్నించెను. విశ్వామిత్రుడు రామా! అదే ఇంతకుమునుపు నేను చెపుతూ వచ్చిన 'తాటక' రాక్షసి అరుపు. రామా! వెంటనే బాణం సంధించు. సంహరించు." అని ఆజ్ఞాపించెను. అప్పుడు రాముడు "స్త్రీపై బాణాన్ని సంధించమందురా?" అని ప్రశ్నించాడు. అందుకు విశ్వామిత్రుడు "రామభద్రా! ఈ తాటకి లోకకంటకియైన రాక్షసి. క్రూరకర్మ. ఈ ప్రాంతమందు నివసించు సాధుసత్తములను, అమాయక ప్రజలను తనకు ఆహారంగా భక్షిస్తూ చాలకాలం నుండి జనపీడన కొనసాగిస్తున్నది. వికటరూపిణియై రాత్రింబవళ్ళు ఈ అడవుల్లో తిరుగాడుతూ ప్రాణిహింసను జరుపుచున్నది. ముని సత్తములు నిర్వర్తించు యజ్ఞయాగాదికములను ధ్వంసము చేయుచున్నది. ఇట్టి లెక్కసమైన రాక్షసిని చంపుటవలన ఎటువంటి దోషముకాని, పాపముకాని అంటబోదు. కావున వెనుకముందు లాలోచించక

దీనిని తెగటార్చుము." అని నొక్కిచెప్పెను. అదే సమయంలో తాటకి తన విశాలమైన నోటిని తెరచుకొని, భీకరముగా గర్జించుచూ రామలక్ష్మణులను మ్రింగుటకు ఒక్కుమ్మడి దరిజేరెను. రాముడిక ఉపేక్షించక ఒక్కటే బాణంతో రక్కసిని వధించెను. నడగొండ వలెనెను ఆకారముతో పైకి లంఘింపనున్న తాటక, ఆయువు పట్టున దారుణమైన తిరుగులేని రామబాణము గ్రుచ్చుకొనగానే కొండ యెగిరి పడినట్లు నేలమీద ఒరిగిపడెను. తాటక సంహారము జరిగి అచటి జనులకు ఆ వనములో ప్రశాంత జీవనము కలిగినది.

తాటక సంహారమునకు ఇంద్రాది దేవతలు సంతోషించినారు. "విశ్వామిత్రా! సులభకర్ముడైన శ్రీరామునకు ఉపదేశించదగిన అస్త్ర విద్యలన్నియు అవశ్యము ఉపదేశింపుము. రాముడు కారణజన్ముడు. ఇతనివలన అనితరసాధ్యమైన లోకకళ్యాణము జరుగవలసి యున్నది" అని ప్రార్థించి, దేవతలు తమతమ స్థానములకు వెళ్ళి నారు.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు సకలాస్త్రశాస్త్ర విద్యలు నేర్పినారు. ఆరాత్రి వారు అచటనే నిర్భయముగా విశ్రాంతి గైకొని నారు.

తెల్లవారినది.

గురువుగారు నిద్రలేవకుండగానే రామలక్ష్మణులిద్దరూ మేలు కొనినారు. గురువు మేల్కొనిన పిదప సోదరులిరువురును భక్తిశ్రద్ధలతో గురుపాదములకు సాష్టాంగ దండప్రణామము లాచరించినారు.

విశ్వామిత్రుడు వారలను "రాజపుత్రులకు శుభమగుగాక" యని దీవించెను. కాలకృత్యాలు తీర్చుకొనిన పిమ్మట విశ్వామిత్రుడు ముందు నడవగా శిష్యులిద్దరు ఆయననుసరిస్తూ అనుగమింపసాగిరి. గురుశిష్యు లా విధంగా అడవులగుండా నడుస్తూ వున్నారు. విశ్వామిత్రుడు మార్గమధ్యంలో ఉన్న ఆయా ముఖ్యప్రదేశాలు,

మునివాటిక విశేషాల గురించి వివరించి చెబుతూ సాగాడు. ఆయన చెప్పిన విషయాలను శ్రద్ధగా ఆలకిస్తూ ఉత్సాహం తో గురువుగారి వెంట చకచకా నడుస్తూ వెళుతున్నారు.

సిద్ధాశ్రమము చేరిక :

గురు శిష్యులు ముగ్గురూ సిద్ధాశ్రమమును చేరినారు. విశ్వామిత్రుడు ఈ యాశ్రమ విశిష్టతను చాటుతూ "రామా! ఇయ్యాది విష్ణువాసస్థలము. పూర్వము కశ్యప మహాముని, తన భార్యయైన అదితితో కూడ విష్ణువును గూర్చి తీవ్రతపమొనర్చెను. పర్యవసానముగా విష్ణువు ప్రత్యక్షమై కశ్యపు నేమి కావలయునో కోరుకొమ్మనెను. కశ్యపుడు దేవలోక సంరక్షణార్థమై సమర్థుడగు పుత్రుని రూపమున నీవు నా గర్భవాసమున జన్మింప వలయునని కోరెను. విష్ణువా విధముగనే జన్మింతునని వర ప్రదానము చేసెను. వరమున కనుగుణముగా విష్ణువు వామనుని రూపమున అతిది కశ్యపులకు పుత్రుడై జన్మించెను. కశ్యపుడు విష్ణువుని గూర్చి తపస్సిద్ధి నందినదీ ప్రదేశమే కావున దీనికి సిద్ధాశ్రమమని పేరు వచ్చెను. రామా! ఈ యాశ్రమమే మన యాశ్రమము. ఇచ్చటనే నేను యాగము చేయుచున్నాను. రాక్షసులీయాగమును ఎప్పటికప్పుడు ధ్వంసమొనర్చుచున్నారు." అని నుడివెను.

యాగసంరక్షణము :

విశ్వామిత్రుని యాగము ప్రారంభమైనది. రామలక్ష్మణులు తామేమిచేయవలెనో విశ్వామిత్రుడు చెప్పలేదు. అట్లు చెప్పక పోవుటకు గురువుగారు యజ్ఞ దీక్షితుడైయుండుటయే కారణము అని అచటి మునులు చెప్పి, రామలక్ష్మణులారా! మీరు ధనుర్ధారులై అనిశము ఈ యాగమును రాక్షసులు విధ్వంసము చేయకుండా కాపాడుడు. ఇదియే మీ కర్తవ్యము. గురువుగారి కోరికయు నిదే యనిరి.

రామలక్ష్మణులట్లేయని ధనుష్పాణులై అహో రాత్రములు యాగరక్షణము సల్పుచుండిరి.

ఆ రోజు ఉషఃకాలముననే యాగశాలలో పర్యగ్నికరణము జరిగియాగము ప్రారంభించబడెను. యాగ గుండములోనికి అగ్నిహోత్రుడు జాజ్వల్య మానముగా వెలుగొందుచు అత్యంత శ్రద్ధా సక్తులతో హవ్యకర్యములను స్వీకరించుచు వెలుగొందు చుండెను.

రామలక్ష్మణులు ధనుర్బాణములను ధరించి యజ్ఞశాలచుట్టు కాపలా కాయుచుండిరి. కామ రూపులైన రాక్షసులు అనేక మాయలతో వసా రక్తమాంసములను కుంభ వృష్టిగా కురిపించుచుండిరి. రామలక్ష్మణులు యజ్ఞశాలపై బాణములతో గొడుగువలె, కప్పను నిర్మించిరి. యజ్ఞ భంగమును చేయ సమకట్టిన మాయారూపులైన రాక్షసులు, మారీచ సుబాహులను వారు- వారిపై రామలక్ష్మణులు తమ బాణములను గురిపెట్టి వదిలిరి. తీక్షణమైన రామబాణ ఘాతమునకు సుబాహుడచటనే ప్రాణములను వదలెను. మారీచుడు మాత్రము దక్షిణదిశగా నూరు యోజనముల దూరమున పోయి పడెను.

రామలక్ష్మణుల నిశిత పర్యవేక్షణలో విశ్వామిత్రుడు యాగమును నిర్విఘ్నముగ పూర్తి చేసెను. యాగ నిర్వహకులంతా అవభృదస్నానాదులు నిర్వర్తించిరి. యాగం పూర్తి అయినది.

విశ్వామిత్రుడు యాగరక్షకుడైన ఆ యన్నదమ్ముల నిద్దరినీ, ఆశీర్వదించి, వారికి చక్కని రాజనీతి ధర్మాలను నిత్యనైమిత్తిక ధర్మసూక్ష్మలను వివరిస్తూ వుండగా క్రతు నిర్వహణమునకు వచ్చిన ఋత్విక్కులు, సందర్శనమునకు వచ్చిన బ్రాహ్మణోత్తములు విశ్వామిత్రుని వద్ద సెలవు గైకొనుటకువచ్చి యిట్లనిరి. "మహర్షీ! మిథిలా నగరాధీశ్వరుడైన జనక మహారాజు ఒక యజ్ఞమును చేయుచున్నాడు. ఆ యాగమును చూచుటకు మేము వెళ్ళ గోరుచున్నాము. మీరును, ఈ రామాలక్ష్మణుల యుక్తంగా ఆ కార్యక్రమమునకు విచ్చేయుట ఉచితముగా నుండును. అనుమతింపుడు"

అని చెప్పిరి. విశ్వామిత్రుడు వారి మాటలను విని రామలక్ష్మణుల వైపు చూచి ఆమోద సూచకముగా, 'వెళ్ళుదమని' తల పంకించెను.

ఆనాటి రాత్రి ఆశ్రమములో ప్రశాంతంగా గడిపారు. మరునాటి ఉదయమే రామలక్ష్మణులు నిద్రమేల్కొంచి, విశ్వామిత్రునకు నమస్కరించి, కాలకృత్యాదులు నెరవేర్చుకొని, గురువుగారి తరువాత సూచనలకై నిరీక్షించుచుండిరి. కొలది సమయములోనే విశ్వామిత్రుడు జనకుని యజ్ఞమును తిలకించుటకై, రామలక్ష్మణులతో, కొందరు మునులతో అచటినుండి బయలుదేరిరి. అడవిలో నడచి నడచి శోణానది తీరమును చేరిరి.

ఆ రాత్రి వారందరు ఆ తీర ప్రాంతమున సుఖముగా నిద్రించిరి. ఉదయాననే రాజపుత్రులు మేల్కొని, కాలకృత్యములు తీర్చుకొని, విశ్వామిత్రుని వద్దకు వచ్చి కూర్చుండిరి. రాముడు అచటి ప్రకృతి శోభకు అచ్చెరువొందెను. అతడు విశ్వామిత్రునితోమహాను భావా! ఈ ప్రాంతమత్యంత రమణీయముగ నున్నది. ఇందలి విశేషములను గురించి వివరించండి అని ప్రశ్నించెను. అందులకు విశ్వామిత్రుడు ఆ ప్రాంత చరిత్రము నిట్లు నుడివెను.

విశ్వామిత్ర చరిత్రము :- రామచంద్రా! ఇప్పుడు మన మున్నది- వసురాజ్యము. ఇది ఐదు పర్వతముల నడుమనున్నది.

కుమారా! సవిస్తరముగా వినుము.

బ్రహ్మమానసపుత్రుడు కుశుడనే రాజర్షి ఉన్నాడు. అతనికి నలుగురు కుమారులు. 1. కుశాంబుడు 2. కుశనాభుడు 3. అధూర్తరజసుడు 4. వసువు అనువారు.

ఈ నలువురు కుమారులు తండ్రి రాజ్యమును నాలుగు భాగములుగా చేసుకొని పరిపాలించుకొంటూ వచ్చారు.

వారిలో 'కుశనాభుడ'నేవాడు తండ్రివలెనే రాజర్షి పదము నందెను. అతనికి 'ఘృ తా చి' యను అప్సరస స్త్రీ వలన నూర్గురు కుమార్తెలు కలిగారు. ఒకనాడు వాయుదేవుడు వారిని చూచి వారల సౌందర్యమునకు ముగ్ధుడై తన్ను వివాహమాడవలసినదని కోరి నాడు. అందులకు ఆకన్యలు మా వివాహము విషయములో మా తండ్రిగారిదే నిర్ణయము. ఆయన మమ్మెవరి కివ్వదలచిన వారి కివ్వ వచ్చును. తండ్రి చేసిన వివాహబంధనమునే మే మంగీకరింతుము. కావున ఇంక ఈ విషయములో మమ్ము తర్కించవలదు." అని ఖండితముగా చెప్పిరి. అందులకు వాయుదేవుడు మిక్కిలి కోపించి, ఆ కన్యలనందరిని కుబ్జలుగా చేసినాడు. వారలు లజ్జించి బిర బిర తండ్రి వద్దకు పరుగెత్తుకొని వెళ్ళి, జరిగిన వృత్తాంతమును వివరిం చిరి. తండ్రి వారి విచక్షణకు, ధర్మజ్ఞతకు, పితృదేవుని యందలి గౌరవభావమునకు, ఓర్పునకు మెచ్చుకొని "బిడ్డలారా! మీ యెడల వాయుదేవు డొనరించిన యాగడమునకు మిక్కిలి చింతించు చున్నాను. అయినను మీరు ఓర్పు వహించి, ఆతన్ని శపింపక బాధ్యత యంతయు నాయందుడి, యిటకు వచ్చిరి. మీ ఓర్పు శ్లాఘ నీయము. క్షమయే దానము, క్షమయే యజ్ఞము, క్షమయే సత్యము, క్షమయే కీర్తి, క్షమయే ధర్మము. పెక్కు మాటలేల క్షమయే ఈ జగత్తునకు సర్వాధారము" అని నుడివినాడు.

పిమ్మట కుశనాభుడు తన కూతుండ్ర నూర్వురను బ్రహ్మ దత్తుడను వానికిచ్చి వివాహము చేసెను. బ్రహ్మదత్తుడు కుశనాభుని నూర్గురు కన్యలను వివాహమాడడంతో, వారి 'కుబ్జాత్వము' పోయి యథాపూర్వరూపము వచ్చినది. వారు భర్తతో కాంపిల్య నగరంలో సుఖంగా కాపురం చేసుకుంటు వున్నారు.

కుశనాభుడప్పటివరకు అపుత్రకుడు పుత్రులు లేని కారణాన వంశవృద్ధిని కోరి పుత్రుని కొరకై "పుత్రకామేష్టి" యాగం చేశాడు. తండ్రియైన కుశుడు ప్రత్యక్షమై "నాయనా! నీకు వంశదీపకుడైన ఒక కుమారుడు కలుగగలడని చెప్పెను. అతడు 'గాధి' యను

పేరుతో లోకమున ప్రఖ్యాతి నందగలడు. అతనివలన దశదిశలా నీ కీర్తి ప్రతిష్ఠలు వ్యాపించగలవు," అని చెప్పి అతడు బ్రహ్మ లోకం చేరుకున్నాడు. తరువాత కొంతకాలానికి ఒక కుమారుడు కలిగాడు. అతడే 'గాధి' మహానుభావుడైన ఆ 'గాధి' యే నా తండ్రి. రామచంద్రా! నేను కుశుని వంశంలో జన్మించినవాడను కావున నన్ను కౌశికుడని, గాధి రాజకుమారుడను గాన 'గాధేయు డని' పిలుతురు. నాకొక సోదరి ఉన్నది ఆమెయే 'కౌశికి'. ఆమె "ఋచికుడ"ను మహానుభావుని వివాహమాడినది. నిరంతర భర్తృ సేవ యొనర్చి ఆమె సశీరముతో స్వర్గధామమును చేరినది.

ఆమెయే లోకకళ్యాణ కాంక్షచే హిమవత్పర్వత ప్రాంతము నకు పోయి 'కౌశికి" యను నదీరూపమున ప్రవహింపసాగినది. నేనామె సన్నిహితముగ నుండగోరి, ఆ నదీతీర ప్రాంతమున ఆశ్రమము నిర్మించుకొని తపశ్చర్య కొనసాగించు కొనుచున్నాను. యజ్ఞము చేయ సంకల్పించి నేనిటకు వచ్చితిని, నీ సహాయమువలననే తలపెట్టిన యాగము అన్నివిధముల ఫలవంతమైనది.

విశ్వామిత్రుడు తన కథ యంతయు క్లుప్తముగా, సవిస్తర ముగా చెప్పునంతలో రాత్రి సమయమైనది. ఒకరికొకరు చెప్పుకొన కుండానే గురుశిష్యులు నిద్రలో కూరుకొనిపోయి ఉదయమే నిద్ర లేచి, మరల నడక సాగించినారు.

గంగావతరణము :-

శోణానదిని దాటి గురుశిష్యులు క్రమముగా గంగానదిని చేరిరి.

రాముడు గంగను గూర్చి విశ్వామిత్రు నడిగెను.

గంగను "త్రిపథగా" అని అంటారు ఎందువలన? ఆ నది ముల్లోకములను ఆక్రమించి సముద్రునిలో సంగమించిన విధ మేమి?"

విశ్వామిత్రుడిట్లు వివరించెను

రామా! శ్రద్ధగా వినుము. హిమవంతునికి ఇరువురు పుత్రికలు కలిగినారు. పెద్దకుమార్తె పేరు గంగ. రెండవ కుమార్తె 'ఉమ' ఈ ఉమనే పార్వతి అనికూడా అంటూ వచ్చారు.

పార్వతిని శివుని కిచ్చి పెండ్లి చేశారు. గంగ దేవతల ప్రార్థనపై దేవలోకమున కరిగి నదీరూపము దాల్చినది. ఆ నది తరువాత త్రిపథము యందు చరించునదై 'త్రిపథ'గా యని పేరు బడిసినది.

ఆ కథ చెబుతాను సవిస్తరంగా వినుము. పార్వతికి వేల సంవత్సరాలు గడిచినా సుతులు కలుగలేదు. శివుడు పార్వతి యుక్తంగా పుత్రేచ్ఛచే పర్వతం మీద తపస్సు చేసుకుంటూ వున్నాడు. ఇక దేవసేనను నడిపించు నాయకుడు లేక దేవత అందరూ శివుని ప్రార్థించినారు. ఆ సమయముననే శివునికి రేల్లు స్ఖలనమైనది. మహా తేజోవంతమైన ఆ దివ్యతేజము యొక్క తీవ్రతను, ఉగ్రతను ఎవరు భరించగలరు? అను ప్రశ్న వచ్చినది. దేవతలు అందోళనము చెందిరి. మరల ఈశ్వరుని ప్రార్థించగా ఈ తేజము భూమి భరింపగలదని, చెప్పెను. ఆ విధముగా భూమిపై శివతేజము పడినది. అది భూమియంతయు ఆక్రమించినది. దేవతలు మిక్కిలి భయపడి, అగ్నిని, వాయువును ప్రార్థించి, దీనిలో మీరు ప్రవేశింపుడని కోరగా అగ్ని వాయువుతో కలిసి శివతేజమున ప్రవేశింపగా నది శ్వేత పర్వతమైనది. అదియేశరవణము (రెల్లువనము) ఆ శరవణము నందే శివతేజమున "కుమారస్వామి" జన్మించినాడు. అతనికి ఆరుగురు కృత్తికలు పాలిచ్చుటచే "కార్తికేయుడని" పిలువ బడినాడు.

బిడ్డడు కలిగినను పార్వతి తను ఏమి కోరి తపమునకు గడంగెనో ఆ విధముగా జరుగలేదని, అందుకు దేవతలు కారణమగుటచే వారిని అపుత్రకులు కండని శపించినది. అక్కడనుండి దేవతలు సంతానము పొందు యోగ్యతను కోల్పోయిరి. ఆ సమయములోనే

పార్వతి భూమిని కూడ శపించినది. "నీవు పెక్కుమందికి చేతులు మారి, పెక్కురకు భార్యవుగా పేరు బడెదవవు. నా పుత్రప్రాప్తి ప్రయత్నమును నిరోధించిన దానవైతివి కనుక నీవును నీ పుత్రుల వలన సంతోషమును పొందకుండెదవుగాక.

శివుడంతట పార్వతీయుక్తముగా హిమవత్పర్వతము నందలి వేరొక కొండశిఖరము పైనుండి తపస్సు చేయ నారంభించెను.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు పార్వతి చరిత్ర వినిపించి, పిదప 'గంగ' చరిత్రను ఇట్లు చెప్పదొడగెను.

రాకుమారులారా! ఇది మీ వంశపూర్వజులకు సంబంధించిన కథ. శ్రద్ధగా వినండి.

రామలక్ష్మణులు తమ పూర్వీకుల కథ యనగానే గురువుగారి వైపు ఎంతో శ్రద్ధాసక్తులతో చూచి, చెవులు రిక్కించి, అతడు చెప్పునది వినదొడగినారు.

"పూర్వం సగరుడనే చక్రవర్తి అయోధ్యను పరిపాలిస్తూ వుండేవాడు. ఆతడు ఎంతో ధర్మబుద్ధి కలవాడు. అతనికి ఇద్దరు భార్యలు. 1) కౌశిని, 2) సుమతి అనువారలు — కౌశినికి అసమంజసుడు అనే కుమారుడొకడు కలిగాడు. సుమతికి సొరకాయ వంటి పిండమొకటి యేర్పడి బయల్పడగా దానినుండి అరువదివేల మంది కుమారులు కలిగారు. ఇట్టి విపర్యయము కాలవైపరీత్యమే కదా!

కౌశిని కుమారుడు అసమంజసునికి అంశుమంతుడు అను కుమారుడు కలిగెను. అతడు మిక్కిలి యోగ్యుడు.

కొంతకాలమునకు సగరునికి ఒక మహాయజ్ఞము చేయవలయునని తలంపు కలిగినది ఆ యజ్ఞము హిమవత్పర్వతము-వింధ్య పర్వతములనడుమ సంకల్పించెను యజ్ఞరక్షణార్థమై అంశుమంతుడు సగరుని వెంబడించినాడు. యజ్ఞము మొదలైంది. ఇంద్రుడు రాక్షస

రూపమును దాల్చి, యజ్ఞాశ్వమును హరించి, ఈశాన్యాధిపతిగా వున్న విరూపాక్షుని వద్ద పాతాళమందు దాచెను. అశ్వము కనిపింపనిదే దాని యోగక్షేమము లరయువరకు యజ్ఞము కొనసాగింప వీలులేదని ఋత్విక్కులు నుడివిరి. ధర్మాభిమాని, శాస్త్రవిదుడు ఐన సగరుడు అశ్వమును పట్టి తెచ్చుటకై తన కుమారు లరువదివేల మందిని నియోగించెను. తండ్రి యానతి ననుసరించి, సాగరులు మొత్తము సాయుధులై నేల నాల్గుచెరుగులా అన్వేషింపసాగిరి. అంతేకాక భూమినంతయు త్రవ్వుకొని లోపలలోపల వెదుకసాగిరి. ఎంత త్రవ్వుకపోయినను యాగాశ్వము జాడకనిపింపలేదు. చివరకు ఈశాన్యదిక్కును త్రవ్విరి. ఆ దిక్కున ఉన్న విరూపాక్షుడు కోప దృష్టిని వారిపై బరుపగా ఆతని కోపాగ్నిచేత సగరకుమారులు దగ్ధమై బూడిదరాశులుగ మారినారు. ఎంతకును సగరుల జాడ తెలియకపోగా, పిన తండ్రులజాడ తెలుసుకొని, అశ్వమును బట్టి తెచ్చుటకు అంశుమంతుడు బయలుదేరెను. అంశుమంతుడు తిన్నగా సాగరులు భస్మరాశులై పడియున్న స్థలమునకు వచ్చెను. అచ్చటనే విరూపాక్షుడుండెను. అతనిచెంత యాగాశ్వము, సాగరులు భస్మరాశు లయిన ఉదంతమును విని అంశుమంతుడు మిక్కిలి చింతించెను. అంతనాతడు విరూపాక్షుని యొద్దగల యాగాశ్వమును గైకొని, తన తాతగారైన సగర చక్రవర్తి చేయుచున్న యాగము వద్దకు వచ్చి, వారికి అశ్వమును సమర్పించి జరిగిన వృత్తాంతమును అచటి వారికి వినిపించెను.

పిమ్మట బూడిద రాశులుగా పడియున్న పినతండ్రులకు జలతర్పణము గావించి యుత్తమగతులు ప్రాప్తింపజేయుటకు నిశ్చయించుకొనెను. జలతర్పణమొసగుటకు భూలోకము నందున్న జలములు వినియోగపడవని, దేవలోకమున నున్న గంగను తెచ్చి, తర్పణము గావించినచో పితరులు తృప్తినొందెదరని భావించి, గిరిజ గంగను భూలోకమునకు తెచ్చుటకుగాను 'బ్రహ్మ'ను గూర్చి తపస్సు చేసెను కాని చిరకాలము తపస్సు చేసినను అంశుమంతునికి

బ్రహ్మ దేవుని అనుగ్రహము కలుగదయ్యెను. తుదకు అతడు తన ప్రయత్నమున కృతకృత్యుడు కాకుండగనే తన కుమారుడైన దిలీపునకు రాజ్యమప్పగించి వెడలిపోయెను. దిలీపుడు కూడ, గంగను తెచ్చి తన పితృదేవతలకు తర్పణమొసంగి పుణ్యగతులు కల్పించ డానికి అవకాశము చిక్కలేదు. దిలీపుని తరువాత, అతని కుమారుడు భగీరథుడు. భూలోకమున గంగావతరణ కార్యమును సాధించుటకై బ్రహ్మ నుద్దేశించి కఠోరమైన తపస్సును ప్రారంభించెను. వేయి సంవత్సరాలపాటు తపస్సు చేయగా బ్రహ్మ సంతృప్తిచెంది ప్రత్యక్ష మైనాడు.

భగీరథుడు బ్రహ్మను : స్వామీ! సగర కుమారులకు జల తర్పణము చేయుటకు వీలు కలిగింపుడు. గంగను భూమికి వదలడు. మరియొక విన్నపము ఇక్ష్వాకు వంశమును కొనసాగించు కుమారుని కూడ నాకు ప్రసాదింపుడు అని ప్రార్థించెను.

బ్రహ్మ : నీవు కోరిన ప్రకారము గొప్ప వరములు రెండింటిని నీకు ప్రసాదించుచున్నాను. గ్రహింపుము. నీ మొదటి కోర్కెయైన గంగను భూమికి అవశ్యము పంపెదను అయితే ఉరవడించుచు, పరవడిం చుచు భూమిదెసకు వచ్చు గంగ వేగమును భూలోకమున పరమ శివుడు తప్ప వేరెవరు భరింపలేరు. కావున ఈశ్వరుడా పనిని నెర వేర్చుటకు శివుని ప్రార్థింపుము. బ్రహ్మదేవుడా విషయమును గంగకు కూడ చెప్పెను.

బ్రహ్మయాజ్ఞ ప్రకారము భగీరథుడు శివుని గూర్చి తపస్సు చేయగా శివుడు ప్రత్యక్షమై గంగను తన శిరమున దాల్చుటకు అంగీకరించెను.

రామా! గంగ భగీరథుని తపస్సు మేరకు బ్రహ్మ యిచ్చిన వరదానము ననుసరించి, భగీరథుని ప్రార్థనమున భూలోకమునకు మహావేగముతో ప్రయాణించెను. ఉత్తుంగ తరంగాలతో చెంగు

చెంగున గర్వాతి రేకంతో ప్రవహిస్తున్న గంగ ప్రవాహ వేగ కోపమును శివుడు గ్రహించెను. గంగ గర్వమణచుటకై ఆ ప్రవాహమును ఒడిసిపట్టి తన శిరమందున్న జటా వలయమున బంధించెను. గంగ శివుని జటలనుండి బయటకు రాలేకపోయినది. అలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. భగీరథుడు చేసేదిలేక, తను చేసిన అంత శ్రమ కూడ నిష్ప్రయోజనమై పోయిన దుకు చింతించి, గంగ వేగమును తగ్గించి, తన వెంట భూమికి పంపుటకు శివుని అనుగ్రహమును, అనుమతిని కోరి, మరల తపస్సున కుపక్రమించెను. శివుడు భగీరథుని తపో తీవ్రతకు ప్రసన్నుడై, ప్రత్యక్షమై గంగను భూలోకమునకు వదిలినాడు. అలా గంగ భూమికి చేరి హిమవత్పాదములో ఒక సరస్సుగా మారినది. అదియే 'బిందు సరస్సు' అని పిలవ బడినది. ఆ బిందు సరస్సు నుండి గంగ ఏడు పాయలై ఏడు దిశలుగా ప్రవహించినది. ఆ ఏడు పాయలలో పావని, హ్లాదిని నళిని అను మూడు పాయలు తూర్పు దిశగాను, సేలు, సుచక్షువు, సింధువు అను పాయలు మూడు పడమటి దిశగా ప్రవహించినవి. మిగిలిన ఏడవపాయ భగరథుని వెంట నడిచినది. భగీరథ చక్రవర్తి రథము ముందుకు సాగుచుండగా, వెనుక గంగ నడచినది. మార్గమధ్యంలో జహ్నువనే మహర్షి ఆశ్రమం మీదుగా ప్రవహించినది. దాని కారణంగా ఆశ్రమం మునిగిపోయినది. ఈ చర్యకు జహ్నువు గంగపై కోపించి, అందలి జలమునంతటిని మ్రింగి వైచెను. అంత దేవతలు, యక్షులు, గంధర్వులు, కిన్నెరకిం పురుషులు, భగీరథుడు జహ్ను మహర్షిని ప్రార్థించిరి. "గంగ మీ పుత్రిక కరుణించి, విడిచి పెట్టండి."

దేవాదుల ప్రార్థనలను మన్నించి, జహ్ను మహర్షి గంగను పుత్రికగా అనుమతించి, తన చెవి నుండి, సన్నని ధారగా వది లెను. అది మొదలు ఆ ప్రవాహమునకు 'జహ్నవి' అను పేరు వచ్చినది.

గంగ మరల భగీరథుని వెంట పాతాళమునకు పోయి సగర కుమారుల భస్మరాశులపై ప్రవహించెను. భగీరథుడు శాస్త్ర ప్రకారము పితరులకు పితృకర్మల నాచరించెను. సగర కుమారులకు ఉత్తమ గతులు ప్రాప్తించినవి. రామభద్రా! మీ వంశ పూర్వజుడైన భగీరథుని ప్రయత్నము వలన 'గంగ' పుడమి పైకి వచ్చినది. కాన ఇద్దానికి "భాగీరథి" యని కూడా నామకరణము జరిగినది. ఇది మహా పుణ్యనది.

ఈ గంగావతరణ గాథను ఎవరు విన్నా, చదివినా వారి పాపరాశులు ప్రక్షాళితమై పుణ్యాత్ములగుదురు.

అమృత మథనము :

కశ్యపునకు దితి, అదితి అని ఇద్దరు భార్యలు కలరు. దితి కుమారులు దైత్యులు అనీ, అదితి కుమారులు ఆదిత్యులు అని పిలువబడినారు. దైత్యులు అమిత సత్యవంతులు, అదితి కుమారులు, శౌర్య పరాక్రమవంతులు ధర్మపరాయణంలో, కృతపుణ్యులు.

అయితే జరామరణ, వ్యాధి మున్నగు దోషాదులు లేకుండా చేసుకొనవలెనని వారికి యాలోచన కలిగినది. ఆ ఆలోచన ప్రకారము వారికి అమృతము కావలసివచ్చినది. అమృత పానము వలననే కదా! అమృతత్వము సిద్ధించునది. అందుకొరకు పాలసముద్రమును చిలికి అమృతమును పొందవలెను. ఈ రహస్యము రాక్షసులకు కూడ తెలియును. కాగా మంథరపర్వతాన్ని కవ్వంగా చేసుకొని, వాసుకియను నాగరాజును త్రాడుగా చుట్టి సముద్ర మథనానికి పూనుకొన్నారు. ఆ మథనంలో మొట్టమొదట హాలాహలం పుట్టింది. దేవతలు భయపడ్డారు. ఈశ్వరుణ్ణి రక్షింపవలసినదని కోరారు.

ఈశ్వరుడు దయతో ఆ విషాన్ని గ్రహించాడు. కంఠం లోననే దాగియున్న ఆ విషం యొక్క ప్రభావము వలన అతడు నీలకంఠుడు లేక శ్రీకంఠుడు అని పిలువబడినాడు.

మళ్ళీ అసురులు, సురలు సాగరమథనం ప్రారంభించారు. ఆ సమయంలో మంధరం బరువు ఎక్కువై పాలసముద్రంలో క్రుంగిపోయింది. దానిని విష్ణుమూర్తి తాబేలు రూపం ధరించి మూపు పైన మంధరాన్ని నిల్పాడు. మరల సాగర మథనం. ఈ సారి ధన్వంతరి అవతరించినాడు. తరువాత అప్సరసలు, పుట్టారు. క్రమంగా దేవాసురుల సాగర మథనంలో క్రమంగా ఉచ్చైశ్రవము, ఐరావతము, కౌస్తుభము అమృతము పుట్టినవి. అమృతలబ్ధికోసం దేవ దానవులు యుద్ధం చేశారు. అప్పుడు విష్ణుమూర్తి మోహినీ రూపంలో అవతరించి, అమృతం చేజిక్కించుకున్నాడు. దేవతలు రాక్షసులను జయించినారు. ఇంద్రుడు అమృతమును పొంది లోకపాలకుడై నాడు.

దితి తన పుత్రులు చాలమంది చనిపోవుటకు విచారించింది. తన కుమారుల చావునకు కారకులైన ఆదిత్యులను తుద ముట్టించ గల కుమారుడు నాకు కలుగునట్లు వరమను గ్రహింపుమని భర్త యైన కశ్యపమునిని ప్రార్థించెను. కశ్యపుడు దూరము ఆలోచించి, "సరి అట్లే యగుగాక యని వరమిచ్చి, ఈ వరము నీకు వేయి సంవత్సరములకు గాని ఫలింపదని, అందుకొరకు తపస్సు చేయ మని ప్రార్థించెను.

కశ్యపుని వరప్రసాదం వల్ల వేయిసంవత్సరములకు ఇంద్రుని వధించగల సామర్థ్యం వుండే కుమారుడు దితి గర్భంలో పడినాడు. దితి తపః కాలంలోను, గర్భధారణ కాలంలోను, సవతి కుమారు డైన ఇంద్రుడు కావలసిన సపర్యలు చేసినాడు. తరువాత ఒకరోజు ఇంద్రుడు దితి నిద్రిస్తూ వుండగా తన వజ్రాయుధంచే దితి గర్భస్థ పిండాన్ని ఏడు ఖండాలుగా నరికివేసాడు. పిండం ఏడు ముక్క లైంది. చనిపోబోయ్యే శిశువు రోదనం దితి విన్నది. ఇంద్రుడు యేడ్చు శిశువును 'మారుద మారుద' అనగా ఏడవకు యేడువకుము అని యోదార్చినాడు.

ఈ సంగతి తెలిసి దితి, ఇంద్రునితో కుమారుని వధించవల దన్నది. వజ్రాయుధపు తాకిడికి దితి గర్భము విచ్ఛిన్నమైనది. అప్పుడు దితి ఇంద్రుని ప్రార్థించి ఆ ఏడు ఖండములు ఒక్కొక్క ముక్కను ఏడు ఖండములుగా చేసి, ఏడుముక్కలు సప్తమ రుద్గణ ములు లోకపాలకులుగా నుండునట్లు చేయుము.

'నాయనా! ఇట్లు చేయుట నాకెంతయు ప్రీతికరము బ్రహ్మేంద్ర లోకములలో ఒక్కొక్కగణము, ఆకాశంలో ఒకటి, తక్కిన గణములు నాలుగు, చతుర్దిశలందు సంచరించునట్లును గూర్చుము. వారే మారలోములు.

ఇంద్రుడట్లు చేసి, తల్లీ! నీ కుమారులు దేవత్వమును పొందు దురు - అని చెప్పెను. పిమ్మట వారిరువురూ ఆ స్థానమును వదలి వెళ్ళినారు.

రామా! ఇప్పుడు మనమున్నది. దితి తపము చేసుకొని, కుమారుల గన్న ప్రాంతము దీనిని 'కుశప్లవనము' అందురు. కుశ ప్లవనకు నేటి కాలము విశాలాపురి యనబడుచున్నది. ఈ విశాల పురిని ఇక్ష్వాకు ప్రభుని కుమారుడైన 'విశాలుడు' నిర్మించినాడు. విశాలుని వంశస్థుడు సుమతి. ఇప్పటి ప్రభుడు.

ఈ రాత్రి మన మిచటనే యుండి, రేపటికి జనకమహారాజు పట్టణమును చూడవచ్చును.

సుమతి మహారాజుకు విశ్వామిత్రుడు వచ్చిన సంగతి తెలిసి నది. వెంటనే రాజు విశ్వామిత్రునికి, అతని శిష్యులకు స్వాగతం చెప్పి ఉచిత మర్యాదలు చేసినాడు. పిమ్మట రామలక్ష్మణులను గాంచి "ముద్దులుగారు ఈ పసి బాలకులెవరు? మీరలిచ్చట నుండి ఎచటి కెళ్ళుదురు? అని ప్రశ్నించెను.

అంతట విశ్వామిత్రుడు తమ వివరము లన్నియు చెప్పి రాత్రి యట సుఖనిద్రలో మునిగి, తెల్లవారిన పిమ్మట మిథిలానగర దిశకు ప్రయాణమైరి.

## గౌతమాశ్రమము

అహల్య—

విశ్వామిత్రుడు శిష్యులతో కలిసి, మిథిలానగర మార్గం పట్టి ప్రయాణం చేస్తున్నారు. కొంతదూరం ప్రయాణం చేశాక, ఆ అరణ్యా మార్గంలో ఒక ప్రదేశం కనిపించింది, అది యేదేని ఒక ఆశ్రమ ప్రాంతమై యుండునేమో నన్న శంక కలిగింది రామునికి. అతి ప్రాచీనమైనది. జనసంచారం లేనిది. సుందరమైన ఫలపుష్పాదులతో శోభిల్లుతున్నటువంటిది అయిన ఆ ప్రాంత సమీపానికి వారు వచ్చారు. రాముడు ఆగి, స్వామి ఆ ఆశ్రమం ఎవరిది? చాలా పురాతనమైనదిగా కనిపిస్తున్నది...?

రాముని ప్రశ్నకు విశ్వామిత్రుడు వెంటనే ఇట్లా సమాధానం చెప్పాడు. "రామచంద్రా! ఈ ఆశ్రమం గురించి అంతా చెబుతాను వినవలసింది: ఇది పూర్వం తపస్సిద్ధుడై మహామహిమాన్వితుడు ఐన గౌతమమహర్షి ఆశ్రమం. ఇది యొక పుణ్యక్షేత్రంగా ఆ రోజుల్లో గుర్తించబడింది. అటువంటి పుణ్యక్షేత్రంలో మనం కొంతకాలం విశ్రాంతి తీసుకొని వెళదాము! అంటూ గురువుగారు ఆశ్రమంలోనికి అడుగిడుతూండగా రామలక్ష్మణులు కూడ అనుసరించారు. ఆశ్రమంలోనికి ప్రవేశించుతూండగానే, అతనికి దారిలో ఒక నల్లని రాయి కనిపించింది రాముడు ఆ నల్లని రాతిపై కాలిడి నడచి వెళ్ళాడు. రాముడట్లా ముందునకు ఒక అడుగు వేశాడో లేదో! మరు క్షణంలోనే ఆ రాయి ఒక స్త్రీగా మారినది.

రాముడు ఆ దృశ్యం చూచి ఆశ్చర్యపోయినాడు. ఆ స్త్రీ అతనికి నమస్కరించింది. చిరకాలం భర్తృశాపవశాన శిలయై పడి యున్న తనకు తన పాదస్పర్శచే శాపవిమోచనం కలిగించిన శ్రీరామచంద్రునకు సకల కళ్యాణ పరంపర జరగాలని ఆశీర్వదించింది— ఆ స్త్రీమూర్తి 'అహల్య' యని గుర్తించాడు రాముడు.

అప్పుడు విశ్వామిత్రునివైపు తిరిగి "గురువర్యా! ఈమె ఎవరు? ఈ పరిస్థితికి వచ్చిన కారణమేమి? వివరించండి" అని అన్నాడు.

విశ్వామిత్రుడు ఇట్లా చెప్పదొడిగాడు.

"బ్రహ్మ మానసపుత్రిక అహల్య. ఇంద్రుడు ఆమెను దేవ లోకంలో ఉండగానే మోహించాడు. అయితే కామమే ప్రవృత్తి గాగల ఇంద్రునకు బ్రహ్మ తన కుమార్తె నిచ్చి వివాహం చేయ నన్నాడు. ఆ తరువాత గౌతమమహర్షి కిచ్చి వివాహం చేశాడు.

ఆ విధంగా అహల్య గౌతములు దంపతులై ఆశ్రమ పద్ధతుల ప్రకారం జీవించసాగారు. దైవమానుషముల కలయికగా వారి దాంపత్యం హాయిగా సాగిపోతుంది. అయితే ఇంద్రునకు అహల్యపై మోహం పోలేదు. అందుకని ఒకనాడు గౌతమ మహర్షి ఆశ్రమం వద్ద లేని సమయంలో, ఇంద్రుడు రాత్రివేళ గౌతముని రూపుదాల్చి అహల్య దగ్గఱకు వచ్చాడు. తన భర్తే అనుకొని అతనికి ఉపచా రాలు చేసింది. వారిద్దఱూ ఆనంద క్రీడా పద్ధతులు సలుపు సమయంలో గౌతముడు వచ్చాడు. విధి వక్రతను ఎవరూ సరిచేయలేరు కదా! పరి స్థితిని అర్థము చేసుకొన్నాడు. ఇంద్రుని ఒడలంతా కన్నులు కల వానిగా ఉండు'మని శపించాడు. అప్పటినుండి అతడు సహస్రా క్షుడు అనిపించుకున్నాడు. అహల్యను రాయిగా మారిపొమ్మని శపిం చాడు. అహల్య ఇంద్రుల దోషములలో అహల్య దోషం తెలియక చేసినది కనుక కొంత ఉపశమించి, "ఏనాడైతే శ్రీరామ చంద్రుడు ఈ యాశ్రమమునకు వస్తాడో! ఆ సమయంలో ఆయన పాదం రాయియైన నీపైన మోపిన యంతనే, నీకు శిలారూపం పోయి, మానవ స్త్రీగా ఆవిర్భవించగలవు. ఇది నిజం"- అని శాపావసానం అనుగ్రహించి హిమవత్పర్వత శిఖరాలపైకి తపస్సు చేసుకొనే నిమిత్తం వెళ్ళిపోయాడు గౌతముడు. "రామా! ఆనాటి నుండి ఈ యహల్య ఇక్కడే రాయియై పడియున్నది. ఈనాడు నీ పాదం సోకి పవిత్రురాలై శాపం తొలగి నిజరూపం ధరించింది." అని విశ్వా

మిత్రుడు అహల్య శాప వృత్తాంతాన్ని వివరించి చెప్పాడు. అంత లోనే గౌతమ మహర్షి తన దివ్య దృష్టిచే తన ఆశ్రమంలో జరిగిన వృత్తాంతాన్ని గమనించి వారిమధ్యకు వచ్చి, రాముని కొనియాడి, యహల్యను స్వీకరించాడు.

మిథిలానగర ప్రయాణము

రామలక్ష్మణులతో విశ్వామిత్రుల వారు మిథిలకు ప్రయాణమై నారు. మార్గ మధ్యంలో వాపే, కూప, తటాకాదు లెన్నిటినో కనుల పండువగాచూస్తూ, వివిధములైన లతాతరు, గుల్మముల పంచన చల్లని పిల్ల వాయువులు మృదు స్పర్శలను కలుగజేయగా అచ్చటచ్చట కొంత తడవు విశ్రాంతి తీసుకుంటూ సంధ్యాకాలమునకు మిథిలా నగరాన్ని చేరుకున్నారు. వారు తమ రాకను నగరపాలకుల ద్వారా జనక మహారాజునకు విశ్వామిత్రుల వారు తెలియజేశారు.

జనక మహారాజు తను చేయచున్న జన్నమును తిలకించ డానికి వచ్చిన విశ్వామిత్ర మహర్షికి, రామలక్ష్మణులకు తమ పురో హితుడూ, గౌతమ మహర్షి పుత్రుడూ అయిన శతానందుల వారితో కూడ ఎదురుగా పోయి స్వాగతం పలికి, ముని చంద్రునకు అర్ఘ్య పాద్యాదులు సమర్పించి సత్కరించాడు. చెంతనే ఉన్న రామ లక్ష్మణులను చూచి, జనకుడు తనలో "ఆహా! ఈ బాలకులు దేవ లోకము నుండి వచ్చినవారా! ఎంత సుందరమైన రూపమును కలిగి యున్నారు. నీలమేఘచ్ఛాయతో ఒక కుమారుడు పసిడి కాంతులతో తళతళ మెరయుచు నిగారింపులతో పాలుగారు మోముగల చిన్నారి యొకడు భళా! వీరలను కన్న తల్లిదండ్రులెంత యదృష్టవంతులో కదా!" జనకుడు తేరుకుని విశ్వామిత్ర మహర్షితో "స్వామీ యీ బాలకులు ఎవరు? వీరి తల్లిదండ్రులెవరు? వీరు యే దేశపు రాజ పుత్రులు వీరి నామధేయములేమి? వీరు మీ వెంట నుండుటకు కారణ మేమి? వివరింతురేని సంతసింతును" అని ప్రశ్నించాడు. అంత విశ్వా మిత్రుడు, జనకునితో "రాజా! వీరు కోసల దేశమందుగల అయోధ్య

నగరాన్ని పరిపాలిస్తున్న దశరథ మహారాజు కుమారులు రాముడు-లక్ష్మణుడు. ఇంతకు ముందు నేను చేసిన యజ్ఞాన్ని నిర్విఘ్న సమాప్తి కొరకు, దశరథ మహారాజు వద్దకు వెళ్ళి వీరినర్థించాను. ఆ కారణంగా దశరథ సోదరులను నా వెంట పంపగా, నా యాగము నిర్విఘ్నపరచి, పరిసమాప్తి నొందుటకు ఎంతయో సహకరించిరి. సకల నిగమాగమ శాస్త్ర శస్త్రాస్త్ర నిపుణులైన యీ రామ లక్ష్మణులను ప్రత్యేకముగా విశిష్టములైన మహాస్త్ర విద్యలను నేను ఈ సందర్భముగా ప్రత్యేకంగా నేర్పియున్నాను.

యజ్ఞ సమాప్తి అనంతరం మీ యజ్ఞ నిర్వాహణ విషయం విన్నాము. ఇక్కడికి శిష్యసమేతంగా" వచ్చాము. అని బదులు పలికాడు.

విమ్మట మహాతపోనిధి, తేజస్వి యగు శతానందుడు, రామునివైపు తేరిచూచాడు. రాముని ప్రక్కనే అదే రూప సౌందర్యముతో భాసిల్లుతూ కూర్చుండి యుండిన లక్ష్మణుని కూడ చూచాడు. ఆ తపోనిధి యాశ్చర్యానికి అంతులేదు.

అతడు విశ్వామిత్రునితో "మహర్షీ! ఈ మహానుభావులు మా తండ్రీ యాశ్రమము మీదుగా వచ్చిరికదా! రామచంద్రుని మా తల్లి యగు యహల్య గాంచి పూజించి తరించినదా! అయ్యా! విధివిశాత్తు ఆమెకు కలిగిన శాప విపత్తుతొలగి, నా తండ్రియైన గౌతమునితో కూడి సుఖముగానున్నదా!" అని పరిపరి విధముల ప్రశ్నించెను.

ఆత్రుతతో కూడిన శతానందుని ప్రశ్నల పరంపరను విశ్వామిత్రుడు ఎంతయో ఓపికగావిని, యాతనితో యీ విధంగా అన్నాడు.

"ముని కుమారా! ఆందోళనము చెందకుము రామానుగ్రహముచే నీ తల్లి అహల్య, తన పతిదేవుడైన గౌతమునితో సుఖముగా నున్నది. ఆ దంపతులు ఇరువురు రామచంద్రుని ఎంతయో గౌరవించినారు. ఫలాదులచే తృప్తులను గావించినారు. శ్రీరామ

లక్ష్మణులు ఆ పుణ్యదంపతులిద్దరినీ ఎంతో భక్తి, గౌరవ, ప్రపత్తులతో పూజించినారు.”

విశ్వామిత్రుని మాటలు విని శతానందుడు మిక్కిలి తృప్తిని, ఆనందమును పొందినాడు. అతడు రామ లక్ష్మణుల వైపు చూచి, రాకుమారులారా! లోకోత్తర పురుషుడైన ఈ విశ్వామిత్ర మహర్షిననుసరించి, మీరు సర్వథా కృతకృత్యులైనారు. ఈతడు మహాత్ముడు-రాజపదం నుండి రాజర్షి పదానికి, రాజర్షి పదంనుండి ఋషి పదానికి, ఋషిపదం నుండి బ్రహ్మర్షిపదానికి ఎదిగిన పుణ్యమూర్తి-మహాతపోనిధి-అత్యద్భుత ప్రతిభాశాలి.

తొలుత వశిష్ఠ మహర్షి చేత, తిరస్కరింపబడినవాడై, ఇహలోక సంబంధములైన కేవలబలపరాక్రమములచే లబ్ధమైన శక్తి కంటే, తపస్సు చేత సాధించుకున్న బలమే అనేక రెట్లు గొప్పది. వశిష్ఠ మహర్షికి తన వంటి మహాబల సంపన్నుణ్ని ఓడించగల శక్తివచ్చినదంటే, ఆతని తపస్సువల్లనే “క్షాత్రబలం కంటే బ్రహ్మబలమే గొప్పది. ముమ్మాటికీ బ్రహ్మబలమే గొప్పది.” యని అనుభవంలో తెలుసుకొని, అనేక వేల సంవత్సరాలు కఠోరమైన తపస్సుచే బ్రహ్మయొక్క అనుగ్రహం పొంది అతని వలన బ్రహ్మబలసంపన్నుడైనాడు. ఆ సదృశము, అసాధారణమునైన విశ్వామిత్రుని తపోనిష్ఠకు అచ్చెరువొంది. “బ్రహ్మశక్తి నందిన కారణంచేత విశ్వామిత్ర మహర్షీ! నీవు నిశ్చయంగా బ్రహ్మర్షివే-బ్రహ్మర్షివే బ్రహ్మర్షివే” యని మూడు సారులనిపించుకొన్న ప్రజ్ఞాశాలి యీతడు!

## త్రిశంకు మహారాజు చరిత్రము

ఆ సమయంలోనే అయోధ్యా పట్టణాన్ని ‘త్రిశంకువు’ అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతడు శరీరంతోనే స్వర్గాన్ని చేరుకోవాలనే కోరికతో ఒక గొప్ప తపస్సు చేయ సంకల్పించాడు. ఆ సంకల్పంతో బ్రహ్మణ్యమూర్తియైన వశిష్ఠమహర్షి దగ్గరికి వెళ్ళి, విషయం

చెప్పి అర్థించాడు. అందులకు వశిష్ఠుడు నీ కోరిక సమంజసమైనది కాదు. అనుచితమైన నీ కోరిక కోసం మహా ఫలదాయకమైన యాగాన్ని నేను జరిపించలేను వెళ్ళు" అని పంపించాడు. అంత త్రిశంకుడు తన కోరిక నెరవేర్చుకోవలెనని వశిష్ఠ పుత్రులున్న చోటికి పోయి, విషయము విన్నవించి, యాగమునకు తోడ్పడుడని వేడెను.

తండ్రియైన వశిష్ఠునిచే తిరస్కరింపబడి తమ కడకు వచ్చిన త్రిశంకుని యీసడించుకొని, వశిష్ఠ పుత్రులు సూర్వురును ముక్తకంఠముతో తిరస్కరించి పంపిరి. త్రిశంకుడు వారి తిరస్కారమును పురస్కరించుకొని, మీరు చేయని పనిని వేరొకరిని అర్థించి నా కోర్కెను నెరవేర్చుకొందునని పలికి వెళ్ళబోతుండగా వశిష్ఠ పుత్రులు కోపించి, కుల గురువు, గురు పుత్రులమైన మమ్ము కాదని, వేరొకని నాశ్రయించి, పని పూర్తి చేసుకొనదలంచుట గురుద్రోహము. కావున ఈ యవిధేయతకు నీవు చండాల రూపము వహించెదవు గాక!"యని శపించిరి.

గురుపుత్ర శాపముచే భ్రష్ట శరీరుడై ఛండాల రూపము ధరించెను. నల్లని రంగు—నల్లని వస్త్రము—కర్కశ శరీరము—చెరిగిపోయిన తల వెంట్రుకలు—ఒడలినిండా భస్మరాశి పులుముకుని ఇనుప ఆభరణములు ధరించి చూడరాని రూపముతో త్రిశంకుడు దిక్కులేక తిరుగాడుచు ఒకరోజు మహా తపోసాధనుడైన విశ్వామిత్రుని కడ కరిగి తన దీనగాథను వినిపించెను. విశ్వామిత్రుడాతని కభయమిచ్చి, త్రిశంకుడు సశరీరంగానే స్వర్గానికి పోవడానికి అవసరమైన యాగ నిర్వహణకు అన్నివిధాల సహకరిస్తానని చెప్పాడు. యాగం ఆరంభమైంది. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఋత్విన్మహరేణ్యులచే యాగం ఆయా మంత్రాహుతులచే దేవత లాహ్వానింపబడినారు. కాని అట్టి యాగఫలాన్ని గ్రహించడానికి దేవతలు రాలేదు. అందులకు విశ్వామిత్రుడు కోపగించి, ఇది అంతా దేవేంద్రుని కుట్రయని భావించి తన తపోశక్తిని ధారపోసి త్రిశంకుని శరీరంతోనే స్వర్గానికి వెళ్ళవలసిందిగా ఆదేశించాడు. కాని త్రిశంకుని ఇంద్రుడు స్వర్గంలో అడుగిడనీయలేదు; కాగా తలక్రిందులుగా క్రిందికి వెళ్ళమని ఆదేశించాడు. త్రిశంకుడట్లు తలక్రిందులుగా భూమిమీదకు పడుతూ 'విశ్వామిత్రా! రక్షింపుము! రక్షింపుము!'అని వేడుకొన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు గ్రహ చంద్రతారాపూర్ణమైన మరొక జ్యోతిర్మండలాన్ని సృష్టించి,

మరొక దేవేంద్రుని కూడా సృష్టింప సంకల్పించి ఆస్థానములో త్రిశంకుని చండాల రూపముతోనే నివసింపుమని కట్టడి చేశాడు. అదియే త్రిశంకు స్వర్గమని పిలువబడుచున్నది.

రామా! విశ్వామిత్ర మహర్షి యెంతటి శక్తిశాలి- అనాథ ముని బాలకుడైన శునశ్శేపునకు అంబరీషుని యజ్ఞపశువుగా బలి కానీయ కుండా చిరంజీవిత్వమును ప్రసాదించిన మహా మహిమాన్వితుడు. ఇట్టి సద్గురు శుశ్రూషలో మీరు సకలాస్త్ర శస్త్ర వేదులగుట యెంతయో ముదావహము అని ప్రశంసించి, శతానందుడు వారలను వీడ్కొని వెళ్ళెను. జనకుడును మహర్షికి పరిపరి విధముల వందన మాచరించి, "రేపు యజ్ఞశాల కడ పునః మిమ్ములను రామలక్ష్మణులతో కూడ తిలుసుకొను భాగ్యము కలుగ జేతురు గాక! యని" వేడుకొని, అచటి నుండి వెడలెను.

సాయంకాలమైనది. గురుశిష్యులు తమ తమ నివాస స్థానము లకు వెళ్ళి విశ్రాంతి గొనిరి.

## శివ ధనుర్భంగము

మరునాడు ప్రాతః కాలముననే విశ్వామిత్రుడు రామలక్ష్మణులను మేల్కొల్పెను. ముగ్గురూ కాలకృత్యములను నిర్వర్తించుకొని, జనక మహారాజు యాగశాల కేతెంచిరి.

ఆ ప్రదేశమంతయు భువన మోహనముగా అలంకరింపబడినది. శిలాప్రాంగణమంతయు గోమయముచే అలికి, ముగ్గులో తీర్చబడినది. హోమ వేదాలు, ఋత్విగ్వర్యుల స్వాహాకృతులచే, జాజ్వల్య మానముగ ప్రజ్వలించుచున్నవి. యాగశాల చుట్టును వివిధ దేశాలలోని రాజలోకము, మునివర్యులు, బ్రాహ్మణోత్తములచే కిటకిట లాడు చుండెను. జనకమహారాజు విమానశాలలోనికి ప్రవేశించిన విశ్వామిత్రుని రామలక్ష్మణులను సాదరంగా స్వాగతం పలికి, వారిని యథాస్థానములలో కూర్చుండజేసెను. అంత జనకుడు విశ్వా మిత్రునితో "మహర్షీ! నేను మీకై యింకను చేయవలసిన విధివిధాన మేదో సెలవిండు" అని సవినయంగా ప్రశ్నించెను. అంత విశ్వా మిత్రుడు రాజా! మా రాముడు తమవద్ద ఈ సభాప్రాంగణంలో

ప్రత్యేక వేదికపై అమర్చబడియున్న 'శివధనుస్సు'ను చూడగోరు చున్నాడు. అట్టి యవకాశమును కలుగుజేయుడు" అనెను. అట్లే యని జనకుడు విన్నవించి వెడలి శివధనుస్సు ఉంచిన వేదికవద్దకు వచ్చి ఇట్లు ఉచ్చైస్స్వరముతో ప్రకటించెను.

"రాజవరులారా! పూర్వం నేను యజ్ఞం చేయుటకై భూమిని సిద్ధము చేయించుచుండగా, నాగేటిచాలున ఒక పాప దొరికింది. ఆ పాపను తీసుకొని వచ్చి అల్లారుముద్దుగా పెంచుకొన్నాను. అయోని జమైన ఆ పాప రూపసౌందర్యాన్ని చూచి, నాగేటిచాలులో జన్మించిన దగుటచే ఆమెకు "సీత" యని నామకరణం చేయడం జరిగింది. ఆనాటినుండి ఆమె నాకు గారాబుపట్టి యైంది. ఇప్పుడు మా సీతకు వివాహసమయము వచ్చినది కాబట్టి తగిన వరుని అన్వేషించి, వివాహము జరిపించవలసి యున్నది. అందుకోసం మా పురోహితుడైన; శతానందులవారి సలహాప్రకారం, మా పూర్వీకుల నాటినుండి మా యింట భద్రపరచబడియున్న శివధనుస్సును ఎక్కు పెట్టిన వీరునికి కుమార్తె నిత్తునని ప్రకటించియున్నాను. ఆ సమయ మిప్పుడాసన్నమైంది. ఇప్పుడిచ్చట యీ వేదికపై అమర్చబడియున్న ధనుస్సే శివధనుస్సు అని జనకుడు చూపెను. సభలో సభాసీనులై యున్న సభాసదులందరూ ఆశ్చర్యంగా ఆ అపురూపమైన ధనుస్సు వైపునకు చూపులు సారించారు. ధనుస్సుకొలది కాలమునకు ముందే అమితబలశాలురు, పుణ్యాత్ములైన ఏడువేలమందిచే ఈ ప్రదేశము నకు తీసుకొని రావడం వారిలో చాలామంది చూశారు. ఆ ధనుస్సు గంధమాల్యాదులచే అలంకరించబడియుంది. కొందరు రాకుమారులు తమ తమ స్థానములనుండి లేచివచ్చి, ఆ శివధనుస్సును చూచి మోకరిల్లి మరల వారివారి స్థానములకు వెళ్ళి కూర్చున్నారు. కొందరు రాజన్యులు ఆ శివధనుస్సును కదల్ప ప్రయత్నించి వశముగాక వెళ్ళి కూర్చున్నారు. జనకమహారాజు ఆ దృశ్యాన్నంతా స్తిమిత లోచనా లతో చూస్తూవుండి పోయాడు. అతడు ఈ శివధనుస్సును ఈ వచ్చిన రాకుమారులలో ఎవరూ ఎక్కుపెట్టలేరని గ్రహించాడు. ఆ సమయంలో శ్రీరామచంద్రుడు లేచినిలుచొని, గురుదేవుల పాదాలకు నమస్కరించి చేతులు ముడుచుకొని, ఆజ్ఞకై ఎదురుచూస్తున్నాడు. అంత విశ్వామిత్రుడు రామునికి అనుజ్ఞనిస్తున్నట్లుగా ఆమోద దృష్టులు పరచి, జనకునివైపు సాభిప్రాయంగా చూచాడు. జనకుడు

కూడా సంతోషహృదయంతో శ్రీరామచంద్రునకు స్వాగతం పలికాడు.

బాలుడై ప్రతిభావిశాలుడైన శ్రీరామచంద్రుని పూనికను చూచి జనకమహారాజు మనస్సులో ఆశ చిగురించినట్లనిపించింది.

గురువర్యులైన విశ్వామిత్రుడు, జనక మహారాజు యొక్క అనుమతిని పొంది, శ్రీరామచంద్రుడు అతిబలీయము, పురాతనము, కదల్చుటకు గానీ, కదల్చి ఎత్తుటకు గానీ, ఎత్తి వింటినారిని సంధించుటకు గానీ,సంధించి నారిపైబాణమును దట్టించి,దానినారి నాకర్ణాంతము లాగుటకుగానీ, లాగి బాణమును వదులుటగానీ త్రిదశలకుగానీ, ఏ యితర బలిష్ఠులకుగానీ సాధ్యముకానట్టి యాధనువును ఎత్తుటకు రాముడుద్యుక్తుడైనాడు.

సభకు పరివేష్ఠించియున్న వేలకొలది రాజలోకము ఆశ్చర్యముతో చూస్తూ ఉండగా రాముడు ఆ ధనుస్సును అవలీలగా ఎత్తి నారిని సంధించి, ఆకర్ణాంతము లాగాడు. ఆ విల్లు సభా భీకరమైన ప్రళయ ధ్వనితో విరిగి రెండు ముక్కలైంది.

సభ అంతా నివ్వెరపోయింది. స్పృహతప్పినట్లు నిశ్చేష్టమై ఉంది. కొందరు అత్యద్భుతానంద పారవశ్యంలో గంతులు వేశారు. దివినుండి దేవతలు పూల వర్షం కురిపించారు. వీర్యశుల్కయని ప్రకటింపబడిన సీత జనక మహారాజు తోడురాగ చేత పూలమాల ధరించి, రాముని చెంతకు వచ్చి చిరునగవులు చిందులాడగా అతని మెడలో ఆ హారాన్ని అలంకరింప జేసింది. ఆకాశాన దుంధుభులు మ్రోగినవి. అప్సరసలు ఆడారు, పాడారు. ఋషిగణం, దేవగణం మనసారా సీతారాములను దీవించారు. శ్రీరామచంద్రుడు చెరగని చిరునగుమోముతో సభా మధ్యలో నిలుచున్నాడు. జనక చక్రవర్తి అంతులేని ఆనందంతో శ్రీరాముణ్ణి పరిపరి విధాల కొనియాడాడు. తన ప్రతిజ్ఞ ఫలస్వరూపమై యెట్టయెదుట సాక్షాత్కరించినందులకు మంత్రసిద్ధిని పొందిన జాపకుని వలె అమితానందం పొందాడు. సీతారాములు ఒకరినొకరు ఓరగా చూచుకొన్నారు. సీత సిగ్గుతో తలను వంచుకొన్నది. శ్రీరాముడు గంభీర వదనంతో, వెనుదిరిగి విశ్వామిత్రునివద్దకు వెళ్ళి నమస్కరించి, తన ఆసనంపై కూర్చున్నాడు. జనకుడు విశ్వామిత్రుని వద్దకు వచ్చి సవినయంగా "అయ్యా! సీతారాముల కళ్యాణం యథా శాస్త్రీయంగా

పెద్దలు, సమక్షంలో జరిపించుటకు తమ ఆజ్ఞను కోరుతున్నాను. ఆ యగుచో ఇప్పుడే దశరథ మహారాజు కడకు వారిని సబంధుమిత్ర ప వారంగా కళ్యాణమునకు తరలివచ్చుటకు దూతలచే యాహ్వానములను పంపెదను. వారివెంట మా ముఖ్య అమాత్యుడు సుధామీనుడు కూడా వెళ్ళెదరు." అని విశ్వామిత్రుని యాజ్ఞకై వేచియుండెను.

విశ్వామిత్రుడు జనకుని మాటలకు ఎంతో ఆనందించి "శుభమస్తు" అని పలికి "జనకరాజా! మీరును, అయోధ్యాదశరథుడు" వియ్యాలవారై పరస్పరము బంధువులగుట ఎంతయు సంతోష దాయకము. మీరు అవశ్యముగా మహాప్రజ్ఞాశాలియైన వశిష్ట మహర్షికిని, దశరథ మహారాజునకును వర్తమానం పంపుడు. ఇంకొక విషయం కూడా మీతో చెప్పదలచినాను. వినుడు మీ కుమార్తెయైన ఊర్మిళను, మా తమ్ముడైన సాంకాశ్యపురాధినేత కుశధ్వజుని కుమార్తెలుమండవి, శ్రుతకీర్తులను కూడా దశరథుని కుమారులగు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు యిచ్చి సీతా, రాములతోపాటు ఒకేసారి కళ్యాణ క్రతువు నొనర్చింపుము. దశరథసుతులైన ఆ నలుగురికి, సోదరులైన మీ ఇద్దరి కూతుండ్రను యిచ్చి వివాహము జరిపించుట ఎంతయు యుక్తముగా ఉంటుంది." అని అన్నాడు.

విశ్వామిత్రుని, సూచనను జనక చక్రవర్తి వెంటనే పరమానంద భరితుడై "తన ఆమోదాన్ని తెలిపాడు." మీ మాటప్రకారం మా నలుగురు కుమార్తెలను దశరథ మహారాజు నలుగురు పుత్రులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులకు ఇచ్చి వివాహం చేయిస్తాను. నేడే మా తమ్ముని రావించెదను. విషయాన్ని తెలియపరిచి, నలుగురికి, వివాహక్రతువు జరిపించుటకు అయోధ్యాపతియైన దశరథ మహారాజునకు మా దూతలు మంత్రి పుంగవుల ద్వారా వర్తమానం పంపి, వారిని వివాహములకు ఆహ్వానించెదను. అందుకు తమ ఆజ్ఞవేడెదను" అని జనకుడు విశ్వామిత్రునికి అంజలి ఘటించి నిలిచాడు విశ్వామిత్రుడును అందుకు తన ఆమోదమును తెలిపి జనకుని వద్ద సెలవు తీసుకొని, రామ, లక్ష్మణులతో తన విడిదికి చేరుకొనెను.

జనక మహారాజు తమమంత్రి ముఖ్యుడను సుదామునుని,తగుపరివారముతో ఇంతకుముందుగా నిశ్చయించుకున్న ప్రకారం "తమ నలుగురి కుమార్తెలను దశరథుని నలుగురు పుత్రులకు ఇచ్చి వివాహము చేయ సంకల్పించినట్లు" శుభలేఖలను యిచ్చి, దశరథుని

బంధుమిత్ర సపరివారముగా వివాహమునకు తరలి రావలసినదని యాహ్వానము పంపెను.

సుధామనుడు, పరివార యుక్తంగా నాలుగురోజులు సుదీర్ఘ ప్రయాణంచేసి, అయోధ్యకు వెళ్ళి దశరథ మహారాజును సందర్శించాడు. దశరధుడు వచ్చిన యతిథులను ఉచితరీతిన సత్కరించి, వారిని ఉచితాసనములపై కూర్చుండ నియోగించి కుశల ప్రశ్నలడిగెను. జనక దూత దశరధునకు తన పరిచయముగావించుకొని, తక్కిన వారిని పరిచయము చేసి, తాము జనక భూపతి సందేశవార్తను గొని, మీకు విన్నవింపవచ్చినామని తెలిపి, అయోధ్యాపతికి తాము తెచ్చిన శుభమును అందించినట్లు వివరించెను. రాజా! మీకు మంగళ మగుగాక. మీ కుమారులైన రామలక్ష్మణులు విశ్వామిత్ర మహర్షి వద్ద, మా రాజ్యమగు మిథిలా నగరంలో జనక చక్రవర్తి ఆదరణ ఆతిధ్యములో సంతుష్టులై క్షేమముగా వున్నారు. జనక చక్రవర్తి వీర్యశుల్కమైన తన కుమార్తె సీతను రామునకిచ్చి వివాహముచేసి తమ కోడలుగా చేయుటకై వేయికన్నులతో తమరాకకై ఎదురు చూచుచున్నాడు. మీ రాముడు, మా వీధిలలో రాజరక్షణలో చిరకాలం నిక్షేపించి యుంచబడిన "శివధనుస్సును" విరిచినాడు. జనక మహారాజు "శివధనుస్సును" ఎక్కిడినవారికే అయోనిజమైన తన కూతురునిచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు జనకుడు ప్రకటించినవివాహ మంగళ రూపమైన జనకమును తిలకించడానికి, జానకిని పరిణయమాడ గలుగు భాగ్యవంతుడెవ్వడో చూతుముగాకయని ఎక్కడెక్కడి నుండియో రాజులు వచ్చారు. కాని వారందరూ లోగడ ప్రయత్నించి తమ యశక్తతను బాహాటంగా చాటుకున్నవారే. దశరథ మహారాజా! తుదకు మీ కుమారుడు మాత్రం అవలీలగా ఆ శివధనుస్సును ఎత్తి వంచి నారిని సంధించు ప్రయత్నములోనే ధనుస్సు పెళ్ళున భువన భయంకరమైన మ్రోతతో విరిగి రెండు ముక్కలైనది. మా సీత మందహాసముతో రాముని మెడలో వరమాల వేసినది. ఇక వారికి శాస్త్రోక్తముగ కళ్యాణము జరిపించుటకై, మీకు శుభలేఖలను పంపిరి మేము వాటిని తెచ్చాము. మరొక విషయం మహారాజా! జనకుని కూతురైన ఊర్మిళను మీ లక్ష్మణునికి, జనకుని తమ్ముడును, ప్రస్తుతం సాంకస్య పురానికి అధిపతిగా యున్న కుశధ్వజుని కుమార్తెలు మాండవి, శ్రుతకీర్తులను భరత శత్రుఘ్నులకు ఇచ్చి, మీ నలుగురు

కుమారులకు ఒకేరోజున వివాహం చేయాలని తలంచినారు. మీరందులకు అంగీకారము తెల్పి సత్వరమే విచ్చేయుటకు ప్రార్థింపుడని మా ప్రభువులు మమ్ములను పంపినారు.'' అని చెప్పిరి.

దశరథుడు జనక దూతల ద్వారా తన కుమారుడు రామ లక్ష్మణులు విశ్వామిత్రులవారి శుశ్రూషలో మంగళ మూర్తులై క్షేమముగా నున్నారన్న విషయం విని మిక్కిలి సంతోషపడినాడు. వారికి భూరి పారితోషికములిచ్చి, ముఖ్యామాత్యుని సత్కరించి రేపే సపరివారముగా తరలివత్తుమని జనక మహారాజునకు ప్రతి వర్తమాన మంపెను.

దూతలు తిరిగి వెళ్ళిన మరుక్షణమే వశిష్ఠుడు, వామ దేవుడు, వారిలో తన ముఖ్యమంత్రి వర్యులను సమావేశ పరిచి ఇట్లా అన్నాడు మహాత్ములారా! విశ్వామిత్ర మహర్షి పర్యవేక్షణలో, రామలక్ష్మణులు మిథిలా నగరమున జనక మహారాజునకు అతిథులై సుఖముగా నున్నవారు. జనకుడు వీర్యశుల్కమైన తన కూతురు సీతను, మరియు, ఊర్మిళను రామలక్ష్మణులకు, తమ్ముని కూతుండైన మాండవి, శ్రుత కీర్తులను భరతశత్రుఘ్నులకు యిచ్చి వివాహమొనరింప నిశ్చయించి నాడు. తమరు అనుగ్రహించి, యామోదించుచు మనము భరత శత్రుఘ్నులను వెంటనిడుకొని సపరివారముగా రేపే ప్రయాణమై పోవుదము. తమ ఆజ్ఞకై వేచియుండెను.''

దశరధుడట్లు పలుకగా, వశిష్ఠాదులు ''మహారాజా! మంచి శుభ వార్త విన్నాము. అవశ్యము జనకదుహితలను మీ కోడండ్రుగా తెచ్చుకొననగును!'' అని తెలిపిరి.

దశరథుడు వారి మాటలకు మిక్కిలి సంతోషించాడు. ఆ రాత్రి గడిచింది.

తెల్లవారే రాజపుత్రుల వివాహమునకు కావలసిన రాజోచిత వస్తుసామగ్రిని చాలినంత ధనాన్ని కోశాగారం నుండి తీసుకొని చతురంగబలాలను ముఖ్యులు, రాజబంధువులు, రాణివాసంవారు ప్రయాణం చేయడానికి అవసరమైన వాహనాలను సిద్ధంచేసి ఉంచారు.

రాజబంధువులందరూ దశరథ కుమారుల వివాహానికి, జనకపురికి బయలుదేరుటకు అనుమతింపబడినారు. ముందుగా వశిష్ఠుడు వామదేవుడు, జాబాలి కాశ్యపుడు, మార్కండేయుడు,

కాత్యాయనుడు మున్నగు ఋషిపుంగవులు బయలుదేరారు. వారి వెనుక చతురంగబలముతో బంధుపరివారముపంగాలతో రాజుకూడా బయలుదేరాడు.

నాలుగురోజులు నిరాఘాటంగా భేరీమృదంగ వాద్యాలతో అయోధ్య నుండి, మిథిలాపురికి వారి ప్రయాణం సాగింది. మిథిలాపురి మహారాజునకు తాము వచ్చిన వర్తమానాన్ని తమ దూతద్వారా తెలియపరిచారు.

జనకమహారాజు ఏమాత్రం ఆలస్యం చేయకుండా, అంతకు ముందే పురోహితుడైన శతానందునితో మిథిలానగరానికి విచ్చేసిన జనకుని తమ్ముడు, సాంకాశ్య నగరాధీశ్వరుడైన కుశధ్వజుడు తక్కిన పరివారంతో పరిచారక పరిచారికాగణంతో ఎదురువచ్చి, దశరథ మహారాజునకు, వారి పరివారానికి స్వాగతం చెప్పి పుష్ప, చందన తాంబూలాదులచే సత్కరించి, పురములో ప్రత్యేకముగా ఏర్పాటు చేసిన సువిశాలమైన విడిది భవనాలలో వారి వారి యోగ్యతలకు తగిన విధంగా ప్రవేశింపజేశాడు. దశరథుని చతురంగ బలాలకు తత్తదు చితములైన విడుదులు, బంధువులకు ప్రత్యేక విడుదులు, రాణి వాసానికి వేరు విడుదులు ఏర్పాటుచేసి ఆయా చోటులలో వియ్యాల వారికి సేవలు అందించడానికి అవసరమైన సేవకులను నియోగించాడు.

"రేపు ఉదయం మీరు వివాహవేదిక వద్దకు మీరు మీ కుమారు లతో, వివాహమునకు రండి" అని జనకుడు దశరథుని యాహ్వానించి, వరకుమారులను ఒకసారి ఆనందపారవశ్యముతో తిలకించి వెళ్ళాడు.

దశరథుడు వశిష్ఠుల వారి సలహాప్రకారం, రామలక్ష్మణులకు, భరతశత్రుఘ్నులకు మంగళస్నానాలు చేయించి, విధివిధానంగా స్నాతకవిధులు, హోమకార్యక్రమాలను జరిపించి, బ్రాహ్మణోత్తము లను భూరిదానాలచే సంతుష్టులను చేశాడు.

రాముడు నీలమేఘచ్ఛాయలో, కళ్యాణమూర్తియై అందాన్ని వెదజల్లుతూ వున్నాడు. మాత కౌసల్యరాముని చూచి, అంతులేని పుత్రవాత్సల్యంతో "రామా! నిన్ను కన్నందుకు నాజన్మ ధన్యమైనది నీవంటి బిడ్డ ఎవరికి కలిగినా వారందరూ ధన్యులే." అని తన మనస్సులోనే రాముని చూచి ఆనందించెను. నలుగురు కుమారులును

మధుపర్కములు ధరించి, పెండ్లికుమారులై చూపరులకు ముచ్చట గొలుపుతూ కనిపించారు.

లగ్నసమయం సమీపించింది. రాకుమారులు వివాహవేదిక వద్దకు కొనిపోబడవలెను. ఉభయపక్షముల రాజపురోహితులు మంత్రములు చదువుచుండగా రాకుమారులు తండ్రి దశరథ యుక్తంగా తరలిపోవడానికి సిద్ధమైనారు. సరిగ్గా అదేసమయంలో చుక్కతెగి పడినట్లుగా భరతుని మేనమామ, కేకయ రాజకుమారుడైన యుధాజిత్తు మిథిలానగరంలోని దశరథ మహారాజు విడిదికి వచ్చాడు. దశరథమహారాజు యుధాజిత్తును సానులాపసల్లాపాలతో ఆదరించి స్వాగతం చెప్పాడు. యుధాజిత్తు తన బావగారైన దశరథమహారాజు నకు నమస్కరించి, మానాన్న కేకయాధీశుడు తన మనుమడైన భరతుని చూడగోరి, తీసుకొనిరమ్మని అయోధ్యకు నన్ను పంపినారు. మీరు అక్కడ లేకపోవడంచేత, విషయం తెలిసిన నేను అనుకోకుండా ఇచ్చటికి వచ్చాను.” అని చెప్పాడు. భరతుడు మేనమామకు భక్త్యాదులతో నమస్కరించాడు.

ఇంతలో వశిష్ఠమహర్షి జనకమహారాజు కడకేగి, మహారాజా! వివాహమంగళప్రశస్త దీక్షితులైన కుమారులతో కూడి దశరథ మహారాజు సపరివారముగా వివాహక్రతువునకు విచ్చేయుటకు సిద్ధముగా నున్నారు. లగ్నసమయము సమీపించినది. మీరు వారిని యహ్వానించుటయే మిగిలియున్నది.” అని పలికెను.

జనక మహారాజు మిక్కిలి కుతూహలముతో మహర్షీ! అంతయు సిద్ధముగనే యున్నది. వివాహ మంగళ శోభామూర్తులైన నా కుమార్తెలు ఇప్పటికే కళ్యాణవేదిక వద్దకు వచ్చియున్నారు. నేనిప్పుడే వెళ్ళి దశరథుల వారిని కుమారులతో సపరివార యుక్తంగా వివాహ వేదిక వద్దకు వచ్చుటకు ఆహ్వానింతును.

జనక మహారాజు మంగళవాద్యములతో దిక్కులు ప్రతిధ్వనించుచుండగా సపరివారంతో వెళ్ళి పెండ్లి వారిని యాహ్వానించారు.

అందరూ మహదానందంతో కళ్యాణవేదిక వద్దకుచేరుకున్నారు.

వశిష్ఠుడు అగ్నిహోత్రుని వద్ద కొందరు ఋత్విజులతో వివాహ మంత్రములను పఠిస్తూ హోమం చేస్తున్నాడు.

ఇయం సీతా మమసుతా సహధర్మ చరీతవ
ప్రతీచ్ఛచైనాం భద్రంతే పాణిం గృహీష్వపాణినా
పతివ్రతా మహా భాగాఛాయే వాను సతా సదా
ఇత్యుక్త్వా ప్రాషి పద్రాజా మంతపూతం జలంతధీ!

వశిష్ఠుడు వర కుమారుడైన రామచంద్రుని వంశ క్రమాన్ని ఉచ్చైస్వరంతో వినిపించాడు. తరువాత జనకుడు పురోహితుడు శతానందులు జనకుని వంశక్రమాన్ని చాటారు.

ఆ వంశక్రమం ఇట్లా ఉంది.

నిమి-మిథి- (ఇతడే మిథిలానగర నిర్మాత) ఇతడు మొదటి జనకుడు - ఇతనికి ఉదావసువు - నంది వర్ధనుడు - సుకేతువు - దేవరాయుడు ఇతడు రాజర్షి - ఇతనికి బృహద్రథుడు - మహావీరుడు - సుధృతి - దృష్టకేతువు - హర్యశ్వుడు - మరువు - ప్రతింధకుడు - కీర్తిరథుడు, దేవమీడుడు - విబుధుడు - మహీధ్రకుడు- కీర్తిరాతుడు (రాజర్షి) మహిరోహుడు - స్వర్ణరోముడు (రాజర్షి)-హ్రస్వరోముడు. ఇతనికి ఇద్దరు కుమారులు. వీరిలో జేష్ఠుడు జనకుడు - రెండవవాడు కుశధ్వజుడు.

పురోహితుడు జనకుని వంశక్రమం చెప్పిన పిమ్మట అతని సూచనచే జనకమహారాజు అగ్నిహోత్రుని కభిముఖంగా ఎదురెదుగా రాముని సీతను కూర్చుండ నియోగించారు. జనకమహారాజు రాముని చేతిలో సీత చేయి వుంచి, ఈ సీత నా ప్రియకుమార్తె. ఇకనుండి నీకు సహధర్మచారిణిగా ఉండి, పలయు సేవలందిస్తూ వుంటుంది. ఈమెను స్వీకరించి నన్ను కృతార్థుని చేయుము రామా!" యని అన్నాడు. ఈ మాటలంటున్నప్పుడు జనకుని కన్నులలో నీళ్ళు తిరిగాయి.

సీతారాముల వివాహం అనుకున్నట్లుగా అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆకాశం నుండి దేవతలు పుష్ప వర్షం కురిపించారు. కోలాహల సంరంభం మిన్ను ముట్టే విధంగా దేవదుందుభులు మ్రోగాయి, ఆనాడు చైత్ర శుద్ధ నవమి.

తరువాత జనక మహారాజు లక్ష్మణుని పిలిచి, ఊర్మిళాదేవితో వివాహం జరిపించాడు. తరువాత భరతునికి మాండవిని, శత్రుఘ్నునకు శ్రుతకీర్తి అనే కన్యను యిచ్చి వివాహం జరిపించారు.

దశరథ రాజు సుతులు నలుగురి వివాహం అతిలోక వైభవంగా జరగడం ప్రత్యక్షంగా చూచిన రాజలోకం, ఋషి పుంగవులు విప్రోత్త

ములు గగన చరులైన, గరుడ గంధర్వ కిన్నెరాదులు మిక్కిలి ఆనంద పడినారు.

పెండ్లి వేడుకలను చూడవచ్చిన వారంతా జనక మహారాజు వద్దకు వెళ్ళి అభినందించి, నూతన వధూవరులను ఆశీర్వదించి జనకుని ఆతిధ్యం స్వీకరించి వెళ్ళారు.

మరునాడు అనేక వస్తు వాహనాలు, దాసదాసీ జనమును, ఏనుగులను, గుఱ్ఱములను, రధములను, బంగారు ఆభరణాలను, వస్త్రాలను దశరధునికి, అల్లుళ్ళకు, కుమార్తెలకు ఇచ్చాడు.

తరువాత రామలక్ష్మణ, భరత, శత్రుఘ్నులతో తమ కోడండ్రు నలుగురితో సైన్య సమేతంగా దశరథుడు అయోధ్యకు తిరిగి వెళుతూ జనకుని వద్ద సెలవు తీసుకొన్నాడు వారు మిధిలానగరసరిహద్దులుదాటి ప్రయాణం సాగిస్తున్నారు-విశ్వామిత్రుడు మిధిలనుండే అందరి వద్దా సెలవు తీసుకొని తన తపోభూమియైన హిమాలయములకు వెళ్ళాడు

## పరశురామగర్వ భంగం

పెండ్లివారు ఆ విధంగా అయోధ్యవైపు తిరుగు ప్రయాణం సాగిస్తుండగా, అనుకోనటువంటి పిడుగు వంటి ఒక పెద్ద ధ్వని వినిపించింది. అగ్ని పర్వత మేదో విస్ఫోటనం చెందిందా అన్నంత దారుణంగా వుంది ఆ ధ్వని. అంతటా కారుచీకట్లు క్రమ్మినవి. అందరికీ కండ్లు కనిపించక ఎక్కడి వారక్కడనే స్తబ్ధులై నిలబడి పోయినారు. శ్రీరామ చంద్రుడు, దశరధుడు, వశిష్ఠమహర్షి మాత్రం ధైర్యంగానే వున్నట్లు కనిపించారు, కాని వారికి కూడ కొంతసేపటి వరకు ఏమీ పాలుపోలేదు.

ఆ సమయంలో పరశురాముడు ఎదురుగా వచ్చి నిలిచాడు. చేతగండ్రగొడ్డలితో, ఎరుపు తిరిగి జడలు కట్టిన రాగివెంట్రుకలతో, భయంకరమైన చూపులతో రెండవ రుద్రునివలె వారికి కనిపించాడు.

పరశురాముడు ఎదురుగా కళ్యాణ శోభతో అలరారుతూ వున్న రామచంద్రుని చూచి "రామా! నీవు విరిచిన ధనుస్సు శివధనుస్సు పాతవడి త్రుప్పు పట్టిన దానిని విరుచుటలో ఆశ్చర్యమేమున్నది? ఇదిగో! నీవు విరచిన శివధనుస్సునకంటే ఎన్నో రెట్లు మిన్నయైనది.

మహాశక్తివంతమైనది ఈ విష్ణుధనుస్సు. దీనిని విరిచి నీవు ఇక్కడ నుండి వెళ్ళుము. లేదా నిన్నుకదలనిచ్చునదిలేదు. దీనితో నీ బల పరాక్రమము లెంతటివో తేటతెల్ల మగును. హూ"అని హూంకరించాడు పరశురాముడు.

పరశు ఘాతము వంటి పరశురాముని భీతిగొలుపు మాటలకు వడవడవణకిపోయి దశరథ మహారాజు పరశురామునికి నమస్కరించి అయ్యా! మీరు కోపమును విడిచిన బ్రాహ్మణోత్తములని వింటిని, నీవు గొప్ప కీర్తికలవాడవని యెరుగుదును. బాలురు, కళ్యాణ మూర్తులైన నా కుమారుల నాశీర్వదించి, దయయుంచి క్షేమముగా యిక్కడ నుండి మే మయోధ్యకు చేరుటకు అనుమతినిండు. దేవేంద్రుసాక్షిగా మీరాయుధము పట్టనని విసర్జించితిరని వింటిని, అంతేకాక ఈ భూమండలము జయించిన కౌశ్యపునకు దానమిచ్చిన వదాన్య శేఖరులు మీరు. అట్టి మీరు కరుణించి యీ బాలురను వదలుడు అని ప్రార్థించాడు.

అంత రాముడు తండ్రిని సగౌరవంగా ప్రక్కకు తప్పుకొనుమని చెప్పెను. వశిష్ఠుడు కూడ దశరథుని వారించి "రాజా! రాముడు ధీరుడు-జగదేక ధనుష్కుడు. అతనికేమీ భయములేదు. అతనిని ఆ పరశుధారితో పోరనిండు" అని అన్నాడు.

రాముడు తండ్రితో "తండ్రీ! మీరు నాకు ఆజ్ఞయిచ్చిన ఇతడొక లెక్కకాదు. క్షణములో ఈతనియాట కట్టించి బీరములుడిగింతును" అని రాముడు దశరథునికి, గురువర్యులైన వశిష్ఠునికి నమస్కరించి, పరశురాముని చేతనున్న ధనుర్బాణములను తీసుకొన్నాడు. బాణమును ధనుస్సున సంధించు లోపలనే పరశురాముడు రామునికి నమస్కరించి రామా! ఆగు మాగుము. నీవు సామాన్యుడవుగావు. నీవు శ్రీ మహావిష్ణువని గుర్తించితిని. ఈవిల్లు నీదే, నాయహంకారము, అభిమానము అంతము నశించినది-నీవు నీ శక్తిని విస్మరించినావని భావించి, నిన్ను పరీక్షించితినేకాని వేరుకాదు. నీవు ఎక్కుపెట్టిన బాణముతో తపస్సుచేత సంపాదించిన నా పుణ్యలోకములను పోగొట్టుము, చాలును. నేను మనోబలముచే మహేంద్రగిరికి వెళ్ళి అచట నివసింతును.

రాముడట్లు చేయగా పరశురాముడు రామునకు నమస్కరించి, మనోవేగముచే మహేంద్ర పర్వతము నందలి తన నివాసానికి వెళ్ళాడు.

అంత రాముడు తన చేతనున్న ధనుర్బాణములను వరుణదేవున కొసగి తండ్రితోను, వశిష్ఠ మహర్షితోను, ఇతరబలగములతో అయోధ్యా పురమును చేరిరి.

కళ్యాణమూర్తులైన దశరథ తనయులు, అయోధ్యకు చేరుచున్నారని తెలియగానే అయోధ్యా పురజనులు, అయోధ్యను మున్నెన్నడూ అలంకరించని విధముగా అలంకరించిరి.

పచ్చని తోరణాలు, పన్నీరు చల్లి మెత్తచేసిన వీధులు, ముత్యాలతో తీర్చిదిద్దిన ముగ్గులు, రంగురంగుల తోరణాలతో, మంగళ వాద్యాలతో, తూర్య ఘోషలతో అయోధ్యా నగరం కళకళలాడుతూ వున్నది. పురవాసులందరూ ఎంతో సంతోష సంరంభాలతో జయజయ ధ్వానాలు చేసుకొంటూ రాకుమారులకు స్వాగతం చెప్పారు. దశరథుడు ఎవరెవరికి కావలసిన వసతి మందిరాలలోనికి వారిని ప్రవేశింపజేసి, తాను కొడుకులు కోడండ్రతో తమ తమ నిర్దేశిత రాజ మందిరములకు ప్రవేశించి ఆనందంగా విశ్రాంతి తీసుకుంటున్నాడు.

దశరధ కుమారుల కళ్యాణ వినోదములను, కథలు కథలుగా పురజనులు కొంతకాలము వరకు చెప్పుకుంటూనే వున్నారు.

# అయోధ్యా కాండము

అయోధ్యలో కొంతకాలమున్న తరువాత, యుధాజిత్తు భరతునితో తాను తన రాజ్యమున కేగెదనని దశరథుని యనుజ్ఞ కోరుతూ వేడు కున్నాడు. దశరథుడు ప్రీతిపూర్వకంగా యుధాజిత్తును అనుమ తించాడు. భరతునితోపాటు అతని యనుంగు తమ్ముడైన శత్రుఘ్నుడు కూడ తాతగారింటికి బయలుదేరాడు. ముగ్గురును కేకయ రాజ్యం చేరుకున్నారు. అచట రాజుచేత, రాజ బంధువులచేత మన్నన, ఆదర, సత్కారాలు పొంది సోదరులిరువురు సుఖంగా అక్కడ నివసింప జొచ్చారు.

వయోవృద్ధుడైన దశరథ మహారాజునకు నలుగురి కుమారుల యందు ప్రగాఢమైన ప్రేమాభిమానాలు ఉన్నప్పటికినీ, రామచంద్రు డంటే అతనికి అంతులేని ప్రేమ, గౌరవము, ఆప్యాయత. శ్రీరామ చంద్రునిలో నెలకొనియున్న సద్గుణపుంజాన్ని గురించి అతడు మనసు లోనే శ్లాఘించుకునేవాడు. రాముడు సుగుణాభిరాముడు, కళ్యాణ గుణాభిరాముడు త్రిజగన్నుతాభి శోభితుడు. రామునివంటి గుణగరిష్ఠుని పోలినవాడు ఈ భూమండలములో ఎవ్వరునూలేరు. దశరథుడు పరిపరి విధములు శ్రీరామచంద్రుని దివ్యమంగళ రూపాన్ని చూచి పురుష పుంగవులే వ్యామోహ పరవశులైతే ఇక స్త్రీల మాట ఏల?

రామునికి సీత-సీతకు రాముడు అన్నివిధాల పోలిన, చాలిన వయోరూప, గుణసంపద కల అరుదైన దాంపత్యం.

## యువరాజ పట్టాభిషేకం - ఫలించని ప్రయత్నం

దశరథుడింకా ఇట్లా భావించాడు. తనకు వయోభారం అధిక మైంది. తాను జీవించి యుండగానే రాముని అయోధ్యాధీశునిగా చూడ వలెను. నాకంటే ప్రజలను అమితంగా ప్రేమించి, అన్నివిధాల వారిని కాపాడగల శక్తియుక్తులు ఉదార హృదయం కలవాడు. అంతేకాక నాకు జ్యేష్ఠ కుమారుడు. తమ్ములందరికినీ, అన్న అంటే అపారమైన

భక్తి ప్రపత్తులున్నాయి. ప్రజలు, రాజోద్యోగులు, చుట్టుప్రక్కలనున్న సమస్త రాజన్య లోకం శ్రీరామచంద్రుని యౌవరాజ్య పట్టాభిషేకాన్ని ఎంతగానో హర్షిస్తారు అంతేకాదు త్రిలోకములచేత భళీ! యనిపించు కొనగల గొప్ప సద్గుణములు, అసదృశ పరాక్రమము గల సాటిలేని మేటివీరుడు రాముడు. నాతో సహా మా పూర్వులందరికంటే కూడ అధికముగా ఇబ్బడి ముబ్బడిగా రఘువంశపు కీర్తి ప్రతిష్టలను నిల్పగల సమర్థుడు. నిల్పడమే కాదు. వృద్ధి పొందించగల రఘుకులవర్ధనుడు రాముడు.

దశరథుడు ఈ విధంగా అనేకవిధాలుగా శ్రీరామ యౌవరాజ్య పట్టాభిషేకాన్ని గురించి ఆలోచించసాగాడు. ఎప్పుడు పట్టాభిషిక్తుడైన రాముని దివ్యమంగళ రూపాన్ని చూస్తానా అనే ఆతృత మనసులో కలిగింది.

ఆ రాత్రి మధురమైన శ్రీరామ యౌవరాజ్య పట్టాభిషేక ఊహలతో దశరథునికి నిద్రపట్టకపోయినా సుఖంగా గడిచింది.

మరునాడే రాజు తన ముఖ్యామాత్యులచే సంప్రదించి, మంత్రి, సామంత, దండనాథులతో కూడిన ప్రత్యేక సభ యేర్పాటు చేయించాడు. దేశదేశాలకు సంబంధించిన రాజలోకాన్ని సభకు ఆహ్వానించాడు. అయితే అటువంటి సభకు రాజర్షియైన జనకుడు, వృద్ధుడైన కేకయరాజు తప్ప తక్కిన పెక్కురు రాజులు విచ్చేశారు.

దశరథుడు దేవతల చేత పరివేష్టింపబడియున్న దేవేంద్రునివలె భాసించాడు. సభలో ప్రత్యేకంగా ఒక దిక్కున అమర్చబడియున్న ఉన్నతాసనాలపై వశిష్ఠాది మహర్షులు ఆసీనులై యున్నారు. తక్కిన వారంతా వారి వారికి నియుక్తములైన ఆసనాలలో కూర్చుని యున్నారు.

అంత దశరథుడు లేచి నిలుచొని సభను పరామర్శించి బహుమాన పురస్సరంగా ఇట్లా మాట్లాడ ప్రారంభించాడు.

"మాన్యులైన రాజన్యవరులారా! ప్రియతమ మంత్రిముఖ్యులైన, పూజ్యాతి పూజ్యతములైన విప్రోత్తములారా! ఇతర గౌరవ సభాసదులారా! మీ యందరికి ఒక ముఖ్య విషయం చెప్పదలచి, ఈ సభ నేర్పాటు చేశాను. నాకు వృద్ధాప్యం పైబడినది. ఇంక నాకు ఈ సువిశాలమైన కోసలరాజ్యాన్ని పాలించే శక్తి చాలుటలేదు. మీ అందరి

అభిప్రాయములు స్వీకరించి మా రాముని యువరాజుగా పట్టాభిషిక్తుడును చేయదలిచాను. మీకిది సమ్మతమేనా! మీరు సమ్మతించినచో రేపు పెందలకడనే శ్రీరామచంద్రుని యౌవరాజ్యాభిషిక్తుని చేస్తాను."

అని చెప్పి తన ప్రసంగం ముగించి సింహాసనంపై కూర్చున్నాడు.

దశరథుని మాటలు విన్న సభాసదులు అంతా మిక్కిలి సంతోషంతో మహారాజా! మీయాలోచన ఎంతైనా సమంజసము. సర్వవిధముల మన రాముడు యువరాజ పట్టాభిషేకానికి తగినవాడు. మేమును మీకు మారుగా రామునే యీ రాజ్యమునకు రాజుగా చూడ గోరుచున్నాము. సుగుణాభిరాముడయిన రాముని తప్ప వేఱెవరిని మన కోసలదేశవాసులు అంగీకరింపరు. రాముడు రాజైతే మాకు కావలసినదిలేదు.

సభాసదుల మాటలను విన్న దశరథుడు శ్రీ రామచంద్రుని రాజ్యాధిపత్య లాభం కొరకు వారు దేశంలోని యావన్మంది ప్రజలు ఎంతగా ఆకాంక్షిస్తున్నారో అర్థం చేసుకున్నాడు. తనకంటే అధికముగ అనేకములయిన సుగుణపుంజములచే భాసిల్లు సర్వజ్ఞ శేఖరుడు రాముని రాజుగా వారు కోరుటలో అనౌచిత్యమేమియు లేదు.

విజ్ఞులయిన సభాసదుల ఏకాభిప్రాయముతో కూడిన, అభిప్రాయములు విని దశరథుడు పరమానంద భరితుడైనాడు. తన ప్రియ కుమారుడైన రాముడు రేపు పట్టాభిషిక్తుడు కాబోతున్నాడని యెంతో సంతోషించాడు. వెంటనే ఆ యేర్పాట్లన్నీ సమగ్రంగా, ఎటువంటి లోటు రాకుండా చేయడానికి, మంత్రులను నియోగించారు. క్షణంలో దగ్గఱి రాజులకు రాజబంధువులకు వర్తమానాలందాయి. కేకయ రాజ్యానికి చెందిన మహారాజు, మిథిలానగర చక్రవర్తియైన జనక మహారాజు తప్ప తక్కినవారందరూ తెల్లవారేవరకు పట్టాభిషేకోత్సవానికి రాగలిగారు. అనంతరము దశరథుడు వశిష్ఠుడు, జాబాలి, సుమంతుడు మున్నగు పెద్దలతో సమావేశమై వారితో ఉత్సవాన్ని గురించి వివరంగా మాట్లాడాడు.

ఈ విషయం రాజులతోను, రాజబంధువులతోను, రాజముఖ్యులతోను ప్రస్తావించి, రాజనగరునంతా అలంకరింపజేయుటకు ఆదేశించెను. రామునికివార్త తెలిపి సమాయత్తపరచి వెంటనే రాముని నిచ్చుటకు కొనితేవలసినదని వశిష్ఠునికి విన్నవించెను.

వశిష్ఠుడు వెంటనే శ్రీ రామమందిరానికి వెళ్ళి రామచంద్రునితో "రామా! మీ తండ్రిగారు నిన్ను తక్షణమే చూడగోరుచున్నారు. నా వెంట రమ్ము-" అని చెప్పాడు ఆ సమయంలో సీతారాములు ఇద్దరూ హంస తూలికాతల్పంమీద కూర్చొని, ఏవో ఇష్టాగోష్ఠిగా కొన్ని మాటలు చెప్పుకొంటున్నారు. అనుకోకుండా వశిష్ఠులవారు వచ్చి ఈ మాట చెప్పడంతో రాముడు,సీత నివ్వెరపోయినారు. ఇద్దరూ వశిష్ఠులకు నమస్కారం చేశారు- అంత రాముడు "గురువర్యా ! తండ్రిగారు ఆకస్మికంగా ఇట్లా మాకు కబురుపెట్టడానికి కారణం తెలుసుకోవచ్చునా!..." అని కొంతసేపు ఆలోచించి, తామేమీ చెప్పనక్కరలేదు. తండ్రిగారు యాజ్ఞాపించిరన యేదో అతి ముఖ్యమైన నిగూఢ విషయమే అందిమిడి యుండవచ్చును. వెళదాం పదండి." అని సీతవైపు చూచాడు. సీత చిరునవ్వుతో తలవంచుకొని "సరే నన్నట్లు" నిలుచున్నది.

## దశరథుని మందిరానికి రామలక్ష్మణులు వెళ్ళడం

శ్రీ రామచంద్రుడు వీప గంభీర వదనారవిందుడై మారు పలుకక వశిష్ఠుల ననుసరించెను. రాముని వెంట లక్ష్మణుడు కూడ ప్రయాణమై నాడు. సీత సింహద్వారమువరకువచ్చి, భర్తను, మరదిని, మునివర్యుని ముదిత ముఖారవిందయై సాగనంపినది.ఇంతలోనే దశరథుడు సూతుని పంపించాడు. రాముని మందిరమునకు వెళ్ళి త్వరగా తాతని తీసుకొని రమ్మని, సూతుని రాక చూచి రాముని మనసులో శంక కలిగింది. "ఏమిటా! వెంట వెంటనే తండ్రిగారు నాకిట్లు కబురంపుచున్నారు. ఏదేని కష్టము సంభవింపలేదుకదా!" అని తలచి వేగిరమే పితృ మంది రానికి చేరుకున్నాడు.

రామచంద్రుడు వచ్చాడని తెలుసుకొని, దశరథుడు శ్రీ రామ

చంద్రునికి ప్రీతి కలిగించు శుభవార్తను తెలుపవలెననెడి కుతూహలముతో రాముని వెంటనే తన వద్దకు రప్పించుకొనెను.

రాముడు తండ్రి వద్దకేగి, పాదములకు సాష్టాంగముగ నమస్కరించాడు. దశరథుడు చేతులతో సమారుని లేవనెత్తి, ఆలింగనము చేసుకొని పుత్రవాత్సల్యము పొంగి పొరలగా దశరథుడు ప్రేమతో "రామా! నిన్ను చూడగోరిన కారణమును వినుము. రేపు ఉదయముననే యువరాజ్య పట్టాభిషిక్తుని గావింప దలచితిని. నీవును సీతయును ఈ రాత్రి గురువుల యాదేశములను పాటించి ఉపవాస వ్రతనిష్ఠచే గడుపవలెను. లక్ష్మణా! నీవు కూడ మీ అన్నగారి మందిరములోనే ఉండి, వారి వ్రత దీక్షలో వలసిన సహకారమొసర్చుము. రాముని, లక్ష్మణుని దీవించి మరల మరల యాలింగన మొసర్చుకొనెను. పిమ్మట రాముడు వేరేమియు మాట్లాడక, తండ్రి యానతి ననుసరించి నడచుకొన నిశ్చయించుకొని, తండ్రియొద్ద సెలవు తీసుకొని వశిష్ఠ మహర్షితో కూడి నిజమందిరానికి చేరుకున్నాడు. సీత రాముని కోసం ఎదురు చూస్తున్నది. రాముడు సీతతో విషయమంతా వివరించాడు. సీత సంతోషంతో పతిదేవునికి ప్రణమిల్లింది. వశిష్ఠుడు ఆ రాత్రి సీతారాములచే ఉపవాస దీక్ష ప్రారంభింప జేయడానికి పూనుకున్నాడు.

## సీతారాముల ఉపవాస దీక్ష

ఉపవాస దీక్ష ప్రారంభించడానికి ముందుగా రాముడు, సీతను వెంటనిడుకొని లక్ష్మణుడను గమింపగా మాతృ మందిరానికి బయలు దేరాడు. అక్కడ తల్లి కౌసల్యాదేవితోపాటు, సుమిత్ర కూడ ఉన్నది. తల్లులకు నమస్కరించి, రాముడు, తన తండ్రిగారు తనకు రేపు యువరాజు పట్టాభిషేకోత్సవము జరిపించుటకు నిశ్చయించి తగు ఏర్పాట్లు చేస్తూ వున్నారు. ఈ రాత్రి మాచేత ఉపవాసదీక్షను ఆచరింప జేయుటకు వశిష్ఠుల వారిని కోరినారు. వారిప్పుడు ఆ పనిపై మా మందిరమునకు వచ్చియున్నారు. ఈ వార్త మీకును చెప్పి, మిమ్ముల నాహ్వానించి, మీ యాశీర్వచనమును పొందుటకై వచ్చినాము. అనుగ్రహింపుడు" అని మిన్నకున్నాడు.

ఆనందవర్ధనుడైన రాముని చూచి, ఆతని మాటలను విని కౌసల్యాదేవి మిక్కిలి సంతోషపడినది. ఆమె రామునితో "రామా! కడుపార నిన్ను కన్న భాగ్యము నాకు అపురూపము. నీ యంతటి పుత్రుని భాగ్యమును పొందిన తల్లులెందరున్నారయ్యా!" అని రాముని మరి మరి యక్కున చేర్చుకొని ముద్దాడి యానందించి యాశీర్వదించినది. సీతారాములు, లక్ష్మణుడు కౌసల్య చెంతనే మోదాబ్ధిలో మునిగి తన్మయం చెందివున్న సుమిత్రను సమీపించి, ఆమె పాదములకు సాష్టాంగ నమస్కారం చేశారు. తరువాత వారు తమ మందిరానికి తిరిగి వెళ్ళారు.

ఆ రాత్రి వశిష్ఠులవారి చేత అభిమంత్రితులై సీతారాములు ఉపవాస దీక్షను చేశారు.

వశిష్ఠులు రాత్రి పొద్దుపోయిన తరువాత దశరథ మందిరానికి వెళ్ళి, రాజుతో తెల్ల వారి ఉదయం చేయవలసిన విధులన్నిటినీ మరొక సారి జ్ఞప్తిచేసి తన విశ్రాంతి మందిరానికి వెళ్ళాడు.

సీతారాములు ఆ రాత్రి విధి విధానంగా ఉపవాస దీక్ష నిర్వహించారు. దర్భాసనాలపై శయనించి వేకువఝామున బ్రాహ్మ ముహూర్తంలో నిద్ర మేల్కొన్నారు. పుర వైభవము తెల్ల వారేసరికి రామమందిర మంతా అభిరామ మందిరంగా అలంకరింపబడి యున్నది. 'తెల్లవారే శ్రీరామచంద్రునకు యువరాజ పట్టాభిషేకం' అన్న వార్త ఆ రాత్రే అయోధ్యా నగర వాసులందరికీ తెలిసింది. తెల్లవారేసరికల్లా పట్టణమంతా శోభాయమానంగా అలంకరింపబడింది. ప్రజలు ఆనందోత్సాహాలు వెల్లివిరియగా రామాభిషేక వార్తను క్షణాల్లో ఆనోట ఆనోట వినిపించి పట్టణమంతా వ్యాపింపజేశారు. వీధులన్నీ అరటి చెట్లను నిలిపారు. రంగు రంగుల తోరణాలను కట్టారు. ఎక్కడ విన్నా మంగళవాద్య ఘోషలు శ్రవణ సుభాగంగా నినదిస్తున్నాయి. అయోధ్యా పురంలో ప్రతి యిల్లు అపురూపంగా అలంకరించబడింది. ఇండ్లముందు రంగురంగుల రంగవల్లులు ఎంతో కళాత్మకంగా చిత్రించబడినాయి.

ఇండ్లల్లోను, వీధుల్లోను అయోధ్యావాసులు ఏవో తొందర పనులమీద ఎల్లెడల సంతోష సంరంభాలతో పరిభ్రమిస్తున్నారు. వారందరి నోటి నుండి ఒకే మాట, ఒకే చర్చ-అది తెల్లవారితే శ్రీరాముని యౌవరాజ్య పట్టాభిషేకం గురించి-

దశరథుడు ప్రజల సంరంభాలను చూచి పరమానంద భరితుడై నాడు. "మా శ్రీరామచంద్రుడు చిరంజీవియై చిరకాలము వర్థిల్లుగాక" యని మనసులోనే కుమారుని దీవించాడు.

## మంధర అసూయ

అయోధ్యా నగర వైభవమును చూచి, మంధర ఇంకా విశేషాలను చూడాలని రాణివాస మందిరం పైకి ఎక్కి చూసింది. నగరమంతా కనులు మిరుమిట్లు గొలిపే అలంకరణలతో కళకళలాడుతూ వున్నది. ఎటు చూచినా నగరంలోని ప్రజలు గుంపులు గుంపులుగా చేరి ముచ్చటించుకొన్నట్లు చూచింది. పెద్దరాణి మందిరంలో అర్థ పరు రాలైన ఆ మహాభాగ కౌసల్యాదేవి...విరివిగా దానాలు చేస్తూ వున్నది. ప్రక్కనే దాసీతో మంధర "ఏమే ఆ నగర కోలాహలం గురించి నీకే మైనా తెలుసా?" అని అడిగింది. ఆ దాసీ యిట్లా అన్నది. "మంధరా! ఈ విషయం నీకు తెలియదా? మన ప్రభువులవారు దశరథ సార్వ భౌములు తమ పెద్ద కుమారులైన శ్రీరామచంద్రులవారికి రేపు ఉదయమే పట్టాభిషేకం చేయ సంకల్పించారు. ఇంకా నీవు ఏమీ తెలియ నట్లున్నావు. కైకేయీ అమ్మవారు నీకోసం చూస్తూంటారు. వెళ్ళి వారిని కలిసి చేయవలసిన పనులు చక్కపెట్టుకోవాలి కదా! ఊఁ! ఊఁ! క్రిందకు నడువుము. ఇప్పుడే అమ్మగారిని కలిసి తరువాతి పనులు ఆలోచింపుము" అని త్వరపెట్టింది.

దాసీ చెప్పిన మాటలు విని నిర్విణ్ణురాలైంది. క్షణకాలం నిశ్చేష్ఠ రాలైంది. కొంతవడికి తేరుకొన్నది. కైకేయికి అత్యంత ఆప్తురాలు' ఆంతరంగిక పరిచారికయైన మంధరకు ఈ వార్త కఠోరమనిపించింది' కైకేయి శ్రేయస్సు, ఆమె కుమారుడైన భరతుని శ్రేయస్సే ఎప్పుడూ కోరు మంధర, శ్రీరామచంద్రుని యౌవరాజ్య పట్టాభిషేక వార్తను

విని జీర్ణించుకొనలేకపోయింది. కనీసం కలలోనైనా ఊహించని వార్త విన్నట్లు భావించి వెక్కసపడింది.

మంధర వెంటనే రుసరుసమంటూ మేడ క్రిందికి దిగి కైకేయి మందిరానికి వెళ్ళింది కైకేయి మంధర ఆతృతను, ఆరాటాన్ని గమనించింది. ఎందుకో అర్థంకాక కంగారుపడుతూ అడిగింది.

"మంధరా! ఏమిటి ఇట్లా ఉన్నావు నిన్ను ఎవరైనా ఏమైనా అన్నారా! నీ మొగం ఎందుకిలా వాడిపోయి ఉన్నది. నీ విచారానికి గల కారణం ఏమిటో త్వరగా చెప్పు. సందేహించకు" అని ప్రశ్నించింది.

అప్పుడు మంధర కైకేయితో ఇట్లా చెప్ప దొడిగింది. "అమ్మా కైకేయీ! నీకు తీరని అన్యాయం జరుగుచున్నది. మన ప్రభువులు దశరథులవారు మనమెవ్వరము కలలోనైనా తలవని తలంపుగా ఒక కాని కార్యానికి పూనుకున్నాడు. నీవు వెర్రిదానిలా ఇట్లా అంతఃపురం నాలుగు గోడలమధ్య ఉన్నంతకాలం నీ గతి యింతే...

మంధర ఏమోమో చెబుతూ వుంది. ఆమె క్రమంగా తిట్లకు శాపనార్థాలకు దిగినట్లు గమనించింది. అయినా మొదటినుంచీ అంతఃపురంలోని రాణివాసంలో మిగతా దాసీ జనానికంటే అధికంగానే మంధరకున్న ప్రాముఖ్యాన్నిబట్టి స్వాతంత్ర్యాన్ని బట్టి ఆమె మంధర మాటలపోటుల్ని ఆపలేకుండా పోయింది.

మంథర ఇంకా "ఇంతకాలం రాజునకు మిగతారాణులకంటే నీవే ప్రియమైన దానివనీ, ఆరవప్రాణానివనీ, నీవేదంటే అది చేస్తాడనీ గర్వంతో, స్వాభిమానంతో విర్రవీగి పోయావు. అదంతా వట్టి అబద్ధం - ఇక నీ గతి అధోగతి...

"విషయమేమిటో త్వరగా చెప్పవే" అని కైక మంధరను అదిలించింది.

మంధర రొప్పుచూ రోజుచు "రేపు ఉదయమే శ్రీరామ చంద్రునికి యువరాజు పట్టాభిషేకం చేయడానికి నీ నాథుడు

అన్ని యేర్పాట్లు చేస్తున్నాడు. అందువల్ల నీకు నీ ప్రియ కుమారుడైన భరతునికి తీరని కష్టం వాటిల్లింది. రేపటినుండి ఇంక నీవు నీ సవతికొడుకు ఏలుబడిలో ఉండవలసినదే. కౌసల్యాదేవి నిన్ను తన కనుసన్నలలో నుండ నియోగిస్తూ ఎన్ని కష్టములను బెట్టునో కదా! - రాజునకు నీవు యిష్టసతివను గర్వంతో ఆమెకు లోగడ ఎన్నో అప్రియములు చేసియున్నావు. ఇప్పుడామె తన కొడుకు రాజు కాగానే వానినన్నిటినీ తిరిగి నీపై ప్రయోగించకుండునా!

కైకేయి తల, తలతోపాటు చుట్టుప్రక్కలనున్న వారు, వస్తు జాలం మొత్తం ఒక్కసారి అతివేగంతో తిరుగుచున్నట్లయింది. తల తిరుగుడు కొంత తగ్గిపోయిన తరువాత -

కైక:- మంథరా! ఎంత వింతమాట చెప్పితివే రాముడు రాజైనచో నాకును, భరతునకును కష్టకాలము వచ్చునా? భళా! ఇంత కాలము నీ శరీరమే వక్రించినదనుకొంటిని, ఇప్పుడు నీ బుద్ధి కూడ వక్రించినదని తెలుసుకొనుచున్నాను. సుగుణాభిరాముడైన రాముడు కాక రాజు మరెవ్వరు కాగలరు? ఏల నీకీ విపరీత బుద్ధి పొడమినది మంథరా! రాముడు యౌవరాజ్య పట్టాభిషక్తుడైతే నాకు కావలసిన దేమున్నది?

రాముడు గొప్ప గుణవంతుడు - తన కన్నతల్లి కన్నా నన్ను ఎక్కువగా గౌరవించువాడు. మన ప్రభువులకు జ్యేష్ఠ కుమారుడు. జేష్ఠుడు, శ్రేష్ఠుడు శిష్టగుణోదారుడు ఐన రామునికే రాజ్యార్హత. అట్టి ఉత్తమునిపై నీకేల యసూయ పుట్టినదే. రాముడు రాజైనా ప్రజలకు సేవకుడే. నాకు భరతుని వలెనే ప్రియకుమారుడే. శ్రీరామ యౌవ రాజ్యాభిషేక వార్తను తొలుత నా కందజేసినందులకు, నీవెట్లు చెప్పినను నాకు ఇష్టురాలివే. ఇదిగో! ఈ ముత్యాలహారము." అని మంథర మెడలో హారం వేసింది,

మంథర ఎక్కడలేని కోపం తెచ్చుకుంటూ రుసురుసమని కసురుకోసాగింది. ఛీ! నీవు ఎంత మూర్ఖురాలవు కైకా! రాముడు రాజైనచో నీకు నీ కుమారునికి దక్కేదేమి? ఆలోచించుము. రాముడు రాజైనచో లక్ష్మణుడు, అతని తల్లి సుమిత్ర రాజమాత కౌసల్యలు ఏకమై నిన్ను అవమానించక మానుదురనుకొందువా? సపత్నీమాత్సర్యము, రాజ్యకాంక్ష, నిన్ను నీ కుమారుడైన భరతుని కూడ మట్టుపెట్టించవచ్చును. నీవు పట్టి పిచ్చిదానివి రాజుపై నీకు గల ప్రేమ గుడ్డిప్రేమ.

నిజము నిష్ఠురముగనే యుండును. ఇప్పుడు నేను నీకు చెప్పు మాటలును అట్లే యనిపించవచ్చును. కాని నేను చెప్పినదియే జరిగి తీరును. అప్పుడు నీ కథోగతియే. విచారించి లాభములేదు. నాకెందుకు ఈ నీ బహుమానము. అక్కఱలేదు అని తీసి ప్రక్కకు పెట్టింది.

మంథర మాటలు సూటిగా కైకేయి గుండెల్లోకి చొచ్చుకొని పోయినవి. ఆమెకేమీ అర్థం కావడం లేదు. రాముడు రాజైతే తనకు ఇన్ని అనర్థాలు కలుగుతవా! మంథర ఎందుకు చెబుతుంది. ఆమెకు ఏమీ పాలుపోలేదు. మంథర తనకు ఇష్టసఖి - ఇంతవరకు ఆమె ఎవరిని గురించి, ఏవిధంగానూ ఎప్పుడూ కష్టంగా, కటువుగా మాట్లాడ లేదు. ఇప్పుడుమాత్రం ఎందుకో ఇట్లా అంటున్నది. ఆమె చెబుతున్న జోస్యం నిజమగునా! ఆమె చూపుతున్న కారణాలు — సహేతుకము లేనా! ...ఏమో!...

ఇంతలో "భరతుల" వారు మేనమామ గృహం నుండి అయోధ్యకు వచ్చి, రాజనగరులోనికి సగౌరవంగా ఆహ్వానింపబడి వచ్చి చేరినాడనువార్త కైకకు ఒక పరిచారిక వచ్చి చెప్పినది.

భరతుని ఆగమనకు మిక్కిలి సంతోషము కలిగినది. కాని ఆ సంతోషము ఎంతోసేపు లేదు. ఆమె చెవిలోను, మనసులోను అంతకు ముందుగా మంథర అన్నమాటలే ప్రతిధ్వను లీనుచున్నవి. తన కుమారుని భవిష్యత్తుని గురించి, తన భవిష్యత్తుని గురించి ఆమె

మనస్సులో ఒక భయంకరమైన ఊహాచిత్రము రూపు కట్టుకొన్నది. వెంటనే శూన్య దృక్కులతో చుట్టూ చూస్తూ బేలయై మంథర వద్దకు సమీపించి బిగ్గఱగా "మంథరా!" నన్నిప్పుడేమి చేయమందువో చెప్పు-త్వరగా చెప్పు ... తల బాధ మిక్కుటమగుచున్నది. హృదయము బరువెక్కుచున్నది. ఆలోచనలు అడుగంటి పోయినవి. చెప్పలేని ఆవేదన నన్ను దహించి వేయుచున్నది.

"మంథరా! నీవు చాల మంచిదానివి. యోగ్యురాలవు. ఆపత్సహాయకురాలివి. నీకంటే నాకాప్తులింకెవరున్నారు. చెప్పు. నేనిప్పుడేమిచేయవలెను. నీవేమిచేయమని చెప్పిన అట్లే చేసెదను."

అని మంథర రెండు భుజములు గట్టిగా కుదుపుతూ అట్లే నేల మీదికి దిగజారినది. మంథర కూడ కైక ఆవేదనను తెలుసుకొని, ఆమెతో పాటే క్రింద కూర్చుని తల, వీపు నిమురుతూ, కళ్ళు తన కొంగుతో అద్దుతూ.

"మహారాణీ! చింతించకు-నేను నీకు తగిన ఉపాయము చెప్పెద-దాన ఎవరికినీ ఎట్టి అపాయము కలుగదు. నే చెప్పినట్లు చేయుము. అన్నియు చక్కబడుతవి"

కైక మంథర మాటలను చెవి యొగ్గి వినసాగింది.

## మంథర దుర్బోధ

మంథర ఇట్లా చెప్పసాగింది.

నీవు లోగడ మహారాజుగారి నుండి రెండువరాలను పొంది యున్నావుకదా! జ్ఞప్తికి తెచ్చుకొనుము నాకీ విషయమును నీవే ఒకప్పుడు చెప్పినావు.

"దేవీ! పూర్వం దేవతలకు, అసురులకు జరిగినసంగ్రామం అది. ఆ సంగ్రామానికి, సకలయుద్ధవిశారదవైన నిన్ను కూడా దశరథ మహారాజు వెంట తీసుకొనిపోయినాడు. దండకారణ్య ప్రాంతంలో 'వైజయంతము' అనే పట్టణాన్ని రాజధానిగా చేసుకొని (తిమిధ్వజుడు) శంబరుడనే రాక్షసుడు పాలిస్తున్నాడు. శంబర పాలితమైన ఆ రాక్షస పట్టణాన్ని దశరథుడు ఇంద్రునికి సహాయంగా

తన సేవతోను, రాజర్షిగణంతోను చుట్టూముట్టాడు. అప్పుడు మహారాజుకు, శంబరునికి ఘోరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో దశరథుడు తీవ్రంగా గాయపడి తెలివితప్పినాడు. యుద్ధరంగం నుండి నీవాయనను వ్యూహము ప్రకారము తప్పించి, ఉచితోపచారము లొనర్చి ప్రాణములను కాపాడితివి. అందులకు మిక్కిలి సంతోషపడిన రాజు నీకు రెండు వరములను ప్రధానము చేసెను. అట్టి వరములను "నాకవసరమైనప్పుడు ఈ వరములను నేను తమనుండి గైకొందును" అని ప్రభువుతో చెప్పితివి. అతడును "అట్లే" యనినాడు.

"రాణీ! జ్ఞప్తికివచ్చినదికదా! నీవు చెప్పినదానినే నేను మరువక జ్ఞప్తియందుంచుకొనినాను. ఆ రెండు వరములను రాజునుండి నీవు పొందు, అవసరమిప్పుడు వచ్చినది. చెప్పెదనువినుము- ఒకటి-భరతునకు యౌవరాజ్య పట్టాభిషేకము. రెండవది-రాముడు పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసమున కేగుట, అట్లయిన రామునకు బదులు నీ కుమారుడు పట్టాభిషిక్తుడగును. పదునాలుగు సంవత్సరముల తరువాత రాముడయోధ్యకువచ్చినను, ప్రజలు భరతునే తమ రాజుగా భావింతురు.

లోపల నిప్పులు రగులుస్తూ, బయటికి అమృతోపమానములుగ పలుకు మంథర మాటలయందలి ద్రోహచింతనను కైక అర్థము చేసుకొనలేక పోయినది. మంథర బోధలవల్లమారిన తన మనస్సున కావంకరది ఎంతోమేలుచేయు ఆపద్బాంధవిగా తోచినది, 'ఎంత మంచిది మంథర...ఆమె శరీరము వంకరయైననేమి మనస్సుపాల సముద్రము - ఇన్నాళ్ళకీమెను సరిగా అర్థము చేసుకొంటిని.

కైక :- చెప్పుము మంథరా! నా కుమారుడు భరతుడు రాజ్యాధికారియగుటకు, రాముని పట్టాభిషేక ప్రయత్నములు ఆగుటకు ఇంకను నేనేమి చేయవలెను.

మంథర :- నీవు వెంటనే కోప గృహములో చేరుము. నీ భర్త వచ్చుసరికి ఏమాత్రము ఉలుకక, పలుకక అలకదీరి తొంగుండుము. రాజు వచ్చి నిన్ను బ్రతిమాలును. భంగపడును. కాని మాత్రము

ఆతని దీనాలాపములకు కరిగిపోక, అతనికడ ముందే న్యాసముంచిన రెండు వరములను అడుగుము. నీవు నీ పట్టును విడనాడితివా? నీవే యరణ్యములపాలు కాగలవు.

కైకేయి మంథర చెప్పిన మాటలను శ్రద్ధగా విన్నది. మంథర వెళ్ళిపోయింది.

## కోపగృహంలో కైక

మంథర బోధ తలకెక్కిన కైక, ఆమెకు తెలియకుండానే తల తిక్క కైక అయింది. ఆమె తన ఒంటిమీదనున్న నగలనన్నింటినీ చకచకా తీసివేసింది. తుమ్మెదల ఝారువంటి నునుపైన కేశపాశము విర బోసికొన్నది. నల్లని వస్త్రమును ధరించినది. తలకు వాసిన ఒక నల్ల గుడ్డ దట్టించి బిగించినది. చీకటి గదిలోనికి వెళ్ళి కటిక నేలపై పరుండి నది. కైకలో ఆవేశించిన కోపము గదినిండా ఆవేశించినట్లు ఎటువంటి సడీ చప్పుడు లేకుండా మౌన ముద్రాంకితమై యుంది. కైకేయి కోప గృహంలోనికి ప్రవేశించినదని తెలుపుటకో యన్నట్లు ఆమె మందిర మంతా కళావిహీనమై యున్నది.

కళావిహీనమై, నిశ్శబ్దము తాండవిస్తున్న కైకేయీ మందిరానికి ఆ రాత్రి దశరథుడు స్వయంగా శ్రీరామచంద్రుని పట్టాభిషేక వార్తను ప్రియపత్నికి చెప్పడానికి ఉత్సాహము పరుగులు తీస్తుండగా వచ్చాడు. మందిరంలోనికి అడుగుపెట్టగానే అందలి పరిస్థితులు కొంత దశరథునికి అవగాహన అయినవి. మందిరంలో ఏదో అసాధారణమైన పరిస్థితి నెలకొని ఉన్నదని. అయినప్పటికీ, తానువచ్చిన సంగతి తెలియ జెప్ప డానికి ఎవరైనా పరిచారికలు కనిపింతురేమోనని చుట్టూ కలయ జూచాడు. సమీపంలో ఎవరూ కనిపించలేదు. చేయునది లేక దశరథుడు తానే స్వయంగా కైకేయీ మందిరంలోనికి అడుగుపెట్టాడు. అత్రుతతో కైక విశ్రాంతి నిలయంలోనికి ప్రవేశించాడు. అక్కడ ఆమె కనిపించ లేదు. అందుండి మెల్లగా కోపగృహం వైపుకు నడిచాడు. కోప

గృహంలో అడుగుపెట్టగానే అతని కాలికి ఏమో తగిలినది. వంగి చూచెను. కైకేయి క్రింద పడుకొని యున్నది. దశరథుడు ఆమెను చూచి "ఏమి కైకా! ఇది యేమిటి? నేలపై పరుండి యుండుటకు కారణ మేమి? ప్రియసఖీ! ఎప్పుడూ చక్కని నగలను ధరించి, సర్వాభరణ భూషితవై యుండు నీవు పత్ర, పుష్ప, ఫలములన్నియు రాలిపోయిన వట్టి మ్రోడువలె నిరాభరణవై తేజమును కోల్పోయి యున్నావు. ఏమి నీ యారోగ్యము బాగుండలేదా! లేకపోయినచో చికిత్సకై రాజవైద్యులను పిలిపించుకొనకపోయితివా! అది కానిచో, దేవీ! నీకు ఇప్పుడు వచ్చిన బాధ యేమి చెప్పుము" తన్నివారణమాలోచింతును.

## దశరథుని కైకేయి వరములు నడుగుట

అంతట కైకేయి కొంత ఈసడింపు, విసుగు, కోపము, చలము ముప్పిరిగొనగా భూమిపై పరున్నది. లేచి కూర్చుని యిట్లన్నది.

"నాథా! మీరన్నట్లు నాకేమీ అనారోగ్యము కలుగలేదు. నీవు నాకొక మాట యివ్వాలి. అది నెరవేర్తునని కూడ మాట యివ్వాలి. అంతే-"

దశరథుడు కైక మాటలు విని వెంటనే "కైకా! ఏమి మాట నీవు నాకు మిక్కిలి ఇష్టురాలవు కదా! నీవు కోరడమూ, నేను ఆ కోరికను తీర్చకపోవడమూనా! నీవడిగిన దానికి ప్రత్యేకముగా "ఇత్తును తీర్తును" అని మాట యివ్వాలా?" ఆశ్చర్యముగ నున్నదే. "దేవీ! నీలో క్రొత్తగా ఏదో మార్పు వచ్చినట్లున్నది" అని పలికెను.

అందుకు కైకేయి "మీరింకేమీ మాట్లాడవలదు. మీరు మాట యిచ్చి తీరాల్సిందే, మాటకాదు...వరదానము.

దశరథుడు వరదానమా! ఇక్ష్వాకు వంశములో జన్మించిన నేను ఇచ్చిన మాటను నిలబెట్టుకొనలేని యసమర్థుడననుకొంటివా కైకా!

సందేహించక అడుగుము. నాకు ప్రియాతి ప్రియమైన రాముని పై యాన. ఈ శుభ సమయములో నీ కోరిక తప్పక తీర్చుదును.

కైకేయి :- రాజా! నీవు పూర్వము శంభరాసుర యుద్ధములో నాకు రెండు వరములను ఇచ్చితిరి. వాటిని నాకు కావలసి వచ్చినప్పుడు తీసికొందునని చెప్పి, వానిని మీ వద్దనే అట్లే యుంచితిని. నాకు నేడు ఆ రెండు వరములు అవసరము. మీరు ఆడితప్పని వారని నాకు తెలుసును. ఆడి తప్పనని బాస కూడా చేశారు.

దశరథుడు :- కోరుకొనుము దేవీ! నీవడిగిన కాదందునా!

కైకేయి :- అట్లయిన సరే. ఒకటి రాముడు పదునాలుగు సంవత్సరములు జటాధారియై యరణ్యవాసము చేయవలెను, రెండవది రేపు భరతుని యౌవ రాజ్యాభిక్తుని గావించవలెను. ఈ రెండు వరములను మారు మాటాడక, తడయక నా మనః ప్రీతిగా చెల్లించవలెను. అట్లు చెల్లించనిచో మీరనినట్లు ఇక్ష్వాకుల గౌరవ ప్రతిష్ఠలను నిలబెట్టిన వారగుదురు.

దశరథుడు, కైకేయి మాటలు విని మొదలుతెగిన కదళీ వృక్షమువలె హఠాత్తుగా మూర్ఛనొంది నేలకొరిగెను. కొంతసేపటికి తెలివివచ్చి దుఃఖించుచు దశరథుడు ఇట్లు పలికెను. కైకేయీ! ఎంతటి ఘోరమైన కోరికలను కోరితివి. రాముడు నిన్నెప్పుడూ దూషించలేదే. ఎప్పుడూ నీ యెడ ప్రియముగా ప్రవర్తించలేదే. తన కన్నతల్లి కన్న యెక్కువగా నిన్ను ప్రేమించువాడు కదా! చీమకైన అపకారము చేయని రాముడు అరణ్యవాసము చేయుటయా! ఈ సువిశాల సామ్రాజ్యమునకు భావి మహారాజునిగా తనయైన శ్రీ రామచంద్రునే సదాభావించి, గౌరవము చూపు భరతుని యౌవ రాజ్యాభిషిక్తునొనరించుటయా! మహా వృషభ రాజమేనియు మోయలేని భార ధూర్వహతను చిన్ని లేగదూడ మోయగలదా? కైకేయీ నీవు కోరిన వరములను ఉపసంహరించి, నన్ను మాట తప్పని వాడిగా చేయుము. ఆనాడు నీవనినట్లు యుద్ధమున నీ సహాయము వలన విజయలక్ష్మిని చేపట్టి

గలిగితిని. అదే విధముగ ఈనాడు నీ సహాయముచేతనే రఘువంశపు కీర్తిని నిలబెట్టగలిగిన వాడనగుదుము. కార్యహాని, యశోహాని, తుదకు ప్రాణహానికి హేతువైన నీ కోరికలను మానుము. నీకు ఆజన్మాంతము కృతజ్ఞుడనై యుందును. కాదు కూడ దందువేని, చివరకు నీ పాద ములు పట్టుకొందును కైకా! నీ వరములను వెనుదీసుకొనుము. లేదా, సకల సద్గుణ సంపన్నుడైన రామునసైను అడవులకు పంపమను కోరికను విడనాడుము. మనకున్న అపారమగు సేనలోగానీ, సేవికా సేవకులలో గానీ ఎవరూ రాముని యెడ యసంతృప్తిగా లేరు. రేపే రాముని యౌవరాజ్య పట్టాభిషేకోత్సవమును నిర్ణయించి, సకల విధము లైన యేర్పాట్లను గావించితిమి. ఈ దశలో నీవిట్టి విపరీతములను కోరుట న్యాయము కాదు. దాన, దయా, ధర్మవీరుడైన రాముడే యీ రాజ్యమునకు రాజు కావలెనని కోసలదేశ వాసులందరి కోరిక. వారి కోరికను తీరని కోరికగా చేయకుము.

ఓ కైకేయీ! వృద్ధుడను, సదా నీ వాక్య బద్ధుడను. ఇప్పుడా సన్న మృత్యుడనైన నన్ను ఈ వరములనెడి దారుణ శర ఘాతము లచే ఛిద్రము మొనర్చి చంపకుము. నాపై దయ చూపుము దేవీ! యని దైన్యము, కరుణ లోలోపల చెప్పరాని బాధచే కుమిలిపోవుచున్న దశరథుడు కైకేయిని పరి పరి విధముల ప్రార్థించెను.

అప్పుడు కైకేయి దశరథుని యెడ మరింత కోపమవలంబించి, 'రాజా! నీవు నాకు మనస్ఫూర్తిగా రెండు వరములిచ్చియు, ఇప్పుడు తప్పు జూచుచున్నావు. ఆడి తప్పు జూచుట నీకభ్యాసములోనున్నదే కదా! మున్ను శ్రీరాముని, విశ్వామిత్రులు యాగ రక్షణకై తనతో పంపుమని మిమ్ము కోరినప్పుడు కూడ, "మొదట ఆ మునితో మీరేది కోరిన యది యిత్తునని మాట యిచ్చి, మహాత్యాగమును ప్రదర్శించి, పిమ్మట రాముని తన వెంట పంపుమని కోరగా, "నేను రాముని పంపజాలనని వాపోయితిరి. అప్పుడు విశ్వామిత్రుడు రాజా! మీరు

మీ ప్రతిజ్ఞ భంగజనిత పుణ్య విశేషమును యథేష్టగా ననుభవింపుడని యధిక్షేపింపలేదా! ముఖస్తుతి మాటల పబ్బము గడుపుకొన నలవాటు పడిన మీరు యిప్పుడు వేరువిధముగ నేల ప్రవర్తింతురు. భావితరము వారు వాగ్దాన భంగముచే కలుగు పాపమును మూటకట్టుకొన్నవానిగా రఘువంశములో నిన్నే చెప్పెదరు. మహారాజా! నేనుకోరిన దధర్మమో ధర్మమో ఉచితమో అనుచితమో! ఏదిఏమైనను మీ రిచ్చిన మాట ప్రకారము నేనడిగిన రెండు వరములను నెరవేర్చి కీర్తిమంతులు కండు. లేదా మీరు నిర్ణయించుకొనినట్లు రామునే యభిషిక్తు నొనరింప యత్నించుచో నేనిప్పుడే మీముందే విషము త్రావి చత్తును, యని నిష్కర్షముగ చెప్పెను.

దశరథుడు దారుణశూలములవంటి కైక మాటలు శ్రవణపుటములను భేదించగా వెఱ్ఱెత్తిన వానివలె తరితప్పిన తడబడుమాటలతో మిక్కిలి దుఃఖించు కైకను నిందించెను.

మంథర దుర్బోధను, సుబోధగా మనస్సు కెక్కించుకున్న కైక, రాజు ఎంత బ్రతిమాలినను లేశమైనను చెవినబెట్టలేదు. దైవము దుర్భలమైన ఎట్టివారికేని తీరని యిడుములు తప్పవు కదా!

## శ్రీరాముడు కైకేయి మందిరమునకు వెడలుట

సుమంత్రుడు మహారాజు దర్శనార్థమై కైకేయి మందిరానికి వచ్చాడు. ఆతని రాకను విని కైకేయి చరచర సుమంత్రుని చేరి ఒకచోట కూర్చుండ నియోగించి, యిట్లు పలికెను. "సుమంత్రా! నీవు రాజాజ్ఞగా వెంటనే రాముని వద్దకు వెళ్ళి ఆతనిని యీ రాజ మందిరానికి తీసుకొనిరా. మహారాజు రాత్రి ప్రొద్దుపోయే వరకు రేపటి యౌవరాజ్య పట్టాభిషేకోత్సవ విషయమునే చర్చించుచూ ఇంతకుమునుపే నిద్రలోనికి జారుకొనినారు, వారికి కొంతసేపు విశ్రాంతి యవసరము. ఈలోపుగా నీవు పోయి శ్రీరాముని యిటకు తోడుతెమ్ము. రాజుగారు రాముని చూడగోరుచున్నారు. నేను మీ కిప్పుడు చెప్పినదే రాజుగారి యాదేశము. వెళ్ళుడు. త్వరగా రామునితో మరలిరండు" అని చెప్పినది.

సుమంత్రుడు అట్లే తల్లీ! యని రాజుగారిని చూడలేని దిగులుతో అక్కడినుండి వదలివెళ్ళెను. శ్రీరాముని మందిరమునకు సుమంత్రుడు వెళ్ళి అక్కడి కావలివానిచే శ్రీరామచంద్రునికి తానువచ్చిన వార్తను తెలియబంపెను.

కావలివాడు రామచంద్రుని వద్దకు వెళ్ళి సుమంత్రుని రాకను ఎరిగించెను. శ్రీరాముడు సీతాదేవితో సాక్షాత్తు లక్ష్మీనారాయణుల వలె సాలంకృత సుఖాసనముపై కూర్చొనియుండెను.

సుమంత్రుని రాక విని రాముడు చిరునవ్వుతో సాదరముగా అతనిని లోనికి ఆహ్వానించెను.

సుమంత్రుడు:- రామచంద్రా! మీ తండ్రిగారు మాత కైకేయీ మందిరమున విశ్రాంతి గొనుచున్నారు. వారు మిమ్ములను చూడగోరుచున్నారు. వెంటనే తోడి తెమ్మని మీ కడకు నన్నంపినారు. రాత్రి చాల ప్రొద్దుపోవువరకు మీ పట్టాభిషేకమును గురించిన విషయములనే మాట్లాడుచుండిరట- ఆ విషయములే మీకు వివరించుటకు రమ్మనియుందురు.

సుమంత్రుని మాటలు శ్రద్ధగా నాలకించి రాముడు ఏమియు తొణకక, బెణకక, వెంటనే సుమంత్రునితో బయలుదేరెను. ప్రక్కనే లక్ష్మణుడు ద్వారము చెంతనుండి వెంబడించెను.

రామలక్ష్మణులిరువురు వాకిలిలో సాలంకృతమై సిద్ధముగా ఉన్న రథమును అధిరోహించెను.

కన్నుల పండువుగా అలంకరించిన రథముపై ప్రయాణమైనారు. వీధుల్లోను, గృహాంగణములలోను, భవనములపైనను, పౌర జానపదులు వేలసంఖ్యలో గుంపులు గుంపులుగా బారులుతీరి, రాకుమారులను కుతూహలముతో వీక్షించుచుండిరి. మేడలమీద నిలుచుండినవారు శ్రీరామునిపై పూలవర్షమును కురిపించుచుండిరి. చూచువారందరూ కనురెప్పలార్పకుండా కాబోవు అయోధ్యాపతియైన శ్రీరామచంద్రుని ముగ్ధమోహన సుందరాకారమును తిలకించుచుండిరి.

వారు తమలో "ఆహా! మనకికనుండి యీ శ్రీరామచంద్రుడే ప్రభువుకాగలడు. మన యదృష్టము వలన సకల సద్గుణరాశియైన యీ మహానుభావుడు రాజగుచున్నాడు. దైవమిట్టి లోకోత్తరగుణాధిక్యుని మనకు ప్రభువుగా చేయుచున్నందులకు ఎంతయు స్తుతిపాత్రుడు. సత్యసంధుడు, ఋజువర్తనుడు, స్మితపూర్వభాషి, మహిధన్వి, కరుణావరుడు, ఆశ్రిత వత్సలుడు, వినయాది సద్గుణభూషణములు గల శ్రీరామచంద్రునకన్న వేరెవరు ఈ రాజ్యమునకు రాజు కాగలవాడు - ఇక మనకేటువంటి కష్టములు ఉండబోవు. వృద్ధుడైన దశరథ మహారాజు, రాముని రాజుగాచేసి, మనకు ఒక గొప్ప వరమొసంగినాడు" అని తలపోయుచుండిరి.

మంగళవాద్యములు దిశల మార్మోగుచుండగా రామలక్ష్మణులు తమ వాహనములతో, ముఖ్య పరిచార గణం వెంబడించగా సుమంత్రుడు ముందు నడువగా కైక మందిర ప్రాంగణమును సమీపించిరి. రాముడు భద్రగజము దిగుచుండగా ఆకస్మికంగా తన ఎడమ కన్ను అదరడం గమనించాడు.

నిర్నిమిత్తముగా సంభవించిన దుర్నిమిత్తమునకు కారణమాతని యూహలో స్ఫురించకపోయినను మనసులో కొంత అనిశ్చిత యేర్పడినది. వెంట వచ్చిన పరివారము ప్రధాన ద్వారమునందే ఆగిపోయిరి. సుమంత్రుడు రామలక్ష్మణులు మందిరములోనికి ప్రవేశించిరి.

అంతవరకు మూర్ఛనొంది అప్పుడే మేల్కొని మౌనముద్రదాల్చి కూర్చొనియున్న తండ్రిని రాముడు సమీపించెను. దశరథుడేమియు మాట్లాడలేక రాముని వైపు నిస్తేజముగా చూచుచుండెను. విషణ్ణవదనుడైన తండ్రిని చూచి రాముడు క్షణకాలం విస్మయమొందెను. రాముడు తండ్రి పాదములకు నమస్కరించెను. పిమ్మట లక్ష్మణుడు నమస్కరించెను. సుమంత్రుడు దశరథునకు సాష్టాంగ నమస్కారము సల్పి లేచి ప్రక్కకు జరిగి వినయపరుడై నిలుచుండెను.

ఎట్టకేలకు దశరథుడు తనను తాను కూడదీసుకొని ఎదుట ప్రాంజలియై నిలుచున్న రాముని చూచి "రామా!" అని యేదియో చెప్పబోయి, తరువాతి మాటలు పెగలక గద్గదస్వరము కలవాడై మరల మూర్ఛనొందెను. అశక్తుడై అవశుడైన తండ్రి పరిస్థితి చూచి రాముని మనస్సు ఎంతగానో క్రుంగిపోయింది.

ప్రక్కనేయున్న కైకేయిని చూచి "అమ్మా! తండ్రిగారు ఎందుకో నా ముఖమునైనా చూచుటకిష్టపడనట్లున్నారు. నేనేమి తప్పు చేసితినో తెలపండి"

కైకేయి రామునితో ఇట్లు బదులు పలికెను.

"రామా! నీ తండ్రి నీకవశ్యముగా ఒక మాట చెప్పవలెనని పిలువబంపిరి. కాని తీరా నీవు వచ్చుసరికి తాను చెప్పు మాటలకు నీవు బాధపడుదువేమోనను సంశయముతో మిన్నకున్నారు."

రాముడు :- ఆహా! తల్లీ! నీవుకూడ సంశయించుచు మాట్లాడుచున్నావేమి? నేను తండ్రి మాటకు ఎన్నడైన బదులు పల్కితినా? తండ్రి యాజ్ఞనెప్పుడైనా కాదంటినా!

తల్లీ! సంశయించక నీవైనను తండ్రిగారి అంతరంగమును నాకు వివరించి చెప్పుము. నేను అవశ్యము నెరవేర్తును.

కైకేయి :- రామా! నీ తండ్రి లోగడ నాకు రెండు వరముల నిచ్చిరి. ఆ వరములు నాకివ్వవలసి వచ్చిన సమయమున, మాట తప్ప వలసి వచ్చినదేయని బాధపడుచున్నారు. అప్రియము, సమయోచితము కాని స్వధర్మ నిర్వహణమునకు సంబంధించిన వార్తను, నీకు చెప్పిన ఎట్టి విపరీతములు వాటిల్లునోయని సంశయించుచు విస్మృతి చెంది యున్నారు. కనుక మీ తండ్రిగారు నీకు చెప్పడానికి సంశయించు చున్న మాటలను నేనే విశదముగా చెప్పుచున్నాను సావధానుడవై వినుము.

రాముడు:- తండ్రిగారెట్టి వరములు నీకిచ్చిరో ఆ వరములను వివరింపుము - సావధానుడనై వినెదను. వినుటయే కాదు నా వలన కావలసినదేదో అద్దానిని తప్పక నెరవేర్తును. "రామా! నీవు అగ్నిలో దూకుమన్న దూకుదువు, అందుకు సందేహించపనిలేదు. తల్లీ! ఆజ్ఞ నీదైననుసరే. అద్దానిని తండ్రి యాజ్ఞగానే భావించి తు.చ తప్పక నెరవేర్తును.

కైకేయి : రామా! వినుము-పూర్వము దేవతలకు రాక్షసులకు అనేక యుద్ధాలు జరిగేవి. ఆ యుద్ధాలలో మీ రఘువంశీయులైన పూర్వ రాజన్యులు ధర్మ పక్షులైన దేవతలకు సహాయకారులుగా వెళ్ళి సహకరించి, విజయమును చేకూర్చుచు వచ్చిరి. అట్టి రఘు వంశపు పూర్వ రాజన్యులవలెనే మీ తండ్రి ఇంద్రునికీ, శంబరునికి జరిగిన యుద్ధంలో, ఇంద్రునికి సహాయకారిగా ససైన్యంగా వెళ్ళాడు. ఆ సమయంలో మీ తండ్రికి తనకు సహాయంగా నన్ను కూడా తీసుకొని వెళ్ళారు. అప్పుడు యుద్ధంలో ప్రాణాంతకంగా శత్రువులు చేసిన తీవ్రమైన గాయాలతో పోరాడి రథం మీదనే ఒరిగి పడిపోయినారు. ఆ సమయంలో వారిని తప్పించి, గాయాలకు చికిత్సచేసి, వారి ప్రాణాలను కాపాడినాను. నేను తనను రక్షించితినన్న కృతజ్ఞతతో వారు నాకు రెండు వరములను అనుగ్రహించారు. అట్టి వరాలను నేను అప్పుడు కోరక, అవసరమై ఇప్పుడు కోరినాను. ఆ వరాలను నీ తండ్రి తరఫున జ్యేష్ఠుడవైన నీవు నెరవేర్చి, నీ తండ్రిగారి మాటను నిలబెట్టవలయును.

రామా! ఆ రెండువరాలు ఇవి. ఒకటి ఇప్పుడు జరుగుచున్న నీ యౌవరాజ్య పట్టాభిషేక ప్రయత్నమును వెంటనే ఆపి, భరతునికి అదే ముహూర్తములో యువరాజుగా పట్టాభిషేకము జరిపించుట. రెండవది నిన్ను వెంటనే అరణ్యవాసమునకు పంపించుట రామా! యీ రెండును అవశ్యము జరిగి తీరవలయును. కారణములునన్నాద

వద్దు. నీ తండ్రి యిచ్చినవి నీవు పాటింతునని గట్టిగా అన్నావు, కావున నీ తండ్రి తలంపుగా కాదు. ఆజ్ఞగా నీకు నేను వివరించి చెప్పితిని మరొక్కసారి వినుము రేపటి సుముహూర్తమునకు నీకు మారుగా నీ తమ్ముడైన భరతుడు యౌవరాజ్య పట్టాభిషిక్తుడగుట. అదే సమయమున నీవు పదునాలుగేండ్లు జటాకల్కలధారివై అరణ్య వాసమునకేగుట.

రాముడు కైక యాడిన మాటలకు ఏ మాత్రము చలించలేదు. నిస్తరంగ నీరధవలె గంభీరముగా క్షణకాలము కైక ఎదుట నిలుచొని యున్నాడు. పిమ్మట రాముడు కడుదీనముగా!

"తల్లీ! ఇంతమాత్రమునకే తండ్రి దుఃఖింపవలెనా! భరింపలేని బాధతో మూర్ఛాక్రాంతుడుకావలెనా! ఈ స్వల్పమైన వరదాన కారణమునకే తండ్రికిట్టి యాపదయా! ప్రియజననీ! ఈ మాత్రపు దానికే అప్పటి వరదానరూపములో తండ్రి ఇప్పుడే యడుగవలయునా! వారిప్పుడు నాకు చెప్పినట్లు మీ యాజ్ఞగా మీరే స్వయంగా నన్ను పిలిచి చెప్పిన మీయాజ్ఞను అక్రమముగా తక్షణమే పాటించెడి వాడనుకదా! తండ్రిగారి దుఃఖమును చూడలేకున్నాను. ఒక్క మాటేనియు వారు నాతో మాటలాడుటకు ఇష్టపడకున్నారు. ఏది ఏమైనను సరే, మీయాన తీరున ఇప్పుడే నేను అన్నియేర్పాట్లు గావించుటకు చర్యగైకొనెదను. నేనే స్వయంగా సీతతోను, తల్లిగారైన కౌసల్యతోను ఈ విషయమును చెప్పి వారిని ఒప్పించెదను. అన్ని పనులు సక్రమముగానే జరిగితీరును. అని రాముడు కైకతో చెప్పెను.

కైక : అటులైన మీ తండ్రి మనస్సు తప్పక కుదుటపడును. నీ వన్నట్లు ఇప్పుడే భరతుని రప్పించెదను. నీవు మాత్రము ఆలస్యము చేయక వనవాసమునకు తగు ఏర్పాట్లు గావించుము. కైకేయికి, రామునకు మధ్యన జరిగిన సంభాషణమును లక్ష్మణుడు మౌనముద్ర

దాల్చి యూరకున్నాడు. విస్ఫోటించుటకు సిద్ధముగానున్న అగ్ని పర్వతమువలె కుత కుతలాడిపోతూ అన్న మొగముచూచి మిన్నకుండి పోయినాడు. కైక అన్న చివరిమాటలు దశరథుడు విని మరింత దుఃఖితుడై కుమిలిపోయెను.

## కౌసల్యా మందిరంలో శ్రీరాముడు

శ్రీరామచంద్రుడు లక్ష్మణుడు వెంటరాగా కైకేయీ గృహము నుండి, ధీరగంభీర విగ్రహుడై కాలినడకతో కౌసల్యా మందిరానికి బయలుదేరాడు. కదలి వచ్చే ధర్మంలాగున లక్ష్మణ సహితుడై వస్తూ వున్న తనకుమార రత్నమునుగాంచి కౌసల్య మిన్నంటిన సంతోష ముతో ఉప్పొంగి పోయింది. కుమారునకు ఎదురుగా వెళ్ళి రెండు చేతులు చాచుచు రామా! నా చల్లని కడుపుపంట-నాకు కనువిందు చేయవచ్చితివా తండ్రీ! నీకు కోటి శుభములు కలుగుగాక!" అని కుమారుని ఆశీర్వదించి కొడుకులిద్దరినీ ఉచితాసనములపై కూర్చుండ నియోగించెను. వారిరువురు తల్లియెదుట వినమ్రులై తలవంచి, ఆమె పాదములకు నమస్కరించి కూర్చుండిరి.

తన తల్లికి ఇప్పటి రాచ కార్యములలో తక్షణము జరుగనున్న మార్పులను గురించి తెలియదు కాన ఉత్సాహభరితయై యున్నది. అసలు విషయము తెలిసిన యెంతగా కుమిలి పోలారునో కదా! అయినను చెప్పక తప్పదు.

రాము :- అమ్మా! నీకును, సీతకును, లక్ష్మణునకు ఒక పెద్ద కష్టము వచ్చి వాటిల్లినది. తండ్రిగారి ఇప్పటి యాజ్ఞ ననుసరించి నేను పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేయవలసి యున్నది. ఇదే సుముహూర్తమునకు తమ్ముడైన భరతునికి యౌవరాజ్య పట్టాభి షేకము గావింపబడును. ఇది రాజాజ్ఞ! అంతకంటెను పితృాజ్ఞ. కావున అవశ్యము నేనీ యాజ్ఞను పాటించి తీరవలయును,

కౌసల్య రాముని మాటలు వినినతోడనే మూర్ఛిల్లినది. రాముడు తల్లి లేపనెత్తి కూర్చుండబెట్టి, ఒడలంతయు నిమిరి ఆమెను స్వస్థత పరిచినాడు.

తల్లీ! ఇది దుఃఖించుటకు సమయము కాదు. తండ్రిగారు కైకమ్మ తల్లికిచ్చిన రెండు వర దానములను అవశ్యము నెరవేర్చవలెను. అవి నేను నెరవేర్చకపోయినచో కలుగు విపరిణామములు మిక్కిలి దుర్భరముగా నుండును. నీవును, సుమిత్రా మాతయు, లక్ష్మణుడును, సీతయు ధైర్యము కూడదీసికొని, తండ్రిగారి యోగక్షేమము లరయుచు అయోధ్యలోనే యుండుడు. సత్యసంధుడైన భరతుని శాంతముగా ప్రజా సంక్షేమము నరయుచు రాజ్యపాలనము గావింపనిండు. అమ్మా! నీవు మాత్రము నీ కిష్టమైన వ్రతాదులు, పూజ పురస్కారములచే నిరంతరము పుణ్య సంపాదనము చేయుచు రాజ కుటుంబ సంక్షేమమునకు పాటుపడుము.

కౌసల్య :- దుఃఖముతో రాముని శిరస్సును నిమిరి నాయనా! నీ తండ్రి రేపు నీకు యౌవరాజ్య పట్టాభిషేక మొనర్తునని అన్ని ప్రయత్నములు జరిపించి, నగరమునంతయు సర్వాలంకార శోభిత మొనర్పజేసి చాటింపించుట యంతయు బూటకమేనా! అట్లు కానిచో ఇప్పుడీ హఠాత్పరిణామ మేమి? రామా! కైకేయిపై వ్యామోహముతో, ఆమె కోరికపై రాజ్యమును భరతునికి ఇచ్చుటకు అంగీకరించెను. రాజ కుమారులలో జ్యేష్ఠునికే కదా రాజ్యార్హత చిన్నవానికి ఎటులవచ్చును?

కౌసల్య రామునితో ఈ మాటలు అనుచుండగానే లక్ష్మణుడు లేచి నిలబడి "అన్నా! నీవు ఆజ్ఞ ఇచ్చినచో దురాలోచనాపరులై నీకు తీరని అన్యాయము తలపెట్టిన దశరథుని, కైకేయిని ఇరువురను ఒక్క బాణముతో వధించి, నీ రాజ్యాభిషేక క్రతువును నిర్విఘ్నమొనరింతును. కన్నతండ్రియే యెంత ఎంత దురన్యాయమును తలపెట్టినాడు. అధర్మమున నడిచినవారు తండ్రియైననేమి, తల్లియైననేమి,

కైకేయి మత్తులో పడి మన తండ్రి ఉచితానుచితములను, ధర్మాధర్మములను మరిచి అంధుని రీతి ప్రవర్తించుచున్నాడు.

"అన్నా! నీవు యీ మౌనమును వీడుము", "తల్లీ! కౌసల్యామాతా! అన్నను నేను అనుసరించి, అరణ్యములకు నేను వెళ్ళుదును. అన్నను వదలి నేను ఒక్క నిముషమును వదలియుండను. అయినా భరతుడు తల్లి కోరిక ననుసరించి వచ్చి, అన్నకు మారుగా యౌవరాజ్య పట్టాభిషేకము నంగీకరించునందువా! దురూహలకు పుట్టయైన కైకేయి మాటలను, భ్రాతృసేవా పరాయణుడైన భరతుడెన్నటికినీ అంగీకరించడు ఆమె కోరిక యెన్నటికినీ తీరదు."

లక్ష్మణుడీ మాటలను కౌసల్యతో అనుచున్నపుడు అతని మొగమంతయు కందగడ్డయయ్యెను. కోపావేశముతో అతడనిటు ఊగిపోవుచుండెను.

కైకేయి దశరధుని వరములడుగుటయు రాజు అందుల కంగీకరించుటయు, రేపు తెల్లవారగనే రామునికి బదులు భరతుడు పట్టాభిషిక్తుడగునట యను మాట క్షణములో దావానలమువలె అయోధ్యయంతయు వ్యాపించెను. అయోధ్యానగర ప్రజలు ఈ వార్త విన్నంతనే, వారిలో పెల్లుబికిన సంతోషమంతయు ఆవిరియైపోయెను. వార్త చెవినబడిన వారందరూ పరిపరి విధముల మాట్లాడుకొనుచుండిరి. మహారాజునకీ వార్ధక్యములో ఇట్టి విపరీతబుద్ధి ఏలకలిగినది. ధర్మమూర్తియైన శ్రీరామచంద్రునకిట్టి యపచారము గావించుటకు గైకొనిన నిర్ణయము వెనుక జరిగిన యుదంతమేమి? రాము డరణ్యవాసమునకు వెళ్ళుట- భరతునకు పట్టాభిషేక మొనరించుటకును రెండు విభిన్నమైన అంశములను దశరధుడేల పాలింపవలెను? తన కిష్టభార్యయైన కైకేయి కోరికవలన కాదుకదా! కైకేయి తన కుమారుడైన భరతుని యౌవరాజ్యాభిషిక్తుని చేయమని కోరవచ్చును. కాని రాము నరణ్యవాసమును కోరుట యెంతవరకు సమంజసము?

మాతా! నీవు చింతింపకుము. కైకేయి కోర్కె యేది యెటు లున్నను, గుణాఢ్యుడు ప్రేమమూర్తి యుక్తాయుక్త విచక్షణ జ్ఞాన సంపన్నుడైన భరతుడు మాత్ర మంగీకరింపడు.

నగరములో వ్యాపించిన ఈ వార్తనువిన్న వశిష్టాదులు ఖిన్నులై ఏమియూ మాటాడలేక మౌనముద్ర దాల్చియుండిరి. కోసల రాజ్యమునకు అనతికాల భవిష్యత్ప్రభువుగా శ్రీరామచంద్రుడు యౌవరాజ్య పట్టాభిషిక్తుడు కాబోవుచున్నాడనెడి మధురాతిమధుర మైన వార్తను విన్న ప్రజలు శ్రీరామునిపై తాముంచుకొనిన ఆశ లన్నియు, అడియాశలై కుప్పకూలిపోవుటను సహించలేకపోయిరి.

ముసలితనములో కైకేయి వ్యామోహములో పడి, ఆమె ఆడినది ఆటగా, పాడినదిపాటగా దశరథుడు ఆమోదించి, చెప్పినట్లు చేయు చున్నాడు. ఇక్ష్వాకువంశ ప్రభువైన దశరథ మహారాజు అన్నియు తెలిసి వినబడనవాడై పోవుచున్నాడు. ఇది మిక్కిలి అన్యాయము. దురన్యాయము! అని వాపోవుచుండిరి.

కౌసల్యా మందిరములో లక్ష్మణుడు మరింత మహోగ్రుడై తనపైతాను అదుపుతప్పినవాడై "అమితమైన స్త్రీ కాంక్షతో రాజు, అనుచితమైన రాజ్యకాంక్షతో నిజపుత్రునిపై వ్యామోహముతో కైకేయి ఇట్టి దారుణకృత్యములకు పూనుకొన్నారు కావున ఇప్పుడే వెళ్ళి, వారిరువురిని నిస్సంకోచముగ సంహరింతును. చేవలుదీరిన ఈ నా బాహువులు కేవల మలంకార దృశ్యములు కావు- నేను ధరించు ధనుర్బాణములు ప్రదర్శనము కాదు. ప్రయోజనము లేని పనిని లక్ష్మణుడెన్నడును ఆమోదించడు. అన్నా! నన్ను వారింపకుడు." అని విపరీతమైన క్రోధోద్రేకముచే మాట్లాడుచూ కంపించిపోసాగెను.

సత్యసంధుడు, ధీరనిష్ఠితుడు, పితృవాక్య పరిపాలనా నిరతుడు అయిన శ్రీరామచంద్రుడు లక్ష్మణస్వామి యొక్క క్రోధకంపిత

దారుణ రూపమును చూచి, దరహాసోజ్జ్వలన్ముఖుడై "తమ్ముడా! లక్ష్మణా ఎన్నడును సేవాభావమే తప్ప, తిరుగబడుట యెరుగని నీ సాధుస్వరూపము ఏలకో అదుపుతప్పి యిట్లయినదేమోయీ! నాయనా! ధర్మమెప్పుడూ ఒకేవిధముగా భాసించును. వ్యక్తి యొక్క యిష్టానిష్టములను బట్టి అదిమారదు ఈ సమయమున మన తండ్రి గారి యాజ్ఞ నాకెంతయు శిరోధార్యము. అది జరిగితీరవలసినదే.

కౌసల్య:- తండ్రీ! అట్లయిన నీవరణ్యములకు పోవుటకే నిశ్చయించుకొంటివా!

రాము:— అమ్మా! నీ వెరుగని ధర్మము లేమున్నవి. నేను ధర్మానువర్తిని. నన్నట్లేపోనిండు - నాతోరమ్మని నేనెవరిని కోరను, బాధింపను- నిర్బంధింపను.

లక్ష్మణా! నీకును మరల మరల చెప్పుచున్నాను. పూజ్యుడైన తండ్రిని పదేపదే నిందించి దోషదూషితుడవు కాకూడదు. తండ్రి యందు వైరమును చూపి, అన్నవైన నాయందు భక్తిని సమాచరించుట నాకు సమ్మతము కాదు. ఈ విషయము మాత కైకేయి మాత్రమేమి చేయగలదు. విధివైపరీత్యము. కానికాలమున ఎవరెంత ప్రయత్నించినను కార్యము సానుకూలపడదు. కైకేయి మాతకు నేనంటే ఎంత ప్రేమ కలిగియున్నదో నీ వెరుగనిది కాదుకదా! మాతల్లి కౌసల్యాదేవి కన్నా మిన్నగా నన్ను గౌరవించుట ఎల్లరకు తెలిసినదే కదా! అటువంటి తల్లి ఈనాడు నన్ను విరోధిగా నెంచి, యడవులపాలు గావించుటకు ఉద్యమించినదనినచో విధివైపరీత్యము కాక మరేమిటి?

కాబట్టి ఇందులో ఎవరిని వ్రేలుఎత్తిచూపి దూషించపనిలేదు. రఘువంశపురాజులు ఏనాడు ధర్మపథమునుండి మరలినవారు కారు. హరిశ్చంద్రుడు దిలీపుడు, రఘు మహారాజు, ఎవరూకూడా ధర్మము తప్పకయే విధి విధానముగా తమ రాజ్యపాలనము గావించి ప్రజా

రంజకులై, యశోభుక్కులై, వంశవర్ధనులై ఖ్యాతిగాంచినారు. పుణాత్ములైన మన వంశపూర్వజుల ధర్మనిరతి, సత్యనిష్ఠయే నాకు సర్వ విధముల ఆదరపాత్రము.

"నాయనా! లక్ష్మణా! నిర్నిమిత్తముగ, తొందరపాటుచే అలము కొన్న ఆవేశమును తగ్గించుకొని స్వస్థచిత్తుడవుకమ్ము - తమ్ముడా! నీపై నాకుగల అపారమైన ఆదరమును చెక్కుచెదరనీయకుము" అని రాముడు లక్ష్మణుని నయనహితోక్తుల ఊరడించి సాంత్వన పరచెను. అంత రాముడు కౌసల్యవైపు చూచి "తల్లీ! ఇప్పటికే నా మూలమున మిక్కిలి దుఃఖితవైనావు. నీ దుఃఖమును నే సహించ లేకున్నాను. ఊరడిల్లి నన్నాశీర్వదింపుము" అని వేడెను.

కౌసల్య రాముని హృదయ పూర్వకముగ ఆశీర్వదించి "రామా! వనాలకువెళ్ళి, అచట వనవాసవ్రతములను పూర్తిగా జయప్రదముగ నెరవేర్చి కుశలివై సీతాలక్ష్మణ సమేతముగ మరల అయోధ్యకు వచ్చిన నిన్ను చూచి మిక్కిలి యానందించగలను. సకలదేవతలు, నీకు ఎల్ల వేళల అండగానుందురుగాక దైవమానుషములు మూర్తీ భవించిన నీ సత్య, దయా ధర్మనిష్ఠ లోకోత్తరమై ప్రకాశించుగాక" యని ఆశీరక్షత రాముని తలపై చల్లి, కుమారుని గాఢాలింగన మొనర్చుకొని, ప్రేమతో శిరమును మూర్కొనెను. నీవు, సీత, లక్ష్మణుడు, సుమిత్రామాత, భరతుని ఏలుబడిలో సుఖముగా మీ యభిలషిత కార్యము లొనరించుడి. నాపై చూపు ప్రేమాదరములను, ఇకనుండి భరతుని పైన కూడ చూపి, అతని పరిపాలనా పాటవమ్మునకు శక్తిని, ధృతిని, దీప్తిని కలిగించుడి-కైకయి మిమ్ములను ఏ విధమగు ద్వేషభావముతోను చూడదు. ఒకవేళ చూచినట్లగుపించిన కడు జాగ రూకులై మసలుకొనుడు. నేనిచట ఇంక ఎంత మాత్రమును ఆలస్యము చేయరాదు. తొందరగా వెళ్ళవలయును. ఇప్పటికే ఆలస్య మైనది. సీతా మందిరమునకు వెళ్ళి, ఆమెతో ఈ విషయమును చెప్పి

బయలుదేరెదను-అని రాముడు మాత కౌసల్యకు పరిపరి విధముల సాష్టాంగ దండ ప్రణామములు సలిపి సీతా సదనమునకు బయలు దేరెను.

## సీ త తో రా ము డు

శ్రీరామచంద్రుడు రాజవీధులగుండా పాదచారియై ఒంటరిగా సీతా భవనమునకు బయలుదేరెను. అతని తల కొంచెము క్రిందకు వంచబడినది. అతని తన వెంట వందిమాగధులెవరూ లేరు- ముఖము కళదప్పి యున్నది. మౌనముద్రను దాల్చి, ప్రశాంతగంభీరముగా అడుగులో అడుగువైచుచు తిన్నగా సీతా భవనమును సమీపించెను. భవనములోనికి అడుగిడగానే సీతాదేవి సాదరముగా రామునికి స్వాగతము పలికినది. ఆమెకు అంతవరకు జరిగిన విషయములేమీ తెలియవు. తెల్లవారితే రామపట్టాభిషేకమగుననియే భావించుచున్నది. అటువంటి అత్యుత్సాహభరితయై యున్న సమయములో రాముడు ఆవిధముగా మందిరమున అడుగిడుట మిక్కిలి యాశ్చర్యము కలిగించినది. అంతేకాక స్మితపూర్వ భాషియైన రాముని ముఖారవిం దము అట్లు వసివాడిపోయి విషణ్ణమై యుండుటను సహించలేక పోయినది. ఆమెకు దుఃఖమాగలేదు. కడుపులోనుండి దుఃఖము తెరలి తెరలి వచ్చినది. కన్నీరు కనుగోనలలో నిండుకొనినది. కంఠం రుద్ధమైనది అతికష్టము మీద సీత రాముని సమీపించి, యాతని పాదములకు నమస్కరించి "ప్రభూ ఏమి యిట్లు పాదచారులై, ఒంటరిగా యేతెంచారు? మీ భద్రగజమేమైనది. మంగళతూర్యనాదములు ఏమైనవి ఛత్ర చామరములెటు పోయినవి. ఎల్లప్పుడు పరివేష్టించి యుండు దాస దాసీ జనమువెందుపోయిరి. మీ మోమున సంతోషము కనిపించుట లేదేమి? మీ తండ్రిగారు కైకేయీ మందిరములో మీ పట్టాభిషేకము నిమిత్తము మీతో ముచ్చటించి యుందురా? ఎందులకు మీరిట్లు మౌనముగా నున్నారు?

సీత రాముని యిట్లడవ్యవధిగా ప్రశ్నలపైని ప్రశ్నలను వేయు చున్న సమయములో లక్ష్మణుడు, నతమస్తకుడై రాముని పార్శ్వము ననే నిలుచునియుండెను.

సీత లక్ష్మణునివైపు చూచి "లక్ష్మణా! అసలేమి జరిగినది? ప్రభువులిట్లేల విషణ్ణవదనులై మౌనముద్ర దాల్చియున్నారు.లక్ష్మణు డేదో బదులు పలుక పెదవి విప్పబోవునంతలో రాముడు అతనిని వారించి, సీతతో యిట్లు పలికెను.

"సీతా! నీవు, లక్ష్మణుడు, తల్లులు కౌసల్య, సుమిత్రలు యిందే యుండి, తండ్రిగారియోగక్షేమములను కనుగొనుచుసుఖముగనుండుడు. మీరంతా ఇక్కడనే యుండి, అరణ్యవాసమునుండి తిరిగి వచ్చువరకు అంతఃపురోచిత మర్యాదల నెరపుచు, తండ్రిగారి కీర్తి ప్రతిష్ఠలకు ఎటువంటి లోటు రాకుండా చూడుడు. సీతా! మా తల్లిని కంటికిరెప్పగా కాపాడుచు ఆమె యాదేశములను మన్నించి నెరవేర్చుము. కైకేయి తన కోర్కెను తండ్రితో చెప్పలేక, పూర్వమెప్పుడో తండ్రినుండి వరదాన రూపమున పొందిన రెండు కోర్కెలను యివ్వమని కోరినది. అందు మొదటిది.

పదునాలుగు సంవత్సరములు నేను వనవాస మొనరించుట - రెండవది భరతుని పిలిపించి, నాకు బదులుగా అతనిని యౌవరాజ్యాభి షిక్తుని గావించుట.

మాత కైకేయి కోరిర ఈ రెండు వరములు విన్న తండ్రిగారికి, గొంతులో వెలగకాయ పడినట్లైనది. అవి కైక కోరికపై తప్పక నెర వేర్చవలసినవే. కాని తండ్రిగారి పూర్వ నిర్ణయము ప్రకారము, ఇంత వరకు జరిగిన ఏర్పాట్లననుసరించి, ముఖ్యముగా ఆ మహాత్మునకు నా యందుగల అపారమైన ప్రేమానురాగములననుసరించి, తనకు తానుగానన్నాజ్ఞాపించి, తన మాటను నిలబెట్టుకొనలేక ఖిన్నుడై అవాక్కై వ్యథకు మూర్ఛితులైనారు,

ప్రియా! జానకీ! ఇప్పుడు పితృవాక్య పరిపాలనము నాకవశ్యా చరణీయము - న్యాయ సమ్మతము - ధర్మము.

సీత, రాముని మాటలను మిక్కిలి ఐద్ధాదరముతో విన్నది - అతని మాటలకు ప్రతిగా ఏమియు చెప్పలేదు - కాని రాముని వీడి తాను అయోధ్యలో ఉండుటయన్న పతిదేవుని మాటలను జీర్ణించు కొనలేకపోయినది. శ్రవణ పుటములకు అత్యంత నిష్ఠూరముగా తోచిన రాముని మాటకు, తన సమాధానముగా ఇట్లు పలికెను.

సీత:- నాథా! నేను నీ వెంట అరణ్యమునకువత్తును. నన్ను నీవు వనములకు తీసుకొని వెళ్ళుము. అరణ్యములోనున్న తరి నిన్ను నేను "అది కావలెను, ఇది కావలెను" అని కోరను. బాధింపను. అరణ్యమునందలి ఋషి పత్నులతోను, సాధువులైన వనమృగముల తోను, సహజమైన ప్రకృతి సౌందర్యము నవలోకించుచు ఆనందముగ కాలము గడిపెదను. అరణ్యమున లభించు కంద మూలములను భుజించుచు, ఫలహారమును స్వీకరించుచు నియతాహార విహారమతినై, మీతో కూడి కష్టసుఖములననుభవించుచు తిరుగాడెదను.

"నాథా! నా రాకనడ్డగింపకుడు" అని రాముని బ్రతిమాలెను.

రాముడు:- సీతా! అరణ్యవాసము చాలకష్టము. అందునా అసూర్యంపశ్యవు, సుకుమార శరీరవునైన నీవు అరణ్యముననుండుట సాధ్యముకాని పని. అంతఃపురసౌధసీమలలో హంసతూలికాతల్పము లపై శయనించి, విలాసవంతమైన జీవిత సుఖోపభోగములననుభవింప వలసిన నీవు ఇట్టి బెట్టిదమైన కోరిక కోరుట తగదు. సీతా! అరణ్య మున పాదచారివై కంటశిలాకీర్ణమైన దారులలో నడువవలెను. క్రూర జంతువులైన పులులు, సింహములు, ఎలుగుబంట్లు, పాములు, తేళ్ళు మున్నగువాని మధ్యన, అనుక్షణము అరచేతిలో ప్రాణములు పెట్టు కొని జీవించవలెను. అయోధ్య ఎక్కడ, అరణ్యమెక్కడ? రాజాంతః పురమెక్కడ? కఠినశిలతో, కంటకములతో నిండిన వనభూము లెక్కడ? అష్టైశ్వర్యములెక్కడ, అష్టకష్టములెక్కడ? షడ్రసోపేత మైన సరసాహిత ఫలసముదాయమెక్కడ, కందమూలాదులతో

కటుకము, అరుచికమునైన ఆహారమెక్కడ? జానకి! జన్మాత్ప్రభృతి కష్టమనునది యెఱుంగని కుసుమకోమలమూర్తివి. అరణ్యమున దుస్సహమైన శీతవాతాతపముల కెరయై క్రుగ్గ జూచుట నీకేమోకాని నాకు మాత్రము త్వద్వియోగజనిత దుఃఖ భారముకంటె కడు దుస్సహమైనది సుమా! కావున నీవు నా వెంట వచ్చెడి యభిలాషను, అభిప్రాయమును వదలుకొనుము. అయినను ప్రియసఖి! కైకేయి మాత నన్నొక్కనిని మాత్రమే అడవులకు వెళ్ళగోరినదికాని, నిన్ను గానీ, మరెవ్వరిని కాని వెళ్ళమని కోరియుండలేదు.

సీత :- రామా! భర్త ననుసరించియే భార్యకదా! నిన్ను విడిచి యే ధర్మమును నాకు విధింపబడిలేదు. పతితో కూడి ధర్మాచరణము గావించు ఇల్లాలిని, "సహ ధర్మ చారిణి" అని శాస్త్రములుద్బోధించు చున్నవి. రాముడయోధ్యలోనున్న సీతయు నయోధ్యలోనే నుండును. రాముడు డడవిలోనున్న సీతయు నడవిలోనే యుండును. రాముడు జటావల్కలధారియైన, సీతయు జటావల్కల ధారిణియే. రాముడు కందమూలాదులు భక్షించిన, సీతయు కందమూలములనే భుజించును. ఇది యదియననేల రామునకు సీత అన్నివిధముల సహధర్మచారిణియే. కావున నా రాకను మీరెంత మాత్రము నిరోధించవద్దు. మీరు ధర్మ మూర్తులు. మీకు విధించిన నియమములు, తప్పని సరిగా మీలోకూడిన నాకు విధించినట్లే. ఇన్ని మాటలేల రామచంద్రా! నిన్ను విడిచి నేను ఒక్క క్షణమైనను వుండజాలను.

అరణ్యమున నేను మీ వలెనె స్థండిలశాయినై వ్రతచర్యను నిష్ఠతో సలుపుదును. మీ ధర్మ రక్షణ కార్యములో నేనును సహకరింతును.

ప్రభూ! వేయేల అచ్చట నీ కీర్తి ప్రతిష్ఠలకేమాత్రము భంగము కలిగించను. కావున నన్ను మీ వెంట అరణ్యమునకు తీసుకొనిపొండు. సీత మనోగతమును కూలంకషముగ తెలిసికొనిన శ్రీరామచంద్రుడు ఎట్టకేలకు ఆమె తన వెంట వచ్చుటకు అంగీకరించెను.

తరువాత తమ్ముడైన లక్ష్మణుని వైపు చూచి, "లక్ష్మణా! నీవైనను ఇందుండుము. సీత నా వెంట వచ్చెదననుచున్నది.

లక్ష్మణుడు :- 'అన్నా! నీవెన్ని చెప్పినను నేను ఇక్కడ ఒక క్షణమైనను ఉండను. మీ యిరువురికి సేవ చేయుదును. మీరు ఎక్కడ ఉంటే, అక్కడే నా నివాసము. ఇక మన తల్లులు ఎవరికి వారే సమర్థులు. తండ్రిగారున్నారు కదా! కైకేయి రాజ్యమును భరతునికి కట్టబెట్టినను అతడెన్నటికీ యంగీకరించడు. కావున ఈ పరిస్థితులలో మనము వెళ్ళిన పిదప యెవ్విధానమైనను దశరథమహారాజే రాజ్యమును పరిపాలింపగలడు. కౌసల్యామాత పట్టమహిషి. ఆమెకే లోటు రాదు. ఆమె పర్యవేక్షణలో నా తల్లియైన సుమిత్రాదేవికి ఎట్టి లోపము కలుగదు. నా విషయములో ఎట్టి చింతయు లేదు.

అన్నా! నీవు మరేమియు ఆజ్ఞాపింపక నన్ను నీతో నను మతించినచో, వెంటనే వనములకు మీతోపాటు బయలుదేరుదును.

రాముడు లక్ష్మణుని రాకకు అంగీకరించాడు. వన గమనమునకు వలసిన యేర్పాట్లు చేయుటకు పరివారము నాజ్ఞాపించెను. చేయవలసిన వేదోక్త దానవిధులను నెరవేర్చుటకు సన్నాహపరచవలసినదిగా ముఖ్య పురోహితులను కోరెను. "లక్ష్మణా! నీవును వనవాసగమనోచిత దానవిధులను నిర్వర్తించుటకు నా వెంట నుండుము. తమ్ముడా! మరొక్క ముఖ్య విషయము. జనక మహారాజు మున్ను యజ్ఞము చేసినపుడు, వరుణుడు అతనికి స్వయముగా నిచ్చిన దివ్య ధనుస్సులు రెండు దుర్భేద్యములగు రెండు కవచములు, అక్షయ తూణీరములు, బంగారు పిడికత్తులు మున్నగు వానిని మామగారు నాకిచ్చిరి. వానిని సముచిత పూజార్హమై కులగురువులైన వశిష్ఠుల వారియింట నుంచితిని. వెంటనే నీవు వెడలి వానిని తీసుకొనిరమ్ము" అని ఆజ్ఞాపించెను.

లక్ష్మణుడు తక్షణమే అచటినుండి బయలుదేరి వశిష్ఠునింటికి వెళ్ళి, గురుననుజ్ఞచే పూజా గృహమున నిక్షిప్తమొనర్చిన ఆయుధములను తీసుకొని, రాముని కడకు వచ్చినాడు.

తలపులోనే ఆయుధములనుగొని, మరలివచ్చిన తమ్ముని గారవముతో చూచి, ఆలింగన మొనర్చుకొని అరణ్య గమనమునకు తదుపరి చర్యలకుపక్రమించెను.

## సీతారాములు తమ వస్తు సముదాయమును దాన మొనర్చుట

రాముడు :- లక్ష్మణా! మనమిప్పుడు వనవాస దీక్ష గైకొనవలసి యున్నది. రాజోచితములగు ఈ దుస్తులు, వస్తు వాహనములు పరిత్యజించవలసి యున్నది. మరియును మనకు గల అపారమైన యీ గోధనమును, ఇతర సంపత్సముదాయమును పాత్రులగు వారికి దానము చేయవలసి యున్నది. ఈ కార్యక్రమములను నిర్విఘ్నముగ యథా శ్రోత్రియముగా జరిపించుటకు గురుపుత్రులగు సుయజ్ఞుని నా పక్షమున యాహ్వానింపుము.

లక్ష్మణుడు రాముని యాజ్ఞను శిరసావహించి వశిష్ఠ కుమారుడగు సుయజ్ఞుని యజ్ఞశాలలో నుండగా వెళ్ళి యాహ్వానించెను.

రాముడు గురుపుత్రునికి నమస్కరించి తొలిసారిగా తన చెవులకు అలంకరింపబడియున్న బంగారు కుండలములను తీసి యిచ్చెను. అటు పిమ్మట ఆ బ్రాహ్మణోత్తమునికి, వారు పరుండు శయ్యను దాన మిచ్చెను. ఇంకను అమూల్యమైన గోధనరాశి నొసంగి సుప్రీతుని గావించెను. రాముడు తనకు తన మేనమామ యొసగిన "శత్రుంజయము" అనే పేరుగల యేనుగును, మరి వేయి యేనుగులతో పాటు సుయజ్ఞునికి దానమొసగెను. తరువాత సీతాదేవి సుయజ్ఞుని భార్యకు తన అమూల్యాభరణములను కానుకగా నిచ్చెను. తరువాత అచటికి రప్పింపబడిన బ్రాహ్మణోత్తములకు ఒక్కొక్కరికి వేయికి తక్కువ గాకుండ గోవులను దానమిచ్చెను. ఆశ్రితులకు, గురుతుల్యులైన సాధు పుంగవులకు అనేక విధములైన అమూల్య వస్తు సంభారముల నొసంగి తృప్తులను గావించెను.

అసదృశమైన శ్రీరామచంద్రుని త్యాగ కార్యములకు ప్రజలు ముగ్ధులై రామ వియోగమును సహింపజాలక కన్నీరు గార్చుచుండిరి. రాముడు వనవాసమేగునాటికి ఎవ్వరును లేమిచే బాధపడువారు లేరు. అట్లే మనసులో ఎటువంటి కొదవ లేకుండా సంతృప్త జీవనులై

యుండిరి. అట్టి తమకు ఇకముందు ఎట్టిబెట్టిదపు యిక్కట్లు రాగలవో యని భీతి నొందుచుండిరి.

రామచంద్రుడు లక్ష్మణునితో "తమ్ముడా! నీవు బ్రాహ్మణోత్తము లైన అగస్త్య, విశ్వామిత్రులకు ఆశ్రితుడు మాత కౌసల్యకు వేద, వేదాంగ, ఉపనిషద్విద్యా విశారదుడైన మహానుభావుడు పండితుడగు విప్రోత్తమునికి సముచిత వస్తు వాహనాదులచే సత్కరింపుము. తమ్ముడా! అడుగో సూత మహాశయుడు చిత్రరథుడు, తండ్రిగారికి చిరకాలము నుండియు ఆప్తుడు. ఇతనిని వెలగల మాణిక్యాదులతో సత్కరించుము.

అల్లే సదాచార సంపన్నులైన బ్రహ్మచారులు వేద నాదములతో స్వస్తి వచనములు చేయుచు నాశీర్వదించుచున్నారు. వారిని సత్కరింపుము. అదుగో కౌసల్యా మాత కడకు వేద పారగులైన బ్రహ్మ చారుల గుంపు నిలిచియున్నది. వారిని సాదరముగ ఆహ్వానించి, ఉచిత సత్కారములచే తృప్తి నొందించుము.మనమా విప్రోత్తముల కొసంగు భూరి సత్కార దానములను చూచి మాత కౌసల్య పరమానందభరితయౌ గాక!

అనంతరము రాముడు ఇతర పరిజనమునకు, గృహ పరివారము నకు అభిలషిత ద్రవ్యమును తృప్తిగా నొసగి మీరెప్పటివలెనే రాచ నగరును రక్షించుతూ ఉండండని-సెలవు గైకొనెను.

త్రిజటుడు :- గర్గ వంశమువాడైన త్రిజటుడను బ్రాహ్మణుడు బ్రహ్మవేత్త. బహు సంతానవంతుడు. అతడు ఉంఛ వృత్తిచే బహు కుటుంబ భారమును భరించుతూ జీవించేవాడు. అతడు తన భార్యచేత ప్రేరితుడై కుటుంబయుక్తంగా శ్రీరాముని కడకు ధన సహాయము నిమిత్తము వచ్చెను. అడవిలో కందమూలములను తెచ్చుకొని జీవించు ఆ బ్రాహ్మణునికి యాచించుట యననేమో తెలియదు. తన ఎదుటకు భార్యా బిడ్డలతో వచ్చి విచిత్రముగ కనబడుచున్న పూజ్యనీయుడు, తేజశ్శాలియైన యా విప్రోత్తముని కడకేగి, ఆతనికెంత ధనము కావల యునో తెలుసుకొన గోరి పరిహాస గర్భితంగా చిరునవ్వుతో

మహాభాగా! నీకెంత ధనము కావలయునో నాకు తెలియదు. నీవు నీ చేతనున్న కర్రను నీ యెదురుగనున్న దిశలో నీ సత్తువకొలది ఎంత దూరము విసరగలవో విసరుము - అంత దూరమునగల ఆలమందను నీకిచ్చివేసెదను” అని అనెను.

త్రిజటుడంత తన యుత్తరీయమును నడుమునకు బిగించి, తన బలమునంత వినియోగించి, కర్రను గిరగిర త్రిప్పి విసరినాడు. ఆ కర్ర సరయూనది అవతలిగట్టున పడినది. రాముడు ఆనందముతో త్రిజటుని యాలింగనము చేసుకొని “మహానుభావా! మదిలో కోపగింపకుడు- ఎవరికీ పెట్టని పరీక్షను మీకే పెట్టి యిట్లు చేసితిని. ఇది కేవలము మీ బ్రహ్మదండ వేగమును పరీక్షించుటకే - పరిహాసభాసురమైన యీ పరీక్షతో మీకెంత ధనము వలయునో అంత ధనమును యివ్వదలచితిని. బ్రాహ్మణోత్తమా! మేము సంపాదించిన ధనమంతయు మీవంటి తేజశ్శాలులైన బ్రహ్మవిదుల కొరకు వినియోగించు నిమిత్తమేనని గ్రహింపుడు. అందులకు త్రిజటుడు పరమానందభరితుడై “రామచంద్రా! మీ యాలింగన సౌభాగ్యమే నాకు కోటి సౌభాగ్యముల సమ పూర్చును. నీ సన్నిధి భాగ్యమునందినవాడు దరిద్రుడెట్లగును?” అనెను.

రాముడు మున్ను అన్నమాట ప్రకారము త్రిజటునకు, అతడు కర్ర విసిరినంత మేరకుగల గోరాశినంతను దానమొనర్చి ఇంకను భూరి సిరి సంపదలతో ఆతనిని సత్కరించి పంపెను.

## సీతారామలక్ష్మణులు దశరథుని చూడబోవుట

రాముడు తన వస్తువులను అన్నింటిని బ్రాహ్మణులకు, ఆశ్రితులకు అందరికి విరివిగా దానమొసరించి, అరణ్యమునకు వెళ్ళుటకు సిద్ధమై, తండ్రిగారిని దర్శించి నమస్కరించుటకు వెడలెను. సీత, లక్ష్మణుడు కూడ రామునను సరించిరి. వారు పురవీధులగుండా పాదచారులై కైకేయి మందిరమునకు చేరిరి. వశిష్ఠుడు, సుమంత్రుడు కూడ

చేరిరి. సుమంత్రుడు దశరథునికి రాముడు వచ్చెను అని చెప్పుటకు వెళ్ళి "రాజా! శ్రీరామచంద్రుడు సీతా లక్ష్మణ సమేతుడై వచ్చినాడు. మీ దర్శనము నభిలషించి ఇదిగో ఇచ్చటనే యున్నాడు. తిలకింపుడు" అని విన్నవించెను.

రాముడు తండ్రికి సాష్టాంగనమస్కారమొనరించి నిలిచెను.

దశరథుడు గమనించి "రామా!" అన్న ఒక్కమాటను బలవంతముగా కూడదీసుకొని అనగలిగెను. అతని కంఠము రుద్ధమైనది. మీదు మాటలు పెగలుటలేదు. దుఃఖపూర్ణుడైన తండ్రియవశత్వతనుగమనించి రాముడుకూడా మిక్కిలి చలించినవాడాయెను. గంభీరముద్రదాల్చి "తండ్రీ! ఈ స్థితిలో మిమ్ములను వదలిపోవలసినవాడనైతిని, ఎంత కష్టచరిత్రుడను తండ్రీ!" యని చింతించి; "నన్ను మన్నింపుడు" అని చెప్పి చెంతనేవున్న కైకతో ఇట్లు పలికెను.

"తల్లీ! కైకేయీ! నేడే నేనరణ్యములకు వెళ్ళుచున్నాను. నాతో పాటు సీత, లక్ష్మణులుకూడ వచ్చుచున్నారు. దయయుంచి వారిని కూడ అనుమతింపుము.

కైక ఏమియు మాట్లాడక మౌనవ్రతమవలంభించినది.

అప్పుడు సుమంత్రుడు కైక క్రూర స్వభావమును తలంచి ఆమె లోపలి ప్రాణమూలములను పెకల్చుమాటల ఈటెలచే ఇట్లు పలికెను.

"సువిశాలమైన రాజ్యమును చిరకాలము సుభిక్షముగ, సర్వజన సమ్మతముగ శాసించు, నీ ప్రాణనాథునే అతిక్రమించి తిరస్కరించితివి. తల్లీ! ఇక నీవు చేయలేనిదేమి? ఎంతకైనను తెగించిన తెంపరివి. ఇట్టి నీవు భర్తృహంతవు - కులనాశనివి. స్త్రీలకు సుతులకంటే భర్తయే విశిష్టుడు. సత్యసంధుడైన నీ భర్త ఆజ్ఞననుసరించి రాముడు, రాజ్యము ను వదిలి భరతునకప్పగించి అరణ్యములకు తప్పక వెడలును. మేమెల్లరము ఆ రామునితోడనే బయలుదేరివెళ్ళి అతనితోనే జీవింతుము.

ఓ దుష్టబుద్ధికలదానా! స్వభావసిద్ధముగ మగపిల్లలు తండ్రి గుణములననుసరించి, ఆడపిల్లలు తల్లి గుణములననుసరించి వర్తించెదరను నానుడి ఇప్పుడు నీయందు సత్యమైనదిగా తోచుచున్నది. క్షేత్రమున చెట్టొకటి వేసిన దానినుండి వేరొక వృక్షము లభింప నగు ఫలములెట్లు లభించగలవు - వేపచెట్టునుండి మధుద్రవమునాశింప లేముకదా! నీ తల్లి స్వభావము వలెనే నీ స్వభావమును క్రూరము.

ఆ నీ తల్లి పూర్వవృత్తమెట్టిదో నీవు తెలియనగును.

## సుమంత్రుడు చెప్పిన కైక తల్లి కథ

పూర్వము నీ తండ్రికి ఒక మహానుభావుడు (గంధర్వుడు) సర్వప్రాణుల శబ్దముల అర్థమును తెలుసుకొను గొప్పశక్తిని ఇచ్చెను. అందువలన పశుపక్ష్యాదులభాషలను అవలీలగా రాజు తెలిసికొనగలిగే వాడు.

ఒకరోజు రాత్రి పడుకొనియుండగా రాజు తన శయనముక్రింద ధ్వనిచేయు చీమల సవ్వడిని విని, అందలి అర్థమును గ్రహించి పదే పదే నవ్వుకున్నాడు. రాణి, రాజు తనను చూచియే నవ్వుచున్నాడను కొని కారణమడిగెను. అంత రాజు చెప్పుటకు నిరాకరించెను. రాణి మరల మరల అతని నవ్వునకు కారణమడిగి సమాధానము చెప్పుమని ఒత్తిడి చేసినది. రాజు రాణితో రాణీ! నన్ను చెప్పుమని ఒత్తిడి చేయకుము. నా నగవునకు కారణము చెప్పినచో నేను తక్షణమే మృతి నొందుదును. ఫలితముగ నీకు వైధవ్యము ప్రాప్తించును.

అప్పుడు నీ తల్లి రాజుతో ఏది ఏమైననుసరే - మీరు చెప్పితీర వలసినదే - లేనిచో మీరు నన్ను పరిహసించుచున్నారని భావించెదను.

కేకయరాజు రాణి పట్టుదల నెరింగి, తగు పరిష్కారమునకై తనకు వరమునిచ్చిన ఆ మహాత్ముని వద్దకువెళ్ళి అడిగెను: "మహాత్మా! మీరిచ్చిన వరముతో రాత్రి చీమలభాష నెరిగితిని - దాని వివరమును చెప్పుమని రాణి కోరుచున్నది. చెప్పినచో నాకు ప్రమాదము. ఈ విపత్పరిణామమును మీరే పరిష్కరించవలెను. అని

ప్రార్థించెను. అప్పుడా మహాత్ముడు "రాజా! ఆమె చచ్చినా, బ్రతికినా సరే అనుచితమైన ఆమె కోరికను ఎట్టి పరిస్థితులలోను నెరవేర్చకుము. అయుక్తమైన ఆమె కోరికను తీర్చి, ఆత్మహానిని ఆహ్వానించుట అవివేకము - పాపకార్యము.

రాజు ఆ మహాత్ముని మాటవిని, తన ప్రాసాదమునకు వెళ్ళి నిష్కారణముగ నీ తల్లిని వెడలగొట్టి సుఖముండెను.

కైకేయీ! తెలిసినదా! నీ తల్లి చరిత్ర. ఆ తల్లి గర్భవాసమున జనించిన నీవును అందుకు భిన్నముకాదు అని నిరూపణ అయినది.

సుమంత్రుని మాటలకు కైకేయి ఈషణ్మాత్రము స్పందించలేదు.

దశరథ మహారాజు కైకేయి నిర్దయతను, నిర్లక్ష్యవైఖరిని చూచి మిక్కిలి కోపించెను. రాజు ఎన్ని కటోక్తులాడినను సరకుచేయలేదు కైక. ఆమె రాముని వనవాసమంపుటలో కృతనిశ్చయం అయినది. రాముడును తన వనవాసగమన నిశ్చయమునుండి ఎంతమాత్రము తగ్గలేదు.

దశరథుడు అడవులకు వెళ్ళు రాముని రక్షణకై చతురంగ బలములను పంపుటకు నిశ్చయించెను. కాని కైక నిర్ద్వంద్వముగ, అట్టి ఏర్పాటును త్రోసిపుచ్చెను. కైకేయి:- రామా! నీవు వెళ్లునది అరణ్యవాసమునకుగాని వేరొక నగరమునుగానీ, రాజ్యమునుగానీ కొల్లగొట్టుటకుకాదు. కనుక రాజోచితములైన మద్యావలను, అలంకార సంభారములను వెంటగొనిపోవుట ఉచితముకాదు. కేవలం జటావల్కలములను ధరించి, ముని వేషధారులై వెళ్ళవలెను. మీ యాహార విహారములును అందుకు తగియుండవలయును. కందమూలములు త్రవ్వుకొని యాహారమును సంపాదించుకొనుటకు రెండు పరికరములు మాత్రము వెంట తీసుకొని వెళ్ళవచ్చును. అదియును పాదచారులై వెళ్ళుట యుక్తము. రఘువంశ ప్రభువులును, వానప్రస్థజీవనమును గడుపవలసినపుడు; అట్లే పాదచారులై నిరాడంబరముగ వెడలిరి. నీకును అట్టి మార్గమే శిరోధార్యము.

కైకేయి నిర్మొగమాటముగ రాముని వనవాస గమన విధానమును నిర్ణయించి చెప్పి, నారవస్త్రములు తెప్పించి రామునికి, లక్ష్మణునకు, సీతకు ఇచ్చినది. రామలక్ష్మణులిరువురును, ఆ వస్త్రములను ధరించిరి. సీతకు మాత్ర మా వస్త్రములను ధరించుటకు కుదురలేదు.

రాముడామె యవస్థను గమనించి, స్వయముగ దరికేగి, యామె ధరించియున్న పట్టు వస్త్రముపైననే నార వస్త్రములను ధరింపజేసి, సరి చేసెను. ఆ దృశ్యమును కనులార చూచిన అంతఃపుర స్త్రీలు సీత దురవస్థకు మిక్కిలి దుఃఖించిరి.

"ఆహా! సీతారాములకు ఎంతటి కష్టము వాటిల్లినది" అని ప్రజలు వాపోయిరి.

అంత వశిష్ఠ మహర్షి యా దృశ్యమును చూడలేక కనులు చెమ్మగిల్లగా "కైకేయీ! రామునొక్కనికే వనవాస వేషము నిర్దేశించుట నీ దృష్టిలో న్యాయము. కాని సీతాదేవికి కూడ నార చీరలు ధరింపజేయుట దురన్యాయము. ఆమెకూడ నీవంటి స్త్రీయే కదా! వనవాస కష్టమును ఊహాయందేనియు భరింపజాలని సుకుమారి-ఎందుకమ్మా నీకీ కఠోర బుద్ధి-?

వశిష్ఠ మహర్షితోపాటు సుమంత్రుడును, కైకేయీ! నీవెంత ఘీంకరించినను మేము మాత్రము సకల గుణాభిరాముడైన రాముని చతురంగ బలయుతునిగ, సకల సంపత్సంభార సమేతునిగ అడవికి పంపెదము. నీవు రాజును వరము కోరుకొనుటలో రాముని అడవికి పంపుమనియే షరతు విధించితివి. తక్కినవానిని నిషేధించలేదు కదా! ఇప్పుడిది ఏమి?

వశిష్ఠుడు, సుమంత్రుల మాటలకు కైక మరింత రెచ్చిపోయినది. దెబ్బ తిన్న ఆడుపులివలె మరింత బొబ్బరించుచు-

మహాత్ములారా! మీరలూరుకొనుడు. ఏది ఏమైనను మా యాజ్ఞలు చెల్లించబడవలసినదే. పితృవాక్య పరిపాలనానిరతుడు, మాత్రాజ్ఞా

విధేయుడైన రాముని, తన ధర్మమును నిరాఘాటముగ నిర్వహింప నిండు. ఇప్పుడు మీరడ్డు తగిలి రాజ కుటుంబములో కలతలు రేపి, అనవసరముగ కలకలము తేవలదు.

అయోధ్యా నగర సంపత్సర్వస్వమును కొల్లగొట్టుకొని, రాముని వెంట వెళ్ళి, కేవలము నిష్ప్రచ్చరము, శ్మశాన సదృశమునైన రాజ్యమును పరిపాలించుమని భరతుని కప్పగించి వెళ్ళుదురా! ఇట్టి ప్రతికూల చర్య రాజద్రోహము కాగలదు సుమా! గమనింపుడు.

కైక రోషముతో మూడు మాటలను రాముడు (నిస్తరంగ నీరధి వలె) ప్రశాంతచిత్తుడై యాలించాడు.

అతడు వశిష్ఠుల వారిని, సుమంత్రుని మౌన ప్రార్థనా పూర్వకముగ వారించి "మహాత్ములారా! నేను సర్వవిధముల తండ్రిగారి యాజ్ఞను పరిపాలించువాడనే. నేను వినుచుండగా కైకేయీ మాతను నిందించి, నన్ను నా ప్రయత్నము నుండి మరలింప యత్నింపకుడు" అని రాముడు ధీర గంభీరవదనుడై పలికెను. అయినను సుమంత్రుడు కైకేయిని, దశరథ మహారాజును నిందించెను.

"అనవసరములైన వరములిచ్చి, ఇప్పుడు చింతించిన ప్రయోజనమేమి ప్రభూ! పరమ సుకుమారియైన సీతాదేవి యేమి చేసినది? ఆమెకు కూడ అరణ్యవాసమా! అడవులలో గండ శిలలపై ఇకనుండి సత్య సంధుడు, ధర్మావతార మూర్తియైన శ్రీరామచంద్రుడు నిద్రించవలెనా?

పంచభక్ష్య పరమాన్నములు స్వీకరించు రాజ మందిరములో సకల భోగములు అనుభవింపవలసినవాడు ఇకనుండి అడవిలో కంద మూలములు తిని ఆకలి తీర్చుకొనవలయునా?

ఆహా! విధి ఎంత విపరీతమైనది? ఎన్నటికైనను కైకేయికి ఈ పాపము కట్టికుడుపక మానదు. రాముడడవులకు పోగా, భరతుడు ఈ రాజ్యము నేలుటయా? భరతుడు వదలిన రాజ్యమును పిమ్మట మరల రాముడు ఏలుటయా? అటులెన్నటికిని జరుగదు-శునకము తిని వదలిన మాంసము సింహము భుజింపదు కదా!

హతవిధీ! రాముడు ఇక మాకు కనిపింపడు కదా! అని

సుమంత్రుడు బిగ్గఱగా విలపించెను. దశరథుడు విలపించెను. ఒక్క కైకేయి తక్క తక్కిన వారెల్లరును కన్నీరు మున్నీరుగా విల పించిరి.

రాముడు మాత్రము సుంతైనను చలింపక నిలుచుండి యుండెను.

## సీతారామ లక్ష్మణుల వనగమనము

శ్రీరామచంద్రుడు తండ్రి పాదములకు నమస్కరించి ఆత్మ రక్షణమునకై శరశరాసనములను ధరించి, అరణ్యమునకు వెళ్ళుటకు ఉపక్రమించి, అచటనున్న పరివారము, ప్రజలు అందరికీ వందన మాచరించి, వశిష్ఠమహర్షికి, మంత్రులకు అంజలి ఘటించి 'నేను వెళ్ళు టకు అనుమతించండి!' అని వేడుకొని నడక ప్రారంభించెను. రాముని వెనుక సీతాదేవి తలవంచుకొని భర్త అడుగులో అడుగు వైచుచు అనుసరించెను. పిమ్మట లక్ష్మణుడు వారి ననుగమించెను. ఆ ముగ్గురిని చూచి, ప్రజలు, మంత్రులు, స్త్రీ బాల, వృద్ధులు అందరూ శోకాతిరేకముతో ఘొల్లున విలపింపసాగిరి. వారి వెంట అయోధ్యానగర ప్రజలందరు సీతా రాముల వనవాస గమన దృశ్య మును చూచి, హృదయ విదారకముగ విలపించిరి.

సుమంత్రుడు రథము నాయత్తముచేసి, సీతారామలక్ష్మణుల యెదుట సిద్ధముగా నుంచెను. వారలు సిద్ధమైయున్న రథమును ఒక రొకరుగా నధి రోహించి, రథము సాగించుటకు సుతునికాజ్ఞాపించిరి. రథము కదలినది. రచ్చలు, క్రంతలు, రాజమార్గములు దాటి సాగి పోవుచున్నది. దారి పొడవున ప్రజల దీనాలాపములు, దుఃఖస్రవం తులు-కుమారుని వనగమన దృశ్యమును చూడలేక, పీడలేక దశరథుడు ఆ రథమువెంట కొంతదూరము పరుగెత్తెను. అతని వెంట కౌసల్య, సుమిత్ర అనేకమంది అయోధ్యా ప్రజలు పరుగెత్తుచుండిరి. సుమంత్రుడు రథవేగమును తగ్గించిపోవునట్లు నడుపుచుండెను. రాముడు తనను వెంబడించుచున్న ప్రజల దుఃఖమును చూడలేక, "సుమంత్రా! రథమును త్వరగా పోనిమ్ము-ప్రజల దుఃఖమును చూడ

లేకున్నాను. తండ్రిగారును రథమును వెంబడించుచున్నారు. మనము వేగముగ ముందునకు వెళ్ళిన, వారు వెనుదిరిగిపోదురు.” అని పలికెను.

సుమంత్రుడు రథవేగమును పెంచెను.

దశరథుడు “రామా! రామా! ఆగుము. ఆగుము” అని బిగ్గరగా పిలుచుచు రథముతో పరుగెత్త లేక ఆగి ఆగి తూలుచు నడుచుచుండెను. రథవేగమున చక్రములనుండి లేచిన దుమ్ము దశరథుని కండ్లలోపడి కన్నులు కానరాక బాధపడిపోయెను. విధిలేక ‘రామా!’ యని క్రిందపడి మూర్ఛిల్లెను. కౌసల్య సుమిత్రలు పరుగు పరుగున వచ్చి దశరథుని చేరుకొనిరి. వారు దశరథుని దుఃఖమును చూడలేక, పరితపించుచునే వలయు సుపచారములు చేసిరి. రాముని వియోగ దుఃఖము. పుత్ర వియోగముచే రాజునకు కలిగిన తీవ్ర పరితాపమును భరించలేక అయోధ్యానగర పౌరులెల్లరు దుఃఖసాగరములో మునిగి పోయిరి. రథము వెంట కొంత దూరము పరిగెత్తి ఇక పరుగెత్తలేక కొందరు స్త్రీ బాల వృద్ధులు, నిరాశచేసుకొని వెనుదిరిగి పోయిరి. కాల్బలము రథము వెంట పరుగెత్తుచునే యున్నది.

దుఃఖతప్తుడైన రాజును పరిచారకులు తిన్నగా అంతఃపురమునకు చేర్చారు. రాజు కోరిక ప్రకారము అతనిని కౌసల్యా మందిరానికి తీసుకెళ్ళి ఉపచారములు చేయడం ప్రారంభించారు. దశరథుడు మెలకువ వచ్చినప్పుడల్లా “రామా! రామా! నా తండ్రీ! నీకు నేను ఎంత కష్టము తెచ్చిపెట్టితినయ్యా! నా కడుపున పుట్టకున్న నీకిట్టి బెట్టిదపు విపత్తు లేకుండెడిదికదా! నాయనా!” అని పరి పరి విధముల విలపించుచు, మరల మరల మూర్ఛనొందుచుండెను.

శ్రీరామచంద్రుని రథము అయోధ్యానగర సరిహద్దులను దాటు దిశలో ముందునకు దూసుకొని పోవుచున్నది.

కొంతదూరము పోవుసరికి రథము తమసా నదీతీరము చేరుకొనినది అచట సుమంత్రుడు గుఱ్ఱములను, వాని సుదీర్ఘ ప్రయాణబడలికను తీర్చుటకు రథమునుండి వేరుచేసి, నదీజలములచే కడిగి, పచ్చిక మేపించి సేద తీర్చెను.

అంత సాయం సమయమైనది. సూర్యుడ స్తంగతుడు కావడం వలన రామలక్ష్మణులు సాయం సంధ్యాది పూజా కార్యక్రమములు ముగించుకొనిరి.

ఆ సమయమున రాముడు సీతవైపు చూచి, లక్ష్మణుని సంబోధించి, "లక్ష్మణా! వనవాస గమనములో ఇది తొలి మజిలీ. సుఖముగ గడచిపోవును. నీవు దిగులొందకుము. అయోధ్యను వీడి వచ్చిన మనలను తలచుకొని, అందలి ప్రజలు మిక్కిలి దుఃఖించుచుందురు. సందేహము లేదు.

సకల సద్గుణములచే విరాజిల్లు మన తండ్రిగారి యెడల, మన యెడల, భరత శత్రుఘ్నుల యెడ మన ప్రజలకు గల అనురాగము అమోఘము. వారు మన యిన వంశ్యులకు కలిగిన కష్టములను చూచి సహింపలేరు.

తల్లిగారిని, తండ్రిగారిని తలచుకొని నా మనస్సు ముక్కలగుచున్నది. ధర్మమునందు మిక్కిలి ఆసక్తి, భక్త్యాదరములు గల భరతుడు తల్లిదండ్రుల దుఃఖమునపనయింప జేయుటతో శక్తి వంచన లేకుండా నిమగ్నుడగునను భావనయే నన్నూరడింపజేయుచున్నది.

లక్ష్మణా! నీవు నన్ను అనుసరించి నాతో వచ్చుట యెంతయు నాకు మేలైనది. నీవు రానిచో సీతాదేవి రక్షణ కార్యము నాకు దుర్ఘటమయ్యెడిది కదా!

తమ్ముడా! ఈ రాత్రి నీరును మాత్రమే గ్రహించి వనవాసోపక్రమ వ్రతమును నిర్వహించుట యుక్తమని తోచుచున్నది. అదియును గాక ఈ ప్రదేశము పవిత్రతమసానదీ పుణ్యతీర్థము. కావున ఈనాటి ఈ జలపాన మాత్ర వ్రతచర్య నాకు కష్ట సహిష్ణుతను, నియతాహార సమ్మతిని కలిగించును. కావున అట్లు చేయుదును.

లక్ష్మణా! నీవు మాత్రము గుఱ్ఱముల విషయమై అప్రమత్తత వహించియుండుము.

సుమంత్రుడు నదీతీరమున ప్రత్యేకముగ ఏర్పాటుచేసిన దర్భాసనములపై ఆ రాత్రి సీతారామలక్ష్మణులు విశ్రాంతినొందిరి.

తెల్లవారుఝాము ఐనది. రాత్రి శేషంలో రాముడు మేల్కొన్నాడు. చుట్టూ కలయ జూచాడు. అంతవరకు తన రథమునంటిపెట్టుకొని పరుగెత్తుకొని వచ్చుచున్న అయోధ్యావాసులైన పౌరులు కొందరు అచ్చటచ్చట ఆ తమసా నదీతీర వృక్షములఛాయలో ఒడలు మరచి నిద్రించియుండిరి. రాముడు వారిని చూచి, సుమంత్రుని పిలిచి "సుమంత్రా! మన మెంత వారించినను, అయోధ్యా వాసులు మనలను వీడిపోవునట్లు లేరు. వారు నిద్రలేవకమునుపే మన మీ ప్రదేశమును విడిచిపోవలెను. వెంటనే రథమునకు గుఱ్ఱములను పూన్చి ఆయత్తము చేయుము వెళ్ళుదము."

సుమంత్రుడు అట్లే రథమును సిద్ధముచేసి సీతారామలక్ష్మణుల కడకు వచ్చి, రథ మధిరోహింపుడని కోరెను. వారలట్లు చేయగా సుమంత్రుడు వేగముగ రథమును పోనిచ్చి, అతి వేగవంతముగ ప్రవహించు నదిని దాటించి ఆవలి తీరము చేర్చెను. రథము ఆవలి తీరమున విడియగనే రాముడు సుమంత్రునితో "సుమంత్రా! మేమెటు పోయినది మమ్ము వెంబడించు పౌరులకు తెలియకుండ నీవొక్కడవే రథమునెక్కి యుత్తరదిశగా సాగిపొమ్ము. కొంత దూరమటు లేగి, మార్గమును మార్చి రథము నిటకు కొనితెమ్ము. అపుడు వారు మన మయోధ్యకే వెళ్ళినామనుకుని, అయోధ్యకు చేరుకొందురు. సుమంత్రా! మనల యందు వారికిగల యభిమాన మట్టిది. యెట్లు కాదందుము.

సుమంత్రుడు రాముడు చెప్పినట్లే చేసెను. మరల రథము రాముని ముందుంచెను. రామలక్ష్మణులు సీతాయుక్తముగా రథము నెక్కి తపోవనమున కేగు మార్గమును బట్టిరి.

నిద్ర మేల్కొనిన పౌరులు రాముడచట లేకుండుటచే మిక్కిలి విచారించి, తమకు కలిగిన గాఢమైన నిద్రను నిందించిరి. చేయునది లేక వారు అయోధ్యకు చేరుకొనిరి.

ఖళ్ళున తెల్లవారింది. తెల్లవారు సరికి రాముడు చాలాదూరం ప్రయాణం చేశాడు. ప్రాతః సంధ్యావందనం చేసుకొని ఉత్తరకోసల

దేశపు దక్షిణ ప్రాంతానికి చేరుకున్నాడు. ఆ తరువాత చిన్నా పెద్ద ఊళ్ళు దాటి, దక్షిణదిశగా పయనించి గోమతీనదిని దాటాడు. అక్కడినుండి స్యందిక అనే నదిని దాటాడు. అచటి విశేషాలన్నీ సీతాదేవి చూచి మిక్కిలి ఆనందించింది. రాముని రథం విశాలమైన కోసలదేశ పరిధులను దాటుతున్నది. రాముడు ఒకసారి అయోధ్యా నగర దిశను చూచి నమస్కరించి సెలవిమ్మంటూ మనస్సులోనే అభ్యర్థించాడు. పిమ్మట అయోధ్యా నగరవాసులను మనస్సులోనే స్మరించి నమస్కరించెను.

రథము తిన్నగా కోసలదేశ గ్రామాలను దాటింది. తరువాత కొంత ప్రయాణం చేసి పవిత్రమైన గంగాతీరము చేరుకున్నది.

పవిత్రమైన అనేక ఉద్యానవనములు, ఆశ్రమ ప్రాంతములు గల గంగా సరిత్తీర సౌందర్యాన్ని చూచి ముగ్ధుడై రాముడు "సుమంత్రా! నేడిక్కడనే విశ్రాంతి గైకొందము." అని చెప్పెను.

సుమంత్రుడు, లక్ష్మణుడు 'అట్లే' యనిరి.

రథము దిగి వారు దాపుననే యున్న ఒక గారచెట్టు సమీపమునకు చేరిరి.

సుమంత్రుడు గుఱ్ఱాలను రథమునుండి వేరుపరచి, రాముని చెంత అంజలి ఘటించి నిలచియుండెను.

## గుహునితో చెలిమి

అది నిషాదరాజైన గుహుడు పరిపాలించే ప్రాంతం. గుహుడు చతురంగబల సంపన్నుడు. ఆ గుహుడు పురుషోత్తముడైన శ్రీరామ చంద్రుడు తన ప్రాంతమునకు వచ్చెనని తెలిసి మిక్కిలి సంతోషించెను. వెంటనే తన బంధుమిత్ర పరివారముతో సగౌరవముగా రాముడున్న ప్రదేశమునకు వెడలెను.

శ్రీరాముడు అల్లంత దూరమునుండియే గుహుని రాకను తెలిసికొని, లక్ష్మణయుక్తముగా ఎదురుకేని సాదరముగా అతనిని కలుసుకొనెను.

లోకాభిరాముడని ప్రసిద్ధికెక్కిన రఘుకుల తిలకుడు శ్రీరామ చంద్రుడట్లు నారవస్త్రములు ధరించి దీనాననుడై యుండుటను చూచి, గుహుడు చింతించెను. రాముని గాఢాలింగనము చేసుకొని, ఆదరించి "రామా! ఇది నీ రాజ్యమైన 'అయోధ్య'గనే భావింపుము. ఇచట నీకు అక్కడ లభించు సకల మర్యాదలు, సౌకర్యములు లభించును. నీవంటి గొప్ప అతిధి ఇన్నాళ్ళకు లభించినాడు నా అదృష్టము.

పిమ్మట గుహుడు అతిరుచ్యములగు వన్య ఆహారములు, పానీయములు, వివిధ భక్ష్య పదార్థములు తెప్పించి, రాముని ముందు పెట్టెను.

"రామా! మేము నీ పాలితులము నీవు పాలకుడవు. మేమిచ్చు ఈ చిరు సత్కారమును గ్రహించి మమ్మానందింప జేయుము. నీ పరివారమునకు, అశ్వరాజములకు వలయు భోజనపదార్థములు కూడ అందింతుము. సందేహింపకుము" అనెను.

రాముడు గుహునితో నిట్లనెను.

"నాయనా! నీవు కాలినడకతో మా చెంతకు వచ్చి మమ్ము సాంత్వనవచనములచే ఆహ్వానించుటయే ఘనసత్కారము. మేము ఇంతమాత్రముచేతనే సంతుష్టులమైనాము.

"గుహుడా! మేమిప్పుడు వనవాసదీక్షితులము. పితృఆజ్ఞా పరిపాలనా ధర్మసువ్రతులము తపోనియతి నవలంభించిన వనవాస జీవనము గడుపువారము. మాకీ భక్ష్యభోజ్యములు పరిహార్యములు.

పుణ్యాత్ముడా! నీ తృప్తికొరకు మా గుఱ్ఱములకు కావలసిన ఆహారమును మాత్రము సమకూర్చుడు. అట్లుచేయుట మమ్ములను సత్కరించినట్లే యగును. ఈ యశ్వములు మా తండ్రిగారికి అత్యంత ప్రియమైనవి.

గుహుడు వెంటనే గుఱ్ఱములకు వలసిన గడ్డి దాణా మున్నగునవి అందించుటకు తగు ఏర్పాట్లు గావించెను.

అంత రాముడు సాయంసంధ్య నుపాసించి, లక్ష్మణుడు స్వయముగ తెచ్చిన జలములనే ప్రాశించి, విశ్రాంతి గైకొనెను. సీతా రాములు విశ్రాంతి గైకొనుచున్న ప్రదేశమున కనతిదూరములో నున్న చెట్టుచెంత నిలుచొని యుండెను.

గుహుడు, సూతునితోను, లక్ష్మణునితోను మాట్లాడుచు తానును నిద్రించకుండానే ఆ రాత్రి గడిపెను.

శ్రీరాముడు సుమంత్రుని అయోధ్యకు వెళ్ళమని కోరుట - సుమంత్రుడు రాముని తననుకూడ అడవుల నుండనను జ్ఞ వేడుట - రాముడు సుమంత్రుని వారించి సమాధాన పరచుట - రామలక్ష్మణులు జటాధారులగుట :

తెల్లవారినది - రాముడు గంగనుదాటి అవలిదూర వనములకు సీతా లక్ష్మణ యుక్తంగా వెళ్ళుటకు నిశ్చయించి - గుహుని పిలిచి, తన కోరికను తెలిపి "గంగను దాటించుటకు తగు ఏర్పాట్లు గావింప వలసినదిగా కోరెను. అంతకుముందుగా మేము జటాధారులమై అరణ్య వాసోచితమగు వేషమునలవరించుకొనవలెను. నీవు వెంటనే మర్రి పాలను తెప్పింపుము" అని గుహుని కోరెను. గుహుడును రాముని కోరికపై వెంటనే మర్రిపాలను తెప్పించి యిచ్చెను. రాముడు, లక్ష్మ ణునితోకూడి ఆ పాలను కురులకు దట్టించి జడలు కట్టించుకొనిరి.

## సీతారామ లక్ష్మణులు గంగను దాటుట

గంగను దాటుటకు గుహునితో నౌకను సిద్ధపరపింపుమని రాముడు కోరెను. అంత రాముడు సుమంత్రునివైపు విషాదభరిత నయనములతో "సుమంత్రా! నిన్ను వదలలేక వదలిపోవలసి వచ్చు చున్నది. ఇటనుండి మమ్ము వదిలి వెనుకకు మరలి య్యయోధ్యా పురమునకు పొమ్ము - మా క్షేమ వార్త తండ్రిగారికి, తల్లులకు చెప్పి, వారలనూరట పరచుము. తండ్రిగారు నా వియోగముచే తరగని దుఃఖముననుభవించుచుందురు - నేను మరలి వచ్చువరకు వారు జీవించియుందురని భావింపను. వారికి నాయందుగల ప్రేమమట్టిది. సుమంత్రా! ఎట్లైనను నీవు వెళ్ళి తండ్రిగారినూరడింపుము. నీవు వెళ్ళసరికి భరతుడు వచ్చియుండును. భ్రాతృవత్సలుడైన భరతుడు

నన్నువలెనే తండ్రిగారిని భక్తితో సేవించుమని చెప్పుము. తల్లి కైకేయీ మాతను నానిపోత్తముగ దూషింపవలదని మరి మరి నొక్కి చెప్పితినని తెలుపుము. సుమంత్రా! సెలవొసంగుము" అని రాముడు సుమంత్రుని వీడుకొలిపెను. సుమంత్రుడు వెళ్ళలేక వెళ్ళలేక వెను దిరిగి అయోధ్యానగర మార్గమును పట్టి వెళ్ళెను.

ఇంతలో గుహుడు "రామా! నౌకను సిద్ధము చేసితిని - అధిరోహింపుడని" చెప్పి నావను నడుపు తన పరివారమును అప్రమత్త పరచెను.

శ్రీరాముడు, లక్ష్మణునితో "లక్ష్మణా! ముందు సీతను నౌక లోనికి ఎక్కించుము. ఆ పిమ్మట నీవు, నీ తరువాత నేనును నౌక నెక్కెదను" అని తెలిపెను. ఆ విధముగ లక్ష్మణుడు మొదట సీతను నావలోనికెక్కించెను. పిమ్మట లక్ష్మణుడు ఎక్కెను. తరువాత రాముడు నౌకలో కాలిడెను.

నౌక కదలుటకాజ్ఞాపింపబడినది. కదలుచు కదలుచు మధ్యమునకు చేరుకొనినది, అప్పుడు సీతాదేవి పవిత్రమైన గంగామాతను ప్రార్థించినది.

"పావనీ! గంగామాతా! కలుషహారిణీ! లోకుల పాపపుంజముల నెల్ల నీవు ప్రక్షాళనముచేసి, పవిత్రులనొనరించు పుణ్యాత్మవు. నీకు నమస్కారము - రఘువంశ తిలకుడు రామచంద్రుడు పితృవాక్య పరిపాలన మొనరించుటకు, నీ ఆవలి యొడ్డుననుండి ప్రారంభమగు సాంద్రారణ్యముల నివసించుటకొరకు బయలుదేరినాడు. ఈతని యీ వనవాసప్రస్థానమును విజయవంతము చేయుము.

దేవీ! నీవు కేవలము నదివి మాత్రమేకాదు. బ్రహ్మలోకమునుండి బయలుదేరి 'త్రిపథగా'యని పేరువడసి, ఈ లోకమున సముద్రున కిల్లాలివై, నీ దరుల యనేక పుణ్యక్షేత్రములకు నెలవైయున్న పవిత్రవు.

మాతా! శ్రీరామచంద్రుడు కృతకార్యుడై, విజయియై తిరిగి వచ్చి అయోధ్యాపతియైనపుడు నీకు మనఃప్రియము కలిగించుటకు, నీ సన్నిధికివచ్చి జగత్పూజ్యులైన బ్రాహ్మణోత్తములకు భూరిగోదాన హిరణ్యవస్త్రదానాదికముల నొసంగెదను. కరుణజూడుము తల్లీ!"

సీతయట్లు ప్రార్థించునంతలో నౌక ఆవలితీరము చేరినది,

## భరద్వాజాశ్రమము

సీతారామలక్ష్మణులు నౌక నుండి క్రిందకు దిగినారు. గుహుడు రాముని వద్ద సెలవు తీసుకొని తిరిగి తన రాజ్యమును చేరుకొనెను. లక్ష్మణుడు, సీత, రాముడు ముందు, నడుమ, వెనుకలుగా పరస్పర రక్షణోద్యుక్తులై అతి జాగరూకతతో నడకను ప్రారంభించిరి. వారు తిన్నగా కొంతదూరము ప్రయాణించి, భరద్వాజ మహర్షి ఆశ్రమ ప్రాంతమును చేరుకొనిరి. మహర్షికి శ్రీరామచంద్రుడు తమ యాగమనమును గురించి వివరముగా వెల్లడించెను. భరద్వాజుడు రాముని యందు అత్యంత భక్త్యాదరములను చూపి "రామా! నీవిట ప్రశాంతముగా నుండుము. ఈ యాశ్రమ ప్రాంతము మీకు నివాసయోగ్యమైనది" అని నుడివెను.

శ్రీరాముడు భరద్వాజ మహర్షికి ప్రణమిల్లెను. తోడనే సీతయు, లక్ష్మణుడును నమస్కరించిరి.

అంత రాముడు మహర్షీ! నీ యాదరపూర్వక స్వాగతమునకు కృతజ్ఞుడను. మీరనినట్లు ఈ ప్రాంతము నాకు నిశ్చయముగా నివాసయోగ్యమే. కాని యిచటి పల్లియులు, జానపదులు మేముండుటను గమనించి, వారు పదేపదే మా దర్శనమునకు వచ్చుచుందురు. కాన మా సీత ప్రశాంతతకు భంగము వాటిల్లును. మహర్షీ! ఆమె ఏకాంతవాస జీవనమునకు అవాంతరము కలుగని, మరొక్క సురక్షితమైన ప్రదేశమును చూపుడు.

అంత భరద్వాజుడు రామునితో "రామా! అట్లయిన ఇచ్చటికి అనతిదూరములో "చిత్రకూట" మను గొప్ప పర్వతప్రాంత మున్నది. అయ్యది పుణ్యుల కావాసము. ప్రశాంతతకు మారుపేరు. ప్రకృతి సౌందర్యమంతయు తన యందు కలబోసుకొన్న రమణీయ ప్రాంతము. రుచికరములైన ఫలవృక్షాదులచేతను, సుసంపన్నమైన పావనసలిల పూర్ణమైన జలాశయములచేతను ఒప్పారుచునటువంటిది. అయ్యది మీ ప్రశాంతమైన ఏకాంత సాధు జీవనమునకు సర్వథా అనుకూలమైనది.

రామా! ఈ రాత్రి మీరిచటనే విశ్రాంతి గైకొని రేపు పెందల కడ మీరు చిత్రకూటమునకు బయలుదేరి వెళ్ళగలరు.

సీతారామ లక్ష్మణులు ఆ రాత్రి ఆ ఆశ్రమములోనే విశ్రాంతి గైకొనిరి.

భరద్వాజుడు ఉదయముననే లేచి స్నానాదులు నిర్వర్తించుకొని, సీతారామలక్ష్మణులను ప్రయాణమునకు సన్నద్ధులను చేసెను. వారును భరద్వాజుడు వెంబడింపగా అడవిలో కొంతదూరము ప్రయాణించి, భరద్వాజునితో "మహర్షి! ఇంక మీరుండుడు" ఇప్పటికే మా కొరకు మిమ్ములను చాల శ్రమ పెట్టితిని. నన్ను క్షమించండి. నిన్న మిత్రసంభావనీయుడైన గుహుడు, గంగను దాటించుటలోను, నేడు పితృసమానులైన మీరు మాకు నివాసయోగ్యమైన సురక్షిత ప్రాంత మును చూపుటలోను ఎంతగానో తోడ్పడినారు. మేము కడుంగడు ధన్యులము. స్వామీ! మాపై కరుణజూపి మమ్ములనాశీర్వదించి కృతార్థులను చేయుడు. భరద్వాజుని వద్ద సెలవు తీసుకొని సీతారామ లక్ష్మణులు ముందునకు సాగిరి.

## చిత్రకూట పర్వతము

సీతారామలక్ష్మణులు దట్టమైన అరణ్య ప్రాంతములోనికి ప్రవేశించారు. ముందుగా రాముడు, మధ్యన సీత వెనుక లక్ష్మణుడు, ఈ రీతిగా వారు ప్రయాణము చేయుచుండిరి. వారికి అరణ్య మార్గములో ఎన్నో అద్భుత దృశ్యములు కనిపించినవి. ఎలుగుబంట్లు చిరుతలు, లేళ్ళు రకరకములైన పక్షిసముదాయము కనిపించెను. అవి యన్నియు వారిని చూచి, వాటి భాషలో ఏవో చెప్పుకొనుచు దారిని చూపుచున్నవా? అనునట్లు ముందునకు సాగిపోవుచున్నవి. దారి పొడవునా ఘనీభవించి అలముకొన్న చెట్టుచేమలు "ఆహా! అతి సుకుమారులు, సుందరులునైన ఈ మహనీయులు ఇట్టి కంకటకాకీర్ణమైన యడవిన ప్రయాణించుచున్నారు. వీరికి ప్రయాణబడలికను కొంత తీర్చవలెనన్నట్లుగా వంగి నీడను ప్రసాదించినవి. సీతారామ లక్ష్మణులకు రుచ్యములైన ఫలము లందించు నిమిత్తము నింగినంటు ఫలవృక్షాదులు వినయముతో వంగి నమస్కరించుచున్నట్లుగా తోచి, పక్వమైన ఫలములను వారికి కరస్థములుగా నయ్యెను. సూర్యుడు తగుమాత్రముగా తన స్వభావమగు ఖరకిరణములను బరపుచూ,

వారిని బాధించకుండ తన ప్రయాణమును కొనసాగించుచుండెను.

అట్లు సీతారామ లక్ష్మణులు కాలినడకన ప్రయాణము చేసి పంపా తీరప్రాంతము చేరుకొనిరి. రాముడు లక్ష్మణునితో ఇట్లనెను. "లక్ష్మణా! భరద్వాజ మహర్షి చెప్పిన చిత్రకూట పర్వతమిదియే కాబోలు" అనిన లక్ష్మణుడు "అన్నా! అట్లుగనే యున్నది. మనమిచ్చట నివసించుసేమో చూతము.

## సీతారామలక్ష్మణులు వాల్మీకి మహర్షిని దర్శించుట

ఆ ప్రాంతముననే అనతి దూరమున ఒక చిరు పర్ణ కుటీరము కనిపించెను. ఆ కుటీరమున వాల్మీకి మహర్షులు నివసింతురు. సీతారామ లక్ష్మణులు ఆ కుటీరమునకేగి, అచట గల వాల్మీకి మహర్షిని దర్శించిరి. మహర్షి వారిని సాదరముగా ఆహ్వానించి తగు విధముల మన్నించెను. రాముడు మహర్షికి తమ రాకను గురించి వివరించెను. అంతట రాముడు మహర్షి యనుమతిని వడసి, అచటనేయున్న యొక కొండగుహ దరికి జేరి, ఆ సమీపమున ఒక పర్ణశాలను నిర్మించుమని లక్ష్మణునితో చెప్పెను. లక్ష్మణుడు సరేయని, వదిన అన్నలచే వాస్తుపూజ గావింప జేసి, పర్ణ కుటీరమున కవసరమగు పరికరములను సేకరించి, అచిర కాలములోనే, అన్ని వసతులతో కూడిన రమ్యమైన పర్ణశాలను నిర్మించెను

సీతారాములు పర్ణశాలా ప్రవేశమున కవసరమైన దేవతా బలుల నిచ్చి, సశాస్త్రీయముగా గృహ ప్రవేశము గావించినారు. లక్ష్మణుడచటి జలాశయము నుండి స్వయముగా నిర్మలమైన ఉదకమును, ఫల వృక్షములనుండి స్వాధురస పూర్ణములైన ఫలములను ఆహారముగా తెచ్చి యిచ్చెను. అనాడు ఆ స్వాదు ఆహారమును స్వీకరించిరి. సుఖముండిరి. తదాది సీతారామలక్ష్మణులు జితేంద్రియులై, నియతాహార విహార మతులై సాధు జీవనము చేయుచుండిరి.

రాముడచట నివసించి యున్నాడని విన్న అనేకమంది ఋషులు వచ్చి, దర్శించుకొని తమ తమ వృత్తాంతములను, ఆ పరిసర ప్రాంత విశేషములను తెలియజెప్పిరి.

సీతారాములకు అహర్నిశము వలయు సేవలందించుచు లక్ష్మణుడు అప్రమత్తుడై వారలను కాపాడుచుండెను.

పంపా సరోవర ప్రాంతం ఎంతో మనోహరమైనదిగా వారికి గోచరించింది. అనునిత్యం అచ్చట ప్రకృతి సౌందర్యమును తిలకించు చున్న సీతాదేవి పొందు అనిర్వచనీయమైన అంతరానందమునకు అవధులు లేవు. కొండల నుండి మహోద్ధృతముగా, ఉద్ధతిన దూకి వచ్చు సెలయేళ్ళ తుళ్ళింతలు సీతను మైమరపింపజేసెడివి. ప్రవాహ వేగము వలన, నీటి తుళ్ళింతల వలన ఏర్పడిన మృదు మధుర మంద్ర ధ్వనులు ఆమెకు వీనులవిందు గొలుపుచు పులకింపజేసెడివి. అప్పటికి సీతారామ లక్ష్మణులయోధ్య వదలి పదిరోజులు కావచ్చుచున్నవి.

## దశరథుని విలాపము

దశరథుడు శ్రీరామచంద్రుని అడవులకు పంపించి, అవ్యవస్థిత మనస్కుడై అంతులేని దుఃఖ సాగరములో మునిగెను. అనాలోచిత ముగ భార్యా వ్యామోహముచే కైకేయికి వరములిచ్చి మోసపోయి నాను.

"కౌసల్యా! నేను నీకు తీరని అన్యాయము చేసినాను. నన్ను మనస్ఫూర్తిగా క్షమించి నీ ఉదార హృదయమును ప్రకటించుము. దీనుడను, దుఃఖ భాగుడను దయనీయుడను. అశక్తుడను పైగా మతి చలించిన వృద్ధుడను. ఇట్టి నన్ను ఎట్లు మన్నింతువో! నేను పెక్కు కాలము జీవించు పనిలేదు. కౌసల్యా! నాకు చూపు మందగించినది. ఏదీ నీ హస్తమును నా కందించుము..." అని విలపింపసాగెను.

దశరథుని దయనీయ స్థితికి, అచటనున్న అంతఃపుర పరిచారికా గణముకూడ తీరని దుఃఖాకులమైనది.

దశరథుడు స్వస్థత తప్పి, ఏవో అర్థరహితములు, అర్థాంతరము లైన మాటలను మాట్లాడుచున్నాడు. చెంతనే ప్రియరాణులు, అంతః పుర పరిచారకులు, అందరూ ఆ పరిస్థితిలో రాజును వదిలి వుండుట మంచిది కాదని భావించి, అచటనే జాగరూకులై యుండిరి.

## దశరథుడు ముని బాలకుని హతమార్చిన వృత్తాంతము

దశరథున కించుక పూర్వపుటాలోచనలు కలిగినవి. చెంత నున్న రాణి కౌసల్యతో ఇట్లు తన పూర్వ వృత్తాంతము చెప్పదొడగెను.

"కౌసల్యా! నిన్ను నేను వివాహమాడక పూర్వము అయోధ్యా నగర యువరాజుగా నున్నప్పుడు ఒకనాడు ముచ్చటపడి, సరయూనదీ తీరమున గల దూరారణ్యమునకు వేటకై జనితిని. అది కటిక చీకటి ఏమియు కనిపించుట లేదు. దూరాన నదిలో 'బుడ బుడ'మని నీటి శబ్దము వినిపించినది. ఏదో అడవి ఏనుగు తొండముతో నీటిని త్రాగు చున్నదని భ్రమించి, నాకుగల శబ్దవేధి విద్యా పరిజ్ఞానముచే అమ్మును వింటీన సంధించి ఆ శబ్దము వచ్చు దిశకు వదలితిని. ఆ బాణము కమండలముచే నీటిని ముంచుకొనుచున్న ఒక మునిబాలకుని ప్రాణ మూలముల నాటుకొన్నది. మునిబాలకుడు "అమ్మా!"యని బిగ్గఱగా ఎలుగెత్తి ఆర్తనాదము చేసి పడిపోయెను. నేను ఆ శబ్దమును విని, అది జంతువు శబ్దము కాదని, మనుష్య శబ్దమని భావించి, భయపడి పరుగు పరుగున నది వద్దకు చేరితిని. అక్కడ బాణాభిహతుడైన ముని కుమారుడు నెత్తురు మడుగున పడి మరణవేదన మనుభవించు చున్న దారుణ ఘోర దృశ్యమును చూచితిని. అక్కటా ఎంతటి పాపమును మూటగట్టికొంటిని. మృగయా వినోదమెంతటి ఘోర వ్యసనముగ మారినది. క్రూర కర్మడను ఇట్టి పాపమునకు ప్రతి కృతి యనునదుండునే! అయ్యో!

మహారాణీ! కౌసల్యా! ముని కుమారుని హతమార్చిన ఘోర కృత్యమునకు నేను మిక్కిలి వగచుచు ఆ బాలకుని దరిజేరి "నాయనా! నీవెవ్వడవు? నే నయోధ్యా నగర యువరాజును దశరథుడను వాడను. ఏదియో మృగమని భావించి, దూరమునుండి శబ్దవేధి కౌశలముచే వింటినుండి బాణమును వదలితిని. ఆ బాణము నీ ప్రాణ మూలముల నాటి, ప్రాణాంతకమైనది. ఈ నిమిత్తముగ నేను ఘోర పాపమునకు

ఒడిగట్టితిని. నా దుష్కృతికి నిష్కృతి లేదు. నన్ను మన్నింపుము. అజ్ఞాన దోషోపహతుడనై యీ అకృత్యమున కొడిగట్టితిని. అని ఆసన్న మరణుడైన ముని కుమారుని ముందు సవినయముగా, దుఃఖముతో చేతులు మొగిచి నిలుచొని యుంటిని.

అంతలకా మునిబాలకుడు అయ్యా! ఈ సరయూనదీ తీరారణ్య ప్రాంతమున ఒక పర్ణ కుటీరము నేర్పరచుకొని, వృద్ధులు, అంధుల నైన మాతా పితలను సేవించుచు కందమూలాదులు సేవించుచు తపో వృత్తి నున్నవాడను. నిస్సహాయులు, వృద్ధులైన నా తల్లి దండ్రులకు నే నొక్కడనే కుమారుడను. వారి ఆలనపాలనకు నే నొక్కడనే దిక్కు.

ఇచటికి కొలది దూరములో నా తల్లి దండ్రులున్నారు. వారు తీరని దాహముతో అలమటించుచున్నారు. వారి దాహమును తీర్చు టకు నీటికై కమండలముతో వచ్చి ఈ నదీ జలములను తీసుకొను చుండగా, హఠాత్తుగా ఎచటినుండియో మృత్యు దేవతవలె ఈ శరము వచ్చి నన్ను నాటినది.

రాజా! తెలిసి చేసినను, తెలియక చేసినను పాపము పాపమే. అట్టి పాపఫలమును కర్తయైన వారు అనుభవింపక తీరదు.

ప్రస్తుతము దీనులై, అనాథలై, తీవ్రమైన దాహముచే పరితపిం చుచు నా రాకకై నిరీక్షించు నా తల్లి దండ్రులకు ఈ జలము లందిం చుము. ఆసన్న మరణుడనైన నా చివరి కోరిక ఇదియే. నీవు వెళ్ళనిచో పిపాసా పీడితులైన వారు నిన్ను శపింతురు.

"దశరథా! నీవు అచ్చటికి వెళ్ళుటకు ముందే, నా ప్రాణ మూల ములను నాటియున్న ఈ శరమును బయటికి పెరకివేయుము. దీని బాధను భరింపలేను" అని దీనముగా వేడుకొనెను.

నేనట్లు చేయగా ముని బాలకుడు ప్రాణములను వదిలెను.

ప్రాణములు వదలిన ఆ బాలకుని కళేబరమును నేను భుజముపై నిడుకొని, మంచి నీరమును గొని, వృద్ధ ముని దంపతులున్న యెడకు అడుగులో అడుగు వైచుచు దుఃఖాతిరేకముతో మాట పెగులకుండగా మౌనముగా వెడలితిని. వారును నా యడుగుల సవ్వడిని విని,

నాయనా! కుమారా! ఎంత ఆలసించితివోయీ! అంధులమైన మేము నీ యాలస్యమునకు కారణము తెలియక మిక్కిలి యలమటించు చున్నాము. అసలే దాహముగొనియున్న మాకు నీ యాలస్యము మరింత బాధపెట్టినది...! నాయనా! మాట్లాడవేమయ్యా!" అని వాపోయిరి.

నేను దుఃఖముతో పూడిపోయిన గొంతుకతో "మహాత్ములారా! మునిదంపతులారా! నేను మీ కుమారుడగాను. ముందు మీరీ పానీయమును గ్రహింపుడు తరువాత జరిగినదంతయు చెప్పెదను" అంటిని. మునిదంపతులు నీరమును ప్రాశింపలేదు. వారు అందోళనముతో ముందు నీవెవరవో చెప్పుము. మా కుమారుడేడి?" అని ప్రశ్నింపగా నేను జరిగినదంతయు సవిస్తరముగ విన్నవించితిని.

మునిదంపతులు కుమారుని మరణమునకు మిక్కిలి దుఃఖించిరి. పిమ్మట మృతుడైన తమ కుమారుని శవముపైబడి హృదయ విదారకముగ విలపించిరి. తరువాత కుమారునికి నా సహాయముతో అచటనే చితిపేర్చి అగ్ని సంస్కారము గావించిరి.

మునిదంపతులు తాము జీవించియుండగనే చిరంజీవియైన తమ కుమారుడు మరణించుటకు అంతులేని దుఃఖముననుభవించి, "దుర్మార్గుడా! నీవును నీ ముసలి తనములో పుత్రునెడబాసి, మావలెనే కుమారా! కుమారా!" యని విలపించుచు చత్తువుగాక యని శపించి వారును ప్రాణములను వదలిరి.

కౌసల్యా! ఇప్పుడు నాకానాటి సంఘటనము, మునిశాపము గుర్తుకు వచ్చుచున్నది. నేనింక ఎన్నో రోజులు జీవింపను. ఆ ముని దంపతులవలెనే పుత్రశోకముచే నేను మరణించుట తథ్యము.

దేవీ! నన్ను వదిలి నీవెచటకును పోకుము-సుమిత్రా! నీవును నన్ను వదలి యుండకుము. క్రూర బుద్ధివి, క్రూర దర్శనవు ఐన ఓ కైకేయీ! నీవును ఎటూ కదలక యుండి, నిశ్చింతగా, నా మరణమును వీక్షించి చిత్తశాంతినందుము...

## దశరథుని మృతి

దశరథుడట్లు అంతులేని పుత్ర వియోగ దుఃఖముననుభవించుచు ఆ రాత్రి ప్రొద్దుపోవు వరకును అతికష్టముమీద గడిపెను. కౌసల్య, సుమిత్రలు, అంతఃపుర పరిచారికలు, రాజవైద్యులు, సుమంత్రుడు, ముఖ్యసేనానులు అందరూ కౌసల్యామందిరమునందే అప్రమత్తులై కంటికి నిద్రలేకుండా యుండిరి.

రాత్రి మూడవ ఝామున అయోధ్యాపతి, దశరథ మహారాజు తన ప్రాణములను విడిచెను.

## భరతునికై కేకయ రాజ్యమునకు దూతలు వెళ్ళుట

దశరథ మహారాజు రాత్రి ప్రొద్దుపోయిన తరువాత తనువును చాలించిన వెంటనే కౌసల్య మొదలైనవారు, అంతఃపుర స్త్రీలు, యావన్మంది ఘొల్లున విలపించిరి. రాజపురోహితుడు వశిష్ఠుడు, సుమంత్రుడు అందరూ దశరథుని మరణమునకు చింతించి, భావి కార్య విధానము నాలోచింప గడంగిరి- తెల్లవారితే రాజులేని రాజ్యమీ కోసల దేశము అని విచారించి దశరథుని శరీరమును తైలపేటికలో నుండ శ్రద్ధ వహించెను. వెంటనే రాకుమారులైన భరత శత్రఘ్నుల కొరకు కేకయ రాజ్యమునకు రాజదూతలను పంపించెను. దూతలతో వశిష్ఠుడు "దూతలారా! మీరు తక్షణమే కేకయ రాజ్యము చేరుకొని, రాజునకు నమస్కరించి, భరతశత్రుఘ్నులను మా ప్రభువులు వెంటనే తీసుకొని రమ్మని మమ్ము పుత్తెంచినారు. మీరును యే మాత్రము ఆలస్యము చేయక, రాజపుత్రులను మా వెంట పంపుడు. అక్కడవారు అత్యవసరమైన కార్యక్రమమును నెరవేర్చవలెను. అని చెప్పి తీసుకొనిరండు-" అని దూతల నాజ్ఞాపించి పంపెను.

రాజదూతలు ఆ ప్రకారముగనే భరతుని తీసుకొని వచ్చుటకు వెళ్ళిరి.

తెల్లవారగనే అయోధ్యానగర ప్రజలు తండోపతండములుగా రాజమందిరము చేరుకొని, హాహాకారములతో దుఃఖించుచు కూృరాత్మ

యైన కైకేయి చేష్టను పలువిధముల నిందించసాగిరి ఆమె దుర్మార్గ మును తలపోసి తిట్టనివారు లేరు.

వశిష్ఠులవారు పంపిన దూతలు కేకయ రాజ్యమునకు ఏడు పగళ్ళు, ఏడు రాత్రులు ప్రయాణించి చేరుకొనిరి. పిమ్మట రాజును కలిసి వారు తాము వచ్చిన కారణమును వివరించి వెంటనే భరతుని పంపమని కోరిరి.

## భరతుని స్వప్నము

భరతుడు, తండ్రిగారి వద్ద నుండి దూతలు వచ్చిన సంగతి తెలుసుకొని ప్రయాణమునకు సిద్ధపడెను. అతడు తాతగారైన కేకయ రాజునొద్ద సెలవు తీసుకొని, ఆ రాత్రి తన మందిరమునకు వెళ్ళి భార్య మాండవితో మాట్లాడి, నిద్రించెను. కాని భరతునకు ఎంత ప్రయత్నించినను నిద్ర పట్టలేదు· చివరకు ఎట్లో రాత్రి మూడవ ఝామునకాని అతనికి నిద్ర పట్టలేదు. ఆ నిద్రలో ఒక భయంకరమైన కలవచ్చి, భరతుని భయ భ్రాంతుని చేసినది. స్వప్నములో తన తండ్రి దశరథుడు నల్లని బట్టలు కట్టుకుని నూనె త్రాగుచున్నట్లుగాను, దున్నపోతును ఎక్కి దక్షిణదిశగా వెళ్ళుచున్నట్లుగాను, రాముడు గుఱ్ఱము నెక్కి దండకారణ్యములోనికి వెళ్ళిపోయినట్లును, అంబుధు లింకినట్లును, అగ్ని చల్లబడినట్లును అంతటా గాఢాంధకారము వ్యాపించినట్లును, తండ్రిగారున్మత్త ప్రలాపముల బొబ్బరించు చున్నట్లును కల వచ్చెను.

తెల్లవారగనే భరతుడు తనకు రాత్రి వచ్చిన భయంకరమైన కలను గూర్చి, మిక్కిలి చింతించెను. అనేక విధములైన ఆపత్సూచి భయములు ఆతని మనస్సు నావరించి మిక్కిలి కలవర పెట్టసాగినది.

భరతుడట్లాలోచించుచు, విభ్రమ భ్రమములో కూరుకొని యున్న సమయములోనే, అయోధ్యాపుర దూతలు భరతుని సందర్శించుకొని, ఆతని ప్రయాణమును గూర్చి జ్ఞప్తిచేసిరి.

భరతుడు వచ్చిన దూతలను ప్రియవాక్యములచేనాదరించి "దూతలారా! మీరు అయోధ్యనుండి బయలుదేరి ఎన్నాళ్లైనది. మా తండ్రిగారు, తల్లులు, మా అన్నగారైన శ్రీరామచంద్రుడు అందరూ క్షేమముగానే యున్నారా?" అని కుశల ప్రశ్నలడిగెను.

దూతలు మౌనముతో ఏమియు సమాధానము చెప్పలేక మిన్నకుండి పోయినారు. భరతుడు మరల ప్రశ్నింపగా దూతలు "రాకుమారా! మిమ్ములను మంత్రిపురోహితులు, వశిష్ఠులవారు తక్షణమే వెంటబెట్టుకొని రమ్మనినారు. మాకంత కంటే యేమియు తెలియదు. మీరు మాత్రము వేగిరమే బయలుదేరి రావలెనట".

భరతుడు దూతల మాటలను విని, తాతగారి వద్దకువెళ్ళి "మేము అయోధ్యకు బయలుదేరి వెళ్ళుచున్నాము. మా గురువులు వశిష్ఠుల వారు మమ్ములను తొందరగా తీసుకొని రమ్మన్నారట." అని చెప్పాడు.

కేకయరాజు "అట్లే" యని అంగీకరించి భరత శత్రుఘ్నుల ప్రయాణమునకు సిద్ధము చేయుడని సేవకులకు ఆజ్ఞాపించెను.

భరత శత్రుఘ్నులు వడి వడిగా రథముపై బయలుదేరిరి. వెనుకగా అయోధ్యనుండి వచ్చిన దూతలు కేకయ రాజొసంగిన వస్త్ర వాహనములు అనుసరించి వచ్చుచుండెను.

భరతుడు ఆఘమేఘాల పరుగుతో రథమును పరుగెత్తిస్తూ మూడురాత్రులు, మూడు పగళ్ళు విధి విరామం లేకుండా ప్రయాణం చేసి, అయోధ్యకు చేరుకున్నాడు. నగర సమీపానికి చేరుకునే సరికి సంధ్యా సమయం కావస్తున్నది. అతనికి నగరమంతా కళా విహీనమై తోచింది. చెట్లు పుష్పములు లేకుండా కనిపించినవి. ఆకసమున మేఘములు మూగవోయినట్లు కనిపించినవి. కుక్కలు శోకముతో వికృతారావములు చేయ దొడగినవి. గ్రద్దలు నగర పరిధిలోని గగన తలంపై అటు నిటు రెక్కలను చాచి తారాడ జొచ్చినవి. గుడ్లగూబల సంచారము కానవచ్చినది. ఎక్కడ చూచినా నిశ్శబ్దము తాండవించియున్నది. అంతులేని అపశకునములు నగర ప్రవేశములోనే కలుగుట చూచి భరతుడు మిక్కిలి ఆందోళన చెందెను. జరుగరాని దేదియో అరిష్టము

నగరమున, అందునను రాజ కుటుంబమున జరిగి యుండునని ఆతని మనస్సు శంకించినది.

## కైకేయి మందిరమున భరతుడు

భరతుడు ఎక్కడను ఆగక తన తల్లియైన కైకేయి మందిరమునకు దారితీసెను దారి పొడవున ప్రశాంత గంభీర వాతావరణము నెలకొని యుండుట గమనించెను. ప్రజలు గుంపులు గుంపులుగా చేరి గుసగుసలుపోవుట గమనించెను. వారు భరతునిచూచి దూరదూరముగా పరుగులు తీయుట గాంచెను. తన తండ్రి తల్లియైన కైక మందిరములో నుండునని భావించి, నేరుగా రథమునచ్చటికే పోనిచ్చెను.

భరతుడు రథమునుదిగి, మాతృ మందిరములోనికి అడుగిడెను. అచట కైకేయి కుమారుని చూచి మిక్కిలి ఆనందముతో "రా నాయనా!" అని కుమారుని చేయి పట్టుకొని అంతఃపురములోనికి తీసుకొనిపోయెను. అక్కడకు వెళ్ళిన భరతునికి తండ్రి మంచము ఖాళీగా కనిపించినది. అది చూచి భృకుటి ముడిపడి తల్లిని సంబోధించెను. "అమ్మా! తండ్రిగారు శయనించు మంచము ఖాళీగానున్నది. కారణమేమి? పురము, అంతఃపురము అంతయు మూగపడియున్నది. చెప్పు తల్లీ! తండ్రిగారు క్షేమమేనా? ఎవరికి ఏమియు కష్టము సంభవింపలేదు కదా! ఎందుకో నాకు అమితమైన దుశ్శకునములు కలుగుచున్నవి. చెప్పు తల్లీ! అసలేమి జరిగినది."

భరతుని ప్రశ్నకు కైకేయి వెంటనే సమాధానము చెప్పలేక పోయినది. అయినా తన సంకోచ నిస్సహాయతలను ముఖమున కనిపింపజేయకుండా జాగ్రత్తపడి, భరతుని మనసెరిగినదగుటచే శుష్కమైన దరహాసమును ముఖముపై తెచ్చుకొని "నాయనా! భరతా! ఎప్పుడు ప్రయాణమైతివో ఏమో చాల బడలికగొనియున్నావు. ముందు స్నానాదికములుచేసికొని, బడలికను తీర్చుకొనుము. తరువాత సావధానముగ ముచ్చటించుకొనవచ్చును. సీతో ముచ్చటించవలసినవి చాల యున్నవి.

భరతుడు అందులకంగీకరించలేదు. విషయమేమిటో చెప్పుమని తల్లిని గట్టిగా నిలదీశాడు.

కైకేయి భరతునితో సానునయముగా ఇట్లు చెప్పదొడగినది.

"భరతా! ఈరోజు విధిగా నీకు పట్టాభిషేకము జరుగవలసి యున్నది. అందులకే నిన్ను సత్వరముగా పిలిపించుట జరిగినది. జరుగునదంతయు నీ శ్రేయస్సును తద్వారా రాజకుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జరుగును. జరిగిన పరిణామమునకు కలతచెందక ధీరోదాత్తుడవై, కర్తవ్యనిష్ఠుడవై నీకప్పగించబడు బాధ్యతలను అత్యంత జాగరూకుడవై నిర్వహింపుము.

కైక అన్న మాటలు భరతునకర్థముకాలేదు. అతనిలో అనుమానము మరింత చోటుచేసుకొన్నది.

"తల్లీ! నీ మాటలు నాకు అసలు బోధపడుటలేదు. తండ్రిగారు ఎక్కడికి వెళ్ళినారు? అన్న రామచంద్రుడెచ్చటనున్నాడు? నేను పట్టాభిషిక్తుడనగుటయేమి? త్వరగా చెప్పవమ్మా! అట్లగుటకు ఏమి పుట్టి మునిగినది...?"

భరతుని మాటలకు కైక ఇంచుక భయముతో చలించినది. అయినను కరడుకట్టిన ఆమె మనస్సులో నిండి నిబిడీకృతమైయున్న కుమారుని పట్టాభిషేకమను విషయము లజ్జాహీనను చేయగా సహజముగనే ఆమె భరతునితో ఇట్లన్నది :

"భరతా! నీ తండ్రిగారు కాలగతిననుసరించి మమ్మందరను దుఃఖసాగరమునముంచి పరమపదించినారు."

తల్లి ఈ కఠోరమైన మాట చెప్పగనే భరతుడు ఒక్కుమ్మడిగా మొదలు తెగిన మహావృక్షమువలె "హా తండ్రీ!" యని బిగ్గఱగా ఱచి నేలకూలెను. పిదప కొంతసేపటికి చేవయుడిగినవాడై మెల్ల మెల్లగా మోపికను కూడదీసుకొని చేతులల్లార్చుచు నిలబడి రోదించసాగెను.

కైక, భరతుని పరిపరి విధములననునయించసాగినది. "నాయనా! ఎట్టి వారికైనను కాలగతి అనుల్లంఘనీయముకదా! వేద శాస్త్రములను చదివినవాడవు. లోకధర్మము, లోకవర్తనములెరిగిన

ప్రాజ్ఞుడవు. చనినవారికై వగచుటకంటే, తేరుకొని యవశ్య కర్తవ్య మును సమాచరించుట నీవంటి ధర్మవిదులకిప్పట్టున చేయదగిన కార్యము.

అతని తల్లితో భరతుడిట్లనియె.

"అమ్మా! తండ్రిగారు తమ అంత్యకాలములో నాకొరకై ఏమైనను సెలవిచ్చిరా! చెప్పుము. వారి చివరి పలుకులేమో సవి స్తరముగా నెరిగింపుము." అని భరతుడడుగగా కైక యిట్లనెను. "నాయనా! మీ తండ్రిగారు చనిపోవునపుడు నిన్ను గూర్చి ఏమియు అవలేదు. రామా! యనియు సీతా! యనియు, లక్ష్మణా యనియు పలుమార్లు పలవిరించి పలవిరించి, తుదకు దివిజధామము చేరినారు అంతే."

భరతుడు తల్లి నుండి మఱొక బెట్టిదమైన మాట విని సంతాపం చెందాడు. తండ్రిగారు చివరలో "రామా! సీతా! లక్ష్మణా!" యని యెందుకు వాపోయిరో తెలియదు. అతడు తల్లి మొగమువైపు సూటిగా చూచి అమ్మా! అన్నగారైన శ్రీరామచంద్రుడు, వదినగారి తోను, తమ్ముడైన లక్ష్మణునితోను తండ్రిని బాసి ఎచ్చటికేగిరి? తండ్రిగారట్లు విలపించుటకు కారణమేమి? అచ్చటనుండి తక్షణమే నారాకనుగోరి సందేశహరులురాగా, నేను తండ్రిగారిని చూడ తక్షణమే బయలుదేరి వచ్చితిని. వచ్చిన ఇచ్చట జరిగినది యేమి?

కైక తన చెప్పుమాటలు కుమారునకు ప్రీతికలిగించునవే యని నమ్మెను. పుత్రవ్యామోహ మెంతయైనను చేయించును కదా!

కైక యిట్లు చెప్పినది. "కుమారా! తండ్రి మాటను తల దాల్చి సుగుణశీలుడు లోకోత్తముడైన నీయన్న శ్రీరామచంద్రుడు అడవుల కేగెను. అతనితో సీతయు, లక్ష్మణుడును అనుసరించిరి. అది నాకు నీ తండ్రి మునుయిచ్చిన వరములు రెంటిలోనే గోరిన దొకటి. వేఱొ కటి నీకు పట్టాభిషేకమూ. ఇదంతయు నీమేలు కోరియే చేసితిని. కాని విధి కొంత వక్రించినది. నీతండ్రిగారు మాత్రము తన ప్రియ తనూజు

డైన శ్రీరాముని యందు ఎనలేని ప్రీతిచే, వనగమనమువలన యాతని వియోగమును సహించలేక గుండె చెదరి మరణించెను.

నాయనా! నీ శోకమును మానుము. నీకొరకు మంత్రి పురోహితాదులు ఎదురుచూచు చున్నారు. రాజులేని రాజ్యము అరాజకము కదా! కావున క్షణమైనను ఆలసింపక పురోహితులు చెప్పి నది చేసి, పట్టాభిషేకోత్సవమునకు సిద్ధము కమ్ము. అయోధ్యా నగరము ముఖ్యపట్టణముగా నున్న ఈ సువిశాలమైన కోసల దేశమును, ఇందుగల అపారమైన రథగజ తురగతుంగ పదాతి యుక్తమైన సేనాసంపదయు, సంపదయు నీ యధీనములు. వీని సహాయమున ఎల్లప్పుడు అప్రమత్తుడవై రాజ్యభార ధూర్వహుడవు కమ్ము. ప్రజారంజకుడవై పరిపాలనము సాగించి, నీ తండ్రి తాతల కీర్తిని నిలుపుము.

## భరతుడు కైకేయిని నిందించుట

కైకేయి మాటలను మధ్యలోనే ఆపి, జరిగిన ఘోర ఉదంతము నంతయు తెలుసుకొన్న భరతుడు తీవ్ర దుఃఖము, ఆవేదనము కోపము ముప్పిరిగొనగా కైకను తీవ్రముగ నిందించెను.

'ఓసీ! కులపాంసనీ! ఘాతకీ! ఎంత దారుణమైన కర్మమున కొడిగట్టితివి. పుత్రవ్యామోహ పీడితవై దైవమువంటి తండ్రిని పొట్టన బెట్టుకొంటివి. తండ్రి వంటి అన్నను నిర్దయగా అడవుల కంపితివి. వీరిరువురికి దూరమైన భాగ్యహీనుడను నాకు రాజ్యమెందులకే?

రాముని యెడల నాకు గల భక్తి ప్రపత్తులు నీవెఱుగవా? అగ్రజుడు, అర్హుడు, సర్వశక్తిమంతుడు, ప్రజారంజకుడైన రాముని కాదని నేనెట్లు రాజ్యమును స్వీకరింతుననుకొంటివి.

కులఘ్ని! రాముడు నిన్ను తన కన్నతల్లి కంటె మిక్కిలిగా గౌరవించు సుగుణాత్ముడు కదే! అతనిని కానలకు బంపుటకు నీకు మనసెట్లు వచ్చెను?

"జ్యేష్ఠుడు రాజగుట. తక్కిన అనుజన్ము లాతనిని భక్తి గౌరవములచే పూజించి యనుసరించుట గోత్రపాలురైన రాజ వంశము లలో గల యాచారము. అట్టి యాచారమును మంటగలిపితివి.

భరతుడట్లు కైకను కసిదీర నిందించి నిన్ను రాముడు తల్లిగా కడు గౌరవమున మన్నించును గావున నీకేమియు శిక్ష యొనరింపక విడిచితిని. నీవు నాకు తల్లివని చెప్పుటకు కూడ నోరువచ్చుట లేదు. నీవంటి దుర్మార్గురాలు ఎచ్చటను ఉండదు. భర్తను బలిగొన్న రాక్షసివి. నీ ముఖము చూడకూడదు. కుటిలబుద్ధితో నీవు చేసిన ఈ దుశ్చర్య నెన్నటికిని పొగనీయను. పుణ్యవతి, పట్టపుదేవి, దివ్యజననియైన కౌసల్యామాత కెంత గర్భశోకమును తెచ్చిపెట్టితివి. ఛీ! నీవు నా ఎదుట నుండతగవు. నేను యిచ్చట ఒక్క క్షణమైనా యుండను. నేనిపుడే కౌసల్యామాత సన్నిధికేగి యామెను శరణు వేడెదను. అని భరతుడు దురంత దుఃఖముతో కౌసల్య మందిరమున కేగెను.

## భరతుడు - కౌసల్య

భరత శత్రుఘ్నులు కౌసల్య మందిరములో అడుగిడిరి. వారి రువురు ఆమెను కౌగలించుకొని పెద్దపెట్టున విలపించిరి.

"భరతా! నీవుకోరిన రాజ్యమును మీ తల్లి ఆర్జించి యిచ్చినది తీసుకొనుము. నా కుమారుడు రాముని యడవులపాలు జేసినది. నాయనా! దాని వలన మీ తల్లికి కలుగు లాభమేమో తెలియకున్నది. అయినను సరే. నాయనా! మమ్ము రాముని యొద్దకు పంపుము. ఈ రాజ్యమును మీ తల్లి కోరిక చొప్పున పరిపాలింపుము."అని దుఃఖాతి రేకముతో కౌసల్య పలికినది. భరతుడు కౌసల్య పాదములకు నమస్క రించి, ఏమియు సమాధానము చెప్పలేక నేలపై సొమ్మసిల్లినట్లు పరుండెను.

వశిష్ఠ మహర్షి, సుమంత్రుడు భరతుని రాక విని, భరతుని చెంతకువెళ్ళి,ఆతని దుఃఖమును చూచి వారును మిక్కిలి దుఃఖించిరి,

చివరకు కౌసల్య చెంతనే నేలపై పరుండియున్న భరతుని అనునయ పూర్వకముగా లేవనెత్తి "భరతా! శాంతింపుము. జరిగినదంతయు పీడ కల. నీవు యిప్పుడు రాజువు. నీ తండ్రి కళేబరం సంస్కార హీనమై యుండే యున్నది. ఇక మీదట జరుగవలసిన కార్య భారమంతయు నీవే ఓరిమితో వహించవలెను. అని చెప్పగా భరతుడు వారితో మహాత్ములారా! మీరును నన్ను అనుమానించి నిందించుచున్నట్లు తోచుచున్నది. రాజెక్కడ? రాముడెక్కడ? రాజ్యమెక్కడ? నేనెక్కడ? అన్న యుండగా నన్ను రాజనుట అవమానించుట కాదా! మ ' ర్షీ! వశిష్ఠ మునీ! నేనెన్నడును రాజు కావలెనని కోరుకొనలేదు. నా తల్లి చేసిన పాపానికి నేను కూడ బలి కావలెనా? నన్ను మీరే రక్షింపుడు అని వశిష్ఠ మహర్షి పాదములపైబడెను.

పిమ్మట భరతుడు కౌసల్యా మందిరములోని వారందరకు నమస్కరించి ఘొల్లున నేడ్చెను.

## భరతుడు కౌసల్య సన్నిధి శపధము చేయుట

పిమ్మట భరతుడు కౌసల్య పాదములకు నమస్కరించి నిలుచొని యిట్లు పలికెను.

"తల్లీ! పితృసమునివంటి యన్నను యడవులకు పంపగా సహించి యూరుకొనునంతటి ద్రోహినికాదు. సుగుణాఢి రాముడైన రాముని కాదని నేను రాజ్యభారమును పూనుటయన్న ధర్మ విరుద్ధమైన కార్యము నీ భరతుడు ఎన్నటికినీ చేయడు. నన్ను నమ్ముము.

ఇట్లు భరతుడు కౌసల్యకు విన్నవించగా కౌసల్య యాతనిని నోదార్చినది. భర్తను కోల్పోయి, కన్నకుమారుడు యడవులబట్టిపోగా దుఃఖ భారముచే బరువెక్కిన హృదయముతో నోటమాట రాకయున్న కౌసల్యకు భరతుని దుఃఖం, అతని నిర్దోషిత, గాంచి పరితపిల్లినది.

"కుమారా! భరతా! ప్రియకుమారుడైన రాముని వియోగము చేత తపించుచున్న నన్ను నీ మాటలు శపథముల ఊరడించినవి, నా యుసురులు కొంత నిలిపినావు.

"లక్ష్మణుని వలెనే నీవును, శత్రుఘ్నుడును నీయన్న యెడల మిక్కిలి భక్త్యాదరములు కలిగియుండుట నేనెరుంగుదును. ధర్మ మూర్తియైన రాముని, అన్ని విధముల ననుసరించుచు సహోదర ధర్మ మును నియతి తప్పక నిర్వర్తించుచున్నారు. సజ్జన మాన్యులైన రాకుమారులుగ నేను మిమ్ము భావించుచున్నాను." అని మరల మరల నూర్పులు నిగుడించుచు ఏడ్చినది.

రాత్రి గడిచింది.

తెల్లవారుఝామున వశిష్ఠుడు భరతుని వద్దకు వచ్చి, నాయనా! భరతా! శోకముడిగి యిక నేటి ముఖ్య కర్తవ్యమును నిర్వహింపుము. నీ తండ్రిగారిని ఉత్తరక్రియలు జరుపవలసి యున్నది అని చెప్పెను.

భరతుడు వెంటనే వశిష్ఠుని వెంట నిడుకొని తండ్రి శరీరముంచిన ప్రత్యేకమైన గది వద్దకు వెళ్ళెను. ఋత్విక్కాచార్య పురోహితులతో కూడి, వారు చెప్పినట్లు పురబహిః ప్రదేశమున తండ్రికి చితిని పేర్చి యథావిధిగ, అగ్నులు రగిల్చి ఊర్ధ్వదైహిక క్రియలు నిర్వహించెను. ఆసందర్భమున బ్రాహ్మణోత్తములకు అమితములైన భూ గో హిరణ్య దానముల నొనర్చి యర్చించెను. పదమూడవ దినమున భరతుడు తండ్రి యస్థి సంచయమును, సంచయనము గావించుటకు ప్రేత భూమి కడకు వచ్చి చితి మూలమున దుఃఖముతో క్రిందపడెను. భరతుడు నేలపై బడిన శత్రుఘ్నుడు కూడ తండ్రిని తలచుకొని తీవ్ర విస్మృతికి లోనైనాడు. శత్రుఘ్నుడిట్లనుకొన్నాడు. ఈ దురవస్థ యంతయు పాపిష్ఠి మంధరవలన యేర్పడినదికదా! ఆమె దుర్బోధలే లేకున్న కైకమ్మ తల్లి కిట్టి విపరీత బుద్ధులు కలుగునా? కలుగవనియే తలతును ఏది ఏమైనను". ఇక జరుగవలసినదంతయు అన్నయైన భరతుని ఆధీనములోనున్నది." అనుకొనుచు మందిరమునకు చేరిరి.

వీరు మందిరములోనికి కడుగిడు చుండగనే చక్కని పూల ధరించి, మెడనిండ నిండైన యాభరణములు ధరించి, కొందరు

సఖులతో వచ్చుచుండుట గాంచి, అచ్చటి ద్వారపాలకులు క్రోధావిష్టులై, యామెను శత్రుఘ్నుని ఎదుట బలవంతముగ నీడ్చుకొనుచు, దెచ్చి నిలిపిరి. శత్రుఘ్నుడు, రాజవంశ సర్వ వినాశమునకు బీజకారిణియైన మంధరను చూచి, పట్టరాని కోపముతో చేతులతో కొట్టి, కాలితో తన్నుచు నేలమీద యీడ్చుచు బోయెను. కైక యీ దృశ్యమును చూచి భయముతో కుమారుడైన భరతుని యాశ్రయించినది. భరతుడు తమ్ముడా! శాంతింపుము. మంధర యాడుది. యాడుదానిని చంపుట అయుక్తము వదలి వేయుము. అనగా శత్రుఘ్నుడు అతి ప్రయత్నము మీద శాంతించెను.

అప్పుడు భరతుడు అటనున్న వారలతో "మీరు చింతింపకుడు. మా వంశ ఆచారక్రమము ననుసరించి, పెద్దవాడైన రాముడే రాజు కాగలడు. నేను ఎంత మాత్రము రాజ్య భారము వహించుట కర్హుడనుకాను. నేనిప్పుడే అరణ్యమున రాముడున్న చోటికివెళ్ళి, యాతని పాదములకు నమస్కరించి, జరిగిన తప్పిదమునకు మన్నింపుమని వేడికొని, యాతనిని తిరిగి తెచ్చి రాజ్యాభిషిక్తు నొనరించి, యతనికి బదులుగ నే నరణ్యవాసమొనరింతును. ఇది నిజము - నిశ్చయము." అని -

మంత్రి సేనానులవైపు తిరిగి "మీరు మా వనగమనమునకు మార్గమును సుకరము చేయుడని యాజ్ఞాపించెను. భరతుని యాజ్ఞ ప్రకారము ఎట్టి యాలస్యమును లేకుండ వనమార్గము సరిచేయబడినది. భరతుడు వనగమన వార్త రాజోద్యోగులకు, ముఖ్యులగు పౌరజనపదులకు దెల్పి సభ గావించెను - సభలో భరతుడు అందరికీ ఇట్లు విన్నవించెను.

"సభాసదులారా! లోకాభిరాముడైన శ్రీరాముని వనగమనము, అటు పిమ్మట రామ వియోగదుఃఖముచే తండ్రిగారి బలవన్మరణమును నన్ను మిక్కిలి కలచివేసినవి. ఏ పరిస్థితిలో ఈ రెండును సంభవించినవో నేను మీకు వివరించ పనిలేదు. జరిగినదంతయు ఒక పీడ కలగా నేను భావించుచున్నాను.మీరును అట్లేభావింప వేడికోలు. నేనిపుడే శ్రీరామ చంద్రుని, అడవులనుండి మగుడి అయోధ్యకు కొని తెచ్చుటకు సకల సన్నద్ధుడనై వెళ్ళుచున్నాను. త్వరలోనే రామునిటకు భక్తి పూర్వకముగా తీసుకొనివచ్చి ఈ రాజ్యమున పట్టాభిషిక్తుని

గావించుటకు తగిన యేర్పాట్లు నేను స్వయముగా చేయుదును. అంత వరకు మీరు నా యందు విశ్వాసముంచి యోపిక పట్టుడు.'' అని పలికి సుమంత్రుని చూచి ''రథమును సిద్ధపరపుడు'' అని ఆజ్ఞాపించు చున్నట్లు సైగచేసను సుమంత్రుడును అది గ్రహించి అచటి నుండి బయటికి వచ్చెను.

## భరతుడు శ్రీరాముని కొనితెచ్చుటకు వనములకు వెడలుట

భరతుడు, శ్రీరాముని మరల అయోధ్యకు తీసుకొని వచ్చునను వార్త విన్నంతనే అయోధ్యాపుర ప్రజలు మిన్నందిన ఆనందోత్సాహ ములతో కేరింతలు కొట్టిరి.

భరతుడు ఉత్తమమైన రథమును ఎక్కి ముందుగా మంత్రులు, గురువులు, ఉన్నతములైన ఏనుగులపై చనగా, వెనుక సాయుధులైన కాల్బలము, అశ్విక దళము బయలుదేరెను. కౌసల్యా, సుమిత్రలు సముచిత యానములలో బయలుదేరిరి.

శ్రీరామచంద్రుని దర్శనార్థమై బయలుదేరిన ప్రజలు ఒకళ్లొకళ్ళు శ్రీరామచంద్రుని గూర్చి చెప్పుకొనుచు బయలుదేరిరి. మార్గ మధ్య మున ఫలములనే భుజించుచు వెళ్ళుచుండిరి. వారట్లు ప్రయాణించి, భాగీరథీ తటమును జేరిరి. అంతట భరతుడు తన ననుసరించు పరివార ముతో ఈ నదీతీరమున ఆ రోజు యిచట గడిపి, రేపు దాటి పోవచ్చును. మీరలు మీకు అనువైన స్థలములలో విడిది చేయుడు. నేను యిచ్చట తండ్రిగారికి తర్పణములను గావించెదను. అని చెప్పెను. పరివారమట్లు చేసెను.

## గుహుడు భరతుని రాకను అనుమానించుట

సుమంత్రుడు భరతునికి, సీతారామచంద్రులు విడిది చేసిన ప్రాంతమును చూపెను. ఆ ప్రాంతమును చూచిన భరతుని కన్నులు చెమ్మగిల్లినవి. చక్రవర్తియగు శ్రీరామచంద్రుడు హంసతూలికా తల్ప ముందు విశ్రాంతి గొనవలసినవాడు ఇట్టి కంటక శిలా కర్కశమైన ప్రాంత మున పరుండవలసి వచ్చెనా! వదినె సీతాదేవికిని ఎట్టి దారుణావస్థ సంభవించినది! విధి యెంత బలీయము. అని తలపోసెను.

అది నిషాద రాజైన గుహుని పరిపాలనా ప్రాంతము. సుమంత్రుడు గుహుని వద్దకు వెళ్ళెను. అంతకుముందే భరతుడు సైన్య సమేతముగా, మహాట్టహాసముతో వచ్చి విడిది చేయుటను సందేహాస్పదముగా గమనించిన గుహుడు, సుమంత్రుని చూచుట తోడనే "సుమంత్రా! ఏమిటి ఇంతలోనే మరల నీ రాక? ఆ సైన్యముతో వచ్చి, అచ్చట విడిది చేసినది ఎవరు?"

అంత సుమంత్రుడు గుహునితో భరతుడు శ్రీరామచంద్రుని అయోధ్యకు తీసుకొని వెళ్ళుటకు సైన్య సమేతముగా వెళ్ళుచున్నాడు. నీవు రేపుదయముననే పెంపలకడ నౌకను సిద్ధముచేసి, భరతుని గంగా తీరమును దాటింపుము అనెను.

సుమంత్రుని మాటలను గుహుడు సందేహించెను. "సుమంత్రా భరతుడు నిజముగా శ్రీరామచంద్రుని అయోధ్యకు తీసుకొని వెళ్ళుటకేనా వచ్చినది? అయిన యింత ఆడంబర, అట్టహాసములెందుకు? జటావల్కలధారియైన శ్రీరామచంద్రునకేమైన ఎగ్గు పలపెట్టుటకు కాదు కదా! అట్లయిన భరతుని అంత దూరము పోనివ్వను. ఇచటనే బంధింతును" అని పలుకు గుహుని మాటలయందలి స్వామి భక్తిని, రాజ ధర్మమును, శ్రీరామచంద్రునిపై గల యపెరమైన అభిమానమును ఎంతో ఎత్తుకు ఎదిగిన విధముగ సుమంత్రునికి గోచరించినది.

సుమంత్రుడు తన ఆలోచనల నుండి తేరుకొని "గుహుడా! నీవు అనుకున్న విధమేమియు కాదుతే! భరతుడు వినీతుడు. చాల గొప్ప మనస్సు కలవాడు. శ్రీరామునికి తగిన సోదరుడే. అందులో సంశయింపవలసిన అవసరమేమియు లేదు. శ్రీరామచంద్రుని అయోధ్యకు తీసుకొని రావలయుననెడి తపనయే అతని సర్వ మనోవృత్తులను ఆశ్రయించి యున్నది. కావున నీ వాతనికి తగిన చేయూత నొసంగుము.

సుమంత్రుని ద్వారా, భరతుని గొప్పతనమును విన్న గుహుడు ఆనందముతో ఉప్పొంగిపోయెను. అతడు సాదరముగా తన పరివారముతో భరతుని చెంతకు సమీపించి, స్వాగతము పలికి, 'దశరథుని' మరణమునకు మిక్కిలి చింతించెను. "తండ్రి కోరికను తీర్చుటకే రాముని మరల అరణ్యమునుండి అయోధ్యకు తీసుకొనివెళ్ళి, పట్టాభి

షిక్తుని చేసెదను” అని భరతుడు గుహునికి విన్నవించెను. గుహుడు మిక్కిలి సంతసించెను.

ఆ రాత్రి గడచినది. తెల్లవారు ఉదయమున భరతుడు శుభ స్నాత్రస్సంధ్యావిధులను నెరవేర్చుకొని, గుహుడు సిద్ధపరచియుంచిన నౌకలో గంగను దాటుయత్నములోనుండెను. అందరూ గుహుడు సిద్ధపరిచిన నౌకలను అధిరోహించిరి.

నౌకలు గంగానదిని దాటి ఆవలితీరము చేరినవి.

భరతాదులు క్రిందకు దిగిరి. గుహుడు ఆతని పరివారమును భరతుననుసరించిరి.

అందరూ కాలినడకన అడవిలో ప్రయాణము సాగించిరి.

## భరతుడు, భరద్వాజ మహర్షిని సందర్శించుట

భరతుడు అరణ్యంలో సైన్య సమేతంగా నడచుకుంటూ వెళ్లు తుండగా, దూరంగా భరద్వాజ మహర్షి ఆశ్రమం కనిపించింది. అల్లంత దూరాన తనతోవచ్చిన సైన్యాన్ని నిలిపి, రథాన్నిదిగి మంత్రి పురోహితులతో కాలినడకన మహర్షి ఆశ్రమం చేరుకున్నాడు. మహర్షిని సందర్శించి, శ్రీరామచంద్రుడున్న జాడను తెలుసుకొన వలెననుకున్నాడు. భరద్వాజుడు భరతుని రాకను గమనించి సాద రంగా ఆహ్వానించాడు. భరతుడు మహర్షి పాదాలకు సాష్టాంగదండ ప్రణామం చేశాడు. భరద్వాజుడు భరతుని లేవనెత్తి “నాయనా! భరతా! నీవు ఈ దుర్గమారణ్యానికి వచ్చిన కారణమేమి? నీవు నీ పరివారంతో రాలేదా? వారేరి?

“స్వామీ! మీ యాశ్రమంలో ప్రశాంతతకు భంగం కలిగించే అనవసరపు అలజడిని నివారించడానికి సైన్యాన్ని దూరంగానే నిలిపి, ఈ మహాత్ములతో తమ సన్నిధికి పాదచారులమై వచ్చాము” అని సవినయంగా భరతుడు విన్నవించాడు. భరద్వాజుడు భరతుని వినయ విధేయతలకు మిక్కిలి సంతసించి, నీ పరివారమునుగూడ ఆశ్రమము నకు రప్పింపుము. మీరందరూ సపరివారంగా మా ఆతిథ్యమును స్వీకరించి ఈరోజు ఇక్కడ విశ్రాంతి తీసుకొని రేపు మీ ప్రయాణమును సాగించెదరుగాక” అని పలికెను.

అందులకు భరతుడు పరమ సంతోషముతో అంగీకరించినట్లు తల ఊపి "స్వామీ! నాదొక మనవి. చిత్తగింపుడు" అని ఇట్లు విన్నవించెను.

"మహర్షి సత్తమా! నా తల్లి చేసిన ఘోరమైన తప్పిదము మా తండ్రికి ప్రాణాంతకమైనది. పితృసమానుడైన మా అన్నగారికి పదు నాలుగు సంవత్సరములు అరణ్యవాస కష్టము కలిగినది. అందులకు ప్రాయశ్చిత్తముగా నేను నా అన్నను, మా తండ్రి అభిలషించిన విధంగా శ్రీరామచంద్రుని అయోధ్యా సింహాసనమందు నిలిపి, అన్న గారికి బదులుగా నేను పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేసి దుష్టబుద్ధియైన నా తల్లి కోరికను నెరవేర్తును. కాన స్వామీ! ఈ యరణ్యములలో అన్నగారున్న ప్రాంతమును మీరు తెలిసిన సెల విండు" అని వేడుకొనెను.

అందులకు భరద్వాజుడు "భరతా! నీ యుద్దేశ్యమును ఎప్పుడో గ్రహించితిని. నీవు వచ్చిన కారణము మిక్కిలి శ్లాఘనీయము. కాని సుగుణాభిరాముడు, పితృవాక్య పరిపాలనా నిష్ఠుడు అయిన రామ భద్రుడు తన కష్టమును ఇతరులకు అప్పగించి తాను సుఖించు స్వభావము కలవాడుకాడు. అటువంటి లోకాభిరాముడు నీవు వేడినా అతడు తన నిశ్చిత ఆజ్ఞాపరిపాలన వ్రతమునుండి వెనుకకు మరలి మరల అయోధ్యకువచ్చి రాజ్యభారమును వహింపడు. అయినను నేను నీ అభిమతమును కాదనను. భరతా! మీ అన్న సీతా లక్ష్మణ సమేత ముగా ఇక్కడికి రెండున్నర ఆమడల దూరములో చిత్ర విచిత్రము లైన పర్వత కూటములతో నొప్పారు "చిత్రకూటము" అను పర్వత ప్రాంతములో ఒక పటకుటీరములో నివసించియున్నాడు. అది మందాకినీ నది తీరప్రాంతము. మహాతపోనిధులైన ఋషులు నివసిం చుచు, తమ తమ అనుష్ఠాన, తపోనిధులను నిరాటంకముగ నెరవేర్చు కొనుచు ప్రశాంత జీవనమును కొనసాగించుచున్నారు. తపోనియతు లైన సీతారామలక్ష్మణుల నివాసమునకు అది సరైన ప్రాంతము.

## భరద్వాజుడు భరతునికి విందు నొసంగుట

భరద్వాజ మహర్షి భరతునికి శ్రీరామచంద్రుని ఉనికిని తెలిపెను. అంతలో భరతుని యాదేశముపై దూరాన భరతుని తల్లులు,

అసంఖ్యాకమైన సైన్యము, ప్రజావాహిని ఆనందోత్సాహములతో ఆశ్రమములోనికి ప్రవేశించిరి. వశిష్ఠ మహర్షి, సుమంత్రుడు ముందే భరతునితో ఆశ్రమమునకు చేరియుండిరి. వారందరికీ, తత్తరుచిత మర్యాదలతో, రకరకములైన విడుదులు మహర్షి తన సంకల్ప బల ముచే విశ్వకర్మ ద్వారా ఏర్పాటు చేయించెను. భరతునికి ప్రత్యేక ముగా ఒక విడిది భవనమును సర్వాంగ సుందరమైన దానిని నిర్మింప జేసెను. దానిలో భరతునికి వలయు సేవ లందించుటకు తగిన నిపుణు లైన పరిచారికా మణులను ఏర్పరచెను. సంగీత, సాహిత్య, గాన వినోదములచే శ్రోత్రపేయముగా ఇంపునింపుత దక్షులైన విశారదులను నియమించెను. అది ఏమిటి? సకలవిధ సౌఖ్యాకరమైన రెండవ స్వర్గ మునే భరద్వాజుడచట భరతునికి, అతని పరివారమునకు విందుగూర్చు నిమిత్తమై ఆవిష్కరింపజేసెను. ఎటు చూచినా రుచ్యములైన ఫలా హారములు, పంచభక్ష్య పరమాన్నములు, ఘ్రాణతర్పణముగా పరిమళ మును వెదజల్లు లేహ్యములు, చోష్యములు, పానీయములు అందు బాటులో నుండెను.

భరద్వాజ మహర్షి భరతుని వద్దకు వచ్చి, సాభిప్రాయముగా "భరతా! ఇందు నాచే అమరింపబడిన సకల విధ భోగములను నీ యిష్టానుసారముగా అనుభవించవచ్చును. సుకుమారుడవైన రాకుమారుడవు. నీకి భోగ సదుపాయములు ఎంతయు వచ్చునని యిట్లు ఏర్పాటు గావించితిని" అని పలికెను.

భరద్వాజుని మాటలు భరతునికి అర్థము కాలేదు. అక్కడ ఏర్పాటు చేయబడిన సకలవిధ భోగావహమైన చిత్ర దృశ్యమును చూచి చాలసేపు భ్రమ విభ్రమములకు లోనయ్యెను. అయినను తను వచ్చిన కార్యమును విస్మరించిన వాడు కాడు.

అతడు మహర్షి మాటలకు సిగ్గుపడి 'స్వామీ! నాకెటువంటి భోగములు అవసరము లేదు. ప్రస్తుతం నా మనస్సు శ్రీరామచంద్రునే చూడ గోరుచున్నది. మునిసత్తమా! ఇటువంటి భోగభాగ్యములకు నేను ప్రలోభ పడెద ననుకొంటిరా? త్రికాలవేదులు మీరు నా సంస్కార మందుల కంగీకరించుననియే భావించితిరా? వద్దు మహాత్మా! ఇటువంటి పరీక్ష నాకు వలదు. అన్నగారట్లు మునిరూపధారులై అరణ్యముల

సారహీనమైన కంద మూలములను, నిర్మల జలోదకములను మాత్రము స్వీకరించి, పలు కష్టముల ననుభవించుచుండగా నేను కృతఘ్నుడనై, తుచ్ఛమైన యీ భోగముల నామోదించుట ఎంత హేయమో మీ రెరుంగనిది కాదు. ఇది నన్ను పరీక్షించుటకై మీరు చేసిన ఒకానొక ప్రయోగముగా భావింతును. దయచేసి నేను ఆశించిన కార్యము సఫలీకృతము కావలెనని యాశీర్వదింపుడు.

భరతుని మాటలకు భరద్వాజ మహర్షి కరగిపోయెను. అతడు భరతుని శిరమును నిమురుచు "భరతా! ఏ విషయములోను శ్రీరామునకు తీసిపోని పవిత్ర శీలము నీది. నీ యుదారవర్తనము రఘువంశ పూర్వుల కీర్తిని ఇనుమడింపజేయునదే కాని వేరుకాదు. నీవు అన్నట్లు నిజముగానే నీ పవిత్ర వర్తనమును, నీతో బయలుదేరి వచ్చిన యీ అపార సేనావాహినికి, ప్రజలకు విస్పష్టముగ తెలియజెప్ప వలయునను భావముతోనే యీ పరీక్ష పెట్టితిని. నీవు నా పరీక్షయందు నిలిచితివి. నిలచి ప్రతిష్ఠాత్మకముగా నెగ్గితివి అన్యథా తలంపకుము. సరియే మీరు మీ సైన్యము యథోచితముగా మా యాతిథ్యమును మాత్రమును స్వీకరించి వెళ్ళుడు. భరతా! శ్రీరామచంద్రుని అడుగు జాడలలో నడచు ధన్యాత్మునిగా నిన్ను భావింతును.

భరద్వాజుడు ఏర్పాటు చేసిన కనువిందైన విందు భోజనములను తృప్తిగా ఆరగించిరి.

భరతుడు, తల్లులు, వశిష్ఠాదులు వారివారికి తగిన పరిమిత భోజన పానీయములు స్వీకరించి, ఆ రాత్రి ఆశ్రమములో నివసించిరి.

తెల్లవారగనే కాలకృత్యములను నిర్వర్తించుకొని, "భరద్వాజుని వద్దకు వెళ్ళి నమస్కరించి, స్వామీ! మేము చిత్రకూటమునకు బయలు దేరుటకు అనుమతింపుడు. అపురూపము, అతిలోకమునైన మీ విందు భోజనము మమ్ములను తృప్తిగావించినది ధన్యులము.

భరతుని తరువాత, తల్లులు, తక్కిన, పరివారము మహర్షికి నమస్కరించిరి. భరతుడు తల్లులను ఋషిసత్తమునకు పరిచయము గావించెను.

అప్పుడు భరద్వాజుడు భరతా! నీ తల్లిని క్రూరకర్మరాలిగా

నిందించ మేము నిమిత్తమాత్రులరాలై నీ తల్లి చేసిన కర్మము భావి కాలములో శుభావహమై పరిణమింపగలదు. ఇకనుండి యామెపట్ల క్రోధమును ఆమెచేష్టితములపట్ల శోధనను వీడి, పూజ్యభావముతో వర్తిల్లుము. నీవు కోరినట్లు రామదర్శనము లభించి, యాతని సంపూర్ణానుగ్రహముతో అఖిలషితార్థములు నెరవేరుగాక!" అని సెలవొసంగెను.

## భరతుడు సైన్యముతో చిత్రకూట పర్వతమునకు వెడలుట

భరతుడు తన పరివారంతో చిత్రకూటానికి బయలుదేరాడు. భరద్వాజుడు సూచించిన మార్గంగుండా పరివారం బయలుదేరింది. కొంతదూరం పోయినతరువాత అడవి రహస్యాలు తెలిసిన తన మిత్రుడు నిషాద రాజైన గుహుని, అతని పరివారంతో ఒకవైపు, మరి తనతో వస్తున్న సైన్యపరివారాన్ని వేరొకవైపు, తాను తల్లులు, వశిష్ఠ, సుమంతులు ఇంకొకవైపున "శ్రీరాముని ఆశ్రమాన్ని" కనుగొనుటకు అన్వేషించసాగారు. వారంతా అన్వేషించి ఒకచోటుకు చేరి కలుసుకున్నారు. దూరాన పొగ కనిపిస్తున్న దృశ్యాన్ని భరతుడు చూచి "అది శ్రీరామచంద్రుని ఆశ్రమమే అయియుంటుంది." అని చెప్పి, తన తల్లులను వశిష్ఠుడు, సుమంత్రుని తోడి తేవలసినదిగా నియోగించి, సైన్యాన్ని అక్కడే ఉండవలసినదిగా ఆజ్ఞాపించి, తాను మాత్రం శత్రుఘ్నునితో ఆశ్రమదిశవైపు బయలుదేరాడు.

## లక్ష్మణుడు వృక్షముపై నుండి భరతాదులు సైన్యయుక్తంగా వచ్చుచున్నట్లు గమనించుట

అరణ్యంలో కంటికి కనిపించని దూరంనుండి ఎవరికి చెందిన వారో సైనికుల కలకలం, కోలాహలం రాముని చెవినబడింది. రాముడు లక్ష్మణుని పిలిచి "లక్ష్మణా! దూరమునుండి సైనికుల కలకలము వినిపించుచున్నది- ఆ కలకల మెచటినుండి వచ్చుచున్నదో! వివర మేమిటో తెలుసుకొనుము." అని చెప్పెను.

వెంటనే లక్ష్మణుడు దగ్గరలో ఉన్న ఎత్తయిన సాలవృక్షాన్ని ఎక్కి నలుదెసలు పరికించాడు. ఉత్తరదిశనుండి పెద్ద సైన్యంతో భరతుడు తమ దిశగా వస్తున్నట్లు గమనించాడు. అతడు చెట్టుమీద నుంచియే,

"అన్నా! రామచంద్రా! భరతుడు సైన్యసమేతంగా వస్తున్నాడు. నీవు లోపల వెలుగొందుతూవున్న 'అగ్ని'ని చల్లార్పుము. వదినె సీతా దేవిని 'గుహ'లో సురక్షితంగా చేర్పుము. నీవు కవచకార్ముకములు ధరించి సన్నద్ధుడవుకమ్ము. భరతుడు మనలను ఇక్కడకూడ ప్రశాంతముగ నుండనీయక ఏచటికో తరిమికొట్టుటకు సబలుడై వచ్చుచున్నాడు. రాజ్యాభిషిక్తుడైన అఖండ సామ్రాజ్యాన్ని కైవసం చేసుకున్నది చాలక, మదాంధుడై కన్నుమిన్ను ఎరుగకుండ, అడవిలో ప్రశాంతంగా సాధు జీవితాన్ని కొనసాగిస్తున్న వారిని హింసింప జాడటం సహింపరాని విషయం. అతని నిక్కడనే ససైన్యంగా మట్టు పెట్టి యాట కట్టించుదాము" అని ఆవేశంతో మాట్లాడసాగాడు.

రాముడు, లక్ష్మణునితో "లక్ష్మణా! ఎందుకింత ఆవేశపడు తున్నావు. భరతుడు అయోధ్యకు వచ్చిన వెంటనే విషయమును తెలుసుకొని, తల్లిని నిందించి, తండ్రి యసహాయతకు నొచ్చుకుని, మరల మనలను అయోధ్యకు తీసుకొని వెళ్ళుటకే వచ్చుచుండ వచ్చును. మనకు ఏ విధంగాను కీడు తలపెట్టడానికికాదు. భరతుని మనస్సును నేను బాగా ఎరుగుదును. లక్ష్మణా! ఒకవేళ నీ మనస్సులో రాజ్యకాంక్ష కలదేమో! నిర్మొగమాటముగా, నిస్సంకోచముగ చెప్పుము. భరతునితో ఇప్పుడే చెప్పి, ఆతని నొప్పించి నిన్ను రాజ్యాభిషిక్తునిగా నొనరింతును. అట్లు కానిచో ఏల నీవు వృథా అనాలోచితముగ మాట్లాడుచున్నావు. నీవు నాకు ఎంతో భరతుడు కూడా అంతే. ఒక కుటుంబంలో అన్నదమ్ములలో ఎవరికైనా, వాగ్వివాద ములు, విరోధములు ఏర్పడినంత మాత్రమున ఒకరినొకరు చంప నిశ్చయించుకోవడం విజ్ఞతకాదు. లక్ష్మణా! ఆవేశముకంటే ఆలోచించి ముందడుగు వేయుట ఎక్కువ మేలు చేకూర్చుతుంది. మనకు అని వార్యముగా కలిగిన కష్టనష్టములకు భరతుడుగానీ, మాత కైకేయి కాని మూలముకాదు. అందునా భరతునకెట్టి సంబంధమును లేదు. మనము దైవ పౌరుషాలను ధర్మమును ఆధారం చేసుకొని నిర్వహిం

చాల్సి యుంటుంది. ఇప్పుడు భరతుని రాకకు కారణము పగ తీర్చు కొనుటకుకాదు. అతనిలో మన వియోగము వలన యేర్పడిన తీరని వగ తీర్చుకొనుటకేననిపించుచున్నది." లక్ష్మణుడు సిగ్గుతో తలవంచు కున్నాడు. అప్పుడు లక్ష్మణుడు "అదిగో మన తండ్రిగారి భద్రగజము 'శత్రుంజయము' సేనకు ముందు భాగమున నడచివచ్చుచు కనిపించు చున్నది. చూడుడు వారును వచ్చుచున్నారేమో"

రాముడు 'అవు'నన్నట్లు తల ఊపి "మరి లక్ష్మణా! తండ్రిగారికి ఆచ్ఛాదనమైయుండే 'శ్వేతచ్ఛత్రము' మాత్రము కనిపించుటలేదు. వారు మాత్రము వచ్చుచున్నట్లు తోచదు. ఆఁ! నీవు మాత్రము చెట్టు దిగిరా - వారు సమీపించుచున్నారు. అంతయు సవ్యముగానే జరుగ గలదు" అనెను.

లక్ష్మణుడు చెట్టు దిగి వచ్చెను. అంత శ్రీరామచంద్రుడు తమ యింట వెలుగుచున్న ఆహితాగ్ని హోత్రమును ఆహుతులిచే మరింత ప్రజ్వలింపజేసెను. అందుండి బయలుదేరిన హోమధూమము మరింత మరింతగా అధికమై దట్టమైన ధూమమండలములుగా ఏర్పడి, ఆకస మున నలుదిశల వ్యాపించెను. భరతుడు తండోపతండంగా ఎగసివచ్చే ధూమాగ్ని చూచి, అది వచ్చుచున్న స్థలాన్ని గుర్తించి ముందుకు సాగెను.

అనతి దూరంలోనే భరతుడు శ్రీరాముడు నివసిస్తున్న ఆశ్రమ స్థలానికి చేరుకున్నాడు. అల్లంత దూరంనుండే రాముని చూచి దుఃఖ ముతో 'అన్నా!'యని విలపించుచు వచ్చి, రాముని పాదములపైపడి మూర్ఛనొందినాడు, శత్రుఘ్నుడు శ్రీరాముని చేరి, అతని పాదములకు నమస్కరించి, దుఃఖించుచు తలవంచుకొని నిలుచొనెను.

శ్రీరాముడు భరతుణ్ణి చేయిపట్టి పైకిలేపి, శత్రుఘ్నుని ప్రగాఢ మైన ప్రేమతో లాలించి కుశల ప్రశ్నలు వేసెను.

"భరతా! దుఃఖింపకుము. నీవు క్షేమమేకదా! మన తండ్రిగారు కుశలమేనా? నీవు రాజ్యపాలనమును నియమము తప్పకుండా, ధర్మైక మూలముగా పరిపాలించుచున్నావా? ప్రజలు నిన్ను తండ్రికి వలెనే మన్ననతో చూచి గౌరవించుచుంటిరా? వశిష్ఠ మునీంద్రులు నీకు

సమస్తములైన రాజనీతి విషయాలను కూలంకషంగా వివరించినారా? తల్లులు క్షేమమా! నీవు యిప్పుడు వనములకు వేటకు వచ్చితివా? భరతా! మాట్లాడవేమి? వివరముగ నేనడిగినవన్నియును చెప్పుము" అని రాముడు భరతుని ప్రశ్నించెను.

భరతుడు మరింత దుఃఖిత మనస్కుడై పెకలిరాని మాటలను మెల్ల మెల్లగా బయటికి తెప్పించుకొని ఇట్లు పలికెను.

"అన్నా! మీరడుగు ప్రశ్నలన్నింటికి సమాధానము చెప్పగలిగినను చెప్పుటకు నోరు రాకున్నది. అవియన్నియు నన్ను మీరు నిందాపూర్వకముగా హెచ్చరించుచున్నట్లున్నది."

"నీవు తప్ప రాజ్యపాలన చేయుటకు అర్హులెవరు? నీ సేవకుడను. నేను ఎన్నటికి రాజును కాలేను. మనతండ్రి నీ వియోగ దుఃఖమును భరింపలేక స్వర్గస్థులైరి. తండ్రిగారికి అగ్ని సంస్కారములు చేయువారు లేకపోవుటచే "నా కొరకు దూతలను పంపినారు. నేను వచ్చి జరిగినది తెలుసుకొని, భరింపలేని దుఃఖమునకు గురై, వశిష్ఠుల వారి ద్వారా జరిగిన వృత్తాంతమంతయు తెలుసుకొని, తండ్రిగారికి జరుగవలసిన అగ్ని సంస్కారమును గావించి, యథావిధిగా కర్మలను నిర్విఘ్నముగా పూర్తిగావించితిని. జరిగిన తప్పును తెలుసుకొని, వెంటనే మిమ్ములను ప్రార్థించి అయోధ్యకు తీసుకొని వెళ్ళి మరల పట్టాభిషిక్తులను చేసి, ప్రజలను ఆనందపరచుటకు వచ్చితిని.

భరతుడిట్లు రామునితో చెప్పుచుండగా రాజమాతలు, వశిష్ఠ, సుమంత్రులు వచ్చిరి.

కౌసల్య రాముని చూచిన వెంటనే దుఃఖమును ఆపుకొనలేక 'రామా!' అని నేలపై కూలినది.

రాముడు తల్లి వద్దకు వెళ్ళి లేవనెత్తి గుహ వద్దకు తీసుకొని వచ్చెను. తండ్రిగారి మరణవార్తను విని మొదలు నరకిన వృక్షమువలె నేలకొరిగి బిగ్గరగా ఏడ్చెను. వైధవ్య దుఃఖము ననుభవించుచున్న రాజమాతలను చూచి మిక్కిలి పరితపించెను.

పిమ్మట రాముడు తన పుత్ర ధర్మము ననుసరించి, వశిష్ఠాది పురోహితుల యుక్తంగా అచ్చట మాల్యవతీ నదీతీరాన తండ్రికి జల తర్పణములు వదిలెను. గారె పిండితో పిండ ప్రదానము గావించెను

రాముడు. పితృలోకమున నున్న తండ్రికి అంజలి ఘటించి, "ఈ గార పిండియే నీకు నేను యిడు శ్రద్ధా పూర్వకమైన పిండప్రదానము. దయ యుంచి దీనిని స్వీకరించి మమ్ములను కృతార్థులను చేయుడు" అని ప్రార్థించి, సీతారామలక్ష్మణులు సువ్వహా నదిలో స్నానాదులు నిర్వహించుకొని కుటీరమునకు చేరిరి.

శ్రీరాముడు భరత శత్రుఘ్నులతోడ, జాబాలి వశిష్ఠాది పురోహితులతోడ, సుమంత్రాది మంత్రులతోడ, తల్లులతో, ప్రజలతో అందరితో చక్కగా పరివేష్ఠించియుండి, తన సహజ మృదు మధురా దార గంభీర వదన సరోజమును కళ తప్పనీయకుండా, అందరినీ కుశల ప్రశ్నలతో అలరించుచు, స్మితపూర్వభాషియై సునిశిత హాస్య వ్యంగ్యచలోక్తులతో ఆనంద పరచుచుండెను. అతడు భరతుని చేర పిలిచి, తన అంత పీఠమున గూర్చుండబెట్టుకొని "భరతా! ఇక అయోధ్యకు వెళ్ళి, పట్టాభిషిక్తుడివి కమ్ము. నీకు అన్నివిధాల రక్షణగా వశిష్ఠాది గురుజనులుందురు. నీవు రాజువై ప్రజలను కన్నబిడ్డలవలె పాలించుము. పెద్దలను గౌరవించుము. పిన్నలను మన్నించుము. దండించువారిని దండించుము. క్షమార్హులైన వారిని క్షమించుము. నీవు పట్టాభిషిక్తుడవై, చక్కగా రాజ్యపాలన చేయుచు నీ తల్లి వాంఛితమును నెరవేర్చుము. మన తండ్రిగారి సత్య సంధతను ధరణిలో ఆచంద్రతారార్కముగా నిలుపుము. పితృ లోకమున నున్న ఆ మహాత్ముని కృతార్థునిగ జేయుము."

అనుచున్న రామచంద్రుని మాటలకు భరతుడు పట్టరాని దుఃఖముతో ఇట్లు పలికెను.

"అన్నా రామచంద్రా! నీ సాత్త్వికమైన అను హితోక్తి శూలములచే నన్ను ఇంతను ఎందుకు బాధించెదవు? ఎక్కడనైనను చిన్నవాడు రాజ్యము చేయునా! పెద్ద వృషభము మోయలేని బరువును లేగ దూడ మోయగలదా? నా తల్లి దుర్మార్గురాలు దురాశా పాతకురాలు. కుమారుని యందలి రాక్షస ప్రేమచే, రఘువంశ వినాశమునకు ధూమకేతువైనది. అన్నా రామభద్రా! నీవు అయోధ్యకు తిరిగి వచ్చి, రాజ్యాభిషిక్తుడవుకమ్ము. ఇది రాజవంశ మర్యాద, రఘుకుల మర్యాద కూడ. అగ్రజా! రాజధర్మములను, ప్రభు ధర్మమును, వంశ ధర్మమును

నీకు నేను వచింపవలెనా? కాదు గుర్తు చేయుచున్నాను. నా ప్రార్థనను మన్నించుము. ప్రజలందరూ ముక్త కంఠంతో నిన్ను రాజుగా కోరుచున్నారు. వారందరూ! అరుగో చూడండి ముకుళితహస్తులై, దీన, ఆశావదనులై, నతులై, అవనతులై మౌనముగా నిలుచొని యున్నారు. వారిని కాపాడి పాలింపుము. నీకు బదులుగా అరణ్య వాసమును నేను చేయుదును. పితృవాక్య పాలనమను నది నీకును నాకును ఒకటే-అయితే నీవే అట్టివాక్యమును పాలించుట యనునది తండ్రిగారి కోరికకాదు. అది బలవంతముగా తెచ్చిపెట్టుకొన్న కర్మ.

భరతుడు పరిపరి విధములు శ్రీరాముడయోధ్యకువెళ్ళి పట్టాభిషిక్తుడగుటకు ప్రార్థించెను. వశిష్ఠాదులు, ప్రజలు భరతుని మాటలకు చలించి పోయిరి. వారు "రామచంద్రా! నీ తమ్ముడు భరతుడు చక్కగా, న్యాయ సమ్మతముగా మాట్లాడినాడు. నీవు తప్ప రాజ్యమును పాలించువారు ఎవరూ లేరు కదా! భరతుడు ఈ విషయమున తన అభిప్రాయములు వెలిబుచ్చినాడు. అవి యెల్లను ధర్మసమ్మతములు కూడ-నీవు ధర్మస్వరూపుడవు. అతని మాటలు మన్నింపదగును." అనిరి.

శ్రీరాముడు నిబ్బరముగ మీరందరూ రాజ్యపాలనకు రమ్మంటున్నారు. ధర్మము వద్దని నన్ను అడవులకు పంపించినది. మహనీయులారా! ధర్మా ధర్మముల సూక్ష్మములతి నిశితములు వినిగూఢములు-బయటకి ధర్మముగా భాసించునది. అంతరికముగనది యధర్మ లిప్తమగును. లోనధర్మముగా భాసించునది బాహిరముగనది యధర్మముగా తోచును. వానిని అతి నిశితబుద్ధితో, గ్రహించి ధర్మమునే యాచరింపవలయును. అగ్రజునికి రాజ్య పాలనా విధులు ఎంత విహితములో, దైవసమానుడైన పితృవాక్య పరిపాలన మంతకన్న విహితము సామాన్యధర్మము, విశేషధర్మాచరణముచేత ఉల్లంఘించినట్లు కానవచ్చునేమో! కాని అదిసరి కాదు. ఇప్పుడు నేను అనుసరించుచున్నది విశేష ధర్మము. అట్టి ధర్మమును నిర్వహించుటలో నేనెల్లప్పుడు అప్రమత్తుడనే. దానిని వదలి, రాజ్యలాభము కలుగునను ప్రలోభముచే, మరల అయోధ్యలో అడుగుపెట్టను.

## జాబాలి రామునికి హితవు చెప్పుట

ఈ మాటలు విన్న జాబాలి యను మహర్షి (దశరథుని పురోహితులలో నొకడు) రామునితో ఇట్లనెను.

"రామా! నీవు సర్వజ్ఞుడవే, కాదనను అయితే రాజవంశమున జన్మించిన నీవు కఠోరమైన నిర్ణయములు గైకొనుట ఒక్కొక్కప్పుడు అనుచితములే కాగలవు" ఎవరికో తండ్రిమాట యిచ్చుట ఏమి? ఏమీ సంబంధములేని నీవు ఆ మాటను పాలించుటయేమి? తప్పు ఒకరిదైతే, శిక్ష మరొకరు అనుభవింపవలయునా! శాస్త్రబుద్ధితో నాలోచించిన ఎవరికెవరును శాశ్వతముగా బంధువులుకారు. తల్లి, తండ్రి, ఇల్లు, ఇల్లాలు, ధనధాన్యములు అన్నీ కేవలము ఇహలోకమున అప్పటి జన్మములకు సంబంధించినవే. తన కాలము తీరినది కాన నీ తండ్రి పరలోక గతుడైనాడు. అందులకు విచారించుట ప్రాకృత బుద్ధి లక్షణము. రామా! ప్రత్యక్షముగ నీవనుసరింపదగు విధానము నాలోచించుము ధర్మము పేరిట పరోక్షమగు మిథ్యాచారము నవలంభించి, నిన్ను నీవు, నీవారిని పెనుకష్టముల పాలుచేయకుము.

"నీవు నా మాటవిని అయోధ్యకు వెళ్ళి రాజ్యాభిషిక్తుడవు కమ్ము" అని బోధించెను.

రాముడు జాబాలి నాస్తిక బోధనకు మిక్కిలి మండిపడెను. పట్టరాని ధర్మావేశముతో "జాబాలీ! నీవు ఎట్టి అనుచితములు పలికితివి ధర్మమును వదలిన వానిని ఎవరైన గౌరవింతురా? ధర్మాచరణమును బట్టియే వ్యక్తి యోగ్యతలు పరిఢవిల్లుచున్నవి.

"తపోవృత్తిలో నున్న నేను ఇప్పుడే వేషమును, జీవన విధానమును విడిచి, నీవు చెప్పినట్లు చేసితినేని, నేను సత్య ధర్మములను విడనాడి ఉభయ లోకములకు చెడినవాడినగుదును."

ఇట్టి అనుచిత బోధచేసిన నీవయోగ్యుడవు-నాకనుల యెదుట నిలువ దగవు వెడలుము." అని గట్టిగా మందలించెను.

రాముని అభిప్రాయములను తెలుసుకొనిన జాబాలి రామునితో "రామా! నేను నీకు నాస్తికత నుపదేశించలేదు. ధర్మమునందు గల నీ యచంచల నిష్ఠను, త్యాగశీలతను తెలుసుకొనగోరి యిట్లు బోధించితిని. ఇది నీ ధీరోదాత్త వర్తనమునకు నేను పెట్టిన పరీక్ష. నన్ను మన్నిం

పుము" అని పలికెను. వశిష్ఠాదులును జాబాలి నాస్తికునిగా గాక నీ హితైషినిగా గుర్తింపుము రామభద్రా!"యని చెప్పిరి.

శ్రీరాముడు భరతునితో ప్రియ సహోదరా! భరతా! నీవు నాకు బదులుగా అయోధ్యా రాజ సింహాసనముపై నా పాదుకలు పెట్టి పరిపాలింపుము. పదునాలుగు సంవత్సరముల నా వనవాస వ్రతము పూర్తి గావించుకొని, మరల అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడనై పరిపాలనము సాగించగలను.

రాముని మాటలకు ఎట్టకేలకు భరతుడు సమ్మతించెను. వశిష్ఠాదులు ఆమోదించిరి. ప్రజల ముఖములలో సంతోషము వెల్లువెత్తి 'జయ జయ' ధ్వానములు చేసిరి.

తెల్లవారినది. భరతుడు తిరిగి వెళ్ళుటకు అనుమతి కోరెను. "అన్నా! ఇప్పుడు మీరు చెప్పినట్లు పదునాలుగు సంవత్సరములు సింహాసనము మీద పాదుకలుంచి, పరిపాలింతును. మీ పాదుకల నను గ్రహింపుడు" అని ప్రార్థించెను. రాముడు పాదుకల నొసంగెను. భరతుడు వానిని తీసుకొని కనుల కద్దుకొని, అన్నకు నమస్కరించి అయోధ్యకు పరివార యుక్తముగా ప్రయాణమయ్యెను.

వారట్లు ప్రయాణమై వెళ్ళి అయోధ్యకు సమీపమున నున్న "నంది గ్రామము"నకు చేరిరి.

## పాదుకా పట్టాభిషేకము

భరతుడు నంది గ్రామం చేరి, రాముడు లేని అయోధ్యలో నేను అడుగుపెట్టను. అడవిలో రామచంద్రుడు ఏ విధమైన తపో నియతితో జీవించుచుండెనో, నేను అదే రీతిగా సాధారణ సాధు వృత్తిలో జీవించెదను. ఈ పదునాలుగు సంవత్సరములు ఈ రామపాదుకలే అయోధ్యా రాజ్యమును పరిపాలించును. అని వశిష్ఠాదుల అధ్వర్యంలో శత్రుఘ్నునకు రామ పాదుకలనిచ్చి అయోధ్య సింహాసనంపై వీనిని నిలుపుమని, నేనికను నుండి వాని పక్షాన శ్రీరామునికి ప్రతిగా రాజ్య పాలన విధులను నిర్వర్తింతును. అట్లు చేయుడని కోరెను. వారు శ్రీరామ పాదుకలను తీసుకొని పురములోనికి ప్రవేశించిరి.

అయోధ్యలో రాజ సింహాసనంపై పాదుకల నుంచి, శాస్త్రోక్త ఆశ్రమ విధానంగా పట్టాభిషేకం గావించిరి. భరతుడు నంది గ్రామం లోనే ఉండి, సమస్త రాజోచితములైన ఆభరణములను విసర్జించి జటా వల్కల ధారియై తపోవృత్తిన నుండెను.

భరతాదులు మరలి వెళ్ళిన తరువాత శ్రీరాముని మనస్సు అల్ల కల్లోలమై అంతులేని దుఃఖమును, ఆవేదనను అనుభవించినది. అతనికి అయోధ్యా ప్రజలు, తల్లులు, భరతుని మాటలు పదేపదే గుర్తుకు రాసాగినవి.

రాముడు లక్ష్మణునితో "లక్ష్మణా! నాకిచట ప్రశాంతముగా గడచునట్లు కనిపించుట లేదు. మాటిమాటికి భరతుని మాటలు, పశ్చాత్తా పముల బోధలు నన్ను కలవరపెట్టుచున్నవి. తల్లుల ఆవేదనమును, పరి తాపమును తలచుకొనినప్పుడు నా హృదయము క్రిద్ధలగుచున్నది. ప్రజల నిర్వేదము, నిరాశ్రయత్నము నన్ను క్రుంగదీయుచున్నది. భరతుని సైన్యము నిరాశా ప్రబోధితులై చుఃయరణ్యమును కల్లోల పరిచినారు.

మనమిక్కడ నుండతగదు. ప్రశాంతతకు భంగము వాటిల్లునను శంక అనుక్షణము బలపడుచున్నది.

"తమ్ముడా! మనము తక్షణమే ఇచ్చోటును వీడి, దక్షిణము నందలి దండ కారణ్యమును ప్రవేశించుట యుక్తము. ఇప్పటికే ఇచ్చట నివసించు కొందరు మునిసత్తములు దండ కారణ్యమున శాంతియుత జీవనము నభిలషించుచు బయలుదేరి వెళ్ళుచున్నారు. మనము కూడ వారి ననుసరింతము."

లక్ష్మణుడు అన్న మాటలకు ఆమోదమును తెలిపెను.

మరునాటి ఉదయమే ప్రాతఃకాలమున సీత, రాముడు, లక్ష్మణుడు కాలినడకన ప్రయాణమైరి.

## అత్రిమహాముని ఆశ్రమం

శ్రీరామచంద్రుడు, సీత, లక్ష్మణుడు అడవిలో కొంతదూరం ప్రయాణం చేసిన తరువాత సాయం సమయానికి అత్రి మహాముని ఆశ్రమానికి చేరుకున్నారు. శ్రీరాముడు ఫలముల సేకరించు నిమిత్తం

అడవిలోనికి వచ్చి ఎదురైన ముని బాలురని జూచి, "ముని కుమారులారా! ఆ దూరాన కనిపించునది ఎవరి యాశ్రమము?" అని ప్రశ్నించెను.

అప్పుడా ముని కుమారులు- రామా! అది అత్రి మహాముని యాశ్రమము. ఎంతో పవిత్రమైనది - అద్భుత మహిమాన్వితమైన తపోభూమి - అత్రి మహామునులు గొప్ప తపఃప్రభావులైన మహాత్ములు. వారి దర్శనము వలన మీకు శుభములు కలుగును. రామచంద్రా! రండి మహామునుల దర్శనము చేసుకొని వెళ్ళుదురుగాని. ముని పత్ని మహా యిల్లాలు. ముల్లోకములకు పూజ్యనీయమైన అనసూయాదేవినిహూత దర్శించుకొనవచ్చును. ఆ పుణ్యదంపతుల ఆశీర్వాదములు సకలార్థసాధకములు. ఆ త్రిమూర్తులనే పసిపాపలుగా మార్చిన పరమ సాధ్వీమణి. సాయం సంధ్యాసమయము. సూర్యాస్తమయమునకుముందే ఆశ్రమమునకు చేరుకొనుట యుక్తము.

ముని బాలకులు దారిచూపగా వారు ముగ్గురు అత్రి మహాముని ఆశ్రమానికి చేరుకున్నారు. అత్రి భార్య అనసూయాదేవి, దూరమునుండియే సీతారామలక్ష్మణులను చూచి, తన పతికి వారిని చూపినది. ముని పుంగవుడు తన దివ్యదృష్టితో రాకుమారుల రాకకు కారణమును తెలుసుకున్నాడు. అతడు తన భార్యతో "అనసూయా! సీతారామలక్ష్మణులు, మన యాశ్రమమునకు వచ్చుచున్నారు. నీవు వెళ్ళి సీతను ఆశీర్వదించి, మన యాశ్రమమునకు తోడితెమ్ము. అనసూయ అట్లే సీతకు ఎదురువెళ్ళి రామలక్ష్మణులు వెంటరాగ, సీత చేయి పట్టుకొని ఆశ్రమములోనికి తీసుకొని వచ్చినది.

వారు ముగ్గురూ అత్రిమునికి సాష్టాంగనమస్కారములు చేసిరి. అప్పుడు "రామా! ఈమె అనసూయాదేవి. నా భార్య. మీకు తల్లి వంటిది" అని ఋషిపుంగవుడు ఆమెను వారికి పరిచయము చేసెను. సీతారామలక్ష్మణులు మిక్కిలి సంతోషముతో, సవినయంగా అనసూయాదేవి పాదములకు నమస్కరించారు.

అంతట మహాముని రామలక్ష్మణులను కుశల ప్రశ్నలనువేసి, వారి వృత్తాంతమును తెలుసుకొనెను.

"రామభద్రా! నీవు ఎంతో గొప్పవాడివి. పితృవాక్య పరిపాలన గావించు ప్రయత్నములోనుండి చరితార్థుడవగుచున్నావు" అని లక్ష్మణునివైపు చూసి,

"లక్ష్మణా! నీవు పరమపూజ్యనీయులైన అన్నవదినలకు సేవ చేయుచు, సేవాధర్మమున పునీతుడవగుచున్నావు. అసదృశమైన నీ త్యాగ జీవనము ప్రస్తుతిపాత్రము" అనుచుండగా అనసూయ, సీత చేయి పట్టుకొని, అల్లంత దూరాన ఒక చెట్టు క్రిందకు తీసుకొనిపోయి కూర్చుండబెట్టి ఆమెతో సంభాషణమారంభించినది.

## సీత-అనసూయల సంభాషణము

సీతా! నిన్ను చూచి చాల సంతోషమైనదమ్మా! ఉదారమైన నీ ధర్మవర్తనము నారీలోకమునకు ఆదర్శప్రాయము. సమస్త భోగములను, బంధుజాలమును వదలి నీ పతి వెంట దుర్గమములైన ఈ యరణ్యముల జీవింపవచ్చుట - సనాతనమైన సాధ్వీ సంప్రదాయము. పతి యెట్టివాడైనను భోగహీనుడు, భాగ్యహీనుడు, చరిత్రహీనుడైనను ఆతనిని ప్రీతిపూర్వకముగా, మనసార సర్వథా అనుసరించుట తరుణోపాయము. ధర్మమిట్లుండగా నీవు సుగుణాభిరాముడు, లోకోత్తర ధర్మవర్తనుడు ఐన నీ పతి శ్రీరామచంద్రునివంటి పతి లభించుట, అట్టి పతిని సేవనుసరించుట యెంతయు సుకృతము. ఇట్లే ఎల్లప్పుడును నీ పతి ననుసరించి నడచుకొనుము. నీకు సత్కీర్తి, ధర్మాచరణ, పుణ్యఫలము లభించును.

సీత, అనసూయ మాటలకు స్పందించినది. "మాతా! అనసూయా దేవీ! నీవన్నమాటలు అక్షరాల నిజము. నేను అరణ్యములకు బయలు దేరి వచ్చునప్పుడు మా అత్తగారుకూడ మీరు బోధించిన పాతివ్రత్య, ధర్మములనే బోధించినది. నేను ధన్యురాలను" అని నమస్కరించినది.

అనసూయ సీతతో "అమ్మా! నీ సౌందర్యమునకు వన్నెతెచ్చు సుగుణసంపద, వినయ ధురీణత, పాతివ్రత్య పవిత్రభావము నన్ను మిక్కిలి ప్రసన్నురాలిని చేసినది. నా సంతోషమునకు గుర్తుగా నేను నీకు కొన్ని యాభరణముల నిత్తును. నీవు అలంకరించుకొని, నీభర్తను సమీపింపుము" అని చెప్పి అనసూయ సీతకు పరిమళ భరితములైన పూలు, పండ్లు, అపురూపములైన ఆభరణము లొసంగినది. ఆమె కోరి నట్లే సీత ఆభరణములను ధరించినది.

వివాహ మంగళ ప్రశస్తమైన వధువు వేషము దాల్చినట్లు కనిపించిన సీతతో అనసూయా", సీతా! నీ తండ్రి జనకమహారాజు నీ పరిణయమును భువనమోహనముగా జరిపించినాడని వినియున్నాను. అది ఎట్లు జరిగినదో నీ ముఖతః వినగోరుచున్నాను. సిగ్గుపడక చెప్పుమమ్మా!" అని అన్నది.

సీత తన స్వయంవర వృత్తాంతమును అనసూయతో సవిస్తరంగా చెప్పింది. సీతారాముల వివాహవృత్తాంతమును సీత స్వయంగా చెప్పగా విన్న అనసూయాదేవి పరమానంద భరితురాలైనది. ఆమె సీతతో "అమ్మా! చాలసేపు మాట్లాడినాము. నీవిక రాముని సమాపింపుము."

సీతారామలక్ష్మణులు ఆ రాత్రి అత్రి ఆశ్రమములో విశ్రమించారు. మరునాడు ఉదయమే రామచంద్రుడు అత్రి మహర్షిని తమకు తగిన నివాసప్రాంతమును చూపించుమని కోరెను. మహర్షి వారికి దండకారణ్యమున ప్రవేశించు మార్గమును సూచించెను. సీతారామలక్ష్మణులు మునిదంపతులకు నమస్కరించి కొందరు ఋషులు రామలక్ష్మణులకు అరణ్యమున ప్రయాణము చేయు మార్గమును సూచించిరి. వారు ముగ్వురును ఋషికుమారులు చూపిన మార్గమున అరణ్యమున ప్రయాణము సాగించిరి.

# అరణ్యకాండము

రామలక్ష్మణులు అరణ్యమార్గమున కొంతదూరం ప్రయాణించారు. అల్లంతదూరంనుండి, కొందరు ఋషిపుంగవుల వేద నాదము వినిపించినది. అది ఫలభరితములైన భుజములచే, పక్షుల కలకలారావములచే కోలాహలముగా నున్న ఋషివాటికగా వారలు గుర్తించిరి. వారు అచటికి వెళ్ళగా, ఋషులు వారికి సంతోషముతో స్వాగతం పలికిరి.

అంతట ఋషులు, రామచంద్రునితో "రామచంద్రా! ఈ ప్రాంతము మిక్కిలి ప్రమాదములతో కూడినటువంటిది. క్రూర జంతువుల నిరంతర సంచారమే కాక, మనుజ మాంసమును భుజించ మరగిన రాక్షసు లనేకులుండి, అప్పుడప్పుడు మా వారలను పట్టి వధించి తినుచున్నారు. ఈ కారణముచే మా ప్రశాంతజీవనమునకు భంగము వాటిల్లినది. నీవు మాకు ప్రభుడవు. అయోధ్యలో నున్నను, అరణ్యములోనున్నను మమ్ము రక్షించు రాజమార్తాండుడవు. ఈ యుపద్రవమునుండి మమ్ము నీవు రక్షింప వేడుచున్నాము" అనిరి.

రాముడు వారలకు అభయమిచ్చి, ఆ రాత్రి వారలక్కడే విశ్రాంతి గైకొన్నారు. ఉదయమే ఋషిపుంగవుల వద్ద సెలవు తీసుకొని, అనతిదూర ప్రయాణంతోనే దట్టమైన అడవిలోనికి ప్రవేశించినారు.

## విరాధుని వధ

అంతలో రామలక్ష్మణులు ఒక భయంకరమైన అరుపును విన్నారు. వినినదేతడవుగ యెట్టయెదుట భయంకరమైన స్వరూపంతో జంతువులను చేతులలో చంకలలో ఇరికించుకొని పెడబొబ్బలుపెట్టుచు వారి ఎదుట వచ్చి నిలుచున్నాడు.

ఆ రాక్షసుడు రామలక్ష్మణులను భయపెడుతూ మీరు ఈ యాడు దానితోకూడి నిర్భయముగా ఈ అరణ్యమున సంచరించుచున్నారు. ఈ ధైర్యము మీకెక్కడినుండి వచ్చినది. వెంటనే మీరీ స్త్రీని యిక్కడ వదలిపొండు. అట్లు చేసిన మీకేహానియును చేయను. లేనిచో మిమ్ము లను చంపితిని, ఈ స్త్రీని నాకు భార్యగా చేసుకొనెదను. అనిచెప్పి, సీత ను చేతబట్టుకొని అతని చంకలో ఇరికించుకొనినాడు,

రాముడు, సీత రాక్షసుని చేతిలో విలవిలలాడిపోవుటను చూచి, దుఃఖముతో కంపించిపోయినాడు. అతడు లక్ష్మణునితో సీతను పర పురుషుడైన ఈ రాక్షసాధముడు స్పృశించుట కంటె నాకు దారుణ మైన దుఃఖ విషయము మరొకటున్నదా? తండ్రిగారి మరణం కంటే, రాజ్యం పోవడం కంటే దుస్సహమైన దుర్ఘటన మిది.

అంత లక్ష్మణుడు రామునితో "రామా! నేను జీవించియే యున్నాను. సర్వ భూతములకు నేతవు, భ్రాతవునైన నీవే యిట్టి కష్ట మునకు లోనగుట విధి వైపరీత్యము. నేనిప్పుడే వీనిని సంహరించెదను.

లక్ష్మణుడు విరాధుని చూచి "ఓరీ! రాక్షసాధమా! మేము ఇక్ష్వాకు వంశస్థులము. ధర్మ పరిపాలన నిమిత్తము మేమీ దండకారణ్యమునకు వచ్చినాము. అట్టి మాపై సాధు జీవులైన ఇచ్చటి ముని పుంగవులపై అత్యాచారము సలుపుటకు పూనుకొనుట సహించరాని విషయము. క్రూరకర్ముడా! ఇట్టి దారుణములకు పాల్పడు కారణమేమి? నీవెవడవు? అనెను.

విరాధుడు క్రోధముతో నేను 'జయుడు' అనే వాని కుమారు డను. నా తల్లిపేరు శతహ్రద. బ్రహ్మదేవుని వరం వలన నేను యే ఆయుధంతో చావను. ఈ స్త్రీని యిచ్చట నాకు వదలిపెట్టి మీరు తక్షణం వెళ్ళండి" అని గర్జించాడు.

రాక్షసుని భీషణమైన మాటలకు రాముడు మిక్కిలి క్రోధ వశుడై నాడు. క్షణంలో అతనిపై ఏడు బాణాలను ఒక్కుమ్మడిగా వదిలినాడు. విరాధుడు సీతను వదిలి, శూలంచేత రామలక్ష్మణులను పొడవడానికి ఉపక్రమించినాడు. రాముడు రెండు బాణాలచే, రాక్షసుని శూలాన్ని తుత్తునియలు చేసెను. రాక్షసుడంత రామలక్ష్మణుల్ని ఎత్తుకొని పోసాగినాడు. సీత తల్లడిల్లినది. ఆమె యాక్రోశమును విన్న లక్ష్మ ణుడు ఖడ్గముచే విరాధుని ఎడమచేతిని నరికినాడు. తరువాత రాముడు విరాధుని కుడిచేతిని నరికినాడు. మొండి చేతులతో విరాధుడు నిస్స హాయుడై క్రింద పడినాడు. కాని చావలేదు.

రాముడు లక్ష్మణునితో "లక్ష్మణా! ఈ రాక్షసుడు ఏ ఆయుధా నికి చావను అని చెప్పినాడు. అట్లైన గుంతనిని గోతితీసి పాతి పెట్టు దము. వాడే చచ్చును.

రాముడన్న మాటలతో విరాధునికి పూర్వజన్మ స్మృతి కలిగినది.

వెంటనే అతడు రామునికి నమస్కరించుచు "రామా! నా పాప వశమున ఈ రూపము వచ్చినది. పూర్వం నేనొక గంధర్వుడను. నా పేరు తుంబురుడు. కుబేరుని శాపంవల్ల ఇట్లైతిని. శ్రీరాముని అనుగ్రహం వలన నీకు శాప విమోచనం కలుగుతుంది అని అతడే సెలవిచ్చాడు. రామచంద్రా! నేడు నీ దర్శనమైనది. నాకు శాప విమోచనమైనది. ఆర్యులారా! మీరు ఇట్లే ముందునకు ప్రయాణం చేసిన "శరభంగుడు" అనే మహర్షి ఆశ్రమం చేరుకొంటారు. అతడు దివ్య ప్రభావం కల మహాత్ముడు. అతని యనుగ్రహం వలన మీకు మేలు కలుగుతుంది అని చెప్పి-

రామునితో "రామచంద్రా! నా కిచట యొక గోతిని ఏర్పరచి, అందులో నన్ను పాతిపెట్టండి. నేను ముక్తుడనవుతాను" అని వేడుకున్నాడు.

వెంటనే లక్ష్మణుడు ఒక గోతి తీశాడు. రాముడు విరాధుని అందులో పాతిపెట్టాడు. రామలక్ష్మణులుభయులు గోతిని పూడ్చి, మరల అడవిలో ప్రయాణం సాగించారు.

## శరభంగ ఆశ్రమము

సీతారామలక్ష్మణులు అరణ్యంలో మధ్యమధ్యన కనిపించే నదులను, సరస్సులను, మంచి మంచి మృగ, పక్షి జాతులను, ప్రకృతి దృశ్యాలను చూచుకొంటూ "శరభంగ మహాముని" యాశ్రమానికి చేరుకున్నారు.

రాముడు శరభంగుని ఆశ్రమం చేరుకునేసరికి, అంతకుముందే, దేవేంద్రుడు వచ్చి అతనితో ముచ్చటిస్తున్నాడు. అంతలో దేవేంద్రుడు రాముని రాకను చూచి, "రాముడు వచ్చినాడు. నేనిచట నుండుట సరి కాదు. మీ పని ముగిసిన పిదపనే మిమ్ములను గొనిపోవచ్చెదను" అని మునితో చెప్పి వెళ్ళిపోయినాడు.

సీతారామ లక్ష్మణుల యుక్తంగా ఆశ్రమంలోనికి ప్రవేశించి "ఇప్పుడు ఇచ్చటినుండి వెళ్ళుచున్నది ఇంద్రుడేకదా!"? అని మునిని ప్రశ్నించాడు.

శరభంగుడు "అవును—ఇంద్రుడే, అతడు నన్ను బ్రహ్మలోకమునకు తీసుకొనిపోవుటకు వచ్చినాడు. ఇంతలో లోకోత్తరుడవైన నీవు వచ్చినావు. నిన్ను వదలి, అతనితో వెళ్ళుట మంచిది కాదని,

నేనతనిని పంపి, నీ కొరకు ఉండిపోయినాను. నీ దర్శనము చేసి కొన్న తరువాత బ్రహ్మలోకమునకేగెదను. 'రామచంద్రా!' అపూర్వమైన తపోనియతిచే బ్రహ్మలోకమును, స్వర్గలోకమును, మరియు పుణ్యలోకములనన్నిటిని సాధించితిని వానినెల్ల నీ కొసగుచున్నాను. కోరిన చోటికి వెళ్ళి నీవు యధేష్టముగ సుఖింపవచ్చును." అని అన్నాడు.

అప్పుడు రాముడు శరభంగునితో "మహాత్మా! మీరు ఇత్తునన్న పుణ్యలోకములనన్నింటిని నేను నా శక్తి సామర్థ్యములచే సంపాంప గలను. కాన మీరు నాకొక సహాయము చేయుడు. అదియేమనిన మేమీదండకారణ్యములో నివసించుటకు అనువైన ఒక సురక్షిత ప్రదేశమును చూపింపుడు. అదియే మాకు మీరొసగు అపురూపమైన యాతిథ్యము." అనెను.

అంత శరభంగుడు రామా! ఇక్కడికి అనతిదూరంలోనే "సుతీక్ష్ణుడు" అనే మునియాశ్రమమున్నది. అచటికివెళ్ళి అతనిని అడిగినచో మీకు తగిన వసతి చూపించగలడు అని బ్రహ్మలోకానికి వెళ్ళిపోయినాడు.

రామాదులు ఆ రాత్రి శరభంగుని ఆశ్రమం నుండి, నడచివెళ్ళి "సుతీక్ష్ణుని ఆశ్రమం చేరుకున్నారు. సుతీక్ష్ణుడు "రామచంద్రా! నీ కోసం వేచియున్నాను. నీవు చిత్ర కూటానికి వచ్చిన సంగతి తెలిసినది. మహానుభావులారా! మీ ఆగమనము కొరకే వేచియున్నాను. నేను బ్రహ్మ, స్వర్గలోకములను తపస్సుచే సంపాదించినాను. ఆ లోకములలో విహరించి సుఖించుటకు నీకు అనుమతినిత్తును నీవు వాటిని పొందవచ్చు ననగా. "రాముడు శరభంగుని"కి చెప్పిన సమాధానమునే చెప్పెను. "మహామునీ! నాకు తగిన నెలవును సూచింపుడు అచట నేను నివసింతును" అనెను.

అందులకు సుతీక్ష్ణుడు "మీరు ఈ యాశ్రమముననే యుండవచ్చును. మీకు ఎట్టి యాటంకములు కలుగవు" అనిన.

రాముడు "మహామునీ! ఇది ఆశ్రమ ప్రాంతము. ఆశ్రమమునకు ఏ క్రూరమృగములు నేనివచ్చిన, వాటిని రక్షణ ధర్మము ప్రకారము నేను బాణములచే వధింతును. అప్పుడు సాధుపురుషులైన మీకు బాధ కలుగును. మీ వంటి మహాత్ములకు ఈ విధముగ బాధ కలిగించుట

నాకు యుక్తముకాదు. కావున మేము వేఱొక చోటికి వెళ్ళ వలయును." అని చెప్పెను.

సీతారామలక్ష్మణులు, ఆ రాత్రి అక్కడనే గడపి, ఉదయముననే లేచి ప్రయాణమైనారు. సీత రామలక్ష్మణులకు ధనుర్బాణములను, ఆయుధములను ఇచ్చి, వారితో సాగినది. వారలట్లు అడవిలో అనేక ఆశ్రమ ప్రాంతములలో పది సంవత్సరములు గడిపిరి.

## అగస్త్యాశ్రమము

సుతీక్ష్ణు సూచనపై వారు మరల అరణ్యమున సంచరించుచు అగస్త్యముని ఆశ్రమమునకు చేరుకున్నారు. అగస్త్యుడు శ్రీరామ చంద్రుని సకలోపచారములతో అతిథి సత్కారము గావించెను.

శ్రీరాముడు అగస్త్య మహామునికి నమస్కరించి "మహామునీ! మాకు ఈ దండకారణ్యములో నుండుటకు తగిన వసతిని చూపింపు డని కోరెను.

"మహర్షి! మేము మీరు చూపినచోట పర్ణశాల కట్టుకొని నివసిం తుము." అని రాముడు అనెను.

అగస్త్యుడు రామునితో "రామా! ఇక్కడికి పదిక్రోసుల దూరంలో 'గోదావరి'నది యున్నది. ఆ నది యొడ్డున ఒక రమణీయ మైన ప్రదేశమున్నది. మీరు స్నానాదులు నెరవేర్చుటకు, ఫలపుష్పా దులకు సమకూర్చుకొనుటకు గోదావరితీరమెంతో అనువైనది. ఆ తీరప్రాంతమునకు పది కోసుల దూరంలోనే 'జనస్థానము' అను ప్రదేశముకలదు. అచ్చట వేల సంఖ్యలో రాక్షసులున్నారు వారు ఋషుల తపో యజ్ఞయాగవిధులకు భంగకరముగా ప్రవర్తించు చున్నారు. నీవు రాజువు కదా! రక్షణీయుడవు-అందుండి నీవు రాక్షస సంహారము సలిపి, ఋషుల యాగములను రక్షించి లోకరక్షణ గావించ గలవు"

అగస్త్యుడు శ్రీరాముని అతిథి సత్కారముగా విష్ణుధనుస్సు, బ్రహ్మధనుస్సు, ఇంద్రధనుస్సు మున్నగు అమూల్యములైన అస్త్ర శస్త్రములనొసంగెను. శ్రీరామాదులు అగస్త్యునికి నమస్కరించి అతని వద్ద సెలవుగైకొని బయలుదేరిరి. సీతారామ లక్ష్మణులు అడవిలో ప్రయాణించుచుండగా వారికి కొంతదూరములో ఒక మహావృక్షము కనిపించినది. ఆ చెట్టు నీడనవారు కొంతసేపు విశ్రాంతిగా నిలచిరి. ఆ ఆ సమయములో వృక్షరాజము వారి యలసటను తీర్చినదాయెను.

## జటాయువు

ఆ వృక్షరాజముపై ఒక గృధ్రరాజముండుట గమనించి, అతడు రాక్షసుడేమోయని శంకించి రామ లక్ష్మణులు "ఓ గృధ్రరాజమా! నీ వెవ్వడవు?" అని ప్రశ్నించిరి.

అందులకు "రాజపుత్రులారా! నేను నీ తండ్రియైన దశరథ మహారాజు సఖుడను." అని సమాధానమిచ్చెను.

రాము :- నీ కులమేమి? నీ పేరు మున్నగు వివరములు తెలియ గోరుచున్నాను.

కశ్యప ప్రజాపతి భార్యయైన వినతకు 'అరుణుడు, గరుడుడు' అను ఇద్దరు కుమారులు కలిగిరి. అరుణునికి మేమిద్దరు కుమారులము జన్మించినాము. నా అన్న 'సంపాతి' యను పేరుగలవాడు. నా పేరు జటాయువు-
"రామా! నీ కిష్టమగునేని మీకు తోడుగానుందును. ఈ యరణ్యములో మృగ, రాక్షసుల బాధ మిక్కిలిగా నున్నది. మీ సోదరులెచ్చటికైన వెళ్ళినచో నేను సీతాదేవిని రక్షించుచుండగలను.

జటాయువు మాటలను విన్న శ్రీరామునికి అతనిపై భక్తిభావము కలిగినది. తన తండ్రికి, జటాయువునకుగల స్నేహమును మరల మరల చెప్పించుకొని రాముడు మిక్కిలి ఆనందించి, పితృభావముతో జటాయువునకు నమస్కరించెను. జటాయువు సహకార, వాత్సల్య భావమునకు అలరి, అతని సహకారమును మహా ప్రసాదముగ స్వీకరించి, జటాయువు యుక్తంగా వారు పంచవటికి చేరుకున్నారు.

## పంచవటిలో - పర్ణశాల

రాముడు లక్ష్మణునితో ఇట్లన్నాడు "లక్ష్మణా! అగస్త్యుల వారు సూచించిన పంచవటికి చేరుకున్నాము. అక్కడ రాముని కోరికపై లక్ష్మణుడు పర్ణశాలను నిర్మించుటకు అనువైన ప్రదేశమును చూచి, అందుకు అవసరమైన పరికరములను సిద్ధపరచుకొని రమ్యమైన ఒక పర్ణశాలను నిర్మించెను. అందువారు వాస్తు పూజ జరిపిరి. పర్ణశాల చుట్టును పూలు, తేనెలతో అలంకరించెను. సీతారాములు పర్ణశాల లోనికి ప్రవేశించిరి. జటాయువు వారికి దగ్గరలోనే ఉన్న ఒక వృక్షముపై నివసించుచుండెను.

లక్ష్మణుడు ప్రతిదినము అన్న వదినెలకు ప్రాతఃకాలములోనే పాదాభివందనముచేసి, అడవిలోనికి వెళ్ళి వలసిన ఫలపుష్పములను, కందమూలములను త్రవ్వితెచ్చుచుండెడివాడు. సీతాదేవి ప్రతిదినము గోదావరినదికి వెళ్ళి స్నానముచేసి నారచీరెలార వేసుకొని, త్రాగుటకై కొన్ని జలములను మట్టి పాత్రలో తెచ్చుకొని, పర్ణశాలకు తిరిగి వచ్చెడిది.-శ్రీరామచంద్రుడు సీతను ఆనందపరచుటకై ఎన్నో మనోహర దృశ్యములను చూపించి ఆమెను నిత్యము ఆనందపరవశురాలిని గావించెడివారు.

ప్రతి నిత్యము, ఆ పరిసరములలో గల ఋషి పుంగవులను దర్శించి, వారిచే అనేక పురాణగాథలను విని, ఆనందించెడివారు. రాత్రి, పగలు తెలియకుండా వారు ప్రకృతి ఒడిలో వారు సుఖ విశ్రాంతి విహారములను సలుపుచు, పది సంవత్సరములు ఆ వనవాస జీవితమును గడిపిరి.

ఇంతలో హేమంతఋతువు ప్రవేశించినది.

## శూర్పణఖ

ఆశ్రమ సమీపంలో రాముడు, లక్ష్మణుడు విహారం చేస్తూ వుండగా రావణుని చెల్లెలైన 'శూర్పణఖ' యను రాక్షసి వచ్చి, రాముని ముగ్ధ మోహనాకారమును చూచి మోహము జనించినదై, "రామా! నన్ను పెండ్లాడుము. నేను నిన్ను చూచినప్పటి నుండి మోహముతో దహించుకొనిపోవుచుంటిని. నన్ను నీదానను చేసుకొని, నా కామ దాహమును తీర్పుము.

రాముడు 'శూర్పణఖ' వాక్యములను విని, "నీవింత అందగత్తెవు. ఒంటరిగా ఈ యరణ్యములో ఇట్లు తిరుగుట యేమి?"

అతడు ఆమె బారినుండి మృదువుగా తప్పించుకొన దలచి, కొలదిగ హాస్యము జోడించి "నీకు నేను అనువైన వాడనుకాదను. అదిగో మా తమ్ముడు లక్ష్మణుడు. నీవు అతని వద్దకు వెళ్ళి నీ కోరికను తెలుపుము. అతడు నీ కోరిక తీర్చగలడు"

శూర్పణఖ వెంటనే మనస్సు మరల్చుకొని, "లక్ష్మణుని చెంతకు వెళ్ళి, తన సోయగములు అన్నియు ప్రదర్శించుచు "నన్ను వివాహ మాడుము నాథా!" అని సంబోధించుచు అతి దగ్గఱగా పోయినది.

లక్ష్మణుడు తన్ను తాను తప్పుకొనుచు కొంచెము హాస్యము చేయ దలచి, "ఔరా:- ఎంత మోసము. నేను బ్రహ్మచర్య వ్రత నిష్ఠుడను. నా అన్నయే నీకు తగిన వరుడు. నిన్ను మరలింప జేయుటకు నిన్నిట్లు నామీదకు సిగొలిపినాడు. వెళ్ళుము. నీ కోర్కెను నా అన్నయే తీర్చగలడు." అని పలికెను.

లక్ష్మణుని మాటలను శూర్పణఖ నిజమని నమ్మి, ఆమె మరల రాముని వద్దకు వెళ్ళి "రామా! ఈ ముసలి భార్య నీకెందులకు? నీవు నన్ను పెండ్లాడుము. ఈమెను నేనిప్పుడే మ్రింగివైచెదను. ఈ చెనటి యడ్డు క్షణములో తొలగిపోగలదు. తరువాత మనమిద్దరము శాశ్వతముగా కామడోలికలలో తేలియాడగలము. నా కోరికను మన్నింపుము. నన్ను వివాహమాడుము" అనుచు శూర్పణఖ సీతాదేవిని మ్రింగుటకు పోవుచుండెను.

లక్ష్మణా, ఇక ఏ మాత్రమును ఆలస్యము చేసిన అపాయము కలుగును. రాక్షసులు కామరూపులు, దుర్మార్గులు. వారితో పరిహాసములు పనికిరావు. వెంటనే ఈమదాంధకు తగిన శాస్తి చేయుము" అనిఆజ్ఞాపించెను.

లక్ష్మణుడు రాముని యాజ్ఞపై వెంటనే ఒరనుండి కత్తిని దూసి, శూర్పణఖ ముక్కు, చెవులనుకోసి, వికృత రూపిణిగా నొనర్చెను. ఆమె దుఃఖంతో లక్ష్మణుని మ్రింగి వేయడానికి ముందుకు దూకినది. వెంటనే రాముడు విల్లందుకుని బాణమును ఎక్కుపెట్టు చుండిన శూర్పణఖ భయపడి పరుగెత్తి మాయమయ్యెను.

రాముడు కోపోద్రిక్తుడై శూర్పణఖను వెంబడించెను. లక్ష్మణుడు "అన్నా ఆగుము. శూర్పణఖ వెళ్ళిపోయినది. సీతాదేవి భయముతో భీతిల్లుచున్నది. ఆమెనూరడించుము.

రాముడు శాంతపడి, సీతను మంచిమాటలతో ఊరడించెను.

శూర్పణఖ తనకు కలిగిన అవమానమును దుఃఖమును భరింప లేక జనస్థానములో నున్న తన అన్నలైన ఖరదూషణాదులకు విన్నవించెను.

"అన్నా! నన్ను మానవుడైన రాముడు, వాని తమ్ముడు లక్ష్మణుడు పరాభవించినారు. ఇది నాకు, మీకు తీరని అవమానము? అని విలపించినది. ఖరుడు తీవ్రమైన ఆవేశముతోను, ఆశ్చర్యముతోను "ఆహా! ఏమి ఒక నరుడు ఇందరు రాక్షసులను వధించుటయా!" అను

కొని మరల మరింత సైన్య సమేతముగా సీతారామలక్ష్మణులున్న ఆశ్రమముపైకి దండెత్తెను.

## జన్మస్థానంలో రాక్షస సంహారం

ఖరుని సైన్యమును అవలీలగా రాముడు తెగటార్చినాడు. చావకుండా మిగిలిన రాక్షసులు ఖరుని వద్దకు వెళ్ళి జరిగిన ఘోరమును ఈ యుద్ధాంతమును విన్న ఖరుడు మిక్కిలి క్రోధోద్రిక్తుడై ఔరా! మన ఆ రాక్షససేనను చంపినవాడు, ఇంద్రుడో, ఉపేంద్రుడో కాడు కదా! ఎవరైనను నేనిప్పుడే ఈ క్షణముననే సాయుధుడనై వెళ్ళి, వానిని హతమార్చెదను. అంతలో ఖరుని సేనాపతియైన దూషణుడు, స్వయంగా యుద్ధసన్నద్ధుడై బయలుదేరి రామునిపై శరవర్షము కురిపించినాడు. రాముడు ఆ శరవర్షమును లెక్కచేయకుండా, దూషణుని రథాశ్వములను, పిమ్మట సారథిని సంహరించినాడు. దూషణుడు విరథుడైనాడు. వెంటనే అతడొక ముసలాయుధమును చేతబూని, రామునిపైకి లంఘించినాడు. రాముడు, తన వాడి బాణములచే ఆ రాక్షసుని చేతిలోని ఆయుధమును, అతని రెండుచేతులను ఖండించినాడు. దూషణుడు నేలమీద కొరిగి, ప్రాణములను వదిలినాడు.

ఈ విధంగా శ్రీరామచంద్రుడు జనస్థానంలో తన నిరుపమాన శౌర్య పరాక్రమాలను చూపుతూ వరుసగా పదునాలుగు వేలమంది రాక్షసులను సంహరించాడు.

## త్రిశిరునితో యుద్ధం

అంత ఖరుడు యుద్ధానికి బయలుదేరాడు. సేనానాయకుల్లో ఒకడైన త్రిశిరుడు. ఖరుణ్ణి వారించి తాను యుద్ధానికి బయలుదేరాడు. "రాముని వధించుటో, లేక రాముని చేత చచ్చుటో చేసెదనుకాని, ఊరక తిరిగిరాను" అని శపథము చేసి బయలుదేరాడు.

త్రిశిరునికి, రామునికి ఘోర యుద్ధం జరిగింది.

త్రిశిరుడు రాముని నుదుటిమీద మూడు వాడియైన బాణాలను ప్రయోగించాడు. అవి రాముని మిక్కిలి బాధించినవి. రాముడు ప్రచండ భాస్కరుని మాదిరిగా క్రోధోద్రిక్తుడై, తన నిశితబాణమును త్రిశిరునిపై ప్రయోగించినాడు. మూడుతలలు గల త్రిశిరుడు, ఒక్కుమ్మడి తలలు తెగి నేలకూలినాడు,

## ఖరుడు

రాముని అపూర్వపరాక్రమోదంతాన్ని విని ఖరుడు భయముచే వణికిపోయినాడు. ఖరుడు రామునితో యుద్ధమును ప్రారంభించినాడు. రామునికి, ఖరునికి ప్రచండమైన యుద్ధం జరిగింది. అగస్త్యు డిచ్చిన బాణమును ప్రయోగించి, ఖరుని ధ్వజాన్ని కూల్చినాడు. ఖరుడు రామునిపై నిశితబాణ పరంపరను కురిపించాడు. రాముని శరీరము గాయములచే రక్తసిక్తము అయింది.

అంత రాముడు రెట్టించిన కోపము, బల, పరాక్రమాదులతో ఖరునిపై బాణాలను వేసినాడు. ఖరుని ధనుస్సు విరిగెనది. రథమునకు కట్టిన గుఱ్ఱములు కూలినవి. సారథి చచ్చినాడు. ఖరుడు విరథు డైనాడు. అతడు రథమును విడిచి, గదను తీసుకొని రామునిపైకి లంఘించినాడు. రాముడు అతని చేతిగదను తన బాణముచే తుత్తు నియలు చేశాడు. ఇంద్రుడు అగస్త్యున కివ్వగా, అగస్త్యుడు తన కొసంగిన బాణమును వానిపై ప్రయోగించినాడు. ఖరుడు తిరుగులేని ఆ బాణంచేత హతుడైనాడు.

ఈ యుద్ధ దృశ్యాన్నంతటినీ దేవతలు ఆకాశం నుండి తిలకించి రాముని పరాక్రమమును స్తుతించి, జయము పలికి వెళ్ళిపోయినారు.

## మారీచుని వద్దకు రావణుడు పోవుట

జనస్థానంలో రామునకు, రాక్షసులకు జరిగిన ఘోరయుద్ధము, ఆ యుద్ధములో ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు మున్నగు ముఖ్యులలో రాముడు పదునాలుగు వేలమంది రాక్షసులను మట్టుపెట్టిన ఉదంతాన్ని రావణుని-గూఢచారి అకంపనుడనువాడు చూచి, సవిస్తరంగా, ఆ వివరాలను రావణుని వద్దకు వెళ్ళి విన్నవించుకున్నాడు.

రావణుడు క్రోధోద్రిక్తుడై "నేనిప్పుడే జనస్థానమునకు పోయి రాముని పరిమార్చెదను." అని గర్జించగా అకంపనుడు "రాజా ఆ రాముడు సామాన్యుడు కాదు. అతిలోక పరాక్రమవంతుడనిపిస్తున్నది. అతడు తలచుకుంటే సముద్రాలను తన శరవర్షముచే ఇంకింప జేయ గలడు. సమస్తలోకాన్ని సముద్రంలో ముంచగలడు. మునిగినదానిని తేల్చగలడు," అని నాకు అర్థమైనది.

"ప్రభూ! రాముని పరిమార్చుటకు నాకొక యుపాయము తోచుచున్నది. అతని వెంట అతిలోక సౌందర్యవతియైన ఒక స్త్రీ యున్నది. ఆమె పేరు 'సీత'యని విన్నాను. నీవు పోయి ఆమెను అపహరింపుము. అప్పుడు రాముడు కదలును. ఆమె యెడబాటును సహింపలేక శక్తిహీనుడై, నీతో యుద్ధమునకు వచ్చును. అప్పుడు అవలీలగా నీవు రాముని వధింపవచ్చును. శూర్పణఖను అవమానించిన క్రోధము, దుఃఖము, పగ ఆ విధముగ నీకు తీరిపోవును.

గూఢచారి అకంపనుడు చెప్పిన మాటలు ఆవేశము నిండుగా దట్టించుకొనియున్న రావణుని మనస్సునకు చక్కగా నాటినవి.

విసురుగా రావణుడు ఆసనము నుండి లేచి అంతఃపురములోనికి పోయెను.

## శూర్పణఖ రావణునితో జనస్థాన రాక్షసుల వధను చెప్పుట

జనస్థానంలో ఖర దూషణాదులు రాముని బాణ పరంపరచే చచ్చినారని, శూర్పణఖ రావణునికి పిడుగువంటి వార్తను వినిపించింది. ఆ రాముడు అచ్చట గల పదునాలుగువేల మంది రాక్షసులను నిర్దాక్షిణ్యంగా వధించినాదని పితృవాక్య పాలన అనే నెపంతో దండకారణ్యంలో ఉన్న మనజాతి వారినందరినీ తుదముట్టించడానికి కంకణం కట్టుకొని వచ్చినట్లుగా తోచుచున్నది. ఆ నా యూహను అసంఖ్యాకులైన మన రాక్షసులను చంపుటద్వారా నిరూపితమైనది.

"అన్నా! రాముడు సామాన్యుడు కాడు మన్మథాకారుడు, ఎంతటివారినైన తన మాటలచే, చేతలచే వశపరచుకొనే ప్రజ్ఞాశాలి. శత్రువులపై తిరుగులేని శక్తివంతమైన బాణములను గుప్పించి నాశనము చేయుటలో అతనికతడే సాటి.

ఇంత విపత్తు జరిగినను నీవు చీమ కుట్టినంతయైనను బాధపడుట లేదు. అసలు నీ యుత్పాతము తెలిసినట్లే లేదు. నీవు మహారాజువు. గొప్ప శక్తివంతుడవు, భుజబలం చేత, తపోబలంచేత గొప్పవాడవనిపించుచున్నావు. రాజైనవాడు చారుల వలన ఎప్పటికప్పుడు రాజ్యంలోని విషయాలను తెలుసుకుంటాడు. మరి నీవో-

శూర్పణఖ నిర్భయంగా, నిస్సంకోచంగా రావణునితో మాట్లాడుచున్నది.

"కామోపభోగాలలో నీ జాతికి జరిగే కీడును గురించి యాలోచించుట లేదు. నీ యప్రమత్తత రాక్షసవంశ అధోగతికి దారితీయును సుమా!"

"భ్రాతా! రాముని వెంట అతని భార్య సీత మరియు సోదరుడు 'లక్ష్మణు'డను వాడున్నాడు. సీత రాముని వీడదు. లక్ష్మణుడు వారిరువురిని వీడడు. అతడు కూడ రాముని పోలినవాడే. అతి సుకుమారుడు అందగాడు. అయితేనేం వారు తేనెపూసిన కత్తులు. నన్ను ఇతర రాక్షసులతో పాటు వధించువారే. కాని నేను యాడుదానినని ఈ విధముగా విరూపను చేసి వదిలినారు.

ప్రభూ! రాముని వెంట సీత ఉన్నదని చెప్పితిని. ఆమె అతిలోక సౌందర్యవతి. ఒక్క చూపుతోనే చూపరులను ఆకట్టుకొను తేజోవతి. నిజము వక్కాణింతునేని ఆమె, అతనికి తగినదికాదు. ఆమె నీవంటి శౌర్య సాహస, గాంభీర్య, తేజోనిధియైన వీర పురుషునికి భార్య కాదగినది. రామలక్ష్మణులిరువురు జనస్థానంలో మన వారిని హతమార్చిన పగ తీర్చుకొనుటకు ఒక మార్గము చెప్పుచున్నాను. నీవు సకల విధములైన బలాలతో జన స్థానమునకు వెళ్ళి, రామలక్ష్మణులను సంహరించి వీరోచితముగా సీతను తీసికొని వచ్చి, ఆమెను పెండ్లాడుము.

అన్నా! మరొక మారు స్ఫుటముగా చెప్పుచున్నాను. సీత నీకు భార్య యగుటకు అన్ని విధముల తగియున్నది.

రావణుడు శూర్పణఖ మాటలను సావధానంగా విన్నాడు. ఆమె మాటలు అతని అంతరంగాన్ని ప్రతీకారేచ్ఛను రగుల్కొలిపాయి. అయితే శూర్పణఖ, రామలక్ష్మణుల వద్ద అసలు తనకు జరిగిన వృత్తాంతమును యధార్థముగ చెప్పలేదు. కామోప పీడితమైన తన వాంఛకు ప్రతిఫలముగ తాను వారివలన పొందిన యవమాన సంఘటనమును ప్రక్కకు పెట్టి, 'సీత'ను గురించి చెప్పుటద్వారా అతనిలోని స్త్రీ వ్యామోహమును రెచ్చగొట్టి ప్రలోభపెట్టినది. అదేవిధముగ జన స్థానంలో రాక్షసుల వధను గురించి చెప్పి, అతనిలోని రాజ ధర్మాన్ని సవాలు చేసి, కార్యోన్ముఖుణ్ణి చేసింది.

## రావణుడు మరల మారీచుని వద్దకు వెళ్ళుట

శూర్పణఖ మాటలు విని క్షణములో రావణుడు మరల మారీచుని వద్దకు బయలుదేరినాడు. అడవిలో మారీచుని ఆశ్రమం ఉన్నది.

రావణుడు మారీచుని సందర్శించినాడు. అతడు రావణుని కుశల ప్రశ్నలు వేసి, అతను వచ్చిన విషయమును తెలుసుకొని "రావణా! నీవు సీతాపహరణమును గురించిన ఆలోచన మానుకొనుము. సీత, నీవన్న ఆ రాముని భార్య. ఇక రాముడనగనో కేవలం మానవమాత్రు డని తలంపకు. అతడు యుద్ధములో దేవతలనే యవలీలగా నిర్జించ గలడు. అతడు విష్ణుతుల్య పరాక్రముడు. అతని జోలికి పోవుట కొరవితో తల గోకికొనుటయే. క్రూర విషసర్పము నోటిలో వేలు దూర్చుటయే. నా హితవును ఆలించి, నీ యాలోచనమును మానుము. నీకీ యాలోచన ఎవరు పుట్టించిరో! ఎట్లు ఆలోచించితివో తెలియదు కాని, ఆ చెప్పినవారు నీకు హితులు కాదు. నీ వినాశనమును కోరు శత్రువు సుమా! కావున నీవట్టి ప్రయత్నమును మానుట ఉచితము.

రాజా! లోకములో ముఖప్రీతి కొరకు, మెర మెచ్చుతనముతో తమ ప్రయోజనములు చక్క బెట్టుకొరకు, ప్రియవాక్యములు పలుకు వారెందరో ఉన్నారు. కాని అప్రియముగా భాసించినను, ఎదుటివానికి హితము చేకూర్చునట్లు నిర్మొగమాటముగా మాట్లాడువారు చాల తక్కువ. సత్యదృష్టి కలవారే నిర్భయముగా, నిర్మొగమాటముగా కటువులైనను హితమును గూర్చి మాట్లాడగలరు. నేనింతకు ముందు చెప్పినట్లు ఎవరి దుర్బోధలో నీ మనస్సు పాడు చేసినవి. మహా పరాక్రమ సంపన్నుడైన రాముని భార్య సీతను మోసముతో అపహ రించుటయను ప్రయత్నమును మానుకొనుము. అతనితో వైరము తెచ్చుకొనుట నీకే కాదు సమస్త రాక్షసజాతి నాశనమునకు కారణ మగును. నీవు సావధానుడవై లంకకు వెళ్ళి, నీ హితైషులైన విభీషణుడు, తక్కిన ధర్మ పారగులయిన మంత్రులను ఆలోచించి సరైన నిర్ణయమును గైకొనుము."

"రావణా! నేను చెప్పవలసినది చెప్పితిని. ఆ పిమ్మట ఇక నీ యిష్టము. నన్ను మాత్రము ఈ కుతంత్రమునకు ఈడ్వకుము. నేను తపోవృత్తిలో నున్నాను. మరొక ముఖ్య విషయము నీకు చెప్పు చున్నాను. నేను రాముని బల పరాక్రమములను ఇంతకు పూర్వమే తెలిసికొని యున్నవాడను. రామలక్ష్మణులు బాలురుగ నున్నప్పుడు, విశామిత్ర మహర్షి తన యాగ రక్షణకు దండకారణ్యమునకు రామ లక్ష్మణులను వెంట తెచ్చినాడు. అప్పుడు నేను ఆ యాగమును భగ్న మొనర్చుటకై ప్రయత్నించితిని. వేయి కన్నులతో యాగ రక్షణము

చేయుచున్న రాముడు నన్ను చూచి, తన వాడి బాణముచే కొట్టినాడు. నేను ఆ బాణాహతి వేగముచే నూరు యోజనముల దూరము వెళ్ళి పడితిని. అంతకుముందు నా తల్లియైన తాటకిని చంపినప్పుడును ఆతని బాణ తీవ్రతను చవి చూచినాను. ఎట్లో ఆ రెండు ఘటనములను తప్పించుకొని బ్రతికి బట్ట కలిగితిని. తెలిసినదా! రావణా! రాముని అతి లోక భీకర పరాక్రమము తెలిసిన వాడెవడూ నీ యభిప్రాయము నంగీకరింపడు. నేను నీ శ్రేయస్సు కోరి చెప్పుచున్నాను. నా మాట వినుము."

మారీచుడు చెప్పిన హితోక్తికి రావణుడు చిరాకుపడ్డాడు. క్షణంలో కోపావేశానికి గురైనాడు. పట్టరాని కోపంతో కంపించి పోతూ.

"మారీచా! నిన్ను నేను అభిప్రాయ మడుగలేదు. కేవలము నా పని (రాచకార్యము)లో సహకరించుమని కోరినాను. అడుగని అభిప్రాయమును చెప్పి, నన్ను నా నిశ్చితాభిప్రాయమునుండి మరల్ప కుము" అని హఠాత్తుగా కత్తి ఝుళిపించి, "ఇదిగో నీవు నా పంపు చేయకున్నచో నిన్ను అవశ్యము సంహరించెదను. మారు మాట చెప్పక నీవు వెండి రంగుచుక్కలతో బంగారు వర్ణముగల జింక రూప మును ధరింపుము. నీవు గొప్ప రాజనీతి విశారదుడవే కాక, మాయా వేషధారణలో నిష్ణాతుడవు కదా! అట్లు ధరించి జనస్థానములో రాము డున్న పర్ణశాల ప్రాంతమున విహరింపుము. సీత నీ యంద చందము లను చూచి ఆశపడును. ఆ జింకను పట్టి తెండని రాముని కోరాను. భార్య యందమిత ప్రేమాదరములు కలిగిన రాముడు అవశ్యం నిన్ను పట్టుటకు నీ వెంట పరుగిడును. నీవును అతనిని వంచించుచు మెల్ల మెల్లగా అందియు, అందనట్లు చిత్ర గతులలు గంతులువైచుచు, పరుగిడుచు, గడ్డిమేయుచున్నట్లు నటించుచు రాముని ఆశ్రమ ప్రాంత మునకు దూరముగ తెమ్ము. రాముడు నీ వెంట పరుగిడునపుడు అతని తమ్ముడు లక్ష్మణుడు పర్ణశాల యందే యుండును. అట్లు రాముని నీవు పరుగెత్తించి, పరుగెత్తించి తేగా అతడు విసిగిపోయి నీకు బాణము విసరును. బాణమును తప్పించుకొని, "లక్ష్మణా! లక్ష్మణా!" యని రాముని గొంతు ననుకరించి, బిగ్గఱగా అరువుము. అప్పుడు పర్ణశాలలో ఉన్న సీత, ఆ ఆర్తస్వరము రామునిదేయని తలంచి, బిగ్గరగా ఏడ్చుచుచు, "లక్ష్మణుని పంపును. లక్ష్మణుని అన్న జాడ

తెలుసుకొనుటకు బయలుదేరిరాగా అవనుకోసము పొంచియున్న నేను అటు పర్ణశాలలో సీతను అపహరించి తీసుకొని పోయెదను."

"మారీచా! కావున పూర్వపనక నేను చెప్పినట్లు చేయుము. చేసితివా నీ కర్ధరాజ్యమొసంగెదను. లేదా కత్తికెరగావించెదను."

రావణుని సుదీర్ఘమైన కుతంత్రముతో కూడిన పథక రచనమును మారీచుడు విన్నాడు.

అతడిట్లనుకొన్నాడు 'రావణుడు చెప్పినట్లు చేయుదునా? పుణ్యాత్ముడైన రాముని చేతిలో చత్తును. తృణీకరింతునా ఈ దురాత్ముని చేతిలో దారుణముగ మరణింతును. ఈ రెండురకముల, మరణములలో రాముని చేతిలో మరణమే నాకు పుణ్యప్రదము.

అనుకొని మారీచుడు రావణుని వెనువెంట అంగీకరించి రాముని యాశ్రమ ప్రాంతమునకు ప్రయాణమయ్యెను.

## బంగారు జింక

మారీచుడు, రాముని ఆశ్రమ సమీపమున రావణుడు కోరినట్లు బంగారు జింక రూపమును ధరించి, అచటనున్న గడ్డి పరకలను మేయుచున్నట్లు నటించుచుండెను.

రావణుడు ఒక బ్రాహ్మణ వేషమును ధరించి, సీతాపహరణమునకు, అదనుచూచుచు గుప్తముగా ఒక చోట దాగుండి, జరుగు దృశ్యములను పరిశీలించుచుండెను.

ఆశ్రమ ప్రాంతములో నుండి సీత అల్లంత దూరమున గడ్డి మేయుచున్న బంగారు జింకను చూచినది. ఆమె రామునితో "నాథా! అదుగో ఆ లేడిని చూడుడు. ఎంత రమణీయముగానున్నది. బ్రహ్మదేవుని యొక్క అద్భుత, అపురూప సృజన సౌందర్యమునకు ప్రతీక యనదగిన ఆ జింకను మన ఆశ్రమమున ఉంచి పోషించుట ఉచితమని నా మనస్సు వాంఛించుచున్నది. మిమ్ములను నేనింత వరకు ఇది కావలెను. అది కావలెను అని కోరలేదు. కాని నేడు ఈ జింకను తీసుకొనిరండు. అది మన ఆశ్రమమునకు ఎంతయు శోభను చేకూర్చును. వనవాస వ్రతము ముగించిన పిమ్మట దీనిని అయోధ్యకు తీసుకొని వెళ్ళిన, అత్తగారలు కూడ ఎంతయు సంతసింతురు.

ప్రాణేశ్వరా! ఒకవేళ ప్రాణములతో దీనిని పట్టజాలరేని, చంపి యైనను చర్మమును తీసుకొని రండు. దానిపై మన మిరుపురము కూర్చుండి ముచ్చటించు కొనవచ్చును."

రాముడు కూడ బంగారు జింకను చూచి ఆశపడినాడు. కాని లక్ష్మణుడు 'అన్నా! ఇది మనము చూచుచున్నట్లుగా బంగారు లేడి కాదు. కామరూపుడైన మారీచుడు ఈ రూపము ధరించి, ఇచ్చటి సాధు జనులను చంపి తినుచున్నాడని వింటిమి. ఆ జింక రూపము మారీచునిదే కావచ్చును.

రాముడు లక్ష్మణుని మాటలను కాదనలేదుకాని, ఏది ఏమైనను ఆ జింకను చంపి దాని చర్మమును సంపాదింపవలెనని కోరిక కలిగినది.

రాముడు ధనుర్బాణములను ధరించి, జింక ననుసరించినాడు. అది రామునికి అందకుండా చెంగు చెంగున గంతులు వైచుచు పరుగెత్తుచుండెను. రాముడు సజ్య కార్ముకుడై దాని వెంబడి పరుగెత్త నారంభించినాడు. అట్లు జింక రాముని అరణ్యములోనికి చాల దూరము తీసుకొని పోయినది. అదే సమయములో రాముడు హరిణముపై తీక్షణబాణమును వదిలినాడు. ఆ మాయలేడి రామబాణము తగిలి గిల గిల తన్నుకొనుచు రాముని కంఠస్వరముతో "హా లక్ష్మణా! హా సీతా!" అని బిగ్గరగా విలపించి ప్రాణములు వదిలినది.

వెంటనే ఆ జింకకు రాక్షస రూపము వచ్చినది. మారీచుడు మరణించినాడు.

## సీత లక్ష్మణుని పరుష వాక్కులతో నిందించుట

మాయలేడియైన మారీచుడు రామబాణమునకు హతుడై నాడు. అతడు ప్రాణములు వదులుటకు ముందు శ్రీరాముని కంఠ ముతో "హా లక్ష్మణా! హా సీతా!" అనుచు చేసిన ఆక్రందనము పర్ణశాల యందున్న లక్ష్మణునికి, సీతకు వినిపించినది.

రాముడు చనిపోవుచున్న మారీచుని ఆర్తనాదము విని "ఆహా! నే నెంతమోసపోయితిని సీత కోరికను తీర్చుటకై, నేను వెనుక ముందు లాలోచించకయే ఈ మాయ జింక వెంట ఇంత దూరము

వచ్చితిని మృగతృష్ణను చూచి, మంచినీరని భ్రమించి పరుగెత్తిన వాని సంగతి అయినది నా పని. సీతను పర్ణశాలలో ఒంటరిగా విడిచి, లక్ష్మణుడు నాకు ఏదో ఆపద జరిగినదని భావించి, నా కొరకై పరుగు పరుగున వచ్చుచుండును. నా మనస్సు ఇప్పుడు కీడును శంకించుచున్నది." అని తలపోయుచు పర్ణశాల దిశకు మరలి వేగముగ వచ్చుచుండెను.

ఇట పర్ణశాల వద్ద రాముని ఆర్తస్వరమును విన్న సీత, మిక్కిలి భయభ్రాంతియై "లక్ష్మణా! రాముని ఆర్తనాదమును వినియుంటివి కదా! ఎందులకో నాకు భయముగా నున్నది. మీ అన్నకు ఏదియో ప్రమాదము సంభవించినట్లున్నది. లేకున్నచో అట్టి ఆర్తనాదము వినిపింపదు కదా!" అని మరపిల్లుచు, నీవు తొందరగా వెళ్ళి, నీ యన్నను రక్షింపుము.

లక్ష్మణుడు సీత మాటలకు అడ్డువచ్చి "తల్లీ! మీరూహించు చున్నట్లు రామునికి ఏ ఆపదయు కలగదు-అది రాముని కంఠము కాదు - అనుకరణ. రాక్షసులు కామరూపులుకదా! అదే విధమున వారు రాముని కంఠము ననుకరించి, మనకు కీడు చేయ సంకల్పించి అట్లు అరుచుచున్నారు.

లక్ష్మణుడు పలికిన ఈ సమాధానము సీతను తృప్తి పరచలేదు. రామునికి ఆపద శంకించిన పరితాప భారముతో ఆమె అతనిని నిందించినది.

రాముడు ఇచట లేని సమయమును నీవు అదను చూచుకొని, నాయందాశగొని యిట్లూపేక్షించుచున్నావు. నీవు కుల పాంసకుడవు. ద్రోహివి. నీవు నిజముగా అయోధ్యనుండి, మా రక్షణమునకే వచ్చిన వాడైనచో రామునికి వచ్చిన ఆపదను విని కూడ ఇట్లుపేక్షించి యుండవు.

సీత తననిట్లు నిష్కారణముగా శంకించి నిందించుటకు లక్ష్మణుడు మిక్కిలి బాధపడినాడు. తల్లివంటి సీత తననిట్లు శంకించి యూసడించుట కలలోనైన యూహించి యుండలేదు. నిర్హేతుకముగా, యేర్పడిన దారుణ పరిణామమునకు లక్ష్మణుడు మిక్కిలి బాధపడి నాడు. అతడు బిగ్గఱగా ఏడ్చాడు.

"అమ్మా! నన్ను గూర్చి అవిచారముగా నిష్ఠూరముగా తూలనాడుచున్నావు. నిర్దోషినైన నన్ను అనరాని మాటలని ఘోరమైన పాపమును మూటగట్టుకొనుచున్నావు. ఇది నీకు తగదు.

నా అన్న రామునికి ఎటువంటి యాపదయు జరుగదు. అతడు త్రివిక్రముడు. చాటునైనను, మాటునైనను మాయ చేతనైనను రామునికి ఎవ్వరును ఎట్టి యపకారమును చేయలేరు. ఇది ముమ్మాటికీ సత్యము."

లక్ష్మణుని యూరడింపు మాటలకు సీత మరింత రెచ్చిపోయి బిగ్గఱగా రోదించుచు "నేను శ్రీరామచంద్రుని విడిచి క్షణమైనను జీవించి యుండలేను. పర పురుషుని మనసు నందైనను తలంపను. అతడెవడైనా నా కాలిగోటిని కూడ తాకుటకు అనుమతింపను."

"నీవు కపటివి. మోసగానివి. అడవికి వచ్చితివని నా కోసమే" అనుచు సీత తన నుదురును ఉదరమును బాదుకొనుచు రోదించుచుండెను.

ఎట్టకేలకు లక్ష్మణుడు మనసు కుదుటపరచుకొని "నేను అన్నగారి జాడ తెలుసుకొనుటకై అడవికి వెళ్ళుచున్నాను. ఇక నిన్ను ఈ యాశ్రమమును ఈ వనదేవతలే రక్షింతురు గాక"యని చెప్పి, ధనుర్బాణములనుగొని అడవిలోనికి బయలుదేరెను.

కొంత దూరము వెళ్ళుసరికి మృగ రూపములో నున్న మారీచుని సంహరించి, రాముడు వడివడిగా పర్ణశాలకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో లక్ష్మణుడు ఎదురుగా వచ్చుటను గమనించి, రామునికి మిక్కిలి ఆందోళన కలిగినది. లక్ష్మణుడు సమీపించగానే రాముడు ఉద్వేగంతో "లక్ష్మణా! నీవు ఎందులకు వచ్చుచున్నావు. ఆశ్రమంలో సీతను ఒంటరిగా వదలి రావడం తగునా! ఈ పాటికి సీతకు ఏదో ఆపద వాటిల్లియే యుండును" అనుచు రాముడు నిష్ఠూరంగా మాట్లాడినాడు.

లక్ష్మణుడు ప్రశాంత గంభీర చిత్తముతో "అన్నా! నన్ను మన్నింపుము. నీ కంఠముతో నినదించిన రాక్షసుని వాక్యములను విన్న సీత నీకు ఏదో ఆపద వచ్చినదని నన్ను వెంటనే నీ చెంతకు వెళ్ళమని ఆజ్ఞాపించినది.

నేను "అమ్మా! అది రాముని కంఠము కాదు" అని ఎంత చెప్పినను విన్నది కాదు. విధిలేక ఆమె యాజ్ఞకు బద్ధుడనై ఇటు బయలుదేరి వచ్చినాను."

లక్ష్మణుని మాటలు విన్న రాముడు ఆశ్రమంలో సీతను గురించి యాలోచించుచు, "నా మనస్సు కీడు శంకించుచున్నది. అందులకు నిదర్శనగా కొన్ని అపశకునములు కలుగుచున్నవి. కుక్కలు, నక్కలు, ఇతర జంతువులు సూర్యునికి ఎదురుగా నిలిచి, ఆర్తారావములు చేయుచున్నవి.

లక్ష్మణా! నీవు బయలుదేరి వచ్చిన పిదప సీత పర్ణశాలలో ఉండి యుండదు. ఆమె ఇప్పటికే రాక్షసుల బారిబడి యుండును. మరణించి యుండును లేదా గోదావరిలో పడి చచ్చియైన యుండును. హతవిధీ! ఎంత పని జరిగినదయ్యా!" అనుచు రాముడు విలపించుచు, తమ్మునితో పర్ణశాలకు బయలుదేరెను.

## రావణుడు పర్ణశాలలో సీతను అపహరించుట

రావణుడు సన్యాసి వేషమును ధరించి పర్ణశాలవద్దకు వచ్చినాడు. అతడు చెట్టుచాటున దాగియుండి, సీత లక్ష్మణుని తూలనాడి రామునియొద్దకు పంపుట అంతయు చూచెను.

రామలక్ష్మణులు వచ్చుసరికి తన పనిని ఇచ్చుట పూర్తిచేసుకొని వెళ్ళవచ్చునని తలంచి, ఇదియే అదనని సన్యాసి వేషమునవలంభించి, సీతాదేవియున్న పర్ణశాల బయటనే నిలబడి, 'వేదబుక్కు'లను పఠించుచు "అమ్మా బయటికిరమ్మా. మేము సర్వసంగ పరిత్యాగులమైన యతీశ్వరులము. మీ యాతిథ్యమును గోరి వచ్చినాము.

ఒంటరియైన సీత భయపడుచు సన్యాసికి భిక్షనొసంగుటకై పళ్ళెములో ఫలపుష్పాదులను తీసుకొని బయటికి వచ్చెను.

ఆమె భయముచే గడపలోపలనుండియే సన్యాసికి భిక్షనొసంగ ప్రయత్నించినది. అంత రావణుడు సీతతో కొన్ని గృహిణీ ధర్మములను చెప్పెను.

"స్త్రీలు గడప అవతల ఉండి, ఇతరులకు భిక్షాచరణము చేయరాదు. ఇది సాధారణ ధర్మము. ఈ ధర్మమును నీవు పాటించనిచో

నేను నీచేత భిక్షను స్వీకరింపజాలను. నీవిప్పట్టున ఉపేక్షించితివేని, మేము భిక్షను స్వీకరించకయే వెళ్ళిపోయెదము. అట్లయినచో నీకు అతిథ్యమర్యాదాభంగ దోషము కలుగును."

అనుచు రావణుడు వెనుదిరిగి వెళ్ళిపోబోతున్నట్లు నటించెను.

సీతాదేవి భయపడుచునే గడపనుదాటి, రావణునికి భిక్షనీయ అడుగు ముందుకు వేసెను.

## రావణుడు సీతను అపహరించుట

సీత తన ముందు నిలుచుండుటచూసి రావణుడు తక్షణమే తన నిజరూపమును ధరించి, ఆకాశంలో బుధుడు రోహిణిని పట్టినట్లు సీతాదేవిని పట్టుకొన్నాడు. అతని ఎడమచేతిలో తలవెంట్రుకలను కుడిచేతిలో ఊరువులను పట్టుకొని, ఎత్తి తన యంకమున దట్టించు కొని, రథంమీదకు చేర్చినాడు.

తన పరాన్ని కోల్పోయి, విస్మృతిగన్న సీత, ఆమెకు తెలియ కుండానే 'రామా' అని బిగ్గఱగా ఏడ్చినది. రావణుని రథం గగన మార్గంలో వేగంగా పోతున్నది.

సీత విలవిలలాడుచు పిచ్చిపట్టిన దానివలె పరితపిస్తూ ఉండినది.

ఆమె వనంలోని, పక్షులను, వృక్షాలను, మృగాలను ఉద్దేశిస్తూ, తనను రావణుడపహరించుకొని పోవుచుండెననియు, ఈ వార్త రామ లక్ష్మణులకు తెలియజేయుడనియు దీనముగా విలపించి, పలవించెను.

## రావణునితో జటాయువు పోరుట

రావణుడు సీతను అపహరించుకొనుచు పోవుచుండగా ఆ దాపుననే ఒక వృక్షముమీద ఉన్న జటాయువు సీత ఆర్తారావమును వినినాడు. అతడు ఆకాశంవైపుకు దృష్టి సారించాడు. దుర్మార్గుడైన లంకాధిపతి రావణుడు సీతాదేవిని అపహరించుకొని ఆకాశమార్గమున వెళ్ళుచున్నాడని గమనించెను.

రామలక్ష్మణులు ఆశ్రమంలోలేని సమయంలో సీతను అప రించుకొని వెళ్ళుచున్నాడు. జటాయువు తక్షణమే ఆకసమునకు ఎగిరి

రావణుని రథమును అడ్డగించినాడు. తన వాడియైన గోళ్ళతో రావణుని రక్కినాడు. రావణుడు ఒక చేత సీతను పట్టుకొని, వేరొక చేతితో ఖడ్గము పట్టుకొని జటాయువుతో యుద్ధము చేయబొచ్చినాడు. రాక్షస రాజు పక్షిరాజుల యుద్ధము గగన మండలమును కల్లోలపరిచెను. జటాయువు రావణుని తీవ్రంగా గాయపరిచినాడు. తన అపారమైన రెక్కలు, గోళ్ళు, కాళ్ళబలంతో రావణుని రథాన్ని భగ్నం చేసినాడు. రావణుడు విరథుడై నేలకూలినాడు. అతడు సీతకేశములను పట్టుకొని రెట్టించిన కోపముతో తన నిశితమైన ఖడ్గముతో జటాయువు రెండు రెక్కలను ఖండించినాడు.

ఆ దృశ్యమును చూచిన సీత "జటాయువు తన కోసమై ప్రాణాంతకమైన విపత్తును తెచ్చుకున్నాడు. ఈ మహాత్ముని స్వామి భక్తి యెంతటి మహోన్నతమైనది. అయ్యో! రామచంద్రా! తండ్రి వంటి జటాయువు నా నిమిత్తమై నేలకూలినాడు. ఇంక నన్ను రక్షించు వారెవరు? ఈ నా విషయమును నీకు తెలియజేయువారెవరు?" అని విలపించసాగినది. రెక్కలు కూలిన జటాయువు నేలపైబడగా, రావణుడు సీతను తన తొడమీద కూర్చుండబెట్టుకొని, ఆకాశమార్గంలో లంకానగరము వైపు దూసుకొని పోసాగినాడు.

మధ్య మధ్యలో సీతకు స్పృహవచ్చి, విలవిలలాడుచు ఆర్తనాదమును చేయుచుండెను. ఆ ఏడుపును విని క్రింద పశు పక్ష్యాదులు దుఃఖించినవి. ఋషి గణము కన్నీరు పెట్టుకొన్నది. సీత తన నగలన్నిటిని తీసి ఉత్తరీయమున మూట గట్టినది. రథము ఋష్యమూక పర్వత గగనతలంలో విహరించసాగినది. ఆ సమయంలో సీత క్రిందకు చూచి, కొందరు వానరులు చేరి ముచ్చటించుకొను సమయమున వారి నడుమ పడునట్లుగా ఆ నగల మూటను పడవేసినది. రావణుడది గమనించలేదు. అతని రథము శరవేగంతో ముందుకు సాగినది. నూరు యోజనాల సముద్రమును దాటి లంకలో ప్రవేశించినది.

లంకలో సీతను ఎచట ఉంచవలెనని ఆలోచించినాడు. మొదట తన యంతఃపురమునకు తీసుకొని పోయినాడు. అచట ఆమె నుంచి, అందలి సిరిసంపదలను, సుఖమున భోగించుటకు ఏర్పాటు చేయబడిన అమరింపులనన్నింటిని చూపెను. సీత వానిని చూడకయే తీవ్ర దుఃఖముతో కనలిపోయినది. పిమ్మట తనకు అత్యంత ప్రీతిపాత్రము

సుందరమునైన అశోక వనమునకు తరలింపచేసి, అందమైన ఒక శింశుపా వృక్షం క్రింద ఆమెను ఉంచినాడు.

ఆమెకు రక్షణగా కొందరు రాక్షస స్త్రీలను నియోగించి, ఆమె మనస్సును తన కనుకూలముగా మార్చుటకు ఆజ్ఞాపించి వెడలి పోయెను.

సీత అశోక వనంలో ఆశింశుపా వృక్షము క్రింద నిద్రా హార ములు విసర్జించి నిరంతరం రామునే మనమునందు ధ్యానించుచు రావణుని అతని అనుచరగణమును కూడ కన్నెత్తి చూడనైనా చూడక కాలము వెళ్ళబుచ్చ జొచ్చినది.

## రామలక్ష్మణులు సీతను కానక దుఃఖముతో అరణ్యమున వెదకుట

రామలక్ష్మణులు ఆశ్రమమునకు చేరుకున్నారు. వారికి అంతయు శూన్యముగా తోచినది. ఆశ్రమమున సీత లేదు. ఆమె పెంచుకున్న జింకలు, లేళ్ళు గడ్డిని మేయక కాంతి హీనమైన చూపులతో దిక్కులు చూస్తూ ఉన్నవి. అతడు ఆశ్రమం చుట్టూ తిరిగి చూచినాడు. "సీతా! సీతా!" అని బిగ్గరగా అరచినాడు. కాని సీత జాడ ఏమీ తెలియదు. రాముడు పట్టరాని దుఃఖంతో ఏడుస్తూ పిచ్చివానివలె పలవించ సాగి నాడు

"లక్ష్మణా! సీత యేమైనది. ఎవరు అపహరించినారు. ఎట్లు జరిగినదీ దుర్ఘటన?" అంటూ అదుపులేని దుఃఖంతో ఆపాద మస్తకం వణికిపోసాగినాడు.

లక్ష్మణుడు అన్నను ఊరడించడానికి ప్రయత్నిస్తున్నాడు. రాముడు స్వాధీనత తప్పినాడు. ఆ పరిస్థితిలో అతడు తన అన్నను ఏ విధంగా ఊరడింపనగునో తెలియరాలేదు. "అన్నా! నీవిట్లు ఎంత యేడ్చినను ఫలమేమి? నీవు ధీరోదాత్తమూర్తివి. ఉత్సాహ శీలుడవు. ఎట్టి యాపదలనైనను ధైర్యముతో అధిగమించగలవు.

అన్నా! ఊరడిల్లుము. మనమీ యాపదను ధైర్యముతో గడుప వలెను. మరల మరల సీతను వెదకి ఈ యరణ్యమున ఎక్కడ నున్నదో కనుగొనెదము. రాక్షసులామెను ఇంతలోనే ఎంతో దూరము

నకు తీసుకొని పోలేరు! త్వరలోనే సీత జాడ కనుగొని, ఆ దుర్మార్గులను అంతమొందింతం. ధైర్యమునవలంభించి కర్తవ్య పరుడవుతమ్ము."

లక్ష్మణుడు ఎన్ని విధాలనో రాముని యూరడింప జూచినాడు. కాని ఫలితము లేకపోయింది. శాంతసాత్వికుడు, స్వావలంబన సమర్థుడు ఐన రాముని ఆ సమయమున ఎవరూ ఊరడింపజాలని దుఃఖ సముద్రములో పడుకొని పోయినాడు. రాముడు ఎప్పటి రాముడుగా లేడు. అతడిప్పుడు ఉన్మత్త రాముడు పిచ్చిగా అరచుచున్నాడు.

లక్ష్మణా! సీత గోదావరీనది తటమునకు స్నానార్థమై వెళ్ళిన దేమో చూడుము. ఈ కొండరాళ్ళుకానీ, చెట్లుగానీ, పొదలుకానీ, ఏమియు సమాధానము చెప్పకున్నవే. ఓ సూర్యభగవానుడా! నీవు జగద్వ్యాపారమునకు ప్రత్యక్షసాక్షివి కదా! నా సీత ఏమైనదో, ఎవ డపహరించి గొనిపోయినాడో చెప్పలేవా! ఓ సెలయేటి ప్రవాహమా! ఊరకే నీవు ఏల ఘోషింతువు. సీత ఏమైనదో చెప్పుము.

"లక్ష్మణా! నీవు గోదావరి నదికి వెళ్ళి, ఆ తల్లి నడుగుము సీత యేమైనదని. ఊఁ సత్వరమే వెళ్ళుము." అని విలపించెను.

లక్ష్మణుడు నదికి వెళ్ళి సీత జాడ తెలియక మౌనముగా తల వంచుకొని తిరిగి వచ్చెను.అతడు ఆశ్రమమునందలి మృగములు గగన తలంపైపునకు చూచుచు దక్షిణదిక్కుగా పరుగెత్తుట గమనించెను.

"అన్నా! మన పెంపుడు మృగములన్నియు దక్షిణదిక్కునకు పరుగెత్తినవి. మనము కూడ ఆ దిక్కునకు వెళ్ళి వెదకుట మంచిది."

ఇద్దరూ దక్షిణదిశగా బయలుదేరారు. కొంతదూరములోని ప్రసరణ పర్వతం చేరుకున్నాడు. రాముడు ఎలుగెత్తి శోకరుద్ధ కంఠంతో "ఓ పర్వతరాజమా! సర్వాంగసుందరి, సర్వాభరణ భూషిత యైన నా సీత కనిపించుటలేదు. మీ కందములలో ఎక్కడనైన దుర్మార్గులచే దాచి యుంచబడిన చెప్పుము. చెప్పవేని నిన్నిప్పుడే నా బాణముచే ముక్కలు గావించెదను!అనుచూ కొంతదూరమునడిచి, అచట కనిపించనదని చూచి లక్ష్మణా! ఈ నదియైనను సీతను చూపించని యెడల నా బాణాగ్నిచే ఇంకింపజేయగలను.

రాముడు భరింపరాని దుఃఖముతో ముందునకు నడుచు చుండగా, లక్ష్మణుడాతనిని విడువకుండా జాగ్రత్తగా అనుసరించు చుండెను. అట్లు కొంతదూరము పోగానే రామునికి రథము విరిగిన గుర్తులు కనిపించినవి. చుట్టుప్రక్కల చెదరిన అడుగుల గుర్తులు కనపడినవి. రథము చక్రము, విరిగిన బాణములు కనిపించినవి. వాటిని చూచి రాముడు ఇవి రాక్షసుడు సీతను ఎత్తుకొని పోవుచుండగా, మార్గమధ్యమున ప్రమాదవశాత్తు జరిగిన ఘట్టన కాదుకదా! అయితే సీత ఈ ప్రమాదమున మరణించి యుండదా! జీవించియే యుండినచో ఆమె ఆర్తారవము ఏల వినిపింపదు. మృతయే యగుచో ఆమె శరీరము ఏమైనది. రాక్షసులామెను భక్షించియుందురా!

రాముడు పిచ్చివాడగుచు "లక్ష్మణా! సీత యేమైనది చూపింపుము. హా! సీతా! నీవు కనిపింపనిదే నేనిక మిగిలిన వనవాసమెట్లు చేయ గలను...? తిరిగి అయోధ్యకు సీత లేకుండా ఎట్లు పోగలను?

రాముని దుఃఖముతో పాటు కోపము కూడ ఇనుమడించి సీత లేని ఈ లోకమును మననివ్వను, కొనసాగనివ్వను. దీనినిప్పుడే ఆమూలాగ్రము నాశన మొనరింతును. ఈ బాణములచే నామ రూపములు లేకుండా భస్మీపటల మొనర్తును.

"లక్ష్మణా! ఇదిగో శరమును సంధించుచున్నాను. నన్ను అడ్డుకొనుటకు ప్రయత్నింపకుము సీత నా నుండి దూరమగు నప్పుడెట్లున్నదో అట్లుగనే మరల నన్ను చేరవలెను. లేదా ప్రపంచమునకు ఇది మహా ప్రళయము."

## రాముని లక్ష్మణుడు వారించుట

"అన్నా! సమస్త లోకములకు మేలు కోరు నీవే యిట్లు ఆగ్రహించిన, ఇక లోక రక్షణకు వేరుపాయమేది? నీవు ధర్మమూర్తివి. ధర్మమును స్థాపించుటకు నీవు యెట్టి త్యాగమునకైనను వెనుదీయవు. ఇప్పుడు నీవిధము కోపము బూని, ప్రపంచమును నాశమొనరించుచో, నిష్కారణముగ, అమాయిక జీవులకు, సాధుపుంగవులైన మునిసత్తములు, దేవతలు, గంధర్వులు మున్నగువారికి వినాశము కలుగును, ఇది అన్యాయము.

మానవులకు ఆపదము కలుగుట సహజము. ఆ ఆపదలను ధైర్యముతో, విజ్ఞతతో గడుపవలయును. పూర్వము యయాతి స్వర్గమునుండి పతనము కాలేదా! వశిష్ఠుడు తన నూరుగురు కొడుకులను ఒక్కసారి కోల్పోయినాడు. అంతెందుకు సమస్తభారమును మోయు భూమాత ఉపద్రవములచే కంపించుట లేదా! ఇంద్రునికి, ఇతర దేవతలకు ఆపదలు రాలేదా?

"అన్నా! ఎట్టివారికైనను దైవము అనుల్లంఘనీయము.

ఎట్టి కష్టములు వచ్చినను నీవంటి విజ్ఞులు దుఃఖపడరు. రామచంద్రా! నీ పరాక్రమమును శత్రువుపై చూపుము. లోకమునేల మడియింపవలె. శత్రువును కనుగొని వానిని పరిమార్చుము.

రాముడు లక్ష్మణుని ప్రబోధమును విని శాంతిల్లి ధనుస్సునుండి బాణమును తొలగించివేసెను.

ఇరువురు దండకారణ్యము యావత్తు తిరిగి వెదుకుటకు నిర్ణయించుకొని మరల అన్వేషణము ప్రారంభించిరి.

## రామలక్ష్మణులు జటాయువును చూచుట

రామలక్ష్మణులకు ఆ ప్రదేశంలో ఒక మూలన రెక్కలు విరిగి మూలుగుతూ నేలపై పడియుండిన జటాయువు కనిపించినాడు.

రాముడు జటాయువును చూచి, ఆశతో అతనివద్దకు వెళ్ళినాడు. అతని రెక్కలు, కాళ్ళు తెగి యుండుటచూచి, తీరని దుఃఖాతిరేకంతో కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు.

"జటాయూ! నీకు ఈ దుస్థితి కలిగించిన దుర్మార్గుడు ఎవరు? నా సీత ఏమైనది?" అని అతనిపైబడి భోరున విలపించినాడు.

"రామా! సీతను, రావణాసురుడు గగన మార్గాన ఆశ్రమం నుండి అపహరించి, ఎత్తుకొని పోవుచున్నాడు. నేనాతనిని తీవ్రముగ ప్రతిఘటించి, వానితో ఘోర యుద్ధమును చేసితిని. వానిని గాయపరిచి అతని రథమును, పెక్కెమును, భగ్నము గావించితిని.

అందులకు రావణుడు రెట్టించిన కోపంతో వాడి కరవాలంతో నా రెక్కలను, పాదములను నరికివేసి, సీతను ఎత్తుకొని ఆకాశమార్గం గుండా వెళ్ళిపోయినాడు. నేను ఎంత హితవు చెప్పినను ఆ పాపాత్ముడు వినలేదు. సీత దుఃఖమునకు అంతు లేకపోయినది. ఆమెను రక్షించుటకు నేను చేసిన ప్రయత్నమంతయు నిరర్థకమైనది.

రామచంద్రా! ఈ ఘోర వార్తను నీకు చెప్పుటకే నా శరీరమున ప్రాణములను నిలిపియున్నాను. అనుచు కొలది కొలదిగ తన మేనును కదిలించి రాముని చెంతకు తెచ్చి, అతని తొడమీద తలను పెట్టి, జటాయువు ప్రాణములు వదలినాడు.

రామలక్ష్మణులు జటాయువు ఘోర మరణమునకు మిక్కిలి దుఃఖించిరి. తన తండ్రియైన దశరథునికి ప్రాణ స్నేహితుడు. తండ్రి తరువాత తండ్రిగా భావించదగిన గృధ్ర రాజైన జటాయువు మరణం అతని హృదయాన్ని ముక్కలు చేసింది. తన భార్యయైన సీతను రక్షించే ప్రయత్నంలో తన ప్రాణాలను పోగొట్టుకున్న త్యాగమూర్తి.

రామచంద్రుడు, లక్ష్మణా! పూజ్యనీయుడైన ఈ జటాయువును, పల్లమునకు తరలించుము. అక్కడ యితనికి అగ్ని సంస్కార మొనరింతము.

లక్ష్మణుడట్లు చేయగా, జటాయువు చితికి స్వయముగా రామచంద్రుడు అగ్ని సంస్కార మొనరించి, ఋణము తీర్చుకొనెను. అంతట వారు చెంతనేయున్న గోదావరినదికి వెళ్ళి స్నానాదులు చేసి, జటాయువునకు జలతర్పణము గావించిరి.

ఆహా! పక్షిరాజైన జటాయువెంతటి ధన్యాత్ముడు. సాక్షాత్తూ దైవాంశ సంభూతుడైన శ్రీరామునిచే అంత్యక్రియ లొనరింప జేసుకొనిన సార్థకజన్ముడు.

రామలక్ష్మణులు అక్కడ నుండి సీతాన్వేషణకు అరణ్యములో సాగిరి..

"లక్ష్మణా! సీతను రావణుడు ఆకాశ మార్గమున ఎత్తుకొని వెళ్ళుచుండెనని జటాయువు మనకు చెప్పినాడు. కాని వాడు, సీతను

ఎక్కడికి తీసుకొనివెళ్ళియుండెను. ఏమి చేసెను. నా సీత జాడ తెలియనిదే నేను ఊరకుండజాలను. ఆమె లేకుండా నేను జీవించ లేను"...అని విలపించుచు రాముడు మార్గమధ్యంలో కనిపించిన చెట్లను, గుట్టలను, సెలయేళ్ళను, మృగాలను అన్నిటినీ కన్నీటి ధారలు కురియిస్తూ జాడ తెలుపమని అడిగినాడు.

## కబంధుడు

రామలక్ష్మణులు సీతాదేవిని వెదుకుచు, దండకారణ్యము నందలి జనస్థానమును దాటి, క్రౌంచారణ్యమునకు వచ్చినారు. అక్కడ అయోముఖి అను రాక్షసి వారి కంటబడినది. అది లక్ష్మణుని చూచి, మోహితురాలై, అతని మీదికి వెళ్ళెను. వెంటనే లక్ష్మణుడు దాని ముక్కు చెవులు ఖండించెను. అంతలోనే అడవి యంతయు విరచి నట్లు గొప్ప ధ్వని వినపడినది. ఆ ధ్వని ఎచ్చట నుండి వచ్చినదోనని విచారించ సాగినారు. ఒక పెద్ద పొదలో నుండి ఒక భయంకరమైన రాక్షసాకారము రామలక్ష్మణులను కబళించుటకు నేలపై బొర్లాడుచు వచ్చుచుండెను. వింతగా ఉన్న ఆ వికృతాకారమును చూచి లక్ష్మణుడు ఆశ్చర్యము చెందెను.

"అన్నా! దీని నోరు పొట్టలో వున్నది. ఇదియేమి చిత్రము?"

రాముడు ఆ ఆకారమును పరీక్షతో చూచెను. వెంటనే బాణమును వింటిని సంధించి దానిపై వదిలినాడు. పొట్టలో నోరు కలిగి దీర్ఘములైన బాహువులు కలిగి, అడవిలో తనదరికివచ్చు ప్రతి జంతువును చేతులు చాచి తీసుకొని భక్షించెడివాడు. ఆ విధంగా జీవించుచున్న ఆ వికృతా కారము - రామబాణము తగిలి గిలగిల కొట్టుకొని మూర్ఛనొందెను. కొద్ది సేపటికి ఆ ప్రాణి మూర్ఛ దేరి పూర్వ స్మృతి కలిగినది.

అది ఎదురుగానున్న రామలక్ష్మణులను చూచి "అయ్యా! మీరెవరు? ఎందులకీ దుర్గమారణ్యాలలో బేలలై తిరుగుచున్నారు?" అని మూలుగుతూ ప్రశ్నించెను.

రామలక్ష్మణులిట్లు సమాధానము చెప్పిరి.

"మేము రామలక్ష్మణులను వారలము. అయోధ్యాపతియైన దశరథ మహారాజు కుమారులము. పితృవాక్య పరిపాలనమునకు దండకారణ్యమునకు వచ్చితిమి. నా వెంట నా భార్య సీత కూడ అరణ్యమునకు వచ్చినది. సీతను నేను పర్ణశాలలో లేని సమయంలో మోసగించి రావణుడను రాక్షసుడు ఎత్తుకొనిపోయినాడు. ఆ కపటి, మోసగాడు, దుర్మార్గుడు ఎచటనుండునో, ఆమెను ఎచట ఉంచినాడో చెప్పగలిగినచో చెప్పుము"

"రామా! మీ పేరు వినినంతనే నాకు పూర్వజ్ఞానము కలిగినది నేను శాపగ్రస్థుడను. రాజ పుత్రుడను. నా పేరు 'కబంధుడని' ఈ అడవిలో పిలుతురు. నాకు పొట్టలో నోరు వున్నది. ఏనాడైతే ఈ యడవికి దశరథ మహారాజు పుత్రుడు శ్రీరామచంద్రుడు వచ్చి, నీపై బాణము వదులునో ఆనాడు నీకు శాపవిమోచనము కలుగగలదు. అటు పిమ్మట నీవు స్వర్గమునకు వత్తువని బ్రహ్మదేవుడు చెప్పినాడు. నా పుణ్యం వలన నేటికి మీ దర్శనము కలిగినది. నేను ముక్తుడనైతిని. ఆర్యులారా! నన్ను దిగువ ప్రాంతమునకు తీసుకొనివెళ్ళి, నా శరీరమునకు అగ్ని సంస్కారము గావింపుడు. అప్పుడు నాకు నా పూర్వ శరీరము వచ్చును." అని చెప్పెను.

కబంధుడు చెప్పిన విధంగా రామలక్ష్మణులు కబంధుని శరీరము నకు, పల్లమునందు చితిని పేర్చి, అగ్ని సంస్కారమును గావించిరి. అంతలో కబంధుడు దివ్య శరీరమును పొంది, ఆకాసము నుండి వచ్చిన దివ్య విమానమును అధిరోహించి, రామలక్ష్మణులకు నమస్కరించి "రామా! నీకు మేలు జరుగును. నీ భార్య సీతను ఎత్తుకొని పోయిన రావణుని నివాసము తెలుసుకొనుటకు మీరు ఈ దారిన పోయి, పంపాసర స్తీరము దాటి ఆవలనున్న ఋష్యమూక పర్వతము పైన నివసించుచున్న సుగ్రీవుడను వానరరాజును కలిసిన అతని వలన మీకు వలసిన సమాచారము తెలియుగలదు. మీరు ఈ దారిన వెళ్ళి

గుంపుగా ఉండిన ఫలపుష్పాన్వితమైన వృక్షరాజముల మధ్యన మతంగ మహర్షి ఆశ్రమము కలదు. ఆ మహర్షిని అమిత భక్తితో సేవించిన శిష్యులు ఎవరూ ఇప్పుడు అక్కడలేరు. కాని వారిని సేవించిన 'శబరి' అనే వృద్ధురాలైన పరిచారిక మాత్రము వున్నది. ఆయమ్మ, సర్వలోక రక్షకుడవైన నీ దర్శన భాగ్యం కొరకే ఎండి పోయిన తన తనువుతో ప్రాణాలను నిలుపుకొని యున్నది. నీవు వెంటనే అచటికి వెళ్ళి, శబరికి దర్శనమిచ్చి, ఋష్యమూక పర్వతము చెంతకు వెళ్ళి, సుగ్రీవునితో మైత్రిని సంపాదింపుము. నీకు కార్యసిద్ధి కలుగుతుంది.

ఈ హితవాక్యములను చెప్పి కబంధుడు ఊర్ధ్వ లోకానికి వెళ్ళినాడు.

## మతంగాశ్రమంలో శబరి

కబంధుడు చెప్పిన విధంగా రామలక్ష్మణులు అడవిలో ప్రయాణం చేస్తూ ఉండగా, అనతి దూరంలో వారికి చక్కని ప్రకృతి రమణీయకమైన ప్రదేశం కనిపించినది. పూలు, పండ్లతో కూపిన వృక్షములు, లతలు కనిపించినవి. రామలక్ష్మణులు ఇంపైన దృశ్యములను చూచి ఆనందించిరి.

"లక్ష్మణా! మతంగమహాముని ఆశ్రమం ఇదియేకాబోలు. శబరి ఇందే ఉండియుండును. ఈ చల్లదనం, ఈ ప్రశాంత వాతావరణం నా హృదయాన్ని ఊరట పరచుచున్నది. ఇది పుణ్యాశ్రమం. ఇక్కడ నివసించే శబరియొక్క భక్తిప్రభావము" అని చెప్పెను.

రామలక్ష్మణులు శబరి ఆశ్రమం చేరుకున్నారు. శబరి రామ లక్ష్మణులను దూరమునుండియే చూచినది "రామా! నీకొరకు ఎన్ని యేండ్లనుండి ఎదురుచూచుచుంటిని? నానిరీక్షణ నిరాశకోపమేనయ్యా! రామా! ఇక్కడికిరా. ఈ తిన్నెపై కూర్చుండుము అని, అన్నదమ్ము

ఇద్దరినీ దానిపై కూర్చుండబెట్టెను. రాముని రాకకై ఆ వృద్ధురాలు ఎంతో కాలంనుండి సేకరించి యుంచిన మధురఫలాలను భక్తితో, ఆప్యాయతతో వారి ముందుంచినది. "రామా! ఈ ఫలములను తృప్తిగా ఆరగింపుమని" వేడుకొన్నది.

రాముడు ప్రీతిపూర్వకంగా ఆ పండ్లను ఆరగించాడు ఆ పిమ్మట శబరి రామలక్ష్మణులకు ఆశ్రమవైభవం అంతా చూపి, రామచంద్రుని అనుజ్ఞ తీసుకొని తన శరీరాన్ని అగ్నికి సమర్పించి, దివ్యాకృతిని పొంది స్వర్గమునకు వెళ్ళినది.

రామలక్ష్మణులు శబరి స్వర్గమునకు వెళ్ళిన తరవాత ఆ ఆశ్రమ ప్రదేశమును, ఋషులయొక్క ప్రభావమును గమనించి, ఆ నదులలో స్నానము పితృతర్పణములు వదిలి ప్రశాంతమనస్కులై కదిలి పంపా సరోవరమును చూచి, ఆ దాపుననే ఉన్న ఋష్యమూక పర్వతాన్ని చేరుకొనుటకు నదిని దాటు యత్నములో నుండిరి.

# కిష్కింధా కాండము

## హనుమంతునితో రామలక్ష్మణులు సంభాషించుట

రామలక్ష్మణులు పంపాసరోవరం చేరుకున్నారు. వారికి కిష్కింధకు వెళ్ళుటకు మార్గము కనిపించలేదు. వాలిచేత తరుమబడిన సుగ్రీవుడు, నలుగురు మంత్రులతో కూడి ఋష్యమూకం అనే పర్వతం మీద నివసించసాగినాడు.

సుగ్రీవుని అన్న వాలి. వాలి పేరు వింటేనే సుగ్రీవునికి ఎంతో భయం. ఆ భయంతోనే ఋష్యమూక పర్వతం క్రింద అడవులలో అల్లంతదూరాన తన కెదురుగా ముందుకు నడచి వస్తున్న రామ లక్ష్మణులను చూచాడు. దయలేనివాడు, క్రూరుడు, ధర్మమును పాటించనివాడు కోపిష్టి, చండశాసనుడు ఐన అన్న 'వాలి' తనపట్ల చేసిన గొడవలకు భయకంపితుడై ఉన్నవాడు కాబట్టి సుగ్రీవుడు రామ లక్ష్మణులను చూచి, కపటియైన తన అన్న వాలియే తన పైకి మారు వేషంలో వారినిద్దరిని పంపినాడని భావించి భయపడినాడు. అతని భయమును, ఆ భయమునకు కారణమైన రామలక్ష్మణులను పరికించిన తోటి వానరవీరులు సుగ్రీవునకు కొంత ఎడముగా పోయి కూర్చుండి మౌనముతో ఎవరికివారు ఆలోచించ మొదలిడినారు. సుగ్రీవసచివుడైన హనుమంతుడు మాత్రం సుగ్రీవుని చెంతనే ఉన్నాడు. సుగ్రీవుడు మెల్లగా ఆంజనేయుని ప్రేరేపించి నీవే స్వయముగా ఈ వేషమును మార్చి, జటివై ,వారలను సమీపించి, వారి పూర్వాపరములను తెలుసు కొని రమ్ము. తరువాత మనమేమి చేయవలయునో యాలోచింతము.

హనుమంతుడు సుగ్రీవుడు కోరినట్లుగా ముని వేషమును దాల్చి, రామలక్ష్మణులను సమీపించినాడు. హనుమంతుడు వారిని సందర్శించి నమస్కరించి ఇట్లు మాట్లాడదొడగెను.

"ఓ మహాత్ములారా! అసాధారణ తేజస్సుచే వెలుగొందు మీరు సాధారణమానవుల వలె తోచుటలేదు. మహారాజు లక్షణములు మీలో విస్పష్టముగా గోచరించుచున్నవి. దుర్గమమైన ఈ యడవిలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నారు కారణం ఏమిటో సెలవివ్వండి. అని వినయవినమిత శిరస్కుడై వారి యెదుట నిలుచుండెను.

రామలక్ష్మణులు కొంతసేపటికి ఏమియు మాట్లాడకపోవుసరికి తిరిగి హనుమంతుడు వారితో ఇట్లన్నాడు.

"ధర్మాత్ములారా! సమాధానమిచ్చుటకు సందేహింపకుడు. సుగ్రీవుడు అనే వానరరాజున్నాడు. అతడు చాలా ధర్మాత్ముడు. అతని యన్నయైన వాలివలన అపకారము పొంది, యిప్పుడు తీరని దుఃఖముతో బాధపడుచున్నాడు. పవిత్రమైన మీ వంటివారి స్నేహహస్తాన్ని అభిలషిస్తున్నాడు. నేను ఆ సుగ్రీవ ప్రభువు మంత్రిని. నాపేరు హనుమంతుడు" అని చెప్పినాడు.

రాముడు సంతోషముతో లక్ష్మణుని వైపు చూచి, "లక్ష్మణా! వేద శాస్త్రములు, వ్యాకరణము అభ్యసించినట్లున్నవి ఇతని మాటలు. ఇతడు నమ్మదగిన యోగ్యునిగ కనిపించుచున్నాడు. మనకిపుడు కావలసిన తోడు, నీడ సుగ్రీవునితో స్నేహము. అట్టిపనిని ఈ యుదార వినయసంపన్నుడైన హనుమంతుడు చేయగలడను నమ్మకము కలుగుచున్నది. ఇది నీవతనితో యథోచితముగ మాట్లాడి కార్యాన్ని సానుకూలము చేయి!" అని అనెను. అందులకు లక్ష్మణుడు హనుమంతునితో ఈ విధముగా అన్నాడు.

"హనుమంతా! నీవు చెప్పినట్లుగా సుగ్రీవునితో మేమున్నూ స్నేహమునే కోరుచున్నాము కాబట్టి అట్లే చేయుదుము".

లక్ష్మణుని మాటలకు హనుమంతుడు సంతోషించి, "మీరిట్లు అడవులకు వచ్చిన కారణమేమి?" అనగా లక్ష్మణుడు "హనుమా! దశరథుడనే రాజు అయోధ్యాపతి- అతని పెద్దకుమారుడే ఈతడు.

రాముడను పేరుగలవాడు. ఇతని తమ్ముడనగు నన్ను లక్ష్మణు డందురు. రాముడు తండ్రి యాజ్ఞవలన వ్రతియై అరణ్యవాసానికి వచ్చి నాడు. ఈ మహాత్ముని భార్య సాధ్వియైన సీతాదేవి కూడ భర్తను అనుసరించివచ్చినది. దండకారణ్యము ప్రవేశించగానే అక్కడి ఋషుల అండన మేము ముగ్గురము చిత్రకూటపర్వత సమీపములో ఒక పర్ణశాలను నిర్మించుకొని యున్నాము. ఆ సమయములో రావణుడనే రాక్షసుడు సీత నెత్తుకొని పోయినాడు. అతడు ఆమెను ఎక్కడికి తీసుకొని వెళ్ళినాడో, ఎక్కడ దాచియుంచినాడో తెలియుట లేదు. ఆ విషయము తెలుసుకొను ఉద్దేశ్యముతో సుగ్రీవుని నివాసాన్ని వెతుక్కుంటూ వచ్చినాము. మీ ప్రభుని విషయం కొంత కబంధుడు చెప్పగా విన్నాము. ఇటువచ్చుచుంతగా నీవు వచ్చినావు. నిన్ను చూచిన వెంటనే మా కెందులకో నీపై ప్రేమాభిమానములు కలుగు చున్నవి. ఎన్నో ఏండ్ల అనుబంధము జ్ఞప్తికి వచ్చుచున్నది.

ఈ మాటలు విన్న హనుమంతునికి వారిపై ఎనలేని భక్తి భావము కలిగినది. ఆ క్షణము నుండియే అతడు శ్రీరామునికి భక్తుడై నాడు. మొదటిసారిగామనసులో "రామా!రామా!రామా"యనిముమ్మా రుతలచుకొని సన్యాసివేషముతోనే నది అవతలనుండి మాట్లాడుచున్న హనుమంతుడు ఒక్కగంతులో వారి సన్నిధికి చేరినాడు. చేరిన వెంటనే రామపాదములకు నమస్కరించిలేచిఅంజలి ఘటించి "స్వామీ! మీరు నా భుజాలపై ఎక్కండి మిమ్ములను నది అవతలకు దాటించి, సుగ్రీవుని సన్నిధికి తీసుకొని పోయెదను"

అత్యంత వినయ విధేయతలతో కూడిన హనుమంతుని మాటలను విని రాముడు ఆశ్చర్యపడి, కొంచెము సందేహించి, "లక్ష్మణా! ఇది రాక్షసమాయ కాదుకదా! ఈ చిన్ని పొట్టి సన్యాసి మనలను ఎత్తుకొని నదినిదాటునట" అనెను. ఈ మాటలకు లక్ష్మణుడును ఆశ్చర్యపడినాడు.

ఎదుట ఆంజనేయుడు చేతులుజోడించి, "స్వామి రామచంద్ర ప్రభూ! సాక్షాత్తు మీరు భగవత్ స్వరూపులు.సందేహములేదు.నేను మీకు కనిపించుచున్నట్లు 'సన్యాసిని' కాను, 'కిష్కింధ'యను పేరిటగల వానర రాజ్యమును వాలి యను రాజు పరిపాలించుచున్నాడు. అతని తమ్ముడు సుగ్రీవుడు. వాలి సుగ్రీవులు ఒకరోజు మాయావిఅనే రాక్షసునితో యద్ధము చేయుటకు ఒక గుహవద్దకు వెళ్ళిరి. కొన్నాళ్ళు వారితో యుద్ధముచేసిన తరువాత ఆ రాక్షసుడు తప్పించుకొని అచటి గుహలోనికి పారిపోయెను. వాలికూడ ఆతనిని వెంబడించి ఆ గుహ లోనికి పోయి యుద్ధము చేయుచుండెను. ఎంతోకాలము వారిద్దరికీ ఆ యుద్ధము జరుగుచునే యుండెను కొన్ని రోజుల తరువాత ఆ గుహనుండి ధారగా రక్తము ప్రవహించుచున్నది. అప్పుడు సుగ్రీవుడు తన అన్నయే ఆ రాక్షసుని చేతిలో మరణించెనని భావించి రాక్షసుడు మరల గుహనుండి వచ్చి, తనను కూడ చంపునను భయముతో ఆ గుహ ద్వారమునకు ఒక పెద్ద బండను అడ్డుపెట్టి మూసి వేసినాడు.

తన అన్న దుర్మరణమునకు దుఃఖించినాడు. తోటి కపివరుల సూచనల మేరకు కిష్కింధా నగరమునకు తానేరాజై, వాలి భార్య తారను తన వద్దకు తెచ్చుకొని, తన భార్యయైన 'రుమ'తో కలిసి రాజ్యమును పరిపాలిస్తూ ఉన్నాడు.

కొంతకాలము తరువాత, మహాబలశాలియైన వాలి గుహ బిలమునుండి బయటకు వచ్చి, తన రాజ్యమున జరిగిన విషయ మంతయు తెలుసుకొని తనకు ద్రోహము చేసినాడను నెపముతో వాలిని పురమునుండి పారద్రోలెను. సుగ్రీవుడు వాలి ధాటికి తట్టుకొనలేక నలుగురు మంత్రులను తీసుకొని, భూమినంతను తిరిగి, చివరకు ఈ ఋష్యమూక పర్వతం చేరుకున్నాడు. సుగ్రీవుని భార్యను వాలి వశపరచుకొనెను. అది మొదలు మా ప్రభువు భార్యా వియోగముచే

నిస్సహాయుడై ఇచ్చట నివసిస్తున్నాడు. సుగ్రీవుని వెంటయున్న నలుగురు మంత్రులలో నేనూ ఒకడను. హనుమంతుడను వాడను— మా రాజు సుగ్రీవుడు మిమ్ములను చూచి, తన అన్నవాలియే, మిమ్ములను మారువేషములో పంపినాడని భయపడి, నన్ను మీ సమాచారము తెలుసుకొను నిమిత్తము ఈ వేషముతో పంపెను.

"రాజ పుత్రులారా! నా నిజ స్వరూపమును తిలకింపుడు" అని వారికి హనుమంతుడు తన శరీరమును పెంచి నిలబడెను.

శ్రీరాముడు ఆంజనేయుని నిజ స్వరూపము చూచి, గంభీర వదనముతో సంతోషించి "హనుమా! నీవు చాలా గొప్పవాడివని, నిన్ను చూడగనే తెలిసిపోయినది. నీవు నాకు ఎంతో ఆత్మీయుడవైనావు. నీ శక్తియుక్తులు నాకు తెలుసును. నీవీ చిన్న స్వరూపముతో మమ్ములను భుజముపై నిడుకొని ఎట్లు నదని, దాటింతువోనని సందేహించితిని. నా సందేహము తీరినది.

అనుచు రాముడు "హనుమా! మమ్ములను నీ భుజముపై నెక్కించుకొని నదిని దాటించుము" అని కోరెను.

హనుమంతుడు వారిద్దరను తన భుజముపై నిడుకొని క్షణములో ఆవలి తీరము చేరుకున్నాడు. తరువాత ముగ్గురూ పర్వతంపైన సుగ్రీవుడు ఉన్న ప్రదేశానికి చేరుకొన్నారు. హనుమంతుడు రామలక్ష్మణులను సుగ్రీవునికి పరిచయము చేసినాడు.

## రామ సుగ్రీవుల మైత్రి

రాముడు, సుగ్రీవుని ప్రేమతో గాఢాలింగనం చేసుకొన్నాడు. ఇప్పుడు మనమిరువురము సమానమైన దుఃఖములో ఉన్నాము. కావున మనముభయులము ఒకరికొకరు సహాయముగ నుండి, కార్యములను సాధించుకొందము. ధర్మైకమూలమైన మన స్నేహము వలన తప్పక ఘనమౌ విజయమును సాధించగలము."

అని శ్రీరాముడు సుగ్రీవునితో చెప్పెను.

ఆ సమయములోనే రామసుగ్రీవుల నడుమ అగ్నిసాక్షిగా మైత్రి కుదిరినదనుటకు చిహ్నముగా హనుమంతుడు అగ్నిని ఉంచగా దాని చుట్టూ ఆ మిత్రులిరువురూ ప్రదక్షిణం చేసి, పరస్పరము సహకరించు కొనెదమని ప్రమాణములు చేసిరి.

రాముడు సుగ్రీవునితో 'సుగ్రీవా! నీవు నాకు ప్రాణసముడవైన మిత్రుడవైనావు. నా పూర్వ జన్మ పుణ్యఫలము వలననే నీ వంటి మిత్రుని పొందగలిగితిని. నా ముగ్గురి సోదరులలో నీవును ఒకడ వైనావు. నీకొదవిన కష్టమును దీర్చుటకై దుర్మాధాంధుడైన నీయన్న వాలిని వధించి, నీ భార్య రుమను, నీ రాజ్యమును నీకు దక్కునట్లు చేయుదును.

సుగ్రీవుడు సంతోషముతో "రామ ప్రభో! నీవు ఎంతో గొప్ప వాడివి. నీ మైత్రీ బంధంతో నా కార్యమేకాదు, జన్మకూడా ధన్య మైనది. నాయంత పుణ్యాత్ముడు మఱొకడు లేడు. రామా! నా అసం ఖ్యాకమైన వానరసేనను నలుదిక్కులకు పంపి నీ భార్య సీత జాడను, రావణ నివాసమును తెలుసుకొని యావత్ సైన్య సమేతముగా రావణు డుండు చోటునకు వెళ్ళి, అతనితో యుద్ధమొనర్చి, దురాత్ముడైన ఆ రావణ సంహారములో నీకు సహకరించి, సీత నిన్ను చేరుటకు తోడ్ప డెదను" అని ప్రతిజ్ఞ చేసెను.

అప్పుడనే ఈ దృశ్యమంతయు చూచుచున్న సుగ్రీవుని మంత్రులు జాంబవంతుడు, హనుమంతుడు, నీలుడు, నలుడు, రామ సుగ్రీవుల మైత్రిని చూచి ఎంతో ఆనందించి, వారిరువురికి నమస్క రించిరి. ఆ సంతోష సమయంలో, వారివద్దకు హనుమంతుడు ఒక చిన్న నగల మూటను తెచ్చి, రామునిచేతికిచ్చి "రామా! కొన్ని రోజులక్రితం మేము ఈ పర్వతముపై ముచ్చటించుకొనుచున్న సమయంలో ఆకాశ మార్గమున ఎవరో ఒక దుర్మార్గుడు ఒక స్త్రీని చెరపట్టి తీసుకొని వెళ్ళు

చుండెను. ఆ స్త్రీ ఆర్తనాదము చేయుచు, ఈ నగలమూటను క్రిందకు వదిలినది. ఆ మూటను నేను మా ప్రభువులకు చూపి, నాటినుండి జాగ్రత్తగా దాచియుంచినాను. ఇవి సీతాదేవివియే అయియుండునేమో పరికింపుడు. ఐనచో సీతను, సీతజాడను కనుగొనుటలో మాకు తేలిక పనియగును.

రాముడు ఆతృతతో ఆ మూటను విప్పి చూచెను. వానిని చూచి పట్టరాని దుఃఖముతో ఘోరున విలపించుచు "లక్ష్మణా! చూడుము నా కన్నులు అశ్రుపూరితములయినందున, వీనిని సరిగా గుర్తింపలేకున్నాను. ఈ నగలు సీతవేనా!" అని లక్ష్మణునికి చూపెను.

లక్ష్మణుడు వానిని చూచి 'అన్నా! ఈ నగలన్నింటిలో ఇదుగో, ఆమె కాలియందెలు పీటిని బట్టి నిశ్చయముగా ఇవి వదినగారివేనని గుర్తింపగలుగుచున్నాను. ఇవి వదినెవే'

రాముడు సీత నగలను గుర్తించి విలపించసాగెను.

"సీతా! ఎందుపోయితివి. దుర్మార్గుడైన రావణుడు నిన్ను ఏమి చేసెనోకదా! ఎన్ని కష్టములు వచ్చినవి నీకు. నేను వలదన్నను నాతో అడవికి వచ్చిన ఫలమిది. నీ యెడబాటును భరింపలేకున్నాను." అని విలపించుచున్న రాముని చూచి వానరులును దుఃఖించిరి. కొంతసేపటికి వారు తేరుకొని, రాముని ధైర్య వాక్యములతో నూరడించిరి.

ఇంతలో చీకటి పడినది. ఆ రాత్రి వారందరూ సుఖముగ నిద్రించిరి.

## రాముడు సప్తసాళ వృక్షములను భంజించుట

ఉదయముననే రామలక్ష్మణులు, సుగ్రీవాదులు నిద్ర మేల్కొన్నారు.

సుగ్రీవుడు రామునితో "రామా! మనమిప్పుడు సమాన దుఃఖమునే అనుభవించుచున్నాము. సరే మరి వాలిని మీరు వధించి నీ కష్ట

మును కాపెదమంటివి. అది యెట్లో ఆలోచించితివా! అతడు సామాన్యుడు కాడు. మహా బలవంతుడు సముద్రమును అల్లకల్లోల పరచగలడు. మహా పర్వతములను అవలీలగా బ్రద్ధలు చేయగలడు. యుద్ధప్రియుడు. మహా బలవంతుడు ఐన మాయావి అనే రాక్షసుణ్ణి తరిమి తరిమికొట్టి ఒకానొక గుహలోనికి అతడు తలదాచుకొనపోగా, మా అన్నయు ఆ గుహలోనికి చొరబడి, ఒక సంవత్సరకాలము పోరాడి అతనిని చంపెను.

"రామచంద్రా! అప్పటివరకూ మా అన్నకూ, నాతో ఎట్టి వైరమూ లేదు. నన్ను ఆ గుహద్వారము చెంత ఉండమని నియోగించగా నేనట్లే యుంటిని. సంవత్సరకాలము గడిచినది. అన్న మరలి రాలేదు. ఇంతలో గుహలో నుండి నురగతో కూడిన నెత్తురు ప్రవాహము బయటికి వచ్చినది. అదిచూచి ఆ రాక్షసుడే మా అన్నను చంపియుండునని భావించి ఆ కొండ గుహనుండి దుందుభి మరలివచ్చి, మా కిష్కింధను ధ్వంసము చేయునను భయముతో, అతడును వెలుపలికి రాకుండా గుహద్వారమునకు ఒక పెద్దరాతిని అడ్డుపెట్టి అన్న మరణము వలన కలిగిన దుఃఖముతో నేను కిష్కింధకు వచ్చితిని, నేను అన్న మరణమును ఎంత రహస్యముగా దాచివుంచినను వానర వీరులు ఊరుకొనలేదు. వారు గుహనుండి వచ్చిన రక్తమును చూచి ఆ రాక్షసునిచే అన్న వాలి మరణించినాడని ధృవపరచిరి. రాజులేని రాజ్యము ఉండకూడదని వారు నన్ను బలవంతపెట్టి కిష్కింధకు రాజును చేసినారు.

సంవత్సరము తరువాత నా అన్న గుహద్వారమును ఎట్లో ఛేదించుకొనివచ్చి 'తన నా గుహలో బంధించి, నేను కిష్కింధకు రాజైన స్వార్థపరుడనని, భ్రాతృ ద్రోహమునకు, రాజద్రోహమునకు పాల్పడిన వాడినని భావించి నాపై వల్లమాలిన క్రోధమును పూని, నన్ను రాజ్యము నుండి తరిమి, నా భార్య రుమను అపహరించి నాకు

తీరని కష్టమును కలిగించినాడు. ఒకానొక కారణమున వాలి యీ ఋష్యమూకమునకు రాజాలడు. వచ్చినచో శిలయగును. ఆ విషయ మతనికి తెలియును. కావున నన్ను ఏ విధముగనైన కవ్వించి, చంపి వేయవలెనని అప్పటినుండి చూచుచున్నాడు రామా! ఇదే వాలికీ నాకు కలిగిన వైర వృత్తాంతము అంతటి బలవంతుడు కావుననే అత డంటే నాకు వల్లమాలిన భయము. అట్టివానిని నీవెట్లు చంపెదవోనని సందేహము కలుగుచున్నది.

లక్ష్మణుడు "సుగ్రీవా! రాముని బలశౌర్యములను సందేహించు చున్నావా! అట్లయిన అతడేమి చేయవలెనో చెప్పుము"అనెను.

సుగ్రీవుడు రామునితో "రామా! మా అన్న దుందుభిఅనే యుద్ధ ప్రియుడైన రాక్షసుణ్ణి చంపాడు. ఆ రాక్షసుడు సహస్ర నాగబల సంప న్నుడు. అతడి కళేబరం ఈ ప్రాంతంలోనే పడియున్నది. దానిని రాముడు ఎత్తి దూరంగా విసిరివేయవలెను.

రాముడు దుందుభి కళేబరాన్ని తన కాలి బొటనవ్రేలితో ఎత్తి దూరంగా విసిరి వేసినాడు.

లక్ష్మణుడు "సుగ్రీవా! రాముడు ఇంకను ఏమి చేయవలెను" అని అనగా,

సుగ్రీవుడు "రామా! చూడుము ఆ కనబడునవి ఏడుసాల వృక్ష ములు వాలి ఒక బాణముచే ఒకేసారి ఒక సాలవృక్షమును ఛేదించ గలడు. నీవట్లు చేయగలవా!" అనెను.

రాముడు రెట్టించిన పరాక్రమముతో కనపడుతున్న ఏడుసాల వృక్షాలను తన ఒకే ఒక బాణంతో నరికివేసినాడు. మహాశక్తివంత మైన ఆ బాణం అక్కడే వున్న ఒక పర్వతాన్ని కూడా చీల్చి, మరల వచ్చి, రాముని అస్త్ర తూణీరములోనికి చేరుకున్నది.

ఆ అద్భుత దృశ్యాన్ని చూచిన సుగ్రీవుడు ఆశ్చర్యానికి అవధి లేకుండాపోయింది. అతడు రామునికి నమస్కరించి, "మన్నింపుము రామా! మా అన్న వాలి బలాన్ని దృష్టిలో ఉంచుకొని, అతణ్ని

చంపగల శక్తియుక్తులు నీ వద్ద ఉన్నవా? లేదా! అని సందేహించాను. నీ బల శౌర్యాదులు నాకు ఎరుకలేవుకదా!"

## వాలి వధ

రాముడు 'వాలివధ'ను నిశ్చయించినాడు.

రాముని ఆజ్ఞను తీసుకొని సుగ్రీవుడు మరుసటిరోజున కిష్కింధకు బయలుదేరినాడు. అతడు తనతో యుద్ధానికి వస్తున్నట్లు వేగుల వలన విన్నాడు. కాని నమ్మలేదు. అయినను యుద్ధ ప్రియుడైన వాలి ఈ వార్త వినగానే అతని భుజాలు పౌరుషంతో పొంగులువారినవి.

కొలదిసేపట్లో సుగ్రీవుడు రాజద్వారం ముందుకు వచ్చి "ఓరీ! మదాంధుడా వాలీ! ఇక నాతో యుద్ధమునకురారా! నిన్ను ఇప్పుడే ఈ నా గదతో చిదిమి యమపురికి పంపెదను." అని గర్జించినాడు.

వాలి, సుగ్రీవుని గర్జన విని ఆశ్చర్యపడినాడు. తన చెవులను తానే నమ్మలేకపోయినాడు. "ఇదేమిటీ! సుగ్రీవుడు నాతో యుద్ధానికి రావటమేమిటి? కొలది రోజులక్రితమే కదా నాకు భయపడి, భూప్రదక్షిణము చేసి చివరకు ఋష్యమూక పర్వతము చేరినాడు. ఇప్పుడు ఎవరి బలము చూచుకొని, నన్ను ధైర్యముగా యుద్ధమునకు ఆహ్వానించుచున్నాడు."

వాలి ఇట్లాలోచించుచుండగా అతని మంత్రులు వచ్చి ఇట్లు చెప్పిరి. "ప్రభూ! అయోధ్యాధీశుడైన దశరథ మహారాజు కుమారులు రామలక్ష్మణులను వారు పితృవాక్య పరిపాలన హేతువుగా అరణ్యమునకు వచ్చినారు. అడవిలో వారు నివసించుచుండగా, రావణుడు అతని భార్యను ఎత్తుకొనిపోయినాడట. భార్యను వెదకుచు వచ్చి వారు సుగ్రీవునితో చెలిమి చేసినారు. ఆ రాముడు సుగ్రీవునకు రాజ్యమిచ్చి, పట్టాభిషేకము చేయుదునని ప్రతిజ్ఞ చేసినాడట. ఆ ధైర్యము చూచుకొనియే సుగ్రీవుడు ఇప్పుడు మిమ్ములను యుద్ధమునకు పిలుచుచున్నాడు. ఆ రాముడు మిక్కిలి బలవంతుడని విన్నాము. కావున మీరిప్పుడు సాహసము చేసి, యుద్ధమునకు వెళ్ళవద్దు."

మంత్రులు వెళ్ళిపోయిన తరువాత వాలి భార్య 'తార' వచ్చినది. ఆమె కూడ భర్తను యుద్ధమునకు వెళ్ళవద్దని అన్నది. "నాథా" ఉదయమునుండి నా కేవో అపశకునములు కలుగుచున్నవి.అందులకు నిదర్శనముగా ఇప్పుడు సుగ్రీవుడు వచ్చి నిన్ను యుద్ధమునకు ఆహ్వానించుచున్నాడు. మీరంటే భయపడి పారిపోయి ఎక్కడో తలదాచుకుంటున్నవాడు, ఇప్పుడిటుకస్మాత్తుగా వచ్చి మిమ్ములను యుద్ధమునకాహ్వానించుట చిత్రముగ నున్నది. మీ యెడల నా మనస్సు కీడు శంకించుచున్నది. మీరు యుద్ధమునకు వెళ్ళవలదు." అని నొక్కి చెప్పినది.

అందులకు వాలి సమ్మతించలేదు. "సుగ్రీవుని వలెనే భార్యను కోలుపోయి అపపయై విలపించుచున్న రాముడు, సుగ్రీవునికి రాజ్యమిప్పించునా? వాలి జీవించి యుండగా అది యసాధ్యము. అంతియే కాదు, నేను యిప్పుడే సుగ్రీవుని పైకిపోయి శాశ్వతముగ వానిని యమపురి కంపెదను," అనుచు చేత గదాయుధాన్ని ధరించి సుగ్రీవునిపై తలపడడానికి వెళ్ళినాడు.

వాలి సుగ్రీవుని చేరి, అతనిని గదతో బలంగా మోదినాడు. సుగ్రీవుడు ప్రతిగా తన గదతో వాలిని మోదటం ప్రారంభించాడు. గదా యుద్ధ రీతులు తెలిసిన యిద్దరూ చాలసేపటి వరకు పోరు ఘోరంగా చేశారు.

రామలక్ష్మణులు, హనుమంతుడు, జాంబవంతుడు, ఇంకా మిగిలిన వానరులందరూ దూరానఉండి చూస్తూండగా, 'వాలి సుగ్రీవులు పోరాటం, భయంకర యుద్ధంగా మారింది. రాముడు తనలో అనుకున్నాడు. అన్నదమ్ములిద్దరినీ చూడగా ఒక్క రూపులోనే ఉన్నారు. ఇప్పుడు నేను బాణం వేస్తే అది వాలికి తగులుతుందో, మిత్రుడైన సుగ్రీవునికి తగులుతుందో చెప్పలేని స్థితి.

అని విచారించుచున్న సమయంలో వాలి, సుగ్రీవుని చితక బాదినాడు. సుగ్రీవుడు అన్న దెబ్బలకు తట్టుకొనలేక, పారి వచ్చి, తన వారిని కలుసుకున్నాడు.

రాముడు తనను అన్నతో యుద్ధమునకు ప్రేరేపించి, తాను ఏమి చేయకపోగా అతని చేతిలో నన్ను చావుదెబ్బలు తినిపించినాడు. రాముని చూచి సుగ్రీవుడు "రామా! నన్ను యుద్ధమునకు ప్రేరేపించి పంపె, అక్కడ నేను చావుబ్రతుకులలోనుండగ , నీ కేమియు పట్టనట్లు ఊరకున్నావు. ఇదేమి పని?" అని నిందా వాక్యములు పలికినాడు.

అంత లక్ష్మణుడు సుగ్రీవుని వారించుచు "సుగ్రీవా! తొందర పడి రాముని తూలనాడకుము. తప్పు నీదగును సుమా! అసలు విషయము తెలుసుకొనుము. రాముడు శత్రువునేమియు చేయలేక ఊరుకొనలేదు. నీవును, నీ యన్నయును ఒకరినొకరు పోలిన రూపములలోనున్నారు. కావున రాముడు బాణమును ప్రయోగింపలేదు. ఒకవేళ వేసినా చచ్చునది మీ యుభయులలో ఎవరో నొకరగుదురు. అట్టి పరిస్థితులలో అన్నగారు ఏమియు చేయలేక నిష్క్రియులై యూరకున్నారు. రామ బాణము తిరుగులేనిదని తెలియుము" అనెను.

రాముడు సుగ్రీవునితో "మిత్రమా! రేపు నీవు పూలమాలను ధరించి, మరల వాలిని యుద్ధమునకు పిలువుము. పూలమాల లేనివానిని అప్పుడు నేను వాలిగా గుర్తుపట్టి వధింతును. ఇది రహస్యము సుమా!

మరునాటి ఉదయమే సుగ్రీవుడు వాలి అంతఃపురము చెంతకు పోయి యుద్ధమునకు ఆహ్వానించెను.

వాలి "సుగ్రీవుని గర్జనము విని, ఎప్పటివలెనే మెడలో కాంచన మాలను ధరించి, నిన్న ఎట్లో వీనిని సోదరుడని యెంచి ప్రాణములతో వదిలితిని. ఈరోజు వీనికి నిశ్చయముగా చావు మూడినది" అని మరల యుద్ధమునకు బయలుదేరినాడు. వాలి భార్య మరల వారించినది. "తమ్మునితో ఈ నిరంతర యుద్ధము తగనిపని యన్నది. ఇప్పుడతడు లోకనాయకుడైన శ్రీరామచంద్రుడనే బలమైన రక్షణ కవచంలో సురక్షితంగా ఉండి, నీతో యుద్ధానికి వస్తున్నాడు. అతణ్ణి మీరు చంపలేరు. కాగా రాముని చేతిలో మీకేమి కీడు మూడనున్నదోనని భయముగానున్నది"

వాలి తారకు మొరటుగా సమాధానం చెప్పినాడు. "నేను నేడు సుగ్రీవుని తప్పక కడముట్టించుతాను, నన్ను అడ్డగించకు" అని రివ్వున సుగ్రీవుడున్న ప్రదేశానికి వెళ్ళి వాలినాడు. మెరపుపాటులో 'సుగ్రీవుని' పైకి లంఘించినాడు. సుగ్రీవుడు మెడలో మాల ధరించి యుండడం వాలికి అర్థంకాలేదు. "అహో! వాడు ధరించినది మృత్యు మాలయని" సణగుకొని గదను పైకెత్తినాడు. అంతలో ఎక్కడి నుండియో విసరిన రామబాణం కనురెప్పపాటులో వచ్చి వాలి ప్రాణ మూలములను తాకింది. ప్రాణాంతకమైన బాణము దెబ్బకు వాలి నేల కొరిగినాడు. బాణఘాతముచే స్పృహను కోల్పోయినాడు.

రక్తపు మడుగులో నేలబడియున్న వాలిని, సుగ్రీవుడు చూచి తలను వంచి క్షణకాలము నిట్టూర్పు పుచ్చినాడు.

## రామ బాణముచే నేలకూలిన వాలి రాముని నిందించుట

రామ బాణ ఘాతమునకు స్పృహతప్పి పడిపోయిన వాలి కొంత సేపటికి తేరుకుని తనచుట్టూ చేరిన వారిని చూచినాడు. ఎదురుగా రామలక్ష్మణులు, సుగ్రీవుడు, అంగదుడు, జాంబవదాదులను చూచి, రామునితో ఇట్లన్నాడు.

"రామా! ఎంత పని చేసినావయ్యా! ఎంతో గొప్ప సంస్కార వంతుడవు, జితేంద్రియుడవు, మహోన్నత వంశ సంజాతుడవు, నిగమ నిగమాంతవేదివి, ధర్మమును తెలిసినవాడవు అని విన్నాను. కాని ఒక సామాన్య మానవునివలె, నీవు నా యెడ ప్రవర్తించితివి. నీవు వీరుడవు, లోకైకదానుష్కుడవని విన్నాను. అయితే అది యంతయు మిథ్యయని యిప్పుడు ఋజువైనది. ఎందుకయ్యా! నీవు చాటు మాటుననుండి, బాణమువేసి ప్రాణము తీసితివి. నీకు నేను చేసిన అపకారమేమి?

రామా! నీవు ధర్మ వీరుడవనుకున్నాను. నీ మీదకు నేను యుద్ధమునకు రాలేదు. నీ దేశముపైకి దండెత్తి రాలేదు. పైగా నీవు నరుడవు. నేను వానరుడను. ఈ భేదమునను సరించియైనను నిరపరాధినైన నాపైకి రాకుండవలసినది. నీవంటి పాపి, దశరథుని వంటి పుణ్యాత్మునకు జన్మింప వలసినవాడు కాడు. నీవు నా యెదుటికి ప్రత్యక్షముగ వచ్చి యుందువేని నా చేతిలో తప్పక మరణించి యుందువు. సుగ్రీవుని మెప్పుకోసము నన్ను వధించినావు కాని, నీ పని నాకు ముందే ఎరింగించి యుండిన, ఒక్కరోజులో రావణుని వధించి, సీతా దేవిని నీకు సమర్పించియుండెడి వాడను కదా!

రామచంద్రా! నేను చనిపోయిన తరువాత సుగ్రీవుడు రాజగుట ఉచితమేకాని అతని నిమిత్తమై నీవు నన్ను చంపుట మాత్రము న్యాయము కాదు."

మృత్యువేదననుభవించుచున్న వాలి బాధను తట్టుకోలేక ఆగి, ఆగి మాట్లాడుచుండెను. యెట్టయెదుట నున్న రాముడు, వాలి తన యెడల చేసిన నిందా వాక్యములకు ధర్మశాస్త్రోపదిష్టములైన మాటలచే ఇట్లు సమాధానము చెప్పెను.

వాలీ! ధర్మము, అర్థము, కామము అననేమో తెలియకయే, అజ్ఞానమునజేసి నీవిట్లు మాట్లాడుచున్నావు. మానవులు, వానరులు, తక్కిన జంతు జాలముతో కూడిన సమస్త భూమండలము ఇక్ష్వాకు వంశ ప్రభువులది. అట్టి రాజ్యమును ఇప్పుడు 'భరతుడు' పరిపాలించుచున్నాడు. ఆ ప్రభువు యొక్క ఆదేశము మేరకే సమస్త రాజులును నడచుకొనుచున్నారు. నేను అట్టివాడనే. మహాత్ముడైన భరతుడు ధర్మరక్షకుడు. అతని రాజ్యమునందున్న నీవు ధర్మహంతవై నీ తమ్ముడైన సుగ్రీవుని యెడల ఘోరమైన అపచారము చేసినావు. అతని భార్య రుమను అపహరించి క్షమించరాని పాపమునకు గడంగినావు. దోషులను వధించుట రాజధర్మము. నీవు నిశ్చయముగా దోషివి. కనుక నీకు శిక్ష విధించినాను.

వానర రాజా! నీవు కొంత వివేకించి యాలోచించినచో నీవు చేసిన పాపకార్యము. నీకేయర్థమగును. యుక్తి యుక్తముగా నాలో

చించిన అడవి మృగములను వేటాడుట యనునది రాజధర్మమే. మాటు వేసి మట్టుబెట్టుట జంతువులను వేటాడుటతో అవలంభించు ముఖ్య ప్రక్రియ. అందుచేత వానరుడైన నిన్ను మాటున నుండి వేటాడి చంపితిని. నీతో యుద్ధము చేయుటకు ప్రతి వీరుడవు కావు కదా! అందువలన నీ యెదుటపడి యుద్ధము చేయవలసిన పనిలేదు. ధర్మా ధర్మ నిర్ణయము చేయవలసినది మానవులే. అయ్యది దైవదత్తములైన వేదములు ప్రవచించిన విధముగా ఆచరింపబడును. ధర్మా ధర్మములు కర్మ సంబంధులు అట్టి కర్మలు తెలిసియో తెలియకయో సకలప్రాణులు చేయును. చేసిన కర్మల ఫలములననుభవించుట మానవులకేకాదు సకల జీవులకును తప్పనిసరి. దైవమే 'రాజు' రూపములో ఉండి, సాధు ప్రపంచమున కలుగు ధర్మహాని, వృద్ధులకు అనుగుణమైన ఫలితము లను అందించును. ఇందు తన వారు, పరులు అనే భేద భావముండదు.

వానరా! మీ యన్నదమ్ముల విషయమున నేనును అట్టి ధర్మా చరణమునే పాటించితిని.నాకు సుగ్రీవుడును, నీవును ఒకపాటివారలనే పెద్దవాడివై యుండి, కుమారుని వంటి నీ తమ్ముని భార్యనపహరించిన పాపమే నీకు శిక్ష విధించినది. సత్యమును గుర్తించి, శాంతినొందుము. శిక్ష ననుభవించితివిగాన నీ పాపము తీరిపోయినది. ఇక నీవు పుణ్య లోకములకరుగుము."

శ్రీరామచంద్రుడు పలికిన ధర్మ యుక్తములైన మాటలు, చివరి దశలో వాలి చెవులకు నాటినవి. అతడు తన తప్పును తెలుసు కొన్నాడు. అతడు రాముని మొగముపైపు చూచి "రామప్రభూ! నన్ను మన్నింపుము. అజ్ఞానమున దైవసమానుడవైన నిన్ననరాని మాటలని నాను. నాకు వినాశకాలము దాపురించినది. కనుకనే హితులు చెప్పిన మాటలను వినలేదు. కడకు తార కూడ అనేక విధముల నా పాప కార్యములనుండి నివారింప జూచినది. కాని పెడచెవిన బెట్టితిని.

అయ్యా! నాకు దేనిమీదయు చింతలేదు. చిన్నవాడైన, నా ఏక పుత్రుడు అంగదుని మీదమాత్రము కలదు. నీవూ, సుగ్రీవుడూ అంగ దునిపై కనికరముంచి అతని యోగ క్షేమములను పరికించుచుండుడు.

రాముడు అందులకు "వాలీ! నీ కుమారుని విషయమున బెంగ పడకుము. అతడు అన్ని విధముల యోగ్యుడు. అతని యోగక్షేమ బాధ్యతలను నిర్వహించుటలో వానరులందరూ అన్ని వేళల అప్రమత్తులై యుండగలరు" అని ఊరడించెను.

## తార విలాపము

భర్త మరణవార్త విని తార, అతడు పడియున్న చోటుకు వచ్చినది అస్తమించే సమయంలో సూర్యబింబము తేజము తగ్గుతూన్నట్లుగా వాలి ముఖబింబము కళావిహీనమై కనిపించినది. కనురెప్పలు వాలిపోయినవి. ఆమె భోరున విలపించినది. తన హితబోధ వినకుండా, ఆకస్మికముగా రాముని చేతిలో కాలధర్మము చెందుటను తట్టుకొనలేక పోయినది. ఆమె తనభర్త శరీరముపై విలపింపజూడగా నలుడది గమనించి వాలి శరీరమునుండి బాణమును పెరికినాడు. వాలి ప్రాణములు గాలిలో కలిసిపోయినవి తార విగతజీవుడైన పతి శరీరము పైబడి, ఘోరమున విలపించినది.

రామలక్ష్మణులు, హనుమంతుడు మున్నగువారు తారనోదార్చిరి.

రామా! నేను నాభర్తను విడిచి ప్రాణములతో జీవించి యుండలేను. నన్నుకూడ నీ బాణముతో వధించి, నా పతి దగ్గఱకు చేర్చి పుణ్యమును కట్టుకొమ్ము" అని దీనముగా రాముని ప్రార్థించినది.

ఆమెతో పాటు అంగదుడు, సుగ్రీవుడును వాలి మరణమునకు తీరని దుఃఖము పాలైనారు. వారందరి దుఃఖముతో సమానమగు దుఃఖమును రాముడనుభవించినాడు. ఆతని జీవకారుణ్య మట్టిది.

అంగదుడు, జాంబవంతుడు, హనుమంతుడు మున్నగు వానర వీరులందరూ వాలి మృత శరీరమునకు తరువాత జరగవలసిన క్రియల గురించి ఆలోచించసాగినారు. వారు రామచంద్రుని యాదేశముల కొరకై నిరీక్షించుచున్నారు. అంత రాముడు సుగ్రీవాదులు వినుచుండగా లక్ష్మణునితో "లక్ష్మణా! వాలి యతని కర్మఫలమును అనుభవించినాడు. చనిపోయిన వారికొరకు ఎల్లకాలము దుఃఖించుచు

కూర్చుండుట సరికాదు. వాలి దహనక్రియలకు వలసిన యేర్పాట్లును జరిపింపుము." అనెను.

సుగ్రీవుని యాజ్ఞపై వానరులు, ఒక అలంకృతమైన పల్లకి తెప్పించి, వాలి కళేబరమును అందుంచి, విచారవదనములతో వారందరూ అనుగమింపగా ఆశిబికను శ్మశానవాటికకు చేర్చిరి. అందుండి వాలి శరీరమును సుగ్రీవుడు, అంగదుడు వెలికితీసి చితిపై చేర్చినారు. పిమ్మట అంగదుడు తండ్రి చితికి నిప్పంటించినాడు. తరువాత అందరు కలిసి, నదికి వెళ్ళి స్నానము చేసి, మృతునికి భక్తి సూచకంగా "జలతర్పణము" చేసినారు.

## సుగ్రీవునికి రాజ్యాభిషేకము

పిమ్మట హనుమంతుడు శ్రీరామునితో "రామా! నీ దయవలన సుగ్రీవునికి 'కిష్కింథ' దక్కినది.

అతడు నీ యనుమతితో కిష్కింథకు చేరి తన భార్యను బంధు మిత్రాదులను కలిసి, కిష్కింథారాజ్యమునకు పట్టాభిషిక్తుడు కావలెను. దయయుంచి నీవువచ్చిస్వయముగా ఆ కార్యక్రమమును జరిపింపుము" అని వేడుకొనెను.

హనుమంతుని మాటలను విని రాముడు "హనుమా! నేను పితృ వాక్య పరిపాలన నిమిత్తమై జటినై ఈ యడవులలో సంచరించు చున్నాను. వ్రతపరిమితియైన పదునాలుగు సంవత్సరములు, నేనే గ్రామమునగానీ, నగరమునగానీ, పాదముంచుటకు వీలులేదు కనుక నా బదులుగ మీరు వెళ్ళి, "సుగ్రీవునికి యథావిధిగ పట్టాభిషేకము గావింపుడు. మరియు వినుడు సుగ్రీవుని పట్టాభిషేక అనంతరము, అంగదునకు యౌవరాజ్యపట్టాభిషేకమునుకూడ జరిపించుడు, మరచిపో వద్దుసుమా!

రాముని యాజ్ఞ ననుసరించి హనుమదాదులు సుగ్రీవుడు, అంగదుని గూడా కిష్కింథకు వెళ్ళి, అచటివారినందరను కలుపుకొని వైభవోపేతంగా సుగ్రీవునికి పట్టాభిషేకం జరిపించినారు. తరువాత

సుగ్రీవుడు అంగదునికి యౌవరాజ్య పట్టాభిషేకమును ప్రకటింపగా, అతనిని కూడ వానరులంతయూ యథాక్రమముగా అభిషిక్తుని చేసినారు. సుగ్రీవుడు తన భార్యయైన రుమతోను, అన్న మరణింపగా తన వశములోనికి వచ్చిన 'తార'తోను రాజ్యపాలన సాగించజొచ్చినాడు.

తరువాత రామలక్ష్మణులు అక్కడినుండి బయలుదేరి ప్రస్రవణగిరికి చేరుకొని, ఆ పర్వతంపై నివసించసాగినారు.

## సుగ్రీవుని ప్రమత్తత

రామలక్ష్మణులు అక్కడినుండి వెళ్ళిన తరువాత, రాముడు సీతను బాసి తన యేకాంత దీన స్థితికి చింతిస్తూ మరల తీరని దుఃఖావస్థకు లోనైనాడు. తమ్ముడు లక్ష్మణుడు రాముని ఎన్నో తీర్లుగ ఊరడించినాడు. కాని రామునికి ఊరట కలగలేదు. అతడిప్పుడు మరొక మోసమునకు గురియైనాడు. సుగ్రీవుడు సత్యాన్వేషణ జరిపించి, రావణవధలో సహకరింతునని అగ్నిసాక్షిగా ప్రమాణముచేసి, అట్టి ప్రమాణమును మరచిపోయి తన వ్యవహారము తాను చూచుకొనుచున్నాడు. సిగ్గుమాలినవాడు. వంచకుడు.

"లక్ష్మణా! నీవు కిష్కింధకు పోయి నా మాటగా చెప్పుము నాలుగు నెలలు గడిచినది నీవు చేసిన బాసను చెల్లింతువా! లేక నా బాణహుతిచే నీ యన్న వాలిపోయిన మార్గమునే యనుసరింతువా!" ఏదైనది వెంటనే తేల్చి రమ్ము

"అన్నా! సుగ్రీవుడు మనమిత్రుడు. అతనిని మీరు మిక్కిలి మన్నించినారు. గొప్ప సహాయముచేసి, చిరస్మరణీయులైనారు. అట్టి వానిపై కోపించి, మృత్యు దండనభీతిని కలిగించుట యెందులకు? అతని విస్మృతిని గుర్తుచేసి, అతనివలన తగిన కార్య విధానమును ఆలోచింతము. నేనిప్పుడే వెళ్ళి మీ హెచ్చరికను వినిపించి, కార్యము సానుకూలపడునట్లు చేసెదను.

అన్న ఆజ్ఞను గైకొని లక్ష్మణుడు పరిపూర్ణ క్రోధావిష్టుడై కిష్కింధకు వచ్చి సుగ్రీవుని అంతఃపురమువద్ద నిల్చి ప్రళయ భీకర

మైన ధనుష్టంకారము చేసెను. ఆ వింటి నారి ధ్వనికి కిష్కింధ పట్టణ మంతయు ప్రతిధ్వనించినవి.

ధనుష్టంకార మెచటినుండి, ఎవరుచేసిరో తెలుసుకొని, హనుమంతుడు సుగ్రీవునివద్దకు పరుగు పరుగునపోయి, విషయమును సుగ్రీవునకు విన్నవించి, "ప్రభూ! ఇప్పటికే ఆలస్యము జరిగినది. రాముడు లక్ష్మణుని పంపి, తమ కర్తవ్యమును తెలివిడిచేయువరకు మీరలసత్వము వహించి, అంతఃపురమును వదలక యుండుట రామచంద్రునికి చేసిన బాసను మరచి ప్రవర్తించుట నేరము ఈ నేరమునకు ప్రాయశ్చిత్తముగా మీరు వారి వద్దకు వెళ్ళి "క్షమాపణ" వేడి, కర్తవ్యోన్ముఖులగుటయే. కానిచో మిత్రద్రోహమొనరించిన దోషమే కాక ప్రతిజ్ఞా భంగ దోషమును కూడ పొందినవారై చెడు ఫలితములను చవి చూడవచ్చును. మీకు మంత్రిని, సకాలములో అవసరమైన సమయములో సరియైన సూచనలిచ్చుట నా పని. ఆపైన మీ యభీష్టము."

సుగ్రీవుడు హనుమంతుని మాటలను విని తన తప్పు తెలుసుకున్నాడు. లక్ష్మణుని శాంతింపజేయుటకు మొదట తారను పంపినాడు ఆమె తన వాక్చమత్కృతిచే లక్ష్మణుని శాంతింపజేసినది.

"లక్ష్మణా! సుగ్రీవుడు రామునకు మిత్రుడు అతని యెడల రామునకు ఎటువంటి విద్రోహము జరుగదు. మీరు వచ్చినారని తెలిసి భయముతోను, బిడియముతోను స్వయముగ రాలేక నన్ను మీ వద్దకు పంపినాడు. దయయుంచి మీ సోదరులిద్దరి యనుగ్రహముచే రాజ్య ప్రాప్తి నొందిన సుగ్రీవుని క్షమింపుడు. అతనినిప్పుడే మీ వద్దకు పంపి 'క్షమార్పణము' కోరునట్లు చేసెదను. ఆ పిమ్మట రామ కార్యమును పూర్తిగా వహించువరకు, రామసేవలో నుండునట్లు చేసెదను.

"మహాత్మా! సుగ్రీవుడు సౌజన్యమూర్తి. గుణవంతుడు. రామానుగ్రహము పొందిన భాగ్యశాలి. సూర్య చంద్రులకు సైతము గ్రహణము పట్టునట్లు సుగ్రీవునికి కూడ చిరకాలము అన్న పెట్టిన బాధలను అనుభవించినందువలన ప్రమత్తత అనే గ్రహణము పట్టినట్లయినది. అతడు కళత్ర, మిత్ర, బంధువియోగమును భరించలేక తారలతో సుఖగోష్ఠి

వినోదములతో కాలయాపన చేసినాడు. మంచి మిత్రుని తప్పును మంచి మిత్రుడు సహింపనిచో వేరెవరు సహింతురు" అని లక్ష్మణుని వద్దనుండి సెలవు తీసుకొని, అంతఃపురములోనికి వెళ్ళి సుగ్రీవునికి పరిస్థితి వివరించింది.

తార తెచ్చిన సమాచారమును విని సుగ్రీవుడు అంతఃపురము వీడి ఒకటి రెండు అడుగులలో లక్ష్మణుడున్న బహిర్ద్వారము చెంతకు వచ్చి, నమస్కరించి తనను మన్నింపుమని, ఇప్పుడే మీ వెంట రాముని చెంతకు వచ్చి క్షమింపవేడి, సీతాన్వేషణ కార్యమునకుపక్రమించెదనని చెప్పెను.

లక్ష్మణుడు, సుగ్రీవుని యుక్తంగా రామచంద్రుని వద్దకు చేరినాడు. రాముడు, సుగ్రీవుని ప్రేమతో ఆలింగనం చేసుకొని కుశల ప్రశ్నలువేసినాడు. సుగ్రీవుడు తప్పుచేసిన వానివలె తలవంచుకొని "రామా! జరిగిన యాలస్యమేమో జరిగినది. ఇక ఈ క్షణమునుండియే నేను, నా వానరసేన అంతా "సీతామాత" అన్వేషణలో ఉండగలము."

సుగ్రీవుడు అన్న మాటలకు రాముడు మిక్కిలి సంతోషపడి, అతనిని కౌగిలించుకున్నాడు. "సుగ్రీవా! నీవంటి స్నేహితుని సహాయమున నేను శత్రువును గెలుచుట క్షణములో పని" అని అన్నాడు. ఈ మాటలతోనే వానర సైన్యములు అపారమైన సంఖ్యలో వచ్చి చేరినారు. మేరు పర్వతంనుండి 'శతవలి' పదివేల కోట్లు వానరులతో వచ్చినాడు. తార తండ్రి సుషేణుడు, రుమ తండ్రి తారుడు, హనుమంతుని తండ్రి కేసరి, గవాక్షుడను ఒకనొక వానర తెగకు ప్రభువు కోట్లకొలది సైన్యముతో వచ్చినారు. ధూమ్రుడు రెండు వేల కోట్లు భల్లూకములను వెంటనిడుకొని వచ్చినాడు. పనసుడు, నీలుడు, గవయుడు, దరీముఖుడు, మైందద్వివిదులు, జాంబవంతుడు, గజుడు, రుమణ్వుడు, గంధమాదనుడు, యువరాజు అంగదుడు, ఇంద్రజానుడు, రంభుడు, హనుమంతుడు, నళుడు దధిముఖుడు, శరనుడు, కుముదుడు, వహ్ని, రంహుడు మున్నగు సేనా నాయకులు వారి సేనలతో వచ్చిరి.

# సుగ్రీవుని పనుపున వానరులు సీతాన్వేషణ సాగించుట

సుగ్రీవుడు రామునితో రామప్రభూ ! ఈ వానరులంతా నీ సైనికులు. నీ యాజ్ఞను పరిపాలింపగలరు. నీకు తోచిన విధంగా వీరిని యాజ్ఞాపింపుము.

"సుగ్రీవా! అవశ్యముగనట్లే చేదము. మనమిప్పుడు మొదట యాలోచించవలసినది సీత బ్రతికియున్నదా? లేదా? పిమ్మట రావణు డుండునదెచట? ఈ రెండు విషయములు తెలిసిన మనము శత్రువును సాధించుట తేలిక. ఈ పనిలో సైన్యమును మనలో ఎవరు నడిపించు నది ముఖ్యముకాదు. నీవే ఇందుకు తగినవాడవు. నీ యిష్టానుసారము వీరిని యాజ్ఞాపింపుము.

రాముడు అన్న మాటలకు సుగ్రీవుడు అంగీకరించి, నాలుగు దిక్కులకు వెళ్ళుటకు తనగల సైన్యమును విభజించెను.

అందులో దక్షిణ దిక్కునకు అంగదుని నాయకత్వములో మేటి వీరులైన హనుమంతుడు, జాంబవంతుడు, సుహోత్రుడు, శరారి, శరగుల్మడు, సుషేణుడు, మైందద్వివిదులు, గదుడు, గంధమాద నుడు, ఉల్కాముఖుడు మున్నగువారిని పంపినాడు.

వానరులను పంపునప్పుడు సుగ్రీవుడు వారికి తగిన ప్రణాళిక నంతయు నిచ్చినాడు. మీరంతా దక్షిణదిశలో దేశదేశాంతరములు దాటిన తరువాత కొలది దూరములో సముద్రము వచ్చును. అచటికి చేరువలోనే మహేంద్ర పర్వతము కనపడును. అది గొప్ప మహిమ గలిగినటువంటిది. దేవతలు, గంధర్వులు, విద్యాధరులు, నాగులు

సంచరించు పుణ్యభూమి. అచట సముద్రానికి అవతలనున్న ద్వీపమే లంకాపురము. అదియే రావణ నివాసము. మీరంతా సముద్రమును దాటునపుడు 'అంగారక' మనే ఒక జలరక్కసి, సముద్రముపైనుండి వెళ్ళువారి నీడనుపట్టి ఆకర్షించి భక్షించును. జాగ్రత్త వహించి వెళ్ళుడు.

సుగ్రీవుడు వానరవీరులకు చెప్పదగిన మాటలన్నియు చెప్పి, హనుమంతునివైపు చూచి, ఇతడే కార్యమును చక్కబెట్టగల ధురంధరుడు అని భావించి, అతనిని దగ్గఱకు పిలిచి "హనుమంతా! నీవు భూన భోంతరాళములను ఎదురు లేకుండా ఎగురగలవు. గమనమున, పరాక్రమమున, తేజమున నీతిజ్ఞతలోను, నీకు సాటి ఎవరులేరు కావున సీతాన్వేషణ కార్య భారమంతటినీ నీయందుంచు చున్నాను. ఎట్లు నిర్వహింతువో నిర్వహింపుము."

సుగ్రీవుడు హనుమంతునితో అన్న మాటలను రాముడు విన్నాడు. ఇతడు కార్యసాధకుడేనని గ్రహించి, సీతాదేవికి గుర్తుగా రామనామాంకితమైన తన అంగుళీయమునునిచ్చి ఇట్లు చెప్పినాడు- "హనుమంతుడా! ఈ అంగుళీయకమును సీతకు చూపుము. ఆమె నా దగ్గరనుండియే వచ్చినాడవని విశ్వసించును. అప్పుడు సందేహము లేకుండా నీవు చెప్పు, నా క్షేమ సందేశమును వినును."

హనుమంతుడు రాముడిచ్చిన అంగుళీయకమునుగొని, శిరస్సు దాల్చి, శ్రీరామునికి నమస్కరించి తక్కిన వానర వీరులతో ప్రయాణమునకు సిద్ధమయ్యెను. సీతాన్వేషణ కర్తవ్య పరాయణులై వారు తమకు నిర్దేశించిన విధముగా బయలుదేరి వెళ్ళినారు.

రామలక్ష్మణులు తామున్న ప్రసవణ పర్వతం మీదనే వుండి, వారి రాక కొరకు నిరీక్షించసాగినారు.

## అంగదుని ప్రాయోపవేశము

హనుమంతునితో సహా దక్షిణ దిశను వెదకుచున్న అంగదాది వానరవీరులంతా సీతజాడ తెలియక తీరని నిరాశకు లోనైనారు. ముఖ్యంగా అంగదుడు మిక్కిలి విచారపడి "సీత జాడ తెలియకుండా కిష్కింథకు మరలివెళ్ళితిమేని, చండశాసనుడైన సుగ్రీవుడు ఊరక వదలడు. అతడు విధించునది మృత్యుదండనమే కావున నేను వెళ్ళను. ఇక్కడనే ప్రాయోపవేశంచేసి చనిపోయెదను" అని నిశ్చయించు కున్నాడు.

తక్కిన వానరులుకూడ అంగదునితో పాటు ప్రాయోపవేశము నకై సిద్ధపడినారు. వారు రామునికి వచ్చిన కష్టమును, సీతను, రావణుడు బలాత్కరించి తీసుకొని పోయిన విషయమును, అరణ్య ములో ఒకచోట జటాయువను పక్షిరాజు రావణుడెత్తుకొనిపోవుచున్న ప్పుడు చేసిన ఆర్తనాదమునువిని రావణునితో పోరాడుట, రావణుడు వాని చేతుతో, రెక్కలు ఖండించుట రావణుడు సీతాపహారణవార్త రాముని కెరింగించి ప్రాణములు విడుచుట- జటాయువునకు రాముడు ఉత్తర క్రియలు జరిపి, ఊర్థ్వలోకమున కనుజ్ఞయిచ్చుట మున్నగు విషయములు ముచ్చటించుకొనిరి.

అచటి కొలది దూరముననే పర్వతమున రెక్కలు తెగిపడి యున్న సంపాతి వీరి మాటలువిని, మొదట వారిని భక్షించమనే భావమును వీడి తమ్ముడు సంపాతి మరణవార్త వినగానే వారి యందు ప్రేమభావమంకురించి, సీత రావణుని వద్ద లంకలోనున్నదని, రాక్షసులచేత మిక్కిలి బాధింపబడుచు చెట్టుక్రింద దుఃఖించుచు జీవచ్ఛవమువలె పడియున్నదని, ఈ యంశమును నేను దూరదృష్టిచే

చూచి తెలుసు కొన్నానని, రాముడనినచో నాకును భక్తి శ్రద్ధలు కలవని, ఆతనిపనిలో సహకరించుటకు నాకు రెక్కలు లేకపోయినను వాక్సహాయముచేసియైనను ఆతని ఋణము తీర్చుకొనుట అదృష్ట మని భావించుచున్నానని చెప్పెను.

ఈ మాటలు చెప్పుట తోడనే సంపాతికి రెక్కలు మొలిచినది.

సంపాతికి సీతాదేవి వృత్తాంతమును చెప్పిన తోడనే రెక్కలు మొలిచినది. ఇది మీకు జయ సూచకమనిచెప్పి, సంపాతి వానరుల నుండి సెలవు తీసుకొని వెళ్ళెను.

వానరులు మిక్కిలి ఆశ్చర్యపడి, సీతావృత్తాంతమును తెలిసిన వని సంతోషపడిరి.

అందరును కలిసి, తమకు, సముద్రమునకు దగ్గఱలోనున్న మహేంద్ర పర్వతమును చేరిరి. అంగదుడు జాంబవంతుడు, మున్నగు వీరులు వానరసమూహముతో ఒకచోట చేరి, నూరు యోజనముల సముద్రమును దాటువారు మనలో ఎవరనీ ఎవరి శక్తి యుక్తులు ఎంతటివో పరస్పరము చెప్పుకొనుచుండిరి, హనుమంతుడు మటుకు వారిలో చేరక, వారి ఊసు ఏమీ తనకు పట్టనట్లు దూరముగ పోయి కూర్చుండి యాలోచించుచుండెను.

కిష్కింధకాండము సమాప్తము

# సుందర కాండము

## సముద్రమును చూచి వానరులు దిగులు పడుట

వానరులందరు సముద్రము ఒడ్డునగల మహేంద్ర పర్వతమునకు వచ్చి అచటి సముద్రము యొక్క భీషణాకృతినిచూచి, భయముతో దిగులుపడి కూర్చుండిరి. నూరుయోజనముల పొడవుగల సముద్రము కావల లంక యున్నది. సముద్రముపై అంత దూరము లంఘించి, ఆవలి తీరము చేరుట ఎట్లా? యని వానరులు విచారించసాగిరి.

సీతను రావణుడు బలాత్కరించి, అపహరించి తీసుకొనిపోయి నాడు. ఆ రాక్షసుడామెను లంకలో ఉంచి యుండవచ్చును. అందు వలన ఈ సువిశాల సముద్రమునకావల యున్న లంకను చేరగల సమర్థుడు మనలోనెవడు?

అప్పుడు వారిలో కొంతమంది వానర వీరులు తమ తమ బలము లను గూర్చి సమీక్షించుకొనిరి. యువరాజు వాలి పుత్రుడైన అంగదుడు తాను "సముద్రమున ఇరువది యోజనముల దూరమును మాత్రము దాటెదను, ఆపై శక్తి చాలదు" అనెను. నలుడను కపి వీరుడు పది యోజనముల దూరము లంఘింతుననెను. నీలుడు ముప్పది యోజన ముల దూరములని నుడివెను.

ఋక్షసైన్య విభాగమునకే యావత్ సుగ్రీవ సేనలోనే వృద్ధుడు, అనుభవజ్ఞుడు మహాబలశాలి, ధీమంతుడు ఐన జాంబవంతుడు తాను నూరు యోజనముల దూరముగల సముద్రమును దాటగలను. కాని వృద్ధుడను, జవసత్వములు సన్నగిల్లిన వాడనగుటచే సముద్రమున

కావలి తీరముచేరి, లంకను చూచి, మరల నూరు యోజనముల దూరం పరిమితిగల యీ సముద్రమును తిరిగి దాటి ఇప్పటికి చేరుకొనలేను.

ఇట్లు వానరవీరులు సముద్రము దాటుట యందు తమ తమ బలా బలములను సమీక్షించుకొనుచు ఏమి చేయుటయో తెలియని స్థితిలో ఉండి సతమత మగుచుండగా వారికి దూరముగా ఒక పెద్ద రాచట్టుమీద మౌనముద్ర దాల్చి కూర్చొని యున్న హనుమంతుడు వారికంటబడెను. ఆ హనుమంతుడు తనకు, వానరులకు సంభాషణతో ఎటువంటి సంబంధము లేనట్లుగా ఒక్కడే యున్నాడు.

జాంబవంతుడది గ్రహించి, ఆనందముతో మిగిలిన వానరులంద రినీ, తన వెంట రమ్మని, హనుమంతుడున్న యెడకు వెళ్ళినాడు. వారు హనుమంతుని గురించి ఇట్లు పలికిరి. "హనుమా! మేమింత హడావిడి పడుచుండగా నీవిచ్చట ఒంటరిగనే ఏదో ఆలోచించుచు కూర్చొనియున్నావు. మరచితివా సుగ్రీవాజ్ఞను.సీతనన్వేషించు కృషిలో మనమందరము రాజుచేత శాసించ బడియున్నాము.కర్తవ్యనిష్ఠులమైన మనమందరము కలిసి, ఈ సముద్ర తరణ మార్గమును, అన్వేషింప వలెను. రామ కార్యము నెరవేరు వరకు మనలో నెవరును ఎట్టి ఇతర కార్యములకు పూనుకొనరాదు.

హనుమా! నీయంత బలశాలి, బుద్ధిశాలి ఇందుకు తగిన కార్య విధానము నాలోచించ వలయును. నీవు నీ తండ్రి యాశీర్వచముచే అతివేగముగ అలసట లేకుండ యెంత దూరమైనను వెళ్ళగలవు. నీ గమనరీతులతిచిత్రములు, ఇతరులెవరు నిన్ననుకరించలేరు. వాయు పుత్రా! ఈ సువిశాల సముద్రమును తరింప వలెనన్న, ఆకాశ మార్గ మున నూరు యోజనములు ప్రయాణించవలసి యున్నది. అట్టి దురా వధి సముద్రమును దాటగల సమర్థుడవు నీవు. నీవు తప్ప మరెవ్వరును ఈ కార్యమును నెరవేర్చలేరు.

హనుమా! నీవు సముద్రమును తరించి లంకలో సీత నన్వేషించు కార్యమునకు గడంగుము, అని జాంబవంతుడు, తక్కిన వానర వీరులును హనుమంతుని ఉత్సాహ పరిచిరి.

సహజ సిద్ధముగనే ఉత్సాహము, ధైర్యము, సాహసము, వేగము గల హనుమంతుడు, జాంబవంతుడు మున్నగు వారి మాటలను విని మరింత ఉత్సాహ, ధైర్యములను పొందెను. అతడు మహేంద్ర గిరి శిఖరముపైకెక్కి, తన శరీరమును అపరిమితముగా పెంచెను. తోటి వానరులు హనుమంతుని పెంచిన రూపమును చూచి మిక్కిలి ఆశ్చర్యపడిరి. వారు సంతోష సంరంభములతో గంతులు వైచుచు "ఆహా! కృతులొనర్చసాగిరి. అందరూ ముక్త కంఠముతో "హనుమంతునికి జై! వాయు తనయునికి జై, శ్రీరామదూతకు జై, కేసరి పుత్రునకు జై - కీర్తిధామునకు జై - జై, జై అని వానరులంతా ఉత్సాహంతో క్రేళ్ళెత్తిరి. వారి నినాదములు, మహేంద్రగిరి కంధరములు హోరెత్తి ప్రతి నినాదములొనర్చినవి.

## హనుమంతుని సముద్ర లంఘనము

హనుమంతుడు మొదట తనకు విద్యాగురువైన సూర్య భగవానునకు నమస్కరించాడు. పిమ్మట దేవతలకు రాజైన ఇంద్రునికి నమస్కారం చేశాడు. ఆ తరువాత తన తండ్రియైన వాయుదేవునకు, బ్రహ్మదేవునికి నమస్కృతులొనర్చి తనకు సముద్రలంఘన శక్తిని ప్రసాదించి, సీతాన్వేషణ కార్యమును సఫలీకృతమొనర్చుడని ప్రార్థించాడు.

సముద్రంపైన, ఆకాశమునకు ఎగురబోయే ముందు మరల నొకసారి తండ్రియైన వాయుదేవుని మనస్సులో సంస్మరించి, శరీరాన్ని మరింతగా పెంచాడు. పెంచిన శరీరంతో పర్వతముమీద చెట్టు మొదళ్ళను, కొమ్మలను కదులుస్తూ, బండరాళ్ళను దద్దరిల్లజేస్తూ కొంతసేపు

విహరించినాడు. ఆ సమయంలో అతని చేత కదల్చబడిన చెట్లు విప రీతంగా పుష్పాలను రాల్చాయి. ఆ పుష్పాలు హనుమంతుని పైబడి అతని శరీరాన్ని పూర్తిగా నింపివేశాయి. అప్పుడతడు నడయాడే ఒక పూల పర్వతంలా కనిపించాడు. అతని నడకకు కొండ అదురుట వలన, అందున్న పాములు, కొండచిలువలు ఒత్తిడి గురియై విషమును గ్రక్కినవి. ఆ కొండమీద విహారమునకు వచ్చిన, విద్యాధరులు, గంధర్వులు మున్నగువారు బెగ్గడిల్లినారు. ఎక్కడో కొండ చరియ లలో తపస్సు చేసుకొనే మునులు సైతం హనుమంతుని కదలికకు భీతి చెందినారు.

హనుమ ఆకాశమార్గమున కెగురుచు, అచటి కపివరులతో "కపి వరులారా! నేను సముద్రలంఘనమునకు పెళ్ళుచున్నాను. లంకకు వెళ్ళి, అచట సీతాదేవిని వెదికి, కనుగొని వెంటనే తిరిగి వస్తాను. శ్రీరామచంద్రుని వింటినుండి వెలువడిన బాణమువలె వేగంగా వెళ్ళి, ఆదే వేగంతో తిరిగి వస్తాను. లంకలో ఒకవేళ నాకు సీత కనపడక పోతే మా శ్రీరామ శరవేగాన్ని అనుకరిస్తూ స్వర్గానికి వెళ్ళి, అక్కడ రావణుడు సీతను దాచినాడేమో చూచివస్తాను. అక్కడ ఆమె జాడ తెలియకపోతే, మరల లంకకు వచ్చి, దుర్మార్గుడైన రావణుని బంధించి వెళ్ళి, సీతను ఎక్కడ దాచినాడో చెప్పమని, శ్రీరామచంద్రుని పాద ముల వద్ద పడవేస్తాను.

"వీరులారా! నేను తిరిగి వచ్చేంతవరకు మీరు ఇక్కడే ఉండండి సుమా!" అని హనుమంతుడు ఒక పెను గర్జన చేసినాడు. ఆ పర్వ తముమీద ఉన్న జంతువులు, పశుపక్ష్యాదులు, దేవగాంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు హాహాకారములు చేసినారు.

హనుమంతుడు తోకను బలవంతముగా ఝాడించి, క్రిందకు వంగి చేతులను బిగించిపట్టి నడుమును విరచికొని, కాళ్ళను ముడిచి,

చెవులను కుంచించి, గగనతలంపై పు చూచి, ఊపిరి బిగబట్టి, ఒక్క కుదుపు తీసికొని పైకెగిరినాడు.

కపివీరులంతా సంతోషంతో కౌకిసలు కొట్టారు. మరొకసారి హనుమంతునికి జయ జయ ధ్వానాలు పలికారు.

## హనుమంతుని ఆకాశ గమనం

హనుమంతుడు ఆకాశంపైకి ఎగిరిన మరుక్షణంలోనే అతని గమనం వేగం పుంజుకున్నది. చిత్రవిచిత్ర గతులలో అతని పరుగు సాగినది. మబ్బుల చాటున చంద్రుడు పరుగెత్తుచున్నట్లుగా ఒకసారి, ప్రచండవేగంతో పరుగెడుతున్న గరుత్మంతునిలాగను, ఐదువేళ్ళతో కూడిన చేయిచాచి పరుగిడుతుండగా ఐదు తలలు గలిగిన నాగరాజు విహారం వలె కనిపించాడు. అతని కన్నులు ఎర్రని నిప్పుకణముల వలె మంటలు చిమ్ముతున్నట్లున్నవి-తోక ఇంద్రుని కేతనంవలె కనిపించు చున్నది.

అతడు ఉత్తరదిక్కునుండి, దక్షిణదిక్కునకు ఆకాశమార్గాన పయనించడం చూస్తే, దక్షిణదిక్కున సముద్రమునకు అవతలవున్న లంకకు చేటును సూచించే తోకచుక్క మాదిరిగా ఉన్నాడు.

రామ కార్యధురంధరుడై హనుమంతుడు ఆకాశమార్గమున పోవుచున్నాడని గమనించిన దేవతలు అతనిపై పుష్పవర్షము కురిపించి నారు. సూర్యుడు, వాయుదేవుడు తమతమ తీవ్రతలను తగ్గించి అను కూలంగా ప్రవర్తించసాగినారు.

## మైనాకుడు

పూర్వం ఇక్ష్వాకు వంశస్థుడయిన సగర చక్రవర్తి వలన సము ద్రునికి పురోభివృద్ధులు కలిగినవి. అందువలన రామకార్యాన్ని భుజాన వేసుకొని, తన పరిధిలోని ఉపరి గగన తలంపై వెళుతున్న హను మంతునికి సహాయం చేయవలెనని సముద్రుడు భావించాడు. అతడు

తన గర్భంలో ఆశ్రయమివ్వబడి ఉంటున్న 'మైనాకుడు' అనే పర్వతాన్ని ప్రేరేపించి, "మైనాకా! ఆకాశంమీద రామ కార్యరతుడైన హనుమంతుడు ప్రయాణం చేస్తున్నాడు. ఇక్ష్వాకు ప్రభువుడైన రామ చంద్రుడు నీకూ, నాకూ ఆదరణీయుడే. కాబట్టి అతని పనిమీద, సముద్రాన్ని దాటుతూవున్న పవన తనయుడు హనుమంతునికి, నీవు సేదదీర్చి, ఫలరసాదులచే తృప్తిపరచి పంపించాలి" అని కోరాడు.

అవసరమైతే నలుదిక్కులకు పెరగగల మైనాకుడు సముద్రుని కోరికను అనుసరించి హనుమంతుడు వచ్చే దిక్కునకు సముద్రగర్భం నుండి పైకి తన బంగారు శిఖరాలతో పెరిగి, అతని ప్రయాణానికి సుంతవిరామం కలిగించుదామనుకున్నాడు. సముద్రంలోనుండి ఏదో క్రూరసర్పం తన గమనాన్ని అడ్డుకొనుటకు ఎదురు నిల్చినదని హనుమంతుడు అల్లంత దూరాన్నుండి చూచి భావించినాడు. అతి వేగంతో హనుమంతుడు తన వజ్రసన్నిభమైన వక్షముతో ఆ పర్వత శ్రేష్ఠుని శిఖరాలను గుద్దినాడు. మైనాకుడు ఆపాదమస్తకము తీవ్రంగా చలించినాడు. తన శరీరము అంతా ముక్కలు ముక్కలైనట్లుగా బాధ చెంది కంపించిపోయినాడు-

తనను క్షమించమని వేడుతూ మైనాకుడు ఆంజనేయునికి, తన వృత్తాంతమును వివరించినాడు.

"హనుమంతా! నేను మైనాకుడనువాడను. నీకు హితుడను. బహుదూరము ప్రయాణము చేయవలసిన నీకు, ప్రయాణ బడలికను కొంత తీర్చి, నీవు నా చల్లని సానువుల్లో విశ్రాంతి తీసికొనిన పిదప పంపించుదామని, అట్టి యాతిథ్యమివ్వుమని నన్ను ఈ సాగరుడు ప్రేరేపించినాడని, నేను మున్ను ఇంద్రుని వజ్రాయుధముచే రెక్కలు నరికించుకొను ఆపదను తప్పి, నీ తండ్రి వాయుదేవుని దయవలన, ఈ సాగర గర్భంలో తలదాచుకొన్నానని, దయచేసి అన్యునిగా తలంచవలదని వేడుకున్నాడు."

ఆంజనేయుడు మైనాకుని సహృదయాన్ని, స్నేహ వత్సలతను అర్థము చేసుకొని, అతని భుజమును ప్రేమతో తాకి "మైనాకుడా! నీవనినట్లు నేను బహుదూరము ప్రయాణము చేయవలసినవాడనే. సమయము చాల తక్కువగనున్నది. అందువలన నేనెవరివలనను, ఎట్టి ఆతిథ్యములను, మర్యాదలను స్వీకరించలేను. రామ కార్యము నెరవేరు వరకు నాకెట్టి ఇతర యాలోచనలును ఉండవు" అని చెప్పి, ముందునకు సాగజొచ్చినాడు.

## సురస

రామ కార్యమును పురస్కరించుకొని, సముద్రమును దాటి వెళ్ళుచున్న హనుమంతునికి, ఆ పనిని చక్కబెట్టగల శక్తి యుక్తులున్నవా? లేవా? యని సందియము కలిగి, ఇంద్రాది దేవతలు, అతనిని పరీక్షించుటకై 'సురస' అనే నాగమాతను పురికొల్పినారు. సురస సర్పములకు తల్లి. దేవతాంశ కలది. అయితే దేవతల ఆదేశం మేరకు క్రూరమైన రాక్షసి రూపందాల్చి, హనుమంతునికి విఘ్నం కలిగించుదామని ప్రయత్నపడినది.

సురస ఆకాశమునకెగిరి హనుమంతుని దారికడ్డుపడినది. హనుమంతుడు అకస్మాత్తుగా అడ్డుపడిన ఆ భీకరమైన పెద్ద యాకారముగల రాక్షసిని చూచి, ఆమె 'సురస' యని గుర్తుపట్టినాడు. సురస పెడబొబ్బలుపెడుతూ కొన్ని యోజనాల దూరము తన నోటిని ఆశ్చర్యకరంగా విస్తరింపజేస్తూ "నీ వెవడవోయీ! ఇదుగో నీవు నా నోటిలోనికి ప్రవేశించి, నాకాహారమవుకమ్ము నిన్ను భక్షింతును. ఇది నాకు బ్రహ్మదేవుడిచ్చిన వరము సుమా! నన్ను తప్పుకొనిపోలేవు" అని హనుమంతుని మ్రింగజొచ్చినది. హనుమంతుడు సురసకు నమస్కరించి, "అమ్మా దాక్షాయణీదేవి నీకు నా నమస్కారము. రామ కార్యార్థినై నేను శరవేగంతో పోతున్నాను. నీవు నన్ను అడ్డగించకుము" అని ప్రార్థించి, నీవు కాదు కూడదందువా? నేను నీ ఆజ్ఞ చొప్పున లంకకు వెళ్ళి, అక్కడ లంకలో శ్రీరామ పత్నియైన సీతా

దేవిని వెదకి, ఆమె ఉనికి తెలుసుకొని వచ్చి, శ్రీరామునకామె క్షేమ వార్తను విన్నవించి, పిమ్మట నేను నీవు కోరినట్లు వచ్చి ఆహారమయ్యెదను" అని అనెను.

సురస తన నోటిని మరింత పెద్దచేసినది. హనుమంతుడామెకు నమస్కరించి, తన రూపాన్ని చిన్న చేసుకొని, సురస నోటికి అమాంతముపోయి, మరుక్షణముననే బయటికి తిరిగి వచ్చాడు.

అప్పుడు హనుమంతుడు భక్తి వినయాలతో "తల్లీ! బ్రహ్మదేవుడు నీకిచ్చిన వరం తీరింది. వెళ్ళి వస్తాను అనుజ్ఞ ఇవ్వమని" చెప్పి ఖావి ప్రయాణం సాగించాడు.

ఇది హనుమంతుడు గడచి గట్టెక్కిన మూడవ విఘ్నము. దేవతలతని విజయానికి ఆనందించి పుష్పవర్షం కురిపించారు.

## సింహిక

దక్షిణ దిశగా సముద్రముపైన ఆకాశంలో హనుమంతుని విజయ విహారం కొనసాగుతూ వున్నది. అకస్మాత్తుగా అతణ్ణి ఏ శక్తియో పట్టి వెనుకకు లాగుచున్నదని గ్రహించినాడు. బలమును ఎంత కూడదీసుకొని ముందునకు పోవ ప్రయత్నించినను, అంగుళము మేరకు సాగలేకపోవుచున్నాడు. ఆ హఠాత్పరిణామమునకు హనుమంతుడు బిత్తరపోయినాడు. తనను పట్టిలాగే ఆఘనసత్త్వమేదో తెలుసుకొనదలచి చుట్టూ చూచాడు. అతనికి ఒక పెనుగొండలాంటి రాక్షసి ఆకారం కనిపించింది. వెంటనే అతనికి అర్థమైనది. ఇది 'సింహిక' అనే రాక్షసి అని.

హనుమంతుడు తాను దక్షిణ దిక్కునకు బయలుదేరి వెళ్ళేటప్పుడు, ప్రభువైన సుగ్రీవుడు చెప్పినాడు. సముద్ర మార్గంలో ఛాయాగ్రాహియైన 'సింహిక' అనే రాక్షసి సంచరిస్తూ ఉంటుందనీ, దాని విషయమై కడు జాగ్రత్తతో వ్యవహరించవలెనని, ఆ ఛాయాపి

ఎటువంటి బృహత్ రూపాన్నైనా ఎత్తి ఎదుటివారి నీడను సైతము పట్టి లాగి తన వద్దకు ఆకర్షించుకుని భక్షించగలదని.

సుగ్రీవుడప్పుడు తనకు చెప్పిన 'సింహిక' విషయం జ్ఞాపకం వచ్చి, ఇదే ఆ సింహిక అనుకున్నాడు.

సింహిక సముద్రజలాలపై పడుతున్న హనుమంతుని నీడను పట్టుకొని లాగజొచ్చినది. హనుమంతుడు క్రమంగా ఆ క్రూరసత్వం చేత ఆకర్షితుడై సముద్రజలాలపై పడినాడు. వెంటనే సింహిక బహు యోజనాల విస్తీర్ణంగా తన నోటిని తెరిచి, అందులో ప్రవేశించి, తనకు ఆహారం కమ్మని అరిచింది.

బుద్ధిశాలియైన హనుమంతుడు బాగా ఆలోచించి, తన శరీరాన్ని అంగుష్ఠ మాత్రంగా చిన్నది చేశాడు. బయట ఉండియే ఆ రాక్షసి ప్రాణమర్మాన్ని గుర్తించుకొని, ఒక్కసారి దాని నోటి లోపలికి పోయినాడు. అది గమనించి సింహిక నోరు మూసింది. సింహిక కడుపులోనికి పోయిన హనుమంతుడు, తన వజ్ర సన్నిభములైన గోళ్ళచే అద్దాని ప్రాణమూలములను ఛేదించి, బయటకు వచ్చి తన పూర్వ శరీరాన్ని దాల్చి దాని గుండెలమీద తన్నినాడు. ఆ రాక్షసి మృత్యుజనితమైన పెనుగర్జనచేసి, గుండెనుండి నెత్తురు లోడికలు కడుతుండగా సముద్రజలాలపైపడి ప్రాణములు వదిలినది.

గగనచరులైన దేవతలు హనుమంతుని వీరోచిత ఘనకార్యమును ప్రస్తుతిస్తూ, "హనుమా! ధైర్యము, సూక్ష్మదృష్టి, దక్షత మతిమంతత్వము అను యీ నాలుగు గుణ విశేషములు నీయందుండి సర్వత్రా నీకు విజయమును చేకూర్చుచున్నవి" అని వేనోళ్ళ ప్రశంసించినారు.

హనుమంతుడు తన గమ్య స్థలమైన లంకకు చేరుటకు కొలది దూరము మాత్రమే ప్రయాణించవలసి యున్నది. అంతదల్లంత దూరమునుండియే లంకా తీర ప్రాంతపు ఘనమైన వనములను చూచి

నాడు. ఒక పెద్ద పెనుగొండవలెనుండిన తన బృహత్తరమైన రూపంతో లంకలో కాలు పెడితే రాక్షసులు సులభంగా తనను గుర్తుపట్టి, బంధించ గలరని భావించి, తన సహజ రూపమైన చిన్నరూపాన్ని ధరించి ప్రయాణం సాగించాడు.

కొలదిసేపట్లో హనుమంతుడు సముద్ర తీరంలోవున్న 'లంబ పర్వతం' మీదకు చేరుకున్నాడు. అతడు తిన్నగా త్రికూట పర్వతం మీద నిర్మింపబడియున్న 'లంకా పట్టణ' దాపులకు చేరినాడు. అతడు పట్టణంయొక్క ఉత్తర ద్వారం వద్దకుచేరి, పురప్రవేశాన్ని గురించి ఆలోచించసాగినాడు. అతని ముఖంలో ఎటువంటి అలసట లేదు. వంద యోజనాల సముద్రమును దాటిన ఘనుడు ఇతడేనా? అని అనుమానించునట్లు ఉన్నాడు ఆ మహానుభావుడు.

లంకా పట్టణం దేవశిల్పియైన 'విశ్వకర్మ'చే నిర్మించబడినది. అది ఇంతకు పూర్వం కుబేరునిది స్వర్గపట్టణమైన అమరావతికి యేవిధంగానూ తీసిపోని విధంగా, ప్రత్యేక శ్రద్ధతో ఆదేవశిల్పి ఈ పట్టణాన్ని నిర్మించినాడు. ఆ పట్టణమిప్పుడు అతనికి సోదరుడే అయిన రావణుని వశమైనది.

ఆంజనేయుడు ఉత్తర ద్వారము వద్దకు వచ్చి ఆలోచించ సాగినాడు. ఆ పట్టణం ప్రత్యేకంగా నియోగించబడిన వేలకొలది రక్షక భటులచే రక్షింపబడుతూ వున్నది. రావణుడు మహాబలశాలి. వేయికండ్లచే అలకించి ఎప్పటికప్పుడు సమాచారం అందించే సుశిక్షితులైన గూఢచారులచే పట్టణం అహోరాత్రులు కాపలాకాయబడుతున్నది. ఇటువంటి సుదృఢము, సువ్యవస్థితము, సురక్షితము ఐన పట్టణానికి శత్రువెవ్వరూ ఏ విధంగానూ ప్రవేశింపజాలరు. ఇది ప్రత్యక్ష నిదర్శనము కాగా ఇక్కడికి రాముడు స్వయంగా వచ్చినా ఏమీ చేయలేడనిపిస్తున్నది. ఈ లంకను జయించడానికి దేవతలకు కూడా సాధ్యమయ్యేట్లులేదు. దీనిని ఎట్లా భేదించి, లోనికిప్రవేశించాలో తెలియడంలేదు

## లంకిణి

ఇట్లా అతడు సుదీర్ఘంగా ఆలోచిస్తున్న సమయంలో ఎక్కడనుండో పెద్ద పెద్ద అరుపులతో, భీభిషికలతో ఒక రాక్షసి వచ్చి యెదుట నిలబడినది. ఆ భయంకర రాక్షసియే 'లంకిణి'—అదే లంకకు అధిదేవత.

భయంకర రూపిణియైన లంక హనుమంతుని చూచి, ఓరీ! ఎవడవురా నీవు. నేను లంకాధి దేవతను. నా పేరు లంక. రావణ పాలితమైన ఈలంకా నగరము, దుర్భేద్యము. "ఓరీ అధమా! ప్రాణములమీద ఆశయుండియే యిటువచ్చినావా! ఇదియే నా హెచ్చరిక. క్షణములో నీ ప్రాణములు గాలిలో కలియకమునుపే నీవు నేనడిగిన దానికి సమాధానము చెప్పుము!" అని బిగ్గఱగా అరచెను.

అందులకు హనుమంతుడు నిబ్బరముగా 'లంకా దేవతా! కోప మెందులకు బురుజులు, ప్రాకారములు, కోటతో కూడియున్న ఈ లంకానగరము ఎంతో సుందరముగా కనుపట్టుచున్నది. హృదయంగమమైన ఈ నగర సౌందర్యమును చూచుటకు మనసుపడి, వచ్చినాను. నన్ను పోనిమ్ము.' అని అనెను.

అంత లంకాదేవత "అదేమియు కుదరదు. నీవు నన్ను జయించికాని, లోనికి ప్రవేశింప వీలులేదు." అని గర్జించెను. లంక హనుమంతుని మీద మీదకు వచ్చినది.

హనుమంతుడు పెద్ద రూపము ధరించి, ఆ రాక్షసిపై పడినాడు. ఒక పెను గ్రుద్దుచే ఆమెను చావబాదినాడు. 'అయ్యో! చచ్చితి. నన్ను రక్షింపుము హనుమంతా! ఇంతటితో నన్ను వదలుము. మహాబలా! నేను అబలను కదా! ఓ వీరుడా! నేను నీ చేతిలో ఓడిపోయినాను. ఇకనీవు యథేచ్ఛగా లంకా పురములోనికి వెళ్ళుము. అచట

నీవు చూడదలచినవన్నీ చూచి, విజయుడవై మరలి రమ్ము-నీకు శుభమగుగాక!

## హనుమంతుడు లంకాపురములోనికి ప్రవేశించుట

హనుమంతుడు లంకా దేవతను జయించి, పురసౌందర్యమును తిలకించు నెపముతో రావణునిచేత సీత ఎచ్చట దాచియుండబడినదో చూచుటకు బయలుదేరెను. ఎవరైనను శత్రుపురములను గానీ,- గ్రామములనుగాని సందర్శించదలచినప్పుడు ప్రధాన ద్వారము గుండా కాక, వేరుదారిలో ప్రవేశించుట శాస్త్ర నిర్దేశము-సకల శాస్త్ర వేత్తయైన హనుమంతుడు ఆ భావమును గుర్తుచేసుకొని, పురములోనికి అద్వారముఖమంగా ఎడమ పాదము ముందు పెట్టి, తరువాత కుడిపాదము నుంచి లోపలికి ప్రవేశించినాడు.

హనుమంతుడు రాజవీధులలో నడచుచున్నాడు. ఆ వీధులలో గల ప్రతి యింటిలోనికి ప్రవేశించి చూచినాడు. ఎక్కడా సీతజాడ కనబడలేదు. అతడు తిన్నగా రావణ అంతఃపురములోనికి ప్రవేశించి నాడు. అంతఃపురములో రావణశయ్యపై మండోదరిని చూచి సీతయని భ్రమించినాడు. రాణుల భవనాలను, రావణుని వలచి వచ్చిన అతని ప్రియురాండ్రాభవనాలను సాయంకృతలై రాత్రి యథేచ్ఛగా తను ప్రియసఖులతో గడిపి, తాను ఊహించని రీతిలో అలసిసొలసి నిద్రించు చున్నవారిని చూచాడు, త్రాగిన మత్తులో తాము ధరించిన ఆభరణ ములు చెదరిపోయి, సూత్రము తెగిపోగా క్రిందపడిన మణులను, ధ్వస్తహారములను చూచినాడు. మదనాతిరేకంచే తనవలెనే మత్తులో దోగి, అలసయై పడియున్న చేడియను, తన ప్రియునిగా భావించి బాహువులలోనికి తీసుకొని శయనించిన దృశ్యాన్ని చూచినాడు. కాని అచ్చట సీత ఉండు ప్రదేశము కాదని, భావించినాడు,

పిమ్మట హనుమంతుడు, పానశాల, అశ్వశాల, గోశాల మున్నగు వానిని పరిశీలించినాడు. కాని సీత జాడ తెలియలేదు. లంకలో నాలుగు అంగుళాల మేరను గూడ విడువకుండా వెదకినాడు. కాని సీతజాడ తెలియలేదు.

## సీతను గానక హనుమంతుడు నిర్వేదము చెందుట. ప్రాయోపవేశ నిశ్చయము

సీతను గానక హనుమంతుడిట్లు దుఃఖించెను.

లంకలో ఇప్పటివరకు నేను సుసూక్ష్మ దృష్టితో ఎంత వెదకినను ఆమె జాడ కనిపింపలేదు. ఆమె జాడ తెలుసుకొనకయే నేను రాజైన సుగ్రీవుని దర్శించితినేను. అతడూరుకొనడు. తప్పుచేసిన వానికి, అతని యాజ్ఞను ఉల్లంఘించినవానికి మరణదండన విధించి తీరును. నాకు అట్లే జరుగును. అదియును గాక నేను నావారితో కానిపోని బింకములుపలికి, అహంకారమత్తుడనై నూరుయోజనముల పొడవుగల సముద్రమును దాటి వచ్చితిని. ఈ శ్రమ యంతయు వ్యర్థముగనే పరిణమించినది కదా! నేను కార్యమును చక్కబెట్టక తిరిగి పోవుదు నేని, నా కొరకు ఎంతో ఆశతో ఎదురుచూచుచున్న వానర పుంగవులు నన్ను గ్రుచ్చి, గ్రుచ్చి పలు ప్రశ్నలువేసి, సీత జాడ తెలుపుమన్నచో నేనేమి తెలుపుదును?

సీత జాడ తెలియకయే, శ్రీరాముని చెంతకేగి సీత కనిపించ లేదని చెప్పితినేని, ఆ కఠోర వార్తను విని యాతడు మరణించును అన్న మరణించెనను తీరని దుఃఖముతో లక్ష్మణుడు మరణించును. వారి మరణమును విని భరత, శత్రుఘ్నులు, తల్లులు మరణింతురు. వారి తరువాత వరుసగా సుగ్రీవుడు, అంగదుడు, తార మున్నగు వారందరు మరణింతురు. ఇందరి మరణమునకు కారణమైన నేను

ఆపైన జీవించియు లాభములేదు. కనుక కార్యము సాధింపని నేను నా మొగము వారికి చూపించలేను. ఇచ్చటే ప్రాయోపవేశముచేసి మరణించెదను. నీటిలోనో, అగ్నిని పేర్చుకొనియో, విషమును త్రాగియో ఏదో విధమున చచ్చెదను.

హనుమంతుడు తీవ్ర నిరాశతో, సీతను తెలిసికొనలేని దుఃఖముతో పరితపించుచు, ప్రాజ్ఞుడు, మహాధీమంతుడు కనుక, ఆత్మహత్య మహాపాతకమని భావించి క్షణకాలము ఆవేశమునకు లోనై ప్రాణములను పోగొట్టుకొనుట పిచ్చి లక్షణముకాదు. బ్రతికి యుండిననే కదా! ఏ పనినైనను సాధించుట. ప్రాణత్యాగము వలన అనేక దోషములు ఆ జీవుని అంటుకొని, మరు జన్మములో దాని ఫలితమును దారుణముగ అనుభవించవలసివచ్చును.

"కావున ఇటనుండి మరింత ఉత్సాహముతో ధైర్యమును కూడగట్టుకొని పూనినచో సీతను వెదకెదను. ప్రయత్నము చేసినచో ఫలితము సిద్ధించవచ్చును."

అని మరల యాలోచించెను. లంకలో తను చూడవలసినదంతయు చూచితిని కాని సీత కనిపింపలేదు. చూడక మిగిలినది ఒక్క అశోకవనము మాత్రమే. అతడశోకవనముపైపుకు దారితీసెను. వనము లోనికి ప్రవేశించుటకు ముందు అతడు భక్తితో వసురుద్రాదులకు, వాయువులకు, తక్కిన దేవతలకు, తన ప్రభువైన సుగ్రీవునికి, నమస్కరించి, రామకార్య నిర్వహణలోనున్న నాకు జయమును చేకూర్చుడని' ప్రార్థించెను.

## హనుమంతుడు అశోక వనమున సీతాదేవిని చూచుట

అది వసంతఋతువు. హనుమంతుడు అశోకవనంలోనికి ప్రవేశించినాడు. అతడు అశోకవనంలో సీతను వెదకుటకు తగిన

యంతయు గమనించినాడు. కొన్ని సూచనలు, శకునములు సందర్భ మునుబట్టి ఆమె శ్రీరామచంద్రుని భార్యయైన సీతయే కావోలునని నిశ్చయించుకున్నాడు.

ఆమె చిరిగిన ఉత్తరీయపు శేషమునుబట్టి, ఇది ఋష్యమూకమున తాము చూచిన సీత నగలుకట్టి క్రిందకు విడిచినది దీని శేషమేనని గుర్తించాడు. నగలుకూడ ఈమె విడువగా మిగిలిన నగలను చెట్టు కొమ్మకు వ్రేలాడదీసినట్లు చూచి, ఈ నగలు, ఆమె విడిచిన నగల పరిశేషములని భావించినాడు. సీత శరీరముమీద ఆయా నగలు ధరించిన గుర్తులనుబట్టి, తమకు ఋష్యమూక పర్వతంమీద దొరికిన నగలకు సంబంధించినవేనని పోల్చుకున్నాడు.

ఆహా! లోక పూజ్యురాలైన శ్రీరామ పత్నికి ఎటువంటి దురవస్థ ప్రాప్తించినది. విధిని తప్పించుట ఎవరికైనను అసాధ్యమే. ఈ సీత, ఆ రాముని తీరు తెన్నులనుబట్టి చూచిన ఉభయులు ఒకరికొకరు తగి యున్నారు. ఒకరి హృదయాలతో ఒకరు నెలకొనియున్నారు. కావుననే విధివశాత్తు వారలు వేరు పడియున్నా తమ శరీరములలో ప్రాణములను నిలుపుకొని యున్నారు.

ఇట్లనుకొనుచుండగనే హనుమంతునికి దుఃఖము పెల్లుబికినది. అతడు సీత దురవస్థను చూచి అంతులేని దుఃఖముననుభవించినాడు.

## రావణుడు అశోక వనమునకు వచ్చుట- సీతను బాధపెట్టుట-

ఇంతలో తెల్లవారినది. తాను దాగియున్న శింశుపా వృక్షము చెంతకు ఎవరో వచ్చు అలికిడి హనుమంతునికి వినపడినది. అతడు మరింత జాగరూకుడై తాను ఎవరికి కనపడకుండా జాగ్రత్తపడినాడు. ఆ వచ్చువారిలో మధ్యన వున్న మేలైన వస్త్రములను, ఆభరణము

ధరించి రాజతేజముట్టిపడుచున్న వానినిగాచూచినాడు. ప్రక్కన కొందరు స్త్రీలు ఛత్రచామరములను ధరించి నడుచుచున్నారు. అతని ముందు వెనుకల రాక్షసస్త్రీలు పరివేష్ఠించి అతనితో వచ్చుచున్నారు. కొందరు మద్యపాత్రలను చేతిలో ధరించియున్నారు.

తిన్నగా అతడు సీతను సమీపించినాడు. కామముకన్నుగప్పి పతివ్రతాంగనయైన సీత పరుని భార్యయని యైనను భావించని మన్మథ భావాతిరేకంతో అతడున్నాడు.

సీతతో ఇట్లను చున్నాడు.

'సీతా! అతిలోక సుందరమైన నీదివ్య రూపము నన్నుఎంతగానో ఆకట్టుకొన్నది. నన్ను మనసార వరించి, నేను సమకూర్చు సకల విధములైన భోగములను అనుభవించి ఆనందించుము. నీవు నా చేష్టను తప్పిదముగా భావింపకుము.' పరకాంతలను అపహరించుట-వారితో ఇష్టభోగములను అనుభవించుట మా రాక్షస జాతికి విహితమే- ఓ భామనీ! నీవు నన్ను వరించి నన్నానందింపజేయుము. మరల నీ రాముడు వచ్చి, నిన్ను స్వీకరించునని యాశపడకుము. దుర్భేద్యమైన ఈ లంకకు వచ్చి నాతో యుద్ధముచేసి గెలుచునని భావింపకుము. నన్నెదిరించి నిలుచువాడు ఈ మూడు లోకములలోను ఎవ్వరూలేరు. అట్టిచో దిక్కులేని అడవిరాముడు నిన్నెట్లు చేరగలడు? అతడు ఏ జంతువు నోటనో పడి మరణించియుండును. అట్టిచో నిరర్థకముగా చనిపోయిన ఆ రామునికై విలపించుట నీ వంటిదానికి తగదు. సీతా! యౌవనము ప్రవాహము వంటిది. అది మనము కోరినప్పుడు వెనుకకు మరలిరాదు. కావున సకాలములో, నీవు నన్ను వరించి ఇష్ట కామ్యార్థములను పొందుము.'

సీతను రావణుడట్లు కారుకూతలచే బాధించుటకు హనుమంతుడు ఎంతో ఓరిమితో, క్రోధమును దుఃఖమును అణచివేసుకొని గమనిస్తూ

ఉండిపోయినాడు. రావణుడట్లు పలుకుచున్న మాటలకు సీత ఎట్లు తల్లడిల్లిపోవుచున్నదో గమనించినాడు.

సీత రావణుని బాకులవంటి మాటలను విని తట్టుకొనలేక పోయినది. ఆమె తనకు, ఆ రాక్షసునికి మధ్యలో ఒక గడ్డిపోచను వైచి ఆ గడ్డి పోచవైపు చూచుచు రావణునితో ఇట్లు మాట్లాడు చున్నది.

"ఓరీ! రావణా! నేను నీ ధనబలమునకు, భోగముల ఎరకు లోబడి నీకు వశమగు దాననుకాను. సూర్యుని నుండి కాంతిని వేరు చేయజాలనట్లు, నీవు నన్ను ఏయుపాయము చేతనైనను వేరు చేయ లేవు. పరపురుషుని నా ఎడమ కాలితోనైనను తాకను. నా భర్త లేని సమయమున నన్ను బలాత్కరించి తెచ్చిన దుర్మార్గుడవు. నీకు అతని చేతిలో చావు మూడినది. నీ పాపపు చేష్టమూలమున మొత్తము లంకకే చేటు తెచ్చినావు. ఇప్పటికైనను మించినదిలేదు. మర్యాదగా నన్ను రామునికి అప్పగించుము. అతడు నిన్ను శిక్షింపక వదలి వేయును. రాముడు శరణాగత వత్సలుడు.

సీత, యాడిన నయోక్తులను రావణాసురుడు లెక్కచేయలేదు. మరల తన ధోరణిలో సీతను నిందించుచు మాట్లాడుచుండెను.

సీతా! ఎంత చెప్పినను నీ మొండి పట్టును విడువకున్నావు. పోగాలము సమీపించిన వారు, సాటివారు చెప్పే మాటలను చెవిన బెట్టరు. ఇదుగో! నీకు రెండు మాసములు గడువు నొసంగుచుంటిని. ఈ రెండు మాసములలో నా మాటవిని, నన్ను మన్నించి నా దాన వైనావా! సరి, లేనిచో గడువు ముగిసిన మరుసటి రోజు ఉదయమే మా రాక్షసులు నిన్ను చంపి, దుచ్యమైన యాహారముగా వండి, నా కడకు పంపెదరు.

"సీతా! మరొక్క అభయమొసంగు చున్నాను. నీవు నన్ను వరించెడిదనక నీ కొరకై వేచియుందును. కాని నిన్ను మాత్రము బలాత్కరింపను. ఈ నా సహృదయమును, మంచితనమును సద్వి నియోగపరచుకొనుము భయము వదిలి, నన్ను ఆమోదించుము."

రావణుడట్లు పరి పరి విధముల సీతను తర్జించుట, చెట్టుమీద నున్న హనుమంతుడు ఎంతో సంయమనముతో విన్నాడు. అతడిప్పుడు విజృంభించి రావణుని ఎదుర్కొనినచో కార్యము చెడును. అని తలంచినాడు.

పిమ్మట రావణుడు అక్కడ కాపున్న రాక్షస స్త్రీలతో "మీ రెల్లయిన జడమతియైన ఈ సీతకునచ్చజెప్పి, నన్ను వరించునట్లు చేయుడు జాగ్రత్త" యని హెచ్చరించి అచ్చోటు వదలి వెళ్ళినాడు.

సీత కన్నుల నుండి ధారాపాతముగా జారిన కన్నీరు ఎండిపోయి, ముఖముపై చారికలు కట్టినవి.

రావణాజ్ఞపై రాక్షసస్త్రీలు సీత చుట్టూ చేరి, ఆమెను రావణుని వరించవలసినదిగా బోధించి బాధించసాగినారు.

## రాక్షస కాంతలు సీతాదేవిని నిష్ఠురోక్తులాడుట

సీత చుట్టును చేరియున్న రాక్షసకాంత నిష్ఠురోక్తులను హనుమంతుడు వినసాగినాడు.

ఒక రాక్షసి: సీతా! రావణుడు సామాన్యుడు కాడు. అతడు బ్రహ్మమానసపుత్రుడు. అట్టి వాని భార్యవగుటకు ఏల సందేహింతువు.

మరొక రాక్షసి:- ఓసీ సీతా! రావణుడు స్వర్గాధిపతియైన ఇంద్రుని జయించిన వాడు సుమా! అతడు నిన్ను పట్టపురాణినిచేసి మండోదరి స్థానములో నిన్ను నిలుపగలడు.

ఇట్లు రకరకాలుగ రాక్షసీగణము సీతను నిష్ఠూర వాక్యములచే బాధించదొడగినవి.

సీత వారల మాటలనువిని మీరు నన్నేల యూరక బాధించెదరు. మీరు నన్ను చంపి తిని వేయుడు కాని రావణుని మాత్రము నేను

వరింపను. సాధ్వీమణులైన శచి, అరుంధతి, రోహిణి, లోపాముద్ర, సుకన్య, సావిత్రి, శ్రీమతి, కుదయంతి, దమయంతి, మున్నగు మహా యిల్లాండ్రు తమ భర్తలను ఏ విధముగా విడువక పూజించి, యను సరింతురో నేను అట్టి సత్యానువ్రతను.

దీనుడైనా, రాజ్యహీనుడైనా రాముడు నాకు సర్వస్వము.

సీతాదేవి చెప్పిన సమాధానమును విని రాక్షస స్త్రీలు అగ్గిబుగ్గై మరింత మండిపడి ఆమెను కత్తులతో, గొడ్డండ్లతో చంప మీదకి పోయినారు. వారిని తప్పించుకొని, లేచి హనుమంతుడు దాగియున్న వృక్షరాజము వద్దకు వచ్చి ఇట్లు తలపోసినది. "ఈ సమయమున నా కింత విషమిచ్చు వారైనను లేరు. ఇచ్చినచో అది మ్రింగి చనిపోయె దను. నాకు మరణము కంటే వేరే దారిలేదు. జన్మాంతరమున చేసిన పాపము వలన నాకీ దుర్యోగము సంభవించినది. నేనిక ప్రాణములతో నుండలేను." అని దుఃఖపడినది.

## త్రిజట స్వప్నము

సీతాదేవి పలికిన సమాధానము విన్నది. ఆమె నిజముగా ప్రాణములను తీసుకొనుననియే భావించిరి. కొందరు రాక్షసస్త్రీలు ఈ విషయమును రావణునకు విన్నవించుటకు చనిరి. మిగిలినవారు సీతాదేవిని భయపెట్టుటకు ఆమె మీదికి ఉరికినారు.

అంతవరకూ నిద్రిస్తూ, ఆ కోలాహలానికి లేచిన 'త్రిజట' అనే వృద్ధరాక్షసి, ఆ రాక్షసీ గణమును వారించి వారిని తనవైపుకు ఆక ర్షించుకొని తన స్వప్నవృత్తాంతము నిట్లు నుడివెను.

"రాక్షస కాంతలారా! ఇటురండి. వినుడు. నేనిప్పుడే నిద్రలో ఒక విచిత్రమైన కలగన్నాను. ఆ కలలో శ్రీరాముడు తెల్లని పుష్ప మాలికలు ధరించి, తెల్లని వస్త్రములు కట్టుకొని, లక్ష్మణునితో కూడి హంసలతో సిద్ధపరుపబడిన పల్లకినెక్కి మన లంకకు వచ్చినాడు. సీతాదేవి మాత్రము తెల్లని చీర ధరించి శ్వేత పర్వతం మీదకి ఎక్కి కూర్చున్నారు. కాంతి సూర్యుని కలుసుకొన్నట్లు సీతరాముని కలిసినది

ఆ తరువాత వారిద్దరూ లంకలో ఒక తెల్ల యేనుగునెక్కి పురవీధులలో ఊరేగుతున్నట్లు కనిపించినది. ఆ తరువాత వారు విమానంలో ఉత్తర దిక్కునకు పోయినారు.

కాంతలారా! వినండి. "ఇక మనరావణుడు ఎర్రని గన్నేరు పూల మాలికలను ధరించి, ఒంటి నిండా నూనె పూసుకొని, ఎర్రని ఉడుపులు ధరించి, ఆ కంఠాముగా మద్యము త్రాగి, త్రాగిన మత్తులో ఒళ్ళు తెలియనివాడై నేలమీద పడియున్నాడు. నల్లని బట్టలు ధరించిన ఒక స్త్రీ మన రావణుని ఈడ్చుకొని పోవుచున్నది. రావణుడు గాడిదలు పూన్చిన రథంపై స్పృహ తప్పి పడియున్నాడు. ఆ తరువాత రథము దిగి ఒక గాడిదపైనెక్కి దక్షిణ దిక్కుకు పోయినాడు. కొంతదూర మట్లు పోయి గాడిదనుండి, తలక్రిందులుగానై దుర్గంధ భూయిష్టమైన ఒక మలిన కూపమున పడినాడు. నల్లని వస్త్రములు కప్పుకొనిన స్త్రీ ఒకతె అతనిని దక్షిణ దిక్కునకు లాగికొని పోయినది.

రావణుని తమ్ముడు కుంభకర్ణుడు, రావణుని కుమారులు, రావణునివలెనే యదనలై దుర్గంధమును కొట్టుకొని పోయినారు.

విభీషణుడు మాత్రము తెల్లని మాలతో, తెల్లని వస్త్రములు కట్టుకొని, తెల్లని ఏనుగుపైనున్నాడు. రాక్షసులారా! రాముని దూత యైన వానరుడొకడు వచ్చి, లంక సమస్తమును కాల్చివేసినట్లు, అగ్నికి అది సర్వనాశనమైనట్లు కలగన్నాను.

బుద్ధి, జ్ఞానము వున్న వారైతే మీలో ఎవరునూ ఇకనుండి ఆమెను బాధింపకుడి. రాబోవు ఆపదలనుండి మనలను రక్షించగల స్త్రీ ఈ సీత ఒక్కతెయే. కనుక ఈమెను ఇప్పుడే పోయి "అమ్మా! రక్షింపుము" అని వేడుడు. తప్పక రక్షింపగలదు.

నా కలయొక్క ఫలితాన్ని విచారిస్తే త్వరలో రావణునితోసహా రాక్షస వంశ నాశనము మరియు శ్రీరామచంద్రుని ఘన విజయము మనము కన్నులారా చూతుమనిపించుచున్నది" అని త్రిజట తన స్వప్న వృత్తాంతమును చెప్పగా రాక్షస గణము సీతను బాధించుట మానిరి.

## సీత ప్రాణ త్యాగమునకు సిద్ధపడుట-
## హనుమంతుని దర్శనము

రాక్షస కాంతల దారుణమైన కఠినోక్తులకు మిక్కిలి గాయపడిన సీత దుఃఖము కట్టలు త్రెంచుకొనినది. కన్నీరు ధారాపాతముగ కురియజొచ్చినది. ఆమె ఇట్లు తలపోసినది.

"రాక్షసుడు పెట్టిన గడువు రెండు నెలలు మాత్రమే. కాని యీ గడువులో రాముడు వచ్చి నన్ను రక్షించుననుమాట వొట్టిది. ఈ రాక్షసులు నన్ను బ్రతుకనీయరు, చావనీయరు. రావణుని మాటలను బట్టి చూడ వారు నన్ను రావణునికి కట్టబెట్టుటకే నియోగింపబడినారని తెలియుచున్నది"

సీత జీవితముమీద తీవ్ర నిరాశ చెందినదై తన సుదీర్ఘ కేశ పాశముచే ఉరి పోసుకొని చనిపోవుటకు నిశ్చయించుకొని, చెట్టు కొమ్మదరికి చేరినది. ఆమె ఆ ప్రయత్నముతోనుండగా అకస్మాత్తుగా ఆమె చెవికి శ్రీరామనామం వినిపించింది. ఎవరో రామకథను శ్రావ్యంగా ఎక్కడనుండియో గానం చేస్తున్నట్లు గమనించింది. ఆమె చుట్టూ చూచినది. చెట్టుపైకి చూచినది. ఆ చెట్టుకొమ్మలలో చిన్ని రూపంలో ఒక వానరము శ్రీ గుణ గానంచేస్తూ ఉండటం చూచినది. ఆమె మనస్సు చెదరిపోయింది. అయోమయంలో పడింది. తాను చూచుచున్నది కలయా! వాస్తవమా! కలయగునో కలలో కోతి కని పించుట అనర్థహేతువు. నిజమగుచో ఈ కపి ఎవరు? ఈ రూపం మాయలమారి రావణుడు వచ్చియుండలేదు కదా! ఆమె ఆలోచనలు ఆగిపోయినవి.

చెట్టుమీద హనుమంతుడు ఈమె శ్రీరామచంద్రుని భార్యయైన సీతయే కావచ్చును. ఈమె యొడలిపై నగల గుర్తులున్నవి. ఆ గుర్తులు ఋష్యమూక పర్వతంపై ఆమె వదలిన నగల గుర్తులులాగున ఉన్నవి. అంతేకాక ఆమె ధరించిన ఉత్తరీయము, ఆమె నగలను మూటకట్టి ఋష్యమూకంపై వేసిన ఉత్తరీయపు కొనవలెనున్నది. కనుక నిశ్చ

యంగా ఈ రాముని భార్యయైన సీతయే అనుకున్నాడు. తాను సీతతో ఏ భాషలో మాట్లాడితే తనను సుళువుగా నమ్ముతుందో, ఆ భాషలో మాట్లాడడం ఉచితమనుకున్నాడు. వైదిక సంస్కృతంలోకాక, ఆర్య వ్యవహార సంస్కృతంలో మాట్లాడితే ఆమె నమ్మవచ్చుననుకొని, ఆ విధంగా మాట్లాడ నిశ్చయించుకొని మెల్లగా చెట్టుపైనుండి క్రిందకు దిగినాడు.

## హనుమంతుడు సీతతో సంభాషణము

హనుమంతుడు సీతాదేవిని ఇట్లు ప్రశ్నించెను.

"తల్లీ! ఎవరవమ్మా నీవు? రూపుకట్టిన శోకదేవతవలె ఇందొక తెవే, రాక్షసులచే గారింపబడుతూ నరకయాతన ననుభవించుచున్నావు! నీవు దేవతవా? గంధర్వ స్త్రీవా? ఋషి పత్నివా?

తల్లీ! నీవేషమును బట్టి చూడ వాక రాచకాంతవనిపించు చున్నది. నీవు తప్పక మా శ్రీరామచంద్రుని భార్యవే యనిపించు చున్నది.

అందులకు సీత సంతోషంగా హనుమంతునితో ఇట్లన్నది.

"నేను అయోధ్యాపతియైన దశరథ మహారాజు కోడలిని, జనక మహారాజు కూతురను, శ్రీరామచంద్రుని భార్యను. నన్ను 'సీత'యని పిలుతురు. నా వివాహమై పండ్రెండు సంవత్సరములవరకు అయోధ్యలో శ్రీరామచంద్రుని ఇల్లాలిగా సకల సుఖభోగములను అనుభవించితిని. కొంత కాలమునకు దశరథ మహారాజు, తన కుమారుడైన శ్రీరామచంద్రునికి యౌవరాజ్య పట్టాభిషేకము చేయవలెనను కొన్నాడు. కాని ఆ విషయము తెలిసిన నా భర్త సవతి తల్లియగు కైకేయి అందుల కొప్పుకొనలేదు. ఆమె అడ్డు తగిలినది. తన కుమారుడైన భరతునిపై మిక్కిలి ప్రేమాదరాలు కలిగియుండుటచే, పుత్ర వ్యామోహం పీడింపగా 'మంథర' అనే అంతఃపుర ఆంతరంగిక పరిచారిక దుర్బోధలకు లొంగి, ఎప్పుడో తన భర్త తనకు ఇచ్చిన రెండు వరములు ఇప్పుడిమ్మని దశరథుని కోరినది. దశరథుడందులకంగీక

రించలేదు. మాట తప్పెదవా? యని నిగ్గదీసినది. దశరథుడు తన మాట తప్పుకొనలేక, వరములివ్వలేక మిక్కిలి దుఃఖించినాడు. ఆ వరము లేమందువా! ఒకటి శ్రీరాముడు పధ్నాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేయుట రెండు రామునకు బదులుగ భరతుని పట్టాభిషిక్తుని చేయుట.

నా భర్త తండ్రి సంకట పరిస్థితిని గుర్తించి, పితృ వాక్యమును పరిపాలించుటకై అరణ్యవాసమునకు సిద్ధపడెను. అతని వెంట నేను బయలుదేరితిని. అన్నయందలి భక్తితాత్పర్యములు కలవాడగుటచే, మరిది లక్ష్మణుడు కూడ అడవికి వచ్చినాడు. మేము దండకారణ్యములో నివాసముండగా రావణుడను రాక్షసరాజు నన్ను అపహరించి తెచ్చినాడు. ఆ రావణుడు తనకు వశమగుటకు నిశ్చయించిన గడువు రెండు మాసములు మిగిలియున్నది. గడువు దాటిన పిమ్మట నేను ప్రాణ త్యాగము చేయుటకంటే వేరుదారిలేదు.

సీత ఈ మాటలు చెప్పుచుండగ హనుమంతుని ఆనందమునకు అవధులు లేవు. అతడామెతో "అమ్మా! నేను శ్రీరాముని దూతను. అతడిప్పుడు ఋష్యమూకమున లక్ష్మణునితో కుశలముగా నున్నాడు' వారికి మా ప్రభువు సుగ్రీవునకు మైత్రి కుదిరినది. రాముడు మీ క్షేమ వృత్తాంతమును తెలియగోరుచున్నాడు. లక్ష్మణుడు మీకు సాష్టాంగ దండ ప్రణామములు చేసినాడు. ఆ సమయములో అతడు సీతను కొంచెము సమీపించగా ఆమెకు అతనిపై కొంచెము అనుమానము కలిగినది.

రావణుడే యీ రూపమున వచ్చియుండునని తలంచి ఆమె చెట్టు కొమ్మ విడిచి నేలకూలినది. హనుమంతుని చూచుట, మాటలాడుట హఠాత్తుగా మానివేసినది.

"దుష్టరావణా! భర్తనుండి దూరమయి ఎంతో దుఃఖముతో నున్నాను, నన్నింక ఏల తపింపజేసెదవు" అని యన్నది.

హనుమంతుడు కన్నీరు మున్నీరై "అమ్మా ! నీవనుమానించు నట్లు నేను రావణుడను కాను. నిక్కముగా నేను రామదూతనే. నన్ను నమ్ముము"

హనుమంతుడు సీత వైముఖ్యమును చూచి ఈమె రాక్షస మాయలకు భయపడి నన్ను నమ్ముటలేదు. అని అనేక విధముల ఆలోచించి, ఈమెకు శ్రీరామచంద్రుని గుణ కీర్తనములను వినిపించిన ప్రసన్నురాలగును అని భావించి, ఆమె ఎదుట శ్రీరాముని ఇట్లు వర్ణించినాడు.

"శ్రీరాముడు సత్యవాది. మధురాతి మధురముగా మాట్లాడు వాడు. నీలమేఘ శ్యాముడు. మన్మధునివలె అందమయినవాడు. కోపమును తన వశమునందుంచుకొనినవాడు. అతడు పురుషోత్తముడు."

"అమ్మా! శ్రీరాముడు త్వరలోనే లంకకు విజయం చేసి,ఇక్కడి వారినందరినీ జయించి, యుద్ధములో రావణునిచంపి అనతి కాలంలో తప్పక నిన్ను తీసుకొని పోగలడు."

"తల్లీ! శ్రీరాముని యాజ్ఞ మేరకు, కపిరాజైన సుగ్రీవుని పనుపునతోటి కపివీరులందరము నాలుగు దిక్కుల అన్వేషించినాము ఆ సమయమున జటాయువు అన్నయగు సంపాతి కనపడి నిన్ను రావణుడు గొనిపోయినాడని, నీవు లంకలో నున్నావని, సముద్రమును దాటుటను గూర్చి మా వారందరు విచారించినారు. నేను వారిని ఓదార్చి, దక్షిణ దిక్కున నూరు యోజనముల పొడవుగల సువిశాల సముద్రమును దాటి ఈ లంకకు చేరినాను. ఇచట ఇప్పటి వరకు నిన్ను వెదుకని తావు లేదు. తుదకు ఈ యశోకవన వాటికలో కడలేని దుఃఖముతో క్రుంగి కూలారిపోవుచున్న నిన్నుగాంచి, నీ జాడ తెలుసుకోగలిగితినని యానందించుచున్నాను.

తల్లీ! అట్టి నన్ను నీవు రావణునిగ అనుమానించి బాధపడు చున్నావు. నీ వించున్న సంగతి రామునకు తెలియదు. తెలిసిన మరు

క్షణములోనే, తమ్మునితో గూడి ఇచటికివచ్చి, రావణయుక్తముగా రాక్షసుల నందరను వధించి, నిన్ను వీరోచితముగా తీసుకొని పోగలడు అమ్మా! నీ వియోగముచే రాముడు నిద్రాహారములు పరిత్యజించి నాడు. అహర్నిశలు 'సీతా! సీతా!' యని పలవించుచున్నాడు."

హనుమంతుడు శ్రీరాముని విషయమును చెప్పుచున్నంతసేపు సీత దుఃఖమును ఆపుకొనలేక పోయినది. కన్నులు ధారలుకట్టగా నేడ్వసాగినది హనుమంతుడామె దుఃఖము చూచి చెప్పుటమాని నాడు.

అప్పుడు సీత! "హనుమంతుడా! నీ మాటలు నా చెవులకు విషముతో కూడిన అమృతమువలె, కడునిష్ఠురముగాను, మధురము గను నున్నవి. నా పతియైన రాముడు నన్నే తలచుచున్నాడని చెప్పుటచే అమృతమువలెను, నా వియోగముచే తీరని దుఃఖమునను భవించుచున్నాడని చెప్పుటచే విషమువలెను నన్ను మిక్కిలి వేధించు చున్నవి.

హనుమా! నీవు వెంటనే వెళ్ళి రామునికి నా క్షేమ వార్త చెప్పి, అతడు వచ్చి నన్ను తీసుకొని వెళ్ళునట్లు చేయుము. శ్రీరాముని ప్రభావము శక్తి యుక్తులు నాకు తెలియనివికావు జనస్థానములో పదు నాల్గువేల రాక్షసులను అతడొక్కడే అశ్రమముగ సంహరించిన పరాక్రమశాలి. ఈ రావణుడు రాక్షస సేన ఒక లెక్కలోనిదికాదు."

సీత యిట్లనుచుండగా హనుమంతునికి ఒకింత వల్లమాలిన ఉత్సాహము కలిగినది. అతడు ఆమెతో "అమ్మా! కొంచెమోపిక పట్టినచో, రాముడు వచ్చునంత వరకు నీవిచట నుండపనిలేదు. నీ విప్పుడే క్షణమాలస్యము చేయకుండా, నా భుజముల పైకి ఎక్కుము. నేను నిన్ను ఇక్కడున్నట్లుగా రాముని చెంతకు తీసుకొని పోయి, అతనికి అప్పగించెదను" అనెను.

అందులకు సీత అతనిపై ఒకింత జాలిపడి, "హనుమా! నీవీ కొలదిపాటి శరీరముతో నన్నీ సముద్రమును దాటించి, తీసుకొని పోయి, రామసన్నిధికి చేర్చుట దుర్లభము. నీవు బాగా ఆలోచించి

యిట్లంటివో, కాక అనాలోచితముగా ననుచున్నావో! తెలియదుకాని మొత్తము మీద కపి వనిపించుకొన్నావు. అదియునుగాక ఒకవేళ నన్ను నీవు నిజముగా సముద్రమును దాటి రామునకే అప్పగింతువు గాక ఆ పని నీకు కీర్తికరముముగలదుకాని, వీరపురుషుడైన రామునికి వచ్చిపడెడిదేమి కలదు. అతనికి మిగులనది అప్రతిష్ఠయే."

పరిహాస గర్భితములైన సీతమాటలనువిని హనుమంతుడు చిన్నబుచ్చుకొన్నాడు. తనను గురించి, తన శక్తిని గురించి తక్కువ అంచనా వేయుచున్నదని గ్రహించి 'మాతా! నా శక్తిని నీవు గమనించినట్లులేదు. నేను అపరిమితుడను, అజేయుడను. ఇదిగో నా నిజ రూపమును తిలకించుము" అని యాతడు తన శరీరమును ఆకాశమున కంటునట్లు అపారంగా పెంచినాడు, సీత హనుమంతుని బృహత్ రూపమును చూచి భయపడినదై "హనుమా! తెలిసిందిలే నీ నిజరూపము కాయమును యధారీతిగా కుంచించుము" అని చెప్పెను. హనుమంతు డట్లు చేసి ఆమె ఏమి చెప్పునోయని నిరీక్షించసాగెను.

"హనుమా! నీవిప్పుడే వెళ్ళి శ్రీరామునికి నా జాడ చెప్పుము. అతడు వచ్చి, నన్నాదుకొనునట్లు చేయుము. అంతకన్నా నిన్ను నేను కోరునది లేదు" అని సీత చెప్పెను.

అంత హనుమంతుడు, శ్రీరాముడు తను బయలుదేరునపుడు సీత గుర్తించుటకై యిచ్చిన రామ నామాంకితమైన అంగుళీయమును ఆమెకు యిచ్చెను. సీత ఆ అంగుళీయకమును పలుమారులు చూచి, సాక్షాత్తూ శ్రీరాముని చూచినట్లుగా తృప్తిచెంది, తన్మయతనొందినది. పిమ్మట అతడు "అమ్మా! నేను నిన్ను చూచినట్లు శ్రీరాముడు నన్ను విశ్వసించుటకై ఏదియైన ఆనవాలు ఇమ్ము" అని యడిగెను.

అందులకు సీత సమ్మతించి "హనుమా! నీకొక మంచి ఆనవాలు చెప్పెదను జాగ్రత్తగా వినుము. విని యిది శ్రీరామునకు చెప్పుము. అతడు నీవు నన్ను చూచినట్లు నిశ్చయముగా నమ్మగలడు.

"రామచంద్రా! సిద్ధాశ్రమ ప్రాంతంలోని చిత్రకూట పర్వతం సమీపంలో మనమున్నప్పుడు, ఒకనాడు అక్కడి పూల వనంలో విహరిస్తూ ఉండగా నేను అలసిపోయితిని. అప్పుడు నీవు నన్ను నీ అంకతలంమీద చేర్చుకొన్నావు. ఆ సమయంలో ఒక కాకి వచ్చి, నా స్తనమధ్యంలో పొడుచుచు మాంసమును తిన నారంభించజొచ్చినది. అప్పుడు నా చీర జారిపోయినది. నేను సిగ్గుపడి సవరించుకొన బోవుచుండగా నీవు నన్ను పరిహసించినావు. నేను మరల నీ యంకముపైకి వచ్చితిని. నేను కోపమునొంది యుండుటచే, అలసటలో నాకు నిద్ర పట్టినది. ఆ కాకి మరల వచ్చి, నన్ను స్తనమధ్యలో గాయ పరిచినది. నా శరీరమునుండి రక్తము ప్రవహించి, నీమీద పడినది. నీవా కాకిని చూచి కోపించి, ఒక దర్భను చేత తీసుకొని బ్రహ్మాస్త్రాన్ని మంత్రించి వాయసముపై ప్రయోగించితివి. ఇంద్ర కుమారుడైన యా వాయసము ముల్లోకములు తిరిగి 'రక్షింపుమని' నీ శరణు జొచ్చినది. అమోఘమైన బ్రహ్మాస్త్రమును త్రిప్పుట సాధ్యము కాదు కావున వాయసము కుడి కంటిని కొట్టి, దానిని ప్రాణముతో క్షమించి వదిలితివి.

నా కోసము కాకిమీద బ్రహ్మాస్త్రమును సంధించిన యుదారుడవే. ఇప్పుడీ ఘోర విపత్తున చిక్కుకొనియున్న నన్నేల రక్షింపరావు?"

హనుమా! ఈ మాటలు నేననినట్లు శ్రీరామునితో చెప్పుము. అన్న ఆజ్ఞనుగొని లక్ష్మణుడైనను నా రక్షణకు రాకూడదా?

హనుమా! నన్ను రక్షింపుమని శ్రీరామునికి మరి మరి చెప్పుము. లక్ష్మణునికి ప్రత్యేకముగ విన్నవించితినని తెలుపుము.

నేనిక ఒక నెల మాత్రము జీవించెదను. అనుచు, సీత తన చూడామణిని తీసి హనుమంతునికిచ్చుచు ఇది శ్రీరామునకిమ్ము. దానిని చూచిన రామునికి నేను, మామగారు, నా తల్లి గుర్తుకు రాగలము. ఇక భావికార్య సిద్ధియంతయు నీ యధీనము.

హనుమంతుడు సీత యిచ్చిన చూడామణిని తన వ్రేలికి తాలించి, సీతకు ప్రదక్షిణ నమస్కారములుచేసి, ఆమె యనుజ్ఞపడసి తిరుగు ప్రయాణమునకు సిద్ధపడెను.

## హనుమంతునిచే అశోకవన భంగము

హనుమంతుడు ఇట్లు ఆలోచించెను. నేనిప్పుడు ఇచటినుండియే సముద్రమును లంఘించి రాముని వద్దకుపోయితినేని పూర్ణ ప్రయోజన ముండదు. వెళ్ళుటకు ముందు రావణుని బలము మరియు లంకయొక్క దుర్గ నిర్మాణ రహస్యము, రాక్షసవీరుల ఆనుపానులు అన్నియు తెలుసుకొని పోవుదునేని మిక్కిలి ప్రయోజనముండగలదు. అన్నిటి కంటె ముఖ్యము రావణుని చూచుట. ఆ చూచుటకు ముందుగా తాను రాక్షసుల కంటబడి, వారిని చంపుట, రావణునికి ప్రియమైన అశోక వనమును ధ్వంసము చేయుట. కాన కోపముతో తన కుమారుని నాపై యుద్ధమునకు పంపుట- నేను వానిని చంపుట- నేను బంధింపబడుట- రావణ సభకు కొనిపోవుట- రావణుని చూచుట అన్నియును జరుగును. ఆపైన కాగల కార్యమును అప్పుడే ఆలోచించవలయును అనుకొని హనుమంతుడు అశోకవన ద్వారమువద్దకు చేరినాడు.

ఆ ద్వారము చెంతనున్న ద్వారపాలకులు హనుమంతునిపై బడినారు. హనుమంతుడు అక్కడ నున్న ఇనుప గదియనొక దానిని తీసుకొని వారలను హతమార్చెను.

అచటనున్న రాక్షసస్త్రీలు రావణుని వద్దకు పోయి, "రాజా! అశోకవనమునందు ఒక వింతయైన వానరుడు ప్రవేశించినాడు. అతడు సీతతో ఏమేమో మాట్లాడి, వెళ్ళిపోతూ అశోకవనమును ధ్వంసము చేసి, అడ్డు వచ్చిన వనపాలకులను హతమార్చినాడు. మేము దిక్కు లేక భయముతో ఇటు పరుగెత్తుకొని వచ్చినాము. రక్షింపు మహా ప్రభో అని మొఱపెట్టుకొనినారు.

## రావణుడు రాక్షస సైన్యమును అశోకవనమునకు పంపుట

రాక్షస కాంతలు చెప్పిన అశోకవన ధ్వంసమును గురించి చెప్పిన మీదట యతడు క్రోధోద్రిక్తుడై ముఖ్య సేనానాయకులతో కూడిన సైన్యమును పంపెను. హనుమంతుడు ఆ ఇనుప గదియతోనే శ్రీవారలనందరను అవలీలగ చంపెను. పిదప అతడు అందున్న చైత్య ప్రాసాదములను కూల్చివైచి, వానిని కాపున్న రక్షకభటులను చంపివైచెను.

ఈ విధముగ మంత్రి కుమారుడు ప్రహస్తుడు, తరువాత ఇతర మంత్రుల కుమారులు ఏడుగురు యుద్ధమునకు రాగా వారును హనుమంతుని చేతిలో చచ్చిరి.

వీరందరూ వానరుని చేతిలో మరణించిరన్న వార్త విని రావణుడు తనలో పిడెవడో, ఇంద్రుడు ఘోరతపము చేసి, మనలను హతమార్చుటకు పంపిన "మహాభూతము" అయి యుండనోపు. వానర రూపములో వచ్చిన ఈ పెనుభూతము పట్ల నిర్లక్ష్యమై ఖరి నవలంభించరాదు. కడుజాగ్రత్తగా మీరు వెళ్ళి వానరుని బంధింపుడు" అని చెప్పి మరికొంత రాక్షస సేనను పంపెను. ఆ రాక్షస సేనయు హనుమంతుని చేతిలో చచ్చినది.

## అక్షకుమారుని వధ

పిమ్మట రావణుడు తన కుమారుడైన 'అక్షు'ని హనుమంతునిపై యుద్ధమునకు పంపెను. హనుమంతునికి, అక్షునికి ఘోర యుద్ధము జరిగినది. అక్షుడు అంత తేలికగా చచ్చువాడు కాదు. అతనిని వధించడానికి ఒక మార్గమును కనిపెట్టినాడు.

హనుమంతుడు అక్షకుమారుని రెండుపాదములు పట్టుకొని పైకెత్తి, గిరగిర త్రిప్పి విసరివైచినాడు. అక్షుడు నేలమీద పడక మునుపే ప్రాణములు వదలినాడు.

అక్షకుమారుడు యుద్ధములో వానరునిచే వధింపబడెనని రాక్షసులు వచ్చి, రావణునితో చెప్పినారు. రావణుడు ఆ వార్తవిని ఘగ్గుమన్నాడు. తన ప్రియపుత్రుడైన అక్షకుమారుడు మరణించుట వలన తీరని దుఃఖమున మ్రగ్గిపోయినాడు.

"హా కుమారా! అక్షా! నా గారాబుబిడ్డా! నీవు మరణించినావా? అయ్యో! ఎంతపని జరిగినది?" అని యేడ్చెను.

మండోదరి రావణుని బ్రతిమాలినది. "రాజా! ఇన్ని యనర్థములకు మూలమైన ఆ సీతను వదిలి రామునకు అప్పగించండి. మన అక్షకుమారుని వధించినది ఆరామదూతయేకాని అన్యుడుకాదు. కనుక మనవారిని యావత్ లంకా ప్రజలను ఇప్పటికైన రక్షించుట రాజైన మీ ధర్మము. మీరు సీతను వదలిన ఆమె తన భర్త వద్దకు వెళ్ళును. మన లంక వైపునకు ఇక ఎవ్వరురారు."

మండోదరి మాటలు రావణునికి "చెవిటి వాని చెవిలో శంఖ మూదినట్లయినది. - మండోదరీ నీ హితోక్తులు చాలింపుము. నీవన్నది జరుగనిపని, నేను ఇప్పుడే పోయి ఆ నీచ వానరుని సంహరించి వత్తును." అని యుద్ధమునకు బయలుదేరుచుండగా, మండోదరి పెద్ద కుమారుడు ఇంద్రజిత్తు తండ్రివద్దకు వచ్చి "తండ్రీ! నేనుండగా మీరు యుద్ధమునకు పోవుట తగదు, మీరు నిశ్చింతగా ఉండండి."

నేను వెళ్ళి, ఆ వానరుని సంహరించి వస్తాను. అనుజ్ఞ ఇవ్వండి! అని వేడుకున్నాడు.

తండ్రి యనుమతి పొంది, ఇంద్రజిత్తు ఒక అక్షౌహిణి సైన్యంతో ఆ వానరునితో తలపడడానికి, అశోకవనమునకు బయలుదేరినాడు.

## హనుమంతుడు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే బంధింపబడుట

ఇంద్రజిత్తు సైన్యసమేతంగా అశోకవనమునకు వెళ్ళి హనుమంతుని చూచెను. అప్పటికే వేలమంది రాక్షసవీరులను చంపిన హనుమంతుడు ఏమియు ఎరుగనివానివలె, ఆ వనద్వారము చెంత కూర్చొని యున్నాడు.

ఇంద్రజిత్తు "ఏమిరా! ఎవడవు నీవు? ఎందులకిటు వచ్చినావు? ఏల మా రాక్షసవీరులందరినీ నిష్కారణముగ మధియించినావు?" అని ప్రశ్నించెను.

హనుమంతుడు అతని మాటలకు సమాధానము చెప్పకయే అతని సైన్యముపైబడి దునుమాడదొచ్చినాడు. సైన్యమంతయు ప్రాణ భీతిచే చెల్లాచెదరైనది. ఇంద్రజిత్తుకు ఏమియు తోచలేదు. వానరునిపై ఎన్ని అస్త్రములు ప్రయోగించినా ఫలితము కనిపించుటలేదు. అతడు చెట్లను, చేమలను రప్పలను పెరికి సైన్యముపై వేయుచుండెను.

ఇక ఉపేక్షించి లాభము లేదని ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమును మంత్రించి, హనుమంతునిపై వదిలినాడు. బ్రహాస్త్ర ప్రభావము వలన హనుమంతుడు నిశ్చేష్టుడై, ఆ యస్త్రముపై గల గౌరవముచే తనకు తానుగా లొంగిపోయి పట్టుబడినాడు. ఇంద్రజిత్తు మాత్రము, హనుమంతుడు బంధితుడగుట తన ప్రభావము వలననేనని మురిసిపోయినాడు. హనుమంతుడు మూర్ఛ నొందినాడని భావించి, రాక్షసవీరులు అతనిని త్రాళ్ళచే మరింత గట్టిగా బంధించిరి. రాక్షసులు హనుమంతుని త్రాళ్ళతో బంధించగానే, బ్రహ్మాస్త్ర ప్రభావము అంతరించిపోయినది. ఇక మహా బలశాలియైన హనుమంతునికి వారలు కట్టిన త్రాళ్ళు నిమిత్త మాత్రముగ పరిణమించినవి. తానిప్పుడు బంధములను త్రెంచుకొనినచో రావణుని చూడలేడు. కనుక బ్రహ్మాస్త్రమునకు కట్టుబడియున్నట్లే నటించి, మిన్నకుండినాడు అంత వానరులు హనుమంతుని గ్రుద్దుచు, లాగుచు రావణాసురుని సభా భవనమునకు తీసుకొనిపోయిరి.

రావణుడు సింహాసనముపై కూర్చొని యున్నాడు. అతడిట్లను కొన్నాడు "ఆహా! రావణుడెంత తేజశ్శాలి ఇతని రూపము, బలము, ధైర్యము మిక్కిలి ప్రశంసనీయములు. వీనియందు ఒక్క సీతాప హరణము" అను అధర్మదోషము లేనిచో, సాక్షాత్తు ఇతడు ఇంద్ర పదవికే అర్హుడు.

రావణుడు కూడ హనుమంతుని చూచి పూర్వము నేను కైలాస పర్వతమును కదలించినప్పుడు నన్ను శపించిన 'నందికేశ్వరుడే' యిత డగునేమో! లేక అతిలోకబలశాలియైన బాణసురుడే యీతడగునేమో! పోలికలు చూచిన ఈ మహానుభావుడు సామాన్యవానరము వలె తోచుటలేదు" అనుకొన్నాడు.

ఉభయులు పరస్పరము చూచుకొని, భావించుకొనిన పిదప వారిద్దరి మధ్యన బహిరంగ సంభాషణ మిట్లుసాగినది.

## రావణునితో హనుమంతుడు మాటలాడుట

సభలో రాజసముట్టి పడుచున్న రావణుడు మంత్రి ప్రహస్తుని చూచి ప్రశ్నింపుమని కనుసన్న చేసెను.

మంత్రి ప్రహస్తుడు హనుమంతుని చూచి "ఓయీ! వానరుడా భయపడకుండ నీ వెవరివో చెప్పుము. ఇంద్రాది దేవతలలో ఎవరిచేత నైనను పంపమనినారా! నీవిట కెందులకు వచ్చితివి? సంశయము లేకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పిన నీకేమీ హానికలుగనీయక వదలి పెట్టెదము లేనిచో ప్రాణములతో నీవుండజాలవు" అనెను.

మంత్రి ప్రహస్తుని ప్రశ్నలను విని హనుమంతుడు అతని మొగము చూపకయే, రావణునివైపు చూస్తూ, రావణునే సంబోధిస్తూ ఇట్లు సమాధానము చెప్పెను.

"రాజా! మీరడిగిన దేవతలలో ఎవరును నన్నిచటికి పంపలేదు. నేనిచ్చటికి ఒక రాచకార్యము మీద వచ్చితిని. నేను శ్రీరామచంద్రుని

దూతను. మా ప్రభువైన సుగ్రీవుని యొద్ద నుండి నీకొక సందేశమును తెచ్చితిని. సావధానముగ నాలకింపుము.

సోదర భావముతో సుగ్రీవుడు నీకు చెప్పి పంపిన హితోక్తుల నాలించి నీవపహరించి తెచ్చిన శ్రీరామ పత్ని సీతను, మరల సగౌరవ ముగా నాతని కప్పగించుము. ఆ రూపమున నీవు శ్రీరాముని యెడల చేసిన మహాపకారమును సరిదిద్దుకొనినవాడవగుదువు. నేను చెప్పు చున్న మాటలను వినుము. శ్రీరాముడు బలశాలి. యుద్ధ విశారదుడు. ఒక్క బాణముతో వాలిని వధించి సుగ్రీవునికి రాజ్య మప్పగించి నాడు.

శ్రీరామున కపకారమొనసగి ఇంద్రుడైనను బ్రతికి బట్టకట్టలేడు. ఇక నీ వంటి వారి సంగతి చెప్పనేల? అతడు వధించదలచిన వానిని ముల్లోకములలో ఎవరును కాపాడలేరు.

రావణా! అంత దూరమెందులకు నేనొక్కడనే యీ లంకను నాశనము చేయగలను. కాని ఆ పనిని ప్రభువైన శ్రీరామునికే వదిలి పెట్టినాను.

హనుమంతుని మాటలను విని రావణుడు పట్టరాని కోపంతో కంపించిపోయినాడు. వెంటనే భటులను పిలిచి "ఈ వానరుని సంహ రింపుడు" అని ఆజ్ఞాపించినాడు.

అప్పుడు సభలోనున్న రావణుని తమ్ముడు విభీషణుడు లేచి నిలుచొని అన్నతో ఇట్లనినాడు.

"అన్నా! నీవు పండితుడివి. రాజువి. ధర్మమును తప్పి నడచుట న్యాయము కాదు. పరుల వార్తలను మోసికొని వచ్చి, అందించు దూతను ఎవరైనా వధింతురా! దూత దండింపదగిన వాడైనచో శాస్త్రములు అతనికి విధించదగు శిక్షలు స్పష్టముగ చెప్పి యున్నవి. నీవును అట్టి శాస్త్ర ధర్మమును అనుసరించుట యుక్తము.

అన్నా! నీవు పండితుడవే కాదు. అత్యంత బలాఢ్యుడవైన యుద్ధ ప్రియుడవు. నీవు నేరుగా రాముని మాతను కాక రామునే యుద్ధమున సంహరింపుము. నూరు యోజనముల సముద్రమును దాటి ఇక్కడి నీ వార్తను చెప్పి వీరుడవైన నీ యెదుటకు రాముని తీసుకొని వచ్చుటెట్టి వేఱొకడు లేడు. కావున ఇతనిని చంపితే నీ శత్రువైన రాముడెట్లు వచ్చును?"

విభీషణుడట్లు చెప్పగా రావణుడు ఆలోచనలో పడి, ఇతడు చెప్పునది యథార్థమేననిపించుచున్నది. వెంటనే ఇంద్రజిత్తు వైపునకు చూచి "ఇతనికి తగిన శాస్తి జరిపించి పంపుడు" అని కోపముతో పలికెను. ఇంద్రజిత్తు కపులకు వాని తోకలే ఇష్టములు. కావున ఇతని తోకకు నిప్పంటించి, ఒడలు మండునట్లు చేసి పంపుడు. అగ్ని బాధకు తట్టుకొనలేక సముద్రములో పడి చచ్చును" అని చెప్పి భటులకు ఆజ్ఞాపించెను.

రాక్షసభటులు హనుమంతుని తోకకు నూనెతో తడిపిన గుడ్డలు చుట్టి, అతనిని వీథిలోనికి తెచ్చి, నిప్పంటించి వదిలిరి.

## లంకా దహనము

హనుమంతుడు మండుతున్న తోకతో లంకకోట ప్రాకారమును ఎక్కి సీతాదేవిని ప్రార్థించెను. వెంటనే హనుమంతునికి అగ్నిహోత్రుడు చల్లదనమును కూర్చెను. బయటికి జ్వాలలై మండుతున్న తన వాలాగ్నితో హనుమంతుడు లంకలోని ప్రతిఇంటినీ, మేడలను, మంత్రుల, సేనాపతుల నివాస భవనములను, రగిల్చెను. ఆ మంటలకు లంకాపురమంతయు ప్రళయకాలాగ్నిచే భస్మీపటలమగుచున్నట్లాయెను. ప్రతి యింట రాక్షసుల హా!హా! కారములు మిన్ను ముట్టినవి. ఏ యింట చూచినా, హా నాథా! హా పుత్రా! హా జనకా! హా! జననీ! అన్న రోదన నినాదములే... వారలు కాలుచున్న తమ యిండ్లనుండి బయటికివచ్చి, దిక్కులేనివారై అటు యిటు పరుగెత్తసాగిరి.

హనుమంతుడు ఒక్క విభీషణుడి భవనం తప్ప తక్కిన వారం దరి భవనాలను కాల్చి బుగ్గిచేసినాడు. దేవతలు సంతోషించారు.

## సీత అగ్నిహోత్రుని ప్రార్థించుట

హనుమంతునికి రావణసభలో అగ్ని శిక్షయైనపని సీత రాక్షసుల వలన తెలుసుకొని మిక్కిలి బాధపడినది. ఆమె అగ్నిహోత్రుని ప్రార్థించినది.

ఓ అగ్నిహోత్రుడా! నా పుణ్యఫలముచే నన్ను రక్షించ వచ్చిన హనుమంతుని చల్లగా చూడుమయ్యా!

నేనే పతివ్రతా మహిళనేని హనుమంతుని కాపాడుము.

సీతిహోత్రా! రాముడు ఏకపత్నీకుడేని అతని చరిత్ర యుదాత్తమైనదేని హనుమంతుని చల్లగా చూడుము.

సీత అగ్నిహోత్రుని ప్రార్థించునంతనే ఎట్టి హాని కలుగకుండా కార్యమును పూర్తి చేసుకొని సముద్రపు ఒడ్డునకువచ్చి, తన తోక నున్న వాలాగ్నిని చల్లార్చుకొనెను.

ఆ సమయములో హనుమంతుడుడిట్లు విచారించెను.

## హనుమ తొందరపాటుకు విచారించుట

"కోపము చేత నేను లంకనంతయు నిశ్శేషముగ కాల్చితిని. ఈ కాల్పులలో సీతాదేవి మరణించలేదుకదా! ఛీ! ఎంత మతిలేని పని చేసితిని-కోపమన్నది గురుజనులని కూడా విచారింపక చంపించును. కోపమున కార్య కార్య విచక్షణజ్ఞానము నశింపగా నేను ఇంతగా చేయరాని పని చేసితిని. దీనివలన నాకు కలిగిన లాభమేమి?" అని హనుమంతుడు విచారించి, సీతాదేవి దగ్గరకు పరుగు పరుగునపోయి, ఆమె క్షేమముగానున్నదని చిత్తశాంతిని పొందెను. అతడు ఆమెకు నమస్కరించి తల్లీ! పొరపాటు జరిగినది. అనివార్యమైన నా లంకా దహనకృత్యములో నీ కేమైనహాని జరిగియుండవచ్చునని తల్లడిల్లితిని

నా కోపమంత చేసినది నీవు క్షేమముగా నున్నాను. నేను బ్రతికితిని" అని విన్నవించుకున్నాడు.

"హనుమా! రాక్షసులు నీకు పెట్టిన చిచ్చుతో నీవేమైతివోనని బాధపడితిని. అగ్నిహోత్రుడు మన యందు దయయుంచి ఎటు వంటిహాని జరుగకుండా కాపాడినాడు. ధన్యులము."

హనుమంతుడు సీతవద్ద మరల మరల సెలవు గైకొని, తిరుగు ప్రయాణమునకు పక్రమించెను.

## హనుమంతుని తిరుగు ప్రయాణం

హనుమంతుడు సముద్రపు ఒడ్డునకు వచ్చి, అక్కడ ఉన్న అరిష్ట పర్వతంపైకి ఎక్కి ఒక్క కుదుపు గైకొని సముద్రపు గగన తలంపైకి ఎగిరినాడు. హనుమంతుని కుదుపునకు అరిష్ట పర్వతం నుగ్గు నుగ్గయి సముద్రంలో కలిసింది. సముద్రము మీద అతని తిరుగు ప్రయాణము ద్విగుణీకృతోత్సాహముతో సాగినది. మధ్యలో మైనా కుని మర్యాద ప్రకారము కలిసి, అతన్ని ప్రేమతో స్పృశించి ముందు నకు సాగినాడు.

కొంతసేపటికి మహేంద్ర పర్వత సమీపమునకు చేరినాడు. పర్వతము మీదికి దిగకుండగనే అతడు భయంకరమైన యొక సింహ గర్జన చేసినాడు. ఆ గర్జనను పర్వతమున హనుమంతుని రాకకై నిరీక్షిస్తూన్న జాంబవంతుడు విన్నాడు. అతడు తక్కిన వానరులను పిలిచి, వానరులారా! ఇప్పుడు మనము విన్న సింహగర్జన హను మంతుని గర్జనవలె నున్నది. ఆ గర్జనను బట్టి చూడ, అతడు విజయ పరిష్టుడై, మరలి వచ్చుచున్నాడని తోచుచున్నది. అతనికి ఘనమైన స్వాగత సత్కారము లందజేయవలసి యున్నది. త్వరపడుడు. మీరం దరు ఆ ప్రయత్నములో నుండుడు. కార్యము సాధింపని వాని గర్జన మిట్లుండదు." అనెను.

వానరులందరూ హనుమ పునరాగమన వార్త విని మిక్కిలి సంతోషించినారు. కొలదిసేపట్లో బృహత్కాయుడైన హనుమ శ్వేత పర్వతంవలె మహేంద్రగిరిపై అడుగు పెట్టినాడు.

వానరులందరూ మిన్నుముట్టిన సంతోషంతో జయ జయ ధ్వానాలు చేస్తూ, కేకిసలు కొడుతూ హనుమంతుని చుట్టుముట్టినారు.

## హనుమంతుడు తనవారితో జరిగిన వృత్తాంతమును వివరించుట

హనుమంతుడు వారితో "చూచితిని సీతను" అని చెప్పి పరామర్శ దృష్టితో అందరిని ఒకసారి చూచి, కూర్చుండ నియోగించగా వారందరు పెద్ద పెద్ద బండలను తెచ్చుకొని హనుమంతుని ఎదుట కూర్చున్నారు.

హనుమంతుడు వారికి తను సముద్రమును దాటుటకు బయలు దేరినది మొదలు, మైనాకునితో కలయిక, మరియు సురసను, సింహిక లంఖిణిని జయించిన తీరును, ఆ పైన లంకలో అడుగిడి లంకానగర ప్రవేశము గావించి, రావణుని అంతఃపురము అందలి సౌదామ సౌధములను, గజ, అశ్వ శాలలను, రావణస్త్రీలు నిద్రించిన శాలలను, పరికించి, సీతాదేవి ఆయా ప్రదేశములలో గానక, చివరకు అశోక వనమును చేరి, అందు వృక్షము క్రింద శోకదేవతయై యున్న సీతాదేవిని చూచితిని. సీతాదేవి తనను నమ్ముటకై, శ్రీరామ ముద్రికనిచ్చుట, అశోక వనభంజనము, అక్షకుమారవధ, ఇంద్రజిత్తు తనను బ్రహ్మాస్త్రముతో బంధించుట, రావణ సభకు గొనిపోవుట, రావణుని యాజ్ఞపై రాక్షసులు తన వాలమునకు నిప్పంటించుట, లంకా దహనము, సీత అగ్నిదేవుని ప్రార్థించుట. అగ్ని తనను బాధించక చందన శీతలతను కలుగజేయుట, తన వాలమును సముద్రములో ముంచి అగ్నిని చల్లార్చుకొని, మరల సీత వద్దకు వచ్చుట, సీత రామచంద్రునికి తన

గుర్తుగా సీత వద్దనున్న చూడామణిని తనకు యిచ్చుట, తాను ఆమె నుండి సెలవుగైకొని, తిరుగు ప్రయాణమై సునాయాసముగా వానరుల మధ్యన దిగిన వృత్తాంతమంతయు వినిపించెను. వానరులందరు సీతాదేవి జాడ తెలిసినదని విని ఆనందముతో గంతులు వైచుచు కిష్కింధకు తిరిగి వాయువేగముతో బయలుదేరిరి.

## వానరులు మధు వనములో ప్రవేశించుట

యువరాజు అంగదుడు, హనుమంతుడు, మున్నగు వానరులు అందరూ కిష్కింధకు సమీపంలో వున్న సుగ్రీవుని ఉద్యానవనమైన "మధువనంలోనికి ప్రవేశించారు. వారు అంగదుని యనుమతితో పొట్టలనిండా ఆ వనంలోని తెనెలను త్రావి ఫలవృక్షాదులను విరిచి, మధువనము నంతయు అల్లకల్లోల పరచిరి. ఇదియంతయు హనుమంతుడు సీతను కనుగొనిన విజయవృత్తాంత సూచకము.

ఆ వన ముఖ్యపాలకుడు 'దధిముఖు'డను వాడు పరుగు పరుగున సుగ్రీవుని వద్దకు వచ్చి, భయ వినయ విభ్రమములతో 'అయ్యా! మీ తాతలనాటి 'ఉద్యాన వనము'ను, నేడు వానరులు ఇష్టము వచ్చినట్లుగా ధ్వంసము చేసినారు. నేను ఇతర కావలివారలు వారినడ్డుకొనబోగా మమ్ములను మిక్కిలి అవమానపరిచినారు. యువరాజు అంగదులవారు కూడ అక్కడనే ఉన్నారు.

సుగ్రీవుడు దధిముఖుని మాటలు విని చెంతనే ఉన్న రాముని చూచి "రామా! వింటివా! మధు వనములో ప్రవేశించిన వానరులు, దక్షిణదిశకు వెళ్ళిన హనుమదాదులైన వానరులే. వారు సీతాదేవిని చూచి వచ్చి యుందురు. లేకున్న నేను పెట్టిన గడువు తీరిన తరువాత వారు మరల తిరిగి నా యెదుటకురారు. నాయాజ్ఞ మీరినవారట్టి సాహసముచేయరు. అదియునుగాక యిప్పుడు మధువనము

ధ్వంసము చేయరు. సీతాదేవిని చూచి, సంతోషముతో వచ్చుచున్న వారిని, అంగద యువరాజు మధువనములోనికి అనుమతించి యుండ వచ్చును.

సుగ్రీవుడు సంతోషముతో రామునికి ఈ వార్త చెప్పి, వచ్చిన దధిముఖునితో మీరు త్వరగా వెళ్ళి, హనుమదాదులను శీఘ్రమే యిచటికి రమ్మని చెప్పెడు.

దధిముఖుడు, అతని అనుచరులు తిరిగి మధువనమునకువెళ్ళి, అచట యున్న యంగదునితో సుగ్రీవులవారు మిమ్ము తొందరగా రమ్మని పుత్తెంచినారు. అని చెప్పిరి. వానరులంతయూ హనుమంతుని యుత్తంగా వచ్చి సుగ్రీవుని ముందు నిలిచి, రామ సుగ్రీవులకు నమస్కరించిరి.

హనుమంతుడు "రామప్రభూ! "చూచితిని సీతాదేవిని" అని చెప్పెను.

## హనుమంతుడు శ్రీరామచంద్రునికి, సీత పంపిన చూడామణిని, ఆనవాలుగ యిచ్చుట.

హనుమంతుడు తనకు సీతాదేవి యిచ్చిన చూడామణిని శ్రీరామ చంద్రునికి సీత ఆనవాలుగా యిచ్చెను. అది చూచి శ్రీరామ చంద్రుడు "ఆహా! సీతా! నిన్ను ఎడబాసి ఎన్నాళ్ళైనది-నీవు లేక నేను ఎట్లు జీవించితినో కదా! ఈ చూడామణిని చూచినంతనే, నిన్ను చూచినంత ఆనందము, దుఃఖము కలిగినది" అనుచు శ్రీరాముడు విలపించెను.

లక్ష్మణుడు, సుగ్రీవుడును రాముని దుఃఖము చూడలేక బాధ పడిరి. వారందరి దుఃఖమును చూచి వానరులందరు దుఃఖింపసాగిరి. సుగ్రీవుడు శ్రీరాముని ఓదార్చెను. అంగదుడు లక్ష్మణుని ఓదార్చెను.

శ్రీరాముడు తెప్పరిల్లి హనుమంతునితో సీతాన్వేషణకు సంబంధించిన సమస్త సమాచారమును చెప్పుమని యడిగెను. "హనుమా! నిన్ను చూచిన, నా సీతను చూచినట్లున్నది.

హనుమంతుడు అంజలి ఘటించి రామునితో తాను వెళ్ళినది మొదలు తిరిగివచ్చునంతవరకు జరిగిన విషయములన్నింటిని సవిస్తరముగా తెలియ పరచెను.

"రామా! లంకలో తల్లి సీతాదేవి దుఃఖమును మాత్రము చూడ లేక పోయితిని. రావణుడు కడు దుర్మార్గుడు. ఆమెను ఎన్నియో బాధలు పెట్టుచున్నాడు. ఐనను ఆ తల్లి కన్నెత్తియైనను రావణుని చూడకయే గడ్డి పరకను అతనికి తనకు మధ్యన పడవైచి, దుర్మార్గుడైన రావణునికి ఎన్నో బుద్ధులు చెప్పినది. ఆహారపానీయములు లేక, తైల సంస్కారాదులు లేని శిరోజములతో, మాసిన వస్త్రముతో కన్నుల వెంటకారిన బాష్పముల చారికలతో చిక్కిశల్యమై మిమ్ములనే తలచుకొనుచు జీవించియున్నది. నన్నుచూచి నమ్మక రాక్షసుల మాయయని భయపడినది. నేను మీరు ఆనవాలు ఇచ్చిన అంగుళీయకమును ఆమెకు ఇచ్చితిని. అదిచూచి సంతోషముతో హృదయమున కద్దుకొని ఎంతో ఉప్పొంగి పోయినది. పిమ్మట నాపై ఏర్పడిన అనుమానము తొలగి, ఆప్యాయతగా అభిమానముతో, ఆనందముతో "హనుమా! నిన్నుచూచిన నాకు ఆ రామచంద్రుని చూచినట్లే అనిపించుచున్నది. తొందరగా వచ్చి రావణుని సంహరించి నన్ను చేకొని పొమ్మని" మీకు చెప్పుమని నన్ను మరి మరి కోరినది.

"ప్రభూ! ఆ తల్లి దుఃఖము సహించలేకపోతిని" అనుచు హనుమంతుడు తన దోసిలిలో ముఖమును కప్పుకొని భోరున యేడ్చెను.

రాముడు హనుమంతుని దుఃఖమును చూచి "సీతను తలచుకొని' చూడామణి చూచి సీతను చూచినట్లుగానే భ్రమించి విలపించసాగెను. ఆపుకోలేనంత దుఃఖముతో అతడు ఏడ్చి ఏడ్చి మూర్ఛిల్లెను. వారిద్దరి దుఃఖమును చూచి, లక్ష్మణుడు కూడా దుఃఖించెను. ఆ దృశ్యమును చూచిన వానరులందరు ఏడ్చిరి.

కొంతసేపటికి రామచంద్రుడు దుఃఖము నుండి తేరుకొని "ఆగ్రహోదగ్రుడై" లక్ష్మణా! ధనుర్బాణములను తెమ్ము. ఇప్పుడే లంకను నాశన మొనర్చి నా సీతను తెచ్చుకొందును. ఆ రావణ హతకుడు రెండు నెలలలో నా సీతను చంపునట. నేను వెంటనే లంకకు వెళ్ళి, సీతను చూడవలెను. ఎవరు అడ్డము వచ్చినను ఉపేక్షింపను" అనెను.

శ్రీరామచంద్రుని కోపాతిరేకాన్ని చూచి, అందరూ భయంతో వణికి పోయినారు.

సుగ్రీవుడు శ్రీరామచంద్రుని శాంతపరచి యిట్లనెను "రామా! అందరమును కలిసివెళ్ళి, రావణుని సంహరించి సీతాదేవిని తెచ్చుటకు ఉద్యమించుదుము. సముద్రమును దాటుట ఎటులనో ఆలోచించుదము.

సుగ్రీవుని మాటలకు రాముడు శాంతపడెను.

తరువాత రామలక్ష్మణులు, సుగ్రీవుడు, యువరాజైన అంగదుడు ఋక్షరాజైన జాంబవంతుడు, హనుమంతుడు, నీలుడు, నలుడు, సుషేణుడు మొదలైన వానరవీరులంతా కలిసి దక్షిణసముద్రపు ఒడ్డునకు చేరిరి.

సుందరకాండము సమాప్తము.

# యుద్ధ కాండము

## శ్రీరాముడు వానర సైన్యముతో లంకకు ప్రయాణమగుట

హనుమంతుని ద్వారా సీతాదేవి వృత్తాంతమును విని శ్రీరామ చంద్రుడు మాటిమాటికి ఆమెను తలచుకొని విలపించుచుండెను. హనుమంతుడు యిచ్చిన చూడామణిని చూచుకొని పట్టలేని దుఃఖము పొందైనాడు. సుగ్రీవుడు రాముని చెంతకు వచ్చి, రామప్రభూ! మనము దుఃఖించుచు ఇచటనే యుండిన ప్రయోజనమేమియు లేదు. తొందరగా మనము, తగినంత సైన్యమును సమకూర్చుకొని, లంకకుచేరి రావణుని సమూలముగా సంహరించే సీతాదేవిని తెచ్చుట మన కర్తవ్యము.

రాముడు వెంటనే తన మిత్రుడైన సుగ్రీవుని మాటలువిని "మిత్రమా! నీవు అన్నది నిజమే. మనము నూరు యోజనముల సముద్రమును ఎట్లు దాటగలము? అని సందేహమును వెలిబుచ్చెను.

అందులకు సుగ్రీవుడు "రామా! నీవు సముద్రుని ప్రార్థించిన్ల సముద్రుడు కనికరించి మనకు తప్పకదారియిచ్చును."

సుగ్రీవుని మాటలను శ్రీరాముడు ఆలకించెను.

పిమ్మట రామలక్ష్మణులు వానర వీరులతో సంభాషించనెంచి, హనుమంతునితో ఇట్లు సంభాషించెను.

"హనుమా! లంకాపురి సంగతి మనసుకు వచ్చినది. నేను దానిని ముట్టడించి సమస్త సంహారముచేసి ఎప్పుడు సీతను తెచ్చుకొందునా యని మనసు తొందరపడుచున్నది" అని. చెంతనున్న సుగ్రీవుని వైపుచూచి, "సుగ్రీవా! ఇదియే లంకను చేరుటకు మనకు మంచి

ముహూర్తము. సూర్యుడు ఆకాశ మధ్యమునకు చేరుకున్నాడు. ఇది అభిజిన్ముహూర్తము. నాకు సాధన తార. ఉత్తర ఫల్గుణీ నక్షత్రము. ఇది జయ సూచకము. రేపు హస్త అది ప్రతికూల ఫలము నిచ్చునది. మనమిప్పుడే బయలుదేరవలెను. మంచి శకునములు కలుగు చున్నవి.

సుగ్రీవుని పనుపుమేరకు సేన లంకాపురము వైపుకు తరలుటకు సిద్ధమైనది. రాముడు సైన్య విభాగమును చేసి, సుగ్రీవునితో ఇట్లు చెప్పెను. నీలుడు శక్తివంతులైన వానర వీరులను వెంటబెట్టుకొని దారి చూపుచు ముందుకు నడుపుము. చల్లని నీడలు నిచ్చు చెట్లు గల దట్టమైన అడవులగుండా మంచినీరు లభించు మార్గము చూచి సేనను నడిపించుము. దారిలో మనకు హాని కలిగించు శత్రు బలములు పొంచి యుండవచ్చును. అప్రమత్తులై చూచి నడచుట ముఖ్యము. సేనలో చేతకాని వారిని ఆపివేయుము. బలవంతులనే ముందుకు నడిపించుము. గజుడు, గవయుడు, గవాక్షుడు ముందుగాను, ఋషభుడు కుడిప్రక్క గంధ మాధనుడు ఎడమ ప్రక్కన నడచు చుందురు. నేను హనుమంతుని భుజమునెక్కి సేన మధ్యలో నుందును. లక్ష్మణుడు అంగదుని భుజముపైనెక్కి రాగలడు. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి ఈ ముగ్గురూ సైన్యము వెనుక భాగమున రాగలరు.

రాముని పథకమునకు, సుగ్రీవుడు సంతోషించి, వానరసైన్యంను బయలుదేరుటకు ఆజ్ఞాపించెను, వానరులందరు అత్యంతోత్సాహముతో వారు గంతులు వేయుచు, ఎగురుచు, సింహనాదముచేయుచు, మధ్య మధ్య చెట్లకొమ్మలకు గల ఫలములను, తేనియను త్రాపుచు, ఆడుచు పాడుచు ప్రయాణమై వెళ్ళుచుండిరి. వానర సైన్యమంతయు అడవిలో సముద్రము వలె కనబడుచుండినది.

ఇదంతా చూచిన లక్ష్మణునికి పట్టరాని సంతోషము కలిగినది. "రామా! శీఘ్ర కాలముననే నీవు సీతాదేవిని గూడి అయోధ్య వెళ్ళ

గలము. ఆకాశమునను, భూమియందును శుభశకునములు కనపడు చున్నవి. మన యిక్ష్వాకుల నక్షత్రమైన 'విశాఖ' నిర్మలముగా ప్రకాశించుచున్నది. దీనిని బట్టి మనము దుఃఖమును వీడి, జయోత్సాహులమై మరలివత్తుమనుటకు సందేహము లేదు. సేన అంతయు జయోత్సాహముతోనే ముందుకు నడచుచున్నది."

లక్ష్మణుడిట్లు మాటలాడుచుండగనే సైన్యము సముద్రముదాపున గల మహేంద్ర పర్వతమునకు చేరినది.

## వానర సేనతో రాముడు సముద్ర తీరమున విడిదిచేయుట

గంభీరమైన అలలతో, హోరెత్తునినాదముతో నురగలు గ్రక్కుచున్న సముద్రమును చూచి భీతి చెందిరి. వారు సముద్రమునకు ఆవలి తీరమున్నట్లుగా చూడజాలరైరి. దానిని యెచటినుండి దాటి ప్రయాణము చేయవలెనో తెలియకున్నది.

సేనాధిపతియైన నీలుడు సైన్యమును ఆపినాడు.

శ్రీరాముని హృదయము శోకముతో సీతవైపునకు మరలినది. అతడు మదన పీడితుడై వియోగ దుఃఖముననుభవించుచు "లక్ష్మణా! కాలము గడచినచో శోకము తగ్గిపోవునని పెద్దలు చెప్పుదురు. నాకు మాత్రము సీతను చూడనందులకు శోకము వృద్ధియగుచున్నదేగాని తగ్గుటలేదు.

సీత దూరదేశమునందున్నదనిగాని, సీతను రాక్షసుడపహరించినాడని గాని దుఃఖపడుటలేదు. సీత యౌవ్వనము తరిగిపోవుచున్నదని మాత్రము విచారించుచున్నాను.

"వాయుదేవుడా! నీవు ప్రియురాలిచెంతకు వెళ్ళి, ఆమెను స్పృజించి తిరిగి నన్ను స్పృజించితివేని, నేను నా ప్రియురాలిని స్పృశించినట్లే సంతోషించెదను. ఇక్కడ, అక్కడ సమానముగ ప్రకాశించు చంద్రుడు మా చూపులకు సమాగమ సన్నివేశమును సమకూర్చగలడు."

అని భావగర్భితముగ పరిపరివిధముల తలపోయుచున్న రాముని లక్ష్మణుడు ఊరడించెను. ఇంతలో సూర్యాస్తమయమైనది.

రామలక్ష్మణులు సంధ్యావిధులు నిర్వర్తించి ఆరాత్రి ఆ సైన్యంతో కూడి, దర్భలను పరచుకొని విశ్రమించిరి.

## సభలో రావణుడు

హనుమంతుడు సలిపిన లంకా దహన కృత్యమును తలచి రావణుడు సిగ్గుపడి తలను వంచి, సాలోచనగా సభలో మంత్రులను గూడియుండెను. కొంతసేపటికి తలయెత్తి మంత్రులతో "మంత్రులారా! ఒక వానరుడు మన లంకలోనికి ప్రవేశించి, సీతను జూచి, మన వారి నెందరెనో వధించినాడు. పట్టణమంతయు నిర్గోమధామము చేసినాడు. ఇప్పుడు మన కర్తవ్యమును గూర్చి ఆలోచించవలసిన సమయము వచ్చినది. అన్న రావణుని మాటలకు విభీషణుడు లేచి "అన్నా! నీవు పెద్దవాడివి. సకల శాస్త్రవేత్తవు. మహా పండితుడవు. నేను నీకు ధర్మ శాస్త్ర విషయములు చెప్పదగినవాడను కాదు. అయినను ఒక మాట చెప్పెదను. సావధానుడవై వినవలసినది. "పరమపావని, మహా పతివ్రతయైన సీతాదేవిని అధర్మపరుడవై అపహరించి తెచ్చినావు- కూడని పని చేసిన నీవు నీ తప్పును తెలుసుకొని, నీ శాస్త్ర విపశ్చిత్వ మును, ధర్మ పరత్వమును స్మృతి పథమునకు తెచ్చుకొని సీతను, ఆమె భర్త లోకైక ధానుష్కుడు, మహావీరుడు ఇక్ష్వాకు వంశ ప్రభువు ఐన శ్రీరామచంద్రునకు ఇచ్చి క్షమింపుమనుము. ఆతడు క్షమామూర్తి. తప్పక క్షమించి, నిన్ను, నీ వారిని, ఈ లంకా రాజ్య మును నాశనము చేయక విడుచును. లేకున్న సకల సంపదలతోను, వైభవముతోను తులతూగుచున్న ఈ లంకా రాజ్యము సర్వనాశనము కాగలదు."

విభీషణుని మాటలు విని రావణుడు పట్టరాని ఆగ్రహముతో నాకు ఎదురుచెప్పు నీవు ఇతరుడవైనచో ఇప్పుడే నా కరవాలముచే

నిహతుడవై యమపురికి పోయెడివాడవు. నా తమ్ముడవగుటచే బ్రతికి పోయితివి. ఆనాడు ఆ కోతి వచ్చి, సభలో నాకు వ్యతిరేకముగ అవాక్యములు పలుకునప్పుడు కూడ నీ విట్లే నాకు ఎదురుచెప్పి, దూతను చంపవలదని, శాస్త్ర వచనములు వల్లించినావు. నీవన్నట్లు శాస్త్రము మాట యటుంచి, ఆనాడు నీ మాటలను మన్నించి, ఆ కోతికి అగ్ని శిక్ష విధించినపుడు లంకను యావత్తు కాల్చివేసి, బుగ్గి చేసినాడు. అది చాలక ఇప్పుడును, శత్రు పక్షమునే పలుకుచు నన్ను పెడ మార్గమును పట్టించుచున్నావు. సభలో మిగిలిన ఈ రాక్షస ముఖ్యులను చివరకు అనుంగు సోదరుడైన కుంభకర్ణుని కూడ ఎగ ద్రోసినావు. కాని కుంభకర్ణుడు పశ్చాత్తాపపడి, మరల నాకు విధేయుడై రామునితో యుద్ధము చేయుటలో నాకు పూర్తిగ సహకరింతునని చెప్పినాడు.

విభీషణా! వినుము. ఏది ఏమైనను నేను సీతను విడిచిపెట్టను. పిరికిపందనై రాముని వద్దకు వెళ్ళి, తప్పు చేసితినని క్షమాభిక్ష వేడను. అదియును గాక మానవమాత్రుడైన రాముని శరణు వేడుటకంటే నీచ కార్యము వేరొకటి యుండదు. దానికంటే మరణమే మేలు.''

విభీషణుడు, అన్న మూర్ఖత్వమునకు మండిపడి కోపముతో ఇట్లు పలికెను. ''అన్నా! రావణా! నీ కంటె నా కధికులు లేరు. అగ్రజుడవు. ఈ సమస్త రాక్షస రాజ్యమునకు అధినాథుడవుగ నీ పరిపాలనము ఎంతయు నిష్కంటకముగా సాగుచున్నది. అట్టి నీవు మొండితనముతో యుచితానుచితములు విచారించకుండా ప్రాకృతునివలె, సీతను అపహ రించి తెచ్చితివి. ఈ రాక్షస రాజ్యమునంతటిని అహర్నిశలు రక్షించు బాధ్యత నీది. ధర్మ, అర్థ, కామములు అధర్మయుక్తముగ సంపా

దించుట నీ వంటి బుద్ధిమంతులు చేయదగిన పనికాదు." నీ వంటి దురాత్ముని కొలువులో ఉండి నీ పాపఫలములో భాగస్వాముడనగుట నా కెంత మాత్రము సమ్మతము కాదు. నేనిదే, నీ రాజ్యమును వదిలి వెళ్ళుచున్నాను. ఇక నీవు, నీ పరివారము, రాక్షసానీకము, లంకా నగరము బలీయమైన విధికీ, విపత్తుకు వశము."

అనుచు విభీషణుడు రుసరుస ఆ సభలోనుండి బయటికి వెడలి పోయెను.

## విభీషణుడు శ్రీరాముని శరణు వేడుట

రావణ చేష్టలకు నిరసనగా సభనుండి నిష్క్రమించిన విభీషణుడు తనకు సన్నిహితులైన నలుగురు రాక్షస ముఖ్యులతో సముద్రతీరము చేరి, రివ్వున పైకెగిరి ఆకాశమార్గమున ప్రయాణించి, ఆవలి యొడ్డున రాముడు విడిదిచేసియున్న గగన తలంపై నిలిచి, క్రిందకు పరికించి చూచెను. వానరులు వారిని చూచినారు. హనుమంతుడు మున్నగు వానరులతో సుగ్రీవుడు "ఆ వచ్చినవారు మనకు శత్రువులు రాక్షసులు. మనలను వధించుటకే వచ్చినారు" అనగానే హనుమంతుడు మాత్రము సరికాదన్నాడు. సుగ్రీవుని మాటలు వినినతోడనే వానరులు ఆ వచ్చిన పై వారిని పైననే చంపివేయుటకు రాళ్ళను, చెట్లను పెరికి వారిపైకి పోవుటకు ఉద్యుక్తులగుచుండిరి. అప్పుడు విభీషణుడు సుగ్రీవుని జూచి "వానరేశ్వరా! నేను రావణుని తమ్ముడను. నా పేరు విభీషణుడు. సీతాదేవిని రావణుడు లంకలో బంధించి, రాక్షస స్త్రీలను కావలి యుంచినాడు. సీతాదేవిని రామునికి సమర్పించమని యెంత గానో వివరించి చెప్పినాను. నేను చెప్పిన హితోక్తిని రావణుడు వినలేదు. పైగా నన్ను అతినీచముగా నిందించి, అవమానించినాడు. ఆ కారణమున నేను నా భార్యా పుత్రులను, నివాసమును వదిలి, శ్రీరామచంద్రుని శరణుగోరి వచ్చినాను. నన్ను శత్రు పక్షమువానిగా తలపకు. రామచంద్రునకు నా రాకను తెలియపరచండి. నేను ఆ మహాత్ముని శరణుగోరి వచ్చినాను"

ఆ మాట సుగ్రీవుని మంత్రులు రాముని వద్దకుపోయి చెప్పినారు.

అంత రాముడు, సుగ్రీవుడు, సుషేణుడు, అంగదుడు, హనుమంతుడు వారలందరి అభిప్రాయములను అడిగి తెలుసుకున్నాడు.

హనుమంతుడుతప్ప, తక్కిన వారందరు ఇంచుమించు త్వరపడి "శత్రుపక్షమువారికి శరణు నొసంగుట మంచిదికాదు" అన్నారు. హనుమంతుడు మాత్రము యుక్తి యుక్తముగా తగిన సమాధానము చెప్పినాడు.

"విభీషణుడు మనకు మిత్రుడుకాని శత్రువుకాదు. రాజ్యకాంక్ష కోసమో, ధర్మము కోసమో మనవద్దకు వచ్చినాడు. అందువలన అతని వలన రావణుని ఉద్దేశ్యము తెలుసుకొనవచ్చును. ఎవరితోనైనను మాట్లాడిన తరువాతనేకదా! అతడు శత్రువైనది, మిత్రుడైనది తెలుసుకొనగలుగునది. అతని ముఖకవళికలనుబట్టి చూడ నిశ్చయముగా తనకు రావణుని వలన రక్షణ కోరియే వచ్చినాడు. ఇప్పుడతని మనసులో స్వీయ రక్షణ, రాక్షస రక్షణము, లంకాపుర రక్షణము అను బాధ్యత నెలకొని యుండవచ్చును. విభీషణునికి మన బలము, బాగుగా తెలియును" అని చెప్పినాడు.

శ్రీరాముడు హనుమంతుని అభిప్రాయమును విని, "సుగ్రీవా! వింటివా హనుమంతుని అభిప్రాయము. నీవు చెప్పినది కొంతవరకు సరియైనదే. ఇంతను జాంబవంతుడు, అంగదుడు మున్నగు మనవారు చెప్పిన అభిప్రాయములను విన్నాను. మనవారి సూచనలన్నిటిని విన్నాను. కాని నేను చెప్పు విషయమునుకూడ మీరు సావధానులై వినుడు.

"మిత్రమా! ఎవరు ఎటువంటి వారైనా నన్ను శరణుజొచ్చిన వారిని రక్షించుట నా ధర్మము. సాక్షాత్తు ఆ రావణుడే వచ్చి, నన్ను శరణు వేడిన తప్పక రక్షింతును. విభీషణుడు నన్ను శరణుకోరి, నా ఆజ్ఞకై వేచి యున్నాడు. సుగ్రీవా! నీవు వెళ్ళి విభీషణుని తీసుకుని రమ్ము"

సుగ్రీవునితో విభీషణుడు రామలక్ష్మణుల వద్దకు వచ్చి, నమస్కరించి.

"రామా! నేను రావణుని తమ్ముడను. విభీషణుడను. మా అన్న దుర్మార్గుడు రావణుడు సీతాదేవిని నిర్బంధించి బాధించుచున్నాడు. నేను చెప్పిన హితోక్తులను వినుటలేదు. ధర్మహంతయైన మా అన్నను త్యజించి, మీ సన్నిధికివచ్చి శరణు వేడుచున్నాను. రామా! రక్షింపుము" అని రాముని పాదములకు నమస్కరించెను.

శ్రీరాముడు విభీషణుని లేవనెత్తి అభయమిచ్చెను.

## విభీషణ పట్టాభిషేకము

రామచంద్రుడు "విభీషణా! నిన్నిప్పుడే లంకా రాజ్యమునకు ఇచటనే పట్టాభిషిక్తుడిని చేస్తున్నాను" అని వానరులచేత పుణ్యనదీ జలాలను, సముద్ర జలాలను తెప్పించి, విభీషణుని లంకా రాజ్యమునకు పట్టాభిషిక్తుణ్ణి చేసెను. "లక్ష్మణా! నాకు నీవు, భరత, శత్రుఘ్నులు ఎంతో ఈ విభీషణుడు అంతియే అని విభీషణునికి ధైర్యము చెప్పి గౌరవించెను.

విభీషణుడు అతని నలుగురు సహచరులు, సుగ్రీవుడు, అతని సచివులు, రామలక్ష్మణులు, ఇక సముద్రమును ఎట్లు దాటవలెనని" యాలోచించుచుండిరి.

రాముడు సముద్రుని యథావిధిగ పూజించి ప్రార్థించెను. 'ఓ సముద్రుడా! నేను సూర్యవంశమున జన్మించిన రఘురాముడను. దుర్మార్గుడగు లంకాధిపతి రావణుని జయించి, అతడు నిర్బంధించి యున్న నా యనుంగు భార్యను తెచ్చుకొనుటకు వానర సహాయుడనై లంకకు చేరు నిమిత్తము వచ్చియుంటిని. నీవు దారి యిచ్చిన మిక్కిలి కృతజ్ఞుడను" అని ప్రార్థించెను.

కాని సముద్రుడు ఏమాత్రము కరుణించలేదు. విపరీతమైన నురుగులు, తరంగములతో ఘోషిల్లుతు ఉప్పొంగుచుండెను. అయినను రాముడు శాంతముగనే దర్భలను పరచుకొని దానిపై కూర్చుండెను. "సముద్రుడా! నీవు ప్రసన్నుడవగుపరకు నేను ఈ దర్భలపైననే కూర్చొని యుందును."

శ్రీరాముడట్లు మూడురాత్రులు కూర్చుండి ఎంత ప్రార్థించినను సముద్రుడు ఉద్ధృతిని తగ్గించలేదు. ప్రత్యక్షము కాలేదు. రామచంద్రునికి పట్టరాని ఆగ్రహము వచ్చినది. కోపముతో లేచి "లక్ష్మణా! నేను ఈ సముద్రుని ఎంత ప్రార్థించినను అహంభావముచే నాకు ప్రసన్నుడగుట లేదు. ఇప్పుడే ఈ యహంభావి గర్వమణగించుదును. ధనుర్బాణములిటు తెమ్ము. ఈ సముద్రమున ఒక్క జలబిందువేని లేకుండ ఇంకింపజేతును." అని, లక్ష్మణుడందించిన వింటిపై బాణమును సంధించి, విడుచుటకు సంసిద్ధుడాయెను.

అంత సముద్రుడు గడగడ వణకుచు, దీనావదనుడై రాముని ఎదురుగా నిలిచి, "రామా! నన్ను క్షమింపుము. పొంగుట నా నైజ స్థితి కదా! ఎంత నిగ్రహించుకొన్నను నా తరంగ తీవ్రతను, ఆప జాలకున్నాను. మీరు శాంతించి అనుజ్ఞ నిచ్చిన, మీ యనుగ్రహముచే పాటింతును. మిమ్ములను నమ్ముకొనకపోయిన నాకు మనుగడ ఎక్కడిది? మీ శరణాగతుడను.

శ్రీరాముడు శాంతించి "సముద్రుడా! నాకును, నా సేనకును, లంకకు చేరుటకు దారినిమ్ము" అని అడిగెను.

రాముని ప్రార్థనను విని సముద్రుడు "రామా! లోతైన సాగరములో ఎన్నో జలచరములు, అపారమైన రత్నరాశులు, పర్వతాలు ఉన్నవి. అందువలన మీరు నా దారిన వెళ్ళుట కష్టము. నా పైననే మీరు వారధిని నిర్మించుకొని ఆవలి తీరము చేరుడు" అని చెప్పెను.

అయితే నాచే ఎక్కుపెట్టబడిన ఈ అమోఘమైన బాణమును విడుచుట ఎట్లు?" అని రాముడు సముద్రుని అడుగగా-

"రామచంద్రా! ఈ బాణమును ఉత్తర దిశయందు "ద్రుమకుల్య" అను ప్రదేశమున్నది. అది నాకు సంబంధించినదే. అచ్చట కొందరు దుర్మార్గులు నా నీటిని త్రాగుచున్నారు. నీవు బాణమును వారిపై వేయుము."

రాముడు బాణమును వదిలెను. ఈ బాణము పడిన ప్రాంతము "మీరు కాంతారము" రాముని వరముచే అది సమస్త సంపదలకు నిలయమై విరాజిల్లినది.

సముద్రుడు, తనపై విశ్వకర్మ కుమారుడు నలుడు వారధి నిర్మాణంలో దక్షుడు. అతడు ముఖ్యుడుగ వానరులు నాపై సేతువు నిర్మింతురేని, ఆ సేతువునుండి మీరు లంకా పట్టణము చేరగలరు.

నలుడు రామునితో "రామచంద్రా! సముద్రుడు చెప్పినది నిజము. నాకు నా తండ్రియైన 'విశ్వకర్మ' అనుగ్రహముచే అంతటి శక్తి కలదు. నేను తప్పక వారధిని నిర్మింతును. మీరు నిశ్చింతగ నుండుడు."

నలుడు రాముని యనుజ్ఞచే సేతు నిర్మాణము మొదలిడెను.

# సముద్రముపై వారధి

సముద్రుడు నలుని పిలిచి, "నలుడా! నీ చేతితో నా జలములపై పెద్ద పెద్ద బండలను, చెట్లను వేయుము. వానరులు వాటిని నీకు తెచ్చి అందించెదరు. ఆ రాళ్ళు చెట్లు నీటిపై మునుగవు." అని చెప్పి, రాముని వద్ద సెలవు తీసుకొని వెళ్ళినాడు. శ్రీరామచంద్రుడు, వారధి కట్టుటకు వానరులను ఆజ్ఞాపించెను. నలునిచే పెద్ద పెద్ద బండరాళ్ళను తెప్పించి సముద్రమున వేయించెను. అవి సముద్రపు నీటిపై తేలియాడినవి. అట్లే తక్కిన వానర వీరులందరూ సేతువు నిర్మాణమునకు వలసిన రాళ్ళను, చిన్న చిన్న గుట్టలను, పచ్చిక దిబ్బలను, పెద్ద పెద్ద వృక్షములను తీసుకొని వచ్చి నలుని ద్వారా సముద్రమున వేయించిరి. ఆ విధముగ వారధి నిర్మాణము మొదలైనది. ప్రతి బండరాయిపై 'రామ' యనెడి నామము వ్రాయబడినది.

మొత్తము ఆరురోజులలో వారధి నిర్మాణము పూర్తియైనది. ఆ వారధి పదియోజనముల వెడల్పు, నూరు యోజనములనిడివి గలిగినదిగా నిర్మింపబడెను. ఈ అద్భుత కార్యమును చూచి దేవతలు సంతోషపడిరి.

సేతువును నిర్మించిన సమయములోనే అసంఖ్యాకులైన వానరులు సముద్రము కావలి తీరమును చేరినారు. సుగ్రీవుడు రామునితో "రామచంద్రా! నీవు హనుమంతుని పైనను, లక్ష్మణుడు అంగదుని పైనను అధిరోహించి ఆకాశమార్గమున నడువుడి."

సుగ్రీవుని సూచన ప్రకారము సేనకదలినది. సుగ్రీవుడు, రామ లక్ష్మణులు సేనకు ముందు భాగమున నుండి కదలినారు.

సేన నూరు యోజనముల సముద్రమును దాటి, దక్షిణ తీరము చేరినది.

వారి సంచలన ధ్వనులు సముద్ర ఘోషవలె లంక నలు దిక్కుల నినదింపసాగినది. నేలయీనినట్లున్న ఆ అంతులేని వానర సైన్యమును చూచి రాముడెంతయో సంతోషించినాడు.

"లక్ష్మణా! మనకిప్పుడు మంచి శకునములే కలుగుచున్నది. కావున విజయమే జరుగును. కాని పరిస్థితులను బట్టి చూడ యుద్ధములో మన సేనయందు కూడ ఎక్కువ నష్టము జరుగునట్లు కనిపించుచున్నది.

ఇప్పుడే సేనను మంచి ఫలవృక్షములు, జలములుగల సువిశాల మైన స్థలమున విడిది చేయించవలసియున్నది. అక్కడ విడిది చేసిన తరువాత యుద్ధమునకు తగిన వ్యూహరచన చేయుదము."

లక్ష్మణుని సూచనపై వానరసేన లంక కభిముఖముగా కొంత దూరము పోయిన తరువాత లంకా పట్టణము నుండి వెలువడిన భేరీమృదంగ వాద్య ధ్వనులు వారికి వినిపించినవి. అవి విని వానరులు కూడ శ్రవణపుట భేదనములైన భయంకర గర్జనలు చేసినారు. వారు ఒక చోట విడిది చేసిరి.

అంత రామలక్ష్మణులు తమకుగల యావత్ సైన్యమును విభజించి వ్యూహరచన గావించినారు.

## శు క సా ర ణు లు

తరువాత లోగడ వానరులు బంధించి యుంచిన రావణుని చారులు శుక సారణులను వారులను శ్రీరాముని యాదేశముపై వదిలినారు.

వదిలినదే తడవుగ శుకుడు రావణుని యొద్దకుపోయి, రాముని బలశౌర్యాదులను, వానర సేనను గురించి వివరించి చెప్పెను.

"మహాప్రభూ! మేమిచటినుండి తమయాజ్ఞచొప్పున వానరసైన్యములో ప్రవేశించిన తరువాత విభీషణుడు మమ్ము గుర్తించి పట్టుకొన్నాడు. రాముని దయవలన మేము ప్రాణములతో బ్రతికినాము. సుగ్రీవుడు, రామలక్ష్మణులు, విభీషణుడు ఈ నలువురు ఒకచోట కూడినారు. సైన్య సహాయములేకయే వారు లంకను కూల్చగలరు. అంతెందుకు ఒక్క శ్రీరాముడు చాలుననిపించుచున్నది. వానరులు లంకవరకు సేతువు కట్టినారు. వారు దాని ద్వారా సముద్రమును దాటి మనకు చేరువలో విడిదిచేసి యున్నారు. ఈ దశలో సీతను అప్పగించుటయే మేలనిపించుచున్నది.

రావణుడు ఆ వార్తవిని ఒకింత భయముతో వణకినను గంభీరముగ మాటలాడుచు ఇంతవరకు వచ్చిన తరువాత రాముని, అతనిలో తమ్ముడు లక్ష్మణుని వారి సేనాబలగమును ప్రాణములతో వదలను. రాముడు తెగించి యుద్ధమునకు వచ్చినాడు. అతనిని నేనును తెగించియే తెగటార్తును.

"శుకసారణులారా! దేవగంధర్వాదులు సయితము రామునికి సహాయులై వచ్చిన వత్తురుగాక. వారికి భయపడి 'సీతకు' అప్పగించను-" అని రావణుడు వానరబలగమును, చూచుటకై ఒక రాజప్రాసాదమును ఎక్కిచూచెను. శుకసారణులు అతనివెంట వెడలిరి.

రాజప్రాసాదమునుండి దూరముగ విడిదిచేసి యున్న వానరసేనను చూచి, సారణునితో "సారణా! ఆవీరులలో ఎవరెవరు? వారి పేర్లను చెప్పుము" అనెను.

సారణుడు రావణునికి, వానరసేన విడుదుల నుండియే వివిధ పనులను నెరవేర్చుచున్న నీలుని, అంగదుని, నీలుని, శ్వేతుని, కుముదుని, రంభుని, శరభుని, పనసుని, గయుడు, వినతుడు మున్నగు వారిని వారి శక్తియుక్తులను పరిచయము చేసెను. పిమ్మట అదిగో నీలమేఘశ్యాముని ప్రక్కన సుగ్రీవుడని వారి సమీపములో నున్న

వీరుడు హనుమంతుడనియు, అతడు వానరప్రభువు సుగ్రీవుడని,- రాముని కుడివైపున కూర్చున్న యోధుడు, బంగారు ఛాయ గలవాడు లక్ష్మణుడని, పరిచయము చేసెను.

అతడు వానరవీరుల ఒక్కొక్కరి ప్రబలమైన బలపరాక్రమము లను గురించి, రావణునకు విశదముగ వివరించి, రాజా! మనకంటె, వేలరెట్లు బలవంతుడైన శత్రువుతో యుద్ధమునకు తలపడుట అంత మంచిదికాదని తోచుచున్నది. బలవద్విరోధము, ఎంతటి వారికైనను ధన, ప్రాణ, మానహానులను కలిగించును. సామాన్యముగ శత్రువును సామ, దాన, భేద, దండోపాయములను నాలుగువిధములైన పద్ధతు లనుపయోగించి లొంగదీయవచ్చును. కాని ఈ రాముని గానీ అతని యనుచరుడైన సుగ్రీవునిగానీ, అతనిసేనను గానీ, కడుకు మీ తమ్ముడు విభీషణునిగానీ యీ నాలుగు విధములైన యుపాయములచే సాధింపలేము'' అని పలికిరి.

తనకు ఆప్తులు, నమ్మిన మంత్రులైన శుకసారణులు, తనకు వ్యతిరేకముగ, శత్రుపక్షమున కనుకూలముగ మాట్లాడుటను చూచి రావణుడు సహించలేక పోయెను. అతడు నిప్పులు త్రొక్కిన వానివలె కోపముతో ఎగిరిపడుతూ ''మూర్ఖులారా! మీరు నావారనుకొని, మంత్రి పదవులలో చేర్చుకొన్నాను. కాని తేనె పూసిన కత్తులని ఇప్పుడు మీ మాటవలన తెలియవచ్చుచున్నది. నన్ను నిరసించి, శత్రువును భూషించుట రాజద్రోహము. మీరు నా కొలువున నుండదగరు. పొండు ఇక్కడ నుండి నాకంట పడితిరా? మిమ్మేమి చేసెదనో ఇప్పుడు చెప్ప లేను.

కోపముతో ఆపాదమస్తకము కంపించిపోతూ పరుషము లాడు చున్న రావణుని యెదుట యుండవలదని భావించి, శుకసారణులక్కడ నుండి వెడలిపోయినారు,

తరువాత రావణుడు రాముడు సేనతో విడిదిచేసిన ప్రాంతము నకు వారి అనుపానులను, స్థావర రహస్యములను తెలుసుకొని రమ్మని శార్దూలుడు మొదలైన రక్కసి గూఢచారులను పంపినారు. వారును శుకసారణుల వంటి సమాచారమునే తెచ్చి, రావణుని ధైర్యమును మరింత సడలింపజేసినారు. ధైర్యస్థయిర్యములు సన్నగిల్లిన కొలది' అతనిలో కోపము అగ్నిశిఖవలె ప్రకోపించి, ప్రజ్వరిల్ల జొచ్చినది. ఎట్లో దిగమ్రింగుకొని, రుసరుస అంతఃపురము నందలి రహస్య మందిరమును ప్రవేశించి అక్కడి వారలచే మంత్రులను పిలిపించి, వారితో ఏవో సంప్రదింపులు జరిపి, విద్యుజ్జిహ్వుడు అనువానిని పిలిపించుకొన్నాడు.

## శ్రీరాముడు చనిపోయెనని రావణుడు సీతాదేవికి చెప్పుట

మాయావియైన "విద్యుజ్జిహ్వుడు" రావణుని వద్దకు వచ్చి నమస్కరించినాడు. రావణుడతనితో ఓయీ! ఇక సీతను మోసగించి యైనను నా భార్యను చేసుకొనవలయును. అందుకని నీ సహాయ మవసరము, నీవు నీ మాయా విద్యచే రాముని శిరస్సును, ధనుర్బాణములను సృజించి, వానితో నావెంట రమ్ము.

విద్యుజిహ్వుడట్లేచేసి, రాముని తలను ధనుర్బాణములను తీసుకొని, రావణుని వెంట సీతయున్న అశోక వనమునకు చేరెను. రావణుడు తనలో లేని ఉత్సాహమును, ధైర్యమును తెచ్చుకొని సీతతో యిట్లనెను.

"సీతా! నీవు యింత కాలము ఎవరిని నమ్ముకొని యున్నావో, ఎవని కారణమున నాకు వశమగాక యున్నావో, ఆ నీ రాముడు

యుద్ధమున మరణించినాడు. నీ యహంకారము అణగిపోయినది. ఇకపై నిన్ను నేను నా భార్యవు కమ్మని యర్థించవలసినపనిలేదు. నీ దుఃఖమే నిన్ను నా భార్యగా చేసినది.

సీతా! భర్త పోయెనని దుఃఖింపకుము. భర్తను కాపగిన నేను నీ చెంతనే యున్నాను. కావున నన్ను వరించి సుఖించుము.

నేలమీద పడియున్న రాముని శిరస్సును, ధనుర్బాణములను చూచి, ఇవి నిజముగ రామునివే యని భావించి కన్నీరు మున్నీరుగా యేడ్వజొచ్చినది. శిరస్సునందు చూడామణి సైతమున్నది. శిరోజములు చూడామణి, ముఖవర్ణము, నేత్రములు ధనుర్బాణములు అన్నియు శ్రీరామునివే.

సీత కన్నీరు మున్నీరుగా విలపించుచు "కైకేయీ! నీ కోరిక తీరినది కదమ్మా! నా రామచంద్రుడు నీకేమి కీడు చేసెనని అడవికి పంపితివి?" అని దుఃఖాతిరేకముచే మూర్ఛనొంది నేలపై బడినది. కొంతసేపటికి మరల మూర్ఛదేరి విల విల విలపించినది.

అంతలో, ఒక వనపాలకుడు వచ్చి "రాజా! సేనాధిపతి ప్రహస్తుడు, తక్కిన మంత్రులందరు మీకై వేచియున్నారు. మీతో అత్యవసరమైన సంప్రదింపులు జరుపవలసి యున్నది." అని చెప్పెను.

రావణుడు అచటినుండి వెళ్ళిపోయినాడు. ఇంతలో సీత యెదుట నేలమీద పడియున్న రాముని మాయశిరస్సు, మాయ ధనుర్బాణములు మాయమైపోయినవి.

సీతకు కాపలాగా ఉన్న సరసు అనే రాక్షస స్త్రీ, సీత వద్దకు వచ్చి, 'ఇదియంతయు రాక్షసమాయ. శ్రీరాముడు, అతని సహాయులుగ కోట్లాది వానర సైన్యము సముద్ర తీరమున వచ్చి విడిదిచేసి యున్నది. నేడో రేపో రాముడు అపారమైన కపిసేనతో లంకను ముట్టడించి, రావణుని యుద్ధమున వధించి, నిన్ను పొందగలడు. నీవు విచారింపకుము. దుఃఖింపకుము." అని చెప్పి, సీతా! నీవు పొమ్మనెదవేని, నేను ఇప్పుడే ఆకాశమార్గమున పోయి రాముని సన్నిధిలో

దిగి, నీ వృత్తాంతమును చెప్పి, కార్యసాధన కుద్యుక్తులగుటకు తొందరపెట్టి వచ్చెదను. చెప్పుము?" అనెను.

సీత సరసుతో "వద్దమ్మా! ఈ రావణుడు మాయావి. వీడు అనుక్షణము ఏదో మోసకారి తనమున నిన్ను వంచింప ప్రయత్నించుచున్నాడు. ఇక్కడ నేను అనుక్షణము మృత్యువనెడి పాము పడగ నీడలో తల దాచుకొని యున్నాను. నాకతడు ఎప్పుడు ఎటువంటి కీడు మూడించునో యని భయపడుచున్నాను. అని చెప్పి సరసుతో సరసూ! "రాముడు లంకకు వచ్చినాడని" చెప్పి నాకు మిక్కిలి సంతోషము కలిగించినావు. అతని భావి పన్నుగడ యేమిటో తెలుసుకొని రమ్ము."

సరసు అట్లే వెళ్ళి, రావణుని సంగతి తెలుసుకొనివచ్చి, ఆ వివరములు సీతతో చెప్పినది.

రావణుని తల్లి వచ్చి, రావణునితో "పుణాత్మురాలైన మహాసాధ్వి సీతను, సగౌరవముగ సత్కరించి, ఇప్పుడే తీసుకొని వెళ్ళి, రామునకర్పింపుము. నీకును, మాకును, మన అందరకును మేలు జరుగగలదు." అని ఎంతగానో చెప్పినది. ఆతని మరొక వృద్ధమంత్రి అనిరుద్ధుడనువాడు ఎట్టి సంకోచము లేకుండ "సీతను రామునకప్పగించు"మని చెవిలో ఇల్లు కట్టుకొని పోరినాడు. 'రావణా! రాముడు సామాన్యుడు కాదు. జన స్థానములో రాక్షస సంహారము, హనుమంతుడు సముద్రమును దాటి, లంకకు వచ్చి సీతనుచూచి, రాక్షసులను సంహరించుట, మొదలగు యాతని బలశౌర్యాదులను గురించి ఒక్కసారి నీవు ఆలోచించుము!

ఎవరు ఎన్ని విధములుగ చెప్పినను రావణుడు వినలేదు. కావున సీతా! రావణుని సర్వబలమును, శక్తియుక్తులను, మాయశక్తులను లంకానగర నిర్మాణ రహస్యమును, రహస్య స్థావరములను, కోటను, అగడ్తలను, అన్నింటిని చక్కగా తెలుసుకొనియే వానరసేనతో

సముద్రమును దాటి వచ్చినాడు. ఇక అతడు లంకను ముట్టడించి, రావణుని సంహరించి, నిన్ను పొందుటయే తరువాయి. నీ వింక విచారమును మానుము అని చెప్పినది సీత యూరడిల్లినది.

## రావణుడు మంత్రులతో సమాలోచనము

రావణుడు సభచేసి, మంత్రులతో భావికార్యక్రమమును గురించి విచారించెను.

"మంత్రులారా! రాముడు వానరసేనతో సముద్రమును దాటి, లంకకు వచ్చుటను, అతని అపార బల పరాక్రమములను గురించి, మీ రంతా చెప్పినారు. మీలో మీరు మన బలహీనతలను గురించి, బయటికి మాట్లాడక ఒకరి మొఖము నొకరు చూచుకొను చున్నారు. మీ యుద్దేశ్యములను నేను గ్రహించినాను.

రావణునకు సన్నిహిత బంధువు, మంత్రి ముఖ్యుడైన మాల్యవంతుడను వాడు లేచి, "రావణా! అన్నియు తెలియునను కొను వాడవు. పెద్దల హితవు నేల పాటించవు? శత్రుబలముకన్న మన బలము మిన్నయైనచో యుద్ధము చేయుట పొసగును. కాని మన బలము తక్కువయై శత్రుబలము ప్రబలమైన దైనచో యుద్ధము చేయుట అవివేకము. అట్టిచో శత్రువుతో సంధిచేసుకొనుట అన్ని విధములు శ్రేయము. నీవు యిప్పుడు సీతను రామునకప్పగించినచో రామునితో సంధి కుదురును. లంక నిశ్శంకముగ క్షేమముగ నుండ గలదు. రావణా! నీ వినాశము, రాముని విజయము దేవతల సంకల్పము. ఋషుల వేదాధ్యయనముతో కూడిన యజ్ఞయాగాది క్రతువులు, ఆ క్రతువుల హోమములనుండి వెలువడు హోమధూమములు నీ ఆయుశ్శ్రీలను హరించుచున్నవి సుమా! జాగ్రత్తగా ఆలోచించి ముందడుగు వేయుము" అని హితవు చెప్పెను.

రావణుడు మాల్యవంతుని హితవునకు మిక్కిలి మండిపడి, నీవు ఏ ప్రలోభము చేతనో ఇప్పుడు శత్రు పక్షమును కీర్తించు

చున్నావు. సాధారణమైన కోతిమూకల నాశ్రయించి, నాపై యుద్ధము నకు వచ్చిన రాముని గురించి గొప్పగా చెప్పుచున్నావు. ఏమైనను నేను అతిసాహసమున, బలవద్యత్నముచే సంపాదించుకొని తెచ్చిన సీతను వదలిపెట్టను. నేను చచ్చినను సరే, సీతను వదలను" అని అక్కడినుండి వెళ్ళిపోయెను.

## శ్రీరాముడు యుద్ధ విధానమును నిర్ణయించుట

ఇచట శ్రీరామచంద్రుని యుద్ధ శిబిరములో రావణసేనతో యుద్ధముసేయు విధానమును నిర్ణయించుటకు సమావేశమైనారు.

విభీషణుడు లేచి "రామచంద్రా! నా నలుగురు మంత్రులు పక్షిరూపములో విహాయనగతులై లంకలోనికిపోయి, అచట రావణుడు సేనతో కావించిన యుద్ధ ఏర్పాట్లను సమగ్రముగ పరిశీలించి వచ్చిరి. పూర్వ ద్వారమున ప్రహస్తుడు, దక్షిణ ద్వారమున మహోదరుడు, మహాపార్శ్వుడు, పశ్చిమ ద్వారమునందు ఇంద్రజిత్తు, ఉత్తరద్వార మున రావణుడు స్వయముగాను, సన్నద్ధులైయున్నారు. మధ్య గుల్మమున విరూపాక్షుడున్నాడు. రామా! రావణుడసాధ్యుడని తెలిపి యుంటినికదా! కుబేరుని వంచించి, పుష్పక విమానమును తెచ్చినవాడు. కావున మనసైన్యమును చక్కగా విభజించి, రావణ సంహారమును గావింపుడు." అనెను.

విభీషణుని మాటలను రాముడు శ్రద్ధగావిని, వానర సేన నుద్దేశించి ఇట్లనెను.

"మిత్రులారా! మనము రావణుని సేనను సమర్థముగ నెదుర్కొనజాలు ప్రతి బలమును వ్యూహాత్మకముగ ఏర్పాటు చేయుదము.

"లంకాపురి తూర్పు ద్వారమున అంగదుని పశ్చిమ ద్వారమున హనుమంతుని, నియోగింతము-నేను లక్ష్మణ సహితుడనై ఉత్తర ద్వారమున నున్న రావణుని వధింతును. సుగ్రీవుడు, జాంబవంతుడు,

విభీషణుడు ఈ ముగ్గురును మధ్యగులమునందుంతగలరు. ఒక్క విషయమును మాత్రము అందరు జ్ఞప్తి యందుంచుకొనవలయును. వానరు లెల్లరు వారి సహజరూపములతో, వానరులుగనే యుండవలయును. వేరు రూపములను ధరించవలదు. ఎల్లప్పుడును, మన వారిని మనము గుర్తించుటకు వీలు కలిగియుండవలయును. నేను, లక్ష్మణుడు, విభీషణుడు, అతని నలుగురు మంత్రులు మాత్రమే మనుష్య రూపములలో నుండగలము.''

ఈ విధమైన ఏర్పాట్లు గావించి సుగ్రీవునితో శ్రీరాముడు ఇట్లన్నాడు- సుగ్రీవా! మనము ఈ సువేల పర్వతము నెక్కి, ఈ రాత్రి అచటనే యుండి, లంకా పురమును, రావణుని కదలికలను గమనింతము.''

## సుగ్రీవుడు, రావణుల మల్ల యుద్ధము

సుగ్రీవాదులతో రామలక్ష్మణులు సువేల పర్వతము మీదికి కెక్కినారు. అచటినుండి లంకను వీక్షించినారు. లంకా సౌందర్యమునకు రామలక్ష్మణులు, సుగ్రీవుడు చూచి ఆశ్చర్యపడినారు. తరువాత రావణుని చూచినారు. ఆ సమయములో రావణుడు ఒకానొక చైత్య ప్రాసాద గోపుర శిఖరముపై నిలుచొని యున్నాడు. అతడు సుగ్రీవుని కంటపడినాడు. సుగ్రీవుడు పట్టరాని ఆవేశముతో ''రాక్షసాధముడవైన ఓ రావణా! నేను లోకోత్తర ధానుష్కుడైన శ్రీరాముని మిత్రుడను అతని దాసుడను. నిన్నిప్పుడు చంపక వదలను.

అనుచు రివ్వున యాతడు ఆకసమున కెగిరి రావణుడున్న చైత్య ప్రాసాద శిఖరముపై వ్రాలెను. అతడు తటాలున ఎగిరి రావణుని శిరస్సుపై గల కిరీటమును తన్నెను. తృటిలో రావణ కిరీటము నేలబడినది. రావణుడుతీరని అవమానమునకు గురియైతినని విచారించినాడు.

రావణ సుగ్రీవులిద్దరును రోషావేశములతో పరస్పరము ముష్టి ఘాతములతో మల్ల యుద్ధమునకు ఉపక్రమించినారు. వారట్లు పోరాడు చుండగా కొంతవడికి రావణుని బలము క్షీణించినది. అలసట వచ్చినది. ఇక లాభము లేదనుకొని మాయా యుద్ధమునకు గడంగినాడు అది గమనించి సుగ్రీవుడు, పైకెగిరి సువేల పర్వతముపై నున్న శ్రీరాముని చెంతకు చేరినాడు.

రాముడు సుగ్రీవుని కౌగలించుకొని, "మిత్రమా! సుగ్రీవా! మాట మాత్రమైనను చెప్పక ఎంత పని చేసినావు. నీకేమైనా కీడు కలిగిన మేమంతరము ఏమగుదుమో! ఆలోచించితివా! ఇక యెప్పుడు ఇట్టి యావేశమునకు లోను గాకుము. ప్రభువైన వాడు నిగ్రహమును పాటించుటావశ్యకము.

"రామచంద్రా! నీ భార్యను అపహరించిన నీచుడు రావణా సురుడు కంటపడగనే, పట్టరాని ఆవేశము వచ్చినమాట నిజము. తట్టు కొనలేక వానిపై లంఘించితిని. మన్నింపుము."

సుగ్రీవునిపట్ల రాముడు ప్రసన్నుడై లక్ష్మణునితో "లక్ష్మణా! ఇప్పటి శకునములు లంకాపుర క్షయమును సూచించుచున్నవి. ఇక యాలసించుట తగదు. వెంటనే మన సేనను లంకాపురి మీదికి పంపు దము" అనెను. ఆ రాత్రి అందరూ విశ్రమించి, ఉదయమునే సువేల పర్వతముపై నుండి, క్రిందకు వచ్చారు.

## అంగదుని రాయబారము

రాజనీతి ననుసరించి శ్రీరాముడు, తన చెంతనే ఉన్న సుగ్రీవా దులతోను, విభీషణునితోను విచారించి, చివరిసారిగా రావణుని వద్దకు కొన్ని హెచ్చరిక మాటలు చెప్పి, అంగదుని రాయబారిగా పంపి నాడు.

"ఓ రాక్షసాధమా! నేను నీ పాలిటి మృత్యువును. నీవు సీతను అపహరించి ఘోరమైన పాపకార్యము చేసినావు. ఇంత తడయక సీతను నా కప్పగించి, శరణు వేడుము. లేకున్న నీ నాశనము నీ వలననే జరుగగలదు. రావణా! లంకా రాజ్యమునకు విభీషణుని రాజుగా చేతును. నీ లంకను అరాక్షసమొనర్చి, సర్వనాశనము చేసెదను. రావణా! నా చేతిలో నీ చావు నిశ్చయమైనది. ఇక నీ యంత్యక్రియ లను నీవే చేసుకొనుము. తరువాత నీకు చేయు వారెవరును ఉండరు."

అంగదుడు రాముని సందేశమును గొని, సభలోనున్న రావణు నికి వినిపించెను. రావణుడు కోపముతో "వీనిని పట్టి బంధింపుడు. వధింపుడు" అని సేవకులకు ఆజ్ఞాపించెను. నలుగురు రాక్షసులు అంగదుని పట్టుకొనబోయినారు. అంగదుడు తన ఇష్ట పూర్తిగానే, ఆ రాక్షసులకు పట్టుబడినాడు. రాక్షసులు దగ్గఱకురాగానే, వారిని తన చంకలో నిరికించుకుని, శరవేగముతో పైకెగిరినాడు. ఆ వేగమునకు రాక్షసులు హాహాకారములుచేస్తూ క్రిందపడినారు. అతడు లంకా ప్రాకారమును బ్రద్దలు చేసెను. అంగదుడు శ్రీరాముని చెంతకు చేరినాడు.

ఇది యంతయు రావణుడు చూస్తుండగనే, అతని కన్నుల యెదుట జరిగినది. ఇక తనకు వినాశనము తప్పదని శంకించి భయ పడినాడు.

## వానరులు లంకాపురిని ముట్టడించుట

అపారమైన వానరసేన లంకాపురిని చుట్టుముట్టినది. ఆ దృశ్యము లంకకు రెండవ ప్రాకారమేర్పడినదా యన్నట్లున్నది. రావణుడా విషయమును తెలుసుకొని, నగర రక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

గావించినాడు. అతడు ప్రాసాదమునెక్కి చూచినాడు. ఎక్కడ చూచినా ఎటు చూచినా వానర సేనా సమూహమే. రావణునికి చెప్ప రాని దిగులు పుట్టినది.

శ్రీరాముడు లంకాపురమును చూచినాడు. అతనికి వెంటనే సీతాదేవి గుర్తుకు వచ్చినది. సీత దీనావస్థను మనసున తలచుకుని, కోపోద్రిక్తుడై, ఇక తడయ నిచ్చగింపక వానరులను శత్రు సంహార మును చేయుడని యాజ్ఞాపించెను. సైన్యమంతా చెట్లు, పర్వత శిఖరములను తీసుకుని సింహానాదములు చేయుచు యుద్ధమునకు సన్నద్ధమైనారు.

## యుద్ధము

రావణుడు తన సేనలను కదిలించినాడు. భేరీఝాంకృతులతో సింహనాదములు మిన్నుముట్టినవి. యుద్ధము మొదలైనది.

పూర్వకాలములో జరిగిన దేవాసుర యుద్ధములవలె ఘోర భీకరమైనది. దొమ్మి యుద్ధములు, ద్వంద్వ యుద్ధములు, అనేకములు జరిగినవి. అంగదుడు ఇంద్రజిత్తుతోను, హనుమంతుడు జంబుమాలి తోను, విభీషణుడు మిత్రఘ్నునితోను, సంపాతి (విభీషణుని మంత్రి) ప్రజంఘునితోను, నీలుడు కుంభునితోన, సుగ్రీవుడు ప్రఘసునితోను, లక్ష్మణుడు విరూపాక్షునితోను ద్వంద్వములు చేశారు. అగ్నికేతుడు, రశ్మికేతుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపులు అను రాక్షసులు ఏకమై శ్రీరామునితో తలపడినారు. రామలక్ష్మణులు, సుగ్రీవుడు, విభీషణుడు హనుమదాదివీరుల చేతిలో రావణ పక్షములు యోధులు మడిసినారు.

ఆ సమయములోనే అంగదుడు, ఇంద్రజిత్తు రథమును నుగ్గు చేసి, అతని సారథిని చంపినాడు. వీరుకాక అనేకమంది రాక్షసులు అగ్నిలో శలభములవలె, వానరవీరుల చేతిలో మసియైపోయినారు.

ఇంతలో సూర్యుడు అస్తమించినాడు. సూర్యాస్తమైనను యుద్ధము కొనసాగినది.

## ఆ రాత్రి యుద్ధము

రాత్రి గాఢాంధకారము అలముకొని యుండుటచే వానరులు, రాక్షసులు అను గుర్తు తెలియకుండా తమ పక్షమువారిని తామే చంపు కొనుచున్న అయోమయ పరిస్థితి ఏర్పడినది. రాక్షసులు కొందరు దొరికిన వానరులను పట్టి చంపి భక్షింపసాగిరి. రామలక్ష్మణులు బాణములు ప్రయోగించి, కన్నులను కనిపించినవారిని, కనిపించని వారిని అనేకమంది రాక్షసులను వధించిరి. దట్టమైన కారు చీకటికి తోడు, యుద్ధరంగములో సైనికుల సంచలనము వలన రేగిన దుమ్ము, వీరులచూపును అడ్డగించినది. యుద్ధభూమి హతులైన వీరుల రక్తముతో తడిసిపోయినది. 'ఎప్పుడు తెల్లవారునా?' యని ప్రతి వారును నిరీక్షించుచుండిరి. రాక్షస యోధులైన మహాపార్శ్వుడు, వజ్రదంష్ట్రుడు, మహోదరుడు, శుకసారణులు రాముని బాణ వర్షమును సహింపలేక ఎటో పారిపోయి ప్రాణములను కాపాడు కున్నారు. అంగదుడు ఇంద్రజిత్తును తరిమికొట్టినాడు.

## ఇంద్రజిత్తు నాగపాశముచే రామలక్ష్మణులను బంధించుట

రామ బాణములకు రాక్షసవీరులు పారిపోవుచుండిరి. ఆ విధముగ రాక్షసులు పారిపోవుటను ఇంద్రజిత్తు చూచి, విజృంభించి

శత్రువీరులతో తలపడి ఘోరమైన యుద్ధము చేయసాగెను. అతడు రామలక్ష్మణులపై శిలావర్షము కురిపించినాడు. ఇంద్రజిత్తు తాను ఎవరికీ కానరాకుండ మాయాయుద్ధము చేయనారంభించినాడు. తనకు గల శాంభరీ శక్తిననుసరించి, అదృశ్యరూపంలో ఆకాశముపై నుండి చిత్ర విచిత్ర రీతులలో యుద్ధము చేసి శత్రువులను సంహరించు చుండెను. అతడు రామలక్ష్మణులపై నాగమయశరములనువేసి, వారిద్ద రినీ బంధించినాడు. శ్రీరాముడు, అంగదుడు, నీలుడు మున్నగు వానరవీరులను పిలిచి, "ఇంద్రజిత్తు ఉన్న తావును కనిపెట్టుడు." అని యాజ్ఞాపించెను. వానరులు ఆకాశమునకేగిరి. ఇంద్రజిత్తు జాడను వెదుకుచుండిరి. ఇంద్రజిత్తు వారిపై బ్రహ్మాస్త్రమును వేసి వారించి, రామలక్ష్మణులపై శరవర్షము కురిపించెను.

ఇంద్రజిత్తు ఆవేశమున అదృశ్యరూపములో ఉండి ఇట్లు గర్జించెను.

నేను అంతర్ధానుడై ఈ విధమగు యుద్ధము చేయుచుండగా నన్ను కనుగొనుట దేవేంద్రునకేని అలవికాదు." అని.

ఇంద్రజిత్తు రామలక్ష్మణులపై నిశితమైన బాణ వర్షము కురిపిం చెను. ఆ సోదరులిద్దరి శరీరములపై ఎడమ లేకుండా బాణములు గుప్పించిన కారణముగా గాయములై నెత్తురు స్రవింపజొచ్చినది. బాణ ఘాతములచే రామలక్ష్మణులిరువురు మూర్ఛనొందినారు. వారికి కలిగిన కష్టమునకు వానరులు మిక్కిలి వగచినారు.

ఇంతలో ఇంద్రజిత్తు తొందరపడి రామలక్ష్మణులను నాగపాశ మున బంధించ బడిరని, ఈ పాటికి వారు చచ్చియుందురని, తండ్రి వద్దకు చేరి చెప్పెను.

రావణుడు అమితానందభరితుడై త్రిజట మున్నగు రాక్షస స్త్రీలను పిలిచి, "ఈ వార్త సీతకు చెప్పి, పుష్పక విమానముపై రామ లక్ష్మణుల శరీరములున్నచోటికి తీసుకొనివెళ్ళి, వారి కళేబరములను చూపించి తెండు" అని ఆజ్ఞాపించి పంపెను.

రాక్షసస్త్రీలు అశోక వనమునకువెళ్ళి, సీతాదేవికి, రావణుడు చెప్పి పంపిన వార్తను వినిపించి, పుష్పక విమానములో ఆమెను ఎక్కించుకొని, రామలక్ష్మణులు ఉన్నచోటికి తీసుకొని పోయి పై నుండియే రామలక్ష్మణులను చూపినారు...

సీత వారిని చూచి అత్యంత దయనీయముగా విలపించినది. నా కొరకు వారు నూరు యోజనముల సముద్రమును దాటి, దుర్భేద్య మైన లంకను ప్రవేశించి, ఈ ప్రదేశములో నిస్సహాయులై దారుణ మరణమునకు గురియైరి కదా!

తానయోధ్యలో నున్నప్పుడు జ్యోతిష్యులు నాకు సంతానము కలుగునని చెప్పిరి. అట్టి వారి భవిష్యద్దర్శనము మృషయైనది కదా! హతవిధీ! నేనేమి పాపము చేసితిని."

అని విలపించుచున్న సీతను త్రిజట అను రాక్షసి "అమ్మా! రామలక్ష్మణులు మరణించుట కల్ల. వారు మరణించినచో, వానరసేన ఇంత ఉత్సాహముగా నుండజాలదు. అదియునుగాక రామలక్ష్మణుల ముఖములు తేజస్సును కోల్పోలేదు. నీ నాథుని జయించుట ఆ దేవేంద్రునికేని సాధ్యముకాదు. నీవు ఊరడిల్లుము" అని చెప్పెను.

త్రిజట మాటలకు సీత శాంతించినది. రాక్షసులు మరల పుష్పక విమానముపై సీతను అశోక వనమునకు గొనిపోయి దింపినారు.

వానరవీరులంతా మూర్ఛనొందియున్న రామలక్ష్మణులను వేయి కన్నులతో చూచుచు కావలియుండినారు. రాముడు కొంత సేపటికి సేదదేరి కనులు తెరచి చూచినాడు. ప్రక్కనే లక్ష్మణుడు

నెత్తుట తడిసి తెలివి తప్పి పడియున్నాడు. అతడు బావురుమని పెద్ద పెట్టున విలపించినాడు. "లక్ష్మణా! నీవే లేనిచో, నాకి సీతతోగానీ, లోకముతోగానీ పనియేమి? అసలీ దేహముతో జీవించియుండుట యేల? లోకమున సీతవంటి భామలెంపరేని దొరకవచ్చును గాని, తమ్ముడా! నీ వంటి వాడు దొరకుట దుర్లభము. ఎన్నడును నన్ను ఒక్క పరుష వాక్యమునైనను నాతో పలుకలేదు. అట్టి సుగుణ శీలియైన ఈ లక్ష్మణుడే మరణించినచో నేనిప్పుడే ఈ వానరుల ఎదుటనే ప్రాణముల విడిచెదను."

రాముని దుఃఖమును చూచి, వానరులంతా దుఃఖించ సాగినారు.

విభీషణుడు, రాముని దుఃఖమును చూచి "ఇంద్రజిత్తు మాయ లుపయోగించి, రామలక్ష్మణులను బాణములచే మూర్ఛ నొందించినాడు, ఎవని నాశ్రయించి, నేను దుర్మార్గుడైన రావణుని పాపకార్యము నుండి విముక్తుడనగుదునని భావించితినో, అట్టి శ్రీరాముడే ఈ దురవస్థ నొంద నాకు రాజ్యముతో నేమిపని? రాజ్యమువద్దు. గిజ్యమువద్దు." అని ఎడువజొచ్చినాడు.

అంత సుగ్రీవుడు "విభీషణా! నీవు దుఃఖింప పనిలేదు. రామ లక్ష్మణులకే హానియు జరుగదు. నీవు లంకారాజ్యమునకు తప్పక పట్టాభిషిక్తుడవగుదువు. ధైర్యము నవలంభింపుము." అని చెప్పి, రామ లక్ష్మణులను సుషేణుడు అను వైద్యునికి అప్పగించి రామలక్ష్మణులు తేరుకొనిన తరువాత, వారిని జాగ్రత్తగా కిష్కింథకు చేర్చుము. నేను ఈ లంకలో రావణసేనను రావణుని చంపి, సీతాదేవి యుక్తముగా అక్కడికి వచ్చి, సీతను రామునికి సమర్పించెదను.

సుషేణుడు సుగ్రీవునితో "సుగ్రీవా! నీవు ఇక్కడికి కొంత దూరములోని క్షీరసముద్ర సమీపములోని పర్వతముపై కొన్ని అద్భుతమైన ఔషధులున్నవి. హనుమంతుని పంపి, వేగిరమే ఆ యోషధులను

తెప్పింపుము. రామలక్ష్మణులు వెంటనే కోలుకొనగలరు." అని చెప్పెను.

## నాగపాశ విమోచనము

సుషేణుడు అట్లు సుగ్రీవునితో మాట్లాడుచుండగనే ఒక పెనుగాలి వీచినది. ఉత్తర దక్షిణములో గరుత్మంతుడు వచ్చి వ్రాలినాడు. రామలక్ష్మణులను శరరూపమున కట్టివైచిన నాగములు ఎక్కడివక్కడ చెల్లాచెదరై పోయినవి.

చంద్రబింబముల వలె స్వచ్ఛమైన కాంతులను విరజిమ్ముచున్న రామలక్ష్మణులను గరుత్మంతుడు ప్రేమతో స్పృశించి, వారిని ఆలింగనం చేసుకొన్నాడు. అతడు వారికి నమస్కరించి వారినుంచి సెలవు తీసుకొని వెళ్ళినాడు.

వానరులు సంతోషముతో సింహనాదములు చేసినారు.

## రావణుని భయము

భయంకరమైన ఆ సింహనాదములు విని, ఎక్కడివీ సింహనాదములు. రామలక్ష్మణులు చచ్చిరికదా! అక్కడఉన్న రాక్షసులు ప్రాసాదముల నెక్కి చూచినారు. వారు వానరసేనయని గ్రహించినారు. రామలక్ష్మణులు నాగపాశవిముక్తులై సుఖముగ నున్నట్లు కనిపించినారు. వెంటనే వెళ్ళి రావణునితో ఈ వార్త చెప్పినారు. రావణుడు చిన్నబుచ్చుకొన్నాడు.

"రాముడు నాగపాశమునే విడిపించుకొన్నాడు. ఇక మనకు ప్రాణభీతియే మిగిలినది,"

రావణుడు క్రోధముతో అక్కడ ఉన్న ధూమ్రాక్షుని పిలిచి, "ధూమ్రాక్షా! నీవు నీ సైన్యముతో వెళ్ళి, వానరులను, రాముని చంపి రమ్ము."

ధూమ్రాక్షుడు, రావణాజ్ఞమేరకు సైన్యాన్ని తీసుకొని పశ్చిమ ద్వారమార్గము గుండా బయలుదేరినాడు. అక్కడ కొన్ని అపశకునములు అతనికి కలిగినవి. ఐనను వెనుకకు మరలలేదు. అతడు ద్వారము దాటివెళ్ళి, రాక్షసులతో పోరుచున్న హనుమంతుని చూచి, అతనితో యుద్ధమునకు తలపడినాడు. హనుమంతునికి ధూమ్రాక్షునకు భయంకర యుద్ధము జరిగినది. తుదకు హనుమంతుడు క్రోధముచే ఒకకొండ శిఖరమును పెకికి ధూమ్రాక్షుని తలపై కొట్టినాడు. ఆ దెబ్బకు ధూమ్రాక్షుడు నేల కొరిగినాడు.

ధూమ్రాక్షుని చావువిని, రావణుడు విచారపడి, వజ్రదంష్ట్రుడను వానిని యుద్ధమునకు పంపినాడు. అంగదుడు,వజ్రదంష్ట్రుని పరిమార్చినాడు. అదేసమయములో హనుమంతుడు అకంపనుడనే రాక్షసవీరుణ్ణి వధించాడు. నీలుడు ప్రహస్తుని సంహరించినాడు, ఈవార్తలను తెలుసుకొని రావణుడు భయముచే కంపించిపోయినాడు.

ఇంచుమించు తనయంత బలపరాక్రమములు గల సేనాపతి ప్రహస్తుడు మరణించినాడు. సీతను రాముని కిమ్మనిచెప్పి, నాకతడు మొదట అప్రియములు పలికినను, తరువాత నిజము తెలుసుకొని తన కొరకు పోరాడి ప్రాణములర్పించినాడు.

## రావణుడు యుద్ధమునకు బయలుదేరుట

ప్రహస్తుడు యుద్ధములో నిహతుడైనాడని తెలిసి రావణునికి దుఃఖముతోపాటు క్రోధము మరింత అతిశయించినది. అతనికి కుడి భుజము పోయినట్లైనది. అతిక్లిష్టమైన ఈ సమయములో నేనే

స్వయముగా యుద్ధసన్నద్ధుడనై శత్రు సైన్యమును హతమార్చవలెను. ఇక ఉపేక్షించి ప్రయోజనము లేదు.

రావణుడు రథాన్ని సిద్ధపరపించుకుని బయలుదేరినాడు. అతడు బయలుదేరుట తోడనే మృత్యు దేవత లెక్కలేనన్ని భేరీనినాదములతో బయలుదేరినదాయన్నట్లు భయంకర యుద్ధ వాద్య ధ్వనులు చెలరేగినవి.

రావణుడు ప్రళయకాల రుద్రునివలె సేనతో యుద్ధభూమికి చేరుకున్నాడు.

రాముడు రావణుని, రావణుని సైన్యమునుచూచి, ఆశ్చర్య పడినాడు. "విభీషణా! ఆ సైన్యమెవరిది? వారెవరు?"

విభీషణుడు రామునికి సైన్యములో యెట్టయెదుట స్ఫుటముగా కనిపించు సేనాధిపతులను, యుద్ధ వీరులను చూపినాడు.

మధ్యలో శ్వేతచ్ఛత్రము క్రింద రథమునందు శోభిల్లుచున్న కిరీట కుండలధారియే మా యన్న రావణుడు. లంకాధిపతి.

రామునికి లంకాధిపతి తేజమును చూచి, కన్నులు చెదిరినట్లైనవి. కానిమ్ము. అతని ప్రకాశము వలన కంటికి స్పష్టముగ కనిపించు చున్నాడు. పాపాత్ముడైన ఈతడు నా కంటబడినాడు. సీతాపహరణ దోష భూషితుడైన వీనిని వదలను.

ఇంతలో లక్ష్మణుడు అడ్డువచ్చి, "అన్నా! వీనిని సంహరించు అవకాశమును నాకొసంగుము" అనెను.

రాముడు దందులకు అంగీకరించి "లక్ష్మణా! రావణుడు సామాన్యుడని యెంచవలదు సుమా! నిన్ను నీవు కాపాడుకొనుచు అతనితో పోరాడి హతమార్చుము" అని జాగ్రత్తలు చెప్పెను. లక్ష్మణుడు ధనుసు, బాణములను చేతపట్టుకుని, రావణుని మీదకి పోవుచుండగా హనుమంతుడు అడ్డుపడి, "లక్ష్మణా! నీవాగుము. ఈ

ధూర్తుని నే సంహారింతును" అని కుడిచేయి యెత్తి పిడికిలిని చూపి, "ఓరీ దుర్మార్గుడా! ఈ నా ముష్టిఘాతముచే నిన్ను హతమార్చెదను. కాచుకొమ్ము. లోగడ నీ కుమారుడైన అక్షయ కుమారుని చంపిన విధమును ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకొనుము" అని హనుమంతుడు రావణునిపైబడి, బలమైన పిడికిలితో మోదెను. రావణునికి దిమ్మ తిరిగినది. మరల నాతడు హనుమంతుని వక్షఃస్థలముపై గ్రుద్దినాడు. హనుమంతునికి రావణుని బలమెంతటిదో ప్రత్యక్షముగ తెలిసినది. రావణుని దెబ్బకు హనుమంతుడు మూర్ఛిల్లినట్లైనాడు. అతడు తేరు కొనునంతలో, రావణుడు మరొకవైపున తన మీదికి వచ్చుచున్న నీలునితో యుద్ధమునకు గడంగినాడు. హనుమంతుడు తేరుకుని, "నాతో యుద్ధము చేయుచు, మరొకనితో యుద్ధమునకు గడంగినావు. ఇక నీతో తలపడను" అని వొదిలిపోయినాడు. రావణుడు, నీలుడు కొంత సేపు పోరాడిన పిమ్మట రావణుడు విసిరిన అమోఘమైన బాణముదెబ్బకు మూర్ఛనొందినాడు. అతడు అగ్ని కుమారుడే కనుక తండ్రి యనుగ్రహముచే రక్షింపబడినాడు.

తరువాత రావణుడు లక్ష్మణునితో తలపడినాడు.

## రావణుడు లక్ష్మణునితో యుద్ధము

రావణుడు, లక్ష్మణునితో యుద్ధమొనర్చుటతో లక్ష్మణుడు తన తీవ్ర శరాసారముచే రావణుని క్షతగాత్రుని చేసెను. తరువాత లక్ష్మణునిపై రావణుడు ఒక శక్తిని ప్రయోగించెను. ఆ శక్తి లక్ష్మణునిపై పనిచేయలేదు.

లక్ష్మణుడు తన దైవాంశ రూపమును స్మరించెను. వెంటనే బరువెక్కెను. రావణుడు సైతము లక్ష్మణుని ఎత్తి బయటుపడవేయలేక పోయినాడు.

అంత హనుమంతుడు రాముని చెంతకుపోయి "రామచంద్రా! నీవు నా భుజముపైనెక్కి శత్రువుతో తలపడుము" అని ప్రార్థించెను.

## రాముడు రావణునితో యుద్ధము చేయుట

హనుమంతుని ప్రార్థనను మన్నించి, హనుమంతుని భుజములపై నెక్కి కూర్చుండి ధనుర్బాణములను తీసుకొన్నాడు. వెంటనే అతడు ప్రళయ భీకరమైన ధనుష్టంకారము చేసినాడు.

రథస్థుడైన రావణుడు అది చూచినాడు. రాముడు రావణునితో "ఓరీ రాక్షసాధమా! నాకు చెప్పరాని అపకారము చేసిన నిన్ను ఎచటికి వెళ్ళినను ప్రాణములతో నుండనీయను." అనుచుండగనే రావణుడు హనుమంతుని మీద వాడి బాణములు విసిరి, ఆతనిని గాయపరిచినాడు. అది చూచి రాముడు మిక్కిలి కోపించి, రావణుని రథ చక్రములను, గుఱ్ఱములను, కేతనమును, ఛత్రమును, సారథిని ఖండించినాడు. రావణుని వక్షస్థలమున బలమైన శరమును నాటినాడు. ఆ దెబ్బతో రావణుడు తన చేతిలోనున్న ధనుస్సును వదిలినాడు.

శ్రీరాముడు అర్ధచంద్ర బాణమును వదిలి రావణుని కిరీటమును ఖండించినాడు. అతడు మంటలేని నిప్పువలె తేజస్సులేక దీనావస్థలో నున్నాడు శ్రీరాముడది గమనించి-

"రావణా! నీవు అనేకమంది మహావీరులను వధించినావు. ఇప్పుడు దిక్కులేక క్షతగాత్రుడవై దీనముగా నా యెదురనున్నావు. కావున నిన్ను ఇప్పుడు వదిలివేయుచున్నాను. నీవు పురములోనికి పోయి కొంత విశ్రాంతి గైకొని, మరొక రథముపై, ధనుర్బాణములను ధరించి యుద్ధమునకు తిరిగి రమ్ము. అప్పుడు నీవు నా పూర్ణ బలమును తెలుసుకొందువు" అనెను.

రావణుడు అవమాన భారముతో తలవొంచుకొని అక్కడినుండి బయలుదేరి అంతఃపురమునకు పోయెను.

రావణుడు సభా భవనంలో తన సింహాసనంపై కూర్చొని, తన తపోబల శక్తియుక్తులన్నియు వ్యర్థమైపోయినవని మిక్కిలి వాపోయి నాడు.

ఒక సాధారణ మనుష్యునిచేత నాకు అవమానము కలిగినది. మనుష్యుని వలన నీకు అపకారము కలదు'' అని బ్రహ్మ ఏనాడో చెప్పినాడు. మనుష్యుని వలన కూడ చావు లేనట్లు వరము కోరుకొన నైనది. అది గొప్ప పొరపాటు...ఇక్ష్వాకు వంశపురాజైన అనరణ్యుడు ''దుర్మార్గుడా! సబాంధవముగా సంహరించువాడు నా వంశమునందే పుట్టును'' అని శపించినాడు. అతడితడే కాబోలు ఇంక ఎందరో దేవతలో నన్ను శపించినారు. అవియన్నియు జరుగుచున్నవి. ఋషులు శపించినారు. వారి మాటలు అన్వర్థములు.

రాక్షసులారా! ఇక లంకాపురి రక్షణ విషయములో మీరు మిక్కిలి జాగ్రత్తగా వ్యవహరింపుడు. దేవదానవుల అహంకారమును అణగింప జేయగల నా యనుంగు సోదరుడు కుంభకర్ణుని నిద్రనుండి మేల్కొల్పుడు. అతడు నిదురించ మొదలిడి తొమ్మిది రోజులైనది. ఈ కష్ట సమయములో అతడు నాకెంతయు ఉపకరింపగలడు...కావున మీరు అతనిని వెంటనే తీసుకొని రండి. వానరులందరు నిమేష మాత్ర ముతో అంతమొందింపగలడు.

## కుంభకర్ణుడు

రాక్షసులు, అనేకములైన పిండివంటలు- సురాభాండములు, గంధ మాల్యాదులు గైకొని ఘోరముగా నిదురించుచున్న కుంభకర్ణుని భవనమునకు పోయి, భేరీ ఝాంకారాలతో పెద్ద సందడి చేసినారు. కర్ణభేరులు సైతము పగిలిపోవు సవ్వడులు చేసినను కుంభకర్ణుడు లేవలేదు. ఎట్టకేలకు అతడు నిదుర మేల్కొనినాడు.

అక్కడయున్న యూపాక్షుడు "కుంభకర్ణా! ఒక మనుష్యుని వలన ఇప్పుడు మన రాజుకు, లంకకు కీడు మూడినది. లెక్కలేనన్ని కోతుల మూక, అతని సహాయమునకై వచ్చి లంకను చుట్టుముట్టినవి. వారితో పోరాడి మన రాక్షస వీరులు చాలమంది చచ్చినారు, మన రాజు స్వయముగ మనుష్యుడైన రామునితో యుద్ధమాడి, చావు దప్పి కన్ను లొట్ట పోయినదనినట్లు ప్రాణములతో బయటుపడినాడు. దేవతలకు సైతము కాని పనిని రాముడు సాధించినాడు.

అప్పుడు కుంభకర్ణుడు యూపాక్షునితో నేనిక్కడ నుండి యే శత్రువులను నాశనము గావించెదను. ముందు రామలక్ష్మణులను, వానరులను చంపియే పిమ్మట రావణుని చూడ బోయెదను.

మహోదరుడు అతనిని వారించి,"కాదు ముందు రాజునిదర్శించి, అతడు ఏమి చెప్పునో విని, తరువాత కార్యా కార్యములను నిర్ణయించు కొనవచ్చును." అని చెప్పగా కుంభకర్ణుడు సమ్మతించి, రావణుని చూడ బయలుదేరెను. రాక్షసులు వెళ్ళి రావణునితో "కుంభకర్ణుడు" తమ దర్శనార్థమై వచ్చుచున్నాడని" తెలుపగా అతనిని మర్యాదలు చేసి, సగౌరవముగా తీసుకొని రండు" అని అజ్ఞాపించెను.

కుంభకర్ణుడు, రాక్షసులు కొందరు వెంటరాగా దారుణమైన పదఘట్టనలచే రావణుని వద్దకు పోయెను. దారిలో కుంభకర్ణుని అతిమాత్ర కాయమును, చూచి, భయపడి, రాముని వద్దకు వెళ్ళి, వానిని గురించి చెప్పినారు.

శ్రీరాముడు కుంభకర్ణుని ఆకారమును చూచి ఆశ్చర్యపోయి నాడు,

కుంభకర్ణుడు రావణసభకుపోయి, అతనికి నమస్కరించినాడు.

రావణుడు, తమ్ముని రావించి కారణమేమో తెలిపినారు.

కుంభకర్ణుడు, అన్నమాటలనువిని "అన్నా! నేను ఆనాడే చెప్పితిని కదా! విభీషణుడు చెప్పిన హితవును విని సీతను రాముని కప్పగించుట శ్రేయస్కరమని, కాని నీవు విన్నావుకాదు. అయినను నేను ఆనాడే చెప్పినాను. నేను నీకు తమ్ముడనేకాదు. నీవు చెప్పినట్లు చేయు సేవకుడను. నీయాజ్ఞ యెట్టిదైనను నాకు శిరోధార్యము. ఏమి చేయమందువో చెప్పుము" అని చెప్పెను.

"నీవు యుద్ధమునకు సన్నద్ధుడవై వెళ్ళి రామ లక్ష్మణులను, సుగ్రీవాది వానరులను చంపివేయుము. ఆలసింపకుము అని రావణుడు యాజ్ఞాపించెను.

కుంభకర్ణుడు రావణుని యాజ్ఞమేరకు రామునితో తలపడుటకు పెద్ద ఇనుపగుదియను తీసుకొని బయలుదేరెను.

అతడు రామునితో "రామా! నేను మారీచుడు, వాలి, కబంధుడు మున్నగు వారి వంటి వాడనుకాను. అజేయుడను, సహస్రనాగబల సంపన్నుడను" అని బెదిరించి ఒక పెద్ద బండను యెత్తి వానరుల మీద విసరెను. వారందరును ఆ రాతిబండక్రింద పడినలిగి చచ్చిరి. కొందరు వానరులను పట్టి తన నోటిలో వేసుకొని మ్రింగుచుండెను. వారు మరల కుంభకర్ణుని చెవులగుండా, ముక్కులగుండా బయటికి వచ్చుచున్నారు. వానరులు అసంఖ్యాకముగ మరణించుట చూచి, శ్రీరాముడు కుంభకర్ణునిపై అనేక బాణములను కురిపించెను. లక్ష్మణుడును అతనిపై బాణవర్షమును గుప్పించెను. వారి శరములు కుంభకర్ణుని మీద యేమాత్రము పని చేయలేదు.

చివరకు ఆ రాక్షసుడు రామలక్ష్మణులను మ్రింగుటకు తన విశాలమైన నోరును తెరచి పైబడెను. అప్పుడు రాముడు కుంభకర్ణుని కుడిచేతిని నరికివేసెను. అదే సమయములో లక్ష్మణుడు ఎడమచేతిని నరికివేసెను. అయినను కుంభకర్ణుడు అంతటితో ఆగక, వారిని మ్రింగుటకు వచ్చుచునే యుండెను. రామలక్ష్మణులు కుంభకర్ణుని తమ వాడి బాణములచే రెండు కాళ్ళు నరకిరి కుంభకర్ణుడు అంతటితో శాంతించక నేలపై పెడబొబ్బలు పెడుతూ వారిని కబళించుటకువచ్చుచుండెను. తెగిపడిన కుంభకర్ణుని చేతులు క్రిందపడి, అనేక మంది వానరులు నలిగిచచ్చిరి. రామలక్ష్మణులు కుంభకర్ణుని గుండెపైన, తెరచి యుంచిన నోటిలోను, బండి చక్రముల వంటి కన్నులలో, విశాలమైన చేటలవంటి చెవులలో బాణములను నాటిరి. కాని కుంభకర్ణుడు చావలేదు. చివరకు రాముడు విసిగిపోయి, తన అంతశ్శక్తిని వినియోగించి, "నేనే నా తండ్రియైన దశరథమహారాజు నియోగించిన పితృవాక్యమును పరిపాలించ వచ్చితినేని, ఈ మహాస్త్రముతో కుంభకర్ణుడు హతుడగుగాక" యని అభిమంత్రించి అస్త్రమును ప్రయోగించెను. శాపహతుడైన కుంభకర్ణుడు మరణించెను.

కుంభకర్ణుడు చనిపోయినాడని తెలియగనే రాక్షసులులంకలోనికి పరుగిడిరి. దేవతలు ఆకాశము పైనుండి, శ్రీరామునిపై పూలవర్షమును కురిపించిరి.

రావణుడు ఈ కఠోరమైన వార్తను విని, దుఃఖమును భరించలేక పిచ్చివానివలె లంకారాజ్య సభాభవనము లోనికి వెళ్ళి దుఃఖించుచుండెను.

## ఇంద్రజిత్తు సైన్యముతో మరల యుద్ధమునకు వచ్చుట

రావణుడు కుంభకర్ణుని మరణముతో శోకించుచుండగా ఇంద్రజిత్తు తండ్రి వద్దకు వచ్చి "తండ్రీ! నేను రాముని సైన్యసమేతముగా సంహరించి వత్తును. నాకు ఆజ్ఞ ఇవ్వండి." అని కోరెను.

అప్పుడు రావణుడు ఇంద్రజిత్తుతో "కుమారా! నీవు ఎట్లయినను రామలక్ష్మణులను వధింపవలయును. దృశ్యుడవైగాని, అదృశ్యుడవై గాని, నీ బలమును, మాయాబలమును ఉపయోగించి శత్రుసంహారము గావింపుము.

ఇంద్రజిత్తు తండ్రిమాటను శిరసావహించి, యజ్ఞశాలకు వెళ్ళి, ఎర్రని వస్త్రములు ధరించి, అవసరమైన హోమద్రవ్యములు సమకూర్చుకొని, యథాశాస్త్రముగా హోమము చేసి, అంతర్ధాన శక్తిగల రథమెక్కి, అదృశ్యుడై బ్రహ్మాస్త్రముచే సురక్షితుడై, యుద్ధభూమిని ప్రవేశించి, వానరసైన్యము మధ్యనున్న రామలక్ష్మణులపై బాణములు ప్రయోగించినాడు. రామలక్ష్మణులు అస్త్రశాస్త్రము లుపయోగించి, అకాశమును కప్పివేసిరి. కాని అవి ఇంద్రజిత్తును తాకలేదు. అతడు ఆకాశమున పొగను సృష్టించి, ఎదుట శత్రువుల కంటికి కనిపించకుండా యుద్ధము చేయసాగెను.

ఇంద్రజిత్తు కానరాలేదు కాని రామలక్ష్మణులకు అతడు ప్రయోగించు బాణములు తగిలి వారి శరీరమును గాయపరచినవి. వారి శరీరముల నుండి రక్తము కారుచున్నది. బాణములు ఏ దిక్కునుండి వచ్చినవీ కానరాలేదు. ఇంద్రజిత్తు వేయు బాణములు తాకి వానరులు గుంపులు గుంపులుగా చచ్చి పడిపోవుచున్నారు. లక్ష్మణుడు కోపముతో "అన్నా! సమస్త రాక్షసులు నాశనమందుటకు ఉద్దేశించి బ్రహ్మాస్త్రమును అభిమంత్రించి ప్రయోగించెదను అనుమతింపుము."

రాముడు "తమ్ముడా! ఒక్క రాక్షసుని కారణముగా భూమి యందలి రాక్షసులను సంహరించుట పాడికాదు, ఇంద్రజిత్తు యుద్ధ భూమియందు అదృశ్యుడైనాడు.

ఇంతలో ధూమ్రాక్షుడు హనుమంతునితో పోరి మరణించినాడు. అంగదుడు వజ్రదంష్ట్రుని, అకంపనుని హనుమంతుడు వధించెను ప్రహస్తుని నీలుడు సంహరించెను. అంగదుడు నరాంతకుని, హనుమంతుడు త్రిశిరుని. దేవాంతకుని సంహరించెను. నీలుడు మహోదరుని, వృషభుడను వానరుడు మహాపార్శ్వుని వధించెను. లక్ష్మణుడు అతికాయుని సంహరించెను. యుద్ధభూమి యంతయు రక్తముచే తడిసినది. మిగిలిన రాక్షసవీరులు పారిపోయిరి.

## ఇంద్రజిత్తు మాయ సీతను వధించుట

ఇంద్రజిత్తు ఆకాశమున గోచరించి, మాయాసీతను శిరస్సును పట్టి తన కరవాలముతో నరికివేసెను. ఆమె "నాథా! రక్షింపుమని" ఆర్తనాదం చేస్తూ ప్రాణములను వదిలెను.

హనుమంతుడు పట్టరాని దుఃఖముతో నీవొనర్చిన పాప కార్యముచే నీవు నాశనమగుదువు. సీతాదేవిని చంపి నీవు బ్రతికి యుండలేవు. స్త్రీ హత్యాదోషము నిన్ను జన్మజన్మలకు వేధించక మానదు" అని క్రోధముతో విజృంభించెను.

"ఓరీ! వానరా! సుగ్రీవుడు, నీవు, రామలక్ష్మణులు, వానరసేన ఎవరినిమిత్తమై వచ్చితిరో, ఆ సీతను మీరు చూచుచుండగనే నేను వధించితిని. ఇక రాముని, లక్ష్మణుని నిన్ను సుగ్రీవుని, దురాత్ముడైన విభీషణుని వధించెదను."

ఈ మాటలుపలికి 'ఇంద్రజిత్తు' ఆకాశమదిరిపడు ఒక పెను గర్జన చేసినాడు. సీత మరణవృత్తాంతమువిని రాముడు మొదలునరికిన వృక్షమువలె నేలగూలి మూర్ఛిల్లెను. లక్ష్మణుడు రాముని శిరస్సును తన ఒడిలో పెట్టుకొని విలపించెను.

"అన్నా! నీ ధర్మాచరణము నిన్ను ఈ యాపదనుండి రక్షింప లేకపోయినది కదా!"

అంతలో విభీషణుడు వచ్చి, రామునికి ఉపచారము చేసి, "రామా! ఇంద్రజిత్తు మాయాయుద్ధ విశారదుడు. అతడు మాయావి కూడ. ఇంద్రజిత్తు సీతను వధింపలేదు. అతడు వధించినది అతడు సృష్టించిన మాయ సీత. రావణుడు జీవించియుండగా సీతను వేరెవరూ అతని యాజ్ఞలేనిదే, అశోక వనమును ప్రవేశించి, సీతను తీసుకొని వచ్చుట సాధ్యము కాదు. అట్లైన ఇంద్రజిత్తును, ఆమెను తెచ్చి చంపుటెట్లు?- అతడు హనుమంతుని, వానరులను మోసగించి, నికుంభిలాచైత్యమునకు పోయి, హోమము పూర్తి చేయుటకు పన్నిన యుపాయము.

ఈ మాటలు విన్న రాముడు మూర్ఛనుండి తేరుకొని, "విభీషణా! చల్లని మాట చెప్పినావయ్యా! నీవు చెప్పిన మాటను మరొక మారు చెప్పుము.

## లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించుట

"ఇంద్రజిత్తు మాయసీతను సంహరించి, నికుంభలా హోమము చేయుటకు బయలుదేరి, అచ్చట ఒక వటవృక్షము చెంతచేరి హోమము చేయుచుండెనని" విభీషణుడు రామలక్ష్మణులకు చెప్పినాడు. ఇంద్రజిత్తు యజ్ఞ పరిసమాప్తి చేసినచో అతనిని జయించుట ఎవరికిని సాధ్యము కాదు." అని కూడ సూచన చేసెను.

లక్ష్మణుడు రామునితో "అన్నా! ఇప్పుడే నేను వెళ్ళి ఇంద్రజిత్తును సంహరించి" వత్తును. ఆజ్ఞ యిండు" అని ధనుర్బాణములు తీసుకొని, హనుమంతుని, సుగ్రీవుని, విభీషణుని, అతని మంత్రులను

వెంట బెట్టుకొని లక్ష్మణుడు ఇంద్రజిత్తు చేయు నికుంభిలా హోమము చెంతకు వెళ్ళి, అతనిని యుద్ధమునకు ఆహ్వానించినాడు.

వటవృక్షము చెంత ఎంతో నిష్ఠగా యాగకార్యము నిర్వహించు ఇంద్రజిత్తు వెనుదిరిగి, లక్ష్మణుడిని అతని ప్రక్కన ఉన్న విభీషణుడిని చూచి, "దుర్మార్గుడా! నీవు ఎంత ద్రోహమునకు పాల్పడినావు. అన్న కొడుకును చంపుటకు తలపడిన ఘాతకుడవు. ఇంటి గుట్టును రట్టు చేసి, లంకకు చేటు తెచ్చితివి కదా!" అని తూలనాడుచుండగా వానరులు నలుమూలల నుండి, వృక్షములతో, పెద్ద పెద్ద బండ రాళ్ళతో ఇంద్రజిత్తుపై బడ వేసిరి. లక్ష్మణుడు వింటిని ఎక్కుపెట్టి యుద్ధము చేయ ప్రారంభించెను.

ఉభయులు అస్త్ర ప్రత్యస్త్రములను ప్రయోగించుకొనిరి. పోరు ఘోరమైనది. ఇంద్రజిత్తు తన మాయా యుద్ధ ప్రభావమును చూపించెను. లక్ష్మణుడు దాని ప్రభావమునకు లోనుకాక, రాముడు, విభీషణుడు చెప్పిన ప్రకారము అతి జాగరూకుడై తన్ను తాను కాపాడుకొనుచు యుద్ధము చేయజొచ్చెను. చివరకు లక్ష్మణుడు ఇంద్రజిత్తు ఆట కట్టించుటకు, అమోఘమైన దివ్యాస్త్రమును అభిమంత్రించి, "ఓ అస్త్రరాజమా! దశరథాత్మజుడైన శ్రీరామచంద్రుడు సత్యసంధుడు, ధర్మాత్ముడు అగునేని, అతడు ఎదురులేని లోకైక ధానుష్కుడగునేని, నీవు యీ ఇంద్రజిత్తును సంహరింపుము"

మంత్రబలమును పొందిన నిశితవాడి శరము, ఇంద్రుని వంటి మహాబలశాలిని జయించిన ఇంద్రజిత్తు శిరమును ఖండించినది. ఇంద్రజిత్తు శిరము శరీరము నుండి వేరై నేలమీద పడినది.

ఇంద్రజిత్తు మరణమును గాంచి వానరులు, విభీషణుడు, అమితా నందభరితులైనారు. దేవతలు అతిలోక సాహసోపేతమైన ఇంద్ర జిత్తును వధించినందులకు లక్ష్మణునిపై పూల వర్షము కురిపించిరి. చావగా మిగిలిన రాక్షసులు తప్పుకొని పోయిరి. రాముడు లక్ష్మణుని కౌగిలించుకొని, "లక్ష్మణా! నీవు చేసిన అద్భుత కార్యము నిరుప మానము. ఇక రావణుని సంహరించి, సీతను పొందుట నాకు దుష్క రమేమియు కాదు." అని ప్రశంసించెను.

రావణుడు ఇంద్రజిత్తు మరణమును విని, తీరని నిరాశోప హతుడైనాడు. గుండె వ్రక్కలగునట్లు దుఃఖించెను. "కుమారా! నీవు త్రిలోకాధిపతినని విర్రవీగిన ఇంద్రుని జయించిన పరాక్రమశాలివి. ఈనాడు ఒక మానవుని చేతిలో, అతి శోచనీయముగ మృతి చెంది నావు. కుమారా! నీ యండను చూచుకొనియే నేను దేవ, యక్ష, రాక్షస, గంధర్వాది లోకములను జయించి, సాటిలేని మేటి విజేత ననిపించు కొనినాను. నీ వలననే యశో బలములు విశ్వ సన్నుతములైనవి. నీవు లేని లంక, నా జీవితము నిరర్థకము. నీచేత ఉత్తరక్రియలు చేయించు కొనవలసిన నేను, నీకే చేయవలసి వచ్చినది తండ్రీ! ఎంత హీన కర్ముడను? నన్ను, నీ తల్లి మండోదరిని, నీ భార్యను అందరిని వదిలి వెళ్ళితివి-రాముడు, సుగ్రీవుడు, విభీషణుడు, హనుమంతుడు మున్నగు శత్రువులు మిగిలి యుండగా, వారిని కడతేర్చక నన్నొంట రిగా వదిలి వెళ్ళిపోయినావా!" అని పరిపరి విధముల తలపోసి దుఃఖించెను.

ఇంద్రజిత్తు మరణమునకు రావణాంతః పురస్త్రీలు, మండోదరి, తక్కిన రాచపరివారము, రాక్షసులు తీరని దుఃఖము పాలైరి.

# రావణుడు తన మూలబలమును యుద్ధమునకు పంపుట

కుమారుడైన ఇంద్రజిత్తు మరణముచే దుఃఖోపహతుడైన రావణుని శోకమునుండి, కోపము సహస్ర జ్వాలాజిహ్వాలతో ఆవిర్భూతమైనది. అతడు తక్షణమే తన మూలబలమును పిలిచి, సేనానితో మీరు వెళ్ళి, రామునితో యుద్ధరంగమున తలపడి, అతనిని సంహరింపుడు ఒకవేళ చంపలేనిచో, అతనిని మీ మీ ఆయుధములచే, అస్త్రములచే తీవ్రముగా గాయపరుపుడు. అటైన, పిమ్మట నేనువచ్చి, అలసిసొలసి బలహీనుడైన రాముని నేను అవలీలగా వధించెదను. వెళ్ళుడు'' అని ఆజ్ఞాపించెను.

రాక్షససేనలు కదలి యుద్ధరంగమునకు చేరినవి. రాముడు ధనుస్సు, తూణీరమును, కవచమును ధరించి యుద్ధరంగమునకు పోయెను. అతడు మాత్రము ఎవరికి కనపడకుండ, కేవలము శర పరం పర శత్రువును నాటునట్లు, బాణవర్షము కురింపుచు అశేషమైన రాక్షసులను సంహరింప దొడగిరి-రాక్షసులు రాముని అంపవానకు ఎరయై గుంపులు గుంపులుగా ప్రాణములు వదలజొచ్చిరి.

లంకలో ఏ యింట చూచినను "హా పుత్రా! హా నాథా! హా భ్రాతా! హా తండ్రీ'' యను అరపులే వినిపింప దొడగినవి.

ఘోరముగా విలపించుచున్న రాక్షస స్త్రీలు వికార స్వరూపిణి యైన శూర్పణఖ వలన, రావణునికి, మనలంకకు ఇంతచేటు మూడినది. రావణుడు మూర్ఖుడు - విభీషణుడు నెత్తినోరు మొత్తికొని చెప్పినను రావణుడు వినడాయెను. అతని మాటలు వినినచో మనలంక యీ విధముగ శ్మశాన వాటికయయ్యెడిది కాదు కదా!'' అని వాపోయిరి.

రాక్షస స్త్రీల కడలేని యార్తాలాపములతో లంక ప్రతి ధ్వనించినది. రావణుడు కూడ, వారి దుఃఖవార్తలనువిని చలించినాడు. దుఃఖము, దుఃఖము నుండి కోపము, కోపము నుండి ఆపాద మస్తకము కంపనము, పండ్లు కొరుకుట వరకు వచ్చినది యతని స్థితి.

రావణుడు వెంటనే తనకు మిగిలిన సైన్యమునకు పిలుపు నిచ్చినాడు. తాను స్వయముగ యుద్ధరంగమునకు వెళ్ళుటకు నిశ్చయించినాడు.

## రావనుడు యుద్ధరంగమునకు వెళ్ళుట

రావణుడు, సిద్ధపరచి యుంచబడిన రథమునెక్కి యుద్ధరంగ మునకు బయలుదేరెను. అతనివెంట మహాపార్శ్వుడు, విరూపాక్షుడు, మహోదరుడు అనుసరించినారు.

రావణుడు యుద్ధమునకు బయలు దేరునపుడే కొన్ని దుఃశకున ములు కలిగెను. ఐనను అతడు వాటిని పరిగణింపక ముందుకు సాగినాడు. అతడు ఉత్తరద్వారమునుచేరి, అచటి వానరవీరులను శరవర్షముచే వధించివేసినాడు. వానరులట్లు రావణుని చేతిలో చచ్చుట చూచి, మితిలేని కోపావేశముతో సుగ్రీవుడు అనేకమంది రాక్షసులను చంపినాడు. అంత విరూపాక్షుడు సుగ్రీవునితో తలపడినాడు. విరూపాక్షుని కత్తి వేటుకు సుగ్రీవుని కవచము ఛిన్నమైనది. సుగ్రీవుడు అమాంతము విరూపాక్షునిపై దూకి అతనిని పిడికిలిచే బలముకొలది గ్రుద్దినాడు. విరూపాక్షుని శరీరము నుండి, రక్తము బిల బిలా స్రవించి, విల విల తన్నుకొనుచు నేలమీదపడి చచ్చినాడు. అదే విధముగ సుగ్రీవుడు మహోదరుని వధించినాడు.

మహాపార్శ్వుడను వానిని, అంగదుడు చూచి, తన పిడికిలి పోటుచే తొమ్ముసగుద్ది, నేల కరిపించినాడు. ఆ పోటుతో మహా పార్శ్వుడు హతుడైనాడు.

అంత రావణుడు, స్వయముగ రామునిపై యుద్ధమునకు గడంగెను. ఉభయులు కొంతసేపు తమకుగల అమోఘమైన దివ్యాస్త్ర పరంపరను ఒకరిపైనొకరు కురిపించుకున్నారు. ఉభయుల శరీరములు బాణఘాతములచే నెత్తురురోడుచు గాయములైనది.

రాముడు తనకు తగిలిన బాణఘాతములను లెక్కచేయక రావణుని మీద బాణ పరంపరను గుప్పించినాడు.

ఈ యదను చూచి "లక్ష్మణుడు తన బాణములచే రావణుని ధ్వజమును ముక్కలుచేసి, అతని సారథిని వధించినాడు. అంత రావణుడు విరథుడైనాడు. మరొక బాణముచే రావణుని చేతిలోని ధనస్సును విరిచినాడు.

ఆ సమయములోనే విభీషణుడు విజృంభించి, తన గదతో రావణుని రథాశ్వములను కూల్చినాడు.

రావణుడు, విభీషణునిపై విపరీతమైన కోపముతో ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైన 'శక్తి' యను ఆయుధమును ప్రయోగించెను. అద్దానిని లక్ష్మణుడు లాఘవముగా తన బాణత్రయముచే ముక్కలు చేసెను.

పిమ్మట రావణుడు విభీషణునిపై 'మహాశక్తి'ని ప్రయోగించినాడు. మహాశక్తి భీకరాట్టహాసము చేస్తూ విభీషణుని హతమార్చ బూనినది. ఆ శక్తిని లక్ష్మణుడు అడ్డుకొని, విభీషణుని అపాయము నుండి తప్పించినాడు. అంత ఆ మహాశక్తిని రావణుడు, లక్ష్మణునిపై ప్రయోగించినాడు. శక్తి లక్ష్మణునివైపు వచ్చుచుండగా చూచి,

రాముడు "ఓ మహాశక్తీ! నీకు మంగళమగుగాక! నీవు శాంతపడి, లక్ష్మణుని వధింపక, వ్యర్థపడి పోదువుగాక! అని యనెను.

రావణుడు ప్రయోగించిన మహాశక్తి లక్ష్మణుని హృదయమును నాటి గాయపరచినది.

## లక్ష్మణుని మూర్ఛ

లక్ష్మణుడు 'మహాశక్తి' ఘాతముచే, నిర్వీర్యుడై స్పృహ తప్పి నేలకొరిగెను. శరీరమంతయు రక్తసిక్తమయ్యెను.

లక్ష్మణుడు మూర్ఛనొందినట్లు తెలిసి రాముడు పట్టరాని దుఃఖముచే తమ్ముని శిరస్సును తన ఒడిలో చేర్చుకొని విలపింప దొడగెను.

"లక్ష్మణా! నీవు ఈ యుద్ధభూమిలో ఎంత దయనీయుడవై పడి యుంటివోయీ! నేను నీకు మిక్కిలి యపకారము చేసినాను. నా నిమిత్తము నీవు అడవికి వచ్చి, నిద్రాహారములు మాని నన్ను సేవించు చుంటివి. నీవు లేని నేను, సీతతో అయోధ్యనకు పోయి రాజ్యమును పాలించుట కల్ల. తల్లి సుమిత్రకు నేనేమని మొగముచూపను. నీవు మరణించినచో, ఇంక నాకా సీతతోను, రాజ్యముతోను ఏమి పని? 'నేను రావణుని సంహరించి' సీతతోను, నీతోను, వానరసేనా సమేతుడనై అయోధ్యకు పోయెదనని చేసిన బాస నిరర్థకమైనది లక్ష్మణా! సమయోచితమైన నీయమోఘమైన సహాయముచేతనే జనస్థానములో పదునాలుగువేలమంది దుష్టరాక్షసులను సంహరించితిని, నీ సహాయము, అండదండలు నాకు ఉండుటచేతనే, సీతా వియోగజమైన దుఃఖమును సహించి అడవిలో ఎట్టి యాపదకు గురికాకుండా బ్రతికితిని లక్ష్మణా! ఎంతపని జరిగినదోయి. లోకమున ఎవ్వరేని ఎందరు భార్యలనైనను సంపాదించవచ్చును. ఎచ్చటనైనను బంధుమిత్రాదులు లభించెదరు, కాని తోడబుట్టిన సోదరులను సంపాదించలేరు.

రాముడు చాలాసేపు అట్లు విలపించి, రావణుని క్షణములో హతమార్చెదనని నిశ్చయించి, ప్రళయకాల రుద్రునివలె ప్రచండమైన రూపము ధరించి ధనుర్బాణములను అందిపుచ్చుకొని, "వానరులారా! ఇక నన్ను ఈ భూమండలములో ఏ శక్తియును ఆపలేదు. మీరు 'రావణుని వధ' వార్తను వినుటకు కొలది సమయమే మిగిలియున్నది. రాముని పరాక్రమము, ధనుఃపాండిత్యము యుద్ధకౌశలమును మీరు స్వస్థచిత్తులై చూడుడి. రాముని రామత్వము మూడు లోకములకును ప్రత్యక్షఅక్షి గోచరమగుగాక. నా సీతను అపహరించి, నన్నధోగతి పాలు చేసి దురాత్ముడు, ఖలుడు రావణాసుడు ఇప్పుడు నాకంట బడి నాడు. ఇక వానిని బ్రతకనీయను. ఈ ప్రపంచ మెంతకాలముండునో, అంతకాలము, సమస్త ప్రజలు, ఋషులు, దేవతాగణము ఇప్పుడు జరుగు యుద్ధమును వేనోళ్ళ కీర్తించెదరుగాక."

వానర సోదరులారా! మీరు లక్ష్మణుని అతి జాగరూకులై కాపాడుడు మీరు భయపడవలదు. విజయము మనదే."

రాముడట్లు అనుచుండగా చెంతనే ఉన్న సుషేణుడు రామునితో "రామా! లక్ష్మణుడు మరణింపలేదు. దిగులొంద పనిలేదు. ఇతడు 'సంజీవని' యను ఓషధ రసముచే మూర్ఛ దీరును. అతని హృదయము ఆడుచునే యున్నది. ముఖ కవళిక తేజము తప్పలేదు" అని చెంతనే ఉన్న హనుమంతునితో "హనుమా! నీవు మునుపు జాంబవంతులవారు చెప్పిన విధంగా, ఓషధి పర్వతమునకు పోయి, అద్దాని దక్షిణ శిఖరమున గల 'సంజీవని' వృక్షమును తీసుకొని రమ్ము. దానితో లక్ష్మణునికి చికిత్స చేసి, 'మూర్ఛ దీరునట్లు చేతము" అని చెప్పెను.

## హనుమంతుడు సంజీవి పర్వతమును గొని తెచ్చుట

హనుమంతుడు లక్ష్మణుని మూర్ఛనుండి దీర్చగల 'ఓషధి' కొరకు బయలుదేరినాడు. వాయు వేగంతో పర్వతమును చేరుకొని, అచట సుషేణుడు చెప్పిన ఓషధి కోసం వెదుకసాగినాడు. కాని అతని కది ఎట్లుండునో, ఎట్లు లభించునో తెలియదు. కాన ఆలస్యము చేయక ఈ పర్వత శిఖరమునే తీసుకొని పోయి సుషేణున కప్పగిస్తే, అవసరమైన ఓషధిని తానే తీసుకొంటాడు అని భావించి కొండ శిఖరాన్ని ఊపి ఊపి, విరిచి దానిని తీసుకొని వచ్చినాడు.

సుషేణుడు, మున్నగువారు హనుమంతుని పరాక్రమము, బలశాలిత్వము, స్వామికార్య నిర్వహణ తీవ్రతను చూచి ఆనందించిరి.

ఓషధి ప్రభావముచే లక్ష్మణుడు మూర్ఛనుండి తేరుకొనినాడు.

రాముడు మహదానందముతో "తమ్ముని కౌగలించుకొని, "తమ్ముడా! నా భాగ్యవశమున నీవు బ్రతికితివి. నీవే చనిపోయిన నాకు భార్యతోను, ప్రాణములతోను పని యేమి?" అనుచుండగా "అన్నా! అట్లనకుడు. మీ దయవలన నాకెట్టి యాపదయు కలుగదు" అని బదులు చెప్పెను.

## యుద్ధభూమిలో మరల రావణుడు

రామలక్ష్మణులు, విభీషణునిచే రథము, ఛత్రము, అశ్వములు, అమ్ములు, తుదకు రథసారథియు ధ్వంసము గావింపబడి, విరథుడైన రావణుడు, తన మహాశక్తిచే లక్ష్మణుని మూర్ఛ నొందించిన పిమ్మట ఎట్టి యాలస్యమును చేయకుండా యుద్ధభూమి నుండి, రాచ ప్రాసాదమునకు వచ్చి మరొక రథమును సిద్ధము చేయించుకొని, అతనివద్ద గల సకలాస్త్రములను, తదితర యుద్ధ పరికరములను వెంటనిడుకొని యుద్ధ రంగమునకు బయలుదేరినాడు.

## ఇంద్రుడు రామునకు రథమును పంపుట

రావణుడు రథము మీదను, రామచంద్రుడు నేలమీదను ఉండి పరస్పరము యుద్ధము చేయుటను సమ్మతింపక ఇంద్రుడు మాతలిచే ప్రత్యేకమైన రథమును రామునకు పంపెను. మాతలి రథముతో రాముని వద్దకు వచ్చి నమస్కరించి "రామచంద్రా! మీ కొరకు ఇంద్రుడు ప్రత్యేకముగ ఈ రథమును, దివ్యాస్త్ర రాజములను మీ కొరకు పంపినాడు. వానిని స్వీకరించి, యుద్ధమున రావణుని సంహరించి, లోక క్షేమము నొరయుడని విన్నవించి పంపినాడు. నేను మీకు ఈ రథ సారథినై యుండెదను. చిత్తగింపుడు" అని నివేదించినాడు.

అదే సమయమున 'అగస్త్య మహర్షి' ఇతర ఋషులతోను, దేవతలతోను రామరావణుల యుద్ధమును ప్రత్యక్షముగ తిలకించుటకు వచ్చెను. వారు ఆకాశము నుండి చూచుచుండిరి.

అగస్త్యుడు రామునకు అమోఘము సర్వాభీష్టప్రదము, అత్యంత శక్తివంతమునైన "ఆదిత్య హృదయము" అను మంత్రరాజమును ఉపదేశించెను. ఆ మంత్రరాజమును ఉపాసించి, ఇంద్రుడు పంపిన రథమునకు భక్తితో ప్రదక్షిణము చేసి, రథము నారోహించి, రావణునితో ప్రత్యక్ష యుద్ధము చేయుటకు సన్నద్ధుడయ్యెను.

## రామ రావణ యుద్ధము

దేవ దానవ యుద్ధాలలో సైతము కనని, వినని ప్రచండ యుద్ధము రామ రావణుల మధ్య జరిగినది. ఏ మానవజాతి, సామాన్యమైనదని, తనను ఏ రూపములోను, ఏ విధముగాను నష్టపరుపలేదని భావించి, మానవుల వలన తనకు మృత్యువు లేకుండా చూడవలసినదని రావణాసురుడు వరముకోరి యుండలేదు. ఈనాడు అటువంటి

మానవుని చేతిలోనే తనకు మృత్యువు ప్రాప్తించనున్నదని తెలుసు కొని, ఎంతగానో కృంగిపోయినాడు.

రామ రావణుల యుద్ధమును దేవతలు, గంధర్వులు, యక్షులు, సిద్ధులు, మహర్షులు వచ్చి ఆకాశమునుండి చూడసాగినారు.

యుద్ధానికి ముందే రాముడి విజయము, రావణుని పరాజయ మును సూచించే శకునములు పొడసూపినవి.

ఇక ఉభయ పక్షములలోని సేనలు యుద్ధము చేయుట నిలుపు దల చేసినవి.

రామ రావణులు తెగించి పోరాడుచున్నారు. ఇద్దరు ఒకరి రథములను ఒకరు, ఒకరి గుఱ్ఱములను ఒకరు, ఒకరి కేతనమును ఒకరు ఇట్లా వారి వారి రణ పరకరాలను, చిహ్నాలను ధ్వంసం చేసు కున్నారు.

రావణుడు రామునిపై ఎడతెరపిలేని శర వర్షమును కురిపించి నాడు. రాముడు ఆ శరములను తన శరములతో భగ్నము చేసినాడు.

సాక్షులవలె ఆకాశముపైనుండి రామునితో రావణుడు చేయు యుద్ధము చూచి, ఏమగునోయని భయపడినారు. "రామునకు జయ మగుగాక, గోదేవబ్రాహ్మణులకు శుభము కలుగుగాక యని" ప్రార్థింప దొడగినారు.

రావణుడు పది తలలతోను, ఇరువది చేతులతోను యుద్ధము చేస్తున్నాడు. రాముడు తన నిశిత శరముచే రావణుని తల నరికినాడు. తెగిన రావణుని తల స్థానములో వెంటనే వేఱొక తల మొలిచినది

ఇట్లు రాముడు నూట ఎనిమిదిసార్లు, తన శరాసారముచే రావణుని తలలను త్రెంచినాడు. తెగిపోయిన తలల స్థానములలో వెంటనే మరల తలలు మొలిచినవి. అనగా ఎప్పటివలెనే అతని పది తలలు, అతని మెడపై ఉండుచూ పోయినవన్నమాట.

శ్రీరామునికి ఆశ్చర్యము, ఆలోచన కలిగినది. "నేనీ పరకు మాయా రూపులు, యుద్ధ విశారదుడైన మారీచుని, అతి బలవంతులైన ఖరుని, దూషణుని, విరాధుని, కబంధుని వధించితిని. కాని వారిపై పనిచేసిన బాణములేవియు, ఈ రావణునిపై పనిచేయుటలేదు. ఇందుకు హేతువేమైయుండును?"

ఇట్లనుకొనుచునే రాముడు రావణునిపై బాణములు కురిపించ సాగినాడు. రావణుడును రామునిపై పెక్కు ఆయుధములను తెరిపి లేకుండా ప్రయోగించజొచ్చినాడు.

అంతులేని బలవంతుల మధ్య యుద్ధము.

"రాముడు అనాలోచితముగ, సాధారణమగు యుద్ధము చేయుచున్నాడు. ఈ ప్రకారముగ యుద్ధము చేసినచో యెన్నాళ్ళకైనను రావణుడు చచ్చునట్లు లేదు" అనుకొని రథ సారథి మాతలి "రామా! ప్రాకృతునివలె ఏమిటి నీ యుద్ధ విధానము. రావణునిపై బ్రహ్మాస్త్రమును ప్రయోగించి చంపుము. దేవతలు విధించిన రావణుని వధ గడువు పరిమితి తీరిపోవచ్చుచున్నది. ఆలసింపక త్వరపడుము" అని హెచ్చరించెను.

## రావణ వధ

మాతలి హెచ్చరికతో రామునికి స్ఫురణ కలిగినది. వెంటనే అతడు దివ్య బాణమును సంధించి, రావణునిపైకి వదలినాడు. ఆ బాణము రావణుని వక్షఃస్థలమును నాటినది. అమోఘమును,

మంత్రముచేత సిద్ధపరుపబడినదియును ఐన ఆ దివ్యబాణము రావణుని ప్రాణములను హరించినది. ఆ బాణము భూతలమునపడి, వెనుకకు మరలివచ్చి, రాముని తూశీరమును జొచ్చినది. రావణుని కళేబరము. రథముపైనుండి క్రిందకు దొర్లినది.

రామ రావణ యుద్ధమున రామలక్ష్మణుల చేతిలోను, వానరుల చేతిలోను చావగా మిగిలిన రాక్షసులు లంకలోనికి పరుగెత్తి తలదాచు కొనిరి.

'రావణ వధ జరిగినది' అని తెలుసుకొనిన దేవగణము దుందుభులు మ్రోగించినది. అందరూ శ్రీరామచంద్రుని కొనియాడినారు.

లక్ష్మణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, విభీషణుడు వానర వీరులు రాముని చుట్టుముట్టి, ఆనందముతో పూజలు సలిపినారు,

## రావణ వధానంతరము విభీషణుడు

రావణుడు విగతజీవుడై యుద్ధభూమిలో పడియున్నాడు. అప్పుడు విభీషణుడు అతని శరీరము దగ్గఱకు పోయి భోరున విలపించి నాడు. "అన్నా! నా హితోక్తి వినవైతివి. నీతి విశారదుడవు. నిపుణ మతివి, అన్నిటా విజయములను గొన్న బలశాలివి. నీవిట్లు దిక్కులేని చావు చచ్చుటను భరింపలేకున్నాను" చెప్పిన హితవును పాటించి యుండిన ఈ రాముడే నిన్ను క్షమించి విడిచి పుచ్చెడివాడు. అట్లు చేయక నీ వినాశమును నీవే తెచ్చుకొన్నావు.

రాముడు విభీషణుని చెంతకు వచ్చి, 'విభీషణా! రావణుడు గొప్ప పరాక్రమవంతుడు. యుద్ధ రంగమున వీర పోరాటము సల్పి యోధుడై నాడు. అతడు అమరుడు. అట్టి యుద్ధవీరుని మరణమునకై దుఃఖింప రాదు. నీవు దుఃఖమును విడిచి, తరువాత జరగవలసిన ఉత్తర క్రియలను గురించి ఆలోచింపుము."

"రామా! రావణుడు గొప్పవాడు. తపస్సంపన్నుడు, వేద పండితుడు. ఆహితాగ్ని. నీ యనుజ్ఞయైనచో తోడబుట్టినవాడు కాన ఈతని అంత్యక్రియలను నేను నిర్వర్తించెదను."

"అట్లే విభీషణా! యథాశాస్త్రముగ నీ సోదరుని యంత్యక్రియలను నిర్వర్తింపుము. ఇతరులతో శత్రుత్వమనునది, వారు బ్రతికి యుండునంతవరకే. చచ్చినవారి మీద సాధించు పగ యేముండును? కనుక నిస్సందేహముగ ఇతనికి సంస్కారమును నిర్వహింపుము.

## రావణ స్త్రీలు మరియు పట్టమహిషి మండోదరి విలాపము

రావణుడు చనిపోయినాడన్న వార్తవిని అతని భార్యలు తమ భర్తను చూచి చాల దుఃఖించిరి. కొందరు అతని తలను తమ ఒడిలో పెట్టుకొని దుఃఖించినారు. కొందరు రావణుని గొప్పతనమును స్మరించుచు ఏడ్చినారు.

రావణ పట్టమహిషి మండోదరి ఎంతగానో విలపించినది. నాథా! నీవు ఇంద్రుని సైతము అనేకమార్లు భయకంపితుని చేసి పరుగెత్తించినవాడవు. అట్టి నిన్ను మనుష్యుడొకడు వధించెననుట చిత్రముగనే యున్నది. జనస్థానములో రాక్షసుల వధ, మారీచ వధ, లంకలోనికి ఆతని దూత హనుమంతుని రాక, సముద్రమునకు సేతువు నిర్మించుట మున్నగు కార్యములు అతి మానుషములు. కావున రాముడు మానవ మాత్రుడు కాదు. ఈ మాట నేను మొదటనే చెప్పితిని. నీవు వినవైతివి. భర్తా! రాముడు, కేవలము మానవమాత్రుడు కాదయ్యా! అతడు విష్ణు తుల్య పరాక్రముడు. శంఖచక్ర గధాధారియైన విష్ణుదేవుడే ననిపించుచున్నదని నుడివితిని. నీవు వినవైతివి. నిన్ను చంపుటకే ఆ విష్ణు భగవానుడు, ఈ రాముని రూపమున వచ్చినాడు. నిష్కారణముగా సీతను కోరి వినాశనము తెచ్చుకొన్నావు. సీత అరుంధతి, అనసూయ,

రోహిణి మున్నగు వారి కోవలోని పతివ్రత. ఆమెను చెర పట్టుట ఎంత తప్పు? మహాపతివ్రతయైన సీతయొక్క దుఃఖాగ్నియే నిన్ను శలభమును వలె మాడ్చి చంపినది. నీ సోదరుడేయైనను పుణ్యాత్ముడైన విభీషణుడు సుఖముగ నున్నాడు. నీవు పాపాత్ముడవు కాన ఈ దుర్గతి పాలైనావు.

పరస్త్రీ వ్యామోహముతో నీవు నా అందచందములను గుర్తించ లేదు. ఆదరించలేదు. సీత నాకన్న అందమైనదా! గుణవతియా! అధికురాలా! సమానురాలా! ఏదియును కాదు. కాని యామె మహా యిల్లాలు, పూజ్యురాలు, గుణవంతురాలు.

నీవు సీతను తెచ్చుట మృత్యుదేవతను మూటగట్టుకొని వచ్చుట యేయైనది.

ఇంద్రజిత్తు చచ్చినపుడే, నేను చచ్చినదాననైతిని. ఇప్పుడు నీవు చచ్చినావు.నాకు పై భవ్యము కలుగునని మనసులోనైనా ఊహించ లేదు.

నీ పుణ్య పాపములను మూటగట్టుకొని నీ దారిన నీవు పోయి నావు. మరి నా గతి యేమి?

విభీషణుడు, మారీచుడు, కుంభకర్ణుడు, మా తండ్రి వీరంతా చెప్పిన హితవాక్యములను కాదన్నందుకు నీకీ శాస్త్రి జరిగినది"

ఇట్లు ఏడ్చి ఏడ్చి మండోదరి రావణుని శరీరముపైబడి శోషిల్లి నది రావణుని ఇతర భార్యలు మండోదరికి ఉపచారములోనర్చిరి.

## విభీషనుడు రావనునికి సంస్కారము చేయుట

రాముడు విభీషణునితో స్త్రీలను అంతఃపురములోనికి పంపి, మీ అన్నకు అంత్య క్రియలు నిర్వర్తింపుమనెను.

విభీషణుడు మొదట నిరాకరించినను, అన్నకు సంస్కారములు చేయని దుర్మార్గుడనని "లోకులు నన్ను నిందింతురు. కనుక దుర్మార్గుడైనను అతనికి సంస్కారము చేతును." అని శాస్త్రోక్తముగ రావణునికి, విభీషణుడు అగ్ని సంస్కారము గావించినాడు. పిమ్మట అతడు నదీస్నానముచేసి, రాముని యొద్దకువచ్చి ఆజ్ఞ కొరకు నిలబడినాడు.

## విభీషణు పట్టాభిషేకము

రామ రావణుల యుద్ధమును చూడవచ్చిన ఇంద్రుడు, ఇతర దేవతలు తమతమ నివాసస్థానములకు వెడలినారు. మాతలిని రథయుక్తముగా ఇంద్రుని వద్దకు రాముడు పంపినాడు.

వానరులంతా సంతోషముతో ఉప్పొంగిపోయినారు. సుగ్రీవుడు రాముని కౌగలించుకొన్నాడు. అందరూ తమ శిబిరాలకు చేరుకున్నారు.

రాముడు "లక్ష్మణా! విభీషణుడు నాకు ఎంతో ఉపకారము చేసినాడు. ఇతడు నా భక్తుడు. ఇతనికి లంకా రాజ్య పట్టాభిషేకము చేయించవలెను. వలయు సన్నాహముల చేయింపుము.

లక్ష్మణుడు సహచరులచే "బంగారుకలశాలతో సముద్ర జలమును తెప్పించినాడు అతడు వానర రాక్షసులందరి సమక్షంలో విభీషణుని సింహాసనాధీశుని చేసి, సత్కరింపజేసినాడు.

విభీషణునికి పట్టాభిషేకము జరిగినది. ఇప్పుడాతడు రాక్షసేశ్వరుడైన లంకాధిపతి. అతడు అనుకూలురైన రాక్షసులను మంత్రులుగా చేసుకొని, అందరను మెప్పించి, శ్రీరామ దత్తమైన రాజ్యమునకు అధినాథుడై రాముని వద్దకు వచ్చి నమస్కరించెను.

## శ్రీరాముడు సీతాదేవి కడకు హనుమంతుని పంపుట

రాముడు హనుమంతునితో "మహాప్రభువైన విభీషణుని యనుమతిగొని, లంకలోనికి పోయి, మేమందరము కుశలముగా నున్నామను వార్త తెలిపి, రావణ హతకుడు నిహతుడైనాడనియు చెప్పి, ఆమె భయము దీర్చి, ఆమె చెప్పు సందేశమును తీసుకొని రమ్ము" అని చెప్పి పంపెను.

హనుమంతుడు, విభీషణుని యాజ్ఞగొని, లంకలోని అశోక వనములోనికి పోయి సీతకు నమస్కరించి రామలక్ష్మణుల క్షేమ వార్త తెలిపినాడు. అప్పటికి ఆమె రాక్షస స్త్రీలచే పరివేష్టింపబడియే యున్నది.

సీత హనుమంతుని చూచి మొదట మాటాడలేదు. తరువాత పోల్చుకొని, సంతోషపడినది.

అప్పుడు హనుమంతుడు "అమ్మా! నన్ను పోల్చుకొని యుందువు. నేను హనుమంతుడను. శ్రీరామ ప్రభువు రావణుని, అతని అశేషబలగమును సంహరించి కుశలియై అనుచరుల శిబిరమున నున్నాడు. మీ క్షేమ సమాచారము కనుగొని రమ్మన్నాడు."

మరియు రాముడిట్లన్నాడు "దేవీ! నా అదృష్ట వశమున నీవు బ్రతికి యున్నావు. యుద్ధమునందు మనకు జయము కలిగినది. శత్రువైన రావణుడు హతమైనాడు. ఇప్పుడు లంక మన వశములో నున్నది. ఈ రాజ్యము మనకు హితుడు సన్నిహితుడు ఐన విభీషణునికి పట్టాభిషేకము గావించితిని మన యింట నున్నట్లే సుఖముగ నుండును. నిన్ను విభీషణు డిప్పుడే వచ్చి చూడగలడు"

హనుమంతుని మాటలు విని సీత ఏమియు ప్రతిసమాధాన మీయలేదు.

హనుమంతుడు సీత నడిగినాడు. "అమ్మా! ఏమియు బదులు పలుకవైతివి" అనెను.

అప్పుడు సీత సంతోషముతో "హనుమా! ఇంత గొప్ప శుభ వార్త చెప్పిన నీకు ఏమియు బహుమతి నొసంగలేక పోతినేయని చింతించుచున్నాను." అనెను.

"తల్లీ! నీవు ప్రసన్నురాలవై పలికిన మాటలే చాలును. నాకేమియు వలదు. శ్రీరాముని సేవాభాగ్యము నాకు లభించినది. అదియే నాకు పెన్నిధి." అని హనుమంతుడనెను.

"హనుమా! నిన్ను కన్న తల్లి దండ్రులు ధన్యులు. మధురవాక్య విశారదుడవు. బలము, పాండిత్యము, ధైర్యము, ఉత్సాహము, పరాక్రమము నీ యందు ప్రకాశించుచున్నవి. ఇన్ని సద్గుణము లాశ్రయించిన నీవు కారణజన్ముడవు సుమా!"

సీత మాటలకు హనుమంతుడు ఉబ్బితబ్బిబ్బయినాడు.

హనుమా! నేను శ్రీరాముని ముఖచంద్రబింబమును వేగిరమే చూడగోరుచున్నాను. రామచంద్రుని కీ విషయమును వెంటనే విన్న వింపుము.

అట్లే తల్లీ! నేనిప్పుడే వెళ్ళి రామప్రభువున కీ విషయమును తెలిపెదను. అతి శీఘ్రముగా నీవు శ్రీరాముని చూడగలవు." అని హనుమంతు డచటినుండి శ్రీరాముని చెంతకేగెను.

## హనుమంతుడు సీత సందేశమును రామునికి వినిపించుట

హనుమంతుడు రాముని వద్దకు వచ్చి 'సీత తక్షణమే మిమ్ము చూడగోరుచున్నది. ఆమె శోకముతో తపించి, కృశించి మాట్లాడ లేకున్నది. నీ విజయవార్త విని మిక్కిలి సంతోష పడినది.

హనుమంతుని మాటలను విని శ్రీరాముడు అమితానంద భరితు డైనాడు. పక్కనున్న విభీషణునితో "విభీషణా! వెంటనే సీతను తల స్నానము చేయించి, సకలాభరణ శోభితనుగా నొనర్చి, యుచటికి తీసుకొనిరమ్ము." అనెను. విభీషణుడు రాముడు ఆజ్ఞాపించినట్లు అంతఃపుర స్త్రీలచే సీతను సాలంకృతనుగా చేసి రాముని వద్దకు వచ్చెను.

రామునికి సంతోషము, దైన్యముచే రోషము పెనవేసుకొనినవి. సీతను చూచుటకై వానరులు, రాక్షసులు గుంపులు గూడి వచ్చిరి. విభీషణుడు వారిని వారించుచుండగా "విభీషణా! వారిని వారించకుము వారెల్లరు నావారు. స్త్రీకి సచ్ఛీలమే కవచము. ఇళ్ళు, వాకిళ్ళు వస్త్రప్రాకారము, తెరలు, ఇతర మర్యాదలు ముఖ్యము కాదు. దుఃఖ వేళల్లో, యుద్ధభూమిలో, స్వయంవర సమయంలో, యజ్ఞ సమ యంలో, వివాహవేళలలో స్త్రీలు బహిరంగముగ వచ్చుట తప్పు కాదు. ఇప్పుడు సీత యుద్ధభూమిలో నున్నది. కష్టమును పొంది యున్నది. అదియును గాక సీత నావద్దకు వచ్చుచుండగా ఆమె చూచుటకు వచ్చు యితరుల నెందుకు వారించుట. ఆమెను నిరాటంకముగ తీసుకొని రండు." అని పలికెను.

లక్ష్మణుడు. సుగ్రీవుడు, హనుమంతుడు రాముని కఠినమైన మాటలకు ఖేదపడినారు.

సీత కా విషయము తెలియదు ఆమెను విభీషణుడు జన మధ్యము నుండి రాముని చెంతకు తీసుకొని వచ్చుచున్నాడు ఆమె తొట్రుపాటుపడుచు భర్తవద్దకు వచ్చి "ఆర్యపుత్రా!"

# రాముడు సీతను పరుషము లాడుట

"సీతా! యుద్ధములో నా శత్రువైన రావణుని సంహరించి నా శపథమును తీర్చుకొంటిని. చపలచిత్తుడైన రావణుని వద్ద, శత్రు పట్టణములో నీవు చిరకాలమున్నావు. దైవయోగమున సీతా! నీవు ఆ దురాత్మునిచే అపహరింపబడినావు. అతడు నీ కోసము నన్ను తీరని యవమానము పాలు చేసినాడు. అందులకు ప్రతీకారము తీర్చు కొంటిని. నా తండ్రి కిచ్చిన మాటను నిలబెట్టుకొంటిని.

ఈ సుగ్రీవుడు, హనుమంతుడు, విభీషణుడు, అంగదుడు మున్నగు వారి సహాయముచే నేను శత్రువును సంహరించి, నా ప్రతిష్ఠను నిలుపు కొంటిని."

శ్రీరాముని మాటల ధోరణి చూచి, సీత బాధపడినది. ఆమె కన్నులలో నీరుబికి వచ్చినది.

"సీతా! చిరకాలము శత్రుని యింటనున్న స్త్రీని పౌరుషముగల వాడెవడును పరిగ్రహింపడు. నీవు రాక్షసుని యింట సురక్షితముగా నున్నావని విశ్వసించుట యెట్లు? అందుబాటులోనున్న నీ యంద చందములను చూచి, అతడు సహించి యూరకుండునా?"

రాముని కఠినోక్తులకు సీత ఆపాదమస్తకము చలించిపోయినది. అతడట్లు ఎందులకనుచున్నాడో అర్థముకాలేదు. ఆమె కన్నులనుండి నీరు కారుచున్నది. ఆ నీటిని తన కొంగుచే నద్దుకొని, "ఆర్యపుత్రా! నన్ననరాని మాటలనుచున్నావు. అవి నీవు ఆడదగినవికావు. నేను వినదగినవికావు. నేను రావణునివద్ద చిరకాలమున్నమాట వాస్తవమే. కాని నేను వాని మాయ మాటలకు లొంగినదానిని కాను. నిరంతరము నీ ధ్యానముననే ప్రొద్దు పుచ్చిన నిరపరాధను. నా వలన ఏమియు తప్పులేదు. నన్ను విశ్వసింపుము. రావణుడు నన్ను తీసుకొని వచ్చు వేళ స్మృతిలోనున్నదానను కాను. కావున నన్ను తాకి నా శరీర మును బలాత్కారముగా తీసుకొని పోయినాడు. నేనేమి చేయగలను.

నీవిట్లు నన్ను త్యజించుచున్నట్లు, ఆనాడు హనుమంతుడు నా వద్దకు సముద్రమును దాటి వస్తున్నప్పుడు చెప్పి పంపిన అప్పుడే మరణించి యుందును" అని చెప్పి లక్ష్మణునివైపు చూచి,

"లక్ష్మణా! ఇక నేను జీవించి యుండుట అనవసరము. ఇంత మంది ప్రజల మధ్యన, భర్తచే అవమానితనై, అనుమానితనై జీవించుట కుదరదు. వెంటనే నీవు చితిని పేర్చింపుము. నేను అగ్నిలోపడి దహనమై పోయెదను."

లక్ష్మణుడు, రామునివైపు దీనముగా చూచెను. రాముడు సీత కోరినది తన కంగీకారమే యన్నట్లు మిన్నకుండెను. చేయునదిలేక లక్ష్మణుడు చితి పేర్పించెను.

## సీత అగ్ని ప్రవేశము

చితిలో అగ్నిహోత్రుడు సహస్రజ్వాలా జిహ్వాలతో మంటలు చిమ్ముతున్నాడు.

సీత అక్కడ కూడిన అసంఖ్యాకులైన వానర రాక్షసుల సమక్షంలో రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు, హనుమంతుడు, అంగదుడు మున్నగువారల సమక్షములో, ఆకాశమునుండి తిలకించుచున్న సూర్యచంద్రులు, దేవతలు, ఋషులు సాక్షిగా, ఇంకను దిగ్దేవతల సాక్షిగా, ధర్మాత్ముడైన రాముని వద్దకు సమీపించి అతని పాదములకు నమస్కరించి, భక్తితో ప్రదక్షిణ సలిపినది. పిమ్మట చుట్టును గుమిగూడిన సర్వులకు నమస్కారముచేసి, అగ్నిహోత్రునివద్దకు వచ్చి ప్రదక్షిణ పూర్వకముగా నమస్కరించి-

"నా మనస్సు ధర్మవిగ్రహుడైన శ్రీరాముని ఎల్లప్పుడు విడువకుండా భక్తితో స్మరిస్తూ ఉండినదైతే "ఈ అగ్నిహోత్రుడు నా

స్వచ్ఛరిత్రమును నిరూపించుగాక! నేను ఏనాడును ధర్మము తప్పక నడచుదానను కాను. అయినన ఈ అగ్నిహోత్రుడు నన్ను రక్షించు గాక!

సకల దేవతల సాక్షిగా నేను పాతివ్రత్యమహితననునేని ఈ యగ్నిహోత్రుడు నన్ను కాపాడుగాక!''

అని ప్రార్థించి సీత అగ్ని ప్రవేశమొనరించినది. సీతకెట్టి హానియు కలుగలేదు.

అప్పుడు దేవతలందరూ ఆకాశమునుండి క్రిందికిదిగి వచ్చారు. దేవేంద్రుడు, బ్రహ్మదేవుడు, మహేశ్వరుడు, దశరథుడు ఇంకను ఋషిగణము ఆ యుద్ధభూమికి తరలి వచ్చారు.

దేవతలు రామునితో "రామచంద్రా! నీవు సాక్షాత్ శ్రీమన్నారాయణుడవు. నీవు రావణ సంహారముకొరకు రామునిగా ఈ భూలోకములో జన్మించితివి. ఈ సీత ఆదిలక్ష్మి. మీ యుభయుల అవతారము లోక కళ్యాణమునకై ఉద్దేశింపబడినట్టిది."

అంతలో అగ్నిదేవుడు "రామా! ఈ సీత మహాసాధ్వి! ఈమె యందే దోషమునులేదు. నిస్సంశయముగ నీవు పరిగ్రహింపుము నీకే విధమైన మాలిన్యదోషము అంటజాలనట్లే, ఈ సీతకుకూడ ఎట్టి మాలిన్యము అంటుటకు వీలులేదు. ఈమె అయోనిజ" అని శ్రీరామున కప్పగించెను.

సీత అగ్నిలో ప్రవేశించినప్పుడు ఏ విధంగా సాలంకృతయై యున్నదో అదేవిధముగా ఇప్పుడును యున్నది. ఆమె అక్షత. అగ్నిహోత్రుడు సగౌరవముగా పూజించి, శ్రీరామునకు అప్పగించినాడు.

శ్రీరాముడు అందరి సమక్షమున చేతులు చాచి, సీతను ఆహ్వానించి పరిగ్రహించినాడు. "దేవతలారా! మీరు మమ్ములను ఆశీర్వదింపుడు. నా సీత పవిత్రురాలు అని నాకు తెలియును. ఈ యగ్నిదేవుడామెను కాల్చదనియు తెలియును. నాకు తెలిసిన ఈ సీత పవిత్రత,

పరిశుద్ధత లోకులకు తెలియదు. శ్రీరాముడు స్త్రీలోలుడనియు, పర పురుషుడు ఎత్తుకొనిపోయిన భార్యను మరల తెచ్చుకుని సుఖించు చున్న వ్యామోహియని ప్రజలు నన్ను నిందింతురు. అట్టి లోకనిందకు వెరచి, సీతకి యగ్నిపరీక్ష పెట్టితినే కాని సీత పవిత్ర శీలమును శంకించి కాదని" చెప్పి సీతను ప్రేమతో అక్కున చేర్చుకొనెను.

ఈశ్వరుడు :- "రామా! నీవు సీతతో, లక్ష్మణునితో అయోధ్యకు వెళ్ళి, వెంటనే పట్టాభిషిక్తుడవు కమ్ము. నీవు అశ్వమేథ యాగముచేసి, తరువాత నీ స్వస్థలమైన వైకుంఠమును చేరుదువుగాని. సీతను పరిగ్ర హింపుము. నీ తండ్రి దశరథుడుకూడ, పుణ్య లోకములనుండి విమానములో వచ్చి యున్నాడు. మాట్లాడుము."

బ్రహ్మ :- "రామా! ఈ సీత మహాసాధ్వి. సాక్షాత్తూ వైకుంఠము లోని లక్ష్మీదేవి. నీవు శంఖ చక్ర, గదా, శార్ఙ్గధరుడవైన శ్రీమహా విష్ణువవు. రావణ సంహారము నిమిత్తము భూలోకమున మీరిట్టి యవ తారములను దాల్చి యుంటిరి. రామా! నీవు జగన్నాటక సూత్రధారి వైన ఆదిమూర్తివే."

రాముడు, సీతను పరిగ్రహించినాడు.

విమానస్థుడై యున్న దశరథునకు రామలక్ష్మణులు నమస్క రించినారు.

దశరథుడు రామునితో "రామా! నీవు అయోధ్యకు వెళ్ళి, పట్టాభిషేకము చేసుకొని సుఖముగా నుండుము" అని యాశీర్వ దించెను. దశరథుడు లక్ష్మణుడు, అన్నకు చేసిన సేవలను అభి నందించి "నీవు నీ ధర్మఫలమును పొందితివి. రాముడు సంతోషపడిన

ధర్మము, యశము, సద్గతి, మహిమ అన్నియును కలుగును. పురుషో త్తముడైన రామునికి ఇప్పటివలెనే ఎల్లప్పుడును సేవ చేయుచుండుము. నీకు శుభమగుగాకయని ఆశీర్వదించి, రామలక్ష్మణుల నిద్దరను కౌగ లించుకొనెను. దశరథుడు సీతాదేవితో రాముడెంత నిందించినను, అతనిపై కోపమాడకుము. నీ పాతివ్రత్యతను, లోకమున చాటుటకే ఆతడీ పనిచేసినాడు. ఇక పతిసేవను గురించి నీకు చెప్పెవిదేమియు లేదు. సీతా! ఆ రాముడు పరదైవము.

ఇంద్రుడు :- శ్రీరాముని చెంతకు వచ్చి, రామా! నీ దర్శనము నాకు మిక్కిలి సంతోషము కలిగించినది. నీకు వరమీయదలచితిని. కోరుకొనుము.

"దేవాధిపతీ! నా కొరకు ప్రాణములర్పించిన వారినందరినీ బ్రతి కింపుము. ఇదియే నాకు పెద్ద వరము. వారందరూ పునర్జీవితులై, తమ తమ భార్యలను కలుసుకొని సుఖముండునట్లు చేసిన చాలును."

ఇంద్రుడు రామునకిచ్చిన వరదానము వలన వానరులందరూ పునర్జీవితులైనారు.

దేవతలందరూ రామలక్ష్మణుల వద్ద సెలవు తీసుకొని వెళ్ళి నారు.

## విభీషణుడు వానర వీరులను సత్కరించుట

తరువాతి రోజున ప్రాతఃకాలముననే విభీషణుడు శ్రీరాముని చెంతకేగి "రామభద్రా! నీకు యథా శాస్త్రముగా మంగళస్నానము చేయించి, అలంకారము చేయుటకై ఇదుగో ఈ పరిచారికలు వచ్చి యున్నారు. దయచేసి నీవు ఆమోదించి, నన్ను కృతార్థుని చేయుము అనెను,

"విభీషణా! నా తమ్ముడైన భరతుడు జటావల్కలధారియై, సన్యాసియై, సమస్త రాజభోగములను పరిత్యజించి, నా రాకకొరకు తపించిపోవుచున్నాడు. అతనిని కాదని, అతడు లేక నేనెట్టి సత్కార్య ములను, ప్రశంసలను కోరను. దయయుంచి నీవు అన్యథా భావింప కుము. మేము ఏ విధముగనైన మరల వేగిరమే అయోధ్యకు చేర వలయును.

రాముడట్లనిన నంతనే విభీషణుడు పుష్పక విమానమును తెప్పించి "రామప్రభూ! విమానము సిద్ధముగా నున్నది. మీ యాజ్ఞ" అని చేతులు ముడుచుకొని నిలువబడెను.

విభీషణా! నీవు చేసిన మేలు మరువను. నేను నీకు సమకూర్చిన లంకా రాజ్యమును విడువకుండా, సుభిక్షముగ, ధర్మ సమ్మతముగ పరి పాలింపుము."

సుగ్రీవా! నీ మేలు చిరస్మరణీయము, అసదృశము. నర, వానర సఖ్యమున అపురూపమైన వారథిలాంటి వాడివి. ఒక మిత్రుడు చేయ వలసిన పనియంతయు చక్కగ శ్రద్ధగా చేసితివి, నీకు నేనొసగిన 'కిష్కింధ'ను జాగ్రత్తగా పరిపాలింపుము వానరులారా! మీరందరు ప్రభుభక్తి పరాయణులు. సుగ్రీవుని అంటిపెట్టుకొని ధర్మపరులై సుఖ జీవనము చేయుడు."

శ్రీరాముడట్లు అక్కడ గుమిగూడియున్న ప్రముఖులందరిని, వారి వారి యోగ్యతల ననుసరించి, పలుకరించి, అందరివద్ద సెలవు తీసుకొని పుష్పక విమానమెక్కబోవుచుండెను.

అప్పుడు విభీషణుడు "రామా! నీవు అన్యథా భావింపకుము. నీతోపాటు అయోధ్యకు, నేనును, సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడు, తక్కిన వానరులందరును "అయోధ్యకు వచ్చి, నీ పట్టాభి షేకోత్సవమును తిలకించవలెనున్నది. దయయుంచి అనుమతింపుము" అనెను.

రాముడట్లేయని, వారందరు వచ్చుటకు సమ్మతించెను.

## శ్రీరాముడు సీతా లక్ష్మణులతో అయోధ్యకు ప్రయాణమగుట

శ్రీరాముడు పుష్పక విమానములో సీతా లక్ష్మణులతోను, విభీషణునితోను, అశేష వానర సమూహముతోను అయోధ్యకు బయలుదేరినాడు. మార్గ మధ్యములో సీతాదేవిని, ఆమెనుండి యెడబాటు కలిగిన తరువాత అడవులలో తాను చేసిన అద్భుత కర్మములు, ఆయా ప్రదేశముల నుండి మరలిపోవునపుడు చూపి, వివరించి చెప్పెను.

పుష్పక విమానము గగన తలంమీద కదలింది. రాముడు "సీతా! ఇదిగో ఇక్కడనే నేను రావణునితో యుద్ధముచేసినాను. ఇదిగో ఇచ్చటనే నేను వానిని సంహరించినాను. ఈ ప్రదేశముననే లక్ష్మణుడు ఇంద్రజిత్తును కూల్చినాడు. సీతా! చూడు మనమిప్పుడు సముద్రమును దాటుచున్నాము. ఆ కనిపించు సేతువును మన వానర వీరులు నిర్మించినారు. సముద్రమున కవ్వలి ప్రదేశముచూపి, సీతా! ఇచ్చటనే విభీషణుడు నన్ను శరణుకోరినాడు. అదిగదుగో ఋష్యమూక పర్వతము. ఈ పర్వతముపైననే, సుగ్రీవునకు, మాకు మైత్రి కలిగినది. అదియే కిష్కింధ వానరుల రాజ్యము. ఇచట దురాత్ముడైన వాలిన చంపి, సుగ్రీవుని కిష్కింధాధిపతినిగా చేసితిని.

'కిష్కింధ'ను చూడగానే సీత రామునితో అన్నది "నాథా! నా మనవి యొకటి కలదు. దయచేసి మన్నింపుడు. వానరులు మనకింతమేలు కూర్చిరికదా! ఈ కిష్కింధలోని సుగ్రీవుని భార్యలు రుమ, తార, మరియు ఇతర వానరుల పడతులు అందరూ మనవెంట వచ్చి, అయోధ్యాపురమును వారి సతులతోకూడి సందర్శించవలెనని యున్నది. అనుగ్రహింపుడు" అన్నది.

రాముడు సంతోషముతో అంగీకరించి సుగ్రీవునితో "సుగ్రీవా! నీవు నీ పత్నులు, ఈ వానరవీరుల పత్నులను మనతో అయోధ్యకు ఆహ్వానింపుడు. అక్కడి పురమును వేడుకలనుచూచి వచ్చెదరు. సీత వారి నాహ్వానించుచున్నది." అనెను.

విమానము 'కిష్కింధ' వరకు వచ్చి ఆగినది. సుగ్రీవుడు "వానరులారా! కిష్కింధలోనికి వెళ్ళి, మీ మిత్రులను మీతో అయోధ్యకు వచ్చుటకు ఆహ్వానింపుడు. రాజమందిరములోనికి పోయి మా యాజ్ఞగా మా రాణి వాసమును కూడ కొనితెండు" అని యాజ్ఞా పించెను. వానర స్త్రీలు కూడ పుష్పక విమానము నధిరోహించినారు.

పుష్పక విమానము మరల కదలినది. రాముడు మరల సీతతో తాము చేయు ప్రయాణ విశేషములను చెప్పుచుండెను.

"సీతా! దిగువ వున్నది 'శబరి' యాశ్రమము. ఆమె మహా భక్తురాలు. మాకు అపురూపమైన ఆతిథ్యమిచ్చిన పుణ్యాత్మురాలు. తరువాత రాముడు సీతకు కబంధుని వధించిన ప్రదేశము చూపెను. తండ్రి వంటి జటాయువు నీ కొరకు రావణునితో పోరాడి ఆ దుర్మార్గుని కరవాలధారచే రెక్కలు, కాళ్ళు పోగొట్టుకొనినాడు. గుర్తుపట్టినావా? ఆ ప్రదేశమును. ఇదిగో! ఇదియే మన పర్ణశాల ఇందుండియే నిన్ను, రావణాసురుడు అపహరించుకొని వెళ్ళినాడు. సీతా! ఇది చిత్రకూట పర్వతము. ఈ పర్వతమున నున్నప్పుడే 'భరతుడు' వచ్చి నాకు బదులుగా, నా పాదుకలను తీసుకొనిపోయి రాజ్యపాలన చేయుచున్నాడు. దేవీ! ఇదిగో! భరద్వాజాశ్రమము- ఫలపుష్ప భరితమైన వృక్షరాజములచే, అందమైన పెంపుడు మృగము లచే, పక్షులచే, విలసితమై చూడముచ్చటగ నున్నది.

# భరద్వాజాశ్రమము

విమానము భరద్వాజుని ఆశ్రమ ప్రదేశమున ఆగినది. రాముడు, సీత, లక్ష్మణులు విమానమును, దిగి, ఆశ్రమములోనికి పాదచారులై యరిగి, మహర్షికి నమస్కరించారు.

మహర్షి వారిని ఆశీర్వదించి, 'రామా! నీవు ఆనాడు ఆశ్రమము నుండి సెలవు తీసుకొని పోయినది మొదలు జరిగిన వృత్తాంత మంతయు నా దివ్యదృష్టితో చూచి తెలుసుకున్నాను. నీవు మా సాదరపూర్వకమైన యాతిథ్యమును స్వీకరించి, అయోధ్యకు వెళ్ళి, పట్టాభిషిక్తుడవై ప్రజారంజకముగా రాజ్యమును పాలించి సుఖము గానుండుము భరతుడు నీ కొరకు వేచియున్నాడు."

"రామా! అద్భుతచరిత్రుడవైన నీకు వరము నివ్వవలెనని యున్నది. కోరుకొనుము" అనెను.

రాముడు 'మహర్షీ! నీవు నాయందు దయవుంచిన అంతే చాలును. మీరు ప్రత్యేకించి వరము లిచ్చెదనిన నాయదృష్టముకాదని యనను స్వామీ! నా దొకటే కోరిక, ఇచటినుండి మేము అయోధ్యకు వెళ్లు మార్గములో ఫలపుష్ప ఛంతములకు వృక్షము లుండునట్లు చేయుడు. అదియే మాకు మహాఫలము" అనెను.

భరద్వాజు డట్లే యగుగాక యని వరప్రదానము చేసెను.

కాలముకాని కాలమైనను మహర్షి వరదానము చేయుటతోనే అక్కడి నుండి అయోధ్య వరకు గల ముప్పది యోజనముల దూరము పొడవున ఫలపుష్పాదులతో కూడిన వృక్షరాజములు వెలసినవి.

# రావణుడు హనుమంతుని భరతుని యొద్దకు పంపుట

రాముడు హనుమంతుని నందిగ్రామమునకు వెళ్ళి, భరతునికి మన రాకను చెప్పి, అతని సందేశమును కొనిరమ్మని యాజ్ఞాపించెను. "హనుమా! నీవు మార్గమధ్యములో శృంగిబేరపురమునకు వెళ్ళి, అక్కడ నిషాదరాజైన గుహుని కలుసుకొని నా క్షేమవార్తను చెప్పిన గుహుడు నీకు అయోధ్యామార్గమును చూపును.

హనుమా! నీవు భరతుని యంతరంగమేమో తెలుసుకొని వచ్చుటకు పంపుచున్నానని తెలియుము. ఒకవేళ భరతునకు మనసులో రాజ్యము చేయవలయునని యున్నచో మరేమియు మాట్లాడకుండ వెడలిరమ్ము. అట్లయినచో మనమక్కడికి పోవలసిన యవసరము లేదు. ఇచటి నుండియే మరలిపోదము."

రామాజ్ఞననుసరించి హనుమంతుడు మొదట శృంగబేరపురము చేరి యచట గుహుని కలుసుకొని మాట్లాడి, సీతారామలక్ష్మణుల క్షేమవార్తను చెప్పి నందిగ్రామము చేరెను. నంది గ్రామమునకు అయోధ్య ఒక క్రోసెడు దూరమున్నది.

నందిగ్రామములో భరతుడున్న ప్రదేశమునకు పోయి, హనుమంతుడు "ధర్మమూర్తివైన భరతా!" జటావల్కములు ధరించి, దండకారణ్యములో నివాసముండిన ఎవ్వని గురించి నీవిట్లు బాధపడుచున్నావో అట్టి శ్రీరామచంద్రుడును క్షేమము అతడు నన్ను నీవద్దకు పంపినాడు. అతడు రావణుని వధించి, సీతాదేవిని పొంది, మిత్ర పరివార సమేతముగ, సీతాదేవితోను, లక్ష్మణునితో వచ్చుచున్నాడు" అని తెలిపెను.

హనుమంతుని మాటలువిని భరతుడు అమితానంద భరితుడై హనుమంతుని మిక్కిలి ప్రశంసించి, నరుడు జీవించి యుండు నూరు సంవత్సరములకైన ఒకరోజేనియు ఆనందపడును' అన్న సూక్తి యథార్థమైనది. ఎన్నో సంవత్సరముల క్రిందట చూచిన మా యన్న క్షేమవార్తను చెప్పిన సుకృతాత్ముడవు. నీకు ధన్యవాదములు.

"హనుమా! వానరులకు, శ్రీరామునికి మైత్రి ఎట్లు కుదిరెనో తెలుపుము" అనెను.

హనుమంతు డిట్లనెను. "చిత్రకూటములో సీతారామలక్ష్మణు లున్నంతవరకు జరిగిన సంగతులన్నియు నీకు తెలియును. శ్రీరాముడు నిన్ను అయోధ్యకు పంపిన తరువాత చిత్రకూటమును వదిలి దండ కారణ్యములోనికి ప్రవేశించినారు. అచట విరాధుడను రాక్షసుని చంపి నాడు. అచటినుండి జనస్థానము వచ్చినారు. అచట శూర్పణఖ యను రాక్షసి కనపడినది. లక్ష్మణుడామె ముక్కూ చెవులను కోసినాడు..."

శూర్పణఖ అన్న ఆ విషయము తెలుసుకొని, రామునిపై కోపించి, మాయవేషమున వచ్చి, సీతను అపహరించెను..."

హనుమంతుడు, అది మొదలుకొని, జటాయువు రావణునితో పోరాడి మరణించుట, రాముడు సీతా వియోగ దుఃఖముచే అడవుల తిరుగుట, క్రమముగ వారు ఋష్యమూక పర్వతము చేరుట, అన్న వాలిచేత, తమ్ముడైన సుగ్రీవుడు భంగపడుట, రాముడు దుర్మార్గుడైన వాలిని సంహరించుట, ఆ సహాయమునకు ప్రతిసహాయముగ సుగ్రీవుడు శ్రీరాముని కార్యము నెరవేర్చుటకు ప్రతిన గైకొనుట, సీతాన్వేషణలో

తాను, వానరసేన కృషిచేయుట. తాను నూరు యోజనముల పొడవైన సముద్రమును దాటి లంకకు చేరుట- అచటి అశోక వనములో సీతను కనుగొనుట- లంకా దహనము మరలివచ్చి, రామునకు విషయము విన్నవించి, సుగ్రీవుని సహాయముతో వానరసేనను లంకకు నడిపించుతూ సముద్రమునకు సేతువు నిర్మించుట.

వానరసేనతో రామలక్ష్మణులు సముద్రమును దాటి, రాక్షస సేనలను వధించుట. తరువాత రాముడు రావణునితో భీషణ యుద్ధముచేసి సంహరించుట, సీతతో రాముడు తిరిగి ప్రయాణమై వచ్చి, భరద్వాజాశ్రమములోనున్న విషయమంతటిని వివరించెను.

హనుమంతుడు చెప్పిన శుభవార్తను విని, భరతుడు, తమ్ముడైన శత్రుఘ్నునితో "తమ్ముడా! అయోధ్యను వెంటనే అలంకరింపజేయుము. రేపు సూర్యోదయములోపల అంతయు పూర్తికావలయును"

శత్రుఘ్నుడు, భరతుని యాజ్ఞ ప్రకారము అధిక సంఖ్యాకులైన సేవకులతో అయోధ్యా పట్టణమును సర్వాంగ సుందరముగా తీర్చి దిద్దెను.

భరతుడు హనుమంతునితో "హనుమా! రాముడింకను రాలేదు. వారితో వచ్చుచున్న వానరసేనయు కనిపించుటలేదు. నిజముగనే రాముడు వచ్చుచున్నాడా! చెప్పుము" అనెను.

అందుకు హనుమంతుడు "భరతా! రాముడు నిజముగనే పరివారముతో వచ్చుచున్నాడు. భరద్వాజుననుగ్రహమున మార్గ మధ్యములో అమరియున్న వృక్షముల ఫలములను, అడవి తేనెలను తినుచు త్రావుచు వచ్చుచుందురు.

ఇంతలో దూరమునుండి సవ్వడులు వినిపింపదొడగినవి. అదుగో ఆకసమునుండి పుష్పక విమానము వచ్చుచున్నది. రామలక్ష్మణుల ప్రయాణించు విమానమదియే.

## సీతారామలక్ష్మణులు నంది గ్రామము వచ్చుట

కొలది సేపటిలోనే విమానమువచ్చి ఆగినది. సీతారామ లక్ష్మణులు విమానము దిగినారు. తక్కిన పరివారముకూడ దిగినది.

శ్రీరాముడు తనను ఆహ్వానింప వచ్చిన భరతుని విమానము లోనికి చేర్చుకొనినాడు. భరతుడు రామునికి సాష్టాంగ నమస్కారము చేసినాడు. రాముడు భరతుని లేవనెత్తి, తన ప్రక్కన కూర్చుండ బెట్టుకుని ప్రీతితో లాలించినాడు. అనంతరము భరతుడు లక్ష్మణునకు స్వాగతము చెప్పి, సీతాదేవికి నమస్కరించినాడు. సుగ్రీవుని, జాంబ వంతుని, మైందుని, అంగదుని, నీలుని, నలుని, సుషేణుని, శంభుని అందరినీ కౌగలించుకున్నాడు. వారందరూ మనుజ రూపములలో నున్నారు. అందరి యోగక్షేమములను భరతుడు అడిగి తెలుసు కున్నాడు.

"సుగ్రీవా! నీవు మా నలుగురికి జతచేరి ఐదవ సోదరుడవైనావు. విభీషణా! నీ తోడ్పాటును మేము ఎన్నడును మరువజాలము. మరువ జాలని మిత్రుడవు నీవు. నీకు అభివాదాలు."

శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు మ్రొక్కి, సీతకు పాద నమస్కారము గావించినాడు.

శ్రీరాముడు ముగ్గురు తల్లులకు భక్తితో నమస్కారముచేసి, పిమ్మట వశిష్ఠునికి పాదాభివందనము చేసెను.

అనంతరము ప్రజలందరూ రామునికి జయ జయ నాదములతో చేతులెత్తి నమస్కరించిరి. శ్రీరాముడు వారి నమస్కారములను మోదముతో ఆమోదించినాడు. ఇంతలో భరతుడు తానిన్ని నాళ్ళు, సింహాసనముపై పెట్టి, రామునికి ప్రతిగా భావించి రాజ్యపాలనను గావించిన రామపాదుకలను తెచ్చి,రాముని పాదములకు తొడిగినాడు.

"రామా! ఇక నీ రాజ్యమును నీకు అప్పగించితిని. నీవు అయోధ్యకు వచ్చి, ప్రజలు, మంత్రులు, పురోహితులు, పెద్దలందరి సమక్షములో పట్టాభిషేకము చేసుకొని మా యథోచిత సేవలను గొనుచు పెద్దకాలము రాజ్యమునుచేసి, ఇక్ష్వాకువంశపు మన పూర్వ రాజన్యుల యొక్కయు, తండ్రిగారైన దశరథ మహారాజు యొక్కయు కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయుము.

పిమ్మట వారంపయూ పుష్పక విమానమునుండిభరతునియాశ్రమ మునకు వచ్చిరి.

రాముడు పుష్పక విమానమును కుబేరుని వద్దకు పొమ్మని యాజ్ఞాపించినాడు. విమానము రాముని యాజ్ఞ ననుసరించి కుబేరుని వద్దకు వెళ్ళెను.

## శ్రీరాముడు అయోధ్యకు ప్రయాణము

శ్రీసీతా రామలక్ష్మణ పరివారయుక్తుడై అయోధ్యకు చేరినారు. శత్రుఘ్నుడు ముందు భరతునికి లక్ష్మణుని జడలు విప్పించెను. కేశ సంస్కారము గావించి సుస్నాతులను చేయించినాడు. తరువాత సుగ్రీవుడు, విభీషణునికి మంగళస్నానములు చేయించినాడు. తరువాత శ్రీరాముడు తన జడలు విప్పించుకొని, మంగళస్నానము చేసినాడు.

శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు అలంకారములు చేయించినాడు. సీతను అంతఃపుర స్త్రీలు అలంకరించిరి.

కౌసల్యాదేవి వానర పత్నులందరినీ పరిచారికల చేత సుస్నాతుల నొనరింపజేసినది.

సుమంత్రుడు సిద్ధము చేసియుంచిన రథముపై సాలంకృతుడైన రాముడు అధిరోహించినాడు. సుగ్రీవుడు, హనుమంతుడు దివ్య వస్త్రములు ధరించి, అలంకృతులై అయోధ్యకు బయలుదేరినారు.

శ్రీరామ రథమునకు ఇప్పుడు భరతుడు సారథి. శత్రుఘ్నుడు శ్రీరామునికి ఛత్రము పట్టినాడు. లక్ష్మణుడు, విభీషణుడు వింజామరలు వీచుచున్నారు.

రథము శంఖభేరీ నినాదములతో బయలుదేరినది.

రథమునకు ముందుగా బ్రాహ్మణులు అక్షతలు,కుడుములతోను, వేదమంత్రములతో సాగిరి. ఆ తరువాత గో సమూహము, కన్యలు నడచిరి.

శ్రీరాముని రథము అయోధ్యలోనికి ప్రవేశించినది. ప్రజలు నేల యీనినట్లు గుమిగూడి సీతారామలక్ష్మణులకు జయజయధ్వానములు చేసినారు.

శ్రీరాముడు తన తల్లులకు నమస్కరించి తండ్రిగారి భవనమును ప్రవేశించి, "భరతా! ఈ భవనములో సుగ్రీవునకు విడిది నేర్పరచుము" అనెను.

భరతుడట్లేయని, శత్రుఘ్నుని అందుకు తగిన ఏర్పాట్లను గావింపుమని పురికొల్పెను. శత్రుఘ్నుడట్లు చేయగా సుగ్రీవుడందు చేరి సంతోషించినాడు.

భరతుడు సుగ్రీవునితో "శ్రీరామ పట్టాభిషేకమునకు వలసిన జలమును తెప్పింపు"మని కోరెను.

సుగ్రీవుడు నాలుగు సువర్ణ కలశములను జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి, ఋషభుడు అను నలుగురు వానర వీరులకిచ్చి, నాలుగు సముద్రముల నుండి ఈ సువర్ణ కలశములలో జలములను తెండు అని ఆజ్ఞాపించెను.

వారట్లు చేసి, జలములను శత్రుఘ్నున కప్పగించిరి. శత్రుఘ్నుడు జలములు వచ్చినవని వశిష్ఠునకు తెలిపెను.

## శ్రీరామ పట్టాభిషేకము

మహర్షి వశిష్ఠుడు సీతారాముల నిద్దరను రత్నఖచిత సింహాసనముపై కూర్చుంచ నియోగించెను.

ఋషిసత్తములైన వశిష్ఠుడు, జాబాలి, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, సుయజ్ఞుడు, విజయుడను వారలు సుగంధ జలములు, దివ్య జలములతో సీతారాములను అభిషేకము చేసినారు.

అటు పిమ్మట ఋత్విజులు, బ్రాహ్మణులు, కన్యలు, మంత్రులు, పౌరులు అందరూ సీతారాముల నభిషేకించినారు. దేవతలు సమస్త ఓషధులతో ఆకాశము నుండి అభిషేకించినారు.

శత్రుఘ్నుడు శ్వేతచ్ఛత్రము పట్టినాడు. సుగ్రీవుడు, విభీషణుడు చామరములు వీచినారు. ఇంద్రుడు వాయుదేవునిచే సువర్ణ హారమును, మణిరత్న ఖచితమైన ఇంకొక హారమును పంపెను.

గంధర్వులు పాడినారు. అప్సరసలు ఆడినారు. వృక్షములు ఫలములతో విరాజిల్లినవి.

శ్రీరాములు అనేక గుఱ్ఱములను, ఆవులను, వృషభములను, బంగారు నాణెములను బ్రాహ్మణోత్తములకు దానము చేసినాడు.

సుగ్రీవునికి కాంచనమాలను, అంగదునకు మణిరత్నాఖచితమైన ఆభరణము నిచ్చెను.

సీత మెడలో చంద్ర కిరణములను బోలు ప్రకాశవంతమైన ఒక ముత్యాలహారమును రాముడు స్వయముగ అలంకరించినాడు. సీత రామునివంక చూచి ఆయన ప్రసన్నతను గ్రహించి, వస్త్రములను, ఆభరణములను హనుమంతున కిచ్చినది. మరియు రాముడు తన మెడలో వేసిన ముత్యాలహారమును తీసి, మరల రాముని వైపు చూచినది.

రాముడు "సీతా! పౌరుషము, పరాక్రమము, ఉత్సాహము, ధైర్యము, బుద్ధి ఎవ్వని యందున్నదో అతనికి ఆ హారమును యిమ్ము" అనెను.

సీత ఆ హారమును హనుమంతునికి సమర్పించినది.

హనుమంతుడు తెల్లని మేఘము కప్పిన పర్వతమువలె భాసించినాడు.

రాముడు వానరవీరులందరికీ తత్తరుచితములగు గౌరవ సత్కారములను సలిపెను.

అందరును రామునియొద్ద సెలవు గైకొని వారివారి నెలవులకు వెళ్ళిరి.

శ్రీరాముడు భరతునకు యౌవరాజ్యాభిషేకము చేసెను.

రామరాజ్యము ఎటువంటి అరిష్టములు, కరువుకాటకము లేకుండా సస్యానుకూల వర్షములు కలిగి, పాడిపంటలలో సంపత్సమృద్ధిగా వృద్ధి చెందినది.

రాముడు సకల ప్రజారంజకముగా పదకొండువేల సంవత్సరములు సుభిక్షముగా రాజ్యపాలన చేసినాడు.

# ఉత్తర కాండము

## శ్రీరాముడు జనకాది రాజలోకమును వారి వారి పురముల కంపుట"

శ్రీరామపట్టాభిషేకమునకయి అయోధ్యాపురమునకు వచ్చిన రాజులందరు, ఆతని పట్టాభిషేకుత్సవములను కన్నుల పండువుగా చూచి, మిక్కిలి యానందించిరి.

కేకయ రాజును, భరతుని వెంటనిచ్చి, సకల వస్తువాహనములు, రత్నాభరణములు, పట్టువస్త్రములు మున్నగువాని నొసంగి సత్కరించి పంపెను.

అట్లే పితృసమానుడైన జనకమహారాజును సత్కరించి సగౌరవముగా, లక్ష్మణుని వెంట నిచ్చి మిథిలాపురికి పంపినాడు.

అదేవిధముగా రామచంద్రుడు తక్కిన దేశాధీశులందరినీ తత్తరుచిత మర్యాధలతో సత్కరించి పంపెను.

లంకాధిపతియైన విభీషణుని, కిష్కింధాధి పతియైన సుగ్రీవుని ఎంతో ఆదరముతో ఆలింగనము చేసుకొని వారివారి నెలవులకు పంపెను. మహాభక్తుడైన హనుమంతుని చిరంజీవిగా దీవించి, భావి కాలపు బ్రహ్మవు నీవేనని వరమిచ్చి, యాదరించెను,

## పుష్పక విమానము శ్రీరాముని కొలుచుటకై తిరిగి వచ్చుట

నందిగ్రామము నుండి, రాముడు, కుబేరునికి త్రిప్పిపంపిన పుష్పకవిమానము కుబేరుని వద్దకు పోయినది. కుబేరుడు ఆ విమానము

రాముడు అధిరోహించినది కాన, మరొకరికి ఇది అర్హము కాదు. దీనిని రాముడే ఉపయోగించుట యుక్తము అని, మరల రాముని సేవకు పంపెను. ఆ విమానము అయోధ్యా గగనతలముపై ఆగి, "రామా! కుబేరుడు నన్ను సేవింపమని నన్ను త్రిప్పి పంపినారు నీ సేవకు సదా సన్నద్ధమై యందును అని విన్నవించెను.

రాముడు ఆ విమానముతో "విమానరాజమా! చాల సంతోషము. నిన్ను నా కవసరమైనప్పుడు వినియోగించు కొందును. అందనుక నీవు నీ కిష్టము వచ్చినట్లు గగన భాగమున సంచరింపుము" అని చెప్పెను.

పుష్పకము రామునికి నమస్కరించి వెడలెను.

## భరతుడు, ప్రజల సుఖస్థితిని శ్రీరామునకు విన్నవించుట

"అన్నా! రాఘవా! మన అయోధ్యానగరవాసులు నీ పరిపాలనలో సుఖశాంతులతోను, ఆయురారోగ్యములతోను వున్నారు. నిన్ను పరమాత్మ స్వరూపునిగా భావించి భక్తి ప్రపత్తులతో నున్నారు. రాజ్యమునందు ఎవరికి మరణ భయములేదు. బాలింతలు ప్రసవవేదన లేక బిడ్డలను కనుచున్నారు. కరువు కాటకములు ప్రజలు వినియుండరు. దేశమంతయు సుభిక్షముగనున్నది కాని వీరికి కల లోటు ఒకటే నిన్నువారు ప్రత్యక్షముగ చూడలేక పోతిమేనని రామ భద్రా! నీ దయవలన దేశమున చోరభయము, పరవీర భయము లేదు."

రాముడు మిక్కిలి సంతోషించెను,

## ఉద్యానవనములో సీతతో రాముడు

మంచిగంధము పారిజాత చూతపున్నాగ, మందార, పనస, పారిజాత, చంపక, దాడిమి మున్నగు వివిధ ఫలపుష్పవృక్షములతోను, మంజులములైన మణిశక్య సోపానకలితములైన జలాశయములతోను, సుందర దృశ్యములతో శోభిల్లుచున్న ఉద్యానవనమునకు వెళ్ళి, అక్కడ సీతారాములు శిశిరభాగమంతయు గడిపినారు.

పగలు అంతఃపురములో రాముడు రాచకార్యములు నెరవేర్చు కొంటూ, దేవాతిథి పూజల్లోను, శాస్త్ర చర్చలలోను గడుపుతూ రాత్రి కాలములో రాజోద్యానవనమున సీతలో గడిపెడివాడు. సీతయు పగలంతయు, అత్తలసేవలతోను, ఇతరగార్హస్థ్యవిధుల నిర్వహణము లోను ఉంటూ, రాత్రులు ఉద్యానవనములో శ్రీరామచంద్రునితో గడిపెడిది.

ఈ విధముగ దంపతులిరువురు అనేక సంవత్సరములు ధర్మోచిత మైన సుఖోపభోగములతో గడిపినారు.

## సీత ఋష్యాశ్రమముల సందర్శనమును కోరుట

సీత గర్భిణియన్న సంగతి రామునకు తెలిసినది. అతడు ఆమెతో తన సంతోషమును వెలిబుచ్చుతు "సీతా! ఈ సంతోష సమయములో నీకు గల కోరికను తీర్చవలెనని యున్నది. నీ కిష్టమైన దేదియైన కోరుకొనుము"

శ్రీరాముడు ప్రేమ పూర్వకముగ కోర్కెతీర్తునన్నందుకు సీత సంతోషముతో ఉప్పొంగి పోయినది.

"నాథా! నాడు అరణ్యములలో పలుకష్టములకులోనై, దుఃఖము లకు ఎరయై, అనుక్షణము మరణ భీతితో సంచరించుచు, తుదకు రావణుని చేత అపహృతనై సుఖసంతోషములకు దూరమైతిని. ఈనాడు, మీరు మహారాజులు, పట్టమహిషినై నేను మరల వనముల

కరిగి, అందలి రమణీయములైన ప్రకృతి సహజ సౌందర్యములను తిలకించి అందుగల ఋష్యాశ్రమ వాటికలలో కొంత కాలము ఏకాంతముగా కాలము గడుపవలెనని యున్నది. ఈ కోరికను తీర్చుడు. చాలు" నన్నది.

## శ్రీరాముడు భద్రుని లోకవార్తల నడుగుట

రాముడు రాత్రి రెండవ ఝాముననబయటికివచ్చి, తన గుమ్మము వద్ద నిలిచి నగారా మ్రోయించిన భద్రుడను భటునిచూచి, "భద్రా! మనరాజ్యమునందలి లోకులు ఏమేమనుకొను చున్నారు. నన్ను గూర్చి, భరతునిగూర్చి, కైకనుగూర్చి, సీతనుగూర్చి, లక్ష్మణునిగూర్చి గాని వారేమను కొనుచున్నారో తెలియజెప్పుము తెలిసినచోకదా! నేను వారికేమైన చేయగలుగునది" అనెను.

"రామా! నీ రాజ్యమున దోసుగులేమియు జరుగవు. అందరూ సుఖముగనే యున్నారు. ఈ విషయములో యెట్టి సందేహమక్కఱ లేదు."

## భద్రుడు శ్రీరామునకు ప్రజలనుకొను సీతాపవాదును గురించి తెలుపుట

"రామా! సమస్త రాజలోకం నిన్ను గురించి, నీ సాహస కార్యాలను గురించి ఎంతగానో ప్రశంసించుచున్నారు ప్రజలు. నూరు యోజనముల సముద్రమునుదాటి, లంకను ప్రవేశించి, రావణుని సంహరించి, అతడు బంధించి యుంచిన సీతను తెచ్చుకొని మరల యెగ్గులేక ఏలుకొనుచున్నాడు. రాముడు ధీరోదాత్తుడనుకొన్నాము. కాని, వట్టి భీరుడు, స్త్రీ వ్యామోహపరుడని ఇప్పుడు తేలినది" అని తమలో తాము మాట్లాడుకొనుచుండగా నేను ఆ నోట ఆ నోట మన వారి వలన వింటిని. అట్లు విన్న మాటలనే మీకు మనవి చేయు చున్నాను. అంతియే" అని భద్రుడు కైమోడ్చి నిలుచుండెను,

## శ్రీరాముడు సోదరులను పిలిపించుట

రాముడు "భద్రా! నీవు త్వరగా వెళ్ళి భరత, లక్ష్మణ, శత్రుఘ్నులను పిలుచుకొని రమ్ము" అని ఆజ్ఞాపించెను.

భద్రుడు వెళ్ళి రామ సోదరులకు రామాజ్ఞ గురించి తెలుపగా వారు ఆ మరుక్షణముననే రాముని వద్దకు వచ్చిరి. రాముడు లక్ష్మణునితో "లక్ష్మణా! మీ వదిన జానకిని గురించి లోకులు నీచముగ మాట్లాడుకొనుచున్నారని తెలిసినది. రావణుడెత్తుకొనిపోయి, తన కడనుంచుకొనిన సీతను సిగ్గుమాలి మరల రాముడేలుకొనుచున్నాడని, అతడు స్త్రీ లోలుడని అనరాని మాటలాడుకొనుచున్నారు. నీకు తెలియును కదా లక్ష్మణా! సీత నిర్దోషిత్వము. ఆనాడు ఇట్టి యపవాదులు వచ్చుననియే కదా! అగ్ని పరీక్షకు నిలిపితిని. అప్పుడు బ్రహ్మాది దేవతలువచ్చి, అగ్నిదేవుడు వచ్చి, సీత నిర్దోషియని ప్రకటించిరి కదా! అట్టి అగ్నిపునీతయైన సీతను గురించి ప్రజలు మాట్లాడుకొనుట న్యాయమా! ఇందుకు నేనేమి చేయవలయునో తెలియుటలేదు. విధి నన్ను ఇంకను పరీక్షించుచున్నది. ఈనాడు సీత వట్టిదికాదు. ఈ పరిస్థితిలో నేనేమి చేయవలయును"

భరత, శత్రుఘ్నులను చూచి "సోదరులారా! కింకర్తవ్యముతో విమూఢుడనై, పరితాపచారముచే కృంగిపోవుచున్న నాకు సరియైన ఆలోచన చెప్పుడు."

భరత, శత్రుఘ్నులు సమాధానము చెప్పక ఊరకొనిరి.

రాముడు ఉద్వేగభరిత హృదయముతో కొంత వడి దీర్ఘముగ నాలోచించి, తుదకిట్లు పలికెను. "నేను ఎల్లవేళల ప్రజాభిప్రాయమునకే విలువనిత్తును. ప్రజల సౌఖ్యమే నా సౌఖ్యము. ప్రజల కొరకు నా సీతనేకాదు నా ప్రాణములనే త్యజించెదను. పితృవాక్య పాలనకై అడవులలో సంచరించుట, సీతను కోల్పోవుట, ఆ పిమ్మట శత్రువును వధించుట, దుష్ట రాక్షస సంహారము అంతయు ప్రజా సంక్షేమము

కోసమే. వారి ధర్మబుద్ధిలో ఎటువంటి లోపము రానీయకుండుటకే అన్నియు చేసితిని. కాని అవి యన్నియు ఈనాడు ప్రజలచే గుర్తింప బడకున్నవి. రాజునైన నా పైననే ప్రజలిట్టి దోషారోపణ చేసిన ఇతర సాధారణుల మాటయేమి? నేను వారికి ధర్మబద్ధమైన సమాధానము చెప్పవలెను.

లక్ష్మణా! నీవు సీతను అడవులలో వదిలిరమ్ము. ఆమె కోరికయు వన భూములు సంచరింపవలెననియే యున్నది. లక్ష్మణా! నా కెదురు చెప్పకుము. నేను చెప్పినట్లు చేయుము'' అనెను.

## లక్ష్మణుడు సీతను ఋష్యాశ్రమమునకు తీసుకొని వెళ్ళుట

లక్ష్మణుడు సీతాదేవి వద్దకు వచ్చి, "అమ్మా! నిన్ను అన్నగారు ఋష్యాశ్రమములకు తీసుకొని వెళ్ళుము'' అని చెప్పెను.

సీతయు మిక్కిలి సంతసించినది. నేను రాత్రి రామచంద్రుని కోరుటయేమి? తెల్లవారగనే నా కోర్కెను తీర్చుదునని, ఆ మహానుభావుడు దయతో నన్ను ఇయ్యకొని పంపుటయేమి?

రాముడు యెవరు యేది కోరినను ఇచ్చువాడు కదా! అయినప్పుడు ప్రియపత్నియైన నేను కోరినది చెల్లించకుండునా!

"లక్ష్మణా! కావలెనని ఇష్టపూర్తిగా నేను సాధు జీవనులైన ఋష్యాశ్రమమునకు వెళ్ళుచున్నాను. అక్కడికి వెళ్ళునప్పుడు వట్టి చేతులతో వెళ్ళకూడదు. అదియును గాక అరణ్యావాస జీవనములో, ఋషికాంతలు నన్నెంతగానో ఆదరించి, సత్కరించినారు. వారిని ఇప్పుడు నేను సంతోషపరచవలెనని యున్నది'' అనెను.

లక్ష్మణుడు సీత కోరికమేరకు, ధనాగారము నుండి, విలువైన రత్నాభరణములు, మరియు పట్టువస్త్రములు, మణి మాణిక్యములు,

మున్నగు వానిని తెప్పించి సీత కప్పగించెను. సీతయు తృప్తి జెంది అరణ్యములకు పోవుటకు సిద్ధమైరాగా రథము కదలినది.

## సీతకు కొన్ని దుశ్శకునములు కలుగుట

రామాజ్ఞ ననుసరించి,లక్ష్మణుడు సీతాదేవిని రథముపై కూర్చుండ నియోగించెను. సీత రథముపై కూర్చొనిన పిదప, లక్ష్మణుడు ధనుర్బాణములను ధరించి, రథముపై ఒక ప్రక్కన కూర్చుండెను. సారథి సుమంత్రుడు రథమును కదలించినాడు. రథము కదలునప్పుడు, సీతకు కొన్ని దుశ్శకునములు కలిగినవి. ఆమె కుడికన్ను అదిరినది. శరీరము వణకసాగినది. గుండె వేగముగ కొట్టుకొనజొచ్చినది.

సీతకు అర్థము కాలేదు. ఆమెకు విపరీతమైన భయము కలిగినది.

"లక్ష్మణా! నా శరీరము భయముతో కంపించిపోవుచున్నది. ఏలాగో ప్రయాణములో దుశ్శకునములు కలిగినవి. మీ అన్న నేను కోరిన వెంటనే ఋష్యాశ్రమములకు పంపుటకై అంగీకరించినాడు· తాను స్వయముగ రాక, నిన్ను పంపించిన కారణమేమో తెలియదు· రాచకార్యములు కదా! తీరిక లేకయుండును. రాముని మనస్సు 'వెన్న' కంటె సున్నితమైనది."

లక్ష్మణుడు, సీత మాటలను విని మనస్సులోనే దుఃఖపడుచుండెను. అతనికి సీతతో రాముని అంతరంగము గురించి ఏమి చెప్పవలయును? అన్న తనకు చెప్పి పంపిన వర్తమానమును ఏమాత్రము దయ లేకుండా వదినెకు ఎట్లు చెప్పువాడను.

రథము గంగాతీరమును సమీపించినది. రథము నుండి లక్ష్మణుడు క్రిందకు దిగి, "అమ్మా! రాముడు ఎవరో దుష్టులు రావణుడెత్తుకొనిపోయిన సీతను, ఎటువంటి సంకోచము లేకుండా రాముడు మరల తనవద్దకు తెచ్చుకొని ఏలుకొనుచున్నాడు. అతడు వట్టి స్త్రీ

వ్యామోహపరుడు. రాజ్యమును పరిపాలించు రాజే అట్లైనచో ఇక మనవంటి సామాన్యుల మాట యేమి? ధర్మమునకు దారి ఎక్కడ? ఆ దశరథ మహారాజు కూడా భార్యా వ్యామోహమునకు వశుడై, రాముని అడవులకు పంపునట్లు చేసి, తుదకు ప్రాణముల మీదకే తెచ్చుకొని, రాజ్యమును అరాజకము చేసినాడు. జరిగినది జరిగెను పో. ఈ కొడుకును తండ్రి దారినే పోవుచున్నాడు." అని ఏమేమో నిందించిరట. నీ నాధుడు రామభద్రుడు భద్రుడు చెప్పిన ప్రజలాడుకొను వార్తను విని, నిన్ను అడవులలో దించి రమ్మని పంపినాడు. తల్లీ! ఈ మాటలను చెప్పలేక చెప్పలేక నీకు చెప్పుచున్నాను.

లక్ష్మణుడు కన్నీరు కార్చుచు సీతతో చెప్పిన మాటలను విని, దుఃఖముతో క్రుంగిపోయినది. "లక్ష్మణా! ఎటువంటి కర్ణ కఠోరమైన వార్తను చెప్పినావు. రాముడు ఇంకను నన్ను ఈ విధముగ శోధించుట నాకు విధి చేయు వంచన తప్ప వేరేమియు కాదు. కాకుండిన నన్ను తన ప్రాణాధికముగ చూచుకొను మీ యన్న, మరల నన్నిట్లు శోధించుట యేమి? కటాకటా! నేనేమి పాపము చేసితినయ్యా! నిజమే పూర్వజన్మములో నేను ఏ దంపతులను విడదీసితినో వారు తీరని దుఃఖముల పాలగుచుండగా, నేను సంతోషించితినో-ఆ పాపము ఈ రూపమున నన్ను పట్టి పల్లార్చుచున్నది.

"లక్ష్మణా! నీకు తెలియును కదా! ఆనాడు లంకాపట్టణములో, మీ యన్న రావణుని వధించి, నా శీలమును నిర్దోషపరచుటకై నన్ను అగ్నిపరీక్షకు గురిచేసినాడు. ఆ సమయములో అక్షతగా నన్ను అగ్ని దేవుడు తీసుకొని వచ్చి, రాముని కప్పగించి, 'ఈసీత మహాసాధ్వి-అకలంకచరిత' యని చెప్పలేదా? బ్రహ్మాదిదేవతలు కూడా, నా శుభ చరిత్రమును ప్రశంసించి, రామునికి ప్రబోధింపలేదా? అప్పుడు శ్రీరాముడు, నా చరిత్రవిషయములో తృప్తిచెంది, ఇప్పుడీవిధముగ పామరునివలె నన్ను నిర్దాక్షిణ్యముగ విడనాడి, అడవులకు పంపుట న్యాయమా!

లక్ష్మణా! నీవు ధన్యాత్ముడవు ధర్మాత్ముడు. సుగుణసింధువు-మహాత్ముడునైన రాముని ఎప్పుడు ఎడబాసి యుండవు. మరి నేను కడుదురితురాలను అతని పవిత్ర సేవకు అంకితమైన దానినయ్యాను. నేను ప్రత్యక్షముగ సేవచేసుకొనగలుగు భాగ్యమునకు నోచుకొన లేదు. విధి యెట్టివారినైనను వంచించి తీరును.'

మరదీ! నేను లంకలో దుర్మార్గుడైన రావణుని బందీనై జీవించి యుంటినని, జగదేకధానుష్కుడైన నా భర్త ఎన్నినాళ్ళకైన వచ్చి, దుష్టరావణుని పరిమార్చి, నన్ను సగౌరవముగ తీసుకొని పోయి ఏలు కొనగలడనియే-ఆనాడు ఆ మహానుభావుడు పెట్టిన అగ్నిపరీక్షకు నిలబడి, నా నిర్దోషిత్వమును నిరూపించుకొనుటకు, సాహసించినదియు రామునికోసమే. రాక్షసస్త్రీలు పెట్టిన అన్ని బాధలను చావక భరించి నదియు రామునికోసమే. అట్టి నా పతిదేవుడు రాముడే నా విషయమున నిందపడి, నన్నిట్లు అనాథగా అడవులలో వదలిరమ్మనుటయే ధర్మ సూత్రముననో తెలియదు.

లక్ష్మణా! రాముని విషయమున పొరబడితిని. అతడు నిశ్చ యముగా ధర్మాత్ముడే. ధర్మము కొరకు, సత్యముకొరకు, పితృవాక్య పరిపాలన నిమిత్తము ఆతడు తన సర్వస్వమును ఒడ్డియైనను నెర వేర్చెను.

మందభాగ్యను దురదృష్టమంతయు నాదే-

"నాయనా! నీ ధర్మమును నీవు నెరవేర్చితివి. నీవు వెళ్ళుము. రామచంద్రునకు నా నమస్కారములు తెలుపుము. అత్తే అత్తలకు, మరదులు భరతశత్రుఘ్నులకు, మాతోటి కోడండ్రకు అందరికినీ నా ప్రణతులు చెల్లింపుము,"

పౌరులకు నాపైనగల యనుమానము, యసహనము తీరినదని తెల్పుము. ఇక ఎన్నటికిని అయోధ్యకు రాను......

నీవు అయోధ్యకు వెళ్ళి, "రామా! నీ సీతను నీ యాజ్ఞ చొప్పున వదలివచ్చితిని. మీ నిర్ణయమునకు చాల సంతోషించితినని తెలుపుము. ఈ నదీతీరమున నేనున్నాను. ఈ నదియున్నది. పైన ఏమగునో చెప్పజాలను. ఈ మాటలనుచు, పెనుదుఃఖముతో సీత ఇసుకతిన్నెపై కుప్పకూలిపడిపోయినది. హృదయవిదారకమైన ఆ దృశ్యమును చూచి, లక్ష్మణుడును మిక్కిలి దుఃఖించెను.

కొంతవడికి తేరుకొని, సీతను నౌకలో గంగ ఆవలితీరమును దాటించి లక్ష్మణుడు సెలవుకొని, మరలిపోయెను.

## శ్రీరాముని దుఃఖము

లోకాపవాద భీతిచే రాముడు సీతను అడవికి పంపెను. తన ప్రియపత్ని, అగ్నిపుత్ర, అయోనిజయైన సీత విషయము తనకు పూర్తిగా తెలిసియున్నను రాముడు ప్రజాభిప్రాయమును శిరసావహించి, సీతను అడవులకు పంపుట, యను కఠోరనిర్ణయమునకు పాల్పడెను.

సీతపట్ల తాను సలిపిన ఘోరాపచారము, దారుణమైన దుఃఖాగ్ని శిఖలై రాముని అంతరంగము కాల్చివేయ జొచ్చినది.

"సీతా! ప్రజాపరిపాలనముపట్ల రాజధర్మలోపము నావలన జరుగునని వెఱచి, ప్రజలలో ఎవరో ఆడుకొను మాటలను పాడిచేసి, నిర్దాక్షిణ్యముగ అడవికి పంపితిని, అసూర్యంపశ్యవు, అంతఃకాంతవు. అబలవు, నాకిష్టురాలివి. భార్యవైన నిన్ను నేను పెట్టిన బాధలకు అంతులేదు. ఆనాడు నీవడవులకు వచ్చుట. నా కారణముననే. ఈనాడు నిన్నడవులకు పంపుట నా కారణముననే. నేరమొకరిది. శిక్ష వేరొకరిది' యనుచందమైనది నీ బ్రతుకు 'సీతా! రాజ్యపాలనలో నా ధర్మాచరణము కడునిష్ఠురము. ఐనను దానిని నిర్వర్తించుట నా

నిశ్చితవ్రతము. దానికై నేను నా తండ్రిని, నేను నిన్ను కోలుపోయి నాను." అని ఘోరముగ విలపించెను.

ఇంతలో లక్ష్మణుడు వచ్చి, "సీతను మీ యాజ్ఞప్రకారము గంగా తీరమున వదలి వచ్చితినని" తెలిపెను. ఆ వార్త రామునికి పిడుగు పంటిదై మరల మరల దుఃఖించెను.

## మునికుమారులు వాల్మీకికి సీత వృత్తాంతమును తెల్పుట

మునిబాలురు గంగా తీరమందు శోకించుచున్న స్త్రీ మూర్తిని చూసి, ఆశ్రమమునకు వెళ్ళి, వాల్మీకి మహర్షితో "గురుదేవా! గంగా తీరమందు ఒక స్త్రీ దీనముగ విలపించుచున్నది. ఆమె యెవరో తెలియదు. దేవకాంతయో, మరెవరో ఆమె ముఖవర్చస్సు అమోఘ ముగ నున్నది. ఆమె వద్ద ఎవరును లేరు. ఒక్కతియే యెంత తడవు నుండి విలపించుచున్నదో తెలియదు. అపుటకు వీలులేని దుఃఖముతో కన్నీరు మున్నీరుగా ఏడ్చుచున్నది." అని చెప్పిరి.

మహర్షి మునిబాలుర మాటలనువిని, తన దివ్యదృష్టితో ఆమె వృత్తాంతమునంతయు తెలుసుకొని, ఆశ్రమము నుండి త్వరత్వరగా బయలుదేరినాడు. శిష్యులు మహర్షి ననుగమించిరి.

## వాల్మీకి సీతాదేవిని ఓదార్చి ఆశ్రమమునకు గొనివచ్చుట

వాల్మీకి మహర్షి గంగాతీరమున సీతయున్న ప్రదేశమునకు పోయి, ఆమెనుగాంచి, "తల్లీ! దుఃఖింపకుము. నేను దివ్యదృష్టితో నీ దివ్య చారిత్రమును గురించి సమస్తమును తెలుసుకొన్నాను. నేను వాల్మీకి మహర్షిని. మా ఆశ్రమము ఇచటికి సమీపముననే యున్నది. నీవు మాతోరమ్మ.

"తల్లీ! నీవు దశరథ మహారాజు కోడలివి. జనక మహారాజు కూతురివి. శ్రీరామ చంద్రుని యర్ధాంగివి. నీయందిసుమంతయైన దోషములేదు. మహాపతివ్రతవు. నా తపోశక్తి వలన, నీ పవిత్ర చరిత్రమును, నా తపోదృష్టి వలన కనుగొంటిని. నీవు దుఃఖించవలదు. నీ కిక్కడ ఎటువంటి లోటురాదు.

మహర్షి మాటవిని సీత అతని వెంట ఆశ్రమమునకు చేరు కున్నది. వాల్మీకి మునిపత్నులను పిలిచి, వారితో ఇట్లనెను. "ముని పత్నులారా! ఈమె దశరథ మహారాజు కోడలు. జనక చక్రవర్తి కూతురు. రామచంద్రుని భార్య-భర్తచేత ఈ వనభూముల సందర్శ నార్థము పంపబడిన మహాసాధ్వి. ఈమె మన యాశ్రమమున కొంత కాలముండగలదు. మీరీ మహాభాగకు వలయు సేవలనందించుడి."

మహర్షి సీతను వారలకప్పగించి ఆశ్రమములోనికి వెళ్ళెను.

## లక్ష్మణుడు శ్రీరాముని దుఃఖమును సుమంత్రునితో చెప్పి దుఃఖించుట

అయోధ్యలో సీతలేని రాముడు, కాంతిలేని సూర్యునివలె కళా హీనమై యుండెను. లోకోపవాద భీతిచే సీతను, పునరాలోచన లేకుండ, ఆమె కోరినదనే అదను గైకొని లక్ష్మణుని ద్వారా ఆమెను వనాలకు పంపినాడు. లక్ష్మణునకీ యుదంతము మిక్కిలి ఖేదమును కలిగించినది. అయినను అన్నగారిమాటకు మారు బలుకలేక అతని యాజ్ఞను పాలించినాడు. లక్ష్మణుడు రాముని యాజ్ఞను పాలించుటయే నియమముగ పెట్టుకొన్నమతి మంతుడుగాని తనకైతాను స్వతంత్రించి నిర్ణయములు గైకొనవలెనని ఎన్నడును భావించిన వాడుకాదు. సీత విషయమై తాను గూడ నిర్దయ వహించి ఆమెను యరణ్యము పాలు చేసినాడు. ఆమెను ఈపాటికే ఏవేని క్రూరమృగములు భక్షించి యుండును. లేదా! రామ వియోగ దుఃఖాతిశయముచే, ఆమె యే యే విధముననో మరణించియుండును.

లక్ష్మణుడు అక్కడకు చేరిన సుమంత్రునితో "సుమంత్రా! చూచితివా విధి వైపరీత్యము. రాముడంతటివానినే విధి తల్లక్రిందులు చేసినది. సుగుణ చరితయైన తన ఇల్లాలినే అడవుల పాలు చేసినాడు. జనకుని గారాబుపట్టి ఎంతటి కఠోర శిక్షను అనుభవించుచున్నది. పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసముచేసి, చివరకు మరల ఈనాటికి కూడ సుఖపడు రాతలేక కడలేని కష్టములనుభవించు చున్నది.

రాముడు కూడ, రాజ్యపరిపాలనము సాగించుచున్నాడేకాని, సీతా వియోగ దుఃఖమును సహించలేకున్నాడు" అని లక్ష్మణుడు తానును దుఃఖమునాపుకొనలేకపోయెను.

సుమంత్రుడు లక్ష్మణుని ఓదార్చినాడు. అంత లక్ష్మణుడు శ్రీరాముని చెంత కేగెను.

## శ్రీరాముని చెంతకు లక్ష్మణుడు వెళ్ళుట

రామునికి సీతా వియోగము ఈ మారు స్వయంకృతము. కావలె నని రాముని, సీత వనభూముల చరించవలెనని కోరుకున్నది. కావలె నని సీతను రాముడు ఒంటరిగా అడవికి పంపి భార్యా వలన యెడబాటు దుఃఖము ననుభవించుచున్నాడు. "అనుకొనని ఘటన మెన్నడును జరుగదు" అనెడి నానుడి యుండనే యున్నది కదా! అది వీరి యెడ నిజమైనది.

రామునికి ధర్మాచరణమునందు మిక్కిలి ప్రీతి. అయినను సీతా వియోగము రామునికి తీరని హృదయశల్యమైనది.

లక్ష్మణుడు అన్న వద్దకు వచ్చి "అన్నా! నిరంతరము నీవిట్లు దుఃఖాక్రాంతుడవై యుండుట యుక్తముకాదు. నీవు ధీరోధాత్తుడవు. జితేంద్రియుడవు, ధర్మనిష్ఠుడవు. నీ మనస్సు ఎప్పుడును అధర్మమును గురించి యాలోచించదు. ధర్మనిర్వహణలో నీవు పూను కఠోరత్వము నిన్ను ఏ మాత్రమును చలింపజేయలేదు. ఇప్పుడు నీవు ధైర్యము నవలంభించవలయును. యథాప్రకారము రాజకార్యములందు ప్రవృత్తుడవు కావలెను.

దృఢవ్రతుడైన రాముడు ధైర్యమును పూని రాజకార్యములు నిర్వహించుచుండెను.

రాముడు తన సామంత రాజ్యమైన 'మథుర'ను తమ్ముడైన శత్రుఘ్నునకు పట్టము గట్టి, లవణాసురుని సంహరింపఁబంపెను.

## సీత కుమారుల కనుట

ముని పత్నులు వాల్మీకి ఆశ్రమమున సీతను ఎంతో గౌరవముతో చూచుచు వలయు సేవలు అందించుచుండిరి. సీత ఆశ్రమమునందలి పెంపుడు లేళ్ళను, మయూరములను మున్నగువానిని దర్శించుచు వాటితో ఆటలాడుచు, పాటలు పాడుచు సుఖముగ కాలక్షేపము చేయుచుండెను. సాయం వేళల మునిపత్నులు సీతను ఇష్టకథా వినోద గోష్ఠులనానందింపజేయుచుండిరి. దుఃఖముపై దుఃఖము పెనగొనుచు ఏండ్ల తరబడి, యామె క్రుంగి కృశించియున్నను వాల్మీకి యాశ్రమములో కొంతలో కొంత ధుఃఖము నణచికొని కాలము వెళ్ళబుచ్చ సాగినది. విధి ఎట్లు ఆడించునో ఆ విధముగా ఆమె యిప్పుడు అల వర్చుకొన్న నవీన మనస్తత్వము. ఎవరు తన వారనీ, తన సర్వస్వ

మని భావించి, పూజించుచున్నారో వారే (అట్టి రాముడే) తనను నిరాదరించి తనను దూరంగా అడవుల పాలు చేయుటను సహించలేక పోయినది. అయినను దైవకృప యనునది కొంత తోడై తనను సురక్షితమైన యీ ప్రశాంత ఆశ్రమ భూములకు తరలించినది. ఇప్పటి కిదియే దైవము చేసిన పెద్ద యుపకారముగా ఆమె తలంచినది. తాను రఘు వంశముయొక్క పేరుప్రతిష్ఠలను నిలబెట్టుటకు కంకణము ధరించిన శ్రీరామచంద్రుని పత్ని- రఘుకుల వర్ధనులైన బిడ్డలను ప్రసాదింపవలసిన సర్వోత్కృష్టమైన స్థానములోనున్నది. శ్రీరామ చంద్రుని దివ్య తేజస్సు సంతాన రూపములో తన గర్భమున రూపు దిద్దుకొంటున్నది. కావున ఎంత వియోగ దుఃఖమనుభవించుచున్నను ప్రాణ త్యాగమున కొడబడకుండినది.

సీతకు ప్రసవ సమయమాసన్నమైనది. ఒక శుభ ముహూర్తమున ఆమె కవల పిల్లలను కన్నది. సీతకు కవలలు జన్మించినారన్న వార్త ఆ మరుక్షణములోనే వాల్మీకి మహర్షి విని మిక్కిలి ఆనందపడినాడు. ఆశ్రమమునందలి ఋషులు, మునిబాలకులు, అందరూ ఈ వార్తను విని ఆనందపడినారు. బాలురిరువురు ఆరోగ్యవంతులై పెరుగుచుండ జొచ్చిరి. పది దినములు గడిచిన తరువాత మహర్షి వారికి జాత కర్మాదులు నిర్వహించినాడు. తొలుత పుట్టినవానికి కుశుడని, తరువాతి వానికి లవుడని నామకరణం చేశాడు. దినదినాభివృద్ధి నొందు చున్న బాలకులిరువురినీ చూచి, సీత సంతోషముతో ఉప్పొంగి పోయెడిది. బిడ్డలు వృద్ధినొందుట చూచి ఆమె బిడ్డల ఆలనపాలనతోనే ఆమెకు సమయము సరిపోజొచ్చినది. పిల్లలు కొంత పెరిగిన తరువాత సమయముచూచివాల్మీకివారినియథావిధిగా ఉపనయన సంస్కారములు జరిపించాడు. నిపుణులైన ఉపాధ్యాయులచే పలువిధములైన శాస్త్ర

విద్యలను, రాజ విద్యలను నేర్పించజొచ్చాడు. తాను సంగ్రహముగ ప్రత్యేకించి బాలుర కొరకు వ్రాసిన బాల రామాయణమును కుశలవులకు నేర్పి, శ్రావ్యముగ వారిచే పఠింపజేసెను. ముని వారిని శాస్త్ర విద్యలలోనే గాక, ప్రత్యేకించి నీతి, వినయ, విధేయతల నలవరింపజేసి, చూచువారికి, వారియందు ఆదరభావము కలుగునట్లు చేసెను. బాలురు తల్లియందు అనురాగబద్ధులై పూజ్యభావము కలిగియుండిరి.

## బ్రాహ్మణుడు మృతబాలుని కళేబరమును శ్రీరాముడు యింటి వాకిటనుంచి యేడ్చుట

శ్రీరాముడు తమ్ములతో కూడి, రాజ్యపాలన ధర్మవర్తిగ పాలించుచున్న ఒకనాడు ఒక బ్రాహ్మణుడు, ఒక మృత దేహముతో నున్న బాలుని తీసుకొని వచ్చి, సింహద్వారము చెంతనుంచి, రాముని చెంతకు వచ్చి, ఏడ్చుచుండెను. "కొడుకా! ఓ కొడుకా! నీ వప్పుడే యమపురికి కరిగితివా? పెద్దవాడను నేను బ్రతికియుండగనే నీవు మరణించుట ఏటి ధర్మము. ధర్మపూర్వకమైన నీ రాజ్య పాలనలో ఏ లోపము సంభవించినదో! నేడు నా కొడుకు అన్యాయముగ మరణించినాడు. పెద్దవారు బ్రతికియుండగా చిన్నవాడు మరణించుట ధర్మ సమ్మతము కాదు. ఇప్పుడు నీ రాజ్యమున మాకిట్టి దురవస్థ సంభవించినది- "రామా! నీవు యీ ధర్మ లోపమును తప్పక సవరించవలసి యున్నది. అందుకు నీవు చనిపోయిన ఈ బాలుని పునర్జీవితుని గావింపవలెను" అని యా బ్రాహ్మణుడు శ్రీరాముని పరుషముగ నిందించుచు కుమారుని కళేబరమును చూచి విలపించసాగెను.

# నారదుడు బాలకుడు మృతుడైన కారణము తెలుపుట

ఇంతలో నారద మహర్షి అచటికి వచ్చి రామునితో "రామా! నీవు శ్రద్ధగా వినుము. కృత యుగములో బ్రాహ్మణులు తప్ప, వేరెవరును తపస్సు చేయువారు కాదు. యజ్ఞ యాగాదులు కాని, ఇతర వైదిక క్రియలు వేనినీ చేయుటకు పూనుకొనువారు కాదు. అందుచేత తరువాతిదైన త్రేతా యుగములో కూడ బ్రాహ్మణేతరులు స్వాతంత్రించి తపోనియతికి పూనుకొనువారు కారైరి. అట్టి సంప్రదాయ పరమైన విధి బాధ్యతలను కడకు నెట్టి, క్షత్రియులు తపమునకు పూనుకొని, పూర్వుల కంటె అధిక బల సత్వ సంపన్నులై రహించిరి. అట్లే వైశ్యాది ద్విజులు తపోనుష్ఠాన సంపన్నులై బల సంపదలచేత రహించిరి. కాని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యాది ద్విజుల కోవకు చెందని వారెప్పటియట్ల ఎటువంటి తపోనుష్ఠాన బలసంపదల కర్హత లేనివారై యుండుటను తలపోసి ద్విజేతరులు కొందరు అట్టి అర్హతలను పొందుటకు ప్రయత్నించ దొడగినారు. ప్రస్తుతము శంభుకుడను శూద్రుడు అట్టి ప్రయత్నములో నుండి తపస్సు కొనసాగించుచున్నాడు. రామా! శూద్రకుని తపస్సు వలన ద్విజానుష్ఠాన కర్మలు ప్రభావ శూన్యములైనవి.

ఈ బ్రాహ్మణ బాలుని మృతి, తపో ధర్మమును అతిక్రమించి యొక శూద్రుడు విశేష ఫలముల నాశించి తపమొనరింప గడంగుటచే, శంభుకుడను వాడు ప్రస్తుతము ఈ శరీరముతోనే స్వర్గము నాశచేసి, తపమొనరించుచున్నాడు" అని చెప్పి నారదుడచటినుండి కదలెను.

వెంటనే రాముడు తన కర్తవ్యమును గుర్తు చేసుకొనెను. శ్రీరాముడు తన పుష్పకాన్ని స్మరించిన తక్షణమే ఆ విమానము వచ్చి, తనమోల నిలచెను. రాముడు ఆ విమానాన్ని అధిరోహించి, అచటి అరణ్యమంతా గాలించాడు. హిమగిరి ప్రాంతాలను అన్వేషించాడు. అక్కడా ఏమీ ఆచూకీ తెలియలేదు. పిమ్మట అతడు తూర్పు దక్షణాలను గాలించాడు. దక్షిణ దిక్కున శైవలము అనే కొండ సమీపమందుగల సరోవరము చెంత అధోముఖుడై కఠోరమైన తపస్సు చేస్తూ ఉండడం గమనించాడు.

రాముడతని వద్దకు ధనుర్ధారియైవెళ్ళి "ఓయీ నీవెవడవు...? ఏమి ఆశించి నీవీ కఠోరమైన తపమొనరించుచున్నావు." విషయమేమిటో వివరించమన్నాడు.

అందులకు అతడిట్లని బదులు పలికెను. "మహానుభావా! నేను శంభరుడనువాడను. శూద్ర యోనిసంజాతుడను. సశరీరముతోనే స్వర్గమును సంపాదింపవలెననెడి కోరిక చేత నేను యిట్టి లోపమొనరించుచున్నాను. నే నసృతమాడు వాడనుకాను. ఋజువర్తనుడను."

శూద్రముని మాటలకు శ్రీరాముడు. "ఓయీ? నేను ఈ రాజ్యమునకు ప్రభువును. ధర్మపాలన విషయములో నేను సునిష్ఠితుపనైతూ. చ తప్పక విధులను పాటించువాడను. తపమొనర్చుటకు నీవనర్హుడవయ్యావు. ధర్మధ్వంసకుడవై, ఇట్టి తపమాచరించుచున్నావు. ఇదినీకు తగదు. అధర్మ రోచకమగు నీ తపము వలన బ్రాహ్మణ బాలుడాయువు తీరకయే అకాల మరణము పొందినాడు. ఇందులకు ప్రత్యక్షముగ నీవును పరోక్షముగ నేనును బాధ్యులమైతిమి,

కావున నేనింక నిన్నుపేక్షించజాలను" అని శ్రీ రాముడు తన కర వాలముచే శంభుకుని తల నరికివేసెను. దేవతలు శ్రీ రాముని తలపై పుష్ప వృష్టిని కురిపించిరి. బ్రహ్మాది దివిజనేతలు వచ్చి, శ్రీరాముని ప్రస్తుతించి, "రామా! శంభూకుని వధించి నీవు ద్విజధర్మ మును కాపాడితివి నీకి శుభసమయమున ఏదేనియొక వరమివ్వ వలెనని భావించు చున్నాము. కోరుకొనుము." అనిరి. శ్రీరాముడు దివిజవరులతో "దేవతలారా! నాకు ఏ కోరికలులేవు కాని నా రాజ్య ములో అకాలమరణము పొందిన బ్రాహ్మణ బాలుని బ్రతికించిన అదియే మీరు నాకు ప్రసాదించు గొప్ప వరము. ఆ బ్రాహ్మణ దంపతులకు 'మృతిచెందిన మీ బాలుని బ్రతికించి తీరుదును' అని వాగ్దాన మొనరించితిని. ఆ నా వాగ్దానమును నెరవేర్చి, వారికి వారి బాలుని సజీవునిగ నొప్పగించితినా నేను సర్వధా కృతకృత్యుడన గుదును." అన్నరాముని మాటలకు బ్రహ్మాది దేవతలు సంతసించి బ్రాహ్మణ బాలుని బ్రతికించి, శ్రీరామునకప్పగించి, యాతనిని కొని యాడి, వారి వారి నిజాస్థానముల కరిగిరి. శ్రీరాముడు ఆ బాలుని గొనిపోయి, యాతని తల్లి దండ్రులకప్పగించెను. వారును అపరిమితా నందభరితులై రాముని పరి పరి విధముల కొనియాడిరి.

అధర్మ దోషములను, తన ధర్మైక దీక్షచే పరిహరింపజేసు కొనుచు, సత్యానిష్ఠుడై, ప్రజారంజకముగ పరిపాలనమును యధావిధిగ కొనసాగించుచుండెను.

## రాముడు రాజసూయ యాగము నిర్వహింప నెంచుట

ఒకనాడు తన తమ్ముడైన భరతుని పిలిచి, "భరతా! రాజులకు శ్రేష్ఠము, ఉచితమునైన రాజసూయ యాగమును చేయవలెనని

తలంచుచున్నాను. బ్రాహ్మణ కార్యము నెరవేర్చితిని. ఇంక అక్షయము, అవ్యయము, ధర్మమునకు సేతువు, పాప విదారణము ఐన రాజసూయ యాగమును చేసి తరించెదమను కొనుచున్నాను. నీవు తక్కిన సోదరులు ఇందులకు సహాయపడగోరెదను. ఈ యాగాచరణము వలన ఎందరెందరో మహానుభావులు ఇహాముత్ర ఫలములకు పొంది యశము నందియున్నారు. మీరు ఆలోచించి, నాకు తగు సలహాల నొసంగి యాగము దిగ్విజయముగ పరిసమాప్తి నొందునట్లు తోడుపడుడు" అనెను.

అంత భరతుడు "అన్నా! రామచంద్రా! నీవనినట్లు రాజసూయ యాగ నిర్వహణము మీకు హితముకాదు. అనేక వ్యయప్రయాసలకు మూలమై, పరరాజ ధనాపహరణ, పీడనములచే దోషదూషితమై, ప్రజా విధ్వంసమునకు కారణభూతమైన రాజసూయము నీవంటి ధర్మవర్తనులకు, సచ్చరిత్రులకు విహితముకాదు." అని చెప్పెను.

భరతుని హితోక్తి శ్రీరామచంద్రునకు నచ్చినది. లక్ష్మణుడు "అన్నా! నీవు రాజసూయముకన్న అశ్వమేధయాగము చేయుటవలన నీవాసించిన సకలఫలితములు సమకూరును. పూర్వము మన వంశీకులైన రాజన్యులెందరో ఇట్టియాగమును చేసి సకల దోషములనుండి ముక్తులై, శాశ్వత యశస్సును సముపార్జించినారు. బ్రహ్మహత్యాది మహాపాతకములను సైతము పరిహరింపజేయు ఈ యాగమును మీరవశ్యము నిర్వహింపదగును. సకలజన శ్రేయస్సుకు మూలమైన ఈ యాగమునందు ప్రజలెల్లరును ఉత్సాహచరితులై పాల్గొనెదరు." అనెను.

లక్ష్మణుని మాటలకు శ్రీరాముడు ప్రసన్నుడై మంత్రి పురోహితులతో యాగనిర్వహణకు అవసరమైన సమాలోచనము చేయ దొడగెను.

## శ్రీరాముడు అశ్వమేధయాగము చేయుట

ప్రజల శ్రేయస్సును కాపాడుటలో ఎల్లప్పుడు అప్రమత్తుడై యుండు శ్రీరామచంద్రుడు దేవతాప్రీతికరమైన అశ్వమేధయాగము చేయుటకు సంకల్పించెను. పురోహితులైన వశిష్ఠ, వామదేవ, జాబాలి, కౌశ్యపాది మునులను రావింపగా, వారందరు రాజసభకు వచ్చిరి. శ్రీరాముడు వారందరికి సభక్తికముగా నమస్కరించి, ఉచితాసనములపై కూర్చుండ నియోగించెను. వారును శ్రీరామునకు అక్షయాశీస్సుల నొసగి మన్నించిరి.

శ్రీరాముడు మహర్షులతో "మహాత్ములారా! నేను ఇహాముత్రా ఫలదమైన అశ్వమేధయాగమును చేయగోరుచున్నాను. అందులకు మీ సంపూర్ణ సహాయ మవసరము. అట్టిసహాయమును మీరు నాకు కలుగజేసి ధన్యునిగావింపవలసినదిగా మిమ్ములను ప్రార్థించుచున్నాను. దయయుంచి, అనుమతించి తగు యేర్పాట్లు గావింపుడు." అని ప్రార్థించెను.

రాముని మాటలకు మహర్షు లానందించి, "సకల రాజన్యులకు శుభప్రదమైన ఈ యాగము యాగకర్తలైన నీకు అఖండఫలముల నొసంగును." అని తమ ఆమోదమును తెలిపిరి.

రాముడు వెంటనే లక్ష్మణునితో "లక్ష్మణా! నీవు తక్షణమే సకల వానరసేనాసమేతుడైన సుగ్రీవుని తరలిరమ్మని ఆహ్వానము పంపి అతడు వచ్చునట్లు చేయుము. బుద్ధిశాలురు, బలశాలురు, సూక్ష్మగ్రాహులైన మంత్రులను పంపి విభీషణుని తమ ముఖ్యసచివులతో తరలి రమ్మని కబురంపుడు.

ఇంతను అనేక దేశదేశాల రాజులను పిలిపించుము. అనేకమంది బ్రాహ్మణులను ఋత్విక్కులుగా ఆహ్వానింపుము. సాధుపుంగవులైన మహర్షులకు, వర్తకులకు, ప్రజలకు, పరివారమునకు అందరికీ యాహ్వానములు పంపి, వారీ మహాక్రతువున పాల్గొనునట్లు తగిన ఏర్పాట్లు గావింపుము. గోమతీనదీతట ప్రాంతమైన నైమిశములో యాగశాలను నిర్మింపజేయుము.

తమ్ముడా! లక్ష్మణా! భరతా! వీరు వారననేల ధర్మవిధులైన మహాత్ములందరూ ఈ యాగములో పాల్గొనునట్లు చేయుము.

రాముని యాజ్ఞపై లక్ష్మణుడు, భరతుడు యాగనిర్వహణమునకు అవసరమైన, వస్తువాహనములు, పరిచారక, పరిశారికాశణము సమీకరించి, నైమిశలో యాగనిర్వహణమునకు యేర్పాట్లు గావించెను. నల్ల యిట్టిని బోలిన సలక్షణమై అశ్వమును కాపాడుచుండగా శ్రీరామచంద్రుడు ఏర్పాట్లనన్నిటిని చూచి మిక్కిలి సంతృప్తి నొందెను.

బుధజనాశీర్వాదంతో వశిష్ఠమహర్షి స్వస్తి వాచకంతో, ఋత్విజుల పవిత్రవేదమంత్ర ఘోషలతో యజ్ఞవేది ప్రతిధ్వనించు చుండగా, ప్రత్యేకాహ్వానములపై విచ్చేసిన నానా దేశాగత రాజన్యుల సమక్షంలో అశ్వమేధయాగ ప్రక్రియ శ్రీరాముడు కర్తగా ప్రారంభించబడినది.

సకల శుభ లక్షణోపేతమైన యాజ్ఞాశ్వమును రాముడు పరిశీలించి, దానిని వేదమంత్రోచ్చారణముచే పూజ సలిపెను. ఋష్యాది పూజ్య విప్రగణమునకు తగిన వసతులను విభీషణుడు కల్పించెను.

శ్రీరాముడు యజ్ఞవాటికను చేరి సూర్యునికి అష్టదిక్పాలకులకు నమస్కరించి, క్రతువును ప్రారంభించెను. క్రతు సమాప్తిన యాజ్ఞాశ్వమును చక్కగ అలంకరించి, సాయుధుడైన లక్ష్మణుడు అశ్వ

రక్షకుడుగ నియోగించి వచ్చెను. అక్కడి వారల జయ జయ ధ్వానములమధ్య యాగాశ్వము కదిలినది. లక్ష్మణుడు దానిననుసరించినాడు.

యాగమును చూడవచ్చిన అతిథులు షడ్రసోపేతమైన భోజనములుచేసి తృప్తులైరి. అనేకమంది దేవతలు, ఋషులు శ్రీరాముని వేనోళ్ళకొనియాడిరి. మునుపు ఎన్నో క్రతువులను చూచితిమి. ఇంద్రుడు, ధనేశుడు, సూర్యపుత్రుడు, వరుణదేవుడు మున్నగు వారలు ఈ యాగమును చేయగా చూచినాము. కాని అవి యన్నియు, ఇప్పుడు శ్రీరామచంద్రుడు చేసిన యాగముతో సరికావు అని పరి పరి విధముల వారు యాగమును, యాగకర్తయైన శ్రీరాముని కొనియాడిరి.

యాగానంతరము శ్రీరాముడు, ఎందరెందరో అసంఖ్యాకులైన యాచకులకు, పండితులకు, వేదవిదులకు భూరి దానములొసగెను. వారందరినీ, సువాసన భరితములైన పలు పరిమళ ద్రవ్యములచే, భూరి సన్మాన సత్కారములచే శోభింపజేసెను.

ఈ విధముగ శ్రీరాముడు నిర్వహించిన అశ్వమేధ క్రతూత్సవము పెక్కురోజులు అత్యంత వైభవోపేతంగా, చూపరులకు కన్నుల పండువుగా జరిగినది.

## వాల్మీకి మహర్షి కుశలవులకు రామాయణ గానము చేయ నియోగించుట

వాల్మీకి మహర్షి అనుజ్ఞతో, కుశలవులు రామాయణమును గానము చేయుటకు నియోగింపబడిరి. లవకుశ లిరువురు శ్రావ్య

మగు కంఠస్వరముతో రామాయణ కథాగానమును చేయుచుండిరి. వారు ముని వాటికలతో, పెద్దల సమక్షములో శ్రావ్యమైన కంఠముతో రామాయణమును వినిపించుచుండిరి. గురువుగారైన వాల్మీకి యాజ్ఞ ననుసరించి ఎవరివద్ద ఎట్టి పారితోషికమును తీసికొనకుండ కథా గానమును చేస్తూ ఉండండి. మీరెవరి శిష్యులని ఎవరేని యడిగినచో 'నా పేరు చెప్పండి' అని చెప్పి అంతలోనే అశ్వమేధయాగము చేయుచున్న శ్రీరాముని కడకు వెళ్ళు కొందరు విప్రోత్తములు వారికి తటస్థించిరి. లవకుశుల నిద్దరిని, వాల్మీకి ఆ బ్రాహ్మణోత్తములకు జత పరిచి, అయోధ్యకు వెళ్ళిరండని చెప్పి, ఆశీర్వదించి పంపెను.

## లవకుశులు రామాయణ గానము చేయుట శ్రీరాముడు వినుట

లవకుశులు శ్రీరాముడు యాగము చేయుచున్న ప్రదేశమునకు సమీపములో విడిదిచేసియున్న మునివాటిక చేరి ఆ రాత్రి యచట విశ్రమించి ఉదయముననే లేచి, కాలకృత్యములు తీర్చుకొని, ఋషి వర్యునాజ్ఞ ననుసరించి, శ్రీరామునివద్దకు వెళ్ళుటకు వీణెలు కరమున బూని, శ్రీరామునికి రామాయణ కథాగానము వినిపించుటకు వెళ్ళిరి. ముద్దులు మూటగట్టు బాలకులిరువురు శ్రీరామచంద్రునకు వీనుల విందుగా శ్రీరామద్రామాయణగాథను విపులముగ, విశదముగ విని పించిరి. కరుణరసము జాలువాలు ఆ బాలుర శ్రావ్యమైన కథాగాన మును విని శ్రీరామచంద్రుడు తన్మయుడై వినెను. అచ్చముగా ఆకార రూపరేఖా విలాసములలో శ్రీరామ ప్రభువునే పోలియున్న యా బాలకుల రుచిర మందహాస వదనారవిందము సౌందర్యమధురమలను కన్నులతో ద్రావుచున్న చూపరులైన జనము, ఆ వింత వారలను ప్రామాగన్న పడి కనుచుండిరి. వారి కంఠ మాధుర్యమునకు అలరి, అనిర్వచనీయమైన ఆనందము ననుభవించుచుండిరి,

శ్రీరాముడును మైమరచి, ఆ బాలకుల గానమును విని, వారిని దగ్గఱకు పిలిచి, "బాలకులారా! మీరు ఎవరి పిల్లలు? రామకథను మీ చేత ఈ విధముగా శ్రావ్యముగా గానము చేయించిన గురువర్యు లెవరు? ఎంత మధురముగానున్నదో యీ మీ కథాగానము..."

అందులకు కుశలవులు "స్వామీ! మేము వాల్మీకి మహర్షి శిష్యులము. మా గురువుగారు రచించిన రామకథను వారి నేర్పరి తనముతో ఈ విధిన శ్రావ్యముగ పాడుట నలవరచుకొంటిమి. ఈ మా గానముచేయు కథకు నాయకులు మీరే కనుక, ఈ కథను స్వయముగ మీ సన్నిధానమున గానముచేయు భాగ్యము కలిగినందులకు మిక్కిలి యానందించుచున్నాము.

లవకుశుల ముద్దులుగారు ముచ్చటైన మాటలను విని శ్రీరాముడు అపరిమితానందభరితుడై నాడు. వెంటనే భరత, లక్ష్మణులను పిలిచి, ఈ బాలురకు భూరి సువర్ణనిష్కములచే సన్మానింపుడు. అంతియే కాక వీరేది మరి కోరిన కాదనక వారికవి సమకూర్చి పంపుడు" అని యాజ్ఞాపించెను. తమ్ములు రామాజ్ఞననుసరించి క్షణములో భూరి విత్తమును కోశాగారమునుండి తెచ్చి, ఉభయులకు వేర్వే రుగ ఆ ధనమును బహూకరింపజూపిరి. లవకుశులా బంగారు మాడలచూచి, దరహాస బాసురవదనులై మృదువుగా తిరస్కరించుచు "అయ్యా! మేము వనవాసులము. మాకు బంగారు నాణెములతో యేమి పని? కందమూల, ఫలాదులచే పొట్టనింపుకొను బ్రహ్మచారులమైన మాకు ఇవి నిష్ప్రయోజనములు, నిరర్థకములు.

శ్రీరాముడు వారి మాటలనుబట్టి, వారు చేసిన కథాగానమును బట్టి, వారి గురువర్యుడు వాల్మీకి మహర్షిగా గుర్తించి, ఈ బాలకులు తమ కుమారులుగా భావించెను. ఆతని భావమునకు సరిపడునట్లుగా ఆ బాలకులు వాల్మీకి విరచిత రామగాథను గురించి మరిన్ని వివర ములు చెప్పిరి.

శ్రీరాముడు బాలకులను మిక్కిలి యాదరముతో మన్నించి ఈ బాలురు సీత తనయులు. వారలు వాల్మీకి యాశ్రమమున, ఆ మహర్షి పోషణలో వృద్ధిపొందుచున్నారని విని యానందించెను. వెంటనే రాముడు కొందరు దూతలను వాల్మీకి వద్దకు "మునివర్యా! సీత పరిపూతయని మీరు మనస్ఫూర్తిగా నమ్మినచో, సీతయు అట్టి భావమునే శపథ పూర్వకముగా చెప్పినచో ముని యనుమతిన యామెను యనుమతింతుము" అని చెప్పి పంపెను.

## శ్రీరాముడు వాల్మీకి ఆశ్రమమునకు దూతలను పంపుట

శ్రీరాముని సందేశమునుగొని దూతలు వాల్మీకి యాశ్రమమునకు వెళ్ళిరి. వారు మహర్షికి నమస్కరించి, రాముడు పుత్తెంచిన సందేశము నిట్లు వివరించిరి. "మహర్షీ! సీత మీ వద్దనే సురక్షితముగా నున్నదని, మా సమక్షములో రామాయణ కథాగానమును శ్రావ్యముగ గానమొనరించిన లవకుశులు సీతా తనూజులని నా కర్థమైనది. మీరు వెంటనే సీతను వెంటబెట్టుకొని, మా యజ్ఞశాలకు రాగలరు. మీరు వచ్చిన తరువాత మేము సీతా తనూజులను లోకులకు తెలియపరిచి, సీత తాను నిర్దోషియని శపథము చేసిన వెంటనే రాజ్యమునకు కొనిపోవుదును. ఆనాడు చేసిన అగ్ని ప్రవేశమును ఈనాటి ఈ ప్రజలు చూడలేదు కదా! వారి సందేహములు సందేహముగనే మిగిలిపోయి నా యెడల అవి అపవాదులుగా మారి, నన్ను మచ్చపడి బ్రతుకుచున్న సిగ్గుమాలిన రాముడని ప్రజలు తలంచరాదు. అందుకని సీత యెడల ప్రజల కేర్పడిన అనుమానములను పోగొట్టుకొనవలసిన బాధ్యత ఆమెపైన నాపైన, ఆశ్రయమిచ్చిన మీపైన ఉన్నది సకల సద్ధర్మవిధులైన మీకు తెలియనిదేమియు కాదు. త్రికరణశుద్ధిగా ధర్మమునే సర్వవిధముల పరిపాలించు నన్ను ఈ సంకట పరిస్థితిలోను ధర్మనిష్ఠునిగా కొనసాగనిండు. మహర్షీ! అందులకు మీ తోడ్పాటు అవసరము. నాకు వ్యక్తిగతముగ సీతపై దురభిప్రాయము, అను

మానము యెప్పుడును లేదు. లేశమాత్ర, మేనియు ఆమె తప్పు చేయదని నాకు తెలియును. కాని యామె నిర్దోషిత్వమును లోకమెఱింగి ప్రతిష్ఠాపింపవలయును కదా!

మాతలు శ్రీరాముని సందేశముగా చెప్పిన మాటలు మహర్షి విని విషయమంతయు సీతతో వివరముగ ప్రతిభాషించెను. మహర్షి సీతను, మరికొందరు మునులతో కూడి శ్రీరాముడు యాగము చేయుచున్న ప్రదేశమునకు వచ్చెను.

వచ్చిన వాల్మీకి మహర్షికి శ్రీరాముడు సాష్టాంగ నమస్కారము లొనర్చి, అర్ఘ్య పాద్యాది సత్కృతు లొనర్చెను. శ్రీరాముడు తక్కిన ఋషులందరినీ అర్హరీతిన నమస్కరించి సపర్యలొనరించి, వినయ వినమిత శీర్షుడై నిలబడెను.

వాల్మీకి రామునితో ఈ చిరంజీవులు, సీత తనయులు. నీ కుమారులు. సీత నిర్దోషి. ఆమె యిప్పుడే తన నిర్దోషిత్వమును ప్రకటించును. ఎల్లరూ సావధానులై కనుడు. వినుడు.

## సీత భూప్రవేశము

సీత శపథమును ప్రత్యక్షముగ చూచుటకై బ్రహ్మేంద్రాదులు, సమస్త సురలు, గంధర్వులు, ఋషులు అందరూ వచ్చి నిలిచిరి. సీత ఒక పరి చుట్టూ దిక్కులను కలయజూచి, శ్రీరామచంద్ర ప్రభువునకు నమస్కారము చేసి, తల్లియైన భూమాతను తనలో లీనమొనర్చుకొనగలందులకు ప్రార్థించినది. భూమాత దారి చేయగా సీత భూగర్భ వివరములోనికి చొచ్చి రసాతలమునకు చేరుకొనినది. మరల భూమియధావిధిగా ఐనది. శ్రీరాముడు ఊహించని యా భయంకర దృశ్యమును చూచి, భరించలేక భోరున విలపించెను. కుశలవులు తల్లి యట్లగుటను చూచి విలవిలలాడిపోయిరి. ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించి దుఃఖించిరి. బ్రహ్మేంద్రాదులకు సైతం శ్రీరాముని ఊరడించుట కష్టమైపోయినది.

# కుశలవుల యౌవరాజ్య పట్టాభిషేకము-
# శ్రీ రామాదుల మహా ప్రస్థానము

సీత భూ వివరములోనికి వెళ్ళి లయమైపోయిన తరువాత శ్రీరాముడు తన అవతార పరిసమాప్తిని లీలగా గుర్తించెను. యాగము పరిసమాప్తి ఐన వెంటనే లవకుశులను తీసుకొని అయోధ్యకు వచ్చి, కుశుని అయోధ్యా నగరమునకు యౌవరాజ్య పట్టాభిషిక్తు నొనరించెను. తాను తమ్ములతో కూడి అయోధ్యా నగరమును వీడి కొంత దూరము వనములలో సంచరించి, అచ్చట పశ్చిమ ముఖమున వేగముగ ప్రవహించుచున్న సరయూ నదీ తీరానికి చేరుకొన్నాడు. ఆ ప్రయాణము మాయా మనుష రూపధారియైన శ్రీరామచంద్ర ప్రభువు అవతార పరిసమాప్తికి సలిపెడి మహా ప్రస్థానమని బ్రహ్మాది దేవతలు గుర్తించిరేమో అంపరూ గగనతల పరిధిలోనికి వచ్చి నిలిచి జరుగునది చూచుచుండిరి. శ్రీరాముడు తన తమ్ములతో పరివారముతో సశరీరుడై సరయూ నదీ ప్రవాహములోనికి జొచ్చి, తన భౌతిక శరీర తేజమును, సరయూ నదీ జలములలో విలీన మొనరించి, బ్రహ్మేంద్రాదులు సమకూర్చిన పుష్పక విమానములో శ్రీరాముడు తన శాశ్వత స్వస్థానమైన విష్ణు రహితమైన విష్ణు లోకమునకు పయనమై వెళ్ళెను.

శ్రీరాముడు వైకుంఠధాముడై సీతమ్మ విష్ణు వక్షస్థలి నివాసిని యైన లక్ష్మియై యథావిధిగ లోకరక్షణ కార్య విధానమును కొనసాగించుచుండిరి.

సమాప్తము---

## ఫలశ్రుతి

"శ్రీరామ కథామృతము"ను శ్రద్ధాభక్తులతో చదివి అందలి రస విశేషాన్ని ఆస్వాదించిన వారిని పుత్ర పౌత్రాభివృద్ధిగా శ్రీ హనుమత్సమేత సీతారామ చంద్రమూర్తి స్వామివారు ఆయురారోగ్య ఐశ్వర్యములను కలుగజేసి రక్షించుగాక !

రచయిత్రి

294.592
SUB
fee NO. 23436